
రామాయణం

వాల్మీకి రామాయణము-అయోధ్య కాండము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org

సదాశివ సమారంభాం


గురు దక్షిణామూర్తి


గురు వేదవ్యాస మహర్షి



గురు శుక మహర్షి


గురు నారద మహర్షి


గురు వాల్మీకి మహర్షి


గురు శ్రీకృష్ణ

శంకరాచార్య మధ్యమాం


గురు దత్తాత్రేయ


గురు బాబాజి


గురు గౌతమ బుద్ధ


గురు ఆదిశంకరాచార్య


గురు రామానుజాచార్యులు


గురు జ్ఞానేశ్వర్


గురు రవిదాస్


గురు కబీర్ దాస్


గురు చైతన్య మహా ప్రభువు



గురు నానక్


గురు రాఘవేంద్ర స్వామి


గురు వీరబ్రహ్మేంద్ర స్వామి


యోగి వేమన

అస్మదాచార్య పర్యంతాం


గురు త్రైలింగ స్వామి


గురు లాహిరి మహాశయ


గురు రామకృష్ణ పరమహంస


అమ్మ శారదా దేవి


గురు వివేకానంద


గురు సాయిబాబా


గురు అరబిందో


గురు రమణ మహర్షి


గురు యోగానంద


గురు భక్తివేదాంత ప్రభుపాద


గురు మళయాళ స్వామి


గురు విద్యాప్రకాశానందగిరి


గురు చంద్రశేఖర పరమాచార్య

వందే గురుపరంపరాం..





Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్చంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్థం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని జళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజూ పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ ర స్తు

శ్రీరామచంద్రపరబ్రహ్మణే నమః




శ్రీమదాంధ్ర
వచనరామాయణము

అయోధ్యాకాండము

సంస్కృతరామాయణమునకు సరిదైనతెనుఁగు

శ్రీసరస్వతుల సుబ్బరామకాస్త్రిగారిచే

విరచితము



చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్

వారిచే ప్రకటితము

1951.

All Rights Reserved] [Rs. 5—0—0

విషయసూచిక

అయోధ్యాకాండము

సర్గము.		పుట.
1.	శ్రీరాముని గుణముల వర్ణనము ...	1
2.	సభ్యులందఱు రాముని పట్టాభిషేకంబునకు సమ్మతించుట ...	6
3.	దశరథుఁడు రామునిఁ బిలిపించి యతనితోఁ బట్టాభిషేకము చేయందునని చెప్పుట ...	12
4.	దశరథుఁడు రామునికిఁ దన దుస్స్వప్ననూలకు ఫలమూఁజెప్పి పట్టాభిషేకము స్వరఁగా జరుపవలయుం నని తెల్పుట ...	16
5.	వసిష్ఠుఁడు రాముని నగరునకు వెళ్ళి యుపవాస ముండుమని చెప్పుట	20
6.	రామునఁ డుపవాసము గావించుట, పురజనులందఱు పట్టాభిషేకమునఁ జూడవచ్చుట. ...	22
7.	మంథర యయోధ్యాపట్టణవైభవముచూచి, కైకేయికి దుర్బోధన చేయుట	25
8.	కైకేయి మంథర దుర్బోధలకు లోఁబడుట ...	28
9.	మంథర కైకేయికి మునుపటివరంబుల జ్ఞాపకపఱిచుట ...	33
10.	దశరథుఁడు కైకేయి యంతఃపురమునకుఁ బోవుట ...	40
11.	కైకేయి రెండువరంబు లడుగుట ...	43
12.	దశరథుఁడు కైకేయివరంబులఁ దలఁచి చింతించుట ...	47
,,	కైకేయి మొండితనము ...	50
13.	దశరథుఁడు మఱల కైకేయిని వేఁడుకొనుట ...	59
14.	కైకేయి దశరథుల సంవాదము ...	62
15.	సుమంత్రుఁడు రామునిఁ దోడ్కొని రాఁబోవుట ...	68
16.	సుమంత్రుఁడు రాముని దోడ్కొనివచ్చుట ...	72
17.	రాముఁడు సుమంత్రునితోడఁ గైకేయి యంతఃపురమున దశరథునిఁ జూడబోవుట ...	77
18.	కైకేయి రాముని నడవికిఁ బోవలసినదని చెప్పుట ...	79
19.	కైకేయి రాముని వనవాసమున కై తొందరపఱచుట ...	83

సర్గము.		పుట.
20. కౌసల్య రాముని వనవాసమునకై దుఃఖపడుట	...	87
21. లక్ష్మణుఁడు కౌసల్యను, రాముని నోదార్చుట	...	92
22. రాముఁడు దైవబలము గొప్పదని లక్ష్మణునితోఁ జెప్పుట	...	99
23. లక్ష్మణుఁడు రాముని వనవాసము మానుకొనఁ బురికొల్పుట	...	103
24. కౌసల్యాదేవి రాముని వనవాసంబు నంగీకరించుట	...	108
25. కౌసల్య రామునకు మంగళాశీర్వాదములు చేయుట	...	112
26. సీత రాముని విన్నదనమునకుఁ గారణము నడుగుట	...	116
27. సీత అడవికి వచ్చెదనని రామునితోఁ జెప్పుట	...	119
28. రాముఁడు వనవాసక్లేశములను సీతకుఁ దెలుపుట	...	122
29. సీత తన్నడవికిఁ దోడ్కొనిపోవ రాముని నిర్బంధించుట	...	124
30. సీత తనరాక నంగీకరింపమికై రాముని దూఱుట	...	126
31. లక్ష్మణుని రాకకు రాముఁ డొడంబడుట	...	131
32. రాముఁడు యాత్రాదానంబులు సేయుట	...	134
33. రామలక్ష్మణులు సీతతోడ దశరథునిఁ జూడఁబోవుట	...	138
34. సీతా రామలక్ష్మణులు వనవాసంబునకై దశరథుని వీడ్కొనుట	...	141
35. సుమంత్రుఁడు కైకేయిని దూఱుట	...	147
36. సిద్ధార్థుండను మంత్రి కైకేయిని దూషించుట	...	150
37. రామాదులు కైకేయి దెచ్చియిచ్చిన నారబట్టలను ధరించుట	...	153
38. దశరథుఁడు సీతకు నారబట్టలు వలదనుట	...	156
39. సుమంత్రుఁడు దశరథాజ్ఞ చే రాముని వనంబునకుఁ దోడ్కొనిపోవ రథంబుఁ దెచ్చుట	...	158
40. సుమిత్ర లక్ష్మణునకు బుద్ధి నెప్పుట	...	161
41. రాముని వనవాసమునకై మూఁడులోకములవారు దుఃఖించుట	...	166
42. దశరథుఁడు కౌసల్య యంతఃపురము సేరుట	...	168
43. కౌసల్య పుత్రవియోగమునకై దుఃఖించుట	...	171
44. సుమిత్ర కౌసల్య నూఱడించుట	...	173
45. రాముఁడు సరయూనదీతీరమున విడియుట	...	176
46. రాదులు జనులను వంచించి రథం బెక్కిపోవుట	...	179
47. రాముఁడు దమ్ము విడిచిపోయినందుకై పురజనులు విచారపడుట	...	181

సర్గము.		
48. అయోధ్యాపురజనులు రాముని వనవాసమునకు దుఃఖించుట	...	183
49. రాముఁడు దుత్తరకోసల దేశములను దాఁటుట	...	186
50. రాముఁడు గంగానదియొద్ద గుహునిఁ జేరుట	...	188
51. గుహుఁడు లక్ష్మణునితో సంభాషించుట	...	192
52. రాముఁడు గంగానదినిదాఁటి వత్సదేశములకుఁ జేరుట	...	195
53. రాముఁడు లక్ష్మణునితో మాటాడుచుండుట	...	203
54. రాముఁడు భరద్వాజాశ్రమమున నివసించుట	...	205
55. రాముఁడు చిత్రకూటమునకుఁ బోవుట	...	209
56. రాముఁడు చిత్రకూటపర్వతము సేరుట	...	212
57. సుమంత్రుఁడు వనమునుండి మఱలి యయోధ్య సేరుట	...	215
58. సుమంత్రుఁడు రాజునకు రామాదులు చెప్పినమాటలు వినిపించుట		217
59. సుమంత్రుఁడు దశరథునకు రామునివనవాసముతీరు చెప్పుట	...	220
60. కౌసల్య సుమంత్రుని నడుగుట	...	224
61. కౌసల్య దశరథుని దూఱుట	...	226
62. దశరథుఁడు కౌసల్యను నూఱడించుట	...	229
63. దశరథుఁడు తన పుత్రశోకమునకుఁ గారణముఁ దెల్పుట	...	230
64. దశరథుఁడు పుత్రశోకముతో మృతినొందుట	...	235
65. కౌసల్య మొనలగు నంతఃపురాంగనలు భర్తృమరణమునకై చింతించుట		242
66. పుత్రులు దశరథుని కళేబరమును తైలభాండముననుంచి కాపాడుట		244
67. మునులు రాజును గోరుట	...	246
68. వసిష్ఠుఁడు దూతలను గేకయనగరమునకుఁ బంపుట	...	249
69. భరతుఁడు తాను దుస్స్వప్నము గనె నని చెప్పుట	...	251
70. భరతుఁ డయోధ్యను మఱలుట	...	253
71. భరతుఁ డయోధ్యాపురముఁ జేరుట	...	255
72. కైకేయి భరతునకు అయోధ్యయందు నడిచిన సంగతిఁ దెలుపుట		259
73. భరతుఁడు తండ్రి, తోఁబుట్టువులనుగూర్చి పిలిపించుట	...	263
74. భరతుఁడు మఱల కైకేయిని దూషించుట	...	265
75. భరతుఁడు కౌసల్యయొక్క నమ్మికకై యెత్తులు పెట్టుకొనుట	...	269
76. భరతుఁడు దశరథునకు సంస్కారము చేయుట	...	277

సర్గము.		పుట.
77. భరతుఁ డష్టి సంచయనమునకుఁ బోయి విలపించుట	...	279
78. శత్రుఘ్నుఁడు మంథరను జంపఁబూనుట	...	281
79. భరతుఁడు రామునిఁ బిలుచుకొని రాఁ బయనమగుట	...	283
80. శిల్పులు వనమునకు నూర్గమును నిర్మించుట	...	285
81. భరతుఁడు రామునియొద్దకుఁ దఱలుట	...	287
82. భరతుఁడు ససైన్యుఁడై యడవికిఁ దఱలుట	...	288
83. భరతుఁడు పయనమై గంగాతీరమున విడియఁటఁ	...	291
84. గుహుఁడు భరతునికి నతిథిసత్కారము సేయఁట	...	293
85. భరతుఁడు సైన్యముతోఁ గూడ గంగానదిం దాఁటుట	...	294
86. గుహుఁడు భరతునికి లక్ష్మణుని వాక్యము సెప్పుట	...	296
87. భరతుఁడు గుహుని పలుకులు విని చింతించుట	...	298
88. భరతుఁడు రామునిసేజ్ఞఁ జూచి విలపించుట	...	300
89. భరతుఁడు గంగానది దాఁటి భరద్వాజాశ్రమమునఁ జేరుట	...	303
90. భరతుఁడు భరద్వాజాశ్రమున నుండుట	...	305
91. భరద్వాజమునీంద్రుఁడు భరతునకు విందుసేయఁట	...	307
92. భరతుఁడు చిత్రకూటమునకుఁ దఱలుట	...	314
93. భరతుఁడు చిత్రకూటముఁ జూచుట	...	317
94. రాముఁడు సీతకు చిత్రకూటముసొంపుఁ దెలుపుట	...	319
95. రాముఁడు సీతకు మందాకినీ నదీవైభవముఁ దెల్పుట	...	322
96. లక్ష్మణుఁడు రామునికి భరతునియాత్రను దెలుపుట	...	323
97. రాముఁడు లక్ష్మణుని కోపము చల్లార్చుట	...	326
98. భరతుఁడు పాదచారియై రామాశ్రమము వెదకుట	...	329
99. భరతుఁడు రామునిఁ జూచుట	...	330
100. రాముఁడు భరతుని కుశలప్రశ్న చేయఁట	...	333
101. భరతుఁ డన్నకుఁ దండ్రిమరణవార్తను దెలుపుట	...	342
102. రాముఁడు తండ్రి కుత్తరక్రియలు సల్పుట	...	343
103. రామునిఁకల్లులు రామునిఁ జూచుట	...	346
104. భరతుఁడు రాముని రాజ్యముఁ గైకొనఁ బ్రార్థించుట	...	349
105. రాముఁడు భరతుని మాటలకు బదులు సెప్పుట	...	351

సర్గము.		పుట.
106. భరతుఁడు రాము నయోధ్యకు రమ్మని వేఁడుట	...	355
107. రాముఁడు భరతు నయోధ్యకుఁ బొమ్మనుట	...	358
108. జాబాలి రామునితో అహితకము పలుకుట	...	360
109. రాముఁడు జాబాలి మతమును ఖండించుట	...	362
110. వసిష్ఠుఁడు రాముని బతిమాలుట	...	366
111. రాముఁడు వసిష్ఠునికి బదులిడుట	...	368
112. రాముఁడు భరతునకుఁ దనపాదుకలనొసఁగుట	...	371
113. భరతుఁ డయోధ్యకు మఱలుట	...	374
114. భరతుఁ డయోధ్యను జూచి దుఃఖించుట	...	376
115. పాదుకాపట్టాభిషేకము	...	378
116. ఋషులు రాక్షసులను విఱిచి చిత్రకూటాశ్రమము వదలుట	...	380
117. రామఁడత్రిమునీంద్రునియాశ్రమముచేరుట	...	382
118. అనసూయాదేవి సీతకు శాశ్వతాలంకారము నొసంగుట	...	385
119. రామాదులు దండకారణ్యము సొచ్చుట	...	389

శ్రీ ర ఘు
శ్రీరామచంద్రపర బ్రహ్మణే నమః

శ్రీ మ ద్రా మా య ణ ము

అ యో ధ్యా కా ం డ ము

1-వ స ర్గ ము

శ్రీరాముని గుణముల వర్ణనము

శ్లో. గచ్ఛతా మాతులకులం భరతేన తదాఽనఘమ్,
శత్రుఘ్నో నిత్య శత్రుఘ్నో నీతః ప్రీతి పురస్కృతమ్.

భరతుఁడు మేనమామ యింటికిఁ బోవుచుఁ దాను తన మేనమామ యింట సౌఖ్యముల ననుభవించినను, తనకుఁ బ్రియుఁడగు శత్రుఘ్నుఁడు తనతోపాటు లేనియెడల నవి తనకిష్టముగా నుండవని తలఁచి శత్రుఘ్నుని రమ్మని పిలువఁగా, శత్రుఘ్నుఁడు తల్లిదండ్రులను విడిచి యుండ నలెనన్న వ్యసనము లేనివాఁడై, భరతునందలి ప్రేమచేతను, భక్తి చేతను నతని నెడఁబాసి యుండఁజాలక యతనిని వెంబడించి పోయెను. భరతుఁడు శత్రుఘ్నునితోఁగూడఁ దన మేనమామయయూరికిఁ బోయి, లెక్కలేని గుణ్యములుగల తన మేనమామచేఁ బుత్రస్నేహముతో, బుజ్జగింపఁబడుచు, సకలోపచారములఁ బొందుచు నచ్చట నుండెను. ఆ శూరులయిన భరతశత్రుఘ్నుల కచ్చట నేమియుఁ గొఱఁతలేక సమస్త వస్తువులతోఁ దృప్తిపఱచుచున్నను వారు ముదుసలియైన తమ తండ్రిని విడిచివచ్చితిమే యని సర్వదా తమ తండ్రినితలఁచుచుండిరి. అట్లే పరాక్రమశాలియగు దశరథమహారాజును రామలక్ష్మణులు తనకడనున్నను, ఇంద్రుని, వరుణునింబోలు తన పుత్రులగు భరతశత్రుఘ్నులు దేశాం

తరమునకుఁ బోయియున్నందున, అచ్చట వారెట్లున్నారో యను చింత గలిగి యుండెను. ఆ దశరథునికిఁ బురుషశ్రేష్ఠులగు నలువురు కుమారులు, తనశరీరమునుండి బయలువెడలిన నాలుగుబాహువులవలె మిక్కిలి ప్రియులై యుండిరి. అట్లున్నను, సకల భూతములలోపలను విశేష గుణములుగల బ్రహ్మదేవుఁడు విష్ణువునకుఁ బ్రియుఁడైన యట్లు, ఆ నల్వురిలోపలను శ్రేష్ఠములగు సకలగుణములుగల రాముఁడన్నమహారాజున కెక్కిలి సంతసము గొల్పువాఁడుగ నుండెను. అతఁడు లోకకంటకుఁడైన రావణుని వధింపఁగోరి, దేవతలు ప్రార్థింపఁగా భూలోకమున నవతరించిన పురాణపురుషుఁడగు విష్ణుమూర్తియేగదా! అట్టి యనితరతేజశ్శాలియగు నాకుమారునిచే కౌసల్య వజ్రపాణియైన దేవేంద్రునిచే నదితి వలె మిక్కిలి విరాజిల్లెను.

ఆ రాముఁడు సౌందర్యముతోఁ గూడినవాఁడును, పరాక్రమశాలియు, అసూయలేనివాఁడును, గుణములచేత దశరథునిఁ బోలువాఁడనునై, పుడమియందిట్టి సుపుత్రుఁడు మఱొక్కఁడు లేఁడనిపించుకొన్నవాఁడయ్యెను. మఱియు, అతఁడు తిన్నని స్వభావముగలవాఁడు. ఎప్పుడు నెమ్మదిగా మాటాడువాఁడు. ఎవరైనను తన్నుఁగూర్చి నిష్ఠురపు మాట లాడినను, బదులు చెప్పువాఁడుగాఁడు. ఎవరైనసుదనముఁ గొంచె ముపకారము చేసినను, దానినే గొప్పగఁదలఁచి సంతసించువాఁడు. తాను మనోనిగ్రహము గలవాఁడగుటచే నొరులు తనకు నూఱుపకారములు చేసినను, వానిని మనంబునఁదలఁపఁడు. ఆ రాముఁడు నడతయందు వృద్ధులయినవారితోను, జ్ఞానమునందు వృద్ధులగువారితోను, వయస్సునందు వృద్ధులగువారితోను దాను వినువిద్దె నేర్చుకొనునప్పుడునైతము శాస్త్రరహస్యములను ముచ్చటించుచుండెడివాఁడు. అతఁడు విశేషబుద్ధి గలవాఁడు. ఇంపుగా మాటాడువాఁడు. ఒకరు మాట్లాడింపకమునుపే యల్పులతోనేని తాను ముందుగా మాట్లాడువాఁడు. ప్రియభాషి. మగఁటిమి గలవాఁడు; అట్లు మగఁటిమి గలిగియున్నను దా నందఱికంటెను బరాక్రమశాలియని గర్వపడువాఁడుగాఁడు. అసత్య మాడనివాఁడు. విద్వాంసుఁడు. పెద్దలను బూజించువాఁడు. ప్రజలచేఁ గోరఁబడువాఁడు. తానును ప్రజల ననురాగముతోఁ

జూచువాఁడు; దయాళువు; కోపము నణంచుకొన్న వాఁడు; బ్రాహ్మణభ క్తి గలవాఁడు; దీనులను గరుణించువాఁడు; సకలధర్మముల నెఱింగినవాఁడు; సర్వకాలములందు నియమంబుఁ దప్పనివాఁడు; నిత్యపరిశుద్ధుఁడు; తన క్షత్రియకులమునకుఁ దగిన బుద్ధి గలవాఁడు; క్షత్రియజాతి ధర్మమునే తనకు ముఖ్యముగా నెంచువాఁడు; గొప్పకీర్తి నార్జించి దానితో మహా త్తరమైన స్వర్గఫలముగల్గునని తలఁచువాఁడు. అతఁడు కీడుపనులలో మనస్సుఁ జొరనీయఁడు, న్యాయవిరుద్ధమైన ముచ్చటలలోఁ బ్రవే శింపఁడు; బృహస్పతివలెఁ బైపైన యుక్తులు చెప్పువాఁడు; ఆరోగ్యము గలవాఁడు; ప్రాయపువాఁడు; యుక్తియుక్తముగ మాటాడువాఁడు; పుష్టిగలవాఁడు; దేశకాలములనెఱిఁగి, దగినట్లు పనులు చేయఁగల వాఁడు; చూచినంతమాత్రముననే పురుషులబలమును దెలిసికొను వాఁడు; అపకారులకైనను నుపకారముచేయు సజ్జనుఁడు; ఆరాజ పుత్రుఁడు మేటిగుణంబులతోఁగూడి, జనులయొక్క వెలుపటి ప్రాణమో యనఁదగినట్లు తనగుణములచే ప్రియుఁడై యుండువాఁడు; సకలవిద్యల నభ్యసించి, పూర్తియయిన పిదప స్నాతకవ్రతములను జరిపినవాఁడు; వేద వేదాంగవేత్త; వినువిద్దెయందుఁ దండ్రికంటె మేలైనవాఁడు; సమస్తశుభములకు జన్మభూమి; సాధువు; చలింపని ధైర్యముగలవాఁడు; సత్యసంధుఁడు; త్రికరణశుద్ధి గలవాఁడు; ధర్మార్థములను దెలిసిన బ్రాహ్మ ణులయొద్దను, పెద్దలయొద్దను శుశ్రూషచేసి, సకలవిద్యలను, సకలధర్మ ములను నెఱింగినవాఁడు; ధర్మము, కామము, అర్థము అను పురుషార్థ ములస్వరూపము లిట్టిపని యెఱింగినవాఁడు; జ్ఞాపకశక్తిము, మంచిప్రతి భయుఁగలవాఁడు; లోకమర్యాదలను జక్కఁగాఁదెలిసి, యట్లు నడచుకొ నువాఁడు; మితిమీఱిన తెలివితేటలు గలవాఁడు; ఎంత యాపద వచ్చినను చలింపనివాఁడు; తనయాకారము నొరులకుఁ దెలియనీయని వాఁడు; రహస్యమును వెలిపుచ్చనివాఁడు; సహాయసంపదగలవాఁడు; సఫలమైన కోప, సంతోషములు గలవాఁడు; సత్పాత్రదానమునకును, న్యాయముగా ద్రవ్యమునార్జించుటకును దగినకాలము నెఱిఁగినవాఁడు; స్థిరప్రజ్ఞగలవాఁడు; గురువులందు దృఢభక్తిగలవాఁడు; చెడ్డవారిని దాపునఁగూడఁ జేర్పనివాఁడు ; పరుషముగ మాట లాడనివాఁడు;

అలసత్వము లేనివాఁడు; అప్రమత్తుఁడు; తన లోపములను బరుల లోప
ములను నెఱుఁగువాఁడు; శాస్త్రములను జదివినవాఁడు; పరులమేలు
మఱువనివాఁడు; పురుషుల తారతమ్యమును గనిపెట్టఁగల పండితుఁడు;
మిత్రులు మొదలగువారిని చేకూర్చుకొనుటలోను, నాచేకూర్చుకొనిన
వారిని న్యాయము తప్పకుండ మర్యాదగాఁ బరిపాలించుటలోను గడు
సమర్థుఁడు; యోగ్యతలను దాపునఁ జేర్చుకొనుటయందును, వారిని
పాలించుటయందును, దుష్టులను బాఱఁదోలుటయందును, వారిని
శిక్షించుటయందును మిక్కిలినేర్పరి; ద్రవ్యము సంపాదించుటయందలి
యుపాయములనెల్లను దెలిసినవాఁడు; తానుగ నెఱింగి వ్యయము
చేయువాఁడు; తర్కము, వ్యాకరణము మొదలగు శాస్త్రములందును,
సంస్కృతము, ప్రాకృతము మొదలగుభాషలయందును గట్టివాఁడని
పేరెన్నికగన్నవాఁడు; ధర్మార్థములకు లోపము వాటిల్లకుండునట్లు
కామముల ననుభవించువాఁడు; సోమరితనము లేనివాఁడు; సంగీతము
మొదలగు వేడుకలైన విద్యలనెల్ల బాగుగ నెఱింగినవాఁడు; ధర్మము,
కీర్తి, లోకసంబంధపుఁ బనులు, తాను, తన బంధువులు వీరికిఁ దగినట్లు
ధనమును బంచిపెట్టుటకు శక్తిగలవాఁడు; గుట్టులను, వీనుఁగులను
ఎక్కుటకును, వానిని లోఁబఱచుకొనుటకును దెలిసినవాఁడు; లోక
మున విలువిద్దెనేర్చినవారిలో మేటియైనవాఁడు; అతిరథులఁజే మర్యాద
వడసినవాఁడు; శత్రువుల నెదుర్కొనువాఁడు; వారిని సంహరించు
వాఁడు; సేనలను నడిపించు శక్తిగలవాఁడు; యుద్ధమునఁ గోపముతో
నెత్తివచ్చిన దేవతలకైనను, నసురుల కైనను లోఁబడనివాఁడు; పరుల
కలిమి కీర్తి లేనితనము లేనివాఁడు; కోపమును, గర్వమును గెల్చిన
వాఁడు; ఒరులశుభములను జూచి ద్వేషించుస్వభావము లేనివాఁడు;
ఏప్రాణినైన నవమానింపనివాఁడు; ఆయాసమయములకుఁ దగినట్లుపోక,
యేది న్యాయమో అట్లే నడచుకొనువాఁడు. రాజకుమారుఁడగు రామునఁ
డిట్టిసుగుణగణములతోఁగూడి, ముల్లోకములవారిచే గౌరవింపఁబడుచుఁ
దాలిమియందు భూమిని, బుద్ధియందు బృహస్పతిని, పరాక్రమమునం
దింద్రునిఁ బోలి, సకలజనులకు నొప్పినవియుఁ, దండ్రికిఁ బ్రీతిని గల్గించు
నవియు నైన సుగుణములు గలిగి, కిరణములచే వెలిఁగెడి సూర్యుని

మాడ్కిఁ దేజరిల్లుచుండెను. ఇట్టి సుగుణములతోడంగూడి, శత్రువులకు గెల్వరాని పరాక్రమంబు గలవాఁడై, యింద్రునిబోలిన యీరాముని భూదేవి తన భర్తనుగాఁ గోరెను.

ఇట్టిసాటిలేని యనేక సుగుణంబులతోఁగూడియున్న తన పెద్ద కుమారునింగూర్చి దశరథుఁ డిట్లు మనసునఁ జింతించెను: "నేను ముసలి వాఁడను, నేను బ్రతికియుండఁగనే రాముఁ డెప్పుడు రాజ్యమునకు వచ్చు నని నేను సర్వదా కోరుచున్నాను. ఎప్పుడు నేను మన కుమారుఁడగు రాముని సింహాసనముమీఁదఁ గూర్చుండఁబెట్టి పట్టాభిషేకము చేసి, యతఁడు సింహాసనంబునఁ గూర్చుండియుండ చూడఁ బోయెదను" అను మిక్కుటమయిన యీశదే యీ దశరథుని మనస్సునందు కొట్టులాడుచుండెను.

మఱియు దశరథుఁడు తన మనమున నిట్లు తలపోయఁ జొచ్చెను: "ఈ మన రాముఁడు ప్రజల మేలుఁ గోరెడివాఁడు; జంతువులయెడ జాలి గల్గినవాఁడు; వర్షము వర్షించు నింద్రునివలె నాకంటెను జనులకందఱికిఁ బ్రియమైనవాఁడు; పరాక్రమమున నింద్రుని యముని, బుద్ధియందు బృహస్పతిని, ధైర్యమునఁ బర్వతమును బోలినవాఁడు; నాకంటె నెన్ని గుణముఁగులో నెక్కువ గుణములు గలవాఁడు. రాముఁడు సింహాసన మెక్కి యీ భూమండల మేల్ల నేలుచుండఁగా నీ వయస్సున్నవైనను చూచి నేనెట్లు స్వర్గము నొందుదును?" అని యీ విధమునఁ దశరథుఁడు తలపోసి, యితరరాజులకుఁ బొందఁ గలవికానివియు, లెక్కపెట్టుటకు సాధ్యపడనివియు, లోకోత్తరములయినవియునైన ఆయారామంచి గుణములతోను, ఇంకను ననేకములయిన సుగుణములతోను నిండియున్న యీ రాముని జూచి, తన మంత్రులతోడ నాలోచించి, యీ రాముని యువరాజునుగ నిశ్చయించెను. అంతట బుద్ధి సూక్ష్మత గల దశరథుఁడు మంత్రులం జూచి, "మంత్రులారా! భూమియందును, నాకసమునందును, స్వర్గమునందును సుశకునములు గలుగుచున్నవి. నాకును ముసలితనము నానాఁటికి హెచ్చుచున్నది. కావున రామునకుఁ ద్వరలోఁ బట్టము గట్టనలయును" అని చెప్పి, రాముఁడు బుద్ధిమంతుఁడు; పున్నమచందమునిబోలు మోమువాఁడు; దుఃఖలేశము లేనివాఁడు.

ఇట్టి రామునకుఁ బట్టాభిషేకము చేయుటలో జనులందఱు సొప్పి యున్నారని తెలిసికొనెను.

తనయొక్కయు, జనులయొక్కయు మేలుకొఱకును, ప్రీతికొఱకును దశరథుఁడు రామునకుఁ బట్టాభిషేకమును దగిన సుముహూర్తమునఁ జేయుటకుఁ దొందరపడి, యాలోచన చేయుటకై సకల పురవరులలో నుండువారిని, పల్లెటూళ్లలోనివారిని, భూమండలమందు గొప్పవారైన రాజుల నందఱను బిలిపించెనుగాని, దూరదేశములం దుండుటంబట్టి కేకయమహారాజును జనకమహారాజును బిమ్మట నీ శుభవార్తను వింవరుగాక, యిప్పుడు కడుదూరమున నుండునట్టి వారిం బిలిపించుటకాలస్యమగు నని, వారి నిరువురునిఁ బిలిపింపఁడయ్యెను. దశరథుని యానతి మెఱసిచ్చిన రాజులనందఱిని వారివారి యంతస్తులకుఁ దగినట్లు మర్యాదలుచేసి, తానును సకల భూషణాలంకృతుఁడై కొల్వుకూటమున కేతెంచి, బ్రహ్మదేవుఁడు ప్రజలనుబోలెఁ దన యానతిచే వచ్చిన రాజుల నందఱని జూచెను. అంత శత్రుసేనలఁ బీడించుసట్టి దశరథనృపాలుఁడు సింహాసనంబునఁ గూర్చుండినంత తక్కిన నృపతులందఱు లోపలికిఁ జొచ్చి, తమకై యమర్పఁబడియుండెడి యాసనంబులందు రాజున కెదుట నియమంబుతోఁ గూర్చుండిరి.

అట్లు మర్యాదలంబొంది, యడఁకువతోఁగూడి దానుననే యాసనంబులఁ గూర్చుండియున్న రాజులచేతను, తన దేశమునందలి పట్టణవాసులగు జనులచేతను, పల్లెలలో నుండు జనులచేతను పరివేష్టింపఁబడియున్న యా దశరథనృపాలుఁడు సకల దేవతలచేఁ బరివేష్టింపఁబడియున్న వేయికన్నులవేల్పుమాడ్కి వెలయుచుండెను.

2-వ స ర్గ ము

సభ్యులందఱు రాముని పట్టాభిషేకంబునకు సమ్మతించుట

అంతట దశరథమహీపాలుఁడు దుందుభివాద్యమునొక్కయు, మేఘగర్జనమునొక్కయు మ్రోఁతవంటి మ్రోఁతగలదియు, గంభీరమైనదియు, రాజలక్షణములతోఁ గూడినదియు, వినువారి కింపొందవించునదియు, సాటిలేనిదియు, ప్రేమగలదియు నైన కంఠస్వరముతో, సభవారి నందఱిం జూచి, జనులకెల్ల మే లొదవునదియు, విశేష సంతో

షము గావించుసదియు, నాదరింప దగినదియు నైన మాట జెప్పెను. "ఓ నృపాలులారా! సకలజనులారా! నేను పరిపాలించెడి యీ రాజ్యపు జనులను నాకు ముందటిహారయిన రాజులందరు తమపుత్రులతో సమానముగ దలంచి రాజ్యమును బరిపాలించుచుండిరి గదా. నేనును ఇక్ష్వాకువంశమునం బుట్టిన రాజులందరికిచేతను బాలింపబడిన యీ జగత్తున కంతయు మేలొనరింప గోరుచున్నాడను. నేనును నా పెద్దలదారి నవలంబించి జాగ్రత్తగలిగి, యెల్లప్పుడు సోమరితనము మాని, జనులను బాలించితిని. నేను జనులందరికి మేలు చేయుచు, శత్రువులను బారద్రోలి, తెల్లని గొడుగుయొక్క నీడలో నుండ, నాకు ముసలితనము నచ్చెను. నేను పెనుక (నలునది) పేల సంవత్సరములు జీవించి, రాజ్యపరిపాలనము చేసితిని. నేను ముదుసలి నైతిని. ఇంక రాజ్యపాలనము సేయరాదలను. అలుపుం దీర్చుకొనం గోరుచున్నాను. రాజగుణములచేం బొందబడినదిగను, ఇంద్రియముల నణచని వారిచే మోయ నలవిగానిదిగను నైన యీ లోకమంయొక్క న్యాయపరిపాలన మనెడు బరువు మోసి మిక్కిలి బడలితిని. కావున బ్రాహ్మణశ్రేష్ఠులయిన వసిష్ఠుండను మొదలగువారి యొక్కయు, ఇచ్చటం జేరియున్న రాజుల యొక్కయు, సకలజనములయొక్కయు నిష్టము గైకొని ప్రజల మేలు గోరెడు నా పుత్రుని రాముని రాజునుగా నేర్పఱచి, నేను విశ్రాంతి నొందగోరియున్నాను. నా పెద్దకుమారుడగు రాముండు పరాక్రమమున నింద్రునిం బోలువాండు; శత్రుపురములను గెల్చువాండు; సకల గుణములందును నీస్సీం బోలినవాండు. పుష్యమీనక్షత్రముతోం గూడిన చంద్రునివాడిక్కి వెలుంగుచుండువాండును, ధర్మవేత్తలగు పురుషుల లోపల శ్రేష్ఠుండును నైన యా రామునికి యువరాజపట్టముంగట్టం దలంచితిని. కాంతిగల లక్షణుని యస్మదీయుడు రాముండు మన రాజ్యమునకుం దగిన నృపాలుండు. ఆ రాముండు ప్రభువయినయొడల మూండులోకముల వారును రాజు గలవా రగుదురు. నేనును ఈ భూమండలం బెల్లను నా పెద్ద కుమారుండైన యీ రామునియం దుంచి, రాజ్యమున కీ మేలు గావించి, శ్రమ దీర్చుకొనంగోరెదను. ముదుసలినైన నేను రాజ్యను నా కొమరుని కొప్పగించుటకుం దగినదనియు, నే నాలోచించిన

యోజన మంచి దనియు మీకుఁ దోఁచెనేని, మీరు సమ్మత మంగీకరింప వలయును. నే నొక్కఁడను మాత్ర మొప్పుకొని మీరందఱు సమ్మతింప రేని, మీ యనుమతిలేక నే నెట్లు ఈ కార్యంబుఁ జేయఁగలను? రాము నికిఁ బట్టాభిషేకముచేయుట నాకు సమ్మతముగాఁ దోఁచినను, మీ కంద ఱకు వేఱొక మేలైనమార్గముఁ దోఁచునేని యాలోచించి చెప్పుఁడు. పక్షపాతములేని మధ్యస్థులతోడి యాలోచించుట తా నొంటరిగఁ గూర్చుండి యాలోచించుటకంటె యుక్తి ప్రతియుక్తులచే నెచ్చు మేలు గలిగించునుగదా!"

ఇట్లు దశరథుఁడు పలికిన మాటల నన్నిటిని విని, వాన గురియు చుండు మేఘమును జూచి నెమళ్ళులు సంతస మొందునట్లు, రాజులును, జను లందఱును సంతసించి దశరథమహారాజును గొనియాడిరి. అచ్చట నున్న జనులందఱు సంతోషభరితులై, "మహారాజా! తమ యాలోచన మిక్కిలి బాగుగా నున్నది; అదియే తగినది" యని ఘోషించిరి. ఘోషించునప్పుడు గలిగిన ధ్వని మిక్కిలి దట్టమయి, మానుచ్రొక్కాఁగి, యచ్చటి విమానము గదలునట్లుచేసెను. ధర్మార్థముల నెఱిఁగిన యాదశ రథ నరపాలుని యభిప్రాయము నంతయుఁ దెలిసికొని, యచ్చటనున్న ఋషులును, బ్రాహ్మణులును, దేశములనుండి వచ్చిన రాజులును పట్టణ ములలోను, పల్లెలలోను నుండు జను లందఱును గూడి యాలోచించి, యొకటె యభిప్రాయమునకువచ్చి, దశరథుని ముసలితనమును మనమునఁ దలపోసి, యా నృపాలునితో నిట్టులనిరి: "మహారాజా! తమరు పండు ముదుసలివారలు. మీ రనేకవేలసంవత్సరముల వయస్సు చెల్లినవారలు. కావున రాముని యువరాజుగఁ జేయు విషయమై మా కేమియు నాటంకములేదు. పొడవు చేతులవాఁడును, గొప్ప శూరుఁడును, రఘువంశమునఁ బుట్టినవారిలో నెల్ల శూరుఁడునునగు రాముఁడు పట్టాభిషిక్తుఁడై పట్టంపుటేనుఁగు నెక్కి, తెల్లనిగొడుగు పట్టికొని వీథులం దూరేఁగుచుండ మేము చూడఁగోరుచున్నాము" అని సభలో నున్నవా రందఱు దశరథునితోఁ జెప్పిరి.

ఇట్లు జనులందఱు తన మనస్సున కిష్టముగాఁ జెప్పినమాటను విని, దశరథుఁడన్ని సంగతు లెఱిఁగియుండియుఁ దెలియనివాఁడువలె జనుల

నడిగి తెలిసికొనఁగోరి "ఓ జనులారా! నేను చెప్పినమాట వినినంతనే "రాముఁడు రా జగుట మా కందఱికు సమ్మత" మంటిరే! ఏల యిట్లు చెప్పితిరి? ఇపుడు నేను న్యాయముగాఁ బరిపాలన జరుపుచున్నను, మీ రీలాగున రాముఁడు యువరాజుగాఁ గావలె నని గోరుటకుఁ గారణమేమి? ఈ నా సంశయము పోఁగొట్టవలయు" నని జనుల నడిగెను.

అప్పుడు సకలదేశములందలి పట్టణములనుండి పల్లెలనుండి వచ్చిన వారందఱు రాజులును బ్రాహ్మణులును గూడి మహారాజుం జూచి, "నరపాలా! నీ కొమరునికి లెక్కలేని మంచి గుణము లున్నవి. ఓ ప్రభూ! దేవతలం బోలువాఁడును, బుద్ధిమంతుఁడును, సుగుణవంతుఁడు నైన యా రామునియొక్క యాసందకరములైన గుణములను జెప్పెదము. మహారాజా! మేము వర్ణించునట్టి యాతని గుణములను వినుఁడు: రాముఁడు తన మేలైన గుణములచే నింద్రునితో నెనవచ్చువాఁడు. ఓటమి నొందని పరాక్రమముగలవాఁడు. ఇక్ష్వాకువంశస్థులగు రాజులందఱికంటెను మించినవాఁడు. రాముఁడు సత్యమనెడి ధర్మమును దప్పని సత్పురుషుఁడు; రామునినుండియే న్యాయము, కలిమియుఁ గలిగిన వని చెప్పవచ్చును. మఱియు నతఁడు జనుల మనస్సునకు సంతోషం బొదవించుటయందుఁ జంద్రుని, ఓర్పునందు భూమిని, బుద్ధియందు బృహస్పతిని, శౌర్యమునందు దేవేంద్రునిఁ బోలినవాఁడు; సకల ధర్మముల నెఱింగినవాఁడు; ప్రతిన తప్పనివాఁడు; ఆచారవంతుఁడు; అసూయలేని వాఁడు; ఓర్పుగలవాఁడు; జనుల నోదార్చువాఁడు; తిన్ననివాఁడు; చేసిన మేలు మఱువనివాఁడు; ఇంద్రియములను గెల్చినవాఁడు; మెత్తని వాఁడు, అయినను గదలని మనస్సుగలవాఁడు; ఎల్లప్పుడు మంచిపనులే చేయువాఁడు; ఇతరుల కిష్టముగ మాట్లాడువాఁడు; సత్యము పలుకువాఁడు; చక్కఁగాఁ జదివిన పెద్దలను బ్రాహ్మణులను గొల్చునట్టివాఁడు. అట్లతఁడు సకల గుణగణములతోఁ గూడినవాఁడగుటంజేసి యతనియొక్క సాటిలేని కీర్తియు, ప్రతాపమును, కాంతియు దినదినమునకు వర్ధిల్లుచున్నది.

దేవతలు, అసురులు, మనుష్యులు వీరిలోపల రాముఁడు సకలాస్త్ర ములు నెఱింగినవాఁడు; సకల విద్యలను జదివి సమావర్తనవ్రతము చేసిన వాఁడు; వేదములను, వేదాఁగములను బూర్తిగాఁ జదివినవాఁడు; గాన విద్యయందు రామునికి సాటివచ్చువాఁడు మఱొక్కఁడు లేఁడు. గొప్ప వంశమునఁ బుట్టినవాఁడు; ధైర్యస్వభావము గలవాఁడు; విశేష బుద్ధి కలవాఁడు; ధర్మములను, అర్థములను జక్కఁగా నెఱుఁగఁగల మేటి విప్రులకడ విద్యాభ్యాసము చేసినవాఁడు; పట్టణములలోని వారి నిమిత్త మైనను, తన దేశమునందలి గ్రామములలోని వారి నిమిత్తమైనను, లక్ష్మ ణుని వెంటఁదీసికొని యుద్ధమునకుఁ బోయిన, నెప్పుడును శత్రువులను గెలువక మఱలిరాఁడు. అట్లు శత్రువులను గెల్చి, రథమునైనఁ గూప్పుండికాని, యేనుఁగు నెక్కికాని మఱలివచ్చి, పురవాసులగు జనుల నందఱిని దన బంధువులను వలెనే సేమ మరయుచుండును. పుత్రులం దును, అగ్నులందును, భార్యయందును, పనివారియందును, శిష్యులం దును, నొకటేతీరునను, వరుసగాను, దండ్రి తన యౌరసపుత్రులను విచారించునట్లు, మిక్కిలి ప్రేమతోఁ విచారించు చుండువాఁడు. మఱియు, పురుషవ్యాఘ్రుఁడయిన రాముఁడు ఋషులమగు మున్నుఁ జూచునేని 'గురువులారా! మీ శిష్యులు చెప్పినపని చేయుచు, మిక్కిలి శ్రద్ధతో శుశ్రూష చేయుచున్నారా' యని మమ్ము నెల్లప్పు డడుగు చుండు వాఁడు.

మఱియు రాముఁడు మనుష్యుల కాపదలు సంభవించినప్పుఁడు తనవారు, పొరుగు వారని తలంపక తాను మిక్కిలి దుఃఖపడును. అట్లే, వారి కుత్సవములు సంభవించునపుడును దండ్రి తన కొడుకుల కుత్సవ ములు సంభవించినప్పుడు సంతోషించురీతిని తాను సంతోషించును. ఆ రాముఁడు, సత్యమే పలుకువాఁడు; గొప్ప విలుకాఁడు; పెద్దలను శుశ్రూషఁ చేయువాఁడు; ఇంద్రియములను గెల్చినవాఁడు; చిఱునవ్వు తోఁప మాటాడువాఁడు; ఎన్నికష్టములు వచ్చినను న్యాయమార్గముఁ దప్పనివాఁడు; జనులకు మేలగు పనులచే నెస్నగాఁ జేయువాఁడు; వదరుఁ బోతులతోనుఁ మొండికట్టెలతోను, మాటాడుటయందుఁ బ్రేమలేని వాఁడు; బృహస్పతివలెఁ బై పైని యుక్తులను జెప్పువాఁడు; సొగసు

కనుబొమలును, వెడల్పైన యొత్తైన కన్నులుగలవాడు; లోకములకెల్ల ప్రియుడయిన యారామునకు మగటిమి, ధైర్యము, పరాక్రమము అను మూటిచే విష్ణుమూర్తి తానే పుడమియం దవతరించెనో యనదగు వాడు; జనులయొక్క పాలన రీతిని బాగుగా నెఱిగినవాడు; ఆశలకు లోబడని యింద్రియములుగలవాడు; ఈరామునికి గోపము వచ్చిన, తేజస్సు, సంతసము గలిగినను నెప్పటిగ నవివర్ణముగానుండు; దండింపదగినవానిని చక్షుర్మములచేసి గనుడించువాడు; దండింపదగనివారిపై గోపముగనుపరచనివాడు; రణము నొనరించువాడై ప్రహరించునో, అతనికి సకలవిధములగు కోరికల నొసగును. ఇట్టి రాముడు సకల జనులచేత గౌరవింపబడియు, జనులందరి కొప్పినవియు, నెమ్మదిగలవియునైన సుగుణములతోడ గూడి, వేడి వెలుంగులచే దేజరిల్లుచుండు సూర్యునిమాడ్కి ప్రకాశించుచుండును. ఈ రాముడు మల్లోకములను బరిపాలింపదగినవాడనడగియుండ నీ భూలోకమును మాత్ర మేలు విషయమున నేమి సంశయ మున్నది?

రఘువంశమునం బుట్టిన యో దశరథన్నృపాలా! యట్టి సర్వసుగుణములతోం గూడియున్నవాడును, అమిత పరాక్రమశాలియు, లోకపాలురను బోలినవాడును నైన రాముని భూదేవి తానే భర్తనుగా వరించెను. మహారాజా! పుత్రులకుండవలసిన గుణములతో నిండిన కౌశల్యపుండు యుచునికి జన్మించునట్లు, ఈ రాముడు నీ భాగ్యవశము ననే నీకు జనించినవాడు; జ్ఞానవంతుడైన యీ రాముడు దేవతలు, గంధర్వులు, పన్నగులు, అసురులు, మనుష్యులు మొదలగువారికంటె నెక్కువయిన బలము, ఆరోగ్యము దీర్ఘాయువును గలిగినవాడు. ఇట్టి రామునికి బట్టాభిషేకంబు జరుగవలెను నని మన దేశములోని పట్టణము లలో నుండు స్త్రీలు, ముదుసలులు, జనరాండ్రు మిక్కిలి శ్రద్ధగలవారై ప్రాతస్సాయంకాలములందు రెంటియందును సకల దేవతలను ప్రార్థించు చున్నారు. మహారాజా! నీయనుగ్రహమునం జేసి, వారి కోరిక నెఱి వేరునుగాక! నల్లకలువలనంటి దేహచ్ఛాయగలుగువాడును శత్రువుల సంహరించి బరివార్చు వాడును, రాజాధిరాజులలో సుత్తముడును నైన నీపెద్దకొడుకగు రాముడు డిప్పుడు యువరాజయి యున్నాడు. జనుల

కోర్కుల నొసఁగునట్టి మహారాజా! దేవదేవునికి సాటివచ్చువాఁడును, జనులందఱి మేలు గోరువాఁడును, గొప్పవారిచేఁ గొల్వఁబడు చుండువాఁడునైన రామునికి వేగిరంబుగఁ బ్రేమతోఁ బట్టాభిషేకంబొనర్చి, మాకు మేలొసఁగుదువుగాక!" యని వచ్చిన రాజులు, మహర్షులు, పుర గ్రామవాసులగు జనులు నందఱు నొకటే యభిప్రాయమును దశరథనృపాలునితోఁ దెల్పిరి.

తి-వ స ర్గ ము

దశరథుఁడు రాముని బిలిపించి యతనితోఁ బట్టాభిషేకము చేయుదుననని చెప్పుట

"రాజులు, ఋషులు, జనులందఱు చేతులు మోడించి చెప్పిన మాటలను విని, దశరథమహారాజు వారి కిష్టము లయిన పలుకుల నిట్లనియె :

ఓ జనులారా! యాహా! మీరు నాయభిప్రాయము నామోదించి నందులకై నేను గడుసంతసము నొందితిని. మీరు నా జ్యేష్ఠసుతుఁడగు రాముని యువరాజునుగఁ జేయ సమ్మతించిరి. నా ప్రభావము సాటి లేని దనవచ్చును" నని చెప్పి, వారికిఁ దగు మర్యాదలఁ జేసి, యా వచ్చిన జనులందఱు వినుచుండ వసిష్ఠవామదేవ మహర్షులం జూచి, "మునీంద్రులారా, యీ చైత్రమాసము మిక్కిలి శుభప్రదమైనది. శుభకర్మములను జేయ యోగ్యమైనది. ప్రతివనంబును వృక్షములు చిగిరించి పూలతోను గాయలతోను నిండియున్నవి. కావున శ్రీరాముని యువరాజపట్టాభిషేకమునకుఁ దగుప్రయత్నముఁ గావింపుఁడు" అని చెప్పెను. ఆ మాట చెప్పి దశరథుఁడు నిలుపఁగానే, యామోద సూచకముగా జనుల హర్షధ్వనులు చెలరేఁగినవి. ఆసందడి యాఁగి నంతనే, జననాథుఁడు మునీంద్రుఁడగు వసిష్ఠునిఁగూర్చి: "ఓపూజ్యుఁడా! రాముని పట్టాభిషేకమునకయి కావలసిన సామగ్రులనెల్ల సెలవిండని చెప్పెను.

బ్రాహ్మణ శ్రేష్ఠుఁడగు వసిష్ఠుఁడు దశరథనరపాలుని వాక్యమును విని, చేతులుజోడించికొని రాజుముందట నిలఁబడియున్న పనివారిం జూచి, "యపుడె సాలెవారిచే నేయించి తెచ్చిన యంచులుగల వస్త్రములను, బంగారును, సకలవిధములగు రత్నములను, బలులను, ఓషధుల

నన్నిటిని, తెల్లని పూవులదండలను, రథములను, సకలాయుధములను, చతురంగబలమును, శుభలక్షణములుగల పట్టంపుటేనుఁగును, తెల్లని చామరములను, వింజామగలను, గొడుగులను, ఱెక్కెమును, అగ్ని హోత్రునివలె వెలుఁగుచుండు బంగారు పూర్ణకలశములను, బంగరు కొమ్ములుగల యెద్దును, గొప్ప పులితోలును, మఱియుఁ గావలసిన యన్నివస్తువులను దెల్ల వాఁటినప్పటికి రాజుగారి యగ్నిహోత్రశాలకుఁ బోర్పుఁడు. అంతఃపురద్వారములను, బట్టణద్వారములనన్నింటిని గంధము పూసి పూవులదండలచే నలంకరించి, సువాసనగల ధూపములు వేయుఁడు. లక్షలకొలఁదిగ బ్రాహ్మణులు భుజించుటకుఁజాలిన, షడ్రసోపేత మగుచు, పాలు పెరుగులతోఁగూడిన శ్రేష్ఠమయిన యన్నము వండింపుఁడు. రేపటి యుదయమున బ్రాహ్మణుల నెల్లరఁ జక్కఁగా గారవించి, వారికి నేయి, పెరుగు పేలాలును, విస్తారమైన దక్షిణలును నిప్పింప వలయు. రేపు సూర్యోదయమగు నప్పటికిఁ బుణ్యాహవాచనకార్యముపక్రమింపఁబడును. కనుక బ్రాహ్మణుల నందఱిని బిలిచివచ్చి, వారికిఁ దగిన యాసనంబుల నేర్పఱిపుఁడు. ఱెక్కెములఁ గట్టుఁడు; రాజవీథులలో దుమ్ము రేగకుండులాగున నీరు చల్లింపుఁడు. వేశ్యలును, నట్టువ గాండ్రును సకల భూషణాలంకృతులై, రాచనగరియొక్క రెండవ వాజారమున సుందరగాక! దేవాలయములందును, నాలుగుదారులు గలియుచోట్లను గొంద ఱన్నమును, గొందఱు భక్ష్యములను, మఱి కొందఱు పూవులదండలను వేర్వేఱుగాఁ గైకొని వచ్చు బ్రాహ్మణుల కెల్ల నిప్పింపుఁడు. భటులందఱు పొడుగుకత్తులను దాల్చి, కవచములను దొడిగి, చక్కని యుడుపులను ధరించి రాచనగరు వాఁకిట సిద్ధముగా నుండునట్లానతిండు" అని భృత్యుల కానతిచ్చిన, తక్కిన పనుల నన్నింటిని రాజునకుఁ దెల్పుచు, ఆమనయనుమతి వడసి వసిష్ఠవామదేవులు సిద్ధపఱిచిరి. ఇట్లు బ్రాహ్మణోత్తములగు నావసిష్ఠవామదేవులు సంతసముచేఁ బులకలెత్తిన మేనితోఁగూడి "మహారాజా! అన్నియు సిద్ధము చేయఁబడినవి" యని పుడమిఱేఁడగు దశరథ నృపాలుని కెఱిఁగించిరి.

అంతటఁ గాంతిమంతుఁడయిన దశరథుఁడు సుమంత్రునిఁ బిలిచి, "బుద్ధిమంతుఁడయిన రాముని వేగిరముగఁ దోడ్కొనిరమ్ము"ని యానతిచ్చెను. సుమంత్రుఁడును "చిత్త" మని సెలవుఁ దీసికొనిపోయి, రథికులలో శ్రేష్ఠుఁడైన రాముని రథముపైఁ గూర్చుండఁబెట్టికొని వచ్చుచుండెను. అపుడు తూర్పు, పడమర, దక్షిణము, ఉత్తరము ననెఁడి నాలుగు దెసలనుండి వచ్చిన రాజులు, మ్లేచ్ఛరాజులు; మఱియును, గొండ ప్రదేశములందుండు రాజులు, అడవులందుండు రాజులు నేతెంచి దేవతలందఱు దేవేంద్రునింబోలె నృపాలునిఁ గొల్చుచుండిరి. దేవతలచేఁ జుట్టఁబడిన దేవేంద్రునిమాడ్కి, రాజు లందఱిచేఁ జుట్టఁబడిన దశరథుఁడు ప్రకాశించుచు మేడపైనుండి, రథముపైఁ గూర్చుండివచ్చుచున్న తన కుమారుని రామునిం జూచెను. గంధర్వరాజుం బోలువాఁడును, పరాక్రమశాలి యని ప్రసిద్ధికెక్కినవాఁడును, పొడవు చేతులవాఁడును, ఎక్కువ బలిమిగలవాఁడును, మదపుటేనుఁగుచందమున నడచువాఁడును చంద్రునివలె మనోహరమగు మోమునగలవాఁడును, మిక్కిలి యిష్టముతోఁ జూడఁదగినవాఁడును, తన సౌందర్య దాక్షిణ్య గాంభీర్యాది గుణములచేఁ బురుషులయొక్క చూపులను, మనస్సును, జూఱగొనువాఁడును నైన యా వచ్చుచున్న రాముని నెండవేఁడిమిచే బడలికసఁడియున్న ప్రజలువర్షించుచున్న మేఘమునుఁబోలెఁ జూచియు దశరథుఁడిపు దనివినొందకుండెను. సుమంత్రుఁడు రాచనగరుకడ కేతెంచి, రాముని రథంబునుండి దించి, చేతులు జోడించుకొని తన తండ్రికడ కేఁగుచుండఁ రాముని వెంబడించిపోయెను.

ఆ రాముఁడును దనవెంబడి వచ్చుచున్న సుమంత్రునితోఁగూడఁ దండ్రిని జూచుటకై కైలాసశిఖరముంబోలు మేడ యెక్కెను. ఆతఁడు మేడపైఁ గెక్కి చేతులు జోడించి వినయనమ్రుఁడై వచ్చి, తండ్రికడ నిలఁబడి, తనపేరు చెప్పుచుఁ దండ్రిపాదములకు మ్రొక్కెను. ఇట్లు నమస్కరించి, చేతులుజోడించుకొని యడఁకువతోఁ నిలఁబడియున్న తనముద్దులకొడుకగు రాముని జూచి, యంజలినిబట్టి దగ్గఱకుఁ జేరఁదీసికౌఁగిటఁబట్టి, యెత్తయినదియు, లెస్సగా రత్నములు చెక్కినదియునైన యొక బంగారుపుయమయిన యాసనమఁపుఁ గూర్చుండ నియమించెను.

అతఁడాయాసనమునఁ గూర్చుండి నిర్మలుఁడైన సూర్యుఁడు తన కిరణములచే మేరుపర్వతమును వెలుఁగఁజేయుమాడ్కిఁ దాను గూర్చుండిన యాసనశ్రేష్ఠమును దనకాంతిచేతనే ప్రకాశింపఁజేయుచుండెను. మబ్బులు వర్షించి తెల్లపాఱుటచే నిర్మలమ్మైయుండు నక్షత్రములతోడను గ్రహములతోడను గూడిన యాకాశము చందురునిచే వెలుఁగునట్లు మిక్కిలి ప్రకాశించుచుండు రామునిచే నాసభ యంతయు వెలుఁగుచుండెను. అట్లు తనయెదుట నాసనంబునఁ గూర్చుండియున్న తన ప్రియకుమారుఁడైన రామునిజూచి, సకలభూషణములచే నలంకరింపఁబడి, యుగ్వమానందుఁ గనఁబడుచున్న తనప్రతిరూపమునుగాఁ దలఁచి మిక్కిలి సంతోషము నొందెను. కాశ్యపుఁడు దేవేంద్రునింబోలెఁ బుత్రవంతులలోఁ శ్రేష్ఠుఁడైన యా దశరథుఁడు తనకుమారునిఁజూచి, క్షేమమడిగి, చిరునవ్వుతోఁ బలుకరించి నిట్లనియె. "ఓరామా! నీవు నాకన్ని విషయములందుఁ దగియున్న నా జ్యేష్ఠభార్యయగు కౌసల్యయందు నాకుఁ దగిన కుమారుఁడవు; సకలగుణములచే నొప్పినవాఁడవు; నీయొక్క సద్గుణములను జూచి, యీ మనదేశపు జనులందఱు నీవు రాజవు గావలెనని కోరుచున్నారు. కావున నీవు పుష్యమీనక్షత్రయుక్తమయిన శుభదివసమున యువరాజపట్టమునొందుము. ఓరీ నాయనా! నీవు స్వాభావికముగానే వినయముతోఁ గూడినవాఁడవు; గుణవంతుఁడవు; అలుసును నీయంచలి ప్రేమచేఁ గొన్ని హితవాక్యము లుపదేశించెదను; వినుము. "పెద్దల కడఁగియుండి, యెల్లప్పుడు ఇంద్రియములను లోఁబఱచుకొనియుండుము. కామమునలనను, క్రోధమువలనను బుట్టిన వ్యసనములను మానుము. పరోక్షముగా వేఁగులనలనఁ బరరాజ్యములసంగతి విచారించుటచేతను, ప్రత్యక్షమునఁ దన రాజ్యమునొక్కయుఁ బరరాజ్యము నొక్కయు సంగతులు విచారించుటచేతను మంత్రులు మొదలగు సకలజనులను సంతోషపఱిపుము. ధాన్యపుఁ గొట్టులను, బొక్కసములను నేర్పఱిచి, సకలవస్తువులను ధనమును జేర్చిపెట్టి, జనులు సంతుష్టులు ననురక్తులునయియుండునట్లు, వారిని ప్రేమతోఁ బోషించుచు నెనఁతు భూమిపాలనము సేయుచున్నాఁడో, యా రాజును బొందిన మిత్రులమృతముదొఱకిన దేవతలచందమున సంతతమునొందుదురు; కావున

నీవును మనస్సును జయించి యీ ప్రకారముగఁ జేయుము" అని రాము నకు దశరథుఁడు హితమును బోధించెను. అప్పుడు తమయిష్టములఁ జేయు రామునియొక్క స్నేహితులు సంభరముతో కౌసల్యకడకు వేగ నేఁగి యీసంగతిని దెలిపిరి. స్త్రీలలో నుత్తమురాలగు నా కౌసల్య విశేషమయిన బంగారమును, గోవులను, రత్నముల ననేకము లను వారికిప్పించెను. అంతట రాముఁడు రాజునకు నమస్కరించి, యీరథ మెక్కి, జనుల సమూహముచే గారవింపఁబడి, కాంతితోవెలుఁగు తన నగరునకుఁ జేరెను. పురజనులందఱు దశరథు ననుమతిని బడసి తాము గొప్పలాభమునుబొందినట్లు సంతసించి, తమయిండ్లకుఁబోయి, మహానంద ముతోఁగూడి దేవతలను బూజించిరి.

4 - వ స ర్గ ము.

దశరథుఁడు రామునికిఁ దన చుస్వప్నములకు ఫలముఁజెప్పి
పట్టాభిషేకము త్వరలో జరుపవలయుం నని తెల్పుట

అంతట రాజులందఱును, దేశమునుండి వచ్చిన జనులందఱును, తమతమ యిరవులకుఁబోయి చేరినంతటనే దశరథుఁడు తానుగ నన్ని సంగతులను నిర్ణయింపఁగలవాఁడయ్యును, తన మంత్రులతోడ నాలో చించి నిర్ణయముచేసి మంత్రులంజూచి "రేఁపటిదినము పుష్యమీనక్ష త్రము; కావునఁ గమలాక్షుఁడగు రామునికి యువరాజ పట్టాభిషేకము రేఁపే జరిపింపవలయును." అనిచెప్ప, లోపలియింటికిఁ జొచ్చి, యప్పుడు రామునిఁ దోడ్కొనిరమ్మని సారథితోఁజెప్పెను. ఆ సారథి యానతిని శిరసావహించి, రామునిఁ బిలుచుకొనివచ్చుటకై రాముని నగరునకు వేగముగబోయెను.

అప్పుడు ద్వారపాలకులు లోపలికిఁజని, "మహారాజా! తమసుతుని దోడ్కొనిరమ్మని తమతండ్రిగారు చెప్పిపంపఁగా, సారథినచ్చి కాచి యున్నాఁడు." అని విన్నవించెను: రాముఁడు సారథి వచ్చియున్నాఁడని ద్వారపాలకునిమాట విన్నవాఁడై; "ఇప్పుడే నే నచ్చటినుండి వచ్చితిని. ఇంతలోనె నన్ను మఱలఁ బిలువనంపుటకుఁ గారణమేమి"యని సంశయ పడినవాఁడై, యతనిని లోపలికిరప్పించి "ఓసారథీ! నీవు మఱల వచ్చుట కేమి కారణము? విస్తరించి చెప్పు"మని యడిగెను. సూతుఁ

ప్రయత్నవార్త విని, సుమిత్రయు లక్ష్మణుండును ముందే సీతను బిలిచి కొనివచ్చిరి. అప్పుడు కౌసల్య తనకుమారునికి మఱుసటిదినంబునఁ బుష్యమీనక్షత్రమునాఁడు యువరాజ పట్టాభిషేకము జరుగఁగలదని యెఱిఁగి సదై, సుమిత్రయు, సీతాలక్ష్మణులును గొల్చుచుండఁ బ్రాణములను బిగఁబట్టి, యందఱి మనసులలోపల వెలుఁగుచున్న భగవంతుఁడగు నారాయణునిఁ గన్నులు మూసికొని ధ్యానించుచుండెను. అట్టి పరిశుద్ధురాలగు తల్లికడ కేతెంచి, రాముఁడు నమస్కరించి, యామె మనసునకు సంతసము వోచ్చునట్లు "అమ్మా! మాతండ్రిననున్నఁ బ్రజలఁ బాలించుటకు నియమించెను. రేపటి పుష్యమినాఁడు నాకు యువరాజపట్టాభిషేకము కాఁగలదు. ఈ రాత్రికి నేనును సీతయు నుపవాసము సలుప వలయునని వారు, ఋత్విజులు, నుపాధ్యాయులును జెప్పిరి. రేపటి పట్టాభిషేకమున కే దే యలంకారములు ముఖ్యములో, వాని నెల్ల నాకును సీతకును జేయింపవలయును" అని తన తల్లితోఁ జెప్పెను. కౌసల్య రాముని జూలయేండ్లుగాఁ గోరియున్న యీ కోరిక నేఁటి కీడేఱిన మాట విని, మిక్కిలి యుప్పొంగి, యానందముచేఁగలిగిన డగ్గుత్తికతోడ రాముని తోఁ నిట్లనెను.

"ఓ నాయనా! రాముఁడా! చిరంజీవివిగ నుండుము. నీ శత్రువులందఱు నశించిరి. నీవు యువరాజ పట్టంబుఁ బొంది రాజ్యలక్ష్మితోఁ గూడి, నాయొక్కయు సుమిత్రయొక్కయు బంధువులను సంతోషపఱుపుము. నీవు మంగళకరమగు పునర్వసూనక్షత్రమున జన్మించితివి. నీవు నీ గుణములచే నీ తండ్రిని సంతోషపఱచితివి. కమలములం బోలు కన్నులుగల నారాయణమూర్తిని గూర్చి నే ననేక వ్రతములు, నుప వాసములును సల్పితిని. అవియెల్ల నిప్పుడు సిద్ధించినవి. కావున నిక్ష్వాకు వంశమువారి రాజ్యలక్ష్మి నిన్నుఁజేరఁగలదు" అని కౌసల్య రామునితోఁ జెప్పెను. రాముఁడు తల్లిపలుకులు విని, చేతులుజోడించి, యడఁకువతోఁ గూర్చుండియున్న లక్ష్మణుఁగూర్చి, "లక్ష్మణా! నీవును నాతోడ నుండి యీ పుడమినెల్ల నేలుము. నీవు నాయొక్క వెలుపటి ప్రాణము వంటివాఁడవు. ని న్నీ రాజ్యలక్ష్మి పొంద నున్నది. ఓ సుమిత్రయొక్క పుత్రుఁడా! నీవును రాజ్యము నొంది, రాజ్యమును బాలించుచు,

నాతోడఁగూడి సకల సౌఖ్యములు ననుభవింపుము. నీ నిమిత్తమే నేను భూలోకమునఁ బ్రాణములను, రాజ్యమును గోరుచున్నాఁడ" నని చెప్పి, తల్లికడ నెలవుదీసికొని, సీతతను దనతల్లులయొద్ద విప్పించి, తన నగరునకుఁ బోయి చేరెను.

ల్-వ సర్గము.

వసిష్ఠుఁడు రాముని నగరునకు వెళ్ళి యుంపనాస ముండుమని చెప్పుట

పుడమిఱేఁడును మరుసటిదినంబున జగుగఁబోధ్య పట్టాభిషేకంబు విషయమయి రామునఁ డుండవలసిన తీరెల్లఁ జెప్పి యతనినిఁ బంపించి, వెంటనే తమపురోహితుఁడగు వసిష్ఠునిఁ బిలుప నంపించి, "మహాత్మునీ! తపోధనా! (తపస్సే ధనముగాఁగలవాఁడా!) తరుణు రాముని నగరున కేఁగి కలిమిని, కీర్తిని, రాజ్యమును బడయునిమిత్తమై రామునిచేతను సీతచేతను నుపవాసవ్రతమును చేయింపుఁడు" అని చెప్పెను.

వేదవేదాంగములను, మంత్రార్థములను దెలిసినవారిలోఁ నుత్తముఁడును, నియమముఁ దప్పనివాఁడును, త్రికాలజ్ఞానము గలవాఁడునైన వసిష్ఠమహాముని 'యట్లే' యని రాజుతోఁ జెప్పి, వేదమంత్రములందుఁ జెప్పిన తెఱఁగున రామునిచే నుపవాసము చేయించుటకై, గుఱ్ఱములు పూన్చినట్టియు బ్రహ్మాణు లెక్కఁదగినట్టియు రథమునఁ గూర్చుండి, శరదృతువునందలి మేఘమువలెఁ దెల్లని కాంతి గలిగియున్న రాముని నగరు సొచ్చి, రథమునుండిఁ గూర్చుండియే మూఁడు ప్రాకారములు దాఁటి, లోపలికిఁ జొచ్చెను. వచ్చిన వసిష్ఠుని జూచి, రాముఁడు తొందర పడుచు సంభ్రమముతో లేచి, మర్యాద సేయఁదగినవాఁడగు వసిష్ఠ మునిని బూజింపఁగలవాఁడై తన నగరునుండి వెడలి, మహామును కెదు రేఁగి, మునీంద్రుని రథముకడకు వచ్చి, తానే మహామును చేయి పట్టు కొని రథమునుండి దింపెను. పురోహితుఁడగు నా వసిష్ఠమునియు మేలు సమకూర్పఁదగినట్టి వినయసమ్రుఁడగు రాముతోఁ ముచ్చటలాడి, వేడుకపుట్టించి, సంతోషము నెసఁగఁజేయుచు నిట్లనియె.

"ఓ రామా! నీయెడ నీతండ్రి మిక్కిలి ప్రీతిగలిగి యున్నాఁడు. నీవు యువరాజపట్టము నొందఁగలవు. నీవు సీతతోఁగూడ నేటిరాత్రి కుపవాస ముండవలయును. తెల్లవాఱఁగనే నవరుషుండు యయాతికి

రాజ్యాభిషేకము చేసిన చందమున, నీ తండ్రియగు దశరథమహారాజు నీకును యువరాజపట్టాభిషేకము నేయుఁగలఁడు." అని వసిష్ఠమునీం ద్రుఁడు రామునితోఁ జెప్పి నియమనంతుఁడయిన రామునిచేతను, సీత చేతను నుపవాసవ్రతము యథావిధిగాఁ జేయించెను. పిమ్మట రాముఁడు గురుపగు వసిష్ఠమునిని భక్తితో శాస్త్రరీతిఁ దప్పక పూజింపఁగా సవ్యాసిష్ఠ మహాముని యా పూజలనెల్ల స్వీకరించి, యాతని వీడ్కొని, యా రాముని నగరునుండి పయన మొనరించెను. అచ్చటఁ దన మేలు గోరుచు నిష్టమునలే పలుకునట్టి స్నేహితులతోఁ గూర్చుండియున్న రాముఁడును, వారిని వీడ్కొని, వారిని తమతమనెలవులకుఁ బోవ నాజ్ఞ యొసఁగి, తాను లోపలికిఁ జనియెను. అప్పుడు సంతోషముచే నిండిన మనంబుగల స్త్రీపురుషులచే నిండిన యా రాముని నగరు మదించిన రామండలు మున్నగు నీటిపక్షులతోఁగూడి, పూఁచిన తామరపూవులచే వెలఁదులు చున్న కొలనిచందమునఁ బ్రకాశించుచుండెను. అంతట వసిష్ఠుఁడు రాజగృహమువలె వెలుఁగుచున్న యా రాముని నగరునుండి వెడలి, వెలుపలికి వచ్చి, జనులచేఁ గ్రిక్కిరిసియున్న మార్గమును జూచెను. అయోధ్యా పట్టణమునందలి వీథులన్నియు రాముని పట్టాభిషేక సంభ్రమముతో నొప్పు గుంపులు గుంపులుగఁ గూడిన జనులచేఁ గ్రిక్కిరిసి యుండినవి. జనుల గుంపు లనెడి యిలలయొక్క రొమ్ములయికవలనను, సంతోషమువలనను గలిగిన చప్పుడును గర్జించుండఁ నా యయోధ్యా పుర రాజమార్గము అలలతోడను బాన ధ్వనులతోడను గూడిన సము ద్రమో యనఁదగి యుండెను. అయోధ్యా పట్టణం బెల్ల ప్రదేశము లందును వీథులన్నియు సిద్ధపఱచి, యప్పుడే పూఁచిన పూలదండలచే నలంకరింపఁబడినవై, యింటింటను గట్టిన యుత్తియున ధ్వజములతోఁ గూడినవై వెలయుచుండెను. అయోధ్యాపురమునందలి జనులందఱును స్త్రీలతోడను, బాలురతోడను, వృద్ధులతోడను, గూడినవారయి సూర్యోదయము నెదురుచూచు చట్లు రాముని పట్టాభిషేకమున నెదురు చూచుచుండిరి. జనులకు సలంకారప్రమైనదియు, సంతోషప్రదమై నదియు నైన యా యయోధ్యాపురియందలి రాముని పట్టాభిషేక మహోత్సవమును జూడవలె నని జనులందఱు కోరిక గల్గియుండిరి.

మహామునియు నిట్లు జనులచేఁ గ్రిక్కిరిసియున్న రాజమార్గమునఁ బ్రవేశించి, జనుల గుంపులనెల్ల వరుసలు వరుసలుగ నిల్పువాఁడువోలెఁ గనఁబడుచు మెల్లగా రాజనగరు ప్రవేశించెను. అట్లు వసిష్ఠుఁడు రాచనగరు సొచ్చి, తెల్లని మేఘముతోఁగూడిన కొండకొనతో సమానముగ వెలుఁగుచున్న మేడ యెక్కి, బృహస్పతి దేవేంద్రునియొద్దకుఁ బోవునట్లు దశరథనృపాలునికడకుఁ బోయిచేరెను. దశరథుఁడును వసిష్ఠునిరాకం జూచి తా నాసనమునుండి లేచి, "తమరు పోయిన పని చేయించివచ్చితిరిగదా!" యని యడుగఁగా, మునీంద్రుఁడును "మహారాజా! రామునిచే నుపవాసము చేయించి వచ్చితిని" అని రాజునకుఁ దెలియఁబఱచెను. దశరథమహారాజు లేచినంతటనే యతనితోఁ గూర్చుండిన సభ్యులందఱు పురోహితులవారిం గారవించుటకై తమతమ యాసనములనుండి లేచిరి. దశరథనృపాలుఁడు వసిష్ఠుని వాక్యమును విని యతనికి మర్యాదలు సల్పి, యా మహామునివలన సెలవు గైకొని, జనసమూహమును దమ తమ స్థానములకుఁ బోవ సెలవొసఁగి, సింహాము కొండ గుహలోనికిఁ బోవునట్లు తాను అంతఃపురమునకుఁ బోయెను. చక్కఁగా నలంకరించుకొనిన జవరాండ్రతో నొప్పుచు, దేవేంద్రుని భవనమునుబోలి ప్రకాశించుచున్న యాయయంతిపురమును దశరథుఁడు నక్షత్రగుణములతో విరాజిల్లు నాకాశమును చంద్రునివలెఁ బ్రవేశించెను.

6-వ సర్గము.

రాముఁడుపవాసము గావించుట, పురజనులందఱు పట్టాభిషేకముఁజూడవచ్చుట

పురోహితుఁడు పయనమై పోయిన పదంపడి రాముఁడు స్నానము చేసి కదలని మనంబుగలవాఁడై, స్నాతయై పరిశుద్ధురాలయియున్న విశాలములయిన కన్నులుగల పత్నితోడంగూడి, శ్రీమన్నారాయణుని సన్నిధానమున కేఁగి, హవిర్గపాత్రమును శిరమున నిడికొని యథావిధిగ నమ్మహాదేవుని సమక్షమున జ్వలించుచున్న యగ్నిహోత్రమున హోమంబు సేసి, తనకు హోమశిష్టమగు నన్నమును భుజించి, ఇష్టార్థసిద్ధిని నారాయణమూర్తిని ధ్యానించుచుఁ జక్కఁగాఁ బఱపఁబడిన దర్భాసనమునఁ

గూర్చుండి మౌనముతోడ,జితేంద్రియుఁడై,సీతతోఁగూడ నాభగవంతుని దేవాలయమున శయనించెను. యొకజాము నట్లుశయనించి, ప్రొద్దుండఁగనే లేచి నగరున కింతయు నలంకారముసు బూర్తిగాఁ జేయించెను. అంతట రాముఁడు సూతవందిమాగధు లింపుగఁ బాడెడు మేలొకొలుపు, వంశావళులు, బిరుదులు మొదలగువానిని వినుచు నుదయకాలసంధ్యా వందనమాచరించి, నిశ్చలమనస్సుగలవాఁడై గాయత్రీజపమునుచేసి, మధుసూదనునికి సాష్టాంగముగాఁ బ్రణమిల్లి యాదేవదేవుని స్తోత్రములు చేసి, మఱలస్నానముచేసి తెల్లని పట్టుబట్టగట్టుకొని, బ్రాహ్మణులచేఁ బుణ్యాహవాచనము నేయించుకొనెను. అప్పుడా బ్రాహ్మణోత్తములచేఁ జేయఁబడు పుణ్యాహనాచనసుంత్రములఘోషము గంభీరమునసు మధురగమును నయిన మంగళవాద్యముల ధ్వనులతో మిళితములయి యయోధ్యాపురము నంతయు మాఱుమ్రోగునట్లు చేసెసు.

రాముఁడు సీతతోడ నుపవాసవ్రత మొసఁగి ముగించె సన్న వార్తను విని, యయోధ్యయందలి జనులందఱు మిక్కిలి సంతోషము నొందిరి. మఱి పురజనులందఱు నాఁడు రాసునిపట్టాభిషేకవార్తను విని, రాత్రిగడచి తూర్పు తెల్లవాఱుచుండఁ గనేకంగి, పట్టణమెల్ల నలంకరింపఁ దొడఁగిరి. వెండిగొండయొక్క కొనలవలె నెత్తయిన దేవాలయమూలందును, నాలుగుబాటలు గలియుచోటులందును, రాజవీథులందును, యజ్ఞశాలలందును, కోటబురుజులందును, సకలవిధములయిన విక్రయవస్తువులు నిండుగయున్న వర్తకుల యంగళ్లయందును, గృహస్థులయొక్క కాంతిమంతములైన సకల సంపదలతో నిండిన యిండ్లయందును, సభలయం దన్నిటియందును, అన్నివెసలకుఁ గనఁబడు రచ్చపట్టులచెట్లయందును, మిక్కిలి యెత్తయిన పెక్కెములును, పలువన్నెలుగల పెక్కెపు గుడ్డలును గట్టఁబడి విరాజిల్లుచుండినవి. మఱియుఁ బట్టణమునందు జనులంద అచ్చటచ్చట గుంపులుగూడి, యభినయము చేయువారియొక్క యభినయములను, నాట్యమాడువారియొక్క నాట్యంపునేర్పులను, పాటలు పాడువారి పాటలను, ప్రసన్నకథలు చెప్పులకును నింపయిన మాటలను వేడుకతో వినుచుండిరి. మఱియు రాముని పట్టాభిషేకవార్త వినరాఁగానే జనులందఱు ముంగిళ్లలోను,

ఇండ్లలోను రాముని పట్టాభిషేకమునకు సంబంధించిన మాటలనే మాట లాడుచుండిరి. అయోధ్యాపురమునందలి బాలురందఱు తమతము యిండ్ల వాకిళ్లయందుఁగూడి యాడుకొనుచు, "ఈదినమున రామునికిపట్టాభి షేకమహోత్సవము జరుగఁబోవుచున్నది. నేను మా తల్లిదండ్రులతోఁ గూడి వేడుకఁ జూడఁబోయెద" నని తమలోఁ దాము చెప్పుకొనుచుండిరి. రాముని పట్టాభిషేకమహోత్సవదినమునఁ బురజనులందఱు రాజవీథులందుఁ జక్కగా నీళ్లుచల్లి శుద్ధిచేసి, పూవులు వెదచల్లి, యగురు మొదలగు సుగంధద్రవ్యములతో ధూపములువేసి, గంధము చిలుక రించి, ప్రకాశింపఁజేసి రాత్రులందుఁ జీకటిలేక వెలుతురు బాగుగఁ దెలియుటకై యన్ని రాజవీథులయందంతటను వృక్షములనంటి దీపస్తం భములు నాటఁబడినవి.

ఆ పురముననుండు జనులందఱు పట్టణము నిత్తెఱఁగున నలంక రించి, రాముని యువరాజ పట్టాభిషేక మహోత్సవముఁ జూడఁగోరిన వారలై ముంగిళ్లయందును సభలందును గుంపులుగూడి పరస్పరము ముచ్చటించుకొనుచు దశరథనృపాలునిఁ గూర్చి యీ క్రిందివిధమునఁ గొనియాడిరి. "ఈ యిక్ష్వాకువంశమునకు సంతోషదాయకుఁడయిన మహోత్తుఁడగు దశరథమహారాజు తాను ముసలివాఁడనియు తనకు రాజ్య భారముమోయుట కష్టమనియు నెఱిఁగి రామునికిఁ బట్టాభిషేకము చేయఁ గోరెను. ఆహా! యేమి యీ దశరథుని బుద్ధికౌశలితనము! లోకమున నెచ్చుతెచ్చువ లెఱిగినవాఁ డయిన రాముని మనకు రక్షకునిగా దశ రథుఁ డేర్పఱిచుట మనపైఁ బరమేశ్వరునికిఁ గల యనుగ్రహాము పెల్లడి యయ్యెను. రాముఁడు నెమ్మదిగలవాఁడు. గర్వము లేనివాఁడు. సకల విషయముల నెఱింగిన పండితుఁడు. స్వధర్మములను దప్పనివాఁడు. ఇట్టి సకలగుణములతోఁ గూడిన రాముఁడు పక్షపాతము మాని తన తమ్ము లం దెంతప్రేముయో యంత ప్రేమ మనయందు నుంచినవాఁడు. ఇఁక దశరథనృపాలుఁడు విచారము మాని చిరకాలము జీవించునుగాక! ఆయన యనుగ్రహముచేత రామునికిఁ బట్టాభిషేకము జరుగఁగా మనము చూడఁ గలము." అని యిట్లు జనులు తమలోఁ దాము దశరథునిఁ గొనియాడు చుండిరి. ఇట్లు పురజను లంద ఱొండొరులు మాటాడికొనుచుండఁగా,

దేశములోని జనులును బట్టాభిషేకవార్తను విన్నవారలై, రాముని పట్టాభిషేకమహోత్సవము చూచుటకై దిక్కుదిక్కులనుండి వచ్చి, యయోధ్యాపురియం దిసుక చల్లినను రాలనట్లు గ్రిక్కిరిసి యుండిరి. అయోధ్యాపట్టణమున కట్లు నలుదెసలనుండి వచ్చెడు జనుల గుంపులు చేయు కలకలధ్వనులు పుస్సుము మొదలగు పర్వకాలములందుఁ బోలె క్కిన సముద్రమువలె వినఁబడుచుండెను. అప్పుడు రాముని పట్టాభిషేకమువలెక్క వేడుకను జూడఁగోరి దిక్కుదిక్కులనుండి వచ్చిన జనులు చేయు రొదలతో నిండినదై దేవేంద్రభవనమువంబోలిన యయోధ్యాపట్టణము సీటిజంతువులచేఁ గలఁత పెట్టఁబడుచున్న సముద్రజలము వలె వెలయుచుండెను.

7-వ సర్గము.

మంథర యయోధ్యాపట్టణవైభవమును చూచి, కైకేయికి దురోభోధనచేయుట

ఎచ్చటనోపుట్టి, కైకేయికిఁ బుట్టింటివారిచే నరణముగా నీయఁబడి యాఁమెతోడ వచ్చియున్న మంథరయను నొక దాసి మాత్రాత్రుగాఁ జంద్రునిఁబోలు మేడలెక్క, దుమ్ము రేఁగకుండుటకై నీళ్లు చల్లఁబడిన రాజవీథులు గలదియు, వీథులం దెల్లెడలను వెదచల్లబడిన పూవులరాసులు గలదియు నైన యయోధ్యాపురమును జూచెను. మఱియు నా యయోధ్యాపురమూ మంథర కంటఁబడినపుడు మేలయిన కెక్కెములతోడను, గుమ్మెతులుగల కెక్కెములతోడను నలంకరింపఁబడినదియు, స్వేచ్ఛగాఁ రాకపోకల కనుకూలములయిన చిన్న వీథులుగలదియు, మంగళస్నానము చేసియున్న జనులతోఁగూడినదియుఁ, బుష్పమాలలను, భక్ష్యములను జేతఁ దాల్చిన బ్రాహ్మణులయొక్క సంతోష సూచకములయిన ధ్వనులతోఁ గూడినదియు, సున్నపుఁ బూఁతలచేఁ దెల్లనైన దేవాలయముల ద్వార ములు గలదియు, సకలవిధములయిన వాద్యముల ధ్వనులతో నిండినదియుఁ, గడు వేడుకతోఁగూడి గగుర్పాటు చెందిన యెడళ్లుగల జనులచే నంతటఁ బఱివఁబడియుండినదియు, బ్రాహ్మణులయొక్క వేదఘోషములతో నంతట నిండినదియు, సుహృన్మనోహరంతములయిన యేనుఁగులు గుట్టులుఁ గలదియు, గొప్పలు కైలు వేఁయుచున్న యావులతోను, ఎద్దులతోను నిండినదియు, సంతోషముచేఁ గలిగిన రోమాంచము గలిగిన

వారగు పురజనులచే నెత్తఁబడియుండు ధ్వజములతోఁ గూడినదియున్నై
వెలయుచున్న పట్టణముయొక్క వైభవముఁజూచి, యెనుకవ యాశ్చర్య
మొందినదై, తెల్ల పట్టుచీరగట్టి, సంతసముచే బాగుగఁ గన్నులను విప్పా
కొని తనకు దాపున నిలఁబడియున్న దాదిని జూచి, "ఏమి యీ వేడుక?
రామునితల్లి యగు కౌసల్య యేదియో కోర్కి మనసునఁ దలఁచి యది
నెఱవేఱుటకై యెనుకవ యానందముతోఁ గూడి జనులను వి ఱ్ఱేషధసము
నొసఁగుచున్నదా? ఏమి యీ జనుల యెనుకవ సంబరమునకుఁ గార
ణము? లేక దశరథన్నృపాలుఁ డేమియైన నుత్సవమును జరిపింపఁ బోవు
చున్నాఁడా?" యని యడిగెను. దాది యన్నకో, దీనికపటంపుఁదలం పెఱుఁ
గక, కడుపు పగిలిపోవునంత యెనుకవ సంతసముతోఁ గూడినదై, యా
గూనిదగు మంథరకు రామునియొక్క యెనుకవ వైభవంబుఁ దెల్పుఁ
బూని, "మంథరా! రేపటిదినము తెల్ల వా అ.గనే దశరథమహారాజు
దోషరహితుఁడగు రామునికి యువరాజపట్టాభిషేకము చేయుచున్నాఁడు"
అని చెప్పెను. ఆ గూనిదగు మంథర దాదిచెప్పిన మాటవిని యీ మాట
కోర్వలేనిదై, కైలాస శిఖరముంబోలు మేడనుండి దిగి, పాపపుఁ బనుల
మీఁదనే తలంపుగలదై కోపముచేఁ గాల్పఁబడుచు, లోపలఁ బరుండి
యుండు కైకేయికడ కేతెంచి యిట్లని చెప్పఁదొడఁగెను. "ఓ తెలివి
మాలినదానా! లే లెమ్ము. ఏల పరుండియున్నావు? ఆపద నిన్నెదుర్కొని
వచ్చుచున్నది. దుఃఖముల గుంపనెడు సముద్రములో మునిఁగిపోవు
చున్న నిన్ను నీవు దెలిసికొనఁజాలకున్నావు. అదృష్టవంతురాలవుగఁ
గనఁబడునట్టి యదృష్టహీనురాలా! "నాయగఁడు నాయందెక్కువ ప్రేమ
గల్గియుండుననియు, నే నేది చెప్పినను జేయువాఁడనియు, నేను భాగ్య
వంతురాల ననియు నీ వెల్లప్పుడు డంబము లాడుచుందువు. నీ భాగ్య
మెల్లను, వేసవియందలినదీప్రవాహమువాఁడిఁ జంచలమైనది. అది
స్థిరముగాఁ నిలువదు" అని యిట్లు చెడుతలంపుగలదై పాపపుఁబనులనే
వెదకు గూనిదగు మంథర చెప్పినపలుకులు విని, కైకేయి యెనుకవ
చింతనొందినదై, "ఓమంథరా! నీమోముఁ జూడ నేదియో విచారము
నొందియున్నట్లు తెలియుచున్నది. అందఱికిఁ గుశలమే కదా" యని
యడిగెను.

ఆ మంథర కైకేయి యింపయిన పలుకులతో నడిగిన మాట విని, కోపముతోఁ గూడినదై, తాను మాటలలోఁ జమత్కారము గలదిగాన మఱితంత దుఃఖమును మోమునఁ గనఁబఱచుచు నా కైకేయిమేలు కోరినదై యా కేకేయికి న్యాసమును గల్పించుచు రామునిమీఁది ప్రేమను విఱిచివేయుచు నిట్లనియె. "ఓ కైకేయీ! యొన్నటికిఁ దీరని యొక చేటు నీకు వాటిల్లినది. దశరథనృపాలుఁడు రామునికిఁ బట్టాభిషేకమును రేపటిదినము జరిపింపఁ బోవుచున్నాఁడు. నేను మఱిలఁ బైకిఁ దలయెత్తుదు నన్న యాశలేక భయమున మునిఁగి, దుఃఖముతోను, విచారముతోను నిండినదాన నైతిని. మంటలోఁబడి యొడలు కాల్చుకొన్నదాననుబోలె నై నీమేలుగోరి యిక్కడి కతివేగముగ నేతెంచితిని. నీవు కష్టము ననుభవించుచుండఁగా, నాకు మఱితంత కష్టమేకదా కలుగును. నీ వైశ్వర్యము గలిగియున్నఁగదా నేను నైశ్వర్యవంతురాలనుగ నుందును. దీన నేను సంశయము లేదు. నీవు క్షత్రియకులమునఁ బుట్టితివి. పుడమిఱేనికి రాణివైతివి. రాజుల నడతలు భయంకరములని యేల తెలియఁజాలకున్నావు? నీభర్తయగు దశరథుఁడు ధర్మములు పలుకువాఁడేకాని, మోసగాఁడు. తియ్యనిమాటలు మాటాడువాఁడేకాని, క్రూరుఁడు. అతఁడు నీ యెడఁ జూపు మర్యాదలన్నియు వాస్తవములనియే నీవు బేలవై నమ్మియున్నావు. నీ భర్త నీకడకు వచ్చినప్పుడు మోహావేశముచే నీతో సమయానుసారములైన కొన్ని పనికిమాలిన యిచ్చకపుమాటలు చెప్పి నిన్ను మోసపుచ్చుచు నిప్పుడు ప్రయోజన మంతయుఁ గౌసల్య కిచ్చివేయమన్నాఁడు. చెడుతలంపు గలవాఁడగు దశరథుఁడు నీ కొమరుఁడగు భరతుని నీ పుట్టింటికిఁ బంపించి, యతఁడు లేనప్పుడు రామునికి శత్రువుల బాధలేని రాజ్యమునఁ బట్టాభిషేకము జరిగింపఁ బోవుచున్నాఁడు. రాఁబోవు చెఱుపును దెలియని యో మూఢురాలా! నీవు దశరథుని నీ ప్రియుఁడని తలఁచి నీతోడఁబైననే యుంచుకొనెదవు. అతఁడు పామువంటివాఁడు. పామును బోషించెడు నొకతె యా పామునెత్తి తనతోడమీఁదఁ బెట్టికొనునట్లు, నీవు నీ మగనిని విడువక తోడమీఁద నుంచుకొని యున్నావు. తోడమీఁద నుంచుకొన్నను పాము కఱవక విడుచునా? తన తోడమీఁద నిడుకొని

బుజ్జగింపఁబడుచున్న యీ పాము ద న్నెత్తుగొన్నదాని నెట్లు కఱచునో, అట్లే యీ దశరథుఁడు నీచేఁ బ్రేమతోఁ జూడఁబడుచున్నను, నీ కపకారంబు సేయనున్నాఁడు. శత్రువునుగాని, పామునుగానియుపేక్ష చేసినచో మనకు హానిగలుగును. ఇప్పుడు దశరథుఁడునిన్నును నీ పుత్రుని వంచించి రామునకుఁ బట్టాభిషేకము చేసి, నిన్ను, నీ కొమారుని నీ పరివారములతోఁగూడ సన్యాయముపాలుచేయనున్నాఁడు. ఓ కైకేయీ! యిప్పటి కింక నేమియు మించిపోలేదు. నీవు వేగిరమే నీకు మేలు గలుగఁ జేసికొనుము. ఆశ్చర్యపడినట్లు కానవచ్చుచున్నదానా! నిన్నును, నీ కొమరుని, నీ యాశ్రితురాలనగు ననున్ను గాపాడుము." అని మంథర చేసిన దురోద్బోధనెల్ల విని, కైకేయి చిఱునవ్వు మోమునగలదై, సంతోషముతోఁ బాన్పునుండి లేచి కూర్చుండి శరదృతువునందలి చంద్రరేఖనలె విరాజిల్లుచుఁ దన సంతోషమునకు సూచనగా నా గూనిమంథరకు మేలైన యొక భూషణము నొసఁగెను. అట్లు కైకేయి గూనిమంథర కొక్క భూషణ మొసఁగి, వెండియు దానితో నిట్లనియె. "ఓ మంథరా! నీవు నా కిప్పుడు ప్రియమైన వార్తను దెల్పితివి. ఇట్టి సంతోషవార్తను దెలిపిన నీ కింకను బ్రియమేమి చేసెదను. రాముఁడును, భరతుఁడును నా కొకటె. నాకుఁ బక్షపాతము లేదు. కావున రామునిపట్టాభిషేక వార్త విని మిక్కిలి సంతోషము నొందితిని. నీ విప్పుడు చెప్పిన యొక్కువ సంతసపు మాటకంటె నెక్కువ సంతసమొదవుమాట యేమి చెప్పెదవు? నీవు నా కిట్టి ప్రియవాక్యము చెప్పితివిగాన నీ కింకను నే నేమివరము నీయవలెనో చెప్పు"మని కైకేయి మంథర నడిగెను.

3-వ సర్గము.

కైకేయి మంథర దురోద్బోధలకు లోఁబడుట

మంథర కైకేయియొక్క తీరును జూచి, నిట్టూర్పు నిగిడించి, తన హిత వాక్యమును వినలేదన్న కోపమును, తన యజమానురాలికిఁ, గష్టములు రాఁబోవుచున్నవనెడు దుఃఖమును గలిగినదై కైకేయిం జూచి, "ఓసీ మూఢురాలా! దుఃఖమనెడు సముద్రమునొక్క సడుమనున్న నిన్ను నీవు తెలిసికొనక యున్నావు. ఓ దేవీ! విచారపడవలసిన విషయమున సంతసము నొందితివి. ఇంత గొప్ప యాపద వచ్చినపు

డేనింగు బగవసున్నావుగాని నేను మఱింత దుఃఖపడుచున్నాను. నీ తెల్విలేనితనమునకై నేను వగచుచున్నాను. తెల్విగలిగిన యొకతె యిట్టి యిడుము వచ్చినప్పుడు సంతోషమొందునా? సవతిబిడ్డనికిఁ గలిగిన మృత్యుదేనతరాకనంటి మేలును జూచి యెవతె నీ బోఁటిది సంతోషము ననుభవించును? భరతునినలన మాత్రమే రామునికి భయము గలదు. వేల యనిన? రామునితో సమానముగా రాజ్యమునొందుటకు భరతుఁడు తగినవాఁడు. ఎవఁ డొగ్గినిలన భయపడునో, యతనికి వాని వలన భయంబు ముఖ్యముగాఁ గల్గును. మనుష్యులం జూచి పాములు మొదలగునవి భయపడునుగాన, వానివలన మనుష్యులకు భయము విశేషముగఁగలుగును. కనుక భరతునివలన రామునికిఁ గలగిన భీతిం గూర్చి నేను మిక్కిలి విచారమునొందినదాన నైతిని. అంతియకాక, గొప్ప విలుకాఁడగు లక్ష్మణుఁడు సర్వవిధములచేతను రాము ననుసరించి యుండును. లక్ష్మణుఁడు రాము ననుసరించి యుండునట్లు శత్రుఘ్నుఁడును భరతు ననుసరించి యుండును. పుట్టిన వరుసప్రకారము చూచినను, రాజ్యము భరతునికేకాని చిన్నవారయిన లక్ష్మణ శత్రుఘ్నులకు దొరకఁజాలదు. అన్ని శాస్త్రములను జదివిన పండితుఁడును, రాజనీతుల నెల్లఁ జక్కఁగాఁ బరిశీలించినవాఁడును, సమయమునకుఁ దగిన పని చేయు వాఁడు నైన రామునినలన నీ కుమారుఁడగు భరతునకు గొప్ప యాపద వచ్చు నని తలఁచినపుడెల్ల నా మనస్సు తల్లడిల్లుచున్నది. నీ సవతియగు కౌసల్య యదృష్టసంతురాలుగదా! రేపటి పుష్యమీ నక్షత్రమునాఁడు బ్రాహ్మణోత్తము లందఱు చేరి యా కౌసల్యకుమారుఁడయిన రామునికి గౌరవింపఁదగిన పట్టాభిషేకము జరుపఁబోవుచున్నారు. అట్లు తన కొడు కగు రామునికిఁ బట్టాభిషేకంబు సేయుటచే నెక్కుడయిన సంతమునుఁ బొంది, లోకమందుఁ బ్రసిద్ధిఁ గాంచి, సవతులు మొదలగు శత్రువుల నెల్ల నడంచి, వెలయుచున్న కౌసల్యకు నీవు చేతులు జోడించికొని పనికత్తెవలె నామె చెప్పిన పనుల నెల్లఁ జేయుచుండవలసినది. నీవు కౌసల్యకు మాతోఁగూడఁ బరిచారిక వగుచువేని, భరతుఁడును రామునికి బంటగును. అప్పుడు రాముని యంతఃపురస్త్రీలు సకలసంపదలు గలవారు గనుక మహాసంతోషముతో నుందురు. నీకొడం డ్రన్నచో,

భరతుని లేమిడిదళనుబట్టి సంతసము మాని విచారగ్రస్తలై యుందురు" అని మంథర కైకేయితోఁ జెప్పెను.

అట్లు మహాప్రేమతోఁ దియ్యని మాటలు పలుకుచున్న మంథరం జూచి, "రాముఁడు పట్టాభిషేకమునకుఁ దగిన యన్ని గుణములు గలఁ వాఁడే కదా! అతనికిఁ బట్టాభిషేకము జరుపుట కాక్షేప మేమి ? రాముఁడు ధర్మముల నన్నిటిని నెఱిఁగినవాఁడు. గురున్నలవద్ద విద్యలు నేర్చికొని యింద్రియముల నడఁగించినవాఁడు. చేసినమేలు మఱువని వాఁడు. సత్యము పలుకువాఁడు. పరిశుద్ధుఁడు. రాముఁ డిట్టి సుగుణ గణంబులు గలిగియుండుటయే కాక, రాజునకుఁ బెద్దనుమూరుఁడు. కావున నతఁడు యువరాజపట్టము నొందుట కర్హుఁడు. ఆతఁడు పట్టాభిషిక్తుఁడయి, దీర్ఘాయువు గలిగి తన తమ్ములను, పనివారినిఁ దండ్రివలెనే కాపాడఁ గలఁడు. ఓ గూనిదానా! రాముని పట్టాభిషేకవార్తను విని యేల యిట్లు తల్లడిల్లుచున్నావు. నరశ్రేష్ఠుఁడగు భరతుఁడును, రామునికి నూఱేం డ్లయినపిదప వంశ పారంపర్యముగా వచ్చు రాజ్యమును బాలింపఁబోవుచున్నాఁడు. ఓ మంథరా! యిప్పుడు రాముని పట్టాభిషేక రూపంబయిన శుభంబు జరుగుచుండఁగా, భరతుని పట్టాభిషేక రూపం బగు మంగళ మిఁకమీఁద జరుగఁ బోవుచుండఁగా, నీ వేల యిట్లు కుందు చున్నావు. అంతియకాక, నాకు భరతుఁ డెట్టులో యట్టులు రాముఁడు మర్యాద సేయఁదగినవాఁడు. ఆ రాముఁడును దన సొంతతల్లియగు కౌసల్యకంటె న న్నెక్కువగా గారవించి నాకు శుశ్రూషలు సల్పు చుండును. రామునకు రాజ్యము వచ్చినను భరతునికిని వచ్చినట్లే. రాముఁడు త న్నెట్లు చూచుకొనునో యట్లే తన తమ్ములను జూచు కొనుచు భేదము లేక యుండును గాన వారిలో నెవరికి రాజ్యము వచ్చిన నా కొక్కటియ" యని కైకేయి మంథరతోఁ జెప్పెను.

ఇట్లు కైకేయి చెప్పఁగా విని మంథర మిగుల వగచి వేఁడినిట్టూర్పు పుచ్చి కైకేయిం జూచి యిట్లనియె: "ఓ కైకేయీ! మంచిచెడ్డ లెఱుగనిదానవై, నీకు రాఁబోవు వ్యసనము నెఱుఁగకున్నావు. భరతునకు రాజ్యము లేకపోవుట, రామునికిఁ బట్టముగట్టుట యను రెండుదుఃఖము లతోఁ గూడిన కౌసల్యదాసివై యుండుట యను సముద్రమున మునుఁగు

చున్న నిన్ను నీవు దెలియఁజాలకున్నావు. 'రాముఁడు పెద్దవాఁడు గాన నిప్పుడు పెద్దవానికిఁ బట్టాభిషేకము జగుగును. వానికిఁ బిదప భరతునికిఁ బట్టాభిషేకము జరుగఁగలదు' అని చెప్పితివి. ఓసీ వెఱ్ఱిదానా! అట్టి వాడుక యొక్కఁడనైనఁగలదా? రాముఁ డిప్పుడు రాజు కాఁగలఁడు. వానికిఁ బిదప వాని కొమఁడు రా జగునుగాని, భరతుఁడు రాజు గానేరఁడు. కావున, కైకేయీ! భరతుఁడు రాజవంశమునుండి తొలఁగింపఁబడును. పిదప నాతనియొక్క పేరుగాని యూరుగాని యుండదు. ఓ భామినీ! (కోపముగలదానా!) ఒకరాజున కెందఱు కొడుకులు పుట్టిదురో, వారికందఱికిని రాజ్యంబు రానేరదు. అట్లందఱు రాజ్యము నందు రాజులుగాఁ జేయఁబడిరేని, యట్టి రాజ్యమునందుఁ గడు గొప్ప యన్యాయములు జరుగును. ఒచ్చెములులేని యంగములుగలదానా! కాఁబట్టి పుడమిదొలికలు తమ చిన్నకుమారులు పెద్దవానికంటె గుణవంతులుగ నున్నను, పెద్దవానికే రాచకార్యముల నప్పగింతురు. ఓ కైకేయీ! నీవు బిడ్డలపైఁ బ్రేమగలదానవు. అయినను నీ పుత్రుని స్థితినిగూర్చి యాలోచింపుము. రాముఁడు రా జగునేని, నీ కొడుకగు భరతుఁ డధికారము లేమిచేత ననాథునివలె సకల సుఖములు లేనివాఁడగును. రాజవంశమున నితని పే రే లెక్కకు రాకపోవును.

కావున నేను మేడపైకెక్కి రాముని పట్టాభిషేక మహోత్సవ ప్రయత్నమెల్లఁ జూచి, యయ్యో! మనకైకేయిదశ హీనమాయెఁ గదా యని యెంచి, యతిత్వరగ దిగివచ్చి నీకు మేలు గోరి యింత పూర్వము చెప్పితిని. నీకు నే నెంత మంచిమాట చెప్పినను, నామాట నెఱుఁగకున్నావు. అటు గానిచో సవతికి మేలు గలుగుచుండఁగా, నీవు నా కీ హారమును బహుమతి యియ్యవచ్చితివే! ఏ వెఱ్ఱులైన నిట్లు చేయుదురఁటవే! నీ కెక్కువ యదృష్టము పట్టువలెను. అప్పుడు నీ వేది యిచ్చినను నేను దీసికొనవచ్చును. నీదశ తగ్గుస్థితికి వచ్చుచుండఁగా, నీ వీ భూషణమిచ్చుట యేల? నీ వట్లొసఁగినను నేను దీనిని గైకొందునే? నా కిది యక్కఱలేదు. నీవు బాగున్నఁ జాలును. రాముఁడు శత్రురహితమయిన రాజ్యమునకు వచ్చునేని, భరతుని దేశాంతరమునైనను, కాదేని, లోకాంతరమునైనను (పరలోకమునైనను) బొందిం

చును. ఈ సంగతి నిజము. భరతుఁడు పసివాఁడుగ నుండునప్పుడే, వానిని మేనమామ యింటికిఁ బంపితివి. కదలక మెదలక యొక్కచోటనే యుండు స్థావరములందుఁగూడ దాపున నుండుట వలనఁ బ్రేమ గలుగుచున్నది. అట్లుండఁగా, భరతుఁడు తండ్రికడనే యుండి యతఁడు చెప్పిన పనీ చేయుచుండినపక్షమున, భరతునిపైఁ బ్రేమగలిగి, భరతునికే దశరథుఁడు రాజ్యం బిచ్చియుండునుగదా! అది నీవే పోఁగొట్టుకొంటివి. శత్రుఘ్నుఁడును భరతుని యధీనతలోనుండువాఁడు గాన, రాముని లక్ష్మణుఁడు వెంబడించునట్లు భరతుని వెంబడించిపోయెను. శత్రుఘ్నుఁడున్నను, రామునిఁ బట్టాభిషిక్తుఁజేయ నాటంకపఱచి, భరతుని విషయమై కొంత ప్రేరణసేసియుండును. లక్ష్మణుఁడు రాముని ననుసరించియున్నవాఁడు గావున నాతనికి రాముని పట్టాభిషేకంబు సమ్మతమే యయియున్నది. ఇదియొల్ల భరతుఁడు దగ్గఱ లేని దోషముగాని మఱొక్కటిగాదు. తొల్లి యడవిలోఁ గట్టెలు నఱుకువా రొక చెట్టును నఱుకఁగా, దాపుననున్న ముండ్లదుబ్బలా చెట్టును జెలిమిచే నఱుకనీయక, దానికిఁ గలిగిన భయంబును బోఁగొట్టినవని నీవు వినలేదా? అట్లే భరతుఁడు తండ్రిదాపుననే యున్న పక్షమున భరతునిపైఁ బ్రేమయుంచి, రాజ్యంబు భరతుని కిచ్చి యుండును. లక్ష్మణుఁడు రామునికిఁ గాఁపుదల. వా రన్నదమ్ము లిరువు రశ్వినీదేవతల చందమున మిక్కిలి యొద్దికగలిగియుండు రని లోకప్రసిద్ధి కావున లక్ష్మణుని విషయమున రాముఁ డెట్టిహానియుఁ దలపఁడు. భరతునికిఁ గీడు తలఁచు నను విషయమునఁ గొంచెమైనను సందియము లేదు. కావున నోకైకేయీ! నీ కొడుకు మేనమామ యింటినుండి యీ మార్గముననే యడవికిఁ జనుటమేలు. ఇదియే నీకును మిక్కిలి మేలయినది యని నాకుఁ దోఁచుచున్నది. రాముని పట్టాభిషేకమునకుఁ బిదప భరతుఁడిక్కడికి వచ్చునేని, రాముఁడు వానిని దఱుమును, లేనిచోఁ బ్రాణమును దీయును. దానిచే నీ కేకపుత్రశోకము వాటిల్లును. కావున భరతుఁ డచ్చటినుండియే యడవికిఁబోయిన నూఁపిరితోనుండి నీకుఁ గొడుకుగా నుండును. నీకును బుత్రశోకంబు గలుగదు. భరతుఁడు న్యాయ్యముగాఁ దన తండ్రిదయిన రాజ్యమును, బొందునేని, నీ బంధు

పులకందటికి మేలు గలుగును. కైకేయీ! "వీల రామునిదు తమ్ముడయిన భరతునిమాత్రము చంపును, లక్ష్మణుని నేమియుఁ జేయక ప్రేమతోఁ జూచుచుండఁగా, నితనిని మాత్ర మట్లు చూడఁడా?" యని యందు వేమో? ఓ కైకేయీ! సుఖము లనుభవింపఁదగిన మన పిల్లవాఁడు (భరతుఁడు) రామునికి సహజశత్రువు. "అయిననేమి? భరతుఁడు లక్ష్మణునివలెనే యన్న ననుసరించియుండిన, రాముఁడు లక్ష్మణునివలె భరతునిఁగూడఁ ప్రేమతోఁ జూడఁడా?" యని యందువేమో కైకేయీ! లోకమున సొమ్ము పోఁగొట్టుకొన్నవాఁడు తన సొమ్ములాగుకొన్న వాని వశమున నుండ మన సొప్పునా? కావున భరతుఁడేదియో యొక్క మాట యననలసిగమనంసును. బానిచే రాముఁడు కనలి భరతునిఁ దన యగ్రహమునకుఁ బాత్రునిఁగాఁ జేయును. కావున నడవియం దొక సింహముచే వెంబడించి తరుమఁబడిన యేనుఁగులమేటి గుంపును గాపాడెడి యేనుఁగునువలె రాముచే నాక్రమింపఁ బడఁబోవు నీకొడు కగు భరతుని గాపాడుకొనుమని మనోహర మగు రీతి "నా భర్త నాపై మిక్కిలి యనురాగము గలిగియున్నాఁడఁగదా. ఇంక నాకేమి కొదవ యున్న?" దని గర్వించి, రాముని తల్లియు, నీ సవతియునగు కౌసల్యను నిరాకరించి మాటాడితివి. ఇప్పు డామెయొద్దను రాజై సయెడల నామె తన పగను దీర్చుకొనకయుండునా! ఓ భామినీ! అనేకములయిన గసుల తోడ వెలయుచున్న యీ భూమండలమును రాముఁడు పరిపాలింప నారంభించినంతటనే, నీవును దీనురాలవై, చెలిమిని, అపమానమును బొందుదువు. భరతునకును లేని యాపదను, ఓటమిని గలిగింతువు. రామునకు భూపాలనము వచ్చునేని, భరతునిమాట నీవు మఱచిపోవ వలసినదే. కావున భరతునికి రాజ్యము వచ్చువిధమును, ఎమటివాఁడడవికిఁబోవు నుపాయమును నాలోచింపుము" అని మంథర కైకేయికిఁ బలుమాఱు దురోద్బోధనఁ జేసెను.

పదునొకండవ సర్గము.

మంథర కైకేయికి మునుపటిప్రసంగముల జ్ఞాపకపఱచుట.

ఇట్లు మంథర చేసిన దురోద్బోధలచేఁ జనించినదై, కైకేయి కోపముచే ముందుచున్న మోమొగలదై, వేఁడి నిట్టూర్పులు నిగిడించి, యా మంథరతో నిట్లనియె.

ఓమంథరా! యిప్పుడే రాముని వేగిరముగ వనంబున కేఁగించె దను. భరతునకు నిప్పుడే పట్టాభిషేకము జరిపించెదను. ఓ మంథరా! మే యుపాయముపన్నిన భరతునకుఁ బట్టాభిషేకము జరుగునను? రామున కది యెవ్విధమున జరుగకయుండును? అట్టి యుపాయము బాగుగా నాలోచించి చెప్పు"మని మంథరను కైకేయి యడిగెను. పాపపుఁ బనులు నేయునట్టి యా మంథర రాముని కార్యనాశను జెఱుపఁ గోరి నవ్వై కైకేయితో నిట్లనెను. "ఓ కైకేయీ! యాసక! యిదిగో చెప్పెదను! ఇదొకగొప్ప శ్రమనూ! నేఁ జెప్పుమాటను వినుము. నామాట ప్రకారము నడచుకొందువేని, భరతుఁడీ రాజ్యము సంతసముఁ బొందును. ఓకైకేయీ! నీకు జ్ఞప్తిలేదా? నీను జ్ఞప్తియుండియు, దానిని నీవు మఱుఁగుపఱచెదవా? లేక నేను జెప్పెడి మాటను విన వలయునని కోరెదవా? ఓ సొగసులాడీ! అట్లు నేను జెప్పఁగా వినవలె నని నీకుఁగోరిక గలదేని, చెప్పుదను వినుము. అట్లు వినినను, నీవు 'ఇది తగునా తగదా' యని యాలోచింపుము." అని మంథర చెప్పఁగా, కైకేయి బాగుగాఁ బఱిచిన పాన్పువిూఁదనుండి దొంచెము లేచి కూర్చుండి, "యో మంథరా! రాముఁడు రాజ్యము నొందకుండుటకును, భరతునకు రాజ్యమును వచ్చుటకును నే యుపాయంబు చేయవలెను? అట్టియుపాయమును నాకుఁ జెప్పుము" అని యడిగఁగా, గూనిదగు మంథర క్రూరపుఁ బనులందుఁ దలంపుగలది యగుటంజేసి రాముని పట్టాభిషేక కార్యమును జెఱుపఁగోరి కైకేయితో నిట్లనియె.

"కైకేయీ! తొల్లి యొకప్పుడు నీ ప్రియుఁడగు దేవాసురసంగ్రామమున దేవేంద్రునికి సాయము సేయఁగోరి నిన్నుఁ గూడఁ దీసికొని, రాజర్షులతోడఁ గూడి దక్షిణదిక్కున దండకారణ్యములందు మత్స్యధ్వజుం డేలునట్టి వైజయంత మనెడిపురంబున కేఁగెనుగదా! అచ్చట శంబరుఁడని ప్రసిద్ధిఁ గాంచిన యొక గొప్ప యసురుఁడు మూఁఅులకొఁదిమాయలు గలవాఁడని ప్రసిద్ధికెక్కియుండెను. అతఁడు దేవాసురులచే జయింపఁబడనివాఁడై యింద్రునితో సమరంబు సేయఁబూనెను. ఆ గొప్ప యుద్ధమున గాయములు దగిలి క్రిందఁబడి, రాత్రులందు నిద్రించుచున్న దేవతల సేనల నెల్ల రాక్షసులు వేగముగ వచ్చి

యందఱిని జంపుచుండిరి. అప్పుడు దీర్ఘబాహువులుగల నీ మగఁడు తాను బాణములచేఁ దూట్లు చేయఁబడియున్నను, ఆ యసురులతో గొప్ప పోరు చేసెను. ఆ పోరునందు రాక్షసులు బాగుగా శస్త్రము లతోఁ గొట్టుటచే నీ మగఁడు మూర్ఛిల్లెను. అప్పుడు స్మృతిదప్పి పడి యున్న నీ మగనిని నీవు యుద్ధరంగమునుండి యావలికిఁ గొనిపోయి, శీతలోపచారములు చేసి, శత్రువులబాధనుండి తప్పించి కాపాడితివి. అప్పుడు రాజు మఱిలఁ గొంతసేపటికిఁ దెప్పిఱిల్లి సంతసించి, యో శుభ దర్శనా! రెండువరములను నీకొసంగెను గదా? అప్పుడు నీవేమి బదులు చెప్పితివో జ్ఞాపక మున్నదా? అప్పుడు నీవు "నాథా! నే నెప్పు డీ రెండువరములఁ గోరుదునో, యప్పుడవు నా కిమ్మని చెప్పితివిగదా. ఆ మాటల కా మహారాజు సమ్మతించెనుగదా. నా కీ సంగతి యెట్లు తెలియును? నీవే కదా నాతో నీ సంగతిఁ దెల్పితివి. నీపైఁ బ్రేమచే నే నింక నాకథను మఱచిపోక జ్ఞాపకం దుంచియున్నాను. ఇప్పుడు దశరథుని రాముని యభిషేక ప్రయత్నమునుండి నిలిపి, యా రెండు వరముల నిప్పు డడుగుము. వానిలో నొక్కటి భరతునికిఁ బట్టము గట్టుట, రెండవది రాముని బదునాలుగేం డ్లడవికిఁ బంపుట. ఈ రెండు వరములఁ గోరుము. ఈ రెండువరముల నతఁడు తప్పక నీ కొసఁగును. రాముఁడు పదునాలుగేండ్లు వనవాసంబుసేసి మఱలివచ్చినను, నీ కుమా రుం డింతలోపల జనుల యనురాగమునకుఁ దగివాఁడై, శత్రువులచేఁ గదలింప నలవిగానివాఁ డగును.

ఓ యశ్వపతి కూఁతురా! కోపగృహమునకుఁ బోయి, సొమ్ముల నెల్లఁ దీసిపాఱవైచి, చింపిపేలిక యొకటిఁజుట్టుకొని, కటికినేలపైఁగోపగిం చినదానివలెఁ బరుండియుండుము. నీభర్త యచ్చటికి వచ్చునేని, యతనిని తలయెత్తిచూడకుము. అతనిని మాటాడింపకుము. మఱియుఁ జింతతోఁ గూడి యాతనినిఁ జూచి దొడ్డి కన్నీరు విడుచుచుఁ దలవంచి నేలపైఁ బరుండియుండుము. నీవు నీ మగనికి నెల్లప్పుడు ముద్దులుగుల్కు కాంతవు. నీ నిమిత్తమై యతఁ డగ్నియంతైనను జొరఁబడును. ఈ విష యము నేను దృఢముగాఁ జెప్పుగలను. ఆ దశరథుఁడు నీపుఁ గోపము పుట్టింపఁజాలఁడు. నీవు కోపగించుకొన్నయెడలఁ గోపముతోనున్న

నిన్నుఁ జూడనైనను జూడఁ జాలఁడు. నీకుఁ బ్రియముఁ గాంచుటకై యన్నమహారాజు తన ప్రాణములనైనను విడుచుననోపును. ఆ పుడమినేలేఁడు నీ మాటను దాఁటిపోఁజాలఁడు. తిన్ననిస్వభావమునుగలదానా! నీకుఁగల సౌభాగ్యబలమును (=తాను చెప్పిన చొప్పున మగఁడు నడచుకొనుట యనెడి బలమును) దెలిసికొనుము. నీవు కోపముతోఁ గోపగృహమునం దుండునప్పుడు నిన్ను బుజ్జగించుటకై మణులను, ముత్యాలను, బంగారమును, నవవిధ రత్నములను, నీకీనచ్చును. వానియం దెల్ల మన సుంపకుము. నీకు నీపతి మున్ను దేవాసుర యుద్ధమున నొసఁగిన రెండువరంబుల నిప్పు డిమ్మని యడుగుము. నీ మహాభాగ్యమంతయు రాలా! ఆ సంగతి మఱచిపోకుము. ఎప్పుడు దశరథుండు రామునిఁ బిలిచి కూర్చుండఁబెట్టికొని వరము లిచ్చెద నని చెప్పునో, నీవు నీ మగని నొత్తియొత్తి యడిగి, యిచ్చెడి నన్నమాట గట్టిచేసికొని, రామునిఁ బదునాలుగేండ్లకుఁ బిదప వచ్చినను, జను లతనియందుఁ బ్రేమగలిగియుండఁ జాలరు. నీ పుత్రుఁడగు భరతుఁడు శత్రుల నందఱిని రూపుమాపి, రాజు కాఁగలఁడు. రాముఁడు పదునాలుగేం డ్లరణ్యవాసము నేసి మరలి వచ్చునంతలో భరతుఁడు నాఁటుకొని వేళ్ళుపాఱి, తఱ్ఱ-న యేండ్లు స్థిరముగానుండును.

ఓ దేవీ! రెండవ వరమును రామునిఁ బదునాలుగేం డ్లడవికిఁ బంపునట్లు కోరుము. అట్లయినచో నీ పుత్రుని కార్యము లన్నింయు నెఱవేఱఁగలవు. ఇట్లు వనవాసమునకుఁ బంపఁబడిన రాముఁడు పదునాలుగేండ్లకుఁ బిదప వచ్చినను, జను లతనియందుఁ ప్రేమగలిగియుండఁ జాలరు. నీ పుత్రుఁడగు భరతుఁడు శత్రుల నందఱిని రూపుమాపి, రాజు కాఁగలఁడు. రాముఁడు వనవాసము పూర్తిగావించి వచ్చునంత లోపల భరతుఁడు బాగుగవేళ్ళూనిన చెట్టువలెఁగుదుటఁబడిసమాఁడయి, సేనల నెల్ల సేకరించుకొని, తనమేలు గోరు చెలికాండ్రతోఁ గూడి, ధైర్యము గలవాఁడయి యుండును. రాముఁడు వనవాసమునుండి మఱలివచ్చినను, సహాయసంపద లేమిచే భరతుని నేమింపుఁ జేయుఁ జాలఁడు. కావున ఓ కైకేయీ! యిపుడు నీవు మహారాజును బట్టాభిషేకప్రయత్నము చేయనీక నిలుపుటయే తగునని" యని చెప్పెను.

కైకేయి తాను స్వాభావికముగా మంచి తలంపు గలదైనను, ఆ గూనిదాసియొక్క మాటల కొక్కసమయచ్చుకవొంది, బెదరి దారితప్పి పోయిన పెనుదగుట్టుప్రుం బిల్లకలె జొద్దుదారిలోం బ్రవేశించినదై, సంత సముతోను, భ్రుకుటితోను గూడి యామెయంతరంగమున సిట్లనియె. "ఓ గూని దానా! నీ వింతమంచి యుక్తులం జెప్పుచాన వనియుం, బూజ్యకాల వనియు నే నింతదనుక నెఱుంగ నైతిని. లోకమునం గూనివాండ్ర కొక్కసమయాలోచనశక్తిగలదండ్రు. నీవు వారినందఱిని మించిన దాన వుగా నున్నావు. ఆహా! నీ విప్పు డెంత మంచి యాలోచన చెప్పితివి! నీ వొక్కతెవె యిల్లపుపని నా పసులందు శ్రద్ధగలిగి, నామేలు గోరు చుందువు. ఓ గూనిచానా! నీ విపుడు విప్పి చెప్పినంతనటకును రాజు గారి తలం పట్టి చని నే నెఱుంగలే నైతిని.

లోకంబున నెందఱో గూనివాండ్రున్నారు. వార లెచ్చు తక్కువయయిన యంగములు గలవారైలై మహా భయంకరులుగా నుందురు. నీ వలవటి గూనివాండ్రకలెగాక, వాపునుపుచేం గదలింపం బడిన కపుడమునకలె ముందునకు నంగి నుండుటకుం జూడదగియుందువు. నీ మొమ్ము మిక్కిలి సట్టుగలిగినదై మూపురమటకు నెత్తైయున్నది. నీ బొజ్జయుం జక్కని బొడ్డుగలదై, "నాత్రోగూడనుండు మొమ్మంత పొడవుగలిగి యమరినదిగదా. నే నంత పొడవుగల్గి యుండుటకు వీలు లేకపోయెంగదా" యని సిగ్గుపడి క్రిందికిం బోయి నన్నగించి యున్నది. స్తనములు బలిసి యనున్నవి. మంథరా! నీ మోము నిర్మలమైన పున్నమ చందురునిబోలి వెలుంగుచున్నది. నీ మొల గల్లుగల్లుమని స్త్రోగెడి గజ్జెల యొడ్డాణమునచే విలసిల్లుచున్నది. నీ పిక్కలు మిక్కిలి సొంపుగా నున్నవి. నీపాదములు రెండును మిక్కిలి పొడవుగా నున్నవి. నీవు వెడల్పయిన తొడలతోగూడి తెల్లని పట్టుచీరగట్టి నాకు ముందటం బోవుచుండంగా, నాడుహాయించవలె నొప్పియుందువు. అసురులకెల్ల జేడగు శంబరాసురునికడ నుండిన వేయితంత్రములు నీకడ నున్నవి. అవి మాత్రమేకాక యింక నెన్నియో తంత్రములు వేలకొలందిగా నీకడ నున్నవి. రథములోని యొక యంగపుగు ముక్కువలె నుండెడి యీనీగూనునందు నీకుంగల బుద్ధులు, తంత్రియ విద్యలు, తంత్రములు

నున్నవి. ఓ గూనిదానా! భరతునికిఁ బట్టాభిషేకంబయ్యి, రాముఁడు వనంబునకుఁ బోయినపక్షమున నిగూఢమున నీ బంగారుహారము నించెదను. మంథరా! నాకార్యము నెఱవేఱ నాకు సంతసము గలుగునేని, నేను నీ గూనును జక్కఁగాఁ బుటము వేయఁబడిన మంచి బంగారునీరు పూయించెదను. నీ మోమునందు స్వల్ప మయమయిన యందమగు బొట్టు పెట్టించెదను. ఓ గూనిదానా! నీకు మేలయిన యాభరణముల నొసఁగెదను. నీవు నే నొసఁగు చీరఁగట్టి కించుకముఁ దొడిగి వఁటవేసి కొని యప్సరసవలె వెలుఁగుచుఁ దిరుగుచుందువు. నీవు చంద్రుని జగడమునకుఁ బిల్చుమోమునే వెలుఁగుచు శత్రువులనెల్లరఁ జూచి గర్వించుచు మేలయిన నడకతో నడచిపోవుచుందువు. ఓ గూనిదానా! నీ వెట్లు నిరంతరము నా పాదములఁ గొల్చుచుందువో, అట్లు సకల భూషణములఁదాల్చిన పలువురు గూనివాండ్రు నీకాళ్లకు మ్రొక్కుచుఁ దిరుగుచుందురు." అని చెప్పి కైకేయి మంథరను బొగడను.

ఇట్లు మంథర కైకేయిచేఁ గొనియాడఁబడుచుఁ దెల్లనైన పాన్పునందుఁ బరుండి, వెదికయందలి యగ్నిజ్వాలవలె వెలుఁగుచున్న కైకేయిని జూచి "ఓ యందకత్తెయగుదానా! నీ రంతయుఁ బాఱిపోయిన పిదపఁ జెఱువునకుఁ గట్టగట్టుటచే నుపయోగము లేదు. రాముని పట్టాభిషేకంబయిన పిదప రాజును నీవు వరంబు లడిగినను నేమియును నుపయోగంబు లేదుగదా. లెమ్ము. కోపగృహాంబునకుఁ బోయి, నేఁ జెప్పినతీరుగా వేసముఁ దాల్చి, రాజుగారి రాక నెదురు చూచుచుండుము" అని చెప్పెను.

అట్లు మంథర చెప్పిన మాట విని కైకేయి పాన్పునుండి లేచి, మంథరతోఁ గూడఁ గోపగృహము చేరి, తా నట్లు చెప్పినను దన మగండు వినఁగలఁడని గర్వించినదై, తాను బాల్చియుండిన లక్షవరహాలు వెలగల ముత్యాలహారములను, మేలయిన యుత్తమభూషణంబులను దేహము నుండి యులిచి, తాను బంగారువంటి ఛాయగలదైనను, గూనిదాని యొక్క మాటలకు లోఁబడినదై నేలఁబరుండి మంథరతో సిట్టనియె.

"ఓ గూనిదానా! నీవు నే నిచట మృతినొందితినని మాతండ్రి యగు కేకయరాజునకుఁ దెలుపుదువు. అట్లు కాదేని, రాముఁడడవికిఁ

బోగా భరతుండను భూమిసైనను బొందగలడు. ఈ రెంటిలో నేది యైన నొక్కటి జగుబు నిజము. నాకు రాజు బంగారుభూషణము లొసగినను, రాకిని యొక్క టి లేదు. రత్నము లిచ్చినను నేను గైకొ నను. సకల భూషణము లొసగినను నేను గోరను. రామునికే పట్టాభి షేకంబు జరిగినేని, యీ ప్రాణములు పదలుటయే నిజము."

అంతట గూనిదియగు మంథర న్యాయాలుసదేవియు, భరతునితల్లియు నైన కైకేయిగూర్చి యూపెకు మేలుగూర్చినట్లును, రాముని విషయ మునఁ గీడు గలుగునట్లును నెక్కు-వ పరాక్రమముతోడఁ గూడిన పలు కులతో నిట్లనియె.

"ఓ కల్యాణీ! రాముఁడే మిగుల రాజ్యమును బొందెనేని, నీవు నీ కొమరునితోఁగూడఁ గీడుచెందుట నిజము, కావున నీ కొమరుఁడగు భరతునకుఁ బట్టాభిషేకమగు ప్రయత్నము చేయుము" అని యీ ప్రకా రంబుగ గూనిదగు మంథరచే మాటిమాటికిఁ బ్రయోగింపఁబడిన మాటలనెడు బాణములచే బాగుగఁ గొట్టఁబడి, మిక్కిలి నొచ్చినదై, యొమ్మునఁ జేతు లప్పళించుకొని, మాటిమాటికి నాగ్రహముఁ దెచ్చు కొనుచు గూనిదానిఁ గొనియాడి, దానింగూర్చి, "యోగూనిదానా! నేను గోపగృహంబునుండి యమునిపురికేఁగితి వని నీవేకేకయమహా రాజున కఱకేంగింపవలయును. కాదేని, రాముఁడు బహుకాల మడవిలో నుండునట్లు తటస్థుఁడై యడవి కేఁగఁగా, భరతుఁడు క్రోధముతో నిండిన వాఁడై పట్టాభిషిక్తుండు గావలయును. ఈ రెంటిలో నొక్కటి కావలసి నదేకాని, నేను పటుపులను గోరను. పూలచండలను గోరను. గంధము పూసికొనను. కాటుక దిద్దను. నీరు ద్రావను. ఆహారము గుడువను. వేదియుఁ గోరను. వేయిమాటలేల? రాజు రాముని నయోధ్యనుండి యడవికిఁ బంపఁడేని, నేను ప్రాణములనే కోరను." అని యిట్లాధంబున మిగులఁ గఠినమైన మాటలు నేర్పు, సకలాభరణములను దసివైచి, స్వర్ణమునుండి క్రిందఁబడిన కిన్నరాంగనవలె నేలమీఁదఁ బరుండెను. అట్లు కోపాతిశయముచే గలిగిన యజ్ఞానముతోఁ గూడినదై, యిట్లు సకల భూషణములను, బుష్పమాలికలను దీసివైచి నేలమీఁదఁ బరుండి

యున్న యా నృపాలుని చేసి, నక్షత్రము లస్తమించిన పిదప జీకటిచే గ్రమ్మబడిన యాకాశమువాడి వెలుంగకుండెను.

10 - వ స ర్గ ము.

దశరథుడు కైకేయి యంతఃపురమునకు బోవుట

సమర్థురాలయిన కైకేయి, మిక్కిలి చెడుతలంపుగలదైన మంథర యొక్క చెడుబోధనలచే జెడుదారి కీడ్వబడినదై, నిషమురూపిన బాణముచే గొట్టబడిన కిన్నర కాంతవలె నేలపైబడండి, మిక్కిలి కోపము గలదై, మంథర మాటకు బేలుపోయి, యది తనకు ముందు చెప్పిన చొప్పెల్ల ముహూర్తకాల మాలోచించి, సంతసమునం దప్పినదై, మంథరను జూచి, "యో మంథరా! నీవు చెప్పిన యాలోచన యుల్ల బాగుగనున్నది. నే నట్లు చేసెదను" అని మంథరతోం బెప్పి, తనకు మేలు గావించు పద్ధతింగూర్చి ముహూర్తకాల మాలోచించెను.

కైకేయివిషయమున మంచి మనస్సుగలదియు, నాయనకు లాభము గలుగవలెనని కోరుచుండునదియునైన యా మంథర కైకేయిం బాగుగా నిర్ణయించి చెప్పినమాటలనుటని, తా నింతనుకాఁ జెప్పిన హితాంశముల నా కైకేయి పినినందుచేతఁ గార్యము సిద్ధించినట్లే తలంచి యెక్కువ సంతోషము నొందిన దాయెను.

అంతట నా దశరథుని దేవేరియగు కైకేయి కోపముతో మందిర మనంబునం దలపోసి, కనుబొమ్మలు ముడివెట్టి, తాను వేసికొనియున్న సొమ్ములను హారముల నొలిచి, మైలబట్టంగట్టి, యెంటిజడను వెంటి చుట్టినట్లు చుట్టి, సిద్ధివురాలై క్రందంబడిన కిన్నర కామినివలెఁ గోపగృహంబునం బడియుండెను. అప్పుడు కైకేయిచే నొలువంబడి నేలమీఁద నుంచఁబడిన చిత్రములయిన హారములనును, మేలయిన భూషణంబులును నక్షత్రము లాకసమును వెలుంగఁజేసు నట్లు భూమిని వెలిఁగించినవి.

మిక్కిలి యెక్కువ కీర్తి గలవాఁడగు దశరథుఁడు రాముని పట్టాభిషేకముంగూర్చిన యేర్పాటు గావించునట్లు మంత్రుల కానతిచ్చి, సభ్యులనందఱి నడిగి సెలవుగైకొని తన నగరి సొచ్చి, తాను భరతేంద్రియుఁ డయ్యున్నను, కైకేయిం దలఁచికొని, యీ దినమునసే రాముని

పట్టాభిషేకదినమని యందఱు తలఁచిరిగాని, దాసు డైన కేయితోఁ జెప్పలేదు గదా యని తలఁచి, ప్రియముఁ జేయుటకుఁ దగిన యా కైకేయితో నీ ప్రియవాక్యమునుఁ దెలుపఁగోరినవాఁడై, తెల్లని పుబ్బలుగలిగి, రావి వృతోఁగూడియున్న యాకసమును జంద్రుఁడు ప్రవేశించుమాడ్కి దశరథుఁడు కైకేయిఁయున్న కోపగృహమును బ్రవేశించెను. చిలుకలయు, నెమళులయు, సంచలనముఁ, గోకిలలయుఁ గూఁతలతోను, వాద్యధ్వనులతోను నిండినదియు, గూనివాండ్రతోను పొట్టివాండ్రతోను గూడినదియు, తిగెల యించ్లతోను, సంపంగులచేతను నశోకములచేతను నందనముగనున్న చిత్రములయిన యించ్లతోను, దంతమూ, వెండి, బంగారు నను మీనితో నిర్మింపఁబడిన తిన్నెలతోను గూడినదిగాను, నిరంతరము పుష్పనులు పంచ్లఁ గలచెట్లతోను, నడబావులతోను, దంతములు వెండి బంగారునను మీనితోఁజేసిన గొప్పయాసనములతోను శోభిల్లు చుండునదియు, నానావిధనులగు భక్ష్యములతోఁ గూడిన యన్నపానములతో నిండినదియునూ, సకల భూషణములను దాల్చియున్న సుందరాంగనలతోఁ గూడినదియునై స్వర్గలోకము మాడ్కిఁ దేజరిల్లుచున్న తన ప్రియురాలగు కైకేయియొక్క యుత్తమగుణ శోభనగృహముఁజేరి, సెజ్జపై నా కైకేయిం జూడఁడయ్యె. ఆ దశరథనృపాలుఁడు మన్మథ బాణనుల పోటులకుఁ దాళఁజాలక, రతి సలుపఁ గోరి వచ్చియుఁ బడక పింటియం దా కైకేయిం గానక, "కైకేయీ! యెక్కడనున్నా" వని పిలిచియు, బదులు రాఁజేఁ గడు వ్యసనము నొందెను. ఇంతకు మున్నెపు డామె మహారాజుగారు వచ్చెడి యా వేళ కింటనుండక పోయినది లేదు; రాజుగారును కైకేయిలేని యంతఃపురము నొకప్పుడు ప్రవేశించినది లేదు.

ఆంతట దశరథనృపాలుఁడు "కైకేయి ముందువలేఁ గాక యిట్లు తెల్విమాలినదై, తనకార్యమును సాధింపఁగోరియున్న" దని తెలియని వాఁడై, యంతిపురము ద్వారముకడకు వచ్చి, ద్వారపాలికనుం జూచి, "కైకేయి యెక్కడ" నని యడిగెను. ఆ ద్వారపాలకురాలును మిక్కిలి భీతినిబొంది, చేతులు జోడించి, "ప్రభూ! దేవేరి మిక్కిలి కోపముతోఁ గూడి, క్రోధగృహంబుఁ జేరియున్న" దని విన్నవించెను. కైకేయి కనఁబడ

నందుఁ గైక విచారపడుచున్న దశరథన్యాయాలుఁడు దా్వదశసాలకు రాలి మాట విని మఱింత యొక్కువయిన వ్యసనమును బొంది, మిక్కిలి కలవర పడిన యింద్రియములు గలవాఁడయ్యెను. అట్లు పుడమిఁ తోఁడు వ్యసన పడి కోపగృహమునకుఁ జని యచ్చట నేలపైఁ బరుండియున్నదియు, నట్లు నేలపైఁ బరుండుటకు దగనిదియు నైన కైక కేయింజూచి మిక్కిలి నొచ్చిన వాఁడయ్యెను.

ముసలివాఁడగు దశరథుఁడు దాను గపటంపుం దలఁపు లేనివాఁడై, యట్లు చెడుతలంపుతో భూమిమీఁదఁ బరుండి, క్రుంచిపేయఁగాఁ బడి వాడియున్న తీఁగెపూఁడ్కి శాపాదులనలనఁబుడమిసిఁ బడిన దేవకాంగన వలె యక్షలోకమునుండి క్రోయఁబడిన కిన్నరాంగనవలెను, స్వర్గలోకము నుండి భ్రష్టరాలయిన యప్సరసవలెను, క్రిందికిఁ బడఁద్రోయఁబడిన మాయాదేవివలెను, కట్టివేయఁబడిన యూఁదు లేడివలెను, వేఁట కాసిచే విషమువూసిన బాణముతోఁ గొట్టఁబడిన యూఁడేనుఁగు చందమునను బడియున్న తన ప్రాణములకంటె నెక్కువయిన తన ప్రియపత్నియగు కైకేయిని జూచి మోహాముచే మదించిన యూఁడేనుఁగు మదపుటేనుఁగు వలె దాఁకి, తన చేతులతో బాగుగ నొడ లంతయుఁ దడవి మనస్సునం దెక్కువ సంతాపమునొంది కమలలోచనయగు కైకేయింతో నిట్లనియె.

"ఓ మంచిమనస్సుగలదానా! నీ కిపుడు కోపము వచ్చుట కేమి కారణము? ఎవఁడు నిన్నుఁ దిట్టెను? ఎవఁడు ని న్నవమానపఱిచెను? నేను నీయెడ మంచి మనస్సు గలవాఁడనై నీకోర్కి లీడేర్చుచుండఁగా, నీవేల దయ్యమువట్టినదానివలె నా మనమున కెక్కువ చింతను బుట్టించు చున్నావు? నా కడ నెందఱో ఋనులగు వైద్యులు సకల సౌఖ్యములం బొందుచున్నారు. నీ వ్యాధి యేదియో చెప్పుము. వారు నిన్ను స్వస్థ పఱుపఁగలరు. నీ వెవరికైనఁ బ్రియకార్యము చేయఁ దలఁచితివా? లేక యెవఁడైన నీ కప్రియము చేసెనా? ఎవని కిప్పుడు ప్రియమును జేయ వలెను. ఎవని కిప్పుడు కీడు గల్గింపవలయును? దేవీ! నీ వేడువకుము. శరీరశోషణమును జేసికొనకుము. దండింపఁదగనివాని నెవనిని బధింప వలయును? వధింపఁదగినవాని నెవనిని విడిచిపెట్టవలయును? ఏ దరిద్రుని ధనికునిఁ జేయవలయును? ఏ ధనవంతుని ధనమును లాగికొని దరిద్రునిఁ

జేయవలయును! నీ వెవనిని జంపుమనిన, వాడు నిర్దోషియైనను, వానిని సంహారించెదను. నీ వెవనిని విడువుమన్న, వాఁడపరాధియైనను, వానిని విడుదల చేసెదను. నీవు ఏ దరిద్రునికి ధనమిమ్మనినను నిచ్చి, వానిని భాగ్యవంతునిఁ జేసెదను. నీవే ధనవంతుని దరిద్రునిఁ జేయుమన్న నా ధనవంతుని ధనంబంతయు లాగుకొని దరిద్రుని జేసెదను. ఓ కైకేయీ! నేనును, నావారందఱు నీకు లోఁబడి నీవు చెప్పిన చొప్పున వినువారము. నేను నీ రవంత కోరికనైనను దీర్పకుండ నుండఁజాలను. నీవు దేనిని గోరుదువో, దానిని నా ప్రాణమును విడిచియైనను సాధించి యిచ్చెదను. నాకు నీయెడఁగల ప్రేమను దలఁచి, నీవు సంశయింపక నీ కోర్కిని దెల్పుము. నేను జేసిన పుణ్యములనైన నొట్టుపెట్టికొని చెప్పెదను. నేను నీ యిష్టము నెఱవేర్చెదను.

ఓ కైకేయీ! యీ సూర్యమండల మేది మొద లెంతవఱకుఁగల పుడమియెల్ల నాది. సకల సంప దలచె నిండిన తూర్పు దేశములును, సింధు సౌవీర సౌరాష్ట్ర దేశములును, దక్షిణదిశయందుండు దేశములును, అంగ వంగ మగధ మత్స్య కాశి కోసలదేశములును నావి. అచ్చట విస్తారముగనుండు ధనధాన్యరాసులును, గొట్టెలయు, మేఁకలయు మందలును నావి. వీనిలో నేమి గోరుదువో యదియెల్లఁ దప్పక యొసఁగెదను. ఓభీరూ! యేల యిట్టు నేల మీఁదఁ బరుండి దేహము నొప్పింతువు? ఓ సుందరీ! లే లెమ్ము. కైకేయీ! నీకేల యింతభయము గలిగినదో చెప్పుము. సూర్యుఁడు మంచును బోకార్చునట్లు, నీకుఁ గలిగిన భయమును నేను బాపెదను." అని దశరథుఁడు కైకేయిని బలుతెఱఁగుల నూఱడించెను.

అట్లు కైకేయి తన భర్తచేఁ బలుతెఱంగుల నూఱడింపఁబడినదై, తన భర్తకు మఱింత వ్యసనము గల్గించుటకై తన మనస్సున నున్న కోర్కిని దెలుపుటకుఁ బూనెను.

11-వ సర్గము.

కైకేయి రెండువరంబు లడుగుట

దుస్థుని బాణములు నాటుటచే నా మన్మథుని బారింబడియున్న పుడమిఱేనిం గూర్చి కైకేయి యతి క్రూరములయిన మాటలతో "ఓ

నాథా! నా కెవ్వాడు నపకారము నేయలేదు. న న్నెవ్వాడును నవ మానింపను లేదు. నా కొక కోరికయున్నది. అది తమరు చేయగలరని కోరుచున్నాను. మీరు నాకోరికను నెఱవేర్తు రని ప్రమాణము చేసిత రేని, నేను నా మనోరథము దెలిపెదను" అని చెప్పెను.

కామకుడును, విశేషకాంతిగలవాడును సగు దశరథుడు చిఱునవ్వు నవ్వినవాడై, చిఱునవ్వు నవ్వుచుండు నా కైకేయిని దల వెండ్రుకలు చేతితో దువ్వుచు నిట్లనియె. గర్వితురాలా! నీకంటె బ్రియురాలు మఱొక్కతె లేదనియు, బుద్ధిశ్రేష్ఠుడయిన రాముడు తక్కప్రియుడు మఱొక్కడు లేడనియు నీకుఁ దెలియుదువు? జితేంద్రియుడు నలవికానివాడును, రఘువంశస్థులలోఁ ముఖ్యుడును, గొప్ప బుద్ధిశాలియు, దీర్ఘాయువు గలవాడునైన రాముడు సాక్షిగా శపథమును చేసెదను. నీ కోరికయెట్టిదో చెప్పుము. ఏ రాముసిఁ జూడక క్షణకాలమైనను జీవింపనో, యా రాముడు సాక్షిగా నీ సూటయినర్చెద నని ప్రతిజ్ఞ చేసెదను. నన్నుఁగాని, భరతుఁడను మొనలుగాఁ గల కుమారులను గాని, ఇతరబంధుప్రులనుగాని నడలిపట్టి ప్రేమను నెవ్వానిని ప్రేమించుచున్నానో యట్టి రాముడు సాక్షిగా నీ కభీష్టము చెల్లించెదను. ఓ మంగళకరురాలా! నీవు దేనిని గోరెదవో చేయుదు నని నా ప్రాణములకంటె మిన్నయైన రాముడు సాక్షిగాఁ జేసెద నని ప్రతిజ్ఞచేయునంత నీ మోహముగల నా మనస్సును గనిపెట్టి యయినను, నీ కోరికను దెలిపి నన్నుఁ గడతేర్చుము. నే నిప్పుడు చేసిన శపథంబు బాగుగఁ బరికించి, నీవు దేనిని గోరుచున్నావో దానిని జెప్పుము. నాయొక్క బలిమిని గుర్తెఱుఁగు చానవే కాన్పున, నీ కార్యంబు చేయఁగలనో, లేనో యని సంశయింపక చెప్పుము. నే నొనర్చిన పుణ్యకార్యముల సాక్షిగాఁ జెప్పెదను. తప్పక నీ కోరిక నెఱవేర్చెదను" అని దశరథనృపాలుఁడు కైకేయిని బతిమాలుకొనెను.

కైకేయి యా మాటలచే సంతసించినదై, తాను దలఁచిన యభిప్రాయము నంగీకరించిన దశరథునిఁ గూర్చి రాము సడవికిఁ బంపుట, భరతునికిఁ బట్టాభిషేకం బొనర్చుట యను మంథర యుపదేశించిన యా రెంటియందే మనసుంచి యున్నదగుటచే, భరతుని యందల

పక్షపాతమువలనను, దశరథుఁడు తన కనుకూలుఁ డయ్యెనను సంతోషమువలనను జెప్పుటకు నోరురానిమాట చెప్ప నారంభించెను:

"ఓ నృపాలా! నీవు నిన్ను, నీపుత్రులను, సాక్ష్యముగాఁ శపథంబు సేసితివి. అట్లు నీవు చేసిన ప్రతిజ్ఞను నగ్నిహోత్రుఁడు మొదలగు ముప్పదిమూఁడుకోట్ల దేవతలును వినుచుగాక! సూర్యచంద్రులును, నాకసంబును, ననగ్రహంబులును, రేలుం బగళ్లును, దిక్కులును, లోకమును, భూమియు, గంధర్వులును, రాక్షసులును, రాత్రులందుఁ దిరుగుచుండు భూతములు, మఱియును నచ్చటచ్చటనుండు భూతములెల్లఁ దమప్రతిజ్ఞను విసుచుండునుగాక. చేసిన ప్రతిజ్ఞను తప్పనివాఁడును, ఎక్కుసు ప్రతాపముగలవాఁడును, ధర్మములనెల్ల నెఱింగినవాఁడును, మిక్కిలి జాగ్రత్తగలవాఁడునైన దశరథనృపాలుఁడు నాకు వరముల నొసంగుచున్నాఁడు. దేవత లందఱు సాక్షులుగా నుందురుగాక!" యని చెప్పి, పైకేమి గొప్ప నిలుగాఁడైన దశరథనృపాలుని చేఁబట్టుకొని, తన ప్రాణ మొప్పునట్లు చేసి, ముఖస్తుతులచే సుబ్బించి, కామాతురుఁడై యేది యడిగినను నిచ్చుటకు సిద్ధుఁడై యున్న దశరథునిఁ గూర్చి యిట్లనియెఁ.

"మహారాజా! మున్నొకప్పుడు దేవాసురులకు నఱిచిన యుద్ధమున నేమి జరిగినదో జ్ఞప్తికిఁ దెచ్చుకొనుము. ఆ యుద్ధమున శత్రువు తమ ప్రాణములఁ దక్కఁ దక్కినది యెల్లను బడఁద్రోసెనుగదా! అప్పుడొకనాఁటిరేయి యుద్ధము నడుమ నా శంబరాసురుఁడు దమరిని మూర్ఛనొందించెను గదా! అప్పుడు నేను తనురి నావలికిఁ దెచ్చి, శీతలోపచారములుచేసి దమ్ముఁ గాపాడితిని. అప్పుడు తాము తెప్పిలిల్లి, తెప్పిఁదెచ్చుకొని నాయొక్క యాపదకోలునకు మెచ్చి నాకు రెండువరములు గొసంగితిరి. మహారాజా! నే నప్పుడా వరములను రెంటిని నడిగినప్పుడిమ్మని తమరితోఁ జెప్పి యొప్పించితిని. నాథా! అప్పుడు తమకడఁ దాఁచిపెట్టిన యా రెండువరములనే నే నిప్పుడిమ్మని యడుగుచున్నాను. సత్యమయిన ప్రతిజ్ఞగల యో మహీపాలా! యిచ్చెదనని మొదటఁ బ్రతిజ్ఞ సేసి, న్యాయముగా నా వరంబులను దమ రిప్పింపరేని, తమరు చేసిన యనమానంబునకై నా ప్రాణముల నిక్కడనే వదలిపెట్టుదును.

ఇది నిజము. నమ్ముఁడు" అని కైకేయి తన భర్తను నిగ్భంధించెను. బోయవాఁడు వలపన్ని, గానముచేయుచుండఁగా నా పాటయొక్క యింపునకు లోఁబడి జింక వలలోఁ దగులుకొన్న చందమున, దశరథుఁడు కైకేయి తన్ను మున్నడిగిన వరముల నడిగినప్పు డిచ్చెదనని ప్రతిజ్ఞచేసి యున్నందునఁ దనమాటచేఁ దన చెలిమిపునకై తానే ధర్మపాశంబునకుఁ గట్టువడెను. అప్పుడు కైకేయి మహీపాలునిం జూచి, "మహారాజా! తఱు రే వరముల నొసఁగితిరో, యావరముల నిప్పుడే కోరెదను. నామాట వినుఁడు.

మహారాజా! ఆ వరంబులలో నొక్కటి యేది యనిన; 'ఇప్పుడు రాముని పట్టాభిషేకమునకై తాము చేసిన ప్రయత్నముతో నాపుత్రుఁడగు భరతునకుఁ బట్టాభిషేకంబు సేయింపనలయు.' ఇదిగో నేను గోరు మొదటివరము.

నాథా! మునుపు దేవాసురయుద్ధమున సంతోషపూర్వకముగాఁ దా మొసఁగిన రెండవవరంబున కిప్పుడు సమయమువచ్చినది. అది యేది యనిన;

'రాముఁడు నారబట్టలను గట్టుకొని, కృష్ణాజినము గప్పికొని, జడలుదాల్చి, మునివేషము ధరించి,పదునాలుగేండ్లు దండకారణ్యమునఁ ద్రిమ్మరుచుండును గాక.' ఇది రెండవవరము.

నాథా! భరతుఁడు నిష్కంటకమైన యీయుపరాజపట్టాభిషేకము నిప్పుడే పొందునుగాక! ఇప్పుడే రాముఁడు నడవికిఁ బోవునప్పుడు నేను జూడఁగోరెదను. మహారాజా! నే నిప్పుడు గ్రొత్తవరముల నడుగలేదు. తఱుచు మున్ను ప్రేమతోఁ దాముగా నొసంగిన వరములనే యిప్పు డడిగితిని.

మహారాజా! చెప్పినప్రతిజ్ఞ నెఱవేర్చి సత్యసంధులరని పేరు వడసిన రాజాధిరాజుల రగుఁడు. తఱుచు పుట్టినది యిక్ష్వాకువంశము. ఇక్ష్వాకువంశస్థుల పేరు చెప్పుపకుఁడు. ఇన్ని యేండ్లు గంభీరస్వభావంబు గలవారని ప్రసిద్ధిఁజెంది యిప్పు డా నడతను బోఁగొట్టుకొనకుఁడు. తమ రే వంశమునఁ బుట్టితిరో, యది జ్ఞప్తికిఁ దెచ్చికొనుఁడు. మానవులకు సత్యముఁ దప్పకుండుటయే యిహలోక సౌఖ్యమునకు సాధకమనియు,

నట్టి సత్యసంధులు పరలోకమున నుత్తమగతి నొందుదు రనియు మునీం
ద్రులు పలుకుదురు. కావున మహారాజా! యీడినమాట తప్పకుఁడని
కైకేయి దశరథన్నపాలుని మాఱుమాట పలుకకుండునట్లు చేసెను.

12-వ సర్గము.

దశరథుఁడు కైకేయివరంబులఁ దలఁచి చింతించుట

అంతట దశరథమహారాజు కైకేయియొక్క వెఱపుఁ బుట్టించునట్టి మాటలను విని, విచారమునొంది క్షణకాలము మూర్ఛిల్లి మఱలఁ దెప్పి లేచి "ఏమి యిదియొక కలయా? లేక మనోభ్రమయా? లేక, జన్మాంతర వాసనయా? లేక, మనోవికారమా" యని చింతించుచు నప్పుడు సుఖముఁ దప్పియుండెను. దశరథుఁడు కైకేయియొక్క పలుకు లనెడు బాణములచే నాఁటఁబడి, నైమి మఱచి, చాల సేపటికిఁ దెప్పిలేచి, పెంటి పులింజూచిన జింకవలె మనమునందలి దుఃఖముచేఁ జేతులుకాళ్లు విలవిల దన్నుకొను చుండెను. అట్లు దశరథన్నపాలుఁడును నేలపైఁ గూలఁబడి, నిట్టూర్పు లను విడుచుచు, మంత్రములచేఁ గట్టఁబడి వలయమునందు నిలిచి బుస కొట్టుచున్న విషసర్పమువలెఁ గొంతతడ వేమియుఁ దోచక చింతించు చుండెను. పిమ్మట నరాధిపుఁడు రోషముతోఁ గూడినవాఁడై, "యీవా! యిది యేమి యన్యాయము. ఛీ! ఛీ!" యని చెప్పి, గుబులుగుబులుమని పెల్లగించుకొని వచ్చుచున్న దుఃఖమువలన స్మృతి దప్పినవాఁడై, మూర్ఛనొందెను. పిమ్మటఁ జాలసేపటికి మఱలఁ దెప్పిలేచి, స్మృతిని బొంది, కడు దుఃఖమునొంది, కోప దృష్టిచేఁ గైకేయిని గాల్చు వానిచందమునఁ జూచుచు నా కైకేయితో నిట్లనియె.

"ఓసీ గొంతుకోఁయుదానా! ఓసీ చెఱుపుసడతగలదానా! ఓసీ మా వంశమును జెఱుపుదానా! పాపాత్మురాలా! నీకు రాముఁ డేమి యప కారముఁ జేసెను? నేనేమి యపకారముఁజేసితిని? రాముఁడు నిన్నుఁదల్లితో సమానురాలినిగాఁ దలఁచి, నీయెడ మిక్కిలి గౌరవము చూపుచున్నాఁడు గదా? అట్టి రాముని కే యేల యింత యపకారము నీవు నేయఁదలఁచితివి? దీనికేమి కారణము? నీ వోర్వరానివిషము గ్రక్కెడి యాఁడుపాము వంటిదానవు. అది తెలియక నీవు రాజపుత్రివనియెంచి నిన్ను నా రాచ నగరుల్లోఁ బ్రవేశపెట్టితిని. అట్లప్పుడు తెలియక చేయుటచేత నాకుం

జేటు నేనే తెచ్చుకొంటిని. జనులందఱు రామునిఁ గుణవంతుఁడని యాతని గుణంబులఁ బొగడుచుందురు. అట్టి ప్రియసుతుఁడగు రామునిపైనే నేమి తప్పుపెట్టి యతనిని విడిచిపెట్టుదును. కౌసల్యనైనను విడుతును; సుమిత్రనైనను విడుతును; రాజ్యలక్ష్మినైనను విడుతును. తుదకును నా ప్రాణములనైనను వదలుదును గాని, తల్లిసంప్రలయంబుఁ బ్రేమతోఁ బదుచుకొనుచుండు రాముని నేను విడువనే విడువఁజాలను. నా పెద్దకొడుకగు రామునిఁ జూచినంతట నా కెక్కువ ప్రేమగలుగుచున్నది. ఆ రామునిఁ జూడకుండిన నాకుఁ బ్రాణమే పోవును. జగత్తు సూర్యునిచే లేకయైనను నుండవచ్చును. పైరులు నీరులేకయైనఁ బెరుగవచ్చును. కాని రామునిఁ బాసి, నా దేహమునఁ బ్రాణము లుండవోవను. ఓసీ, చెడుతలంపుగల దానా! యీ తలంపువలదు. విడిచిపెట్టుము. నీ పాదములనైనను నా నెత్తినిఁ బెట్టుకొందును, నాపైఁ గరుణించి యీవరమునుఁ బూనుము. ఓసీ కటికిదానా! ఏమని యింత భయంకరమైన కోరికను గోరితివి? లేక, భరతునిపై నాకుఁ బ్రేమయున్నదో లేదోయని తెలియుగోరితివా? అట్లు భరతునిపైఁగల యిష్టాసిష్టములనే తెలియఁగోరిన దానవే యగుదువు గాక! తొల్లి రామునివిషయమునై నాతో 'నీ పెద్దకుమారుఁడు సౌందర్యవంతుఁడనియు, ధర్మజ్ఞులలో నెల్లఁ బెద్దవాఁడనియుఁ బలుమారులు నీవు చెప్పియుంటివే. ఆ మాటలెల్ల నేను నీయందుఁ బ్రేమగల్గినయుండఁగలె ననికాని, నా మనస్సును సంతోషపఱిచుటకుఁ గాని, రామునిచే శుశ్రూషలు సేయించుకొనుటకుఁగాని చెప్పితివి కాఁబోలును. నీవు మనఃపూర్తిగా నా మాటలు పలికినదానవు గావు. ఆ రాముని పట్టాభిషేకవార్తను విని, దుఃఖపీడితరాలవై, నన్నిట్లు మిక్కిలి బాధించుచున్నావు. నీ వెవరి దురూహలకు లోఁబడి యీ శూన్యమగు కోపగృహమున కేతెంచితివి? ఓ కైకేయీ! నీవు మున్ను న్యాయంబుఁ దప్పకయుంటివి. నీ కెప్పుడిట్టి విపరీతబుద్ధి పుట్టెనో, యప్పుడే యీ యిక్ష్వాకువంశమున కొక గొప్ప చేటు సంభవించినది. ఓ విరిసికన్నులదానా, నీ వింతకు మున్నెప్పుడు న్యాయవిరుద్ధముగను, నా మనస్సున కప్రియముగను ఒక మాటనైనను జెప్పినది లేదు. అట్టి యొక్క పనినైనను జేసినదిలేదు గదా! అట్టి నీ విప్పుడు రెండు క్రూరములగు వరముల నడుగుట చూడఁగా నీవు

పరిహాసమున కడుగుచున్నా వని తలఁచుచున్నాను. ఓసీ, నీకు భరతునితో మహాబుద్ధిశాలియగు రాముఁడు సమానుఁడు గాఁడా? ఓసీ, చిన్నదానా, నీవు పసిదానవుగ నుండునపుడు పలుమాఱు "నాకు రాముఁడు భరతుఁడు నొక్కఁటే" యని యెన్ని యో కథలు చెప్పు చుంటివిగదా! అవి యెల్ల నిప్పుడు మఱచితివా? అట్టి ధర్మాత్ముఁడు, కీర్తి మంతుఁడునగు రాముని బదునాలుగేం డ్లడవికిఁ బంపఁగోరితివే! ఈ మాటయడుగ నీ కెట్లు నోరాడెను?

ఓ కడుంగ్రూరురాలా! మిక్కిలి సుకుమారుఁడును (అరణ్య వాసమువలని శ్రమకోర్వలేనివాఁడును), న్యాయమునందే దృష్టి యుంచి యుండువాఁడును నైన యా రాముఁ డడవిలో నుండుటకు నీ మనసె ట్లొప్పినది? సొంపయిన కన్నులుగలదానా, సకలజనుల యిష్టమునకుఁ దగినవాఁడును, నీకు శుశ్రూష సల్పువాఁడును నైన రాముని నెందుల కడవికిఁ బంపవలయును? రాముఁడు నీకు శుశ్రూష నేయుచున్నాఁ డనెడు నెనరుగూడ నీవు పెట్టువైతివిగదా! రాముఁడు భరతునికంటె ని న్నెల్లప్పుడు కొలుచుచుండును. ఆ రామునికంటె భరతుఁడు నీ కెక్కువ యనుట కేమియు దృష్టాంతము గనఁబడలేదు. శుశ్రూష, మర్యాద గనఁబఱచుట, నమ్మకము, చెప్పినమాట వినుట యను వీనిని నీయెడఁ గనఁబఱచువాఁడు రామునికంటె మఱొక్కఁ డెవ్వఁడున్నాఁడు? ఒక్కైకేయీ! యించ్చట వేలకొలఁది స్త్రీ లున్నారు. వేలకొలఁది పనివా రున్నారు. రామునియెడ నొక యపకీర్తికాని, నిందగాని యున్నదో, వారి నందఱి నడుగుము. పురుషశ్రేష్ఠుఁడైన రాముఁడు పక్షపాతము లేని మనసుతో సకల జంతుసంతతులను బుజ్జగించుచు, తన దేశములోని జనులను వారి కిష్టమునులైన పనులు చేయుటచే నాకర్షించియున్నాఁడు. శూరుఁడయిన రఘువంశోద్భవుఁడగు రాముఁడు లోకములను సత్యము చేతను, వేదలను ద్రవ్యమొసఁగుటచేతను, పెద్దలను శుశ్రూష సల్పుట చేతను, శత్రువులను యుద్ధమునందు ధనుస్సుచేతను జయించి లోఁబఱచుకొనుచున్నాఁడు. ఋతియు, నిజమునుపలుకుట, దానము చేయుట, తపమొనర్చుట, త్యాగము, చెలిమి, ఆచారము, మోసము లేకుండుట, విద్య, పెద్దలకు శుశ్రూషనేయుట మున్నగు సుగుణము

లన్నియు నా పెద్దకుమారుఁడగు రామునియందు నెలకొనియున్నవి. అట్లు తిన్ననిస్వభావముగలవాఁడును, దేవతలపరాక్రమముతో సాటియగు పరాక్రమము, మహర్షుల తేజస్సునంటి తేజస్సు గలవాఁడనునగు నా రామునివిషయమున నేల యిట్టిచెఱుపుచేయఁగోరితివి? జనులందఱు రాముని పట్టాభిషేకవిషయమయి యిష్టములయిన మాటలనే చెప్పిరి గాని యొక్కఁడును నది తనకిష్టము గాదని చెప్పలేదు. అట్లుండ నీకొకతె కిష్టముగను, జనులకందఱి కనిష్టముగను నుండు నీ మాట చెప్పుటకు నా కెట్లు నోరాడును? ఓర్పు, ఇంద్రియము, దానముచేయుట, నిజముపలుకుట, నెనరుగల్గియుండుట, స్వధర్మముల సడుపుట, సకల జంతువులను నొప్పింపకుండుట యనుసద్గుణంబులెల్ల నా రామునియందే యున్నవి. అట్టిరాముని విడిచిన నా కెవరు దిక్కు? కాఁబట్టి, కైకేయీ! నన్నుఁ జూచి కొంచెము కరుణింపుము. నేనో ముసలివాఁడను. అవసానకాలము నేఁడో రేపో రాఁబోవుచున్నది. దుఃఖముచే నామనస్సు నొచ్చియున్నది. నేను మిగులఁ బరితాపముతో నిన్ను వేఁడుకొనెదను. నాలుగుసముద్రములచేతను జుట్టఁబడియుండు నీ భూమండలమున నాకు నెంత ధనము లభించుచున్నదో, యదియంతయు నిదిగో నీ కొసఁగెదను. రాముని విషయమయిన కోపము నీవు విడిచిపెట్టుము. ఓ కైకేయీ! నీకుఁ జేతులు జోడించి మ్రొక్కెదను. నీ కాళ్ళమీఁద నైనను బడియెదను. రామునికి శరణుకమ్ము. జనులు నన్నధర్మపరుఁడని చెప్పునట్లు చేయకుము" అని దశరథుఁడు కైకేయిని బహువిధములు వేఁడుకొనెను.

కైకేయి మొండితనము

అవ్విధంబున దుఃఖముచేతఁ బరితపించుచును, నేడ్చుచును, స్మరణదప్పి క్రిందఁబడి పొరలింతలు పెట్టుచును, దుఃఖమునెడి సముద్రమున మునిఁగి, తన్ను నే విధంబునైనను శోకసాగరము దరిఁ జేర్పుమని మాటి మాటికిఁ బ్రార్థించుచుండు దశరథుని జూచి, కైకేయి మిక్కిలి యుగ్రరూపము దాల్చినదై, "ఓ రాజా! రెండువరముల నిచ్చి, యవి యిమ్మని యడిగిన నిట్లు క్రొక్కుటపడుచున్నావే, ఓ శూరుఁడా! తఱుచు 'నేను ధర్మములఁ జేయువాఁడ' నని యెట్లు లోకులతోఁ జెప్పు

కొందురు. ఓ మహారాజా! యనేకులు రాజస్త్రులందఱు తమతోఁ గలిసి, 'కైకేయికి వరముల నిచ్చితివా?' యని యడిగిరేని, ఓ ధర్మజ్ఞుఁడా! అప్పుడు తమరు వారికేమి బదులుచెప్పుదురు.

'ఏ కైకేయియొక్క యనుగ్రహముచే నేను బ్రదికియున్నానో, యీకైకేయి నన్నుఁ బ్రాణాపదనుండి తప్పించినదో, యీ కైకేయికి రెండు వరములు నే నిచ్చెదనని మొదట వాగ్దత్తముచేసి, యట్లు జరిపింపక, నే నీ కైకేయిని మోసపుచ్చితిని' అని తెగించి చెప్పుదురు కాఁబోలును. మహారాజా! తమరు నృపాలురుగ నుండియు, మొదటివరములిచ్చి యప్పుడే వేఱువిధములగు పలుకులు పలుకుదురేని, నృపాలా! 'రాజులెల్ల నిట్టివారేకదా' యని యందఱు రాజులకు నపకీర్తిఁ దెత్తురు. తమరే ముందుగ నిచ్చెదనని చెప్పి, పిదప నే నడిగిన స్వల్పవరము కిట్లు మీన మేషము లెంచుచున్నాను. తొల్లింటి రాజుల చరిత్రము వినియుందురుగదా! ఒక డేగయుఁ బావురమును జగడమాడి, డేగ పావురమును జంపఁబూనఁగా, నది శిబిచక్రవర్తిని శరణుఁబొందగా నప్పుడా శిబిచక్రవర్తిఁయు డేగకుఁ బావురముకు బదులుగాఁ దనమాంసము నిచ్చెనుగదా! అలర్కుఁడు డసువాఁడు తన కన్నుల నొసఁగి యుత్తమగతిఁ బొందెనుగదా! సనుద్రుఁడు చెల్లెలికట్ట దాఁట నని ప్రతిజ్ఞ నేసి యిప్పటికి నట్లుచేయుచున్నాఁడుగదా. మహారాజా! తొల్లింటి రాజులచరిత్రములనెల్లఁ బరికించి, చేసిన ప్రతిజ్ఞ కల్లయగునట్లు చేయకుఁడు. చెడుతలంపుగల యో నృపాలా, తమరు చెప్పినమాట మీఱితే, న్యాయమార్గమునుఁ దప్పి, రామునికిఁ బట్టాభిషేకము జరిపించి, కౌసల్యతోఁగూడి యెల్లప్పుడు రమింపఁగోరుచున్నారు. అది యన్యాయ్యమైనను, న్యాయ్యమయినను, నిజమైనను, కల్లయైనను సరే యేవి నాకుఁ దా మొసఁగునట్లు చెప్పితిరో, యీ వరములకు రెంటికిఁ దిరుగుపాటులేదు. రామునకే తాము పట్టాభిషేకము సేయుదురేని, నే నిప్పుడే తమ ముందటనే యిక్కునగ విషముఁ ద్రాగి, తమరు చూచుచుండఁగనే మరణము నొందెదను. రామునికిఁ బట్టాభిషేకమయిన పిమ్మట రాముని తల్లియెదుటఁ జేతులు కట్టుకొని యొక దినమైనను నా మొకుఁ గొల్వ్ గొల్చుచు నా మెను జూచుచుండుటకంటె నాకు మరణమే మేలుగదా! మను

జేంద్రా! నన్నును, భరతుని సాక్షులనుగాఁబెట్టి యొట్టుపెట్టుకొనెదను. ఇదిరామునిఁ నడవికిఁబంపక, తమ రిఁకనేది యిచ్చినను నేనుతనివినొందను, నిశ్చయము" అని చెప్పి యూరకుండెను. ఆమె పలవించుచుండు రాజును గూడఁ బలుకరింపదాయెను. అంతట రాజును కైకేయి తన్నడిగినట్టివగు రాముని యరణ్యవాసము, భరతుని పట్టాభిషేకము ననెడి కడుఁ గ్రూరములగు రెండువరముల నాకర్ణించి, యింద్రియముల స్వాస్థ్యముఁ దప్పినవాఁడై కొంచెము సేపూరకుండి, కైకేయిని హెచ్చరించుకొనక, తనకుఁ బ్రియ కాంతయయ్యు నప్రియములు పలుకుచుండు కైకేయిని రెప్పవాల్పక చూచుచుండెను. ఆ నృపాలుఁడు తన మనస్సున కసమ్మత మును, దిగులు విచారము అను రెంటితో నిండినదియుఁ, బిడుగుపాటు వలె దారుణమయినదియు నగు కైకేయి మాటను విని నెమ్మదిదప్పి యల్లాడుచుండెను. అట్లు కొంత తడవుండి యతఁడు కైకేయియొక్క మొఱకుఁదనమును, నా మె పెట్టిన భయంకరమైన యొట్టును దలఁచి, యది చేయక తప్పదని యెఱిఁగి, "హా! రామా!" యని నిట్టూర్పు విడిచి, మొదలు దెగిన వ్రానువలెఁ గ్రిందఁబడెను. అప్పుడు దశరథుఁడు కల వరపడిన మనంబుగల వెఱ్ఱివాఁడువోలెను, నెమ్మదిలేని రోగివలెను, మంత్రపుఁ గట్టుచేఁ బొగరు తగ్గిన పామువలెను నయి డగ్గుత్తికతోఁ గైకేయిం జూచి యిట్లు చెప్పఁ దొడఁగెను.

"ఓ కైకేయీ! మంచిదానివలెఁ దోఁచు నీ చెడ్డతలంపును నీ కెవతె బోధించె? దయ్యముపట్టినదానివలె నాతో నీ పలుకు పలుకు చున్న నీకుఁ గొంచెమయినను సిగ్గుదోఁపకున్నదే. నీ బుద్ధి యిట్లు చెడి పోవునని నేను మున్నెఱుఁగ నయితిని. నీవు చిన్నదానవుగ నున్నప్పు డుండిన బుద్ధి కిప్పటిబుద్ధి విపరీతముగా నేర్పడినది. నీ కెవరివలన భయము దోఁచెను? భరతుఁడు సింహాసనమున నుండఁగాను, రాముఁడు వనంబున నుండఁగాను జూడవలె నని నీ వేల కోరితివి? నీ మొగనికిని, జనులకును, భరతునికినిఁ బ్రియంబుసేయవలె నని నీవు తలంతువేని, నీ కసత్య దోషము వచ్చినను లోపము లేదు. ఈ తలంపు మానుము. ఓ దయమాలినదానా! చెడుతలంపుగలదానా! నీచబుద్ధి గలదానా! పాపంపుఁ బనులు సేయుదానా! నేనుగాని, రాముఁడుగాని నిన్నేమి

దుఃఖపెట్టితిని? వీమి యప్రియమొనర్చితిని? భరతుఁడు రాముని విడిచి తాను రాజ్యమేలుటకు నొకప్పుడు నొప్పఁడు. వీల యనిన భరతుఁడు రాముని కంటె మిక్కిలి ధర్మమునందుఁ దలఁపుగలవాఁడు.

ఓ కైకేయీ! నేను రాముని జూచి, "రాముఁడా! నీ వడవికిఁ బొమ్ము" అని చెప్పిన, రాహు కేతుగ్రహములచేఁ గ్రమ్మఁబడిన చంద్రుని మాడ్కిఁ గళఁదప్పిన యా రాముని మోము నెట్లు చూతును? నా మేలుగోరు పెద్దలతోను మంత్రులతోను గూడి చక్కఁగా నాలోచించి చేసిన నా తలంపు తలక్రిందగుచుండఁగా, శత్రువులచేఁ గొట్టఁబడిన సైన్యమునుబోలె నే నెట్లు చూడఁగలను? రాముని యభిషేకమునకై నేఁ బిలిపింపఁగా వచ్చిన రాజులు ననుఁ జూచి యేమి పలుకుదురు? "ఆహా, బాలుఁడయిన యిక్ష్వాకువంశస్థుఁడగు రాముఁడు చిరకాలము రాజ్యము చేసెనుగదా." యని వారు నన్ను హేళనము చేయుదురు. ఎప్పుడైనను సుగుణములు గలవారును, శాస్త్రములనెల్లఁ జదివిన పండితులును, పెద్దలగు వా రనేకులును వచ్చి "రాముఁ డెక్కడ," అని యడిగినచో, నేను వారి కప్పు డేమి చెప్పుదును? అప్పుడు నేను వారిం జూచి 'కైకేయియొక్క నిర్బంధమునకుఁ దాళఁజాలక రాముని నడవికిఁ బంపితిని' అని యీ నిజమయిన సంగతిఁ జెప్పితినేని, ముందు వారి యెదుట సభలో 'రామునికి రేపు పట్టాభిషేకము జరిపించెదను' అని చెప్పినమాట కల్లయగునుగాదా? అదిపోనీ, రాముఁ డడవికిఁ బయనము కాఁగాఁ, గౌసల్య నన్నేమి చెప్పును. ఇట్టి కౌసల్యకిష్టముగాని పనిచేసి యాపెతో నే నేమి బదులు చెప్పుదును? ఓ దేవీ! కౌసల్య యెల్లప్పుడు నా యిష్టమునే చేయఁగోరుచు, రామునిఁ బ్రీతితోఁ బెంచుచు, నా కిష్టములైన పలుకులనే పలుకుచుఁ బనులందుఁ బనికత్తెవలెఁ బరిచర్యలు చేయుచు, నాటలందుఁ జెలికత్తెవలె నన్ను సంతసపఱచుచు, ధర్మకార్యంబులు నడుపుటయందు భార్యవలెఁ దోడ్పడుచు, మఱియొక భార్యను బెండ్లాడునప్పుడు నాతోఁబుట్టినదానివలె లాలనసేయుచుఁ, దల్లివలెఁబోషణముసేయుచు నన్నుఁ గొల్చుచున్నది. మన్ననచేయఁదగినదైనను గౌసల్యను నీ కెక్కుడఁ గోపము వచ్చునో యని యెంచి మర్యాదసేయకుంటిని. ఓసీ కైకేయీ! నేను నీ కెప్పు డెప్పుడేమి యేమి మేలు సేసి

తినో, యదియెల్లను, పథ్యముగాని సాధకములతోడ భుజించిన యన్నము రోగిని బాధించినట్లు, న న్నిప్పుడు బాధించుచున్నది. రామునికిఁ బట్టాభిషేకము నేనెద ననిచెప్పి యది చేయకపోవుట, యడవికిఁ బంపుట యీ రెంటిని జూచి సుమిత్ర యిఁక నన్నెట్లు నమ్మును? భరతని మాటలు నీళ్ళ మాటలవంటివి యని తలంపదఁటవే. సీతయన్ననో, 'నీను మరణము నొందితి' ననియు, 'రాముఁ డడవికిఁబోయె' ననియు నీ రెండు వార్తల నేకకాలంబుననె మిక్కిలి దిగులుతో వినఁగలదు. అయ్యో! పాపము! నే నేమి చేయఁగలను? సీతయు రాము నెడఁబాసి, నాకెత్తిన ప్రీతిగా విలపించుచు, హిమవంతమునొక్క పార్శ్వమున మగని నెడఁ బాసిన కిన్నరాంగనవలె, దుఃఖించుచుఁ బ్రాణములఁ దొఱఁగఁబోవ చున్నది. భయంకరారణ్యంబున నుండు రామునిఁ దలఁచియు, విల పించుచున్న సీతను జూచుచును నేను దీర్ఘకాలము జీవింపఁగోరను. కావున నీవు మగనిఁ బోఁగొట్టుకొని నీ కొడుకుచే రాజ్యపరిపాలనంబు చేయించుచుందువు. రాముని నడవికిఁ బంపి నే నొక్క క్షణమయిననుఁ జీవింపఁగోరను. ఓ కైకేయీ! నీవు సొగసుఁదనముగలిగి పైకి మంచివాని వగ నగుపడుచుంటివి. నరుఁడు మద్యమునొక్క రూపముం జూచి మోహించి, విషముతోఁ గూడిన యాహుద్యముఁ బ్రాగి దాని చెడు గుణము నెఱుఁగునట్లు నేనును నీ రూపముఁ జూచి, మోహించి, నీకడఁ జేరి, నీ దుష్టస్వభావం బిట్టి దని యిపు డనుభవముచేఁ దెలిసికొంటిని. నీవు కపటముతోఁ గూడిన యిచ్చకపు మాటలు మాటాడి, నన్ను లాలన చేయుదానివలె నభినయించితివి. వ్యాధుఁడు తన పాటయొక్క నాదముచే మృగమును వంచించి, బాపునకుఁ జేరినతర్వాత దాని నెట్లు చంపునో, యట్లు నీవు నీ మాటలు వాస్తవము లని నమ్మి నీకడఁ జేరిన నన్నుఁ జంపితివి. యోగ్యు లెవరైనను నన్ను రాజవీథులందుఁ జూచి రేని, 'ఈ దశరథుఁడు యోగ్యుఁడుగాఁడు. రామునికిఁ బట్టాభిషేకంబు జరిపించెద నని చెప్పి, పిదప నతినిని కేవలము స్త్రీ సుఖము నిమిత్త మడవికిఁ బంపించినాఁ' డనుచుఁ గల్లుద్రావిన బ్రాహ్మణునిఁ దిరస్కరించునట్లు నన్నుఁ దిరస్కరింతురుగదా! అయ్యో! నా కెంత వ్యసనము! ఎంత శ్రమ వచ్చినది! 'రాము నడవికిఁ బంపుము' అని నీ వడిగిన మాట విని

యోర్చి యున్నానుగదా. జన్మాంతరమందుఁ జేయఁబడిన దుష్టకర్మ మీ జన్మమున ననుభవమునకు వచ్చిన ట్టిదుఃఖము నాకు నిష్కారణముగఁ బ్రాప్తించినది.

ఓసీ క్రూరరాలా! పాపాత్ముఁడ నయిన నేను నిన్నుఁ జాలదినము లుగాఁ దెలియక మెడనుఁ దగులుకొన్న యురిత్రాటినివలెఁ గాపాడితిని. ఆ యురిత్రాడా మనుష్యుని జంపునట్లు నీవునన్నుఁ జంపవైతివి. నేనును నీతోఁ రమించుచు, నీవు నాపాలిటి మృత్యుదేవత వని యెఱుఁగనైతిని. తెలివిమాలినవాఁడనై, యేకతంబున బాలుఁడు తెలివిమాలి నల్ల త్రాఁచును దాఁకినట్లు నిన్నుఁ దాఁకితిని. కాని యాకృష్ణసర్ప మాబాలుని చేయి గఱచి మరణము నొందించినట్లు, నీవు నీ మాట లనెడు విష ముచే నన్నుఁ జంపఁబూనితివి. పరాత్ముఁడనయిన నా వలన నమ్మహాత్ముఁ డగు రాముఁడు దండ్రి లేనిబిడ్డఁ డయ్యెనుగా! రామునికిఁ దండ్రి చేయు పని యేదియుఁ జేయకపోవుటచేఁ దండ్రియైన నే నుండియు లేన ట్లయ్యెనుగదా! 'దశరథనరేంద్రుఁ డొక స్త్రీ నిమిత్తము దనముద్దులకుమా రుని నడవికిఁ బంపుచున్నాఁడు. ఇతఁడు తెలివి లేనివాఁడు; కామాతు రుఁడు' నని నన్ను సకలవిధంబులుగ జనులందఱుఁ దప్పక దూషింతురు.

రాముఁడు వ్రతముల చేతను, బ్రహ్మచర్యాధర్మముల నడుపుట చేతను గురుశుశ్రూషచేతను బిక్కిపోవునట్లు చేయఁబడెను. ఆ కష్టము లన్నియును దీఱి సుఖానుభవకాలమున మఱుల గొప్పకష్టమునే యనుభ వింపవలసి వచ్చినది. నా పుత్రుఁడగు రాముఁ డెప్పుడును నా మాటకు రెండవమాట చెప్పఁడు. నేను రాముని బిలిపించి: 'నాయనా! నీ వడ వికిఁ బొమ్ము' అని చెప్పినఁజాలును. వెంటనే రాముఁడు 'అట్లే పోయిరచ్చెదను'అని చెప్పి బయలువెడలును. రాముని నే నడవికిఁ బొమ్మని చెప్పినప్పుడును, రాముండు 'నేను బోఁజాల' నని నాకుఁ దిరుగఁబడి చెప్పెనేని, యది నా కిష్టముగానే యుండును. అతఁ డట్లు చెప్పఁడు. రాముఁడు కపటము లేనివాఁడుగనుక, నా చెడుతలంపు నెఱుఁగక, 'నే నడవికిఁ బొమ్మంటి' నేని 'సరే' యనియె చెప్పును. రాముఁ డడవికిఁ బయనము కాఁగానే, పురగ్రామవాసులగు జను లందఱు నన్ను 'ఛీ! ఛీ!'యని తిట్టుదురు. ఇట్లు జనులందఱు తిట్టుటయె

కాక మృత్యుదేవత పాపాత్ముఁడ నగుటచేత నోర్వరాని నన్ను యమ పురికిఁ గొనిపోవును. నేను మరణమొందఁగా, నరశ్రేష్ఠుఁడగు రాముం డడవికిఁ బోఁగా, మిగిలియున్న కౌసల్య మొదలగు నా యిష్ట బంధువుల కెల్ల నీ వేమి కీడు సేయ నెంచియున్నావో? ఓ కైకేయీ! నీవు నన్నుఁ గౌసల్యను, రాముని, లక్ష్మణ శత్రుఘ్నులను విడిచివేయుదువేని, సుమిత్రయు దుఃఖములను సైరింపఁజాలక నాతోడనే సహగమనము సేయును. రాము నడవికిఁ బంపి నే బ్రతుకను. నేను మృతినొందినచో నా వియోగదుఃఖమును, పుత్రవియోగదుఃఖమును సైరింపఁ జాలక కౌసల్య మృతి నొందును. అంత రాముని యండుఁ బ్రేమగల లక్ష్మణుఁడు ప్రాణములను దొఱఁగును. శత్రుఘ్నుఁ డీ వృత్తాంతమును విని యచ్చటనే మృతినొందును. తన పుత్రులు నిర్వురిని, భర్తను బోఁగొట్టుకొని సుమిత్రయు నాతో ననుగమనము సేయును. ఇట్లు కౌసల్యను, సుమిత్రను, నన్ను, మువ్వురు పుత్రులతోఁగూడ దుఃఖమునఁ బడఁద్రోసి నీవు మాత్రము సుఖమునొందుము. సుగుణములు గలిగినదియని ప్రసిద్ధికెక్కి, యొక్కరికిని గదలింప నలవికానిదై శాశ్వతమయియుండు నిక్ష్వాకువంశ మును నేనును, రాముఁడును బోయిన వెనుకఁ గలవరపడిన దానిని జేసి పాలింపఁబోవుచున్నావు. రాము నడవికిఁ బంపుట భరతునకు సమ్మత ముగా నుండునేని, రాముని యరణ్యవాసమునకు వెంబడినె మృతి నొందిన నాకు భరతుం డుత్తరక్రియలు సలుపకుండును గాక? అయ్యో! పాపాత్మురాలా! నా పాలిటి శత్రువైనదానా! నీ కోరికల నన్నిటినిఁ బడయుము. నేను గతింపఁగఁ, బురుషోత్తముఁడయిన రాముఁ డరణ్య మున కేఁగఁగ, నీ వనాథవై పుత్రునింగూడి రాజ్యంబుఁ బాలింపఁ గలవు. నీవు రాజపుత్రి వనెడు నెపమాత్రమో నాయింట నుంటివి. నీవు నిజముగా రాజపుత్రివిగావు. లోకంబున సాటిలేని యపకీర్తియు, శాశ్వతమయిన యవమానమును, సకల జంతువులయెదుట నీచత్వమును జన్మాంతర పాప కర్మము మూఁడిఁ నీ రూపముతో మా యింటనున్నవి కాఁబోలును! ముందురథములమీఁదను, నేనుఁగులమీఁదను,గుఱ్ఱములమీఁదనుమాటి మాటికిఁ బోవుచుండిన పిల్లవాఁడగు రాముఁ డిపు డెట్లు పాదములతో భయంకరమయిన యడవియందుఁదిరుగఁగలఁడు?ఎవఁడు భోజనము నేయు

నపుడుపోఁగులను దాల్చిన వంటలవారు 'నేను వంటచేసి వడ్డించెదను. నేనువంటచేసి వడ్డించెద"నని షడ్రసములతోనిండినమధురములగు పాన ములను, భోజనములను సమర్థురో, యట్టి రాముఁడు వనంబునఁ జేఁదు, ఒగరు, కారము గలయాహారపదార్థంబులఁ దినుచునే విధమునఁ గాలము గడపఁగలఁడు? మఱియు మిక్కిలి వెలగల పట్టువస్త్రములను గట్టికొని, సుఖముగా నుండిన రాముఁడిప్పుడు కాషాయవస్త్రమునుఁ గట్టి కొని యెట్లు నేలపయి వసింపఁగలడు? రాముని నడవికిం బంపుట, భర తునికిఁ బట్టాభిషేకంబు సేయుటయను రెండు క్రూరములగు వరములఁ గోరుమని యెవఁడు నీ కాలోచన లేకుండ బోధించెను. ఇది నీ స్వాబుద్ధిచేఁ గలిగిన యాలోచనకాదు. ఎవఁడో దురోభధన నేనెను. ఇది నిజము. ఛీ! ఆఁడువారు మొండిపట్టుగలవారు. మేలుకీళ్ళరయక యేపని యెట్లు పోయినను తమ పనియే కావలెనని యెల్లప్పుడు కోరుచుందురు. అయి నను, అందఱు స్త్రీ లట్లుందురని నేఁ జెప్పను. ఎందఱో గుణవతులగు స్త్రీ లున్నారు. భరతుని తల్లియె మొండిదియనియుఁ దన పనినె చూచు కొనునది యనియుఁ జెప్పుచున్నాను.

చెఱుపునం దే తలంపుగల దానా! స్వకార్య భుపంధరురాలా! క్రూరు రాలా! నాకు వ్యసనము గలిగింపవలెనని కంకణము కట్టుకొన్న దానా! నాయందుఁగాని, యెప్పుడును లోకంబునకు మేలుచేయఁగోరుచుండు రామునియందుఁగాని యేమి యప్రియమును గంటివి. లోకమున నెంత యనురాగము గలవారయిననుఁ,దండ్రులు కొడుకులను విడుతురు.ఆండ్ర మగలనైనను విడుతురు.నేను రాము నడవికిఁ బొమ్మనిన,దుఃఖపడుచుండు రామునిఁజూచినంతమాత్రముననే లోకమంతయుఁ గోపముతోఁ గూడిన దగును.నేనన్ననో,స్వాభావికముగా దేవతలపుత్రులంబోలురూపముతోఁ జక్కగా నలంకరించుకొని వచ్చుచున్న రాముని జూచిన చూపుననే సంతసపడి, నేను మిక్కిలి ముసలివాఁడయినను బ్రాయమున నున్న వాని వలె దేహ బలము, నుత్సాహముఁ గలవాఁడ నయ్యెదను. సూర్యుఁ డుదయము కాకున్నను పనులు జరుగును. ఇంద్రుఁడు వాన గురిపింపక పోయినను తమ పనియే కావలెనని యెల్లప్పుడు కోరుచుందురు. అయి నను, అందఱు స్త్రీ లట్లుందురని నేఁ జెప్పను. ఎందఱో గుణవతులగు స్త్రీ లున్నారు. భరతుని తల్లియె మొండిదియనియుఁ దన పనినె చూచు కొనునది యనియుఁ జెప్పుచున్నాను.

చెఱుపునం దే తలంపుగల దానా! స్వకార్య భుపంధరురాలా! క్రూరు రాలా! నాకు వ్యసనము గలిగింపవలెనని కంకణము కట్టుకొన్న దానా! నాయందుఁగాని, యెప్పుడును లోకంబునకు మేలుచేయఁగోరుచుండు రామునియందుఁగాని యేమి యప్రియమును గంటివి. లోకమున నెంత యనురాగము గలవారయిననుఁ,దండ్రులు కొడుకులను విడుతురు.ఆండ్ర మగలనైనను విడుతురు.నేను రాము నడవికిఁ బొమ్మనిన,దుఃఖపడుచుండు రామునిఁజూచినంతమాత్రముననే లోకమంతయుఁ గోపముతోఁ గూడిన దగును.నేనన్ననో,స్వాభావికముగా దేవతలపుత్రులంబోలురూపముతోఁ జక్కగా నలంకరించుకొని వచ్చుచున్న రాముని జూచిన చూపుననే సంతసపడి, నేను మిక్కిలి ముసలివాఁడయినను బ్రాయమున నున్న వాని వలె దేహ బలము, నుత్సాహముఁ గలవాఁడ నయ్యెదను. సూర్యుఁ డుదయము కాకున్నను పనులు జరుగును. ఇంద్రుఁడు వాన గురిపింపక పోయినను తమ పనియే కావలెనని యెల్లప్పుడు కోరుచుందురు. అయి నను, అందఱు స్త్రీ లట్లుందురని నేఁ జెప్పను. ఎందఱో గుణవతులగు స్త్రీ లున్నారు. భరతుని తల్లియె మొండిదియనియుఁ దన పనినె చూచు కొనునది యనియుఁ జెప్పుచున్నాను.

చెఱుపునం దే తలంపుగల దానా! స్వకార్య భుపంధరురాలా! క్రూరు రాలా! నాకు వ్యసనము గలిగింపవలెనని కంకణము కట్టుకొన్న దానా! నాయందుఁగాని, యెప్పుడును లోకంబునకు మేలుచేయఁగోరుచుండు రామునియందుఁగాని యేమి యప్రియమును గంటివి. లోకమున నెంత యనురాగము గలవారయిననుఁ,దండ్రులు కొడుకులను విడుతురు.ఆండ్ర మగలనైనను విడుతురు.నేను రాము నడవికిఁ బొమ్మనిన,దుఃఖపడుచుండు రామునిఁజూచినంతమాత్రముననే లోకమంతయుఁ గోపముతోఁ గూడిన దగును.నేనన్ననో,స్వాభావికముగా దేవతలపుత్రులంబోలురూపముతోఁ జక్కగా నలంకరించుకొని వచ్చుచున్న రాముని జూచిన చూపుననే సంతసపడి, నేను మిక్కిలి ముసలివాఁడయినను బ్రాయమున నున్న వాని వలె దేహ బలము, నుత్సాహముఁ గలవాఁడ నయ్యెదను. సూర్యుఁ డుదయము కాకున్నను పనులు జరుగును. ఇంద్రుఁడు వాన గురిపింపక పోయినను తమ పనియే కావలెనని యెల్లప్పుడు కోరుచుందురు. అయి నను, అందఱు స్త్రీ లట్లుందురని నేఁ జెప్పను. ఎందఱో గుణవతులగు స్త్రీ లున్నారు. భరతుని తల్లియె మొండిదియనియుఁ దన పనినె చూచు కొనునది యనియుఁ జెప్పుచున్నాను.

చెఱుపునం దే తలంపుగల దానా! స్వకార్య భుపంధరురాలా! క్రూరు రాలా! నాకు వ్యసనము గలిగింపవలెనని కంకణము కట్టుకొన్న దానా! నాయందుఁగాని, యెప్పుడును లోకంబునకు మేలుచేయఁగోరుచుండు రామునియందుఁగాని యేమి యప్రియమును గంటివి. లోకమున నెంత యనురాగము గలవారయిననుఁ,దండ్రులు కొడుకులను విడుతురు.ఆండ్ర మగలనైనను విడుతురు.నేను రాము నడవికిఁ బొమ్మనిన,దుఃఖపడుచుండు రామునిఁజూచినంతమాత్రముననే లోకమంతయుఁ గోపముతోఁ గూడిన దగును.నేనన్ననో,స్వాభావికముగా దేవతలపుత్రులంబోలురూపముతోఁ జక్కగా నలంకరించుకొని వచ్చుచున్న రాముని జూచిన చూపుననే సంతసపడి, నేను మిక్కిలి ముసలివాఁడయినను బ్రాయమున నున్న వాని వలె దేహ బలము, నుత్సాహముఁ గలవాఁడ నయ్యెదను. సూర్యుఁ డుదయము కాకున్నను పనులు జరుగును. ఇంద్రుఁడు వాన గురిపింపక పోయినను తమ పనియే కావలెనని యెల్లప్పుడు కోరుచుందురు. అయి నను, అందఱు స్త్రీ లట్లుందురని నేఁ జెప్పను. ఎందఱో గుణవతులగు స్త్రీ లున్నారు. భరతుని తల్లియె మొండిదియనియుఁ దన పనినె చూచు కొనునది యనియుఁ జెప్పుచున్నాను.

యుండఁజాలఁడని నేను దలంచెదను. నాకుఁ జెడుగును గోరుదానవును, నామేలు గోరనిదానవును,నాకు శత్రువువంటిదానవునైన నిన్ను నాపాలిటి మృత్యుదేవత నుంచుకొన్న ట్లుంచుకొంటిని. ఓగ్వారాని విషవేగముగల పామువఁటి దానవయిన నిన్ను బహుకాలము నా తొడపై గూర్చుండఁ బెట్టికొంటిని. అది తెలియక చేయుటచే నిపుడు నీచేఁ జంపఁ బడితిని. నన్ను రాముని లక్ష్మణుని బోఁగొట్టుకొని భరతుండు నీ తోడ్పాటుగల్గి, బంధువుల నందఱిం జంపి, యయోధ్యా పట్టణమును, దేశమునంతయు నేలుసుగాక! నీవును నాకుఁ గీడురోయు శత్రువులకు సంతోషము గలిగించుచుండుము. ఓక్రూరమయిన నడతగల దానా! ఆపదలందు మఱింతకష్టపెట్టుదానా! బలాత్కరించి, నాచేత మాట నొప్పించికొని యిప్పు డిట్టి మాటలు పలుకుచున్నావే! ఇట్టి నీ నోటినుండి వేయి ప్రయ్యలయి పండ్లు జల్లున నేల నేలయుమ్మ రాలకున్నవి? రాముఁ డింతవఱకు నొరులకుఁ జెఱుపుఁ జేయునవిగాని, యిష్టములుగానివికాని పలుకులు పలికినదిలేదు. రాముఁడు పరుసని మాటల నాడుటయె యెఱుఁగఁడు. సుగుణవంతుఁడని యందఱిచేఁ బొగడఁబడుచు, నందఱికి సమ్మతములయిన పలుకులే పలుకుచుండు రామునివిషయమున నరణ్యమునం దుండవలసినంత తప్పిదముల నేమి కనిపెట్టితివి? చెప్పుము. కేకయవంశమునకుఁ జెఱుపనచేటయైనదానా! నీ వేడువుము, మంటలోఁబడి మండిపొమ్ము, నాశమైపోవుము, కొండ కొన పైకెక్కి యచ్చటనుండి పడి తుత్తునియలయి పొమ్ము. నీ వేవిధముగా నష్టమైనను సరే, మిక్కిలి క్రూరమైనదియు, నాకుఁ గీడు దెచ్చు నదియునైన యీ పనిని నేను జేయను. మంగలకత్తివలె గొంతు కోయుదానవును, సదా బూటకంపుఁ బ్రేమతోడి మాటలాడుదానవును, కడుఁగ్రూరంపుఁ దలఁపుగలదానవును, మా యిక్ష్వాకువంశమును ధ్వంసముచేయఁబూనినదానవును, మనస్సునను భీతిని గలిగించుదానవును, ప్రాణములతోఁగూడ మనస్సును దహింపఁగోరుదానవునైన నీవు బ్రతికియుండుటను నేను సహింపఁజాలను. ఇట్టి క్రూరురాలవయిన నీవు బ్రతికియుండుటకంటెఁ జచ్చుట మేలుగదా? రాముఁ డడవికిఁబోయిన నా ప్రాణం బుండదు. ఇఁక నాకేల సౌఖ్యము? పుత్రుని నరణ్యమునకుఁ

బంపి ప్రాణములు దాల్చియున్న నాకు సంతోష మెక్కడిది? నీవు నేను ఆలుమగలము. నాకు నీవు చెబుపుచేయుట తగదు. నీ కాళ్ళయినను బట్టుకొనెదను. నాపైఁ గరుణింపుము. రాము నడవికిఁ బంపుటయను వరంబుఁ గోరుకుము." అని కైకేయితోఁ జెప్పెయు, వేఁడుకొనియు స్త్రీమర్యాద మీఱియున్న కైకేయి కధీనముగు మనసుగలవాఁడై, దిక్కులేనివానిలె నేడ్చుచుఁ, గైకేయి తన రెండుకాళ్ళ భర్త దాఁకునని యెంచి యాతనికిఁ జిక్కనీయక తన కాళ్లను మఱొక ప్రక్కకుఁ జూపుటచే, దానినిఁ దాఁకికయె, రోగియగువాఁడు హాహా త్తుగాఁ గ్రిందఁబడునట్లు, దుఃఖముచే నొడలు తెలియక క్రిందఁబడెను.

13-వ సర్గము.

దశరథుఁడు మఱల కైకేయిని వేఁడుకొనుట

అట్లు దుఃఖపడుటకుఁ దగనివాఁడును, నేలపైఁ బరుండియున్న వాఁడును, నాప్రకారముగా నుండుటకుఁ దగనివాఁడు నైనందునఁ బుణ్యమంతయు ముగిసిన పిదప దేవలోకమునుండి త్రోయఁబడి క్రిందఁ బడిన యయాతిని బోలువాఁడును నైన దశరథమహారాజుం జూచి, చెబుపే యాకారముగాఁ గలదియుఁ, గార్యసిద్ధిని బొందనిదియునైన కైకేయి యెడ లేమనుకొందురో యన్న భీతిలేనిదై, రాజునకు వెఱపుఁ జూపుచు, మఱల నావరములనే యిమ్మని కోరుచు, "ఓ మహారాజా! తమరు సత్యముఁ జెప్పువారనియు నియమముఁ దప్పనివారనియు నూరక తమ్ముఁ దాము బొగడుకొనుచుందురు. అట్లుండఁగాఁ దమరేల నా కిచ్చెదనన్న వరము నిచ్చుట కిచ్చగింపక యున్నవారలు" అని యడిగెను.

కైకేయి యడిగిన యా మాట విని, దశరథమహారాజు మిక్కిలి యలిగినవాఁడై, కొంత తడ వంగముల స్వాధీనత తప్పినవాఁడువోలె నుండి, మఱల స్మృతిఁ దెచ్చుకొని కైకేయిం జూచి, "ఓ చెడ్డదానా! నాపాలిటి శత్రువయినదానా! నన్ శ్రేష్ఠుఁడగు రాముఁ డడవికేఁగి, నేను స్వర్గమున కేఁగిన పదంపడి, నీవు కోరిక లన్నిటిని బడసి, సుఖములు గలిగి యుండుము. ఆహా! యేమి నీ కటికితనము? నేను మరణంబు నొందినను నాకు సౌఖ్యము లేకున్నది! స్వర్గలోకమునకు దేవతలు రాముని

క్షేమముఁ గూర్చి, తిరస్కారముతోఁ జెప్పు మాటలను నే నెట్లు విందును? ఆహా! నాకెంత కష్టము ప్రాప్తించెను. నన్ను రాముని క్షేమ వార్తను గూర్చి వేల్పు లడిగినప్పుడు, 'వేల్పులారా! నేను నా ప్రియు రాలగు కైకేయి కిష్టము నెఱవేర్పఁగోరి, రాముని నరణ్యమునకుఁ బంపి తిని' అని యథార్థమును దెల్పితినేని, మున్ను రాజసభలోఁ బలుపురు రాజర్షుల యెదుటను, మునీంద్రుల సమక్షమునను 'రేపు రామునికిఁ బట్టాభిషేకము జరిపించెద' నన్న మాట యసత్య మగును. నేను చాలయేండ్లు బిడ్డలు లేక వ్రతములు, నుపవాసములు మొదలగు కష్టము లనుభవించి, యీ యయోధ్యానుబాహువగు సుపుత్రుఁడైన రామునిఁ బడసితిని. ఈరాముని నే నెట్లు విడుతును? ఈ రాముఁడు ధైర్య వంతుఁడు; విద్యలన్ని నేర్చినవాఁడు కోపము నడఁగించినవాఁడు; ఓర్పే ముఖ్యగుణముగాఁ గలవాఁడు; తామరపూవుల తేనెలఁబోలు కన్నులు గలవాఁడు. అట్టి యీ రాము నెట్లడవికిఁ బంప నోపుదును? నల్లకలువల వంటి మేని చాయ గలవాఁడును, పొడవు చేతులవాఁడును, మిగుల బల శాలియు, సౌందర్యవంతుఁడు నైన రాముని నే నెట్లు దండకారణ్య ములకుఁ బంప నోపుదును? సుఖములే యనుభవింపఁ దగినవాఁడును, దుఃఖమునుఁ లనుభవింపఁ దగనివాఁడును,బుద్ధిమంతుఁడు నైన రామునికి దుఃఖ మును నే నెట్లు కలిగించెదను? ఆ రాముఁడు కష్టము లనుభవింపుచుం డఁగా నేనెట్లు చూచుచుండఁగలను? ఓక్రూరురాలా! చెడ్డకోరికలు గల దానా! విడువని పరాక్రమంబు గలవాఁడును, నాకు ముద్దులు గులుకు వాఁడునైన రామునికి నీ వేల చెఱుపుఁ గావింప నెంచెదవు? నీ కతఁ డేమి యపకారము నేసెను? ఇప్పుడు నేను నీ కోరిక ప్రకారము నడచుకొందునేని, నాకు లోకమున సాటిలేని యపకీర్తియు, శాశ్వత మైన యవమానమును గలుగును" అని చెప్పుచుఁ, గుదుటపడని మనస్సుగలవాఁడై, కన్నీరు విడువసాగెను. ఇంతలో సూర్యుఁడు పడ మటిదెసఁ గ్రుంకెను; రాత్రియయ్యెను. ఆ రాత్రి పండువెన్నలతోఁ గూడినదై వెలయుచున్నను, అవ్యాధమున వ్యసనమున ముసిఁగి పల వించుచున్న యా దశరథ నృపాలునికిఁ గొంచెమయినను సంతసముఁ గావింపకుండెను. ముదుసలియగు దశరథనృపుఁ డట్లు వేఁడి నిట్టూర్పు

విడిచి, యాకసంబు వైపునఁ దన చూడ్కులు నిగిడించి, యాపద నొం దినవానికైవడిఁ జూపఱకు వ్యసనము గలిగించుచు విలపించుచుండెను. అట్లు కొంత తడవు పలవించి, "నక్షత్రములే భూషణముగాఁగల యో రాత్రీ, నీవు నాపైఁ గరుణించి, దెల్లవాఱకయుండుము. అట్లు కాదేని, యో రాత్రిదేవీ! నీవు త్వరగాఁ గడచిపొమ్ము. ఎందువలన ననఁగా నే కైకేయివలన నే నింత దుఃఖము నొందితినో, యా దయమాలిన పాపాత్మురాలిని జూచుట నా కెంతయు సమ్మతముగాదు" అని రాత్రి దేవిని ప్రార్థించి, చేతులు జోడించికొని, మఱలఁ గైకేయిం బతిమాలి కొని, యాసె నుద్దేశించి, "ఓ పట్టంపుదేవీ! నేను మంచి నడత గలవాఁడను; నొచ్చియున్న వాఁడను; నీయందే ప్రేమగలవాఁడను; జీవితము యొక్క కడపటి దశలో నున్న వాఁడను. ఇవన్నియుఁ గాక రాజను. ఈ కారణములంబట్టి నాపైఁ గరుణింపుము. ఓ కాంతామణీ! నేను ముందు వెనుక లాలోచింపక యీ మాట యంటిని. నీవు నాకు నెచ్చెలివిగదా! కావున బాగుగా నాలోచించి నాపైఁ గరుణింపుము. ఓ కైకేయీ! నీ వనుగ్రహించి, రామునకు రాజ్యం బొసఁగుము. నీవు దయయుంచి యొసఁగిన రాజ్యము నతఁడు ప్రీతితో నేలఁగలఁడు. నీవు సాటిలేని కీర్తినిఁ బొందుదువు. ఓసుముఖీ! నీ వా ప్రకారంబుగ రాజ్యంబు నొసఁగుట నాకును, రామునికిని, జనులకును, పెద్దలకును, భరతునికిని మిక్కిలి ప్రియమైయుండును. ఈ పని చేయుము." అని యాపెను బలుతెఱఁగుల వేఁడెను. చెడ్డతలంపుగలదిగ్గొన కఠినురాలగు నాకైకేయి, కపటము లేక కన్నీరు విడుచుచు వేఁడుకొనుచుండు నెఱ్ఱని కన్నులుగల దశరథుని వింతగ్గొన దిక్కుమాలిన మోడ్పును విని, యాతని మాటలఁ బెడచెవిఁబెట్టి యాప్రకారంబుగఁ జేయని దయ్యెను. అంతట నానృపాలుఁడు కడుదుష్టురాలును, నెదురాడుచుండునదియు నైన కైకేయిం జూచి, తన కొడుకు నరణ్యమునకుఁ బంపవలసి వచ్చినందుకై, మిక్కిలి వగచి, నిశ్చేష్టితుఁడై క్రిందఁబడెను.

ఇట్టి మంచి మనస్సుగల దశరథుఁడు వేఁడి నిట్టూర్పు విడుచు చుండఁగా రాత్రి గడచినది. అంతటఁ దెల్లవాఱఁగా, స్తుతిపాఠకులు రాజుగారిని నిద్ర లేపుటకయి మేలుకొలుపులఁ బాడుచుండఁగా, రాజ

శ్రేష్ఠుఁడగు దశరథుఁడు వానిని మేలుమేలుఫలులు పాడవల దనియాజ్ఞా పించెను.

14-వ సర్గము.

కైకేయి దశరథుల సంవాదము

పుత్రుని నెడఁబాయుటను గూర్చిన వ్యసనముచే నొచ్చినవాఁడై తెలివితప్పి, నేలమీఁదఁబడి పొరలుచుండు దశరథమహారాజును జూచి పాపాత్మురాలగు కైకేయి, "ఓ రాజా! నీవు మొదట వరంబుల నొసంగెద నని ప్రతిజ్ఞచేసి, యా ప్రతిజ్ఞ దప్పుట యను పాపకార్యము చేసితివి, నెందుల కిట్లు దుఃఖముతోఁగూడి నేలమీఁద బరుండుచున్నాఁడవు? మహారాజా! యిది నీకుఁ దగదు. నీవు సత్యముఁ దప్పకుండుటయును మర్యాదను మీఱుట యోగ్యముగాదు. సత్యముఁ దప్పకుండుము. సత్యము తప్పకుండుటయే గొప్ప ధర్మమని ధర్మవేత్తలగు పెద్దలు పలుకుదురుగదా! నీ వాడినమాటను దప్పవని యెంచియే, నేను ని న్నీవరంబుల రెండింటిని నిమ్మని యడిగితిని. తొల్లి మీ వంశములోనివాఁడయిన శైబ్యుఁడను రాజు పావురమును రక్షించుటకై డేగకుఁ దనదేహమును గోసి యిచ్చెద ననిచెప్పి, యట్లు చేసి యుత్తమలోకము నొందెను. ఓ మహారాజా! ఆతఁడొక్కఁడే కాఁడు. విశేషప్రభావముగల యలర్కుఁడు దన్ను వేద వేదాంగములను దుదముట్టఁ జదివిన యొక బ్రుడిబ్రాహ్మణుఁడు కన్నులిమ్మని యాచింపఁగాఁ గొంచెముకూడ వెనుఁదీయక, సంతసముతోఁ దన కన్నులఁ బెల్లగించి యిచ్చెనుగదా! సముద్రుఁడును సత్యముఁ దప్పరాదని యెంచియె, తనయొక్క చిన్న కట్టనుగూడ దాఁటి రాకున్నాఁడుగదా! సత్యమే పర బ్రహ్మమునకు ముఖ్యస్థానము. సత్యమునందే యన్ని ధర్మములు నిలిచియున్నవి. సత్యమే సమస్తవేదములును. సత్యము చేతనే మోక్షము లభించుచున్నది. ఓ రాజశ్రేష్ఠుఁడా, నీవు ధర్మమును బరిపాలింపవలసియున్నదిగనుకను, అందునిమిత్తమై నేను బ్రేరేపించుచున్నాను గాఁబట్టియు నీకు ధర్మమునం దుత్సాహము గలదేని సత్యమునుసరింపుము. నాకిచ్చిన రెండువరంబులు ఫలించుఁగాక. నీవు, వరదుఁడవు గదా! నీ కుమారుఁడగు రాముఁ నడవికిఁబంపుము. మమ్మా

టికిఁ జెప్పుచున్నాను. గొప్ప కులమున జనించిన యో నృపాలా! యీ నా వరంబులను రెండింటిని నెఱవేర్పవేని, నీవు చూచుచుండఁగనే నా ప్రాణములఁ దొఱఁగెదను" అని మొగమోటమిలేని మాటలను జెప్పెను.

అప్పుడు దశరథుఁ డా కైకేయి తెగఁబడి చెప్పిన పలుకులు విని, బలి యింద్రునిచేఁ బ్రయోగింపఁబడిన పాశమును ద్రెంపఁజాలనట్లు, ధర్మ పాశమునుండి విడువఁదల నొండఁజాలనివాఁ డయ్యెను. మఱియు నా దశరథుఁడు కైకేయి కొసంగిన వరముల నొసంగుటకును, రాము నడవికిఁ బంపుటకును జాలక, బండికాఁడికిని చక్రమునకును నడుమనున్న యెద్దు వెరుకకుఁ బోయినఁ గాళ్ళకుఁ జక్రము దగులునని భయపడుచు,ముందుకు నయినఁ గాఁడి యట్లు తాఁకు నని వెఱచుచు నెట్లు పోవను జాలక యుండునో యట్లు రాముని నిష్కారణముగాఁ నడవికి బంపఁజాలకయుఁ, కైకేయివరముల నొసంగకున్న నసత్యదోషంబు వచ్చునని వెఱచుచును, మోమునఁ గళవళపడ్డ, వెల్లికిపట్టినవానివలె నుండెను. ఇట్లు పుడమితేఁడు పరవళములయిన కన్నులచేఁ కైకేయిని బాగుగఁ జూడకయే, యెట్టకేలకు దిటవు వూని, యా కైకేయిం జూచి, "ఓ పాపాత్మురాలా! యగ్ని హోత్రుని సమక్షమున మంత్రములచేఁ బరిశుద్ధమయినయే నీ చేతింబట్టితినో, యా చేతిని, నీతోఁబాటు నాకుఁ బుట్టినవాఁడైనను, నీయందు జనించుటంజేసి, యా భరతుని వదలిపెట్టుచున్నాను. ఓ రాణీ! రాత్రి గడచినది. ప్రొద్దుపొడువఁ బోవుచున్నది. పురోహితులు మొదలగువారు రాముని యభిషేకము నిమిత్తము సకల వస్తువులను దెప్పించి, సిద్ధపఱచి, నన్నుఁ దొందఱపఱతురు. ఓసీ! నేను చనిపోయినతర్వాత, నాకు రామునిచేఁ నుత్తరక్రియలు నడిపింపవలయునే కాని, నీవు రాముని పట్టాభిషేకంబు చెడఁగొట్టుఁ బూనితివేని, నీవు నీ కొమారుని చేత నుత్తరక్రియలు చేయింప నక్కఱలేదు. రామునికిఁ బట్టాభిషేకము జరుగఁబోవుచున్నదని యప్పుడ ట్లానందముతోనొప్పుచుండిన యిప్పు డానందము లేక విచారముతో వెలవెల వోవుచున్నసుఁ తలలువంచుకొనియున్న జనులను మఱల నెట్లు చూడఁగలుగుదును?" అని కైకేయితో మాటాడుచుండునప్పుడె చంద్రునితోను,

నక్షత్రములతోను గూడిన యా పావనమయిన రాత్రి గడచి బాగుగఁ దెల్లవాఁజెను.

అంతటఁ బాపంపు నడవడులుగలదియు, మిక్కిలి నేర్పుతో మాటలాడనేర్చినదియునైన కైకేయి రోషముచే నొడలు దెలియనిదై, రాజును జూచి, "మహారాజా! ఏమిమాట్లాడుచున్నావు? విషము ద్రాగుటచేఁ బుట్టిన వ్యాధివలెఁ బేగులను బెల్లగించెడి మాట లను చున్నావు? క్లేశపడకుండ నీవు రాముని నిక్కడికిఁ బిలిపింపుము. తర్వాత నా కొమరునికిఁ బట్టముగట్టి, రాముని నడవికిఁ బంపి, నన్ను శత్రుపక్షము లేనిదానినిగాఁ జేసి నీవు కృతకృత్యుఁడవు కాఁగలవు." అని పరుషములయిన మాటలఁ జెప్పెను.

ఆ దశరథుఁడు కైకేయి యివ్విధంబునఁ జెప్పిన పలుకులు విని చుఱుకైన చొకుతోఁ గొట్టఁబడిన మేటిగుఱ్ఱమువలెఁ గడు వేగముగఁ బ్రేరణ సేయఁబడినవాఁడై, కైకేయిం జూచి, "ఓసీ, నేను ధర్మమును త్రాటిచేఁ గట్టఁబడి యున్నాఁడను. నా బుద్ధియు నాశనమై పోయి నది. ధర్మమునఁదుఁ బట్టుదలగల నా ముద్దులరాముని నేను జూడఁగోరు చున్నాను" అని కైకేయితోఁ జెప్పెను.

అంతట నా రాత్రి గడచి తెల్లవాఱఁగనే, దయాదాక్షిణ్యాది గుణములతోఁ గూడినవాఁడైన వసిష్ఠమునీంద్రుఁడు శిష్యులతోఁగూడి, యప్పుడు, సామగ్రులనెల్లను గైకొని శ్రేష్ఠమగు నగరము లోపలికిఁ బ్రవేశించెను. అట్లు నగరము లోపలికిఁ బ్రవేశించి, నీళ్ళుచల్లి చక్కఁగా నూడ్చిన వీథులుగలదియు, నచ్చటచ్చటఁ గట్టఁబడి యుండు తెక్కెము లతోఁ బ్రకాశించుచుండునదియు, రాముని పట్టాభిషేకం బెప్పుడు జరుగనున్నదో, యెప్పుడు మన మా వేడుకను జూడఁగలమో యనెడి తహతహతోఁగూడిన జనులచే నిండినదియు, విచిత్రములైన పువ్వులు చల్లుటచే నొప్పుచున్నదియు, లెక్కలేని పూవులదండలచే వెలుఁగుచున్న దియు, సంతోషముతో నిండిన మనుష్యులతోఁ గూడినదియు, సకల వస్తువులతో నిండిన యంగళ్ళుగలదియుఁ జందనము, నగరువు మొద లగు సుగంధద్రవ్యములచే నంతటఁ బొగవేయఁబడినదియునై, స్వర్గ లోకముతో సాటివచ్చునదియును, బ్రాహ్మణులచేఁ నంతటశోభిల్లు

చుండునదియు, నగుపట్టణమునుదాటి శ్రౌతవిధానము నెఱింగిన సభ్యులగు బ్రాహ్మణోత్తములతోఁ బరిపూర్ణమైనదియుఁ, బట్టిణవాసులు, గ్రామవాసులునగు జనులచే వ్యాప్త మయినదియు నైన యంచమగు నంతఃపురంబుఁ జొచ్చి, యచ్చటి జనుల నందఱిని గడచి, కడు ప్రేమతోఁగూడినవాఁడై, లోపలికిఁ బ్రవేశించి, రాజశ్రేష్ఠుఁడగు దశరథుని యంతఃపురంబు వాకిటనిలిచి లోపలినుండి వచ్చెడు సుమంత్రుఁడను మంత్రినిజూచెను. ఎక్కువ తపో మహిమ గల వసిష్ఠుఁడు నేర్పరియైన సూతపుత్రునిఁ జూచి, "ఓ సుమంత్రుఁడా! నే నిచ్చటికి వచ్చియున్నానని రాజుగారి కెఱింగింపుము. ఇవిగో! గంగానదినుండియు, సముద్రములనుండియుఁ దేఁబడిన నీటితో బంగారు కలశములు పట్టాభిషేకమునకై, యత్తికొయ్యతోఁ జేయబడిన శుభాసనము సిద్ధముచేయఁబడినది. నవధాన్యములును, బరిమళద్రవ్యములన్నిఁయు, నానావిధములయిన రత్నములు, తేనె, పాలు, పెరుగు, నెయ్యి, పేలాలు, దర్భలు, పుష్పములు, తేఁబడినవి. సొగసుక త్తెలగు నెనమండ్రు పడుచులు వచ్చిరి. మదించిన మేటి యేనుఁగును, నాలుగు గుఱ్ఱములు పూన్చిన రథమును, తళతళ మెఱయు కత్తియు, మేటి విల్లును, మనుష్యులు మోయునట్టి పల్లకియుఁ, జంద్రునివలె వెలుఁగు చుండు తెల్లని గొడుగును, వింజామరలును, బంగరుగిండియును, బసిఁడి త్రాళ్లతోఁ గట్టిన యెనుము మూఁపుగమునగల తెల్లనిరొద్దును, బలముగల దియు, నాలుగు కోఱలు గలదియు, జూలు గలదియునైన మేటి గుఱ్ఱ ముము, సింహాసనమును, పులితోలును, చక్కఁగా జ్వలించునట్లు చేయఁ బడిన యగ్నిహోత్రమును, సకల వాద్యములును సిద్ధముచేయఁబడి యున్నవి. సొగసుచేసికొన్న స్త్రీలు, వేశ్యలు, ఆచార్యులు, బ్రాహ్మణులు వచ్చియున్నారు. పరిశుద్ధమ్మైన మృగములును, బక్షులును వేచి యున్నవి. పట్టణములలోను బల్లెలలోను నుండువారును దమతము పరివారముతోఁ గూడి వచ్చియున్నారు. వీరు మాత్రమేకాక యనేకులు జనులు వచ్చి, సనసపుంబలుకులు పలుకుచు, మిక్కిలి సంతసము ననుభవించుచు, రాజులతోడ నచ్చి, రాముని పట్టాభిషేక మహోత్సవముఁ జూచుటకై కాచియున్నారు. మహారాజికను కానకాఁడు. సూర్యో

దయుమయినది, ఓ సారథీ! నీవు లోపలికిఁ బోయి, సకల శుభగ్రహంబుల తోను, శుభనక్షత్ర యోగకరణములతోను గూడిన శుభదినమున, సుముహూర్తమున రాముని రాజ్యాభిషేకము జరుగునట్లు మహారాజును వేగిరపఱుపుము." అని సారథితోఁ జెప్పెను. వెంటనే సుమంత్రుఁడు మహాత్ముఁడైన వసిష్ఠమునీంద్రుని మాటలను విని, రాజ శ్రేష్ఠుఁడగు దశరథుని గొనియాడుచు లోపలికిఁ బ్రవేశించెను. సుమం త్రుఁడు ముసలివాఁడును, రాజునకు నెచ్చెలియు నైనందునను, నట్టి సుమంత్రుని లోపలికిఁ బోవుటకుఁ గాని, వచ్చుటకుఁగాని యాటంకము చేయఁగూడదని తమ కుత్తరు వయినందుననను, మహారాజునకుఁ బ్రియ మాచరించు ద్వారపాలకులు సుమంత్రుని నడ్డగింపఁజాలరైరి. సుమం త్రుఁడును ద్వారపాలుర యాటంకము లేక లోపలికిఁజొచ్చి, దశరథమహా రాజు చేరువను నిలువఁబడి, యా నృపాలుని యట్టి వ్యసనావస్థ నెఱుఁ గనివాఁడై, యొక్కువ ప్రేమతోఁ గూడిన మాటలచే రాజును బొగడ దలఁచి చేతులు జోడించి, రాజగృహంబునందుఁ గాలాసుగుణమునగ నివ్విధంబునఁ బుడమిఱేనిని స్తోత్రముచేయుఁ దొడఁగెను. "ఓ నృపాలా! చంద్రోదయంబగుడు, కాంతిగల సముద్ర ముప్పొంగినట్లు, తాము మిక్కిలి సంతసముచే నుప్పొంగుచుఁ బ్రేమాతిశయముతోఁ గూడిన మనస్సుతో మమ్ము సంతోషపఱుపుఁడు. ఈ వేళయంచే దేవేంద్రుని నతనిసారథియగు మాతలి స్తోత్రముచేసెను. కావున నింద్రుఁడు సకల దానవులను జయించెను. అట్లే మహారాజా! తాము శత్రువులను గెలు తురు గాక యని నే నిప్పుడు తమ్ము మేలుకొలుపుచున్నాను. సూర్యుఁడు చంద్రునితోఁ గూడినవాఁడై, సకల భూతములను ధరించియున్న మంగళకరురాలగు భూదేవిని మేల్కొలుపునట్లు నేను నమరిని మేల్కొలుపుచున్నాను. వేదము లంగములతోఁగూడినవై బ్రహ్మను లేపునట్లు నేను దమ్ము లేపుచున్నాను. మహారాజా! మేరుపర్వతము నుండి సూర్యుఁ డుదయించునట్లు నెజ్జనుండి లెండు. లేచి, మంగళ కరములైన కార్యంబులు నెఱవేర్చికొని, సభకు రండు. కకుత్థ్సవంశ మునఁ బుట్టిన యో నృపాలా, సూర్య చంద్రులు, ఇంద్ర, అగ్ని, యమ, వరుణ కుబేరులు తమకు మేలు సేయుదురుగాక. పూజ్యమగు రాత్రి

గడచినది. తెల్లవాఁబనచ్చినది. రాము స్నాతకాహ్నికము లెల్లఁ దీర్పవల యునుగదా! రాజశ్రేష్ఠా! మేలొఁనుఁడు. ఆ వెంబడి చేయవలసిన పనుల నెల్ల జరిగింపుఁడు.

రాముని పట్టాభిషేకమునకుఁ గావలసిన వస్తువు లెల్ల సిద్ధముగఁ దేఁబడియున్నవి. పురనుులో నుండువారు, పల్లెలలో నుండువారు, దేశ దేశములలో నుండువారు వచ్చి చేతులు జోడించికొని యుండఁ బూజ్యుఁడగు వసిష్ఠమునీంద్రుఁడు బ్రాహ్మణులతోడం గూడి, రామె వచ్చి యున్నారు. రాజేంద్రా! రామునకుఁ బట్టాభిషేకము జరుప వేగిరంబుగా నానతీయవలయును. కాఁపరిలేని పశువులవలెను, నాయకుఁడులేని సేన వలెను, చంద్రుఁడులేని రాత్రివలెను, నాఁబోతులేని యావులవలెను రాజులేని రాజ్యము ప్రకాశింపదుగదా" అని సుమంత్రుఁడు దశరథ నృపాలునిఁ బొగడెను.

అంతటఁ బుడమిజేఁడు వేఁడికోలుతోఁ గూడినదియు, నర్థ ముతోఁ గూడినదియునైన సుమంత్రుని మాటలను విని, మఱియ శోకముచేఁ గలవరపడి కన్నీరు విడుచుటంజేసి యెఱ్ఱనైన కన్నులు గల వాఁడయ్యెను. ఇట్లు ధర్మముల నాచరించువాఁడయిన కాంతిమంతుఁడగు దశరథుఁడు కొంతసేపు చింతించి, కొమరునింగూర్చిన సంతసము మానిన వాఁడై, సుమంత్రుని జూచి, "ఓయీ, నీవు మఱియ మాట లను సూదులతో నా మర్మములను బొడిచెదవు" అనెను. సుమంత్రుఁడప్పలు కలు విని, దశరథుఁడు సంతసముఁ దప్పి శోకముతో నుండుటను జూచి, తాను చేతులు జోడించికొని యచ్చటినుండి కొంచె మావలికిఁ బోయెను. అట్లు రాజు దుఃఖముచేఁ దాను సుమంత్రునితో నొక్కమాటయైనఁ, జెప్పఁజాలకపోనఁగా, వెంటనే ఉపాయముల నెఱింగినదగు కైకేయి తానే సుమంత్రునిం గూర్చి "ఓ సూతుఁడా! నృపాలుఁడు రాత్రియెల్ల రామని పట్టాభిషేకముఁ గూర్చిన సంతసముఁదలపోయుచు మేలొఁనియుండి, ఇప్పుడే మంచి నిద్రలో నుండువాఁడు. కావున, సారథీ! నీవు వేగ మేఁగి, కీర్తిమంతుఁడగు రాముని బిలుచుకొనిరమ్ము. నీకు మేలగు. రాజుగా రానతీలేదే యని యీ విషయమున నాలో చింపఁబనిలేదు" అని చెప్పెను.

అట్లు కైకేయి నిలుచనీయక మిక్కిలి వేగరపఱిపఁగా, సుమం త్రుఁడు "రాముఁడు పట్టాభిషేకమునిమిత్తము యిక్కడికి రాఁబోవు చున్నాఁ"డని మనంబునఁ దలపోసి, యొక్కొన సంతోషమునఁ గూడిన వాఁడై, నిడివిచేతులుగలవాఁడగు రాముని జూడఁ గోరి, సమంత్ర మందలి మడుగుం బోలిన సొగసయిన యంతఃపురమునుండి వెలువడలికి వచ్చి, ముందట జనులు క్రిక్కిరిసిరాఁగన్న వ్యాక్షేపమును బొంది, వ్యాక్షేపము ముందట నిలిచి, నానా దేశములనుండి రాఁగల వర్తమానమును, రాజులను గైకొనివచ్చి నిలఁబడియున్న రాజాళిని, భృత్యామాత్యులఁగు జనులను జూచెను.

15-వ సర్గము.

సుమంత్రుఁడు రాముని బోడ్కొని రాఁబోవుట

వేదములఁ దుదమొట్టఁ జదివినవారలైన బ్రాహ్మణు లంసత్రా త్రిగడపి, రాజపురోహితుఁడగు వసిష్ఠునితోఁ గూడి, సభకు వచ్చి చేరిరి. మంత్రులలో ముఖ్యులును, సేనానాయకులును, పట్టణము లోపలి పెద్దలును ముదము నందినవారలై రాముని పట్టాభిషేకమును జూడ నచ్చటఁ జేరిరి. సూర్యోదయమునయిన పిమ్మటఁ బుష్యమీనక్షత్ర మునందు రామునియొక్క జన్మలగ్నముగు కటకమునందు బ్రాహ్మణోత్త ములు రాముని పట్టాభిషేకంబు జయప్రదుఁడు గావలసిన నక్షత్రంబుఁ దెచ్చి సిద్ధపఱిచిరి. నీళ్ళతోనిండిన బంగారు బిందెలును, చక్కఁగా నలంకరింపఁబడిన సింహాసనంబును, మెఱుఁగుచుండు పులితోలు లెస్సగాఁ బఱిచిన రథమును బ్రకాశింపుచుండినవి. గంగానదిలోను, యమునా నదిలోను సంగమించు పుణ్యస్థలమునుండియు, మడుగులనుండియు, బావులనుండియుఁ దేఁబడిన జలములతోఁ నిండిన కలశములు సిద్ధమయి వెలఁదులు చుండినవి. తూర్పువైపు ప్రసరిం బొఱుసవియుఁ, బైకిఁ బొఱుసవియు, నడ్డముగాఁ బొఱుసగింపును వైన వదుల నన్నింటినుండియు, సముద్రము లన్నిటినుండియుఁ దేఁ బడిన జల మచ్చట వెలయుచుండెను. లాజలతోఁ గూడినవి, పాలుగల రావి యాకులచేఁ గప్పఁబడినవియునైన బంగరు వెండియుయములైన కలశ ములు పావనజలముతో నిండినవై, తామరలతోను గలువలతోను గూడి

ప్రకాశించుచుండినవి. నటీనటులు నట్టువండ్లు చేసిరి, పాలు, పెరుగు, నెయ్యి, లాజలు, పుష్పములు సర్వమును చేయబడి యుండినవి సొంపగు నడకగల వేశ్యలును సకలభూషణములచే నలంకరింపబడిన యా సభలో నుండిరి. చందనసారంబులచే మిక్కిలి తెల్లనైనదియు, రత్నములు చెక్కిన బంగారుపీఠి గలదియు నైన రామునిపట్టాభిషేకమునకై మేటి చామరము సిద్ధముగా నుంచబడినవి. చంద్రమండలము వంటి తెల్లని కాంతిగల దియు, పరిమళంబారిన శాంతని గలుగజేయునదియు నైనగొడుగు పట్టాభిషేకము నిమిత్తము మిక్కిలి సిద్ధముగా నుంచబడియుండెను. తెల్లనియుద్ధగును, తెల్లనిరత్నమును దెప్పింపబడియుండినవి. మహ జలము గార్చునున్నదియును, శాంతిగలదియు, రాజు లెక్కించదగినదియు నైన రత్నసింహాసనము సిద్ధముగా దెప్పింపబడియుండెను. బంగళాకార్తి ముల చే నుండుచు సిగనవారిచేను, సకలభూషణములచే నలంకరింపబడిన వారు నైన యొనమండుగురు పడుచులు రాముని పట్టాభిషేకము నిమిత్తమునచ్చి కొచిగుండిరి. సకలసిద్ధములో యిన వాద్యములును సిద్ధపఱుపఁబడినవి. స్తుతిపాఠకులును, మంత్రియు నసేవకులు రాముని పట్టాభిషేకము నెదుకు చూచుచుండిరి. దశరథుని యానతిగొనిన రాజు లందఱును, ఇక్ష్వాకునంశస్థులగు రాజులచే బట్టాభిషేకమునకై వారల యాచారము చొప్పునఁ గానబడిన మంచి మంచి వస్తువుల నెట్లు చెప్పఁబడియునో, యట్లు రామునిపట్టాభిషేకమునకుఁ గానఁబడిన వస్తువులనెల్లను జేర్చి గొనుచు, యథాన్యాయముగుండుటఁ గలిసినవారల్లె, దశరథునిచూచి రాజునకు మ్రొక్కి, "ఈ సుకృతకార్యమున్నవారు రాజున కెట్లు చెప్పఁగింతురు? రాజును గానుకొన్నాము. ప్రొద్దుపొడిచినది. రామునిపట్టాభిషేకమునకుఁ గావలసిన సామగ్రులన్నియు సిద్ధముచేయఁబడినవి" అని తమలోఁ దా మనుకొనుచుండఁగా, రాజుగారి మన్ననఁ జెందిన సుమంత్రుఁడు భూమండలమెల్ల నేలెడు చక్రనర్తులం జూచి, "నృపాలులారా, రాజు గారి మనసెఱిఁగిన వేగిరంబుగ రాముఁడు దోడ్కొనిపోవ వచ్చితిని. తాము దశరథునిచేతను, విశేషముగా రామునిచేతను బూజనేయుఁ దగిన వారలుగదా! దీర్ఘాయుస్సులుగల మీరు సుఖముగా వచ్చిన సంగతివి రాజుగారితో నే నిటిగో మనవిచేసెదను" అని చెప్పి వెనుకకు మఱి

లెను. రాజుల పూర్వీకుల చరిత్రముల నెఱింగిన సుమంత్రుఁడు వారితో నిట్లు పలికి, రాజుగారి యంతిపురంబు వాఁకిటికిఁబోయి, తలఁచినప్పుడు లోపలికిఁబోవ వీలగు రాజు నగరులోనఁ బొంచ్చి, యపుడు పుడమిఁజేఁడగు దశరథమహారాజుగాని వంశావళిని బొగడెను. అట్లు పొగడుచు,దశరథనృపాలుని పడకగది చేరువకుఁబోయి యచ్చటనిలిచెను. ఆ సుమంత్రుఁడు పడకగదిని నడుమ తెఱలేకుండునంత దాపునకుఁ జేరి, సుగుణములతోఁ గూడిన దశరథుని దీవనలు దీవించి, యివ్విధంబునఁ బొగడెను. "ఓ కకుత్థ్సవంశమందుఁ బుట్టిన దశరథమహారాజా! సూర్య చంద్రులును, ఇంద్రుఁడు, అగ్ని, యముఁడు, వరుణుఁడు, కుబేరుఁడు, ఈశానుఁడును తమకు విజయముఁ గలిగింతురుగాక! రేయి గడచినది. తమరి రేయి చేయవలసిన పనులనెల్లఁ జేసి ముగించితిరిగదా. నృపశ్రేష్ఠా! మేలుకొని చేయవలసిన పనిని జేయుఁడు. నృపాలా! బ్రాహ్మణులును, సేనాధిపతులును, పట్టణములోని పెద్ద లందఱును వచ్చి తమరాక కెదురు చూచుచున్నారు. రఘునందనా! మేలుకొనుఁడు" అని యాలోచనలో నేర్పరియైన సారథియగు సుమంత్రుఁడు స్తోత్రము చేయుచుండఁగా, దశరథనృపాలుఁడు మేలుకొని సుమంత్రునిఁగాంచి "ఓ సారథీ! రాముని దోడ్కొని రమ్మని యీకైకేయి నీతోఁ జెప్పినదిగదా. ఆ యాజ్ఞ నాయాజ్ఞయేకదా. ఏల యా ప్రకారము చేయవయితివి? ఇట్లు కైకేయి యాజ్ఞను మీఱుటకుఁ గారణమేమి? నేను నిర్ధారచెంప లేదు. నేను మేల్కొనియె యున్నాను. రాముని వెంటనే తోడ్కొనిరమ్ము" అని తానే యుత్తరు విచ్చి పంపెను.

అంత సుమంత్రుఁడు రాజుగారి యానతిని శిరసానహించి, యా దశరథనృపాలునికి నమస్కరించి, యేమియో గొప్పమేలు గలుగఁబోనున్నది యని తలఁచుచు, రాజుగారి యింటనుండి వెడలి, మీఱిన ముదంబుతోను, చింతలేకయుఁ, బులకలు చెందినవాఁడయి, రాజమార్గంబునఁ బోవుచు, జనులందఱు సంతోష రోమాంచములతోడఁ గూడి రాముని పట్టాభిషేకమును గూర్చి చెప్పుకొనుచున్న కథలను వినుచు, కైలాసశిఖరమంత యెత్తు గలదై యింద్రుని భవనమురీతిఁ దనరి యందమువంటి యందముఁగలిగియున్న రాముని నగరు చూచెను. ఆ రాముని

గృహాము గొప్పతనపులు గలదియు, నూటుల కొలఁది తిన్నెలుగల దియు, బంగారు ప్రతిమలు చెక్కిన ముఖ్యములయిన కొనలుగలదియు, రత్నములు, పగడములు గూర్చిన తోరణములు గట్టినదియు, శరదృతువునందలి, తెల్లని మేఘముల కాంతివంటి కాంతిగలదియు, వెలుతురు గలదియు, మేరుపర్వతంపు గుహనుబోలినదియు, శ్రేష్ఠము లయినమణుల హారములచేత నలంకరింపఁబడినదియు, నుత్తమములచేఁబట్టఁబడినదియుఁ, జందనము, నగరు వీనిచే ధూపము వేయఁబడినదియు, దర్దరపర్వతము యొక్క శిఖరమువలె మనంబుల నాకర్షించు సువాసనలను పరిజిమ్ముచున్నదియు, విశేషముగాఁ గూయుచున్న బెగ్గురుపక్షులయొక్కయు, నెమళ్లయొక్కయుఁ గూఁతలచేఁ బ్రకాశించుచున్నదియు, లెస్సగాఁదీర్పఁబడిన తోడ్తో ప్రతిమలతోను, వజ్రంగులచేఁ జేయఁబడిన సూక్ష్మము లగు చిత్రపుఁ బనులతోను నంతటఁ గూడినదియు, చుట్టుకగు కాంతిచే జంతుపులయొక్క మనస్సును గన్నులను నీడ్చునదియు, సూర్యచంద్రులంబోలె వెలుఁగుచుండునదియుఁ, గుబేరుని నగరంబోలినదియు, దేవేంద్రుని గృహాముస కీడయినదియుఁ, బక్షులగుంపు లనేకములతోఁ గూడినదియు, మేరు శిఖరమువంబోలునదియుఁ, జేతులు గట్టికొని చేరువను నిలఁబడియున్న జనులతోను, కానుకలను గైకొని, పల్లెలలోనుండివచ్చి పట్టణమంతయుఁ గ్రమ్ముకొని, రామునిపట్టాభిషేకవార్తను వినుటచే నెక్కువ సంతసమును బొంది మోములెత్తి చూచుచున్న జనులతోను వెలుఁగుచున్నదియు, గొప్ప మేఘుంబుయొక్క యాకృతినిబోలు నాకృతి గలదియు, మిక్కిలి యుత్తయినదియు, నక్కఁగ నలంకరింపఁబడి యుండునదియు, నానావిధంబులగు రత్నములు చెక్కినదియు, గూనివాండ్రతోను, సన్ననిరూపు గలవారితోను గూడినదియునై యుండెను. సుమంత్రుఁడు జనులచే నిండియున్న రాముని నగరు చూచుచుఁ, బైకప్పుగలదియు, గుట్టములు వూన్చినదియునైన రథంబును రాముని నగరునకుఁ దోలుకొనిపోవుచు నా పట్టణంబునందలి జనుల హృదయములను సంతోషపఱిచెను. సారథియగు సుమంత్రుఁడు దెక్కుచ వైభవంబుతోఁ గూడినదియు, నెమళ్లయొక్కయు, జింకలయొక్కయు, గుంపులతో నిండినదియునై శచీపతియగు నింద్రుని గృహాంబుం బోలియున్న రాముని

నగరులోపలఁ జొచ్చి, యావేడుకను జూచి, మేనఁ బులకలు గలవాఁడై కైలాసముం బోలినవియై, స్వర్గమును బురుడించునట్టి యలంకృతములైన ద్వారములుదాఁటి, రాముని యిష్టమును నెఱవేర్చుచు నతని సన్నిధానంబున నున్న వారి నందఱిని వెనుకనుఁ ద్రోచి, యంతిపురము చేరువకుఁ జేరెను. అచ్చట జను లందఱు సంతోషభరితులై, రాముని పట్టాభిషేకములను గూర్చియుఁ, దమకందఱికి మేలు గలుగుటను గూర్చియుఁ బాడుకొనుచున్న మాటలను విని, యట్లు కొంతదవ్వుఁగి, పక్షులతోను మృగములతోను గూడినదియు, మేరుశిఖరంబునఁబోలె నున్నత్తమైనదియు, దేవేంద్రుని నగరుమాడ్కి వెలుఁగుచున్నదియు, తన కాంతిచే వెలుఁగుచుఁ జూచువారి మనసు నీడ్చిపట్టునదియుఁ, గానుకలను గైకొని పల్లెల నుండి కోట్లకొలఁదిగ బండ్లమీఁదను గుఱ్ఱములమీఁదను నెక్కివచ్చి, వాని నక్కడ నుండి నగరుమందటఁ జేతులు గట్టికొని నిలఁబడియున్న జనులచే నిండినదియునైన ద్వారంబుఁ జూచెను. ఆ వెంబడే గొప్ప మేఘమును, గొండను బోలినదియు, మదించి, యంకుశమునకు లోఁబడనిదై యొకులచేఁ బట్టుట కలవికానిదియు, గొప్ప దేహాముగలదియు, రమ్యమయినదియునైన శత్రుంజయమను పేరుగల రాముఁ డెక్కెడి యేనుఁగునుజూచెను. మఱియు రాముని యంతఃపురమునుచుట్టును గుఱ్ఱములు, ఏనుఁగులు, రథములును జక్కఁగ నలంకరింపఁబడి యచ్చటఁ గట్టఁబడి యుండినవి. మఱియు సేనలు, మంత్రులును, జనులు నంతటఁ గూడి, పోవుటకు సందులేక నిలఁబడియుండిరి. అప్పుడు సారథియగు సుమంత్రుఁడు వారిసందరిని తొలఁగఁద్రోసికొనుచు, సకల సంపదలతోఁ నిండియున్నదియుఁ, బర్వత శిఖరముతోను, కదలని మేఘుంబుతోను సాటియైనదియు, గొప్ప దోడంతస్తుల మేడలతోఁ గూడినదియునైన రాముని నగరులోపల, రత్నములతో నిండిన సముద్రమునందు మొసలి ప్రవేశించినట్లు ప్రవేశించెను.

16-వ సర్గము.

సుమంత్రుఁడు రాముని దోడ్కొనివచ్చుట

పురాతన రాజచరిత్రములనెల్ల నెఱింగిన యా సుమంత్రుఁడు జనులు నిండియున్న యా యంతఃపురంబు వాకిలి దాఁటి, బల్లెములను

విండ్లను దాల్చినవాడలై, మేలయిన కుండలములు వేసికొని దేహము పాటులేక, యదే మనస్సుపెట్టి కావలి కాచుచున్నవారును, రాముని యందు మిక్కిలి ప్రేమగలవాడునగు యీవన పురుషు లుండునట్టి యేకాంతమైన తొట్టికిట్టును జేరెను. అట్లు చేరి యచ్చటఁ గావిరంగు గల బట్టలుదాల్చి, బెత్తములను జేతఁ బూని, చక్కని దుస్తులను దొడిగికొని, మిక్కిలి జాగ్రత్తతో ద్వారమునఁ గావలియున్న ముసలి వాండ్రగు సంరక్షపురంపుఁ గావలివారిని జూచెను. ఆ కావలివాండ్రును, ఆ సుమంత్రుసిఁ జూచినంతటనే, రాము రాముసికి మేలుచేయుఁగోరు వారు గావున నందఱును దత్తరపాటుతోఁ గూడి తమతమ యాసన ములనుండి లేచి నిలఁబడిరి. సరసుఁడయిన యా సుమత్రుఁడు వాకిట నిలఁబడియున్న యా రక్షకుల సుట్టేశించి "ఓ ద్వారపాలురారా! మీరు లోపలికిఁ జని, "సుమంత్రుఁడు వచ్చి వాకిటనున్నాఁడు" అని రాముసికి వేగిరమె తెల్పుఁ"డని చెప్పిపంపెను. వారును రాముసికి మేలుగోరు చుండుటా రగుటఁజేసి, రాముని సన్నిధికిఁ జని, యా రాముఁడు సీతయు నుండఁగా, వారితో నీ సంగతిని వెంటనే తెలిపిరి. అట్లు "సుమంత్రుఁడు వచ్చియున్నాఁడు" అని చెప్పినంతటనే రాముఁడు తన తండ్రియొక్క యాంతరంగిక ప్రియుఁడయిన యా సుమంత్రుని దన తండ్రి కిష్టముగావింపఁగోరి లోపలికి రమ్మని యానతిచ్చి పిలిపించెను. ఆ సుమంత్రుఁడు ద్వారపాలుర యనుమతిని గొని, లోపలికిఁ జని, చక్కని బట్టలు ధరించిన వసిఁడి మయంబైన మంచముపైఁ గూర్చుండి, యడపిపిండులవర్ణము రీతిని నెట్టినైనదియు, సువాసనగలదియునైన మంచి గంధమునఁ బూసికొన్నవాఁడై, ప్రక్కన సీల్చుండి, చామర ములు వేయుచున్న సీతతోఁగూడి చిత్రానక్షత్రముతోఁ గూడిన చంద్రునిమాడ్కిఁ బ్రకాశించువాఁడును, చక్కని భూషణములను దాల్చినవాఁడును, గుబేనునితో సాటియైనవాఁడునగు రాముని జూచెను. అట్లు చూచి, యడఁకువ యిట్టిదని యెఱింగినవాఁడయిన వందియగు సుమంత్రుఁ డడుంకువతోఁ గూడి, తనకాంతిచే సూర్యుని మాడ్కి వెలుఁగుచున్నవాఁడ వరంబుల నొసంగునట్టి రాముసికి మ్రొక్కులిడి, రాముసిచే మర్యాద నొందినవాఁడై, చేతులు జోడించి

కొని, రామునింగూర్చి, "నృపాలపుత్రా! నీవు సుఖంబుగా విహారించుచుఁ బరుండుచుఁ గూర్చుండు చున్నావుగదా" యని రాముని క్షేమం బరసెను. అట్లు రాముని కుశలమడిగి "కౌసల్యానందనుఁడవగు రామ చంద్రా! తండ్రిగారు దేవేరియగు కైకేయి యంతఃపురమున నున్నారు. వారికువ్వరు నిన్నుఁ జూడఁగోరియున్నారు" అని సుమంత్రుఁడు రామునితోఁ జెప్పెను. ఇట్లు సుమంత్రుఁడు చెప్పిన మాటలు విని, మిక్కిలి తేజస్వియగు పురుషశ్రేష్ఠుడునయిన రామునుఁడు మిక్కిలి యానందమునొంది, పులకలుఁగలవాఁడయి, యా సుమంత్రుని మర్యాద చేసి, సీతను జూచి "దేవీ! రాజును రాణియు నాపట్టాభిషేకముం గూర్చి యేదియో యాలోచిఁచుచున్న ట్లున్నది. కాంతా! యా మెకడు నేర్పు కత్తె యగుటంజేసి, రాజున కిష్టమగు కార్యమును జేయఁగోరినదై, రాజుగారి యభిప్రాయంబు గనునించి పట్టాభిషేకముం గూర్చి రాజును బ్రేరేపించుచున్నట్లున్నది. కేకయరాజకూఁతురగు కైకేయి సవతితల్లి యైనను దల్లియనియే చెప్పవచ్చును. ఆమె నాకు సర్వదా మేలునే కోరుచుండునది. ఆమె యందఱితోను గలసి మెలసి యుండునది. కావున నా పట్టాభిషేకవార్తను వినినంతటనే, మిగుల నానందముఁ జెంది, మహారాజును ద్వరపెట్టె నేమో! మహారాజును దేవేరియగు కైకేయియు నాకు సంపదలను గోరికలను గలుగఁ జేయునట్టి సుమంత్రునిఁ బంపుట నాయొక్కయదృష్టమే కదా! అచ్చట నెట్టివారు గూడి యున్నారో, అట్టిమంత్రియె యిక్కడి కేతెంచెను. ఇది నిజము. ఇప్పుడే మహారాజునాకుఁ బట్టాభిషేకంబు జరుపును. ఆహా! వేగిరంబుగ నిచ్చటి నుండి తరలి రాజుగారి దర్శించెదను! నీవు చెలిక త్తెలతోఁగూడి సుఖముగ విహరించుచుండుము" అని చెప్పెను.

ఇట్లు రామునిచే గారవింపఁబడినదై, సీత తన భర్తకు మేలు గలుగవలె నని కోరుచు వాకిలివఱకును వెంబడించిపోయి, "బ్రహ్మ దేవేంద్రునికి స్వర్గరాజ్యము నొసంగినట్లు, రాజుగారు యాగంబు చేయ నర్హత గలిగించునట్టి బ్రాహ్మణులను ముందిడికొని రాజ్యమును తమవళంబున నుంచఁదగుదురు. దీక్షవహించి, నియమముతోఁ గూడి, మేలయిన కృష్ణాజినంబు ధరించి, బింకికొమ్ము చేతఁ బూట్చియున్న

మిమ్ముఁ జూచుచు సేవించుచున్నాను, తమకుముందట నింద్రుఁడును, కుడి ప్రక్కను యముఁడును, వెనుకప్రక్కను వరుణుఁడును నెడమ ప్రక్కను గుబేరుఁడును రక్షింతురు గాక!" అని భగవంతుని ధ్యానించెను. అంతట రాముఁడు సీతను లోపలికిఁ బొమ్మని యానతిచ్చి, తాను బట్టాభిషేకమునకుఁ గావలసిన యలంకారములను దాల్చిన వాఁడై సుమంత్రునితోడఁ దన నగరునుండి బయలుదేరెను. పర్వతము యొక్క గుహలోఁ బసుండియున్న సింహము పర్వతమునుండి వెడలునట్లు, రాముఁడు తన మేడనుండి బయలువెడలి, వెలుపలికి వచ్చి వాకిట నడుఁకుపతోఁ జేతులు గట్టి నిలఁబడియున్న లక్ష్మణునిఁ జూచెను. అచ్చటి నుండి నడిచిట్టునకు వచ్చి చెలికాండ్ర నందఱిఁ గూడి, పట్టాభిషేకంబు చూడఁగోరి వచ్చి యచ్చటనున్న వారి నందఱిఁ జూచి, వారితోఁ గలిసికొని, వారి యందఱి క్షేమములను విచారించి వెండియు, వ్యాఘ్రి చర్మము పఱిచినదియు, బంగారు మయమునునై వెలుఁగుచుండుటంజేసి, యగ్నిహోత్రునిం బోలియున్న యరదంబెక్కెను. అట్లు రాముఁడును, ఉజ్జ్వలమువంటి చప్పుడు గలదియు, విశాలమయినదియు,రత్నములచేతను, బంగారముచేతను నలంకరింపఁబడినదియు, సూర్యుని కాంతింబోలు కాంతి గలదై, తన కాంతిచేఁ గన్నులు మిఱుమిట్లు గొల్పునదియు, నేనుఁగు గున్నలంబోలు గొప్ప గుఱ్ఱములం బూన్చినదియును నైన యరదమును, దేవేంద్రుఁడు వేగముగఁ బోఁగల గుఱ్ఱములఁ బూన్చిన యరద మెక్కినట్లుగా నెక్కి, సారథి వెలుఁగుచు వేగఁ బయనమాయెను. ప్రకాశమానుఁడగు రాముఁడు చదల మ్రోగుచున్న మేఘముమాడ్కి దిక్కులన్నియు మ్రోగించుచు, మహేంద్రపర్వతమునుండి చంద్రుఁడుదయించునట్లు తన నగరునుండి బయలు వెడలెను. లక్ష్మణుఁడును రాముని వెనుకగా నరదంబునఁ గూర్చుండి, గొడుగుపట్టుచుఁ జామరము వీచుచు నన్నను గాచుచుండెను. అట్లు రాముఁడు నగరునుండి వెడలినంతనే జనులందఱు వెంబడించి వచ్చుచు, గొప్ప రొదపుట్టించిరి. ఆ రాముని వెంబడిని, గొందఱు రౌతులును మేటిగుఱ్ఱముల నెక్కియుఁ, గొందఱు భటులు కొండలకు సరివచ్చు గొప్ప యేనుఁగుల నెక్కియు, నప్పుడు నూఱులకొలఁదిగను, వేలకొలదిగను పోయిరి.

ఆ రామునికి ముందఱ గవచములం దొడిగినవారును, చంగవసము, అగరు గంధము పూసికొన్న వారును, కత్తులను గొడ్డండ్లు బట్టినవారైన కోసలరాముని మేలుగోరు భటులు కొందఱు నడచిపోయిరి. అప్పుడు దారిలో వాద్యముల ధ్వనులును, బట్టలయొక్క పొగడ్తల శబ్దములును, కోసలయొక్క సింహనాదంబులును వినబడ్డచుండెను. శత్రుసంహారియగు రాముడు మార్గమున వచ్చునప్పుడు దవ్వులనే కాంత లెల్ల సొమ్ములు దాల్చి, చులంగాములు జేసికొని మేడమీది కిటికీలలోఁ గూర్చుండి, పుష్పవర్షములు మీఁద జల్లఁగా నూనిన వైఖరిం జూచుచుండిరి. మఱియు, జక్కనైన యంగములుగల చెలువలందఱు రాముని సంతోషపఱుపఁగోరి, కొందఱు మేడలమీఁదనుండి, కొందఱు క్రిందనుండి తీయని కలుగులతో నిక్రింది విధంబునఁ బొగడ్తలఁ జేసిరి. "తల్లికి సంతసము గలిగించువాఁడా! నీ తల్లియు కోసలయు నిన్నుఁ జూచి కడు సంతసము నొందుచున్నది. నీవు సోపు మని యుగునుగాక! నీవు వంశపరంపరగా వచ్చెడు తండ్రి రాజ్యమును నొందినవాఁడవై యుండఁగా, నిన్ను జనులు చూడ నున్నారు" అని రాముని బైర కాంతలు పొగడుచుండిరి. మఱియు నా మనుజులు రాముని కాంత యగు సీతను మగువ లండఱకంటె ముత్తమురాలిగాఁ దలఁచి, ఆ సీతా దేవి, పూర్వజన్మఁబున నిజముగా గొప్ప తపంబు జేసి యుండఁగలదు. అటు గాకున్న, రోహిణి చంద్రునితోడనట్లె, త్రిలోకపూజ్యుఁడగు రామునితోడఁ గూడిక యీ సీత కబ్బునే" అని తమలోఁ దాము మెచ్చు కొనుచుండిరి. నరశ్రేష్ఠుఁడయిన రాముఁడు రాజమార్గం బందున్న, మేడల కొనలపైఁ గూర్చుండిన జనవరాంగ్రు చెప్పెడి యింపులయిన మాటలను వినెను. "ఓ చెలులారా! యిదిగో రాముఁడు నేఁడు దశరథుని యను గ్రహంబువలనఁ బుడమిని బొందఁగలవాఁడై రాజ్యలక్ష్మిచే నెలుఁగు చున్నాఁడు. సకల సుగుణ సంపన్నుఁడయిన యీ రాముఁడు మనకు రాజుగాఁగలఁడు గాన మన కోరిక్కలన్నియు నీడేఱట్లు తలంపుఁడు. మన కేకొఱతయు లేదు. రాముఁడు రాజ్యంబునొంది చిరకాలమును పరిపాలించుచుండుట యీ జనుల కొక్క గొప్ప లాభమేకదా. రాముఁడు రాజ్యంబునకు వచ్చినేని, జనులలో నొక్కఁడును నెప్పుడును

గొంచెమయినను గీడు గొంచదు. దుఃఖమును గాంచదు" అని దేశ దేశములనుండి వచ్చిన జనులను, మహాసంతోషముతో జెందియున్న పుజనులు దమ్మిగూర్చి చెప్పుకొనుచున్న పలుతెఱంగులగు మాటలను కాకుత్థుడు విని.

ఇట్లు రాముడు ధ్వనులుచేయుచున్న గుఱ్ఱములతోను నేనుఁ గులతోను గూడి, ముందుపోవుచుండు స్వస్తికులు, సూతులు, మాగధులు నవనెడి వారిచే బొగడఁబడుచు, శ్రేష్ఠములగు వాద్యములధ్వనుల వాలించుచుఁ గుబేరునివలెఁ దేజరిల్లుచుఁ బోయి, యాఁడేనుఁగులు, ఏనుఁగులు, గుఱ్ఱములు, రథంబులు క్రిక్కిరిసియుండునదియు, జనులచే ముంగలి ప్రదేశములు గలదియు, విస్తారములయిన రత్నములును, నానావిధములగు విక్రయింపఁదగిన వస్తువులును గలిగినదియునై, కన్నులపండువొసఁగ గావించుచుండు గొప్ప రాజమార్గము జూచెను.

17-వ సర్గము.

{ రాముఁడు సుమంత్రునితోడఁ గైకేయి యంతఃపురమున దశరథునిఁ జూడఁబోవుట }

ఎక్కడ నా శోభగలవాఁడై యుండు రాముఁడు తనమేలు గోరెడి మిత్రుల సందఱిని సంతోషపఱిచుచు, నరదమెక్కి, లెక్కెములతోఁ గూడియుండి, మేలైన యగురుచే ధూపనము వేయఁబడినదియుఁ బట్టాభిషేకము నిమిత్తము సచ్చిద్రకుంభము జనులచేఁ గ్రిక్కిరిసి యుండునదియునైన యయోధ్యాపురమునఁ జూచి, యందు శరత్కాల మేఘముల వలెఁ దెల్లనైన మేడలతో నొప్పారుచుండునదియు, గంధపుఁ జెక్కలు, మేలి యగురుచెక్కలు, తక్కిన సుఖాసనగల ద్రవ్యములు, తెల్లని పట్టుబట్టలు, భూషణములగు పట్టుబట్టలు, బెజ్జములేని మిత్తెములు, సూచ్ఛనులేని మేటి స్ఫటికములు, నానావిధంబులగు భక్ష్యములు, పలుతెఱంగులగు విక్రయవస్తువులును గలదై పేరుగుచు నాకాశమునఁ గల స్వర్గలోకమును బోలియున్నదియు, పెరుగు, పాలు, అక్షతలు, నెయ్యి, లాజలు, అగురుచెక్కలయుఁ, జందనపుఁ జెక్కలయు పొగలు, సకల విధములైన పుష్పమాలికలు మున్నగువానిచే నెల్లపుడు

నలంకరింపఁబడిన నడిమి ప్రదేశములు గలదియు నయిన రాజనీథిబయలు దేఱెను.

అట్లు రాముఁడు రాజమార్గమునఁ దనమేలు గోరెడి మంచి మనస్సుగల పెద్దలు నేసెడి యనేకములగు నాశీర్వాదములను వినుచు, వారికిఁ దగినట్లు ప్రతిమర్యాదలు నేయుచు, నందఱి జనులను బలుక రించుచుఁబోయెను. అప్పుడు జనులందఱు గుంపుగూడి, రాముని గూర్చి, "ఓ నృపాలసూనుఁడా! మీ తాతలు, ముత్తాతలు నెట్లు రాజ్యముచేసిరో, యట్లె నీవును నిప్పు డా రాజులమార్గముల నాదరించి, యీదారియం దున్న వాఁడవై మమ్ముఁ బాలింపుము. మీ తండ్రియు, మీతొల్లింటి తాత ముత్తాతలును మమ్ము నెట్లు సంతసపఱిచిరో, అట్లే నీవును న్యాయపరిపాలనము జేయుచు మమ్ము సంతోషపఱిపుము. మా కిప్పుడు భోజన మక్కఱలేదు. మాకు స్వర్గము మొదలగు సుఖము లక్కఱలేదు. రాముఁడు పట్టాభిషేకము చేసికొని వచ్చుచుండఁగా మేము చూడఁగోరి యున్నాము. పరాక్రమశాలియగు రామునికి నడువబోవుఁ బట్టాభిషేకంబు చూచుటకంటె మాకుఁ బ్రియమైనది యొక్కటియు లేదు" అనితమలోఁ దామనుకొనుచుండిరి. ఇట్లు రాముఁడు తన్నుఁ గూర్చి పొగడుచుండు మాటలను, మఱి యనేకములయిన మాటలను మౌనముతో వినుచు నాపొగడ్తల కుబ్బక, రాజమార్గమునఁ బోవుచుండెను. పురుషశ్రేష్ఠుఁడయిన యా రాముని దెసనుండి యే మను ష్యుఁడును దన మనస్సునుగాని, కన్నులనుగాని మఱలింపఁజాలఁడయ్యె. అంతియకాక, వీథియం దా రాముఁడు దాఁటిపోయినను, నొక్కఁడయి నను తన దృష్టిని మఱలింపఁ జాలకుండెను. ఎవఁడు రాముని జూడ లేదో, రాముఁ డెవనిని జూడలేదో, అట్టి పురుషుని జను లెప్పుడు నిందింతురు. ఒక రననేల? అట్టివాఁడు తనకుఁ దానే "ఛీ! యీ నాజన్మ మేల? నేను రాముని జూడనయితినిగదా"యని తలంచుచుండును. ధర్మ ములను నడపించు స్వభావముగల యారాముఁడు బ్రాహ్మణాదులగు నాలుగు వర్ణములయందు దయ యుంచును. కావున బాల్యము, ప్రాయము, కౌమారము, ముదిమియను నాలుగవస్థలలో నుండువారును నా రాము ననుసరించియే యుందురు. ఇవ్విధమున రాముఁడు జనుల

ప్రేమకుఁ బాత్రుఁడగుచు, నాలుగుదారులు కలియుచోట్లను, దేవళంపు దారులను, రచ్చపట్టుల సభా మంటపములను బ్రదక్షిణముగాఁ జుట్టి కొని, మేఘముల గుంపువలెను, కైలాసశిఖరమువలెను దెల్లఁగఁ బ్రకాశించుచుండునట్టియుఁ, దెల్లని విమానముల మూఁడ్కి నాకాశమును గప్పుకొని యున్నవియునైన నెత్తయిన మేడలతోడను, రత్నములచే నలంకరింపఁబడిన వర్ధమానము లనెడి గృహములతోడను గూడినదై, లోకమందలి రాచనగళ్ళలోపల మిక్కిలి శ్రేష్ఠమైనది గనుకనే దేవేంద్రుని గృహమును బురుడించుచుండు తండ్రిగారి నగరు సొచ్చి, మూఁడు తొట్టికట్లు రథమునఁ గూర్చుండియె, రౌతులు, విలుకాండ్రుఁ జుట్టును గానలి యుండఁగా దాఁటి, తక్కిన రెండు తొట్టికట్టులందును రథమునుండి దిగి, కాలినడకమీఁదనే పోయెను. అట్లు శ్రీరాముఁడన్ని తొట్టికట్లను దాఁటి, తనవెంబడి వచ్చినవారిని వెనుకకుఁ బంపి, తా నొక్కఁడే యంతఃపురమును బ్రవేశించెను. రాముని చే వారి యిండ్లకుఁ బంపఁబడిన జనులందఱు "రాముఁడు పట్టాభిషేకము నొందిన వాఁడై, యెప్పుడు మఱలివచ్చునా" అని, సముద్రము చంద్రోదయంబును గోరునట్లు, రాముని రాక కెదురుచూచు చుండిరి.

18-న సర్గము.

కైకేయి రాముని నడవికిఁ బోవలసినదని చెప్పుట

ఆ రాముఁడు లోపలికిఁ జొచ్చి; యందసుగు నాసనంబునందుఁ గైకేయితోఁ గూర్చుండి, వాడువాఱిన మోముతో వ్యసనపడుచున్న తండ్రిని చూచి,వినయసమ్రుఁడై మిక్కిలి మెలకువతోఁ మొదటఁ దండ్రి గారి పాదముల కెఱఁగి యా పిమ్మట తల్లియగు కైకేయియొక్క పాదములకును నమస్కరించెను. రాముఁడు నమస్కరించినంతటనే దశరథుఁడు రాముని గూర్చి "రామా!" యని పిలిచి, యంతలోపలనే కన్నీటిచేఁ జెదరిన చూపుగలవాఁడై, పైమాటదోఁచక, గోడు చెంది, కన్నులు దెఱచి చూచుటకైనను, మాటలాడుటకైనను జాలనివాఁడయ్యెను.

రాముఁ డిట్టి వింతరైనదియు, దిగులుపుట్టించునదియు నయిన రూపముగలవాఁడును, దుఃఖముచేఁ గలిగినకాఁకచేఁ జిక్కినవాఁడును, సత్తువలేమిచేఁ మూసికొనిపోవుచుండెడి యింద్రియములుగలవాఁడును,

రానుని నడవికిఁ బంపవలసి వచ్చెఁగదా యను మనోదుఃఖముచే నిట్ట ట్టయియుండు డెందముతోఁ గూడినవాఁడును నయి వేఁడి నిట్టూర్పులు విడుచుచుండుటంజేసి కలియఁబెట్ట నలనికానిచ్చైనను, గొప్ప యలలచే నల్లకల్లోలమైయుండు సముద్రమువలెను, గ్రహాణకాలమునందు రాహువుచే మ్రింగఁబడిన సూర్యుని వాఁడిగమును, గల్లలాడిన మహర్షి వలెను గళదప్పికుున్న న్నపాలుని జూచి, రాముఁడును పాదముతోఁ గామును ద్రొక్కినవాఁడువోలె మిక్కిలి భీతిని జెందెను.

అట్లు రాముఁడు దిగులుపడి, తన తండ్రికిఁ గలిగిన దుఃఖమున కేది కారణముగనుండ వచ్చునని చాలవిూకము విచారించియు నిర్ధా రణ చేయఁజాలక, పున్నమనాఁటికి కడలి తెఱఁగున మిక్కిలి కలవరపడి, తాను దండ్రి కితవగు పనులుసేయుటయండే తలఁపుగలవాఁ డగుటం జేసి, యప్పుడు తన మనంబున "ఏమి యిది? ఇప్పుడు మాత్రము రాజు నన్నుఁ బలుకరింపకున్నాఁడు. తక్కిన సమయములందు ముత్తెవ్వరివిూఁద నైనఁ గోపము గలిగియున్నను, నన్నుఁ జూచినంతట నాగ్రహోపమువిూని సంతసమునొందును. అట్లుండఁగా నిప్పు డేల నన్నుఁ జూచియుఁ బలుక రింపకున్నాఁడు? వీవిు కోపము వచ్చెనో తెలియకున్నది?" అని చింతించి, దుఃఖముతోఁ గూడినవాఁడై, ధైర్యము విడిచి, మోమునఁ గళలేక, కైకేయికి నమస్కరించి, వెంటనే యామెతో నిట్లనియెను. "ఓ తల్లీ, నే నేదైనను దెలియక తప్పు చేయలేదుగదా! వీల నాతోఁ దండ్రి మాటాడకున్నాఁడు? నీ వైనను నామిత్త మా కోపము దీర్చుము. ఎల్లప్పుడు నాపైఁ బ్రేమగలిగియుండు మా తండ్రి యేల మనసున సంత సము మాని మొగమునఁ గళదప్పినవాఁడై, వ్యసనపడుచు నాతోఁ బలుకరింపకున్నాఁడు? ఇదేల? ఇతనిని దేహసంబంధమగు వ్యాధిగాని, లేక మనస్సంబంధమగు వ్యాధిగాని బాధింపదుగదా! మునుజొనకు నెల్లప్పుడు సుఖంబు గలుగుట యరుదుగదా! చూడఁ బ్రియమునఁ గొలుపు కుమారుఁడయిన భరతునకుఁగాని, బలవంతుఁడగు శత్రుఘ్నునకుఁగాని, నే నైనను, తల్లులైనను నేమియు నపకారంబు సేయలేదు గదా! తండ్రి కోపంబుతో నుండునపుడు, తండ్రిగారి మాట వినక, యాయనను సంతోషపఱుపక నే నొకక్షణమైనను జీవింపఁ గోరను.

మానవుఁ డేతండ్రివలన జన్మించుచున్నాఁడో, అట్టి ప్రత్యక్ష దైవ మగు తండ్రికి లోఁబడక యుండఁగలదు. నా తండ్రిని నీ వేదిగ్గొన నభిమానముతోఁ బనుసని పలుకులుగాని లేక, కోపముతో నాతని మనస్సు గలఁతఁ జెందునట్లుగాని పలికితివా? ఓ దేవీ! నృపాలుఁ డేల యిట్లు కలవరపడి యున్నాఁడు? ఇట్టి కలవరపాటున కేమికారణము? ఇంతకు ము న్నెప్పు డిట్లుండినది లేదే! నేను మిక్కిలి యాతురముతో నడుగుచున్నాను. నాకు నిజముఁ దెల్పు," మని యడిగెను.

ఇట్లు ధీరుఁడగు రాముఁ డడుగఁగాఁ గైకేయి మిక్కిలి సిగ్గు మాలినదై, జంకులేక తనకు మాత్రము మేలుగావించెడి మాట యిట్లనెను: "ఓ రామా! రాజున కేమియు నాగ్రహము లేదు; ఏమియు వ్యసనమును లేదు. ఇతనికి మనంబున నొక్క కోరిక యున్నది. నీ వే మందువో యని వెఱచి నోరు దెఱువకున్నాఁడు. నీవు ప్రియుఁడ వగు టంజేసి, యిష్టముగాని మాట పలుకుటకు నోరాడకున్నది. ఇతఁడు నా కొక వరము వాగ్దత్తము చేసెను. దానిని నీవు తప్పక నెఱవేర్పవలయును. ము న్నొకప్పు డితఁడు నాకు వరము లొసఁగి వాని నన్లె యిచ్చెద నని పలికి, నన్ను గారవించియు, నిప్పుడు నీచుఁడు మాట తప్పి మాడ్కి నిచ్చెద నన్నవరము నీయక, యొందు కిచ్చెదనంటి నని తపించు చున్నాఁడు. ఈ నృపాలుఁడు నాకు వరము నిచ్చెద నని మొదట మాట యిచ్చి, పిమ్మట నిష్ప్రయోజనముగా నీరంతయుఁ బాతిపోయినపిదపఁ జెఱువునకుఁ గట్టఁ గట్టఁబూనుచున్నాఁడు. రామా! యీ ప్రపంచమున కంతయు ధర్మమే ప్రధాన మని పెద్దల కందఱకుఁ దెలిసినదియ కదా! దశరథుఁడు నీకు వెఱచి, యీ సత్యమునఁ దప్పకుండునట్లు నీవు చేయవల యును. రాజు చెప్పఁబోవునది మంచిదియైనఁగాని, చెడ్డదియైనఁగాని, నీవు చేసెద నని చెప్పుటవేని, వేనిదియంతయు జెప్పెదను. రాజుగారు చెప్పఁదలఁచిన మాట నీయెడ విఫలముగాఁ దేని, యీ మాటను నేనే చెప్పెదను. వేల యనిన, ఇతఁడు నీతో నా సంగతిఁ జెప్పఁబోఁడు" అని చెప్పెను.

రాముఁడు కైకేయిచెప్పిన మాటను విని, మనమునఁ జింతనొం దినవాఁడై, నృపాలుని యొద్దటనే యీ కైకేయిం జూచి, "ఓ దేవీ!

అబ్బబ్బా! ఛీ! ఛీ! నన్నూఁహించి యిట్టిమాట చెప్పుటతగునే? వీల యన, నృపాలుఁ డానతిచ్చునేని, నే నగ్నిలోనైనఁ బడెదను. తీవ్ర విషము నైనను మ్రింగెదను. సముద్రములోనైనను మునిఁగెదను. సశపథుండు నాకు గురుఁడు; తండ్రి; రాజు; నా మేలుగోరెడి యాప్తుఁడు. సకల విధంబులచేతను నే నాతఁడు చెప్పెడికూటు వినఁదగుఁగాదు. కావున నృపాలుని కోరికఁదీఁది యెట్లో నానిని దెలుసుకొను, చేసెద నని ప్రతిజ్ఞ చేసెదను. రాముఁ డెప్పుడును గెంపుసవిఁగబులుగఁ బలుకువాఁడు కాఁడు" అని కపటము లేక చెప్పెను.

ఇట్లు నిష్కపటముగాఁ జెప్పినట్టి సత్యవాదియగు రాముని జూచి, కైకేయి మిగుల భయంకరమైన మాటలతో "ఓ రామా! తొల్లి దేవతలకును, రాక్షసులకును యుద్ధము సంభవించినప్పుడు, మీ తండ్రి కషాయము తటస్థపడఁగా, నతనిని నే నాసుహారణమున నుపాయమునుండి తప్పించి కాపాడితిని. అప్పుడు మీ తండ్రి సంతసించి, నాకు రెండు వరముల నొసంగెను. ఆ రెండు వరములలో నొకటి భరతునికిఁ బట్టాభిషేకము నేయుట, మఱియొకటి నీ విప్పుడే దండకారణ్యమునకుఁ బోవుటయు నని యడిగితిని. నీవు తండ్రిని యథార్థవాదినిగాఁ జేయఁ దలఁచితివేని, నీవును దండ్రివాటుఁ దప్పనని చెప్పినట్లు నడచుకొనఁ గోరితివేని, నేను చెప్పిన యీ మూఁటఁ దీనుము. నీవు నీ తండ్రియాజ్ఞకు లోఁబడి నడచుకొనఁ గోరితివేని, భరతుఁడు భాగ్దత్తము చేసిన ప్రకారము నీవు పదునాలుగేం డ్లరణ్యమునకుఁ బోవలయును. రామా! నీ పట్టాభిషేకమునిమిత్తమై సిద్ధపఱచి యుంచిన వస్తుసంభారముతో భరతునకుఁ బట్టాభిషేకంబు నడపువఁడగును. నీవు పట్టాభిషేకము మాని, జడలను దాల్చి నారబట్టలను గట్టినవాఁడవై, దండకారణ్యమునకుఁ బోయి యచ్చట నుండుము. భరతుఁడు డయోధ్యయందుండి, సకల సంపదలతో నిండినవాఁడై, చతురంగబలముతోఁ గూడియున్న యీ పుడమి నేలును గాక! ఈ నృపాలుఁడు దయార్ద్రహృదయుఁడుగాన, నిన్ను వనంబునకుఁ బంపవలసివచ్చెనే యనెడు వ్యాసమును వీవు వంచికొని, నిన్నుఁ జూడఁజాల కున్నాఁడు. రఘునందనా! నృపాలునిమాట ప్రకారము భరతునకుఁ బట్టాభిషేకము జరుగునట్లు నీవు నీ పట్టాభిషేకము మాని యిర

ణ్యమునఁ బదునాలుగేం డ్లుండుము. రామా! నృపాలుని గొప్పదైన సత్యమును తెప్పచేతఁ డరింపఁజేయుమును" అని చెప్పెను.

ఇట్లు కైకేయి పరుసని మాటలు పల్కుచుండఁగా, రాముని మనస్సున వ్యసనము కలుగలేదు. అయినను ఎక్కువ సామర్థ్యము గల్గి యున్న, దశరథుఁ డడ్డనో, పుత్రు నడవికిఁ బంపవలసివచ్చెనే యున్న వ్యసనముచేఁ బడింపుమ, మనసున విచారము నొందెను.

19-వ సర్గము.

కైకేయి రాముని వనవాసమునకై తొందరపఱచుట

శత్రువులను సంహరించువాఁడయిన రాముఁడు తన మనసున కిష్టముగానిదియుఁ, జాలుపఁటిదియున్నైన కైకేయి చెప్పినమాటను వినిన తర్వాత మనమునఁ గొంచెమైనను వ్యసనము నొందఁ డయ్యె. ఇంతటి క్రూరమయిన మాటఁ జెప్పిన దీని మోము చూచి మాటాడుట యెట్లని భయైసను దలఁపక యా మెతో నిట్లనియెను.

"ఓ తల్లీ! లక్ష్మి కాసిమ్ము. నృపాలుని ప్రతిజ్ఞను నెఱవేర్చుచు, జడలను, నారబట్టలను దాల్చినవాఁడనై, యరణ్యవాసము చేయఁబోయెదను. అది సరే. శత్రువులకు లొంగక శత్రువులను సంహరింపఁజేయు నృపాలుఁడు మునుపటిపలె నాతో నేలమాటాడ కున్నాఁడు; ఏల నన్నుఁ జేరఁదీయకున్నాఁడు. దీనికిఁ గారణమేమో తెలియఁగోరెదను. ఓ దేవీ! నీవు నాపైఁ గోపము చేయకుము. నామాట వినుము. నేను నీ యెదుటనె జడలను నారబట్టలను ధరించి యడవికిఁ బోయెదను. నీ యిష్టము నెఱవేఱుటంజేసి సంతోషము పడయుము. దశరథమహారాజు నాకు మేలు గోరువాఁడు; గురువు; తండ్రి; నేను గొంచెమపని చేసినను దానిని మరుపక జ్ఞప్తియం దుంచియుంచువాఁడు. అదియుఁగాక రాజు హితుఁడు చెప్పుపని చేయవలయు గురువు చెప్పునది చేయవలెను. తండ్రి చెప్పునది చేయవలయును. కృతజ్ఞుఁడు చెప్పునది చేయవలెను. రాజు చెప్పునది చేయవలెను. ఇట్లొక్కగుణము గలవారు చెప్పినపనినే చేయవలసియున్నప్పుడు, అన్నిగుణములుగలిగిన దశరథనృపాలుఁడు చెప్పుపనిని, భక్తి విశ్వాసము లుంచి చేయకుండుటకు వీలగునా? ఏది చెప్పినను జేయవలసినదే. అయినను, నృపాలుఁడు తానే "భరతు

నికిఁ బట్టాభిషేకము చేయఁదలఁచినాను" అను మాట నాతోఁజెప్పక దాఁచియుండుటఁ నా మనమును దహింపఁజేయుచున్నది. నేనే యౌవ్వరాజ్యప్రేరణ చేయఁబోవుచున్నను, సంతోషహృదయముగా సీతను, రాజ్యమును, నా కిష్టములగు ప్రాణములను, ధనమును సైతము మొసఁగుదునని చెప్పుచుండఁగా, నృపాలుఁడగు తండ్రి తానై యడిగినఁదునన్న, నీయొక్క యిష్టార్థము నెఱవేరుటకును నేను రాజ్యమును భరతుని కీయకుందునే? కావున నీవు నృపాలుని నోదార్పుము. ఈ పుణ్యమిత్రోఁడు తలవంచి, మెల్లఁగాఁ గన్నీళ్లను వదులుచున్నాఁడు. దీనికేమి కారణము? ఇప్పుడు రాజు నానతి వడసి, మేనమామయింటనుండి భరతుసఁ దోడ్కొనివచ్చుటకై, దూతలు వేగముగఁ బోవు గుఱ్ఱములపై నెక్కి కేకయదేశముల కేఁగు దురుగాక! తండ్రి చెప్పినది న్యాయ్యమేనా? యసాన్యాయ్యమా? యని కొంచెమయిన నాలోచింపక, పదునాలుగేం డ్లరణ్యవాసము చేయుటకై వేగిరముగా నిప్పుడే యిక్కడినుండియే పోయెదను" అని రాముఁడు కైకేయితోఁ జెప్పెను.

రాముఁడు చెప్పినమాటలను విని, కైకేయి యానందము నొంది, రాముని నడవికిఁ బంపుటయందు మిక్కిలి పట్టుదలగలదై, రాముని వేగిరపఱచుచు, "రామా! అట్లే కానిమ్ము. భరతునిఁ బిలుపొనిరా వేగముగఁ బోవు గుఱ్ఱముల నొసఁగి దూతలను బంపెదను. నీవును వనమునకుఁ బోవుటకు నిష్టపడితివి గావున నీ వింక జాగుచేయుట యుక్తముగాదు. నీ విచ్చటనుండియె తామసింపక యరణ్యమునకుఁ బయనము కావలయును. నృపాలుఁడు లజ్జతోఁగూడి, నీ కీ సంగతి చెప్పుట యిష్టములని యెంచి, తలవాంచి మౌనముతో నున్నాఁడు. నర శ్రేష్ఠుఁడా! దీనికిఁ గారణంబిదియె కాని, మఱియేదియుఁ గాదు. "మనము చెప్పెడుమాట విని, రాముఁడు మున ప్రతిజ్ఞ నెఱవేర్చునో నెఱవేర్పఁడో" యని దిగులుపడియున్నాఁడు. ఆ దిగులు దీర్పుము. నీ వెంతవఱకు నీ పురంబునుండి వేగిరంబుగ నడవికి బయలుదేఱువో, అంత వఱకు రామా, నీ తండ్రి మజ్జన మాడఁడు. ఆహారంబుఁ గుడువఁడు" అని రామునితోఁ జెప్పెను.

దశరథుండు కైకేయి చెప్పిన పలుకులు విని దుఃఖసాగరంబున మునింగినవాఁడై, "ఛీ! నా బ్రతుకేల? అయోధ్య! నా కెంత యాపద వచ్చెను?" అనుచు సిట్టూర్పు నిగిడించి, స్మృతి దప్పి, బంగారు తాపఁ బడిన మంచమున్పై వెనుకకుఁబడెను.

అపుడు రాముఁడు రాజును లేవనెత్తి కూర్చుండఁబెట్టి, కైకేయి తొందర పెట్టుటచేఁ, జొక్కుచేఁ గొట్టుఁబడిన గుఱ్ఱమువలె నడవికిఁ బోవు టకుఁ దత్పరపడినవాఁడై, పరమనీచురాలయిన కైకేయి తనకుఁ జెఱుపుఁ దలఁచి చెప్పినమాట వినినన్ను "ఈమె మనల నిట్లడవికిఁ బొమ్మనుచున్నది గఁడ" యను వ్యాసము లేశమైనను లేనివాఁడై, కైకేయింజూచి, "ఓ దేవీ! నేను పేరాస పట్టినవాఁడ నని తలఁచితివేమో! నేను ధనమును గోరను. రాజ్యమును గోరను. జనుల నంపఁజేసి లోఁబఱిచికొని యేల వలయు నని యిటుఁ గోరను. నన్ను సన్యాసులఁగపరిత్యాగముచేసి యాశ లెల్ల జయించి మునుల్ని జితేంద్రియులఁగు ఋషులతో సమానునిగను, నొక్క ధర్మమునందే ఆసక్తిమానినిఁగను దలంపుము. నీవు చేయఁ జాలని పని చేయుదియేని యున్నఁ జెప్పుము. నా ప్రాణములనైనను బోఁగొట్టుకొని యా పని సాధించి యిచ్చెదను. తండ్రికి శుశ్రూష చేయుట, ఆతనిమాట విసుటయను నీ రెండింటికంటె నుత్తమమగు ధర్మ మేదియున్నది? పూజ్యుఁడగు తండ్రి నూతో నీమాట చెప్పకపోయినను లోపము లేదు. నీవు చెప్పినదే చాలును. నీ మాటప్రకారమే జన సంచారము లేని యరణ్యమునఁ బదునాలుగేండ్లు నివాసము చేసెదను. ఓ కైకేయీ! నీవు నాకు త్వరవు చేయుటకుఁ గడుసాహసవుగ నుండియు, నేను నీ వెట్లు చెప్పినను జేయుటకు సిద్ధుఁడ నైయుండఁగా, నీ ప్రకారము చేయు మని నాతో నాజ్ఞాపింపక, మహారాజును "రాముని నరణ్యము నకుం బంపుము. భరతునికిఁ బట్టము గట్టుము" అని వరములనుగ నడిగితివే. ఇది కొండను ద్రవ్వి యెలుకను బట్టినట్లాయె.గదా. ఇదిగో, నేను నాతల్లిని వీడ్కొని, సీతను నా వియోగమునకు దుఃఖపడకు మని యోదార్చి వెంటనే, యిప్పుడే దండకారణ్యములకుఁ బోయెదను. భరతుఁడు రాజ్యమును న్యాయముగాఁ బాలించునట్లును, వృద్ధుఁడగు తండ్రికి శుశ్రూష చయనట్లును, నీవు భరతుని కేర్పాటుచేయవలసినది.

న్యాయ్యముగా రాజ్యపరిపాలనము సేయుటయు, వృద్ధుఁడగు తండ్రికి శుశ్రూషసేయుటయుఁగదా సనాతనధర్మములు" అని కైకేయితోఁ జెప్పెను.

అప్పుడు తండ్రి తనపుత్రుఁడు చెప్పిన పలుకులు విని, శోకముచేఁ గొట్టఁబడి, దుఃఖాతిశయముచేఁ గన్నీటి నాఁపుకొనఁజాలక బిగ్గఱగా గొంతెత్తి యేడ్చెను. అట్లు యేడ్చి సంజ్ఞతప్పి పడిఁయున్న తండ్రిపాదములకును, నికృష్టురాలయిన కైకేయియొక్క పాదములకును మ్రొక్కి, రాముఁడు "తనకుఁ బట్టాభిషేకము గాకపోవుటయేకాక యడవులపాలు కూడఁ గావలసివచ్చెఁగదా?" యనెడు వ్యసనము మానినవాఁడై, సుహృన్మోదముతో వెడలి, తండ్రికిని, తల్లియగు కైకేయికిని ప్రదక్షిణము గావించి, కైకేయి యంతఃపురమునుండి వెలుపడి బయటికివచ్చి, తనమేలరయుచుండు చెలికాండ్ర నందఱినిఁ జూచెను. లక్ష్మణుఁడు కన్నుల నిండఁ గన్నీరు నింపుకొని యతికోపముతోఁ దన యన్నను వెంబడించెను. రాముఁడు తన పట్టాభిషేకమునిమిత్తము సిద్ధపఱిపఁబడియున్న సామగ్రులకెల్ల మ్రొక్కి, ప్రదక్షిణముచేసి, దశరథుని యాజ్ఞను నెఱవేర్చుటయందే యపేక్షకలవాఁడగుటంజేసి, యా సంభారములను గంటితోనైనను జూడక, మెల్లగాఁబయనమై, వెలుపడెను. స్వభావముచేతనే సొబగుగలవాఁడగుటచే జనులందఱి మనస్సులఁ గొప్పినవాఁడయిన రాముని యొక్క యొక్కనశోభను చల్లనికిరణములుగల చంద్రునియొక్క శోభను రాత్రి తగ్గింపఁజాలనట్లు, రాజ్యములేక పోవుట యనునది తగ్గింపఁజాలనిదాయెను. బాగు సేలఁపలసిన పుడమిని బాసి కాననకేఁగుచున్న యా రాముని యొక్క మనోవృత్తి, సకల లోకముల నతిక్రమించిన యోగియొక్క మనోవృత్తినలేఁ జలింపకయుండెను. వెంటనే ధైర్యవంతుఁడగు రాముఁడు సొగసయిన తెల్లని గొడుగును బట్టువల దనియుఁ, జక్కఁగా సింగారింపఁబడియున్న చామరములు వేయువల దనియు నానతి యొసంగి, బంధువులను, బురజనులను రథంబును నచ్చటనే విడిచి, దుఃఖమును మనసునందే యాఁపుకొని, యింద్రియములను జయించి, తల్లియగు కౌసల్యతో విననింపుగాని యీ మాటుఁ దెలుపుటకై తల్లియొక్కనగరునకుఁ బోయెను. రాముని పట్టాభి

షేకమునకై సింగారించికొని వచ్చియున్న జను లందఱు నెప్పటివలెఁ గాంతిగలిగి యుండువాఁడును, చేసిన ప్రతిజ్ఞఁ దప్పఁగూడదను నియమ మొక్కటిమాత్రము గలవాఁడునునైన రామునియొక్క మోమున నెట్టి వికారమును గనరైరి. శరత్కాలమందలి చంద్రుఁడు తనకు స్వాభావికముగానున్న కాంతిని బాయుటట్లు తన కెల్లప్పుడు నుండునట్టి సంతసమును దీర్ఘబాహుఁడగు రాముఁడు విడువఁ డయ్యెను. కీర్తిమంతుఁడును, ధీరుఁడును నైన రాముఁ డట్లు చిక్కినవ్యుత్తరీఁ గూడి, జనుల నందఱిను నింపుగులుకు మాటలతో గారవించి, లక్ష్మణునిఁ దోడ్కొని తల్లిసమీపమును జేరఁబోయెను. విస్తారమగు పరాక్రమము గలవాఁడును, గుణములలోఁదన యన్న కీడ్గురువాఁడునునైన లక్ష్మణుఁడును తన దుఃఖమునఁ దనలోఁగుంపే యిసుమడిచ్చుకొని, యాతనిని వెంబడించి పోయెను. రాముఁడును తల్లి యంతఃపురంబు సొచ్చి తనకుఁ బట్టాభిషేకము జరుగఁగల దని మిక్కిలి సంతసపడుచున్న జను లీ సంగతిఁ దెలిసిన నొక్కఁడుఁ బ్రాణహాని చెందుదురో యని వెఱచి, యీ వన వాసము మిక్కిలి ధైర్యముఁ గల్గించుచున్నను, దానిని లోపలనే యడఁచుకొని, మోమున విన్నఁదనముఁ జూపకుండెను.

ఏఁబదవ సర్గము.

రామాభ్యా రాముని వనవాసమునకై ప్రోత్సహింపుట

పురుషులలోఁ సుస్థిరుఁడగు రాముఁడు చేతులు జోడించుకొని పయనముకాఁగా, నిప్పు డంతఃపురమున నుండలి స్త్రీలు "ఏ రాముఁడు తమ తండ్రి చెప్పినమ్మున, సంతోషపూరితమున సున్న వసుంధరాధిపత్యమునకు నొక్కఁడై రక్షకుఁడుగా నుండెనో, ఆ రాముఁ డిప్పు డరణ్యమున వాసమును చేయుఁ బోవుచున్నాఁడు. రాముఁడు తన తల్లిగుఁగు కౌసల్యయొడ నెట్లు ప్రేమ గలిగి నడచుకొనుచుండువాఁడో, యట్లే యసయందును బుట్టినది మొద లుగ నుండువాఁడు. ఈ రాముఁడు కోపగింపఁదగిన పనులను జేయక, కోపవంతుల కోపమును మంచిమాటలచే శాంతపఱచుచుఁ దన్నెవరు తిట్టినను కోపగించుకొనక యుండువాఁడు. అట్టి రాముఁ డిప్పుడు మన లను విడిచి యరణ్యమునకుఁ బోవుచున్నాఁడు. మనరాజు తెలివిమాలిన వాఁడు. అట్లు కానిచో, సకలలోకములకు గతియైన రాముని నడవికిఁ

బంపునా? అయ్యో! మన కిప్పుడెంత కష్టమువచ్చెను" అని బిగ్గరగా నేడ్చిరి. అట్లు రామునింగూర్చి దుఃఖించి, యా యంతఃపురంబున నున్న యంగన లందఱు దూడలఁ బాసిన యావులమాడ్కి మిక్కిలి పర్యసన పడుచుఁ దమ భర్తను నిందించుచు గొల్లున నేడ్చిరి. ఆ నృపాలుఁడు నంతఃపురంబునందలి భయంకరమైన యేడ్పు ధ్వనిని విని, పుత్రు నెడఁ బాయుటవలన వ్యసనముతోఁ గూడినవాఁడై, యాసనముపై నొఱఁగెను.

ఇంద్రియముల గెల్చినవాఁడగు రాముఁడు వ్యసనపడి, తమ్మునితో గూడఁ దల్లియొక్క యంతఃపురమునకుఁ బోయెను. అట్లు పోయి, యా రాముఁడు తల్లియొక్క యంతఃపురము వాకిటఁ గూర్చుండియున్న మిగుల మన్ననవడసిన ముసలివానిని, యిచ్చటనె నిల్చియున్న యితరుల ననేకు లను జూచెను. అపుడు ద్వారమున నున్న వారందఱును రాముని జూచి నంతటనే వేగముగ లేచి, జయశీలురతో శ్రేష్ఠుఁడగు రాముని జూచి, "రాజపుత్రా! జయముగలుగుఁగాక జయముగలుగుఁగాక" అని దీవనలు సల్పిరి. రాముఁడు మొదటితొట్టికట్టుబాఁటి, రెండవ తొట్టికట్టుసందు వేదవేదాంగసంపన్నులును, మహారాజు మున్ననలఁ బడసినవారునునగు ముదుసలి బ్రాహ్మణులను జూచెను. రాముఁడా వృద్ధబ్రాహ్మణోత్తముల కెల్ల మ్రొక్కులిడి, మూఁడవతొట్టికట్టు సొచ్చి, యిచ్చట వాకిటఁ గావలి కాచుటయె ముఖ్యమైనపనిగాఁ జూచుచుండు చిన్న పెద్దలగు మగు వలను జూచెను. ఆ మగువ లందఱు రామునికి జయంబుగలుగవలె నని దీవించి, త్వరగా లోపలికిఁబోయి, యప్పుడే రాముని తల్లితో, "ఓ దేవీ నీ కొమరుఁడు తమ్మునితోఁగూడ నిచ్చటికి వచ్చుచున్నాఁడ"ని తెలిపిరి. కౌసల్యయు నప్పుడు నిశ్చలమయిన భక్తితో రాత్రియంతయు నుండి, తనకొడుకునకు మేలుగోరినదై, యుదయమునసే విష్ణుపూజను జేసి ముగించెను. ఆ కౌసల్య పట్టుచీరగట్టి, యలంకారము చేసికొని రాముని పట్టాభిషేకవార్తను విన్నదై, సంతసముతోఁ గూడి, యెల్లప్పుడు నోములు నోచుటయుండే విడువని పట్టుబిలగలదగుచు, మంత్రపూర్వ కముగ నగ్నియందు హోమముచేయుచుండెను. అపుడు రాముఁడు తల్లియొక్క సొగసయిన యంతఃపురములోపలఁ బ్రవేశించి, యగ్ని

హోత్రునిగావుండు హోమమును చేయుచున్న తల్లిని జూచెను. ఋతీయు నచ్చట దేవతల పూజనిమిత్తము సిద్ధముచేయఁబడియున్న పెరుఁగు, పాలు, నెయ్యి, యక్షతలు, భక్ష్యములు, హవిస్సులు, లాజలు, తెల్లని పువ్వులమాలికలు, ధూపాన్నము, చిమ్మిలియుంటలు, సమిధలు, పూర్ణకుంభములు మొదలగు ద్రవ్యములు జూచెను. అప్పుడు రాముఁడు ఋతీంత దగ్గఱకుఁ జని, తెల్లని పట్టుచీరగట్టుకొన్నదియు, నుపవాసములుండి నోములు నోచుచుండుటచేఁ గసుఁ జిక్కినదియు, విష్ణుమూర్తి కర్ఘ్యమీయ నొసంగుచున్నదియు, దేవతలకు సాటియగు రూపసంపదగలదియునైన తల్లిని జూచెను. కౌసల్యయుఁ దనకు సంతసము గావించెడు వచ్చుచున్న కొడుకును జూచి, సంతోషపరవశయై, పెంటిగట్టిమీఁదు గుట్టిపుఁబిల్లను జూచినంతనే సకిలింతలు చేయుచు నెదురొక్కునట్లు, తాను రాముని నెదురొక్కెను. అట్లు తన్నెదురుకొని వచ్చుచున్న తనతల్లిని జూచి, రాముఁడు సాగిలఁబడి మ్రొక్కెను. వెంటనే కౌసల్య తనకొడుకును లేవఁదీసి, తన రెండుచేతులతో గట్టిగాఁ గౌఁగిలించుకొని, శిరంబున ముద్దాడెను. అంత, కౌసల్య శత్రులను లొంగఁదీసిపోఁడయిన తన పుత్రునిఁ గూర్చి, వాత్సల్యముతో నతని కిష్టసుులను, మేలు గావించునదియు నైన మాటుల నిట్లనెను.

"ఓ రామా! పెద్దలును, ధర్మమునడుపుటయే స్వభావముగాఁ గలవాఁడను, విశేషధైర్యశాలులు నగు రాజర్షులయొక్క యాయుస్సును, కీర్తిని, స్వజాతిధర్మమును బొందుము. రామా! నీ తండ్రియొక్క మాటతప్పని స్వభావమునుఁ జూచితివా? ధర్మ స్వభావుఁడగు నీ తండ్రి నీ కిప్పుడె పట్టాభిషేకంబు నేయఁబోవుచున్నాఁడు"అని కౌసల్య రామునితోఁ జెప్పి, యాససంబు నొసఁగి, "నాయనా! బువ్వతిందువు రమ్ము"ని పిలిచెను. వెంటనే రాముఁడు "తల్లికి జరిగిన సంగతిఁ దెలియక పోయెంగదా" యనియు, "తా నడవికిఁబోనున్న వార్తను తల్లి కెట్లు తెలుపుదు"ననియు గొంచెను సిగ్గుపడి, చేతులు జోడించికొని, దా నందఱి యెడలను స్వాభావికముగా వినయము గలవాఁడు గావున, తల్లియందలి మర్యాదచే మఱింత వినయముతో, దండకారణ్యముల కేఁగుటకుఁ బయనమై, తల్లియొక్క యుత్తరువు వడయఁగోరి యిట్లుచెప్పుఁ దొడఁగెను.

"ఓ తల్లీ! నీకు నిజముగా దెలియదు? గొప్పవిపరీతము పుట్టినది! గొప్ప యాపద సంభవించినది! ఈ విషయమును విన్నంతట నీకును, సీతకును, లక్ష్మణునకును విస్తారమయిన వ్యసనముగలుగును. తల్లీ, నేను దండ కారణ్యంబునకేగెదను. నాకేల యీసింహాసనము! ఇరువదియైదు దర్భలు పఱిచిన నిష్టరమను నాసనమునఁగూర్చుండుటకుఁ దగిన కాల మెయిస్పుడు నాకు వచ్చినది. మునీంద్రునిఁబలె మాంసమును వర్జించి తేనె, గడ్డలు, దుంపలు, పండ్లుతిని నా జీవితము గడపుచుఁ బదునాలుగేండ్లు జనసంచా రము లేనివనమున నివసింపఁబోవుచున్నాను. నృపాలుఁడు తన రాజ్యమును భరతున కొసఁగ నున్నాఁడు. నన్నన్నను మునివేషముతో దండకా రణ్యమునకుఁ బంప నున్నాఁడు. కావున నేను పదునాలుగు సంవత్సర ములు కాసలలో నుండు పండ్లుచేతను, దుంపలచేతను బ్రాణంబుఁ గాపాడుచు నేకతముగ వాసము చేసెద"ను నని కౌసల్యతో రాముఁడు నెప్పెను.

ఆ కౌసల్య యీ మాటలు విని గొడ్డటితో నటుకఁబడిన యడవి యండలి చెట్టుకొమ్మవలెను, స్వర్గమునుండి జాఱిపడిన దేవాంగనవలెను గ్రిందఁబడి మూర్ఛ నొందెను. అట్టిదుఃఖములకుఁ దగనిదై, నటుకఁబడిన యరఁటిచెట్టువలెఁ గ్రిందఁబడి, మూర్ఛనొందియున్న తల్లిని రాముఁడు లేవనెత్తెను. నేలమీఁదఁ బొరలి, లేచి, దుఃఖపడుచుండుసదియు, విశేషముగ బరువువేసి మోయించిన యీఁడుగుట్టికుపలె డస్సినదిగను నేలమీఁదఁ బడి పొరలుటచే నొడలంతయు దుమ్ముంటుకొన్నదియునైన తన తల్లియగు కౌసల్యను రాముఁడు లేవనెత్తి కూర్చుండఁబెట్టి, యొడలి దుమ్ముతయుఁ దుడిచెను. అట్లు దుఃఖముచే నొచ్చినదియును, సుఖములకుఁ దగినదియునైన యీ కౌసల్య పురుషశ్రేష్ఠుఁడగు రాముని తోఁ లక్ష్మ ణుఁడు దగ్గఱ నిలుచుండి వినుచుండగా నిట్లనియెను.

"ఓ నాయనా! నీవు నాకు దుఃఖములకై పుట్టినావు కాఁబోలు. నీవు పుట్టకున్న "నేను గొడ్రాలను"అను వ్యసనము దప్ప మఱే వ్యస నమును నాకు లేదుగదా! లోకంబున గొడ్డురాలికి "నాకు బిడ్డలు లేక పోయిరే"అను వ్యసన మొక్కటి మనసులోఁ గలుగుచున్నది కాని; మఱియొక్క వ్యసనము లేదుగదా. నా పెనిమిటి వయస్సున నుండఁగా,

నే నొక్క- సౌఖ్యమునుగాని, మేలునుగాని పొందినదానను గాను. అయినను, నీ కాలములోనైనను సుఖపడుదు నని కొండంతచూశ పెట్టు కొనియుంటిని. నేను నీ తండ్రియొక్క పత్నులలోఁ బెద్దదాన నయినను, చిన్నవారగు నా సవతులు హృదయము గ్రుచ్చుకొనునట్లు చెప్పిన వ్యసనకరములయిన యెన్నియో మాటలను సైరించితిని. ఆఁడువారికి సవతులచేఁ బడు పొమ్మన్న మాటలకంటె దుఃఖకరమయినది యేది యున్నది? నాఁటి వ్యసనమును, నేఁడుపడు నెట్టిదో కాని, యీ వ్యసనమునకు, నాయేడుపునకును మఱుగింపే లేదు. ఓరీ నాయనా, నీ వెదుటనున్నప్పుడో నే నొక్క మూలలలోఁ ద్రోయఁబడితిని. ఇఁక నీ పడమ్రుల కేగిన, నాకు మరణమే. అది నిశ్చయము. నా కెల్లప్పుడు స్వాతంత్ర్యము లేదు. ఎల్లప్పుడు నా పెనిమిటి మున్ను బొత్తుగా లక్ష్యపెట్టఁ డాయెను. నేనిప్పుడు కైకేయియొక్క పనిత్తెలతో, సాటియైనచాన నయితిని. బాగుగా నాలోఁచించి చూశ, వారికంటె నీచులాల ననిగాని చెప్పవలెను. ఎవ్వఁడైన నొకఁడు మన్నిదివఱకుఁ గొల్చుచున్నను, చెప్పినమాట వినుచుండి నను, ఇఁకమీఁదఁ గైకేయియొక్క పుత్రుఁడగు భరతునిఁ జూచినపిమ్మట, భయపడి నాతో మాటాడనుగూడ మాటాడఁడు. ఆ కైకేయి నాతో నెపతెగని వైరము గలదిగాన, నది యనెడు పొడుపుడు మాటలను నీచురాలయి నే నెటులోర్చి యుండఁగలను. నీవు పుట్టిననాఁటినుండియు నీ పనులనేడు సుమనస్సురములు, "నీవు యీపరాజ్యమునకు పచ్చిసయొడల నా కష్టములన్నిఁటిలోఁ బొమ్ము" నని యీ కష్టములనెల్ల నోర్చియుంటిని. నేను భర్తృదేవ పయినను, నా సవతియు చేసెడు చెడుపులను, వారనేడి యీ రాని మాటలను, ఎన్నటికిని దీనని గొప్ప దుఃఖమును నేను చిర కాల మోర్వఁబోలను. పున్నమచందురునిఁబోలు నీ మోమును జూడక, యిల్లప్పుడు దుఃఖపడుచునే నెట్టిట్టి యధమమగు బ్రతుకు బ్రతికెదను. నిర్భాగ్యురాలనయిన నే నొక్క-ప్రొద్దు లుండి, నోములు నోచి, యనేకములగు పడరాని పాటులెల్లఁ బడి, నిన్నుఁ బెంచిన దంతయు నాకు దుఃఖమునకుఁ గారణమాయెనుగదా! వానకాలముందుఁ బ్రవాహము రాఁగానే కొట్టువడని గొప్ప యేటి గట్టువలె నా హృదయ మింత మాట విన్నను బ్రద్దలు కాకున్నదిగాన, నా మనసు కాయికంబు

గట్టిదని తలఁచెదను. నిజముగా నాకుఁ జావే లేదు. యమపట్టణమున నాకుఁ దావు లేనట్లున్నది. అట్లు గాకున్న, దుఃఖపడుచున్న యీఁడు జింకను సింహమీడ్చుకొనిపోఁజొచ్చినట్లు, యమయీఁడు నన్నిప్పుడే తనపురికిఁ గొనిపోవకుండునా? భూలోకమున, నా కింతటి వ్యసనము వచ్చినను, నా దేహము శ్రీణింపకున్నది; ముక్కలుగాకయున్నది; చీలకయున్నది; కనుక నా హృదయ ముక్కుతోఁ జేయఁబడినదేమో! లోకంబునఁ గోరినప్పుడు చావు రాదు. ఎప్పుడు దానికి వేళయో, అప్పుడే యమదూత వచ్చును. నే నిన్నియేండ్లు బిడ్డలకై నోచిన నోములు, దానములు, నియమములు, తపస్సులు సర్వమును చవిటిచేనియందు నాఁటఁబడిన విత్తనములువలె నిష్ఫలము లాయెఁగదా. ఈ దుఃఖమునకంటె మించిన దుఃఖ మేమియున్నది? వేళవచ్చినప్పుడే కాక, తన యిష్టమునుఁబోప్పున నొకఁ డొప్పారాని వ్యసనముచేఁ జిక్కి, మరణమునొందఁ గలుగునేని, నేనును దూడను విడిచిన యావువలె నిప్పుడే యమపురికేఁ బోయి యుందును. చందురునింబోలు మోమున్నచాఁపు గలవాఁడా! నిన్నుఁబాసి, పిదప నేను ప్రాణములు దాల్చియుండుటఁ నిష్ఫలము. కావున నేను బలహీనురాలనయినను, దూడను ఆవు వెంబడించునట్లు నీపై ప్రేముచే నిన్ను వెంబడించి వచ్చెదను" అని కౌసల్య యప్పుడు తన వ్యసనమును సైరింపఁజాలనిదై, వేఁటకాండ్రచే వేయఁబడిన దొమ్మానుని జూచి వ్యసనమునొందిన కిన్నరాంగనవలె వ్యసనమునొంది, విశేషముగాఁ బలవించెను.

21-వ సర్గము.

లక్ష్మణుఁడు కౌసల్యను, రాముని నోదార్చుట

ఆ ప్రకారముగానే దుఃఖపడుచుండు రామునితల్లియగు నా కౌసల్యను లక్ష్మణుఁడు చూచి, తానును మిక్కిలి చింతించి, యీ సమయమునకుఁ దగినమాట యిట్లనెను:—

"ఓ తల్లీ! రాముఁడు కేవల మాఁడుదాని మాటలకు లోఁబడి, రాజ్యలక్ష్మిని వదలిపెట్టి, యడవి కేఁగుటయనుసది నాకును సమ్మతముగాఁ దోఁపలేదు. దశరథుఁడు మనస్సున నిలుకడలేనివాఁడు, ముసలివాఁడు, నింద్రియములకు లోఁబడినవాఁడు, మన్మథుని బాణములచేఁ బీడింపఁ

బడినవాఁడను; మున్నథుఁడను లోపలఁ జేరి ప్రేరణచేయుచుండఁగా, నట్టి చెడ్డ యవస్థలుగల దశరథుఁ డేసనిఁజేయుఁడు ? మోహమునఁ జే నెట్టిమాట పలుకఁడు. రాజ్యభ్రష్టునిఁ జేసి యడవికిఁ బంపవలసినంత తప్పిదమునుగాని, పాపమునుగాని రామునియందు నాకుఁ గనఁబడలేదు. రామునికి జన్మశత్రువైనవాఁడొండె, రామునిపలన నపమానింపబడినవాఁడొండె యెవ్వఁడైనను రాముని మిత్రుఁడగున నైనను నతనిపై దోషము నెప్పువాఁడీ లోకమున నాకుఁ గాన్పింపఁడు. దేవతలతో సమానుఁడును, చక్కని వాఁడును, నోర్పుగలవాఁడును, బగతురనైనను బ్రేమించువాఁడునునైన పుత్రుని ధర్మజ్ఞుఁడగు తండ్రి యెవఁడు నిష్కారణముగా విడుచును? కౌపున మునసతి వాఁ డగునటుం జేసియుఁ, గామపరవశుఁ డగునటుం జేసియు బసివానివలె మంచిచెడ్డ లరయఁజాలనట్టి న్నపాలుఁ డేది చెప్పినను వినవలయు నని విధి యున్నదే? ఆఁడొక సమయమున నసత్యోగ్రముగాఁ జెప్పినమానిని రాజధర్మంబుల నెఱింగిన పుత్రుఁడు వినవలయునే? అట్టి మాటలను బుత్రుఁడు మనసునందే యుంచఁబాదు. ఓ యన్నా! రాజు నిన్ను వనమునకుఁ బొమ్మనిన సంగతి యందఱకుఁ దెలియకముందే, నా తోడ్పాటున రాజ్యమునంతయు స్వాధీనపఱచికొనుము. నేను విల్లు చేతఁబట్టి నీ ప్రక్కన నిలఁబడి కాచుచుండ, యమునివలె నున్న నిన్నెవఁడు మీఱఁజాలును? నరశ్రేష్ఠుఁడా! యయోధ్యానగరమునందు నీ కెదుఱుమాట నెదురు తిరుగఁబడునేని, వానిపైఁ గఱకుటమ్ములం బ్రయోగించి, యీ యయోధ్యనెల్ల నిర్మానుష్యముగాఁ జేసెదను. అటుగాక, భరతునియొక్క హితులైనను, చెలికాండ్రయినను యుద్ధమునకు వత్తురేని, వారి నందఱని సుగ్గుసేసెదను. మెత్తవి వాఁడన్నిచోట్ల నవమాన మొందుననుగదా! కావున మన మిప్పుడు మెత్తదనము గలిగియుండరాదు. చెడుతలంపుగలవాఁడగు మనతండ్రి కైకేయియొక్క దుర్బోధనచే నిట్టి మార్పునొందెను. కావున మన కతఁడు పగతుఁడు. అట్టివానిపైఁ బ్రేమ యుంపక వధింపను వచ్చును. కాలుసేతులు విఱిచికట్టను వచ్చును.

మదించినవాఁడై, లేక కామపరవశుండై, యిది చేయఁదగినది ఇది చేయఁదగనిది యని తెలిసికొనక, చెడుదారియందుఁ బోవువాఁడుగురువైనను, వానిని దండింపవచ్చును. ఓపురుషశ్రేష్ఠుఁడా! నీవు మాయందఱి

లోపలఁ బెద్దవాఁడవు. కావున నీకిఁ రాజ్యము న్యాయప్రకారమున లభ్యమ పడినది. ఇట్టి నీరాజ్యమును దశరథుఁ డేమి బలిమిని, ఏమి కారణమును బట్టి కైకేయి కిచ్చుటకుఁ గోరినాఁడు? ఈ దశరథుఁడు ననున్న గెల్చునంత బలిమిగలవాఁడే? నీ రాజ్యమును గైకేయి కిచ్చుటకుఁ దగినంత కారణ మున్న దే? రెండును లేవని నేఁ బలఁచెదను. ఓ శత్రుసంహారీ! నీకొ డను గొప్ప వైరమువూని, భరతునకు రాజ్యం బొసఁగునంత శక్తియీ దశరథున కున్నదే?" అని రామునితోఁ జెప్పి, తల్లిపంకఁ జూచి, "తల్లీ! నేను జెప్పెడి సత్యమును, నేను బట్టినవింటిని, నేను జేసిన దానములను, నే నొనరించిన యాగములను సాక్షులనుగాఁబెట్టి యొట్టు పెట్టుకొనెదను. నేను నాపుత్రోవాత్కాయంబులచే మా యన్నయందుఁ బ్రేమగలిగియుందును. ఇది నిక్కువము. నన్ను దాపురాదునిఁగాఁ దలంప కుము. ఓదేవీ! రాముఁడు మండుచున్న నిప్పునుగాని, అడవినిగాని ప్రవే శింపఁ బోవునేని, నన్నంతకు ముందె యచ్చటఁ బ్రవేశింపుమన్న వానిని గానెఱుఁగుము. సూర్యుఁ డుదయించి, చీకటిని బోఁగొట్టునట్లు నేను నా బలిమిచే నీ వ్యసనమును బోఁగొట్టెదను. దేవీ, నీవును, రాముఁడును నా మగటిమిఁ జూతురుగాక" అని లక్ష్మణుఁడు కౌసల్యతోను రాముని తోను జెప్పెను.

ఇట్లు ధైర్యశాలియగు లక్ష్మణుఁడు చెప్పిన పలుకులువిని కౌసల్య కన్నీరు విడుచుచు, దుఃఖముచే నెన రెట్లు చెప్పిన నట్లు చేసినయెడల దన దుఃఖ ముపశమించు ననిఁ దలఁచి, రామునిం గూర్చి "ఓ నాయనా! నీ తమ్ముఁడు చెప్పిన పలుకులు వింటివి గదా! ఇప్పు డవి నీకు సమ్మతము లగునేని, యా ప్రకారము చేయుము. నీ సవతితల్లి చెప్పిన ధర్మవిరుద్ధ మైన మాట నొప్పికొనిన ని న్నెడఁబాయఁజాలక, కుందుచుండు ననున్నఁ బాసి, నీ విచ్చటనుండి కానలకేఁగుటకు నే నెంతమా త్రము సమ్మతింపఁ జాలను. ధర్మముల నెఱిఁగినవాఁడా! నీవు ధర్మమునం దే పట్టుదలగల్గి, ధర్మమును నడపుటయందే కోరికగలవాఁడ వగుదువేని, యిచ్చటనే యుండి, నాకు శుశ్రూషలు సల్పుచుండుము. ఉత్తమ ధర్మ మేదియో దానిం జేయుము. తల్లికి శుశ్రూషసేయుటకంటె మించిన ధర్మంబు లోకం బునఁ గలదే? తల్లికంటె మించిన దైవంబు లేదుగావున నీవు తక్కిన ధర్మ

ములను వదలియైనను దల్లికి శుశ్రూష సల్పుచుండుము. తొల్లి కాశ్యపుఁడు తల్లికి శుశ్రూషలు సల్పుచుఁ దన యింటియుండే జితేంద్రియుఁడై యుండి, యధిక తపస్సుచేసి స్వర్గలోకము నొందెను. నృపాలుఁ డెట్లు నీకుఁ బూజ్యుఁడో నేయును నట్లెకదా! లోకంబునఁ గోమసునికిఁ దల్లి దంస్ర లొక్కటియె. వారిలో నతఁ డెవఁగిని హెచ్చుగాను, నెవరిని దక్కువగాను జూడవచ్చును? కావున నీవు వనంబుల కేఁగుటకు నేను సమ్మతింపను. నీవు కట్టుణము విడిచి యొక్కఁడికిఁ బోఁగూడదు. అట్లు కాదని నీవు నన్ను విడిచిపోతివేని, యిఁక నా కీ జన్మముతో నేమి యుపయోగము? ఏ సుఖము ననుభవించియు నేమి యుపయోగము? నీ వడవికిఁ బోయిన, నిన్నుఁబాసి యిక్కడ సుఖంబుల ననుభవించుట కంటె, నీతోడ నడవులలోఁ దిరుగుచు గడ్డి దిసుచునైనను జీవించి యుండుట మేలు. దుఃఖముచేఁ బలురాలనైయున్న నన్ను విడిచి నీవు కానల కేఁగితివేని, నేను తప్పక నిరశనవ్రతము (ఆహారము లేకుండుట) పూని ప్రాణములను దొఱఁగెదను. ఇది నిజము. నమ్ముము. నిన్ను విడిచి నే నర నిమిషమైనను ప్రాణములతో నుండఁజాలను. నేను నీ నిమిత్తము ప్రాణంబులఁ దొఱఁగుటంజేసి, నదులకు మగఁడగు సముద్రుఁ డనాన్యాయముచే బ్రహ్మహత్యాదోషమును బొందినట్లు, నీవు శాశ్వతమయిన యపకీర్తి నొందఁగలవు" అని కౌసల్య దుఃఖపడుచు రామునితోఁ జెప్పెను.

ధర్మము నడపుటయుండే పూనికిగల రాముఁడట్లు కడుదిగులుతోఁ గూడి పలవించుచున్న తల్లియగు కౌసల్యనుజూచి ధర్మమునకు విరుద్ధముగాకుండునట్లిట్లనియెను.—"ఓ తల్లీ! తండ్రిమాట మీఱుటకు నాకు శక్తిలేదు, నేను నిన్నుఁ జూగిలఁబడి ప్రార్థించెదను. నే నడవికిఁ బోఁగోరుచున్నాఁడను. తొల్లి దివ్యజ్ఞానముగలవాఁడయినను, బ్రహ్మచర్యాది వ్రతముల నొనరించువాఁడయినను, ధర్మములను దెలిసినవాఁడయినను విద్వాంసుఁడయినను కండువను మహాముని తండ్రిమాట దాఁటఁజాలక గోవును జంపెను. అవన్నియేల? తొల్లి మానవంశస్థుండయిన సగరునియొక్క కొడుకును లక్షువదివేలమంది భూమిని ద్రవ్వుచుఁ బోయి, పాతాళమున నన్యాయముగా నందఱు మడిసిరి. అట్లు వారు తండ్రి మాటకై తమప్రాణములనుగూడఁ గోల్పోయిరి. అట్లుండ నేను బదునాలు

గేం డ్లడవియం దుండుటను వెనుదీయవచ్చునే? తొల్లి జమదగ్ని పుత్రుఁ డగు పరశురాముఁ డడవియందుండునపుడు, ఆతనితండ్రి తల్లిని జంపు మనిచెప్పఁగాఁ, దండ్రిమాటఁ జేయఁగోరి యతఁడట్లె గొడ్డటితోఁ నా మెను నటికివై చెను. ఓదేవీ! దేవతలవంటి వా రెందఱో యిట్టి యనేక కార్యము లనుజేసిరి. అట్లుండఁగా నేను మాత్రము నాతండ్రి కిష్టమయిన యీ కార్యము చేయక యతనిమాటను వ్యర్థముఁజేయవచ్చునే? నే నతనిమాట యసత్యపఱిపఁజాలను. నే నొక్క డడనే తండ్రియానతిని జేయ నంగీకరింప లేదు. పూర్వమెందఱో నేనుజెప్పిన రాజులంద ట్లు చేసినవా రలెకదా! నీకుఁ బ్రతికూలముగా నడచుకొనఁగోరి యీ యన్యాయమార్గమున నవ లంబింపలేదు. తొల్లింటి పెద్ద లిష్టముతోఁ బోయినమార్గమునన్నే నేనును బోఁదలఁచి యున్నాను. కాఁబట్టి, తండ్రి చెప్పినపని చేసి తీరవలసినది యే. పుడమిపయిందుఁ దండ్రి గొప్ప ప్రత్యక్షదైవముగాన నతనిమాట మీఱరాదు. తండ్రిచెప్పినమాటను జేయు మానవుఁ డెప్పటికిని జెడఁడు గదా?" అని తల్లితోఁ జెప్పి, మాటలాడువారిలో నేర్పరియగు, విలుకాం డ్రలలో మేటియునగు రాముఁడు తమ్మునింజూచి, యిట్లనెను:

"ఓ లక్ష్మణా! నీకు నాయందుండు నెక్కువచెలిమిని, నీపరాక్రమమును, బలమును, పరులకోర్వఁగానిదైన ప్రతాపమును నే నెఱుఁగుదును. నాతల్లియు సత్యమిట్టిదనియు, నోర్పిట్టిదనియుఁ దెలియక యపార దుఃఖము నొందుచున్నది.

లోకమున ధర్మమేకదా గొప్పది. అట్టి ధర్మమునందే సత్యము నిలిచియున్నది. తండ్రిమాట ప్రకారము నడచుకొనుట యసునదియు నట్టి ధర్మములలో నొక్కటియై యున్నది.

ధర్మమార్గావలంబి యగువాఁడు తల్లిదండ్రులకుఁ గాని, బ్రాహ్మణునికిఁ గాని యొకపని చేసెద ననిమాట చెప్పి పిమ్మట తప్పుట యెంతమాత్రము తగదు. కావునఁ దండ్రియాజ్ఞను మీఱుటకు నేను గొంచెమైన నిష్టపడను. తండ్రి నీ కానతియ్యలేదే; తల్లియే కదా యానతి యిసంగెనందువేమో. ఓరూఢా, తండ్రిమాటవలనేకదా నీకై కేయి నన్ను గానలకేఁగునట్లు ప్రేరణసేసెను. కావున నో లక్ష్మణా! క్షత్రియధర్మము నాశ్రయించిన యీచెడ్డతలంపు మానుము. న్యాయమార్గము నవలం

బింపుము గాని, కటికితనము మానుము. నా బుద్ధియెట్టిదో, యట్టి బుద్ధినే నీవు నాశ్రయింపుము." లక్ష్మణుని యన్నయగు రాముఁడు చెలి మిచేఁ దమ్ముఁడగు లక్ష్మణునితో నిట్లుపలికి, తల్లికి మఱిల సాష్టాంగ ముగాఁ బ్రణమిల్లి, యా మెతో నిట్లనియె.

"ఓ దేవీ! యిచ్చటనుండి యరణ్యమునకుఁ బోవ ననుజ్ఞయిమ్ము. నా ప్రాణములమీఁద నొట్టుపెట్టుకొని చెప్పెదను. నాకుఁ గీడు గలుగకుండు లాగున మంగళకరములైన దీవనలు సల్పుము. తొల్లి యయాతియను రాజర్షి స్వర్గలోకమును వదలి భూతలమునఁ బుడమిఁ జెందిన చాడ్పున నేసును బదునాలుగేం డ్లరణ్యవాసముచేసి, ప్రతిజ్ఞ నెఱవేర్చికొన్న వాఁడనై, మఱిల నయోధ్యకు వచ్చిచేరెదను. ఓతల్లీ! శోకమును బొగుగా మనము ననే యూఁపుకొనుము. వ్యసనపడకుము. నేను వనవాసము ముగించి, తండ్రిమాట చెల్లించి, మఱిలఁ బురమున కేతెంచెదను.

నీవును, నేనును, సీతయు, లక్ష్మణుఁడును, సుమిత్రయుఁ దండ్రి చెప్పినచొప్పున నడచుకొనవలయు. ఇదిసనాతన ధర్మము. అమ్మా! యీ యభిషేకమునకుఁ దెచ్చిన సామగ్రులను నిలిపి యుంచి, దుఃఖమును మనస్సులోపల నాపికొని, వనవాసము చేయునిమిత్తము నే నాలోచించిన న్యాయవిరుద్ధముగాని బుద్ధి ననుసరించి నా కనుజ్ఞయొసఁగ వలయును." అని రాముఁడు తల్లిని వేఁడెను.

పట్టపురాణిగను, రాముని తల్లియునగు కౌసల్య తన కుమారుఁడు న్యాయమునకు విరుద్ధముగాకయు, వ్యసనము లేకయుఁ, గలవరపాటు విడిచియుఁ జెప్పిన పలుకులను విని, మృతినొందిన దానివలెఁ గ్రిందఁబడి, మఱిలఁ దెలిసి నొంది, రాముని జూచి యిట్లనియె.

"ఓ నాయనా! నీకు నీతండ్రియొట్లో నేను నట్లే, స్నేహముచేతను, దల్లిదండ్రులకు లోఁబడుట యనుస్వధర్మముచేతను గురువునైన దానవే. కడు దిగులుపడి శోకమునొందుచున్న ననున్ను నిట్లు విడిచిపోవుటకు నేను సమ్మతించి యుత్తరు వీయను. లేక లేక కనిన నిన్నుఁ బాసి, నే నీ లోకమునఁ బ్రాణములతో నున్న నేమి? లేకున్న నేమి? ఈ రాజ్యముతో నేమి? పితృదేవతలకు నిచ్చు స్వధతోఁగాని యమృతముతోఁగాని యేమి యుపయోగము? ఈ కనఁబడుచుండు జీవరాసు లందఱికంటె నరగడియ

నైనను నీమోము నందముఁ జూచుచుంట, నీయెడఁట నుండుట నాకు మిక్కిలి మేలని తోఁచెడిని." అని కౌసల్య చెప్పెను. కట్లు వడలించుకొని, మనుష్యులు కొఱపికట్టెలతోఁ బొడుచుచుండఁగా, బారిఁబడి పోవుచున్న యేనుఁగు పరితపించునట్లు, రాముఁడు తన తల్లి యిట్లు దీనముగాఁ జెప్పిన మాటను విని, మిక్కిలి వగచి, మూర్ఛకొంది పడియున్న యా తల్లిని, దిగులుపడని సంతోషముతోఁ గూడియున్న లక్ష్మణుని జూచి తాను ధర్మమునకే లోనుండువాఁడును ధర్మమునే మాటాడఁగలవాఁడును గావున లక్ష్మణునితో నిట్లనియె.

"ఓ లక్ష్మణా! నే నెల్లప్పుడు సీయొక్క ప్రేమను, మగఁటిమిని నెఱిఁగియున్నాను. నాయొక్క యభిప్రాయము నెఱుంగక తల్లితోఁగూడి నన్ను మిక్కిలి పీడింపుచున్నావు.

ఓరీ నాయనా! లోకమున ధర్మము నాచరించువారికి ధర్మార్థ కామములు మూఁడును గలుగునుగదా. ఎట్లన, చెప్పినట్లు వినెడి భార్య భర్తకు స్వాధీనురాలై ధర్మము గలిగించును; భర్తయొక్క మనసును కొప్పినదై, కామమును గలిగించును; గుణవంతుఁడగు పుత్రునిఁగని ధనమును గలిగించును. ఆ యొక్క భార్యయై మూఁడింటిని గలుగఁ జేసిన చొప్పున ధర్మమునఁ నడపుకొనువారికి ధర్మార్థకామములు మూఁడును గలుగును. ఏకార్యమునందు ధర్మ అర్థ, కామములు మూఁడును గలుగవో యట్టి కార్యమును మానవుఁడు ప్రక్రమింపరాదు. ఎవఁడు కేవలము అర్థమునందే యాసక్తి గలిగియుండునో వాని పై నందఱును బగ గొందురు. కామమే ముఖ్యముగా నుండువానిని జనులు మన్ననచేయరు. ధర్మార్థకామములకు మూఁడింటికి నాధారమైన ధర్మమునే చేయవలయును. దశరథుఁడు గురువును, తండ్రియు, ముదుసలియు. అతఁడు కోపముతోఁ జెప్పినను, సంతసముతోఁ జెప్పినను, మోహముతోఁ జెప్పినను తండ్రిమాట నతిక్రమింపరాదను న్యాయమును గమనించి, యా పని చేయవలసినది. క్రూరస్వభావము లేనివాఁడెవ్వఁడేని తండ్రిమాటను జవదాఁటునే? అంచనును దానిని జేయుదురు. కావున నే నది యెఱిఁగియుండి తండ్రి ప్రతిజ్ఞను నతని మనోరథమును ప్రకారము పూర్తిచేయకుండఁజాలను. ఓరీ నాయనా! దశరథనృపాలుఁడు నీకును

నాకును గురుఁడు. దేవియగు కౌసల్యకు నతఁడేభర్త;అతఁడే దిక్కు; అతని శుశ్రూషయే యీమెకు గొప్ప ధర్మము. ధర్మపరిపాలకుఁడయిన యీ దశరథుఁడు స్వధర్మముఁ దప్పక రాజ్యము పాలించుచు జీవించియుండ, దెనిమిటిలేని యంగనవలె నన్ను వెంబడించి యీమె వచ్చుట తగునా ? ఇదిగొప్పకులమువారికిమర్యాదగాదు. కావున తల్లీ! నీవుముసలివాఁడగు దశరథునిఁ జూచుకొనుచుండుము. నా కడవి కేఁగ నెఱవిమ్ము. వనవాసంబు ముగిసిన పిదప స్వర్గలోకమునుండి దిగినచ్చిన యయాతివలె వచ్చి చేరునట్లు నాకు మంగళాశీర్వాదములను జేయుము. ఓతల్లీ! కీర్తినాశాట వృద్ధి నొందునది. ఈదేహము కొంతకాలము మాత్రముండునది. ఇదియెంతవఱ కుండునో, ఎప్పుడు పోవునో తెలిసినదికాదు. అట్లు అస్థిరమై, స్వల్ప కాలము సుఖంబు నొసంగు శరీరమునిమిత్తము రాజ్యముఁ గోరుదునే? అది యన్యాయముగదా!" అని నరశ్రేష్ఠుఁడయిన రాముఁడు కౌసల్యతోఁ దండ్రి నోదార్పుమని చెప్పి, శౌర్యముగలిగి, దండకారణ్యమునకుం బోవలెనని కోరినవాఁడై, తమ్ముని మిక్కిలి యోదార్చి, తనతల్లికిఁ గదు శుశ్రూష చేయుమని చెప్పి, యాతల్లికి మనసునందే ప్రదక్షిణంబుచేసెను.

22 వ సర్గము

రాముఁడు దైవబలము గొప్పదని లక్ష్మణునితోఁ జెప్పుట

అట్లు శోకముచే దిగులుపడి, యొక్కువ రోషముగలవాఁడై, కన్నులు గిరగిరఁద్రిప్పుచు నాగుఁబామువలె బుసకొట్టుచుండువాఁడును, మంచి మనసుగలవాఁడును, అనుఁగు దమ్ముఁడునునైన లక్ష్మణుని దాపునఁ జేరి, బుద్ధిమంతుఁడైన రాముఁడు దన మనోవికారము నణఁచుకొని

"ఓ లక్ష్మణా! తండ్రి యిట్టి యాసతి సేసెనే యనెడి కోపమును, మన యన్నకిట్టి యవస్థ వచ్చెనే యనెడి విన్నదనమును మాని, ధైర్య మొక్కటిమాత్రము పూని, యిపుడు నా పట్టాభిషేక ప్రయత్నము మాని, దాని నిమిత్తము చేర్చిన వస్తువులనెల్ల విడిచి, నిర్దోషమయిన కార్యమును జేయుము. సౌమిత్రీ! నా యభిషేకమునకై వస్తువులను జేర్ప నీకెంతయుత్సాహ ముండెనో, అంతటి యుత్సాహము పట్టాభిషేక నివృత్తికై యగునుగాక! నాపట్టాభిషేకము మాటవిన్నదైన యే కైకేయి మనస్సు పరితపించుచున్నదో, యట్టి యీ తల్లియొక్క మనమునఁ గల

పరితాపము లేకుండునట్లు చేయుము. ఆ కైకేయియొక్క మనంబునఁ బుట్టిన భయమువలో నిండిన దుఃఖమునుఁ నే నుపేక్ష చేయఁజాలను. నేను తెలిసియుఁ దెలియకయు నొకప్పు డైనను తల్లులకుఁగాని, తండ్రికిఁగాని గొంచెపుఁయినను విరోధంబు నేసియున్న ట్లెఱుఁగను. నిజము పలుకు వాఁడును, ప్రతిజ్ఞ దప్పనివాఁడును, ఎల్లప్పుడు విడువని పరాక్రమము గలవాఁడునునైన నా తండ్రి "నేను జేసిన ప్రతిజ్ఞ దప్పునేమో" యని పరలోకమునకు వెఱచియున్నాఁడు. ఆతని వెఱపును దొలఁగునుగాక! ఈ పట్టాభిషేకము నిలుపక జరుగునేని, "నే నాడినమాట తప్పిపోయితిని గదా" యని మన తండ్రియు మనంబున నొచ్చుకొనును. ఆ నొచ్చి కోలు ననున్ను నొవ్వఁజేయును. కావున లక్ష్మణా! యభిషేకప్రయత్న మును మాని, యిప్పుడె యిచ్చటనుండియు యరణ్యమునకుఁ బోయెదను. ఇప్పుడు న న్నడవికిఁ బంపుటచే రాజపుత్రియగు కైకేయి తన కోరికను నెఱవేర్చికొన్నదై, వెంబడె, తన కొడుకగు భరతునకు దిగులు లేకుండఁ బట్టాభిషేకము జరిపించుకొనును. నేను నారబట్టలను గట్టి, జింకతోలు గప్పుకొని జడలఁదాల్చి యరణ్యంబునకుఁ బోయితినేని, కైకేయి మనస్సు నకు సంతసము గలుగును. కావున నేను నిలువక వనమునకుఁ బోవ వలయును. దశరథుఁడు తన సత్యవాక్యపరిపాలనమునకై యిట్టి యోజనచేసి, న న్నడవికిఁ బంపుటకు మనసు రాయి చేసికొనెను. కావున నట్టి నృపాలునిమాట మీఱఁ, బరాతని మనస్సు నొవ్వఁ జేయఁ జాలను. నేను శీఘ్రముగా వనమున కేఁగెదను. లక్ష్మణా! న న్నడవికిఁ బంపుటకుఁ గాని, యిచ్చిన రాజ్యంబుఁ గైకొనుటకుఁగాని దైవమె కారణముగాని కైకేయి కారణము గాదు. నే నడవికిఁ బోవుట యను నట్టి తలంపు దేవునికి లేదేని, యీ కైకేయియొక్క యభిప్రాయంబు న న్నెట్లు నొప్పింపఁజాలును? ఇదివఱకు కెప్పుడును నేను దల్లులందుఁ దారతమ్యము లేక యుండుటయుఁ, నట్లె యిదివఱకుఁ గైకేయి దొల్లప్పుడు నన్నును, భరతునిని నేకరీతిగాఁ జూచుచుండుటయు నీకుఁ దెలిసినదేకదా! అట్టి కైకేయి కిప్పు డిట్టి తలంపు దైవప్రాతికూల్యము లేనిచోఁ బుట్టునా? భరతునియందును నాయందును నొకతీరున నున్న కైకేయి యిప్పుడు ననున్ను జూచి, "పట్టాభిషేకంబు నీవు సేసికొన

వలదు. పదునాలుగేం డ్లడవియందుండవలయును" అని చెప్పుల కింపుగాని కఠోరపుఁ బలుకులు పలుకుట దైవ వైపరీత్యముగాని, మఱొక్కటిగాదు. అట్లు దైవము నాకు విరుద్ధముగా నుండదేని, యిన్నిదినములు నాయందుఁ బుత్రవాత్సల్యము గల్గియున్న యీమె కిప్పు డేల యిట్టి దుర్బుద్ధిపుట్టును? కావున నిది దైవమొయొక్క ప్రేరణయె గాని వేఱొక్కటికాదు. ఇది దైవప్రేరణ కానిచో, నా కైకేయి రాజ వంశమునఁ బుట్టినదయ్యును, సుగుణములు గలదయ్యును, సుస్వభావము గల దైనను, నాయెడఁ బుత్రవాత్సల్యము గల దైనను, పెనిమిటి యెడుట సిగ్గుమాలి భయము విడిచి, నీచురాలివలె నిర్వ్యథంబున నాకు నొప్పి గల్గించు మాటలఁ జెప్పునా? కావున దైవబలముచేతనే యీ కైకేయి కిట్టి యభిప్రాయము గలిగియుండవచ్చును. దైవం బిట్టిదని యూహించి తెలిసికొనఁదగినదికాదు. ఆ దైవంబున కన్నిభూతములు లడ్డమురావు. ఇది నిస్సంశయము. ఈ విపరీతంబు నా విషయమునను, కైకేయి విషయమునను సిద్ధముగ నేర్పడినది. సకల రాజులతోను, ఋషులతోను గూడి తండ్రి యాలోచించి నిశ్చయించిన పట్టాభిషేకంబు నిలిచిపోయెను. నాపైఁ బుత్రవాత్సల్యము గలిగియున్న కైకేయి కీ నాఁటికి నన్నుఁ గానలకుఁ బంపునంత కటికితనము గలిగినది. కావున దైవమున కెచ్చట నాటంకము లేదు. లక్ష్మణా! దైవ మున్నదనుట కేమి గుఱుతు? అటు లున్నను దైవమును మన ప్రయత్నముచే గెల్వఁ గూడదా? యని యందువేమో! దైవము మన కంటి కగుపడదు. అయినను దాని కార్యమునుఁ బట్టి యున్న దని యూహింపఁబడుచున్నది. కొందఱు బహు ప్రయాసతోఁ జేయు కార్యములు సిద్ధింపవు. కొందఱు ప్రయత్నపడకయే కార్యసిద్ధి నొందుదురు. ప్రయత్నపడి చేసినపని కాకపోవుటయుఁ, ప్రయత్న పడకయున్న పని తనంతట సిద్ధించుటయుఁ జూడ దైవ మున్నదని మనకు రూఢిగాఁ దెలియుచున్నది. అది యేల నివార్యముగాఁ గూడ దనిన, కార్య మగుపడనిది కారణ మిట్టి దని తెలియదు. కార్యమయిపోయిన తర్వాతఁ దనకు దైవంబు ప్రతి కూలముగ లేక యనుకూలముగ నున్నదోయను విచారము చేసి యుఁపయోగములేదు. కార్యము చెడకముందు కారణ మిట్టి దని తెలిసిన,

దానిని సవరించుకొనవచ్చును. కార్య మగునంతవఱకుఁ గారణము దైవముయొక్క యభిప్రాయ మిట్టి దని తెలియదు కావునఁ గార్యము మించిన తరువాత నా విచారము చేసి యుపయోగము లేదు. అది యనుభవించి తీఱవలసినదిగాని, దానికిఁ జికిత్స లేదు. భయంకరముగ తపస్సు చేయుచున్న వారయినను, ఋషులు దైవమాయకు లోఁబడి, కామమోహాములచేతను తమ కఠిన నియమములను విడిచి, చెడిపోవు చున్నారు. సుఖదుఃఖములు, భయక్రోధములు, కలిమి లేములు, చావు పుట్టుకలు మొదలగు కార్యములన్నియు దైవకార్యములె కాని పురు షుని ప్రయత్నముచే నగునవి కావు. మన మారంభించిన కార్యము కాక పోవుటయు, మన మనుకొనని కార్య మగుటయు దైవమాయగదా! కావున నేనును "మన ప్రయత్నములో నొక్కటియు లేదు. అన్నియు దైవమాయవలనఁ గలుగుచున్నవి" యనెడు యథార్థమయిన సంగతిని దెలిసికొని, మనసు నణఁచి, నా పట్టాభిషేకము నిలిచినను విచారము మానియున్నాఁడను. కావున నీవును నావలె మనమున విచారము మాని, పట్టాభిషేకమునకు సంబంధించిన ప్రయత్నము నిలుపుము. లక్ష్మణా! పట్టాభిషేకము నిమిత్తము తేఁబడిన తీర్థోదకములు నాయొక్క వనవాస వ్రతసంకల్పమునిమిత్తము చేయు స్నానమునకుఁ బనికివచ్చును. అట్లు రాజద్రవ్యమయిన తీర్థోదకములచేత స్నానముచేయుట కైకేయికి సమ్మతము కాదేమో! నేను స్వయముగాఁ దెచ్చిన యుదకముచేతనే వనవాస వ్రతసంకల్పమునకై స్నానము చేసెదను. లక్ష్మణా! 'రాజ్యలక్ష్మి లభింపకపోయేఁగదా' యను వ్యసనము మానుము. నాకు రాజ్య మయిన నొక్కటియే; వనవాసమయిన నొక్కటియే. రాజ్యమునఁ బ్రజల రక్షించుటయను ధర్మంబు లభించును. వనంబున నున్నఁ దపస్సు మొద లగు పుణ్యములు లభించును. యోఁచించిచూడఁగా, వనవాసంబునఁ బ్రజల న్యాయాన్యాయముల విచారణ లేమిం జేసియుఁ, దండ్రి మనుపునేయుట యను ధర్మంబు లభించుట బట్టియు వనవాసమే మేలని తలఁచెదను. లక్ష్మణా! పట్టాభిషేకమునకు విఘ్నము వచ్చేఁగదా యని యెంచకుము. దీని నిమిత్తమై, సవతితల్లియగు కైకేయి విషయమున సందియముఁ బాయుము. ఆమె యేమి చేయును? దైవయోగము

చేతనె యామె యట్టి యప్రియ వాక్యములఁ బలుకుచున్నది. భైవశక్తి యెవరికిని గెల్వరానిదిగదా! కావుసఁ గైకేయి నా పట్టాభిషేకమునకు విఘ్నము చేసినదియని తలంపకుము. విఘ్నముచేసినది భైవ మని తలంపుము" అని చెప్పెను.

23-వ సర్గము

లక్ష్మణుఁడు రామని వనవాసము మానుకొనఁ బురికొల్పుట

రాముఁ డిట్లు పలుకఁగా, నరశ్రేష్ఠుఁడగు లక్ష్మణుఁడు రాముని పలుకు లాలకించి, తలపంచి, చాలనేపు చింతించి, యన్నకుఁ బట్టము గట్టుట నిలిచిపోయె ననెడి వ్యసనంబును, దానితోఁగూడ, రాముఁడు తన కిష్టముగాని పనులఁగూడ జేయ నొప్పుకొనెనుగదా యనెడి సంతసము గలవాఁడై, కొంతసేపు దుఃఖపడుచుఁ గొంతసేపు సంతసపడుచు, గనుబొమ్మలు ముడివెట్టిఁ బూపటికిఁ దిగులుపుట్టినట్లు, పుట్టయంచుండు పామువలె బుసకొట్టుచుండెను. అట్టి కోపవంతుఁడైన లక్ష్మణుని మోము రేఁగిన సింహముయొక్క మోమువలె భయంకరముగాఁ దోఁచెను. వీనుఁగు తన తొండమును విదలించుసట్లు లక్ష్మణుఁడు తన ముంజేతిని విదలించుచుఁ, దలను గ్రిందికి మోఁదికిఁ బ్రక్కలకుఁ ద్రిప్పుచుఁ గ్రీఁగంటి చూపుతోఁ దన యన్నను జూచి యిట్లనియె.

"అన్నా! నీవు ధర్మములనెల్ల నెఱిఁగినవాఁడవు గావున దండ్రి మాట మీఱినచో దోషమువచ్చు ననియు, ధర్మముఁ బాసినయెడల లోకులు నిందింతు రనియు నింత తొందరపడుచున్నావు. శూరుఁడవగు క్షత్రియశ్రేష్ఠుఁడా! దుర్బలమైన దైవమును గొప్పవానినిగ నెంచితివి. నీవు భ్రమపడి చెప్పుచున్నావు కాఁబోలును! అట్లు భ్రమపడి యిట్లు పలుకుట తగదు. దుర్బలమగు హీనమైన దైవము నెక్కువగాఁ బొగడుచున్నావు. ఆ దశరథ కైకేయులు పాపాత్ములు. పాపాత్ములగు దశరథ కైకేయులయెడ నీ కేమియుఁ దప్పిదము తోఁపలేదుగదా. వారు చెడు తలంపు గలవారు గావున వారిమాటలను మీఱినను దోషము లేదు. ఓ ధర్మిష్ఠుఁడా, బూటకపు ధర్మాత్ములు కొందఱితరులకుఁ జెప్పుల కిఱుగా మాట లాడుచుందురు. వారివలెనే యీ దశరథ కైకేయు లిద్దఱు నీపైఁ బూటకంపుఁబ్రేమఁ గనఁబఱిచుచు, నీ కెగ్గుతలఁచి తమ పనిని సాధించి

కొన నెంచియున్నారు. ఇట్టి వీరిమాట వినకపోయినను బాధలేదు. వీరి చెడ్డతలంపు నీకుఁ దెలియ దయ్యెఁగదా. రఘువంశమునఁబుట్టిన యో నృపాలా! దశరథుఁడు కైకేయికి వరము లొసఁగినది యిప్పుడు గాదు. ఆ వరము లొసంగుట వాస్తవమైనచో దానిని నింతవఱకు దశరథుఁ డీయకుండునా? కైకేయి యడుగకయుండునా? ఇంతవఱ కాప్రస్తాపమే లేక యిప్పు డీ వరముల నడుగుట కిదియె తరుణమా? ఇప్పుడు కైకేయి యడిగినవరంబుల నాలోచించుచుండఁగా, వీ రిద్దఱు ముందుగా నిట్లు చేయుదమని యాలోచించి చేసినట్లున్నది. అట్లు వారు ముందుగా నాలోచింపనియెడల, దశరథుఁ డెన్నఁడో యిచ్చినవరంబును కైకేయి యడుగకయుండదు. ధర్మజ్ఞుఁడగు దశరథుఁ డీయకయుండఁడు. కావున నిప్పుడు కైకేయి యడిగిన వరంబులఁ జూడఁగాది వీ రిద్దఱు గలిసి చేసిన కృత్రిమ మని తోఁచుచున్నది. ఓ రామా, నీకుఁ గాక మఱియొక్క నికిఁ బట్టాభిషేకమునేయుట లోకసమ్మతము గాదు. అట్టి కార్యము దశరథ కైకేయులు చేయఁబూనుదురేని, నే నెంతమాత్రము దానికి సమ్మతింపను. ఆ విషయమునమాత్రము నీవు నన్ను మన్నింపవలయును. ఎక్కువ బుద్ధిగలవాఁడా నీవు తండ్రిమాట దాఁటరా దను నొకధర్మము నవలంబించితివి. ఆ ధర్మముచేతనే యిసుమంత పట్టాభిషేకము చేసికొనఁగలె నని యున్న బుద్ధి నీకు పుట్టకినది. ఆ ధర్మముచేతనే నీవు తండ్రిమాట వినకున్నఁ బ్రత్యవాయము గలుగు నని మోహము నొందియున్నావు. ఆ ధర్మము నీకెంతయు సమ్మతముగా నుండలేదు. నీవు కార్యములందు శేర్పరివి. తండ్రి యాఁడుదియగు కైకేయి వలలోఁ బడ్డి చెప్పినమాట యది. ఆ మాట న్యాయమార్గము దప్పినది. జనులచే మిక్కిలి దూషిత మైనది. అట్టి మాటను విని యా ప్రకారము నడచుటకుఁ బూనుకొంటివి. నీ వామాటను లక్ష్యముసేయక నీ పరాక్రమముఁ జూపవలెనుగాని, నీవు రాజ్యము విడిచి యడవికిఁ జనుట యుక్తముకాదు. నీ పట్టాభిషేకమును నిలిపి, భరతునికిఁ బట్టాభిషేకంబు జరుపవలయు ననియు, నిన్నుఁ గానలకుఁ బంపవలయు ననియు వారు చేసిన కృత్రిమమును నీ వెఱుఁగక యా ప్రకారంబు నడచుకొందువేని, నాకు వ్యసనము గలుగును. ధర్మలోపమును వాటిల్లును. కాముకులై, నీ కెప్పుడు గీడు

రోయుచుండు తల్లిదండ్రు లనువేరుగల యీ శత్రువులు కోరిన కోరి
కను నీవు యనసునన్నైన నెట్లు తలంపవచ్చును. వారికి నీ విషయమున
నిట్టి తలంపు గలుగుట దైవాధీనమని నీకుపేక్షయున్నను, నా కిది సమ్మ
తముగాఁ దోఁపలేదు. ధైర్య శౌర్యములు లేనివాఁడు, దైవసాహాయ్య
మున్నయెడల బుధులనుకూలించునని దైవమును గూర్చి తలఁచుచుండును.
చక్కని యాలోచనగల శూరులు తమ ప్రయత్నములచేఁ గార్యములను
సాధింతురుగాని, దైవమును నమ్మియుండరు. ఎవఁడు తన పురుష ప్రయ
త్నముచే దైవమును బడఁగొట్టఁ జాలునో, వాఁడు దైవమును నమ్మి తన
కార్యముఁ జెఱిచికొని వశింపఁడు. జనులుండ లేప్పుడు కూడి దైవబల
మెక్కువయో, పురుషప్రయత్నము గొప్పదో చూడఁగలరు. దైవబల
మానుషప్రయత్నములయొక్క తారతమ్య మిప్పుడు వెల్లడిగాఁగలదు.
ఏ దైవమిప్పుడు నీ పట్టాభిషేకంబుఁ జెఱిచినదో, యీ దైవమును నా
ప్రయత్నముచే బడఁగొట్టుదును. లోఁటులు చూతురుగాత. అంకుశము
నకు లోఁబడనిదియు, గొలుసు త్రెంచుకొన్నదియు, మదముచేఁ గలిగిన
బలిమిచే గర్వించియుండునదియునైన యేనుఁగును మావటీఁడువోలె
నడ్డులేక పాఱుచుండు దైవమును నేను బురుషప్రయత్నముచే మఱి
లించెదను. లోకపాలు రంగటు గూడి వచ్చినను నీపట్టాభిషేకమును నిలుప
జాలరు. మఱిల్లోకమును వారు గూడి వచ్చినను దీనిని బడఁగొట్టఁజాలరు.
అట్లుండఁ మునుపొ వాఁడగు తండ్రియొక్కఁడు మాత్ర మెట్లు నిలుపఁ
జాలును? నృపాలా! యిన రేకత్తునఁ గూడి నీ కరణ్యవాసము నిశ్చ
యించిరో, వారంబటు నా ప్రతాపమునకు వెఱచి యడవులందుఁ బదు
నాలుగేండ్లను నివసింపఁగలరు. తన వాక్యము చెల్లింపవలె ననెడి తండ్రి
యొక్క యభిశాసను, నీయొక్క పట్టాభిషేకంబును నిలిపి, తన కొడుకగు
భరతునకుఁ బట్టము గట్టుకొన వలెనని యున్న కైకేయి దురాశను జెడఁ
గొట్టుదను. దైవానుకూల్య మున్నప్పుడు నీవు వారినేమి చేయుదు
వందువేమో! నాతోఁ బగగొన్నవానికి దైవబల మనుకూలముగ
నున్నను, నా బలిమిచే దుఃఖము గలిగించునదియును, నా పౌరుష మెంత
బలిమిగలదో, దైవంబంత బలిమిగలది గాదు. నీవు వేయిసంవత్సరములు
రాజ్యముఁ జాలించి, యరణ్యమున కేఁగుదువేని, పిదప నీ పుత్రులు

రాజ్యపరిపాలనము సేయఁగలరు కాని భరతునకు రాజ్యము రానేరదు. తొల్లి రాజర్షులందఱు తనకు శక్తి యున్నంతవఱకు రాజ్యపరిపాలనము గావించి, తమకు బలిమి యుడిగినప్పుడు, కొడుకులను బిలిచి, "కొడుకులారా! మీరు మీ కొడుకులనుబోలె రాజ్యమందలి జనులను బ్రేముతోఁ బోషింపుఁడీ" యని వారితోఁ జెప్పి, పిదప నరణ్యములకుఁ జనిరి. భర్మస్వరూపుండవగు రాజేంద్రా! నృపాలుఁడు ముసలివాఁడు గనుక మనసు దప్పి యున్నాఁడు గావున ఓశూరుఁడా! నీవు రాజ్యమునందుఁ గలహాములు పుట్టునని యెంచి రాజ్యమును నీకుఁ జేసికొన నొల్లవేని, శూరుఁడనైన నేను నీకు బాసటనైయుందును, నీ కే భయమును గలుగదు. అట్లు నీ రాజ్యాధిపత్యమునకు భంగము గలుగునేని, "నేను నీ లోకం బులఁ బొందను" అని పంతము చేసెదను. అట్లు రాజ్యము నీ స్వాధీనంబు నేయుటయేకాక, పిమ్మటఁ గూడఁ జెల్లెలికట్టి సముద్రముఁ గాపాడునట్లు నీ రాజ్యమును గాపాడుచుందును. కావున నీ రాజ్యంబున నెట్టి యల్లకల్లోలములుం బుట్టవు. నీవు వసిష్ఠుఁడు మొదలగు ఋషులమూలమునఁ బట్టాభిషేకంబును జేయించికొని, రాజ్యపాలనమునం దాసక్తిగలిగియుండుము. నే నొక్కఁడనే నీ పైకి వచ్చెడి రాజులనందఱను నా బలిమిచే నడ్డగింపఁజాలుదును. ఈ నా చేతులు రెండును, విల్లును నాకు వేడుకకైయున్నవి గావు. నేను శత్రువులపై బాణములఁ బ్రయోగించు నిమిత్తమే చేతులను, బాణములను సంధించుటకు విల్లు పూనియున్నాను. కత్తి శత్రుశిరముల నఱికుటకేకాని, నడుమునకుఁ గట్టుకొనుటకుఁగాదు. అట్లే బాణములును శత్రువుల మీఁద నేయుటకేకాని, గుంజలవలె నిలఁబెట్టియుండుటకుఁగాదు. నాకుఁ జేతులు, ధనుస్సు, బాణములు, ఖడ్గము ననునాలుగు గలిగియుండుట శత్రువినాశము నిమిత్తమేకాని వే ఱొక పని నిమిత్తముగాదు. ఎవఁడు నాకు శత్రువో, వానిపైఁ గడుఁ గోపము గలిగియుండును. పదునైన యంచులుగలిగి, మెఱిపువలె మెఱయుడాలు గల బాకును దూసి చేతఁ బట్టి వజ్రాయుధముఁ దాల్చిన యింద్రునైననుఁ లక్ష్యపెట్టక సంహరింతును. శత్రువులు సైన్యములతోఁ గూడి వచ్చిన నడ్డగింతురేని, పుడమి దొల్లి ఖడ్గముచేఁ దుత్తునియలు సేయఁబడిన యేనుఁగులయు, గుఱ్ఱము

లయు, మనుష్యాలయుఁ జేతులు కాళ్లు మొండెములు మొదలగు వానితోనిండినవై, చీకట్లు గ్రమ్మి, యడుగిడుటకుఁగూడఁ దావు లేకుండు నట్లు చేయుదును. మఱియు, నేనుఁగులును నా కత్తిచే బొడుమఁబడినవై, వెలుఁగుచున్న పర్వతములంబోలిన వగుచు, మెఱపులతోఁగూడిన మబ్బులమాడ్కి నేలపైఁ బడఁగలవు. నేను వైర్లకు రక్షకమగు నుడుము త్రోలుకవచమును దొడిగి, విల్లు చేతఁబట్టి, ముందునిలిచినయెడల, నేను మగవాఁడవని యెన్నఁడు దిగులు లేకుండ ముందుకు వచ్చి నిలఁబడఁ గలఁడు. అందఱు వెఱచి పఱుగిడుదురుగాని యొక్కఁడును నిలువఁ జాలఁడు. బలవంతుని ననేక బాణంబులనేసి పడఁగొట్టుచు, సామాన్యులను బలువుర నొక్క బాణముచేతనే పడవేయుచు, భటులయు, గుఱ్ఱము లయు, నేనుఁగులఁగు మర్మస్థలంబులఁ గొట్టుచు, యుద్ధవిహారము సేసెదను. ప్రభువగు రాముఁడా! దశరథుని రాజ్యమునుండి తొలఁగించుటకును, నీకు రాజ్యము నొసఁగుటకును నా యస్త్రముల సామర్థ్యము జూపెదను. రామా! ఈ నా బాహుబలము గందమూ పూసికొనుటకును, బాహుపురులు దాల్చుటకును, ధనములను యాచకుల కొసఁగుటకును, స్నేహితులను గాపాడుటకును నేర్పడినవి. ఇట్టి నా బాహువు లిప్పుడు నీ పట్టాభిషేకమునకు విఘ్ననమును జేయువారలను నివారింపఁజాలును. ఓ రామా! నీకు మేలుగోరని శత్రు వెవ్వఁడో? వాని ప్రాణములను, కీర్తిని, చుట్టాలను, స్నేహితులను గూడఁ బరిమార్చెదను. ఓ రామా! యీ భూమండలమెల్ల నీ యధీనమెటు లగునో యా ప్రకారము చేయ నానతిమ్ము. నేను నీకు దాసుఁడనుగాని, మఱొక్కఁడనుగాను" అని లక్ష్మణుఁడు పటికోపముతో రామునిఁగూర్చి చెప్పెను.

రాముఁడు లక్ష్మణుఁడు వ్యసనముతోఁ జెప్పిన పలుకులు విని, యాతని కన్నీరుదుడిచి, పలుమారు బుజ్జగించి, "లక్ష్మణా! నీ నెమ్మదిని నెఱుఁగుదును. నీవ దేల యింత యాగ్రహము నొందితివి. నీ వెన్ని చెప్పినను సరే నేను తండ్రిమాట మీఱఁజాల"నని దృఢముగా నెఱుఁగుము. మానవులకుఁ దండ్రిమాట మీఱకుండుటయె యుత్తమ మార్గమని తెలియు" మని చెప్పెను.

24-వ సర్గము

కౌసల్యాదేవి రాముని వనవాసంబు నంగీకరించుట

రాముఁడు తండ్రియొక్క యానతిని నెఱవేర్చుటయందే పట్టుదల గలిగియుండుటను జూచి, కౌసల్య కన్నీరు క్రుక్కుకొని గద్గదస్వరముతో ధర్మయుక్తముగు నీమాటఁ జెప్పెను.

"ఓ రామా! దశరథమహీపాలునివలనఁ బట్టంపుదేవియగు నాయందుఁ బుట్టితివి. నీవు పుట్టినదిమొదలు గష్టమెట్టిదో యెఱుఁగకుంటివి. నీవును ధర్మము దప్పని స్వభావముగలవాఁడవు. సకల జంతువులకును ప్రియంబులగు పలుకులు పలుకువాఁడవు. ఇట్టి రాముఁ డెట్లు కేలమీఁద రాలిన ధాన్యపుగింజలను నొక్కటొక్కటిగా నేరుకొని తన జీవనముఁ గడుపఁగలఁడు. తన బంటులును, పరిచారకులును సకలవిధసాధకములతోఁ గూడిన యన్నమును దినుచుండఁగా నీ రాముఁ డడవులలో దిక్కుమాలిననాఁడువోలె గడ్డలను పండ్లును నెట్లు దినుచుండఁగలఁడు? సకల గుణములుగలవాఁడగు ప్రియసుతుఁడైన రాముని నృపాలుఁ డడవులకుఁ బంపుచున్నాఁడనిన నెవ్వరైనను నమ్ముదురా? అట్లు నమ్మినతర్వాత నెనసనికిగుండె దడ పుట్టకుండునను? రామా! నీవు జనులకుఁ గోరఁదగినవాఁడవయిననను, నేఁటైవము వలన నడవికిఁ బోవఁ దటస్థపడెనో, యీ దైవము జనులనందఱిని 'నీవిట్లు చేయుము' అని యానతిచ్చునది కావున నది మిక్కిలి బలిమిగలది. ఇది నిస్సంశయము. నిన్నుఁ జూడమిచేఁ నా దేహమునఁ బుట్టి, నిన్నుఁ జూడకుండుటయనెడు గాలిచే రాఁజి, యేడ్పు, దిగులు ననెడు సమిధలు, యేడ్పువలని కన్నీ రనెడి యాహుతులు చింతాబాష్పమనెడు విశేషమైన పొగయుఁ గలిగి, నిట్టూర్పులచే వృద్ధినొందు దుఃఖమనెడు నగ్ని వేసవియం దగ్నిహోత్రుఁడు పొదయండుఁ బ్రవేశించి, దహించునట్లు నిన్నుఁ బాసి యిచ్చట నొంటరిగానున్న నన్నుఁ గాల్చివేయఁగలడు. నాయనా! దూడపోవుచుండఁగా నావు దనదూడను వెంబడింపకుండునా? కావున నేను నిన్ను వెంబడించి వచ్చెద" నని కౌసల్య వ్యసనముతోఁబలికిన పలుకులు విని, పురుషశ్రేష్ఠుఁడైన రాముఁడు కడుఁజింత నొందియున్న తల్లినిజూచి "ఓ తల్లీ, నృపాలుఁడు కైకేయిచే మోస

పుచ్చఁబడినవాఁడు. నేనును నడవికిఁబోయి, నీవును నతనిని విడిచివత్తు వేని, యతఁడు చాలాకాలము జీవింపఁడు. మగని నెడఁబాసియుండుట మగువలకుదగని యకార్యము. కావున మనసునం దైనను దలఁపఁగూడని యీ కార్యము నీవు చేయకాదు. లోకాధిపుఁడయిన నా తండ్రి బ్రతికి యున్నంతదనుక నీవు శుశ్రూష సల్పుచుండుము. అదియె మగువలకు శాశ్వతమైన ధర్మము" అని చెప్పెను.

మంగళకరమైన దర్శనము గల కౌసల్య రాముని వాక్యమును విని సంతసించి, యెుగులకు సుఖములఁగలిగించు రామునిఁజూచి, "నాయనా నీవు చెప్పిన చొప్పుననే నడచుకొందు"నని చెప్పెను. ధర్మమును బోషించు వారిలో నుత్తముఁడగు రాముఁడు మఱల మిక్కిలి వగలపాలయిన కౌసల్యనుజూచి, "తల్లీ! తండ్రిచెప్పెడు మాట నేనుమాత్రమే కాదు; నీవు నాలకింపవలసినదే. దశరథుఁడు జనులనందరిం బోషించువాఁడు; గురువు; ఉత్తముఁడు; అందరికిఁ బ్రభువు; సకల కార్యనిర్వాహకుఁడు. ఈ పదు నాలుగేండ్లు అడవులందు దిరిగి పితృవాక్య పరిపాలనగాఁ గడుతనివి నొంది, మఱలివచ్చి నీ యిష్టప్రకార ముండెదను" అని కౌసల్యతోఁ జెప్పెను.

రాముని పలుకులు విని పుత్రవాత్సల్యముగలదై, కన్నీరు విడుచుచు మనమున మిగుల వగచి, తన ముద్దుల కొడుకును జూచి "రామా! నేను సవతులనడుమ నుండఁజాలను గావున ననుఁగూడ నీ వెంటఁ దీసికొనిపొమ్ము. కాకుత్స్థా! తండ్రి మాటమన్ననలి గౌరవమునం జేసి నీ వడవికిఁబోవఁ దలంచితివేని వనంబునఁ బుట్టిన యాఁడుజింకనువలె ననున్ను బిలిచికొనిపొమ్ము. నేను నడవులందు హరిణాంగనవోలె సంత సముతోఁ దిరుగుచు నీ కే శ్రమయుఁ గలిగింపకుండెదను" అని చెప్పి గొల్లున నేడ్చుచున్న తల్లినిగని, రాముఁడు తానును నేడ్చుచు "తల్లీ! యాఁడుదానికి బ్రతికియున్నంతదనుకను భర్తయే దైవము, భర్తయే రక్షకుఁడు. కావున మఱొక్కని నాశ్రయింపఁజనదు. ఇప్పుడు దశరథనృపాలుఁడు నాకును నీకును బ్రభువు. కావున నతనియాజ్ఞకులోఁబడి మనము నడచుకొననలయును. లోకములకెల్లఁ బ్రభువయి బుద్ధిచాతుర్యము గల దశరథనృపాలుఁడు మనకుఁ గావుదలయ్యి యుండ మనము దిక్కులేని

వారమునగామునగదా! నీవు నాథుఁడు లేనిదానవుగావుగదా. నీ వనాథ వలె నేల భయపడెదవు? నీకు సవతులవలని భయమును లేదు. భరతుఁడును ధర్మస్వభావముగలవాఁడు. సకల భూతములందును బ్రేమగలిగి వారి కిష్టములగుమాటలఁ జెప్పువాఁడు. కావున నతఁడు నీపైఁ బ్రేమయు భక్తియుఁగలిగి, యెల్లప్పుడు నిన్నుఁ గొల్చుచుండును. అతఁడొక్కరి దుర్బోధనలకు లోఁబడి యపకారము చేయువాఁడుకాఁడు. అతఁడు సర్వదా ధర్మమం దాస్థగలవాఁడుగావున, ని న్ననుసరించి యుండును. నే నడవికిఁ బోయిన పిదప దశరథుఁడు పుత్రు నెడఁబాయుటవలన దుఃఖనుచేత నాయాసము నొందకుండునట్లు కొంచెమయినను నేమఱుపాటులేక మంచిమాటలఁ జెప్పుచు నుపచారము సల్పుచుండుము. ఈయోర్వారాని పుత్రవియోగశోకముచే దశరథుఁడు వినాశమునొందకుండునట్లు, నీ వెల్లప్పుడు జాగరూకురాలవై యాతనికి మేలగు పనులను జేయుచుండుము. ఆఁడుది సకల సుగుణములుగలదై, యెల్లప్పుడు నోములు నోచుచు నుపవాసములు సల్పుచున్నను, భర్తృశుశ్రూష సేయకుండినయెడల, నరకములం బడునే కాని, యుత్తమలోకముల నొందఁజాలదు. పెద్దలకు మ్రొక్కక, దేవపూజలు చేయక యున్నను బెనిమిటికి శుశ్రూషచేయుచున్న యాఁడుది యుత్తమలోకమును బొందును. కావున యాఁడుది యెల్లప్పుడు పెనిమిటికి శుశ్రూషసేయుచుఁ బెనిమిటి మనస్సున కిష్టమయినవియు, మేలుగావించు నవియునైన పనులను జేయుచుండవలెను. ఈ ధర్మమే లోకమునందు వాడుకయైయున్నది; వేదములందును జెప్పఁబడియున్నది. ధర్మశాస్త్రము లును వేదముల కనుకూలముగనే వాక్కొచ్చుచున్నవి. ఓ తల్లీ! నేను వచ్చునంత దనుకను నా మేలుకై యగ్నిహోత్రములందు హోమములు చేయుచుండవలయు; దేవతలకు బుష్పములతోఁ బూజలు సల్పుచుండవలయు, నియమముఁగల బ్రాహ్మణోత్తములను దానములతో సంతోషపఱచుచుండవలయు. ఇవ్విధమున నీవు నాయొక్క రాకను నెదురు చూచుచు మనసు నణఁచుకొని, మద్యమాంసాదులను వర్జించి, శాకములతోఁగూడిన యాహారముఁ గుడుచుచు,

భర్తృశుశ్రూషయందే యాశక్తి కలిగియుండుము. నేనును వనవాసము పూర్తిచేసి వచ్చునప్పటికి, ధర్మపోషకులలో నుత్తముండగు దశరథనృపాలుండు బ్రతికియుండునేని, నీవు కోరిన కోరికల నొందఁ గలవు" అని తల్లికినోదార్పు మాటలఁ జెప్పెను. కౌసల్యయు రాముఁ డివ్విధమునఁ జెప్పిన పలుకులు విని కన్నీటిచే నిండినచూపులుగలదై, పుత్రు నెడఁబాటునకు మనమున వగచి, రామునింజూచి, "ఓరీ నా బిడ్డఁడా! నీ పడవి కేఁగవలసినది' యని యొకకొ పట్టు పట్టినావు. నీవు పట్టినపట్టు నేను మార్పఁజాలను. విధి యెవరికిని దప్పింపఁదరము గాదు. ఓ శూరుఁడా! యెవని కేవేళ నేదివచ్చిన, వాఁ డా వేళలో దాని ననుభవించి తీరవలసినది. ఇది నిజము. ఓ కుమారా! నీవు స్థిరుఁడవై యడవికిఁబొమ్ము. ఓ సమర్థుఁడా! నీ కెల్లప్పుడు మేలుగలుగునుగాక! నీవు మఱలి వచ్చినపిదప నా కష్టములన్నియుఁ బాయును. మహాసమర్థుఁ డవయిన నీవు తండ్రి మాటప్రకారముఁగ వనవాసవ్రతము ముగించి, కృతార్థుఁడవై వచ్చి, తండ్రిఋణంబుఁ దీర్చుకొనినవాఁడవుకాఁగానే నధిక సౌఖ్యము నొందఁగలను. నే నింతదూరము చెప్పినను నా మాటను గాలదన్ని పోవుచున్నావు. ఇదివఱ కెన్నఁడయిన నిట్లు నడచికొని యుందువా? ఇప్పుడు నీ విట్లు నామాట వినకపోవుటకుఁ గారణము దైవ బలమేకాని వేఱొక్కటికాదు. ఆ దైవముయొక్క పోకడ యిట్టిదని యెవ్వరికి నెప్పటికిని దెలియదు. పొడవు చేతులవాఁడా! నీ విప్పుడు వనమునకేఁగి మఱల క్షేమముతో నేతెంచి మనోహరములగు మంచి మాటలతో నన్ను సంతోషపఱపఁగలవు. ఓ నాయనా! జడలనుదాల్చి నారబట్టలను గట్టుకొని వనవాసమునుండి మఱలివచ్చిన నిన్నుఁ జూతునో లేదో! ఆకాలమిప్పుడే వచ్చిన నాకు సంతోషప్రదముగా నుండును" అని వనవాసమునందు మనస్సును దృఢపఱచికొనియుండు రాముని గౌసల్య మంచి మనస్సుతోఁ జూచి, సర్వలక్షణములతోఁ గూడిన యా రాముతో నిట్లు పలికి, యాతనికి మంగళాశీర్వాదములు నేయఁగోరిన దాయెను.

25-వ సర్గము

కౌసల్య రామునకు మంగళాశీర్వాదములు చేయుట

గొప్ప మనస్సుగలదగు కౌసల్య పుత్రునెడఁ బాయుటవలనఁ గలుగఁబోవు దుఃఖమువిడిచి, కన్నీరువిడుచుటవలని మైలఁ దొలఁగించు కొనుటకై యాచమనమఁుచేసి, పరిశుద్ధురాలై యీ క్రిందివిధమున మంగళాశీర్వాదములను జేసెను.

"రఘువంశమునఁ బుట్టిన నృపాలురలో శ్రేష్ఠుఁడా! నే నెంత చెప్పినను నిన్నరణ్యమునకుఁ బోవకుండఁజేయఁజాల నైతిని. నీ యిష్టము చొప్పున నిప్పుడు వనమునకుఁ బోయిరమ్ము. అచ్చట నుండనలసినంత కాలముండి, యీ సమయము తీరినవెంటనే బయలుదేతిరమ్ము. సత్పురుషుల మార్గముననే యుండుము. రఘువంశస్థులలో శ్రేష్ఠుఁడా! నీవు సంతసము గలిగినవాఁడవై, నియమముతో నే ధర్మమును గొంచెము కూడఁ దప్పక పాలించుచున్నావో, ఆ ధర్మము నిన్నుఁ గాపాడునుగాక! ఓ పుత్రుఁడా! నాలుగు దారులు గలియుచోట్లను, దేవళములందును నే యే దేవతలకును, వనంబులందుగడు నే యే మునులకును మ్రొక్కుచున్నావో! ఆయా దేవతలఁను, మునులును నిన్నుఁ గాపాడుదురుగాక! బ్రహ్మజ్ఞానియగు విశ్వామిత్ర మునీంద్రుఁడు నీ కుపదేశించిన యన్ని యస్త్రములు సుగుణ సంపన్నుఁడవయిన నిన్నెల్లప్పుడు కాపాడుచుండునుగాక! ఓ పొడవు చేతులుగల నాయనా! తల్లిదండ్రులకొసర్చిన శుశ్రూషయు, సత్యవాక్య పరిపాలనమును నిన్నన్ని యాపదల నుండికాపాడునుగాక! సాధ్యులు, విశ్వేదేవ్రులు మరుత్తులు, మహర్షులు నీకు మేలుసేయుదురుగాక! పురుషశ్రేష్ఠుఁడవైన రామునఁడా, నీ వేఁగెడి యడవ్రలందలి యాశ్రమములందుండు సమిధలు, కుశలు, పవిత్రములు, జన్నంపువేదికలు, కోచెలలు, వింతలైన దేవపూజ సేయు చోట్లు, కొండలు, చెట్లు, మ్రాఁకులు, మడుఁవులు, పక్షులు, సర్పములు, సింహములు నిన్నుఁ గాపాడునుగాక! సమస్త ప్రపంచమున కాధారభూతుఁడయిన విరాట్పురుషుఁడును, సృష్టికర్తయగు బ్రహ్మయు, పన్నిద్దఱు సూర్యులలోఁ జేరిన పూష, భగుఁడు, నర్యమయనువారును నీకు మేలుచేయుదురుగాక! దేవేంద్రుఁడు మొదలగు లోకపాలు లందఱు

నీకు మేలుచేయుదురుగాక! వసంతము మొదలగు నాలు ఋతువులు, శుక్లపక్షు కృష్ణపక్షములు, నెలలు, సంవత్సరములు, రాత్రులు, పగళ్లు, ముహూర్తములు మొదలగు కాలభేదము లెల్ల నెల్లప్పుడు నిన్ను రక్షించునుగాక! స్మృతి, ధృతి, ధర్మములు కష్టము లేకుండ నీకు నిరంతరము రక్షణమొసఁగునుగాక! దేవసేనాధిపతియగు కుమారస్వామియుఁ, జంద్రుఁడును, బృహస్పతియు, సప్తర్షులును, నారదమునీంద్రుఁడును నన్ని కష్టములనుండి నిన్ను రక్షింతురుగాక! అన్ని విషయములందును గొఱఁత లేని యట్టి దిక్కులును, దిక్పాలురును, నా చేయు వేఁడికోలులచే సంతసించినవారలై వనవాసము చేయుచున్న నిన్నెప్పుడును గాపాడుచుందురుగాక! పర్వతము లన్నియు, సముద్రము లన్నియు, జలాధిపతియగు వరుణుఁడును, స్వర్గము, ఆకాశము, భూమి, నదు లన్నియు, నక్షత్రము లన్నియు, గ్రహములు, గ్రహదేవతలు, రాత్రియుఁ బగలును, ప్రాతస్సాయంసంధ్యాకాలములును వనవాసమునన్న నిన్ను రక్షించునుగాక! మహారణ్యమునందు మునివేసముతోనున్న జ్ఞానివైన నీకు దేవతలు, దైత్యులు నెల్లప్పుడు సౌఖ్యము నిచ్చువార లగుదురుగాక! ఓ నాకూనా! ఘాతుకకార్యములఁ జేయునట్టి భీకరులైన రాక్షసులవలనను, పిశాచములవలనను, మాంసమును దినునట్టి క్రూరమృగములవలనను నీకు భయము లేకుండును గాక! వానరములు, తేళ్లు, అడవియీఁగలు, దోమలు, పాములు, పురుగులు మొదలగు విషజంతువులు నీవు సంచరించెడి యరణ్యములందు లేకుండునుగాక. ఉన్నను నీకు హానిచేయునవిగాకుండునుగాక! గొప్ప యేనుఁగులు, సింగములు, పులులు, ఎలుఁగుబంట్లు మొదలగు కోఱలుగల మృగములు, గొప్ప కొమ్ములుగల భయంకరములగు నడవి దున్నలు నీకు ద్రోహము సేయకుండును గాక! మఱియు మానవుల మాంసముఁ దినునట్టి యనేకములగు నితర ప్రాణులిచ్చట నే నొనర్చు పూజలఁగొని నీ జోలికి రాకుండును గాక! రామా నీకు దారులు శుభము లొసఁగునుగాక! నీ పరాక్రమము సాటిలేనిదై వెలయుచుండునుగాక! ఓ చిన్నకొడుకా! సకల సంపదలకై నీవు నేమముతో నడవికిఁబోయి వత్తువుగాక! నీకు ఆకాశమందుఁ దిరుగు దేవతలును, పుడమియందుఁ దిరుగు దేవతలును, శత్రువులయినను

తఱచు నీకు మేలుసేయుదురుగాక! రామా! దండకారణ్యమున నున్నట్టి నిన్ను గురువు, చంద్రుఁడు, సూర్యుఁడు, కుబేరుఁడు, యముఁడును నాయొక్క పూజలను గొనుచు రక్షింతురుగాక!

రఘునందనా! అగ్ని, వాయువు, అగ్నిహోత్రధూమము (పొగ), ఋషుల నోటినుండి వచ్చిన మంత్రములు నీవు నదులలో స్నానము సేయునప్పుడు నిన్ను రక్షించునుగాక! సకల లోకాధిపతిగాను, సకల జంతువులను బోషించువాఁడును నగు బ్రహ్మగాను, ఋషులందఱును, తక్కిన దేవతలును వనవాసము చేయుచుండు నిన్ను రక్షింతురుగాక!" ఇట్లు రామునిదీవించి, కీర్తిమంతురాలును, విలువిస్సులగలదిగాయున్నైన కౌసల్య గంధ పుష్పాదులచే దేవతలందఱిని బూజించి, ఉచితములయిన స్తోత్రములతోఁ గొనియాడెను. మఱియు నగ్నిం బ్రణయించి, రాముని మంగళముకొఱకు మహాత్ముఁడగు బ్రాహ్మణునిచే శాస్త్రప్రకారముగా హోమము చేయించెను. ఉత్తమకాంతయగు కౌసల్య హోమము నిమిత్తము సేతిని, తెల్లని పూవ్వులను, సమిధలను, తెల్లని యవాలను దెప్పించెను. అంతట నుపాధ్యాయుండు సకలరోగనివారణార్థమయి యగ్నిహోత్రునియందు హోమముచేయఁగా మిగిలిన హవిస్సుతో వెలుపల బలిం గావించెను. అంతట నుపాధ్యాయుండు తేనె, పెరుఁగు, అక్షితలు, నేయి మొదలగువానిని బ్రాహ్మణులకొఱకు, స్వస్తి వాచనము చేయించెను. అంతటఁ గీర్తిమంతురాలయిన రాముని తల్లి యగు కౌసల్య యుపాధ్యాయుండగు నా బ్రాహ్మణోత్తమునకుఁ గోరిన దక్షిణయొసఁగి, రామునిఁజూచి "రామా! నృత్రాసుర సంహారమప్పుడు, సకలదేవతలచే నమస్కరింపఁబడిన దేవేంద్రునికిఁ గలిగిన మంగళమునంటి మంగళమునీకుఁగలుగునుగాక! పూర్వము గరుత్మంతుఁడు తన తల్లియొక్క దాస్యము దొలఁగుటకై యమృతముఁ దెచ్చుటకు స్వర్గమునకుఁ బోవునప్పుడు తల్లియగు వినత చేసిన మంగళము నీకుఁ గలుగునుగాక! సముద్రము చిలుకునప్పుడు దైత్యులను సంహరించిన వజ్రాయుధపాణియగు దేవేంద్రునకు నదితిదేవి యొసఁగిన మంగళము నీకుఁ గలుగునుగాక! తొల్లి వామనరూపుండై బలిచక్రవర్తిని మూఁడడుగుల భూమిని యాచించి మూఁడడుగులచే ముల్లోకముల నాక్రమించిన మహాను

భావుఁడగు విష్ణువునకుఁ గలిగిన మంగళము నీకుఁ గలుగునుగాక! గొప్ప చేతులుగల యోరామా! మిక్కిలి మంగళకరములయిన ఋతున్నులు, సముద్రములు, ద్వీపనులు, నాలుగు వేదములు, ముల్లోకములు, ఎనిమిది దిక్కులును మంగళముల ననేకముల నొసఁగునుగాక! విశాల నేత్ర యగు కౌసల్య పుత్రున కిట్లనేకవిధములఁగు దీవనలుసల్పి శిరమున మంత్రాక్షతలు చల్లి, గంధముపూసి, తప్పక కార్యసిద్ధిని గలిగించు విశల్యకరణియను మూలికను (దేహమునఁ గ్రుచ్చుకొన్న బాణముల వేదనను పోఁగొట్టునట్టి మూలికను) రాముని హస్తమున రక్షకట్టి మంత్ర ములచే నభిమంత్రించెను. ఆ కౌసల్య దుఃఖములకుఁ బాలయి, మనం బునఁగాక, నోటమాత్రము సంతోషపడిన బానివలెనయి, రాముని దలమూర్కొని, కౌఁగిటఁ జేర్చి, డగ్గుత్తికతోఁ గూడిన పలుకులతో రామునిఁగూర్చి, "రామా! వనమున నీ కార్యమును నెఱవేర్చుకొన్న వాఁడవై, క్షేమముగా వచ్చి చేరుము. ఓ బిడ్డఁడా! నీవు ఆరోగ్య వంతుఁడవయి యన్ని కార్యములు నెఱనేర్చుకొని, మఱలి యయోధ్యకు సుఖముగా నేతెంచి, రాజ్యార్హమయిన పట్టాభిషేకము నొంది జనపరి పాలనము నేయుచున్న నిన్నుఁ జూడఁ గోరుచున్నాను.

నీ రాక విన్నంతటనే పాటిపోయిన దుఃఖములుగలదానను, సంత సముచే మెఱయుచున్న మోముగలదాననగుచు, ఉదయించిన పున్నమచందురునిమాడ్కి వనమునుండి యేతెంచిన నిన్నుఁ జూడఁగల దానను. రామా! వనవాసము ముగించి, తండ్రియొక్క యానతిని నెఱ వేర్చి యయోధ్యకేతెంచి, సింహాసనమున నున్న నిన్నుఁ జూడఁగలను. రామా! సకల శుభములతోఁ నీ వడవినుండి యేతెంచి, వెలయుచు నా యొక్కయు, నా కోడలియొక్కయుఁ గోరికలను బెంపొందింపుము. పోయిరమ్ము. రామా! దిక్కులు, పర్వతములు, ఈశ్వరుఁడు మొదలగు వేల్పులును, మహర్షులును నే నిప్పుడు చేయువూజలకుఁ దనివినొంది, బహుకాలము వనవాసముసేయుఁ బోవు నీకు మేలుగావింతురుగాక" అని కన్నీటితో నిండిసకన్నులు గలదై, శాస్త్రవిధిచొప్పున దీవనలుసల్పి, ప్రదక్షిణముచేసి పలుమాఱు గట్టిగ నాలింగనము చేసికొనెను. అట్లు తల్లియగు కౌసల్య రక్షకొఱకుఁ బ్రదక్షిణము సేసిన పిదప గీర్తివంతుఁ

డగు రాముఁడు పలుమాఱు తల్లిపాదములకు బట్టిమ్రొక్కి స్వకీయమైన కాంతితో వెలుఁగుచుఁ దన కాంతయగు సీతయొక్క యంతఃపురమునకుఁ బోయెను.

26-వ సర్గము.

సీత రాముని విన్నదనమునకుఁ గారణము నడుగుట

రాజపుత్రుఁడగు రాముఁడు కౌసల్య యొన్ని చెప్పినను దన తండ్రి యానతి మీఱరా దనియెడు నొక గొప్ప ధర్మమునందే యున్న వాఁడగుటంజేసి తల్లికి నమస్కరించి యడవికిఁ బయనమాయెను. కౌసల్యయు రామునియొక్క దృఢనిశ్చయమును జూచి యింకఁ దన పలుకులు పనికిరావని యెంచి యతని యభిప్రాయమున కియ్యకొని, యాతని కరణ్యవాసమున నేయపాయములు గలుగకుండునట్లు దీవనలు సల్పెను. అట్లు రాముఁడు కౌసల్య యనుమతివడసి జను లందఱిచేఁ గ్రిక్కిరిసి యున్న రాజమార్గమును దనకాంతిచేఁ వెలుఁగఁజేయుచు వచ్చుచుండెను. అప్పుడు రామునిసుగుణములనుగూర్చి జనులందఱు దమహృదయములం దానందము నొందుచుండిరి. పట్టాభిషేకము నిమిత్తము నియమముపూని యున్న సీతయు రాముని యరణ్యవాసమును, భరతుని పట్టాభిషేకము గూర్చిన సంగతిని యెఱుఁగకుండెను, గావున నామె తన కాంతుని యువ రాజపట్టాభిషేకంబును గూర్చియె మనమునఁ దలపోయుచుండెను. అట్లు పట్టాభిషేకముంగూర్చి మనమునఁ దలపోయుచు, సీత తానే దేవపూజలు సల్పి, పట్టమహిషిచేయవలసిన కార్యములనెల్ల నెఱిఁగినదియు, సంతోష భరితమగు మనస్సుగలదియు, రాజధర్మముల నెఱిఁగినదియు నైనందున, రాజపుత్రుఁడగు రామునిరాక కెదురుచూచుచుండెను. అప్పుడు రాముఁడు నే నీ సంగతి నెట్లు సీతతోఁ దెల్పుదునని సిగ్గుచేఁ దలవంచు కొన్నవాఁడై, సంతోషముతోఁ గలకలలాడుచుండుజనులు గలదియు పట్టాభిషేకమునిమిత్తము చక్కఁగా సింగారింపఁబడినదియునైన తననగరు సొచ్చెను. అంతట సీతాదేవి తటాలునలేచి, గడగడవణఁకుచు, దుఃఖముచే నొచ్చి యింద్రియ విషయములందుఁ గలనరపడియున్న తన మగనిని జూచెను. అంత ధర్మమార్గము దప్పనివాఁడగు రాముఁడు తన ప్రియ కాంతనుజూచినంతటనే తన మనస్సునందున్న చింత నణఁచుకోజాలక, యా

దుఃఖమును బయలుపఱిచెను. అప్పుడు సీత కళ్ళదప్పి, జోఁబుచెమటలు గార్చుచుఁ, దుఃఖము నాపుకొనఁ జాలనివాఁడైయున్న తన కాంతుని జూచి, తానును మిక్కిలి వ్యసనమునొంది, "నాథా! యిప్పు డిది యేమి? ఓ రఘువంశోద్భవా! ఈ దినమీకదా బృహస్పతి దేవతగాఁగల సంపదలతోఁ గూడిన పుష్యమీనక్షత్రము. వేదవేదాంగపారంగతులగు పండితులీ పుష్యమీనక్షత్రము మంచి దని తెలిపిరిగదా! అట్లుండఁగా నీవేల యిట్లు వ్యసనపడుచున్నావు? ఓ నాథా! నూఱు కమ్ములుగలిగి, సుఱుగుతో సమానమైయున్న తెల్లని ఛత్రముచే నీ యందమైన మోమును గప్పుకొనకున్నా వచేమి? చంద్రునివలెను, హంసవలెను దెల్ల నైయున్న సొగసయిన చామరములతో నీ మోము విసరఁబడకున్న దేల? నేర్పరులైన వంది, సూత, మాగధులు సంతోషభరితులై శుభవచనము లచే నిన్నుఁ బొగడ్తలు సేయకున్నారేల ? నీకుఁ బట్టాభిషేకమప్పుడు వేదములఁ దుదముట్టఁ జదివిన బ్రాహ్మణోత్తములు పరిశుద్ధుడఁవయిన నీయొక్క శిరస్సునందు యథావిధిగాఁ దేనెను పెరుఁగును నుంచలేదు, దీని కేమి కారణము? మంత్రులందఱును వీథులలో ముఖ్యులయినవారును, పట్టణవాసులును, గ్రామవాసులును, సొగసుచేసికొని నివెంట రాలేదే? కారణమేమి? బంగారు భూషణములచే నలంకరింపఁబడిన నాలుగు వడిగల గుఱ్ఱములు పూన్చిన శ్రేష్ఠమయిన పుష్యరథంబు నీముందుఁ బోవకున్న దేల? ఓ శూరుఁడా! శుభలక్షణములుగలదై, నల్లని మేఘమువలెను, నల్లని పర్వతము చాడ్పునను వెలుఁగుచున్న యందమైన యేనుఁగు నీ ముందటఁ గనఁబడకున్న దేమి? చూచువారి కింపుగొలుపునో రాముఁడా! బంగారుతొపి నాశ్చర్యకరముగనున్న సింహాసనమును ముందుగ నిడుకొని జనులు నీ కుత్సవము జరుపరేల? పట్టాభిషేకమున నుండవలసినంత మోము సంతసము గనఁబడదు! సంతసమును లేకున్నట్లున్నది. ఏమి కారణము?" అని యనేకవిధములుగ నడిగి విలాపము చేయఁదొడఁగెను.

అట్లు విలపించుచుండు సీతనుజూచి, రాముఁ డిట్లనియె. "ఓ సీతా! మా తండ్రిగారు నన్నుఁ గానలకుఁ బొమ్మనుచున్నవారు. గొప్ప కులమునఁబుట్టి, ధర్మముల నెఱిఁగి, యీ ధర్మముల ప్రకారము నడుచుకొనుదానా, జనకమహారాజు కూఁతురా, నా కీ వనవాసము ప్రాప్త

మగుటకుఁ గారణము చెప్పెద నాలకింపుము. తండ్రియగు దశరథుఁడు ఆడినమాట దప్పఁగూడదు అను నియమముగలవాఁడుగదా! అట్టి నరపతి నా తల్లియగు కైకేయికిఁ బూర్వ మొకప్పుడు రెండు గొప్ప వరముల నొసఁగెను. ఇప్పుడు తండ్రియానతివలనఁ బట్టాభిషేక ప్రయత్నము సాగుచుండఁగాఁ గైకేయి తనకు ముందొసఁగిన రెండు వరముల నిప్పు డీయుమని యడిగెను. తండ్రి ముందు వరములఁ దానొసఁగినదానింబట్టి, యా మెకు వరము లొసఁగుటకు లోఁబడెను. ఆ మె నన్నుఁ బదునాలుగేం డ్లరణ్యవాసమునకుఁ బంపుటకును, భరతునికి యువరాజపట్టాభిషేకము జరిపించుటకును గోరెను. కావున నేను నిర్దానుష్యమైన యరణ్యమునకుఁ బోవ వెడలి నిన్నుఁ జూచిపోవ వచ్చితిని. నీవు నే నడవులకుఁ బోయిన పిదప భరతునికడ నివసించుచు, నెప్పటికిని నా గుణములను బొగడకుము. శ్రీమంతులగు పురుషులు పరుల పొగడ్తల నోర్వరు. కావున నీ వెప్పుడును భరతుని ముందట నా గుణములఁ బొగడకుము. నిన్ను బంధు మర్యాదగా నతఁడు పోషింపవలసినదియొకాని యనన్యముగాఁ బోషింప వలసినది లేదు. కావున నీ వతని ననుసరించియుండిన నే నీ విచ్చట జీవితము గడపవచ్చును. దశరథుఁడు శాశ్వతమయిన యీ వరాజ్య పట్టను నా భరతున కొసఁగెను. నీవు భరతునకును, ముఖ్యముగా నృపాలునికిని మనస్సంతోషమును గలిగింపుచుండుము. నేనును దండ్రియాజ్ఞను నెరవేర్ప నడవి కిప్పుడే యేఁగెదను. నీవు గొప్పమనసును, ధైర్యమును గలిగి యుండుము. ఓ ఱిచ్చెము లేనిదానా! ఓ సొంపయినదానా! నేను సకల మునులుండెడి యడవులకేఁగిన పదంపడి, నీవు నోములు నోచుచు నొక్కబ్రాహ్మణులుండవలయును. నీవు దినదినము వేకువసులేచి, యథా విధిగా దేవతలకుఁ బూజలుసల్పి, మా తండ్రియగు దశరథనృపాలునికి నమస్కారము చేయుచుండుము. నా తల్లియగు కౌసల్య ముదుసలిది; నా వియోగదుఃఖముచే నొచ్చినది. కావున నామె దుఃఖము పాయునట్లు నీవు ధర్మము నవలంబించి, ప్రతిదినమును శుశ్రూష చేయుచుండుము. నా తల్లులందఱు నాయం దొకేవిధమైనప్రేమయుఁ, జెలిమియు, రక్షణముం గలవారు గావున నీవు వారికి నందఱికి శుశ్రూషలు సల్పుచుండుము. భరతశత్రుఘ్నులిద్దఱు నాకుఁ బ్రాణములకంటె మించిన వారుగావున,

నీవును వారిని దోఁబుట్టువులంబోలెను, కొడుకులంబోలెను, జూచుకొను చుండవలసినది. అదియుఁగాక నీ వెల్లప్పుడును భరతున కిష్టముగాని పనులు చేయకుము. అట్లైతివా నీ దేశమునకు మనవంశమునకును ప్రభువును రాజుసుగదా?

జనులు మంచి నడవడిగల్గి, భూనికతో ధాఫునుఁడి కొల్పు గొల్చుచుండినయెడల రాజులు దయ గలిగియుందురు. అట్లుగాక, వారి కెగ్గులుసేయుచు, వారి నాశ్రయింపనున్నయెడలఁ గోపముగల్గియుందురు. రాజులు తమ కదుపుబుట్టిన బిడ్డలనైనను తమకుఁ గీడు గోరువారిని విడిచిపెట్టుదురు. ఇతరులనైనను దమ మేలుగోరువారిని దమకడఁ జేర్చుకొందురు. కావున ఓ కళ్యాణీ! నీవును స్వధర్మమునం దాసక్తి గలిగి, సత్యమునే ముఖ్యాశ్రయంబుగా నవలంబించి యిచ్చటనే భరతు ననుసరించి యుండుము. ఓ సతీ, నేను గొప్ప యడవులకుఁ బోయెదను. ఓభామా, నీ విచ్చటనే యుండవలసినది. ఎల్లకాలమును సమ్మతముగనట్లు నీవు నా మాటవిని నేను జెప్పినట్లు నడచుకొనుచుండుము" అని రాముఁడు సీతతోఁ జెప్పెను.

27-వ సర్గము.

సీత అడవికి వచ్చెదనని రామునితోఁ జెప్పుట

సంతోషవాక్యములు పలుకఁదగినది యుఁ, బరుషమనసుల కింపయిన పలుకులు పలుకునదియునైన సీత మగఁడు పలికిన పలుకులు విని ప్రణయ కోపముతో, మగనికి నిట్లనియెను. "ఓ రాజేంద్ర పుత్రుఁడా! రామా! నన్నుఁ జూలకనచేసి, యేల యిట్లు పరియాచకములాడుచున్నావు. ఇదేమి వింత! ఇంతకు మున్నెప్పు డిట్టిపలుకులు పలుకఁగాఁ దలిదండ్రులు విని నదిలేదే. ఓ నాథా! (ఆర్యపుత్రా,) లోకమునఁ తోఁబుట్టువులు, కొడుకులు, కోడండ్రు తమ పుణ్యఫలములను తా మనుభవించు చున్నారు. పురుషశ్రేష్ఠుఁడా! పైఁ జెప్పినవారివలెఁగాక, భార్య యొక్కతె మాత్రము తన సెనిమిటియొక్క పుణ్యపాపరూపములయిన కర్మఫలముల ననుభవించుచున్నది. కావున నీ కీయఁబడిన యీయాయానతిచే నేనును అడవియుండుండవలసిన దానను. ఇహపరలోకములు రెండింటి యందును మగువకుఁ బతియొక్కఁడె యెల్లప్పుడు గతిగాని, తండ్రి

గాఁడు. కొడుకును గాఁడు. తల్లి గాదు. చెలిక త్తెలుగారు. తనకుఁ దానును గతిగాదు. రఘువంశోద్భవా, నీ విప్పుడు చొఅరాని యడవులకుఁ బోదువేని, నేను నీ మున్ను గ దర్భముండ్లను గాలితోఁ ద్రొక్కుచుఁ బోయెదను. నీవు నా వెనుక వచ్చుచుందువేని, నీ కాలియందు ముండ్లు గ్రుచ్చుకొనవు. ఓ శూరుఁడా! నీవు పరాక్రమవంతుఁడవు. నీ కెచ్చటను భయంబులేదు. నీవు నాయందు విశ్వాసముంచి "నామాట వినక, పుణ్యాముఁను పంచుకొన నాతోడ నరణ్యమునకు వచ్చెదనని చెప్పుచున్నదే" యనెడి యీర్ష్యను "నా మాట మీఱుచున్నదే" యనెడు కోపమును ద్రాగఁగా మిగిలిన నీటిని బాఱఁబోయునట్లు విడిచి, శంకమాని నన్ను గూడఁగొనిపొమ్ము. నాయం దెట్టి యపరాధమునులేదు. మేడలపైనఁ గూర్చుండుటకంటెను, విమానములమీఁద సంచరించుటకంటెను, ఆకాశమునఁ దిరుగుటకంటెను, నన్ని యిడుములం బడుచుఁ బెనిమిటి యడుగున నడుగుపెట్టుచుఁ బోవుటయే మేలు. తల్లియుఁ దండ్రియు నన్నుఁ బలుతెఱఁగులుగా శిక్షించి, యన్ని విషయంబుల నేర్పియున్నారు. కావున నే నెవ్వరివిషయమున నెట్లు నడచుకొననలయునో, యా విషయము నిప్పుడు నేర్చుకొనవలసినది యక్కఱలేదు. జనసంచారములేక, నానావిధములగుమృగములగుంపులతోనిండి, పులులతోడను, తోడేళ్ళతోడను గూడియున్న చొఅరాని యడవులకుఁ బోయెదను. ముల్లోకములనైనను లెక్కింపక, పెనిమిటి నియమమువంటి నియమము గలదాననై యడవియందుఁ దండ్రి యింటియందువలెనే సుఖముగ నుండెదను. ఓ శూరుఁడా! నేను సర్వదా శుశ్రూషచేయుచు, బరిశుద్ధురాలినై, బ్రహ్మచర్య వ్రతముపూని, పూఁదేనె తావిగల యడవులందు నీతోడఁ గ్రీడింపుచుండెదను. మానరక్షకుఁడా! నీవు అడవిని యితరజనము నైనను బరిపాలింపఁజాలుదువు. అట్లుండఁగా, ప్రియురాలనైన ననొక్కతెను గాపాడఁజాలుదువను విషయమున నేమి సందియము? నే నిప్పుడే నీతోడ నడవికివచ్చెదను. దీనికి సంశయమువలదు. మహానుభావా, నేను నీ వెంబడివచ్చుటకుఁ బూనితిని. ఇఁక నీ వెన్ని చెప్పినను నా తలంపు మఱలింప నలవికాదు. "అచ్చట మంచి యాహారము దొరకదు. నీ

వెట్లుండఁగల'' వందువేమో, నేను ఎల్లప్పుడు దుంపలను, బండ్లను దినుచు నుండెదను. నీతోడనుండి నీ కెట్టి యిడుములుగలిగింపను. నేనును బుద్ధిమంతుఁడైన నాథుఁడవగు నీతోడనున్నదానవై భయము వదలి, యరణ్యములం దచ్చటచ్చట నుండు నదులను, పర్వతములను, తీర్థములను, తపోవనములను జూడఁ గోరుచున్నాను. శూరుఁడవగు నీతోడఁగూడి సౌఖ్యము ననుభవింపుచు, హంసలచేతను, బెగ్గురుపక్షుల చేతను వ్యాపింపఁబడినవై, చక్కఁగాఁ బూచిన తామరపూవులు గలిగిన కొలఁకులను జూడఁగోరెదను. నేను నియమము పూని, యీ తామర కొలఁకులందే జలకమాడుచు సంతోషముతో నిన్నుఁగూడి సుఖించెదను. ఓ విరివికన్నులు గలవాఁడా! నేను నీతోడ నిత్తెఱఁగున వేయిసంవత్సరములు గడచినను, నూటుసంవత్సరములుగడచినను మిక్కిలి సంతోషముతో నుండెదను. నీవు లేక స్వర్గమైనను నాకు రుచింపదు. ఓ రఘువంశమునఁ బుట్టిన పురుషోత్తముఁడవగు నృపాలా, నా కొకవేళ స్వర్గమున వాసము సిద్ధించినను, నీవు లేకున్నచో, నేను దానింగూడఁ గోరను. మృగములతోను, కోఁతులతోను, ముదపుటేనుఁగులతోను గూడినవై, చొఱ నలవికాని యడవికైనను వచ్చెదను. నీ పాదముల బట్టుచు నియమవంతురాలనై, తండ్రియింట నుండునట్లె వనమునందు నిర్విచారముగా నుండెదను. ఓ నాథా! నా మనస్సు నిన్నువిడిచి మఱియొకనిపైకిఁ బోదు. నీ యందే నా మనస్సు ప్రేమగలిగియుండును. నీవు నా ప్రార్థన నియ్యకొనక నన్నుఁ బాసితేని, నేను తప్పక మరణము నొందెదను. నన్నుఁ దోడ్కొని పొమ్ము. నా ప్రార్థనను సఫలము చేయుము. నావలన నీ కేమియు భారము లేదు.'' అని సీత రాముని నానావిధముల ప్రార్థించెను. ఇట్లు సీత యనేకవిధములుగాఁ ప్రార్థించినను, ధర్మమునం దత్యంత ప్రేమగలిగిన నరోత్తముఁడగు రాముఁడు సీతను దోడ్కొని పోవ నిచ్ఛగింపక, వనవాసముయొక్క యవస్థను గూర్చి, దుఃఖితురాలైన సీతకుఁ దెలియజెప్పి యామెను మఱలింప ననేకవిధంబులఁ బ్రయత్నించెను.

28-వ స ర్గ ము

రాముఁడు వనవాసక్లేశములను సీతకుఁ దెలుపుట

ఇట్లు సీత పలుకుచున్నను, ధర్మముల నెఱింగినవాఁడు, ధర్మమునఁ బ్రేమగలవాఁడునైన రాముఁ డరణ్యవాసమందలి యిడుములఁ జలంచి, సీత నరణ్యమునకుఁ గొనిపోవ బుద్ధిఁ దలఁపఁడాయెను. అట్లు ధర్మాత్ముఁడగు రాముఁడు గొంత సేపాలోచించి, సీతను బలుమాఱు పలుతెఱఁగుల నూఱడించియుఁ గండ్లనిండఁ గన్నీరు నించుకొనియున్న యా సీతనుజూచి యిట్లనియె. "ఓ సీతా! నీవు గొప్పవంశమునఁ బుట్టిన దానవు. ఎల్లప్పుడు ధర్మమునందు మిక్కిలి యాసక్తురాలవు. నీ నిచ్చటనేయుండి నా మనస్సున కానందము గలుగునట్లు నన్నుఁ గూర్చి వ్రతములుమున్నగు స్వధర్మముల నాచరింపుము. ఓ సీతా! నేను జెప్పిన చొప్పున నడచుకొనుము. ఓ కాంతా! వనవాసంబునఁ బలుకష్టములు గలవు. వానినెల్ల నెఱిఁగించెద నాలకింపుము. అట్లాలకించి, వనవాస మునందుంచిన యీ బుద్ధిని వదలుము. వనవాసమునఁ బెక్కిడుములు గలవని చెప్పుఁగా వినియుందువుగదా. నీ మేలుగోరి నే నీ మాటఁ జెప్పితినికాని, నిన్నుఁ బోషింపలేకకాదు. అచ్చటికష్టములను జెప్పెద నాలకింపుము. అడవిలో నెల్లప్పుడు దుఃఖమే కలుగునుగాని, సుఖము గలుగదు. ఇది నాకుఁ దెలియును. నెలయేళ్లు రొదలును, గుహాలందుండు సింహాముల బొబ్బరింతలును భయంకరముగానుండును. నిర్జన వనములదలి యేనుఁగులు మొదలగు గొప్పమృగములు బాగుగాఁ గ్రొవ్వి, భయము విడిచి, విచ్చలవిడిగా సంచరించుచు మనలను జూచి, మనపైకిఁ బఱుగిడి వచ్చును. అచ్చటి నదులు మొసళ్ళతోఁ గూడి, మిక్కిలి యడుసుగలిగి, మదించినయేనుఁగులకయిన దాఁటుట కలవిగాకయుండును. అడవులలోని దారులు తీఁగెలతోను, ముండ్లతోసు నిండినవై యడవికొళకూతలకు మాఱుమ్రోఁత లీనుచు, క్రాగుటకు నీరులేక, నడచుటకు సాధ్యముగాక యుండును. పగళ్లయందంతయు గడ్డలు దుంపలు దిని యలసటనొంది, విచారపడి స్వయముగా నేలపై రాలినయాకుల పాన్పుపైఁ బరుండవలయును. రేయుంబగళ్లు నియమముతోనుండి, తమంతటఁ జెట్లనుండి పడిన పండ్లను దిని తనివినొందవలయును. మఱియు నారచీరలను గట్టి

జడలుదాల్పవలయును. శక్తికిఁ దగినట్లుపవాసము నేయవలయును. దిన దినము దేవతలకును, బితృదేవతలకు నప్పుడప్పుఁడు వచ్చెడు నతిథుల కును శాస్త్రప్రకారముగాఁ బూజలు సలుపవలయును. నియమముతో ప్రాతర్మధ్యాహ్నసాయంకాలములందు ముమ్మాఱు స్నాన మాచరింప వలయును. తానుతెచ్చిన పూవులతో ఋషిప్రోక్తవిధానమున నగ్ని వేదికిఁ బ్రత్యహమ్ముఁ బూజలు సల్పవలయును. వనమునఁ దిరుగుచు నీ వస్తువులు తినవచ్చును, ఈవస్తువులు దినరాదనికము, ఇంతమాత్రమే తినవలయును, ఇన్నిసారులే తినవలయుననని యాహారనియమము గలిగి, దొఱకినదానితోఁ దనివినొందవలయు. వనమునందుఁ బెనుగాలి వీచు చుండును; కాలుచీఁటి గ్రమ్మి దిగులు పుట్టించుచుండును. ఆఁకలియు మితిమీఱియుండును. గొప్పభయములు గలుగుచుండును. బహువిధము లయినపాము లనేకములు విచ్చలవిడిగఁ దిరుగుచుండును. ఓభామినీ, నీ వాఁడుదానవు గావున వానిని జూచినంతటనే భయపడుదువు. ఏళ్ళయం దున్నపిఱుము, నీటివలె వంకరగాఁ బోవుననియునైన పాములు దారి నడ్డగించియుండును. కావున నీవు వానిని జూచి మిక్కిలి వెఱతువు. మిడుతలు, తేళ్ళు, పురుగులు, అడవియీఁగలు, దోమలు సర్వదా బాధించుచుండును. ఓయబలా! యడవియం దేవిధమునను సుఖము కాన రాదు. ఓభామినీ! అడవులందలి వ్రాకులు ముండ్లు గలిగియుండును. వానికొమ్మ లుట్టూతలుఁగుచు నొండొంటితో రాయుచుండును. రెల్లును, దర్భలును అంపశుపుటంచులవలె వాఁడియైనయంచులు గల్గి యుండును. ఓసతీ! అరణ్యవాసమున దేహాశ్రమము మెండు. భయము లనేకములు. కావున నచ్చట నన్ని తెఱఁగుల దుఃఖమేగాని, సుఖము లేదు. కోపమును లోభమును విడువవలయును. ఎల్లప్పుడు తపస్సునందే మన స్సును నిలుపవలయు. వెఱవఁదగిన సందర్భము వచ్చినను వెఱవఁ గూడదు. కావున నీవడవికి రావలదు. నీకు వనవాసము యుక్తము గాదు. ఎంతయాలోచించిచూచినను, వనవాసమునఁ బలుతెఱంగులగు నపాయములే కనఁబడుచున్నవి.” అని రాముఁడు సీతతోఁ బలికెను. రాముఁడప్పుడు సీతను గొనిపోవ సమ్మతింపకుండఁగా, సీత కడు వగ

పాలయి రాముని మాటల నొప్పుకొనక, యతనితో నీక్రింది తెఱఁగునఁ జెప్పెను.

29-వ సర్గము.

సీత తన్నడవికిఁ దోడ్కొనిపోవ రాముని నిర్బంధించుట

సీత రాముఁడు చెప్పిన పలుకులు విని, దిగులుపడి కన్నీరు నించుచు, రామునితో మెల్లన నిట్లనియె. "ఓనాథా! వనవాసమున నేయేదోషము లున్నవని చెప్పితివో, యవియెల్ల నీసహవాసమువలన గుణమగు లేకాని, దోషములుగావు. అయ్యారణ్యములం దుండుజింకలు, సింహములు, ప్రీతిపూర్వకముగు ఖడ్గమృగములు, వీనుఁగులు, గాఱెపోతులు, చమరములు మొదలగు మృగము లంతకుముున్ను నీరూపమును బోలురూపమునుజూచియెఱుఁగవు గావున, నవియన్నియు నీరూపమును జూచి వెఱచి పరుగిడును. భయకారణము తటస్థపడినప్పు డన్నియు వెఱ చునుగదా! కావున నాక్రూరజంతువులన్నియు నీతోడనున్న నన్నే మియుఁ జేయఁజాలవు. పెద్దలయాజ్ఞగావున నేనును నీతోడ నరణ్య ముగా వనమురావలసినదాననే. నిన్నుఁబాసి యొక్కక్షణమైనను జీవింపఁ జాలను. నేనంతటఁ బ్రాణముల విడువనవలసినదే. నీచేరువనున్న నన్ను దేవతలకెల్ల నధిపతియగు నింద్రుఁడైనను దనబలిమిచేఁ జెనకఁజాలఁడు. పెనిమిటిని బాసినయాఁడుది తన ప్రాణముల నిలుపుకొనఁజాలదు. ఓరాముఁడా! నీవీవిషయము నెన్నిమాఱులో నా కుపదేశించియున్నావు. అంతియకాక, గొప్పపండితుఁడా! నేను మునుపు మాతండ్రియింట నున్న ప్పుడు జ్యోతిశ్శాస్త్రవేత్తలగు విప్రులు "నీవు కొంతకాల మరణ్యమున నుండవలసివచ్చును" అనిచెప్పఁగా విని యుందును. బలవంతుఁడ వగు రాముఁడా! సాముద్రికలక్షణముల నెఱిఁగినవిప్రులును నన్నుఁ గూర్చి "నీవు కొంతకాల మరణ్యవాసముచేయవలసివచ్చు" నని చెప్పఁగా నే నాలకించియుందును. అప్పలుకులు విన్నదిమొదలు "ఎప్పు డెప్పుడు వన మునకుఁ బోవుదునా" అని చాల నుత్సాహము గలిగియున్నాను. ఆవిప్రులు చెప్పినచొప్పున నేనును గొంతకాలము వనవాసము సేయ వలయుఁ గదా! ఓప్రియుఁడా! నేనును నీతోడ వచ్చెదను. నే నొంట రిగా నెట్లు వనంబున కేఁగఁగలను? నేను నీవెంబడివచ్చితినేని, యాబ్రహ్మా

ణుల యాజ్ఞను నెఱవేర్చినట్లు నగును. నేను వనవాసమునకుఁ బోవఁ దగినసమయము వచ్చినది. కావున నేను నీతోడ వచ్చెదను. లక్షణవేత్త లగు బ్రాహ్మణుల వాక్యములు యథార్థము లగునుగాక! వనవాసమునఁ బెక్కిడుమలు గలుగునని నేనెఱుఁగుదును. ఓశూరుఁడా! ధైర్యవంతులు గాని పురుషులే యట్టియిడుమల నొందుదురుకాని నీబోఁటి శౌర్యవంతు లుపొందరుగదా! తొల్లి నేను పుట్టింటనుండఁగానొకనాఁడు, మంచి నడత గల యొకతాపస స్త్రీయే తెంచి, నేను నాతల్లియొద్దట నుండఁగా నన్నుఁ గూర్చి, 'ఓపడుచా! నీవు కొంతకాలము వనమున నుండఁగల'వని చెప్పి నది. నేను నిన్నుఁ బలుతెఱఁగులుగా మున్ను సంతోషపఱిచి నీతోడ వనమునకు రావలయునని యప్పుడప్పుడు కోరుచుంటినిగదా? రాఘవా! నీకు మేలయ్యెడును. నేనును నీతోడ నరణ్యమునకు రావలయునని మిక్కిలి మక్కువపడియున్నాను. కావున నన్నుఁ దోడ్కొనిపొమ్ము. శూరుఁడవగు నీకు శుశ్రూషచేయుచు వనమున నుండఁ గోరు చున్నాను. నిర్మలహృదయుఁడా, నేను మగనిపైఁ బ్రేమచే నతనిని విడిచి యుండఁజాలను. కావున భర్తవగు నిన్ను వెంబడించివచ్చి పాప రహితురాల నయ్యెదను. నాకుఁ బెనిమిటియే దైవము. నాకుఁ బర లోకమునను నిరంతరము నీతోడిచేరికయే కావలసినది. కీర్తి మంతులగు బ్రాహ్మణులు చెప్పినట్టి పవిత్రమయిన వేదవాక్యములను వినియున్నాను. ఈలోకమునఁ దల్లిదండ్రు లెవనికిఁ దమ యాచారము చొప్పున నే కన్యను దారపోయుచున్నారో, ఆకన్యక పరలోకమునను అతనికే భార్యయగును. ఇట్లు వేదములు పలుకుచుండఁగా, స్వజాతి సంభవురాలను, మంచినడనడిగలదానను, పతివ్రతను నయిన నన్నుఁ దోడ్కొనిపోవకుండుట కేమికారణము? కాకుత్స్థుఁడా నేను పతివ్రతను; సుఖదుఃఖములం దొక్కతీరుననే యుండుదానను; నీకు సుఖము వచ్చి నప్పుడు సుఖమును, దుఃఖమువచ్చినప్పుడు దుఃఖమును అనుభవించు దానను. నిన్నే మనస్సునఁ దలఁచుచుండుదానను. ఇట్టి నన్ను విడిచి పోవుట నీకు యుక్తముగాదు. నన్నుఁ గొనిపొమ్ము. ఇవ్విధమునఁ గుందుచుండు నన్నుఁ దోడ్కొని పోఁగోరవేని, నేను గరళము మ్రింగినైనను, నిప్పులోఁ జొఱఁబడియుయినను, సముద్రమునఁ బడి

యైనను మృతినొందెదను. ఇట్లు సీత తనరాకనుగూర్చి పలుతెఱఁగుల వేఁడుకొనుచున్నను,గొప్పభుజములుగలరాముఁడుసీతను నిర్జనవనమునకు వెంటఁబెట్టుకొని పోవ సమ్మతింపఁడయ్యెను. అంతట నాసీత యివ్విధం బునఁ దన్నడవికిఁ గొనిపోవ సమ్మతింపక రాముఁడు సెప్పిన పలుకు లాల కించి, తనకండ్లనుండి కాఱువేఁడి కన్నీళ్లఁజేఁ బుడమిని దడుపుచు మిక్కిలి వ్యసనము నొందెను. అట్లు విచారపడుచుండు కైన్మోముగల సీతను రాముఁడు మఱలింపఁ గోరి యూఱెను పలుతెఱఁగుల నూఱడించెను.

30-వ సర్గము.

సీత తనరాక నంగీకరింపమికై రాముని దూఱుట

జనకమహారాజుకూఁతు రగు సీత తన ప్రియుఁడు బతిమాలు చున్నను వినక, యరణ్యవాసముం గూర్చియే మాటలాడఁ గోరి, తన్ను రాముఁడు దోడ్కొ-ని పోనిచ్చగింపమికై మిక్కిలి చింతనొంది, ప్రేమ చేతను, గర్వముచేతను విరివిఁజొమ్ముగల తనప్రియుని రాముని నీ తీరున దూషింపఁ దొడఁగెను.

రామా! మిథిలాధిపతియగు నాతండ్రి జనకమహారాజు పురుష రూపమునసున్న స్త్రీకి నిన్ను నల్లునిఁగా బడసి వీమనుకొనును?

రామా, మిథిలాపురి నేలెడి నాతండ్రి జనకమహారాజు, భార్యను గాపాడుకొన లేక యిచ్చట విడిచి యడవులకేఁగుచున్న నీసంగతిని విని, "నాయల్లుఁడు స్త్రీయే కాని పురుషుఁడుకాఁడు. పురుషవేషముఁ దాల్చిన స్త్రీయై నన్ను వంచించెను"అని తలఁచునుగదా! వెలుఁగుచున్న సూర్యుని యందెట్టి ప్రతాప మున్నదో యట్టి ప్రతాపము రాముఁడవగు నీ యందుఁ గనఁబడదు. ఈజనులందఱు తెలివిలేమిచే రాముఁడు ప్రతాప వంతుఁడని చెప్పుదురేని, యది వట్టిమాటయొ కదా! నీవేపనినిజేసి మనమున దిగులు పడితివి? నీ వెందునలన వెఱచెదవు? వేఱుగతిలేని నిన్నే నమ్మియుండు నన్ను నీ వేకారణముచే విడువఁదలఁచితి? పరా క్రమవంతుఁడా! ద్యుమత్సేనుని పుత్రుఁడగు సత్యవంతుని సావిత్రి వెంబడించి పోయెనుగదా! ఆపతివ్రతయగు సావిత్రిని బోలినదాననుగ నన్నెఱుఁగుము. ఓరూపవంతుఁడా! నిన్నుఁదప్ప వేఱొక్కనిని మనము నెవను దలంపను. రాఘవా! కులమునకుఁ గళంకముఁదెచ్చు నీచకాంత

వలెఁ గాక, నేను నిన్నెడఁబాయఁక నీతోడనే వచ్చెదను. రామఁడా! ప్రాయము వచ్చినడానను; చాలకాలము నీతోఁ గాపురముచేసినదానను; నిన్నుఁ గాఁచుకొనియున్నదానవైన నన్ను నటునివలెఁ బరులపాలుచేయఁ గోరుచున్నావు.

ఓ దోషరహితుడఁవగు రామా! నీ వేపెద్దలకు మేలుచేయ నన్నుఁ బురికొల్పుచున్నావో, ఏకనవాసము నిమిత్తము నన్ను వనము నకు రావలవని చెప్పుచున్నావో అట్టి దశరథుఁడు మొదలగు పెద్దలకు నీవు లోఁబడి, వారు చెప్పిన చొప్పున నడచుకొనువాఁడవ్రు గమ్ము. సకల ధర్మముల నెఱింగినట్టి నీవు నన్నుఁ దోడ్కొనక యడవికిఁ బయనమగుట దగదు. నేను నీతోడనుండిదమే తపస్సు నైనఁ జేయవలయును; అరణ్య మున నయిన నుఁడవలయు; స్వర్గసుఖములనయిన ననుభవింపవలయు. నీతోఁగూడ వేడుకగాఁ దిరుగునప్పుడును, బరుండియున్నప్పుడును నా కెంత సుఖముగలుగునో, యంత సుఖను నీవెంబడి నడవికిఁ జనునప్పుడును గలుగునుగాని దారిబడలిక కొంచెమయినను గలుగదు. మార్గమున నిరు వైపుల నుండునట్టి దర్భలు, తెల్లు, ముండ్లదుబ్బులును, మఱియనేక ములగు ముండ్లచెట్లును నీ సమీపమున నుండు నాకు దూదివలెను, జింకతోలువలెను మెత్తనై యుండును. ఓ ప్రియుఁడా! నేను నీతోడ నడవియందుఁ దిరుగునప్పుడు, పెనుగాలివీచుటచేఁ రేఁగి పైఁ బడిన దుమ్మును మేలిమితావిగల చందనపుఁ బూఁతగా నెంచెదను. అడవులం దగుపడువాఁడా! నీతోడ నడవులలో పచ్చిక బయళ్ళయందుఁ బరుండుట కంటె రత్నకంబళములు పఱచిన పాన్పులపైఁ బరుండుట యంత సుఖ కరముగ నుండదు. నీతోడ నే నడవులందుఁ దిరుగునప్పుడు కొంచెము గాని, పొంచ్చుగాని, ఆకులు, దుంపలు, పండ్లు నీ వేదిప్రేమతోఁ బెచ్చి యిత్తువో అదియె నా కమృతము. నే నడవులందుండునపు డయ్యయి ఋతువులందలి పుష్పములను, కందమూలఫలములను ననుభవించుచుఁ దల్లినిగాని, తండ్రినిగాని, ఇంటినిగాని తలంపను. మఱియు నేను నీతోడ నడవి కేతెంచినప్పుడు నా నిమిత్తము నీకుఁ గొంచెమైనను కష్టముగాని, వ్యసనముగాని వలదు. నేను నిన్నచ్చటఁ గష్ట పెట్టను; బరువుగాఁ దోఁపను. రామా! నాకు నీతోడ నుండుటయె

స్వర్గము; నిన్నెడఁబాసి యుండుటయె నరకము. రామా! ఈ సంగతిని బాగుగా నెఱిఁగి, నన్నిచ్చట విడువక, నన్నుఁ దోడ్కొని వనమునకేఁగి, నాతోఁగూడియుండి యొక్కువ సంతసము నొందుము. ఇట్లు కలవరపడి యున్న నన్ను వనమునకుఁ దోడ్కొనిపోవవేని, యిప్పుడే విషముఁ ద్రావెదనుకాని, పగతురకు లోఁబడి యుండఁజాలను. ఓ నాథా! యిప్పుడు కాకపోయినను, బిమ్మటనైనను ప్రియవిరహదుఃఖముచే నేను ప్రాణములతో నుండఁబోవుననది లేదు. కావున నీ యెదుట నిప్పుడే ప్రాణంబులఁ దొఱఁగుట మేలు. నేను నీ వియోగదుఃఖము నొక నిమిషమైన నోర్వఁజాలను. అట్లుండ నిన్నుఁ బాసి పదునాలుగేం డ్లేమి! నేను వ్యసనముతో బ్రదికియుండుదుఁనేమి! అని యివ్విధమునఁ జింతా క్రాంతురాలై, జాలిపుట్టునట్లు విశేషముగాఁ బలవించి, మిక్కిలి యలసి, ప్రియునిఁ గౌఁగిలించికొని, గట్టిగా నేడ్చెను. పిమ్మట రాముఁడు మర్మ భేదకములగు మాటలు పలుకఁగా, విషము పూయఁబడిన బాణముల చేతఁ గొట్టఁబడిన యాఁడేనుఁగు చందమున నా పలుకులచే సీత నొచ్చిన దయి, యరణియను నిప్పుచిలికెము కొయ్య చక్కఁగాఁ జిలుకఁబడినదై నిప్పును గ్రక్కినట్లు, చిరకాలమునుండి లోపలనే యడఁగించుకొని యుండిన కన్నీటిని విడిచెను. దుఃఖముచేఁ గలిగిన, స్ఫటికమణులం బోలు కన్నీరు కమలములనుండి యుదకము స్రవించుమాడ్క నా సీత యొక్క కన్నులనుండి కాఱుచుండెను. వెడఁదకన్నులుగలదియు, నిర్మలమగు చంద్రునిఁబోలు కాంతిగలదియునైన యా సీతయొక్క ముఖము నీటినుండి యెత్తి గట్టున వేయఁబడిన తామరపూ వెండవేఁడి మికి వాడునట్లు మిక్కిలి వాడెను. అట్లు చింతించినదై స్మృతిఁ దప్పిన దానివలెఁ బడియున్న సీతను రాముఁ డప్పుడు లేవనెత్తి తన యిరుగేల గట్టిగాఁ గౌఁగిలించుకొని, యోదార్చుచు నిట్లనియెను. ఓ దేవీ! నిన్ను వగపాలుసేసి, నాకు స్వర్గము ప్రాప్తించినను నేను బోను. ప్రపంచము నందలి సకల జంతువుల సృష్టిస్థితి లయంబులకుఁ గారణభూతుఁడై, తనంతటఁ బుట్టినవాఁడగు బ్రహ్మదేవుని కెందును భీతిలేనట్లు నాకును నన్నింటివలనను భీతియనుమాట లేదు. సొంపయిన మోమునగలదానా! నేను నిన్నున్నిచోట్లను గాపాడఁగలవాఁడనైనను, నీ యభిప్రాయము

నంతయు బాగుగ నెఱింగిక నిన్నడవికిఁ గొనిపోఁగూడదని తలఁచి, యీ ప్రకారముగఁ జెప్పితిని. ఓ సీతా! నీవు నాతోడ వన వాసముచేయు నిమిత్తము పుట్టితివి కావున, ధైర్యవంతుఁడు గీర్తిని విడువఁజాలనిచందమున నిన్నును విడువఁజాలను. వీనుఁగుతొండములం బోలు తొడలు గలదానా! భర్త యెచ్చటికిఁబోయిన నచ్చటికి భార్య యేఁగుట యను ధర్మము పూర్వము పెద్ద లాచరించినదే కాని వేఱు గాదు. సూర్యుని సువర్చల వెంబడించునట్లు నీవు నన్ను వెంబడింపుము. నేను నా పెద్దల ధర్మము ననుసరించి వనమునకు నిన్నుఁ దోడ్కొనిపోయెదను. ఓ జనకరాజుకూఁతురా! నాతండ్రియొక్క సత్యమయినవాక్యము నన్నడవికిఁ గొనిపోవుచున్నది, కావున నే నడవికిఁ బోవక యుండఁ జాలను. సొగ సైనపిఱుఁదులుగలదానా, లోకమునఁ దల్లిదండ్రులకు గురువునకు లోఁబడి యుండుట గొప్ప ధర్మముగదా. కావున నట్టి ధర్మ ముపు వదలి యొక క్షణమయినను జీవింపఁగోరను. తల్లి, తండ్రి, గురువు ననువారు మువ్వురు ప్రత్యక్షదైవములు. వారిని బూజించినయెడ, వారు సంతసించి, మనకు ఫలమొసఁగుదురు. అట్టి స్వాధీనములయిన ప్రత్యక్షదైవములను విడిచి, మనకన్నుల కగపడక ఫలమొసఁగునో లేదోయను సందియమున కాస్పదమయిన దైవము నేలయారాధింప వలెను? సొంపగు శ్రీఁగటి చూపుకలుగలదానా! తల్లి, తండ్రి, గురువు లను వారు మువ్వురు మూఁడులోకములు. వారితో సమానమయిన పావన మగు వస్తు వీ భూలోకమున మఱొక్కటిలేదు. కావున నేను దక్కిన దైవములను విడిచి, వారిని ముగ్గురిని ఆరాధించు చుందును. ఇారి యారాధనమున ముల్లోకములను గెలువవచ్చును. పితృశుశ్రూష యెంత శ్రేయస్కరమో, సత్యము, ఈని, మర్యాదగనఁ బఱచుట యివియు నంత శ్రేయస్కరములుగావు. విశేషదక్షిణలుగల యాగములు నంత శ్రేయస్కరములుగావు. తల్లి, తండ్రి, గురువు ననెడి వారి యనుమతముచొప్పున నడచుటొసటవలన నిహలోకమున ధనము, ధాన్యము, విద్యలు, సంతానము, సౌఖ్యములును, నంతమున స్వర్గ లోకమును గలుగుచున్నవి కావునఁ దల్లిదండ్రులయొక్కయు, గురువు

యొక్కయు శుశ్రూషచేఁ బడయరాని దొక్కటియు లేదు. తల్లి దండ్రుల సేవయంచే మనస్సుగలవారు దేవలోకమును, గంధర్వలోకమును, గో లోకమును, తక్కిన లోకములను వరుసగాఁ బొందుచుఁ గడపట బ్రహ్మలోకమును బొందుదురు. దశరథుఁడు సత్యసంధుఁడై నాకేమి యాన తిచ్చెనో, ఆ ప్రకారము నడచుకొందును. ఇది యనాదియైన ధర్మము. నీ వడవులలోఁ దిరుగఁజాలవని, నిన్ను దండకారణ్యమునకుఁ గొనిపోవ మనమునఁ దలఁపనైతిని. ఇప్పుడు నీవు "నే నడవులలో నుండెదను" అని చెప్పి నన్ను వెంబడించుటను గట్టి పట్టుదల పూనితివి. మద్భయమువలె మోహాముఁగొలుపు కన్నులు గలదానా, నీవు వనవాసమునకై యిట్టి యొచ్చెములేని యవయవములు గలదానవుగా సృజింపఁబడితివి. ఓ భయపడుదానా, నీవు నన్ను వెంబడించి రమ్ము. నాతోడనుండి నేఁజేయు ధర్మములను జేయుచుండుము. ఓ సీతా! నీకు మగనిని వెంబడించి పోవలె ననుగొప్పతలంపు కలిగినది. ఇట్టి తలంపు నీకుఁ గలుగుట మాకులమునకును, మీ కులమునకును దగినది; విశేష కీర్తిప్రదమును. సొగసయిన పిఱుఁదులుగలదానా, వనవాసయోగ్యము లయినపనుల నారంభింపుము. ఇప్పుడు నిన్నుఁబాసి స్వర్గమునకుఁ బోవుటయు నాకభిమతముగాదు. బ్రాహ్మణులకు రత్నములనొసఁగుము. సన్యాసులకు భోజనమును బెట్టింపుము. మఱియు యాచకుల కందఱికు నడిగినది యిమ్ము. తామసింపక పయన మగుము. నావియు, నీవియునైన వెలగల తొడవులను, మేలిమి బట్టలను, వేడుకకైన మన యొద్దనున్న సకల సామగ్రులను, పాన్పులను, తక్కుంగల వస్తువులను మొదట పనివారల కొసఁగి, పిమ్మట బ్రాహ్మణులకొసఁగుము." అని రాముఁడు సీతకుఁ జెప్పెను.

అంతట గొప్ప మనస్సును, ఎక్కువకీర్తియుఁ గలదియగు సీత దనరాకను బ్రియుఁ డంగీకరించినందుకై సంతసించి, నిండిన మనము గలదై, గగుర్పాటొంది, తన ప్రియునిమాట ప్రకారము ధార్మికులగు బ్రాహ్మణులకును, భృత్యులకును ధనములను, రత్నములను నొసఁగ నారంభించెను.

31-వ సర్గము

లక్ష్మణుని రాకకు రాముఁ డొడంబడుట

మిక్కుటమగు కీర్తి గలవాఁడును, రఘువంశమునఁ బుట్టినరాజు లకు సంతసము గావించువాఁడును నైనలక్ష్మణుఁడు ముందే రాముని తోడ వచ్చినవాఁడుగావునఁ సీతకును రామునికిని జరిగిన సంవాదమును విని, "సీతరామునకుఁ బ్రియురాలు. ఆమె కూడ వచ్చెదనన్న రావలదనిచెప్పి, యెంతయెు వేఁడికోలుమీఁద నామెరాకకు నొప్పుకొనెనే, నేనువచ్చెద ననిన నొప్పుకొనునో, యెప్పుకొనఁడో"యని కన్నీటిచేఁ జెదరిన చూడ్కి గలవాఁడయి, దుఃఖము నాఁపుకొనఁజాలక, తన యన్న పాదములను గట్టిగాఁ బట్టుకొని, సీత యెదుట నిలఁబడి వినుచుండఁగా, వనవాస మహావ్రతమును నెఱవేర్పఁబూనియున్న యన్ననుజూచి, "ఓ యన్నా! లెక్కకు మిక్కిలియగు మృగములతోను, వనగజములతోను నిండి భయము పుట్టించు నడవులకుఁ బోవుటకయి గట్టిగ సంకల్పించిన వాఁడవయితివేని, నేను వింటిని గొని అడవిలో ముందటఁ బోవు చుందును. నీవు నాతోఁ గూడినవాఁడవై, పక్షులయు, మృగముల గుంపులయు రొదలతో నంతటను నిండి వెఱపుఁగొలుపు ననేకములైన యరణ్యములయందు సంచరింప నీవు లేకున్న, నేను స్వర్గలోకమును గోరను; దేవత్వమును గోరను. ముల్లోకముల యాధిపత్యమును గోరను" అని చెప్పఁగా, రాముఁడు వనవాసమునకు నిశ్చయించియున్న లక్ష్మణుని జూచి, "లక్ష్మణా! నీవు రావల"దని పలుతెఱఁగుల బతిమాలెను. అయి నను లక్ష్మణుఁ డా మాటలను వినక రాముని జూచి "ఓ యన్నా! నీవు మునుపే "నేనుగూడ వచ్చెద"నన్న నొప్పుకొంటివే. ఇప్పు డదేల నన్ను రావలదనుచున్నావు? ఓ దోషరహితుఁడా! నేను రావలెనని కోరుచుండఁగా, నన్ను వలదనుచున్నావే. కారణమేమో తెలియరాదు. దీనికిఁ గారణంబుఁ దెలియఁ గోరెదను. నాకు సందియముగా నున్నది" యనెను.

ఇట్లు పలికి, తనకన్నము న్నడవికిఁ బ్రయాణమయి ముందుకువచ్చి నిలఁబడి, దోసిలిగట్టుకొని "నేను వచ్చెదను; నన్నుఁ గూడఁ దీసికొని పొమ్ము" అని ప్రార్థించుచున్న లక్ష్మణునితో నెక్కువ ప్రతాపముగల

రాముఁ డిట్లనియె. "ఓ తమ్ముఁడా! నీవు నాయందుఁ బ్రేముగలవాఁడవు; మఱి ధర్మమునం దాసక్తిగలవాఁడవు. ఎల్లప్పుడు మంచిదారియుండుండు వాఁడవు; నా కిష్టుఁడవు; ప్రాణములతో సమానమయినవాఁడవు; చెప్పినట్లు వినువాఁడవు; తమ్ముఁడవు; చెలికాఁడవు. అన్ని తెఱఁగుల నీవు నాతోడ వచ్చుట నాకేమో మంచిదే. అయినను, సౌమిత్రీ! నీవు నా వెంబడి వత్తువేని, కీర్తిమంతురగు కౌసల్యా సుమిత్రల నెవ్వఁడు పోషించువాఁడు? వారి పోషణమునకై నిన్ను రావలదని చెప్పితినిగాని వేఱొండు కారణము లేదు. "వారి పోషణకై తండ్రియుండలేదా? నేనేల యిచ్చట నుండవలెను" అని యనెదవేమో? పర్జన్యుఁడు వర్షించి భూమికి క్షేమముఁ గలిగించునట్లు ప్రతాపవంతుఁడగు నృపాలుఁడు జనులకోర్కెలను దీర్చువాఁడయినను, ఇప్పుడు కైకేయి యంచలి కామమునెడి పాశములచే గట్టువడి మంచి చెడ్డ లరయుఁజాలకున్నాఁడు. కావున నతఁడు వారి యోగక్షేమముల విచారింపఁడు. "కైకేయి వారి పోషణచేయదా" యని యందువేమో? యశ్వపతియగు రాజుయొక్క కూఁతురగు కైకేయియు నీ రాజ్యమును బొంది, ఐశ్వర్య గర్వముచే విచారములపాలయియున్న తన సవతులకు మేలుసేయదు. "భరతుఁడు తల్లులం దొక్కతీరున నుండువాఁడేకదా! అతఁడు కౌసల్యా సుమిత్రలను బోషింపఁడా!" యని యందువేమో! భరతుఁడు స్వయముగా మంచి వాఁడయినను, కైకేయియొక్క దురోభ్ధనలకు లోఁబడి రాజ్యమును బడసి మిక్కిలి వగలపాలైయున్న కౌసల్యా సుమిత్రలను విచారింపఁ బోడు, కావున నీవె యిచ్చటనుండి స్వయముగాఁగాని, రాజునను గ్రహముఁ బడసి కాని, పూజ్యురాండ్రగు కౌసల్యా సుమిత్రలను బోషింపుము. ఓ సౌమిత్రీ, యీ నేఁ జెప్పిన యీపనిని జేయుము. దీనికి మాఱు పలుకకుము. ఇట్లు నీవు చేతువేని, నాయం దెక్కువ మన్ననగనఁబడినట్లగును.ధర్మముల నెఱిఁగినవాఁడా, పెద్దలను శుశ్రూష చేయు చుంటివేని, సాటిలేని గొప్ప పున్నెముగలుగును. ఓ రఘుసందనా, సుమిత్రాపుత్రా, నా నిమిత్త మీ పనిని జేయుము. ఓ సౌమిత్రీ, నీవు నామాటలను వినక, యీ ప్రకారము చేయవేని, మనలఁబాసి ఖేద మొందుచున్న మన తల్లులగు సుమిత్రా కౌసల్యలకు సౌఖ్యము లేదు.

ఇదియే నేను నిన్ను వలదన్నందుకుఁ గారణ"మని రాముఁడు మృదువుగ లక్ష్మణునితోఁ జెప్పెను.

ఆ పలుకులు విని మాటలందుఁ జమత్కారియైన లక్ష్మణుఁడు మాటలందు నేర్పరియగు తన యన్నను జూచి, "ఓ శూరుఁడా, నీవు పరాక్రమపంతుఁడవు గనుక, భరతుఁడు రాజ్యమున కధికారియైనను తన తల్లి నొక్కతీరుననను, మన తల్లుల నొక్కతీరుననను జూచిన నీ కెక్కడఁ గోపమువచ్చునోయని నీ ప్రతాపమునకు వెఱచి కౌసల్యా సుమిత్రలను శపథతోఁ గాపాడును. దీనికేసంశయములేదు.నీ తల్లియగు కౌసల్యయొక్క యనుగ్రహముచే ననేకు లాశ్రితులు వేలకొలఁది గ్రామంబులఁ బొంది సుఖంబుగా జీవించుచున్నారు. ఆమెయే నాబోఁటి వారిని వేవురనైనను భరింపజాలును. కీర్తిమతియగు నామె వేవుర నేలఁ జాలియున్నప్పుడు తన్నును, నా తల్లియగు సుమిత్రను, మనవంటివారిని బహువులను బోషింపఁజాలును. నన్నుఁ గింకరునిగఁ జేసికొనుము. ఈ విషయమున నీ కేమియు ధర్మలోపము గలుగదు. నేను నీకుఁ బరిచర్యా నేయుటచేఁ గృతార్థుఁడనయ్యెదను. నీకును మేలుగలుగును. ఓ యన్నా, ధనుర్బాణములను, గడ్డలను దుంపలను బెల్లగించుటకై గుద్దలిని, బిస్న గంపను దీసికొని నీకు దారిని జూపుచు నీ ముందట పోవుచుందును. ప్రతిదినంబును దుంపలను, బండ్లను, నింకను మునులకుఁ దగిన వనములఁ బుట్టిన యితర పదార్థములను మంచివానిని నీకుఁ దెచ్చియిత్తును. నీ వన్నతో సీతతోఁగూడి కొండచరియలందు విహరింతువు. నీవు మేల్కొనియున్నప్పుడును, నిద్రించునపుడును నీకు సకలోపచారములఁ జేసెదను" అని తిన్నని పలుకులతోఁ జెప్పెను. రాముఁడును ఈ మాటచేఁ గడు మోదమునొంది, "ఓ లక్ష్మణా, పోపొమ్ము. నీ స్నేహితులతో నంచతీతోను జెప్పి, రమ్ము. జనకుని గొప్పయాగమున మహానుభావుఁడగు వరుణుఁడు తాను భయంకర రూపముగల యే ధనుస్సులను, భేదింప రాని దివ్యకవచములను, తఱుఁగని బాణములుగల యమ్ములపొదులను, సూర్యునివాఁడిఁ దళతళ మెఱయు బంగారు పూతపూసిన రెండు ఖడ్గములను నొసఁగెనో వీని నన్నింటిని జక్కఁగఁ బూజించి గురువులగు వసిష్ఠుల గృహమున నుంచియున్నాను. లక్ష్మణా! యా యాయుధముల

నన్నింటిని గైకొని వేగ నేతెమ్ము" అని లక్ష్మణునితోఁ బ్రత్యుత్తరము నెప్పెను.

లక్ష్మణుఁడును దన చెలికాండ్రనందఱను వీడ్కొని, వనవాస మునకు నిశ్చయించి, యిక్ష్వాకువంశస్థులకు గురుండగు వసిష్ఠుని గృహ మున కేతెంచి, యచ్చట రాజశ్రేష్ఠుఁడగు రామునిచేఁ బూజింపఁబడి, పూవులచే నలంకరింపఁబడి యుంచఁబడియున్న యా దివ్యాస్త్రాయుధముల నన్నింటినిఁ గైకొనివచ్చి రామునకుఁ జూపించెను. సంతోషవంతుఁడయిన యా రాముఁ డాయుధముల నన్నిఁటిని గొనివచ్చిన లక్ష్మణునిఁ జూచి, "ఓ నాయనా! నేను నీ రాకకై యెదురుచూచుచుంటిని. నేను నా యీ ధనంబునంతయు బ్రాహ్మణులకును దాపసులకును నియ్యఁ గోరితిని. నీవును గూడ నుండుము. మఱియు నిచ్చటఁ దల్లి దండ్రు లందును, పెద్దలందును భక్తిగల యే బ్రాహ్మణశ్రేష్ఠు లున్నారో, వారికిని, మఱి నా పనివారికందఱకును విశేషముగా దానములుచేసెదను. నీవు బ్రాహ్మణోత్తముఁడును, మర్యాద సేయఁదగినవాఁడునునైన వసిష్ఠ పుత్రుఁడగు సుయజ్ఞుని వేగముగాఁదోడ్కొనిరమ్ము. ఆతనిని, మఱియు ననేకులను సదాచార సంపన్నులగు బ్రాహ్మణులను బూజించి, యడవుల కేఁగెదము" అని లక్ష్మణుని కాజ్ఞ యొసఁగెను.

32-వ సర్గము.

రాముఁడు యాత్రాదానంబులు సేయుట

అటుతర్వాత లక్ష్మణుఁడు, తన యన్న ప్రేమతో నొసఁగిన కడు మేలయిన యానతిని గైకొని సుయజ్ఞుని గృహామునకుఁ జని, యగ్ని హోత్రశాలయం దౌపాసనము గావించుచున్న యా సుయజ్ఞునకుఁ బ్రణమిల్లి "ఓ మిత్రమా! రమ్ము. చేయ నలవికాని పనినినెల్ల సాధింపఁ బూనిన మాయన్న నిన్నుఁ దోడ్కొనిరమ్మని యానతి యొసఁగెను. నీ వచ్చటికి వచ్చి యతని కార్యములఁ జూడుము" అని యా సుయజ్ఞు నితోఁ జెప్పెను. సుయజ్ఞుఁడు లక్ష్మణుని పలుకులు విని, సంధ్యావందనా ద్యనుష్ఠానమును దీర్చికొని సత్వరముగ లక్ష్మణునితోడఁ బయనమై, రాజధీవిచే శోభిల్లుచుండు సొబగగు రాముని నగరు సొచ్చెను. ఆ సుయజ్ఞుని రాక యొఱిఁగి రాముఁడు సీతాసమేతుఁడై లేచి, వేదార్థము

నెఱిఁగినవాఁడును, పూజ్యుఁడును, నగ్నిహోత్రునివలెఁ దేజరిల్లుచుండు వాఁడునునైవచ్చుచున్న సుయజ్ఞుని నెదురొక్కని, యర్ఘ్యపాద్యాది సత్కారములునేసి, బంగారువైన మేటి బాహుపురులను, సొగసగు కుండలములను, పసిఁడి త్రాళ్ళలో గ్రుచ్చిన రతనాలహారములను, చేతికడియములను, నానావిధములగు రత్నభూషణములను సమర్పించెను. అప్పుడు సీత దాపుననుండి ప్రేరణచేయఁగా, రాముఁడు సుయజ్ఞునిఁజూచి, "ఓ సౌమ్యుఁడా! సీత వనవాసమునకు వెడలి, తనవగు ముత్యాలపేరులను, బంగరుసరదులను, ఒడ్డాణములను, వింతఁగొల్పునట్టి రతనాల బాహుపురులను కేయూరములను నీ భార్యకై నీచేత నిచ్చుచున్నది. వాని నెల్లఁ గొనిపోయి నీ భార్యకిమ్ము. అంతియకాక, మేలయిన పఱపులు గలదియు, రతనములచే నలంకృతమయినదియునగు మంచమునుగూడ నీఁ గోరుచున్నది. దానిని గైకొనిపొమ్ము. ఓ బ్రాహ్మణశ్రేష్ఠుఁడా, నా మేనమామ నాకిచ్చిన శత్రుంజయమనెడి యేనుఁగును, దానితోడ వేయి యితర గజములను నొసఁగెదను." అని చెప్పఁగా సుయజ్ఞుఁడు వానినెల్లఁ గైకొని, రామలక్ష్మణ సీతలకు శ్రేయస్కరములగు దీవనలఁ జేసెను.

అంతటఁ బ్రియములు పలుకునట్టి రాముఁడు దిట్టయగు తన యనుఁగుదమ్మునిఁ జూచి, బ్రహ్మదేవు డింద్రునితోడవలె నిట్లు పలికెను. గొప్పభుజములుగలవాఁడవు, శత్రువుల యహంకారము నడఁచువాఁడవు నైన సౌమిత్రీ, బ్రాహ్మణోత్తములగు నగస్త్య కౌశికులను బిలిచికొని వచ్చి, పైరును నీటిచేఁ దనివినొందించునట్లు, వారికి వేలకొలఁది యావులను, బంగారును వెండిని, అమూల్యములగు రత్నములను, అపరిమిత ముగధనమును నొసఁగి వారిని దనివినొందించుము. త్రైతిరీయ శాఖాధ్యయనము చేయువారికి గురువైన యొక వేదవిదుఁడు, పండితుఁడునగు విప్రుఁడు కౌసల్యయందుఁ బ్రేమగలిగి బహుమెకు దీవనలు సల్పుచు నాశ్రయించియున్నాఁడు. ఆతనిఁబిలిపించి, యాతఁడు తనివి నొందునట్లు వాహనములను, పనిక తైలను, తెల్లని పట్టు బట్టలను నొసఁగుము. మన తండ్రికిఁ గడు నెయ్యంపువాఁడయిన చిత్రరథుఁడను వేరుగల సారథి యొకఁడు బహుకాలమునుండి మనకడ నున్నాఁడు. ఆతనిని బిలిపించి,

వెలలేని రత్నములను, పుట్టములను, ధనములను, పెయ్యలనన్నిటిని, వేయిగోవులను సతనికిచ్చి సంతోషపఱిపుము. కల్ప, కాలాపము లనెడి రెండు శాఖల నధ్యయనము చేయుబాధను, పలాశదండమును దాల్చు వారునైన యనేకులు బ్రహ్మచారి లిదిగో యిచ్చటనున్నారు. వారెడ తెగక వేదాధ్యయనము చేయువారు గావున నితర వ్యాపారానుమం గించి త్తయినను జేయరు; వారు సోమరులు; మధురాహారమునే తినఁ గోరువారు; యోగ్యులచేతను సైతము మన్ననపడయువారు. వారిని బిలిపించి, వారికి రత్నరాసులుపోసిన యెనుబది వాహనములను, ధాన్యము మోయు వేయిబండ్లను, రెండునూఱుల చిన్నయెద్దులను, భోజన హోమసాధనములగు వాలు పెరుఁగు నెయ్యి పెన్న మొదలగు వానికై వేయియావులను ఇప్పింపుము. బ్రహ్మచారు లనేకులు మాతల్లి నాశ్రయించి యున్నారు. మా తల్లి నే నొసఁగు ధనమును జూచి సంత సించుప్రకారముగ నా బ్రాహ్మణోత్తముల కొక్కరొక్కరికి వేయినంతున నావుల నిప్పింపుము" అని చెప్పెను.

అంతటఁబురుషశ్రేష్ఠుఁడయినలక్ష్మణుఁడు రామునేయాధనమునంతయు నన్న చెప్పిన తీరున బ్రాహ్మణోత్తముల కందఱికిను గుబేరుని చందమున నొసఁగెను. ఆ వెంబడే రాముఁడు కన్నీరుగార్చుచు నిలువఁబడియున్న పనివారిం జూచి, ఒక్కొక్కనికి సుఖ జీవనమునకుఁ జాలునంతధనము నొసఁగి, వారిం జూచి, "ఓ కింకరులారా! మేము వచ్చునంతదాఁక, లక్ష్మణుని నగరును, నీ నా నగరును సదా కాచుచుండి, పాడుపడినది యని చెప్పకుండునట్లు చూచుకొనుఁడు" అని చెప్పి, బొక్కసపుఁ గాపరిం బిలిచి, "విస్తారముగా ధనము గొనిరమ్ము" అని యాజ్ఞాపించెను. అంతటఁ బనివారందఱు నతని ధనంబుసంతయు మోసికొనివచ్చి రాశి పోసిరి. ఆ గొప్పధనరాశి చూపఱి కానంద మొసఁగఁ జేయుచుం డెను. అంతటఁ బురుషశ్రేష్ఠుఁడగు రాముఁడు లక్ష్మణుని చాపునఁబెట్టి కొని, యా ధనమునంతను బ్రాహ్మణులకును, పనివారికి, ముసలి వాండ్రకు, దరిద్రులకు నిప్పించెను. అచ్చట సమీపారణ్యమున నెల్ల ప్పుడు నుంఛవృత్తిచే జీవించువాఁడును, గట్టు, గుద్దలి, నాఁగలి గలవాఁడును, పింగళవర్ణుఁడును, గర్గవంశస్థుఁడును సగు త్రిజటుఁడను

బ్రాహ్మణుఁడుండెను. ప్రాయమున నున్న యా త్రిజటుని భార్య లేమిచే మిక్కిలి నొచ్చినదై, పసిపిల్లలగు తన కొడుకులను బిలుచుకొనివచ్చి తన మొదుసలి పెనిమిటిని జూచి, "ఓ నాథా! కట్టెలు గుద్దలిని అపలఁ బాఱివైచి, నేను జెప్పెడి పనిని జేయుము. ధర్మజ్ఞుఁడవగు రాముని దర్శింపుము. నీవట్లు చేయుదువేని యేడిన్నియు ఫలము నొందెదవు" అని చెప్పెను. ఆ త్రిజటుండు భార్య మాటను విని, చనఁగి వేలికలై కప్పుకొనుటకు సాధ్యపడని వస్త్రమును గప్పుకొని రాముని నగరునకుఁ బోవుదారిని విచారించుకొనిపోయి, రాముని నగరులోపలికిఁ జొచ్చెను. భృగువు, అంబరీషుఁడు మున్నగు మహర్షులవలెఁ దపో మహిమచే పెంపెఱిగి మానుఁడై నచ్చుచున్న యా త్రిజటుని నైగమ తొట్టిగట్టుసఱకు జన సమూహములో నొక్కఁడైనను నడ్డగింపఁడాయెను. అంతటఁ ద్రిజటుండు రాజపుత్రుఁడగు రాముని దగ్గఱకొచ్చి, "విస్తారకీర్తిగల యో రాజపుత్రుఁడా! నేను బీదవాఁడను, పెక్కు బిడ్డలుగలవాఁడను; ప్రతిదిన ముంఛవృత్తిచే జీవించువాఁడను. నన్నుఁ గటాక్షింపుము" అని వేఁడుకొనెను. అప్పుడు రాముఁడా బ్రాహ్మణోత్తమునిఁ జూచి, హేళనముగా, "నే నొక వేయిగోవులనైన నొకని కీలేదు. నీ వొక కట్టను దీసికొని విసరివేయుము. అది యెంతదవ్వునఁ బోయి పడునో, అంతవఱకుఁగల గోవులను నీకొసఁగెద"నని యా త్రిజటునితోఁ జెప్పెను. అంతట నా త్రిజటుఁడా మాట విని, తడఁబడుచు, కొట్టిని మొలకుఁ జుట్టి, కొయ్యను గిరగిరఁద్రిప్పి, వేగముతోఁ దన బలముకొలఁది విసరి వైచెను. ఆ కట్టి యా బ్రాహ్మణుని చేతినుండి జాఱి సరయూనది గట్టును దాటి, యనేక సహస్రసంఖ్యగల యావుల మందయం దొక యాఁబోతునకుఁ దాఁకువఁబడెను. ధర్మాత్ముఁడగు రాముఁడా త్రిజటుని గౌఁగిలించుకొని, సరయూనది గట్టువఱకునున్న గోవులమందలను త్రిజటుని యాశ్రమమునకు గొల్లలచేతఁ దోలించి పంపెను. అంత రాముఁడును గర్వవంశస్థుఁడయిన యా త్రిజటుని మంచి మాటలచేనూఱడించుచు "ద్విజోత్తమా, కోపపడకుము. నేను వేడుకకై యీ మాటఁ జెప్పితినిగాని వేఱుగాఁ దలఁపకుము. అడ్డగింపరాని నీ తపఃప్రభావము నెఱుఁగఁగోరియే యీ పని నేయ నిన్నుఁ బ్రేరణసేసితిని. ఇంకను కావలసిన దానిని గోరి

కొనుము. నీవేది యడిగిన దాని నిచ్చెదను. నేను నిజముగాఁ బలికెదను. నీ కేమియు నడ్డులేదు. నాయొక్క యావద్ధనంబును బ్రాహ్మణుల నిమిత్తమేకాని వేఱొక పని నిమిత్తముగాదు. నీకు విశేషముగా నొసంగుట చేతనే నేను సంపాదించిన ధనము సార్థకమగును. జనులకు నాపైఁ బ్రేమగలుగును. నాకు గొప్ప పేరును వచ్చును" అని యా త్రిజటునకుఁ జెప్పెను. అంత త్రిజటుఁడు భార్యాసమేతుఁడై, చూపులమందలను గైకొని యొక్కచోట సంతసమునుండి, మహాత్ముఁడగు రామునకుఁ గీర్తి, బలిమి, సంతసము, సౌఖ్యమునుఁ బెంపొందున ట్లాశీర్వాదములు సల్పి, యాశ్రమమునకుఁ జనియెను. ఆ రాముఁడును నిండు మనముగలిగి, న్యాయబలముచే సంపాదించిన తన యపార ధనంబును వారివారి మర్యాదలకుఁ దగిన గారవంపుకూటలను బలుకుచుఁ దన స్నేహితులకును బనివారికిని నిమ్మని తమ్ముని కానతిచ్చెను. ఆ యయోధ్యాపురియందు బ్రాహ్మణుఁడు, హితుఁడు, పనివాఁడు, లేమిడిదశలోనుండి బిచ్చ మెత్తువాఁడును వారివారికిఁ దగిన గారవముచేతను, దానము చేతను, ఆనందములచేతను దృప్తినొందనివాఁ డొక్కఁడును లేఁడయ్యెను.

33-వ సర్గము.

రామలక్ష్మణులు సీతతోడ దశరథునిఁ జూడఁబోవుట

రామలక్ష్మణులు సీతతోఁగూడి బ్రాహ్మణులకును, భృత్యులకును నపారధనంబొసంగి, సీతను దోడ్కొని, యితరులఁగఁ జూడ నలవికాని వియు, పుష్పమాలికలచేఁ జుట్టబడినవియు, సీతాదేవిచేఁ జక్కఁగాఁ గైసేయఁబడినవియునై వెలుఁగుచున్న ధనుస్సులు మొసలగు నాయుధములను దాల్చినవారలై, తండ్రిని జూడఁబోయిరి. అప్పుడు గాంతి మంతులైన జనులందఱు సంతోషములేనివారలై, ధనికుల మేడలను, రాజులయు దేవతలము గృహంబులను, నేడంతస్తు మేడలను ఎక్కి మౌనముతోఁ జూచుచుండిరి. వీథులన్నియుఁ బెక్కండ్రు జనులతోఁ నిండినవై నడచుటకు సందులేకుండుటఁజేసి, జనులనేకులు మేడలనెక్కి, విన్నదనముతోఁజూచుచుండిరి. అప్పుడు జనులందఱు ఛత్ర చామరములు లేక కాలినడకతోఁ బోవుచున్న రామునిఁజూచి "యక్కటా! రాజపుత్రుఁ

డగు రామున కింతయిడుమవచ్చెఁగదా!"యని మనంబుననొచ్చి తమతము మనసులకుఁదోఁచినట్లనేక విధములుగ ననుకొనుచుండిరి. "ఆహా! చూచి తిరా దైవబలిమి! తొల్లి యే రాముఁడు రాజవీథిం జనునపుడు గొప్ప చతురంగబలము వెంబడించెనో, ఆ రాముఁ డొంటరియై పోవ చుండఁగా, నతనిని లక్ష్మణుఁడును సీతయునే వెంబడించుచున్నారు. ఈ రాముఁడు రాజ్యము చేయు లేకయు, జనులకోర్కుల నీడేర్ప లేకయుఁ గానలకుఁ బోవుచున్నాఁడేమో యని యందురేమో! ఈ రాముఁడు ప్రభుత్వమునొక్క సాధాంశమిట్టిదని యెఱిఁగినవాఁడు; జనులుకోరిన కోర్కుల నొసఁగువాఁడు. అట్టివాఁడయ్యును, తండ్రిమాట మీఱ రాదనెడు ధర్మమునందలి గారవముచేతను, దండ్రి చేసిన వాగ్దానము నీడేర్చి సత్యసంధుఁడనెడు పే రతనికిఁ దెప్పింపఁ గోరుటచేతను నడవికిఁ బోవ నున్నాఁడు. మునుపు, ఆకాశమునఁ దిరిగెడు ప్రాణులకయిన జూడ నలవికాని నతను నేఁడు రాజమార్గమున నున్న జనులందఱుఁ జూడ గలిగియున్నారు. మేలిమైపూఁతలకుఁదగినదియు, నెట్టని చందనముఁ బూసికొనునదియునైన సీత వానకుఁ దడియుచు, నెండ కెండుచుఁ, జలికి వణఁకుచుఁ గాంతి తఱిఁగి యుండఁగలదు. దశరథుని కిప్పుడేమో నయ్యశమువట్టినట్లున్నది. కావునసే యిప్పు డీ విధమున రాముని నడవికిఁ బంపుచున్నాఁడు. రాజు తన ముద్దులపట్టి నెప్పుడును నడవులకుఁ బంపఁ జాలఁడు. లోకమున గుణహీనుఁనైనను బుత్రుని నడవికిఁ బంప నెవని కైనను మనము రాదు. అట్లుండఁగా, దానమానాది సత్కారములచేతఁ గాక, యొక సద్గుణముచేతనే జనులనందఱిని లోఁబఱిచుకొన్న రామునిఁ బోలు సత్పుత్రునిఁ బంప మనంబు వచ్చునా? అహింస, భూతదయ, శాస్త్రజ్ఞానము, మంచినడత, ఇంద్రియనిగ్రహము, ఓర్పు నను నీ యీఱు గుణములు రామునియందు విలసిల్లుచున్నవి. రాముఁ డట్టి గుణములు గలవాఁడు. అట్టి రామున కిప్పు డాపద సంభవించుటంజేసి, నీటివలన జీవించు జంతువులు వేసవిని నీళ్లింకుటచే నల్లాడునట్లు మిక్కిలి నొచ్చిన వారలయి జనులందఱు నల్లాడుచున్నారు.

లోకాధిపతియగు రాముని కాపద సంభవించుటచేఁ బుష్ప ఫలాదులతో నిండినచెట్లు మొదలునఱుకుటచేఁ గ్రిందఁబడి నశించునట్లు,

జగత్తంతయు మనోదుఃఖముచే నొచ్చి తలకిగిపోవుచున్నది. మహాశాంతి గల యీ రాముఁడె మనుజు లనెడువృక్షమునకు మూలము. ధర్మమే యీ రామవృక్షమునకుఁ జేవ. ఇతర జను లందఱు రామవృక్షమునకుఁ బువ్వులు, కాయలు, ఆకులు, కొమ్మలునైనవారు. కావున నట్టి మన మందఱమును పత్నీబాంధవాది సమేతులమై, లక్ష్మణునివలెనే రాముని మార్గమున బోదము. మన మిండ్లను, తోఁటలను, పొలములను విడిచి, రాముసితో సమానముగ సుఖదుఃఖముల ననుభవించుచు, ధర్మాత్ముఁడయిన రాముని వెంబడింతము. మనమందఱు మొక్కఁబెట్టిన నయోధ్యను విడిచి రాముని వెఁబడించి పోయితిమేని, యయోధ్యాపురము పాడువడి పోవును. ఇండ్లలోని నిధులన్నియుఁ బెల్లగింపఁబడును. ముంగిళ్లు సమ్మార్జనాదులులేమిచే రూపునెడును. మంచి మంచి వస్తువులన్నియు నపహరింపఁబడును. ధనధాన్యములు గొనిపోఁబడును. గృహము లన్నియు దుమ్ముతో నిండును. గృహ దేవతలు నిడిచిపోవుదురు. ఎలుకలు, పందికొక్కులు బెద్ద బొఱియలుచేసి యంతటను నిర్భయముగాఁ దిరుగు చుండును. నీరు సిప్పలప్రస క్తి లేకపోవును. నివాసములు లేమిచే నూడ్వఁబడక పెంట నిండియుండును. నందున వైశ్వదేవము, యజ్ఞము, వేదాధ్యయనము బ్రహ్మోపాసనమ్, గాయత్రీజపము మొదలగు ననుష్ఠానంబు లుండవు. చెడ్డకాలము తానే పగులఁగొట్టినో యనునట్లు తుత్తునియలయిన పాత్రలతోనిండియుండును. మనము విడిచిపోయిన యట్టి యయోధ్యాపురంబునందలి యిండ్లలో నా కైకేయి యొంటరిగాఁ బొరలాడుచుండఁగలదు. ఎక్కడికి రాముఁడు పోవ్రచున్నాఁడో, యదే బట్టణమగుఁగాక! మనచే విడువఁబడిన యయోధ్యాపట్టణమే యడవి యగుఁగాక! మన మడవులందు నివాసంబు లేర్పఱచుకొంటిమేని, మనకు వెఱచి పాములెల్లఁ బుట్టలనుండియు, మృగములు, పక్షులును గొండ చరియలనుండియు, సింహములు, గజములు ఱడవులనుండియు నెడలి, మనము వదలిన తావునకుఁ బోయి చేరునుగాక! ఋషముచేరిన తావును వదలునుగాక! ఇట్లు తృణభక్షకములు, మాంసభక్షకములు, ఫలభక్షక ములునైన భయంకర సర్పములును మృగంబులును, బక్షులును గల దయిన యయోధ్యాపురంబునందుఁ గైకేయియు నామె కొడుకును,

బంధువులను, జేర్చుకొని వాసముచేయునుగాక! మనము రామునితోఁ గూడఁబోయి వనంబున నిర్విచారులముగా నుండఁగలము.” అని యిన్విధంబున జనులందఱు పరిపరివిధముల మాటలాడుకొనుచుండిరి. రాముఁడి త్తెఱఁగున జనులు మాటలాడు మాటలను వినినను, మనంబున నించుకైనను వికారము నొందఁడయ్యెఁ.

ధర్మాత్ముఁడగు రాముఁడు పుదపుటేనుఁగుయొక్క శౌర్యముంబోలు శౌర్యముగలవాఁడై, దవ్వుననే కైలాసశిఖరము పగిది నున్నతమైన తండ్రి, నగరుఁ జూచి, ప్రదక్షిణమునేసి, వినయవిధేయులగు వీరపురుషులుగల రాజనగరుసొచ్చి, చేరువను దీనుఁడయియున్న సుమంత్రునిఁ జూచుచుఁ, దన వసవాసమునకై వ్యసనపడుచున్న జనులఁ జూచినను, తన మనసున వ్యసనమున్నట్లు కనఁబఱపక, తండ్రిని జూడఁగోరియుఁ, దండ్రియానతి రవంతయైనఁ దప్పక నెరవేర్పఁగోరియుఁ జిత్తమున నగరులోపలికిఁ బోయెను. ఇక్ష్వాకువంశోద్భుఁడును, ధైర్యగాంభీర్యములు గలవాఁడునగు రాముఁ డడవికిఁ బోవువాఁడై, తన యరణ్యవాస వార్త విన్నది మొదలు ఖేదమొందుచుండు సుమంత్రునిఁ జూచి, తండ్రికిఁ దనరాక యెఱుఁగింపఁగోరి యచ్చట నిలిచి, తాను ధర్మమునందాసక్తిగలవాఁడు గావునఁ తండ్రియానతి యన్నమాత్రమునఁనే యరణ్యమునకుఁ బోన సమకట్టి, సుమంత్రునిఁ బిలిచి, “రాజానకు నా రాక యెఱిఁగింపు”మని చెప్పెను.

34-వ సర్గము.

సీతా రామలక్ష్మణులు వనవాసంబునకై దశరథుని వీడ్కొనుట

కమలాప్తుండును, నీలమేఘవర్ణుఁడును, కృష్ణోదరుఁడునైన రాముని యానతి వడసి వెంటనే గొప్ప బుద్ధిమంతుఁడయిన సారథియగు సుమంత్రుఁడను చింతాక్రాంతచిత్తుఁడై, వేగిరంబుగ లోపలికిఁ బ్రవేశించి, వేఁడి నిట్టూర్పులు పడుచుచు రాహుగ్రస్తమైన మృంగఁబడిన సూర్యునిమాడ్కిఁయు, నివురుగప్పిన నిప్పుచందమునను, నిల్లింకిన కొలనిచాడ్పునను గాంతిహీనుఁడై దైన్యమున మిక్కిలి వగచుచు నా రాముఁనే తలఁచి తలఁచి దుఃఖపడుచుండు నృపాలునిఁ జూచి, కొంత దాపుననుఁజేరి, తొలుత “మహారాజా! జయమగుఁగాక” యని దీవించి, దిగులుచేఁ దడఁ

బడుచున్న తిన్ని పలుకులతో "మహారాజా! పురుషశ్రేష్ఠుఁడయిన రాజ పుత్రుఁడగు రాముఁడు బ్రాహ్మణులకును, గింకరులకును దన యావద్ధనము నొసఁగి, తమ్ముఁ జూచుటకై వాఁకిటవచ్చియున్నాఁడు. నీకు శుభము గలుగునుగాక ! స్థిరపరాక్రమంబుగల రాముఁడు తన చెలి కాండ్రఁ యందఱికిఁడ సెలవుదీసికొని, యిప్పుడు ప్రభుదర్శనంబు గోరు చున్నాఁడు. ఓయధిపతీ, కిరణములచే వెలుఁగు సూర్యునివలె సకల రాజగుణంబులచేతను వెలుఁగుచున్న రాముఁడు గొప్ప యడవికిఁ బోవ నున్నాఁడు. తమరట్టి రాముని జూతురుగాక" యని చెప్పెను.

సత్యముఁ బలుకువాఁడును, ధర్మిష్ఠుఁడును, సముద్రమువలె గంభీరుఁడును, ఆకాశమువలె నిర్మలుఁడునునైన దశరథనృపాలుఁడు సుమంత్రుని జూచి, "ఓ సుమంత్రా! నా భార్యలనందఱిని దోడ్కొని రమ్ము. వారినందఱిని దగ్గఱనుంచికొని రాముని జూడఁ గోరు చున్నాను" అని యానతీయఁగా, సుమంత్రుఁడు వారి యంతఃపురంబు లకుఁబోయి వారితో "అమ్మలారా! నృపాలుఁడు మిమ్ముఁ బిలుచు చున్నాఁడు. ఆలస్యము చేయక రండు" అని చెప్పెను. రాజు ననుజ్ఞ యగుటంచేసి, రాముని వనవాసవార్తాశ్రవణ దుఃఖముచే నెట్టని కన్నులు గల్గియున్న నృపాలుని కాంతలు మున్నూటయేఁబండ్రు జవ రాండ్రును నియమవతులై, కౌసల్యను జుట్టుకొని మెల్లఁగానడచి పోయి దశరథ నరేంద్రుని భవనముఁ జేరిరి. భార్యలందఱు వచ్చినంతటనే దశరథ మహీపాలుఁడు సుమంత్రునిఁ జూచి, "సారథీ! నా పుత్రుఁడగు రాముని బిలుచుకొనిరమ్ము" అనఁగా, సుమంత్రుఁడు వాఁకిటికిఁబోయి, సీతను రామలక్ష్మణులను దోడ్కొని, వేగిరముగా నృపాలుని యెదుటికి వచ్చుచుండెను. అంతలోపల దశరథ నృపాలుఁడు చేతులుజోడించుకొని వచ్చుచున్న రాముని దవ్వుననే చూచి, డెందంబునఁ గుందుచున్న కాంతలతోడఁ దానును సత్వరంబుగ లేచి నిలిచెను. అట్లు నిలిచి, నృపాలుఁడు వేగిరంబున రాముని కెదు రుగాఁ బరుగిడి, శోకముచేఁ గడు నొచ్చినవాఁడై, రాముని దాపునకుఁ జేరకయే మూర్ఛిల్లి, నేల కొఱఁగెను. మహారథులగు రామలక్ష్మణు లిరు వురును దశరథుఁడు మైమఱచి క్రిందఁబడుటను జూచి, తత్తరపాటుతోఁ

బరుగిడివచ్చి, వియోగ దుఃఖము నోర్వజాలక యొడలుమఱచి నేలపైఁ బడియున్న నృపాలుని దాపునకుఁ జేరిరి. అప్పుడు రాజగృహమున వేల కొలఁదిగనున్న స్త్రీ లందఱు తమ భూషణముల ప్రోఁతలు దొడ్డపడు చుండఁగా "నయ్యో అయోధ్యా రామా" యని తత్తరపాటుతోఁగూడ నేడ్వఁ దొడఁగిరి. అప్పుడు రామలక్ష్మణులు సీతయు నేడ్చుచు దశరథుని చేతులఁ గ్రుచ్చియెత్తి పాన్పునఁ గూర్చుండఁబెట్టిరి. కూర్చుండఁబెట్టిన కొంతసేపటికి దశరథనృపాలుఁడు దెప్పిఱిల్లి, దుఃఖసాగరమున మునిఁగి యుండెను. అట్టి తండ్రిని జూచి, రాముఁడు చేతులు జోడించి, వినయ వంతుఁడై, మ్రొక్కి, "మహారాజా! నేను దండకారణ్యమునకుఁ బయన మైతిని. తమరు మా కందఱకుఁ బ్రభువులరు; కావున తమయొద్ద సెలవుఁ గైకొనవచ్చితిని. నాకు నేమంబు గలుగునట్లు దీవింపుఁడు. సీతయు లక్ష్మ ణుఁడును నాతోడ రాఁ బయనమైయున్నారు. నే నెన్నియో సరియైన కారణములు చెప్పి, మీ రిచ్చటనే యుండుఁడని వారించినను, వారు సమ్మతింపక నాతో రా నున్నారు. వారికిని ననుజ్ఞ యిండు. శత్రువుల యహంకారమును ఖండించు నృపాలా, తమరు శోకమువదలి, బ్రహ్మ దేవుఁడు ప్రజల నాజ్ఞాపించునట్లు మాకు మువ్వురకు వనమునకేఁగ సెల వొసఁగి, మమ్మందఱినిఁ బంపివేయుఁడు" అని తండ్రితోఁ జెప్పెను.

అట్లు పలికి, ధైర్యముతోఁ దన యానతికై యెదురుచూచుచున్న తనదు కుమారునిఁ జూచి, "ఓ రామా, నేను కైకేయికి వరము నొసఁగి మోసపోయితిని. నా యానతిని మీఱి నీవె యిప్పు డయోధ్యాపురంబు నకు యువరాజవుగమ్ము" అని తండ్రి చెప్పఁగా, ధర్మసంరక్షకులలో మేటియు, మాటలందు నేర్పరియునైన రాముఁడు తండ్రి మాటను విని చేతులు జోడించి యాతనితో నిటనియె.

"మహారాజా! తా మనేకవేల సంవత్సరములుగాఁ బుడమి నేలు చున్నారు. తామే ప్రభుత్వము చేయుదురుగాక! నే నరణ్యమున కేఁగె దను. నా నిమిత్తమయి తమ రసత్యదోషముఁ గట్టుకొనవలదు. నరా ధిపా! నేనును బదునాలుగేం డ్లరణ్యవాసముముగించి, మఱిలఁ దమ పాద ములకడఁ జేరెదను" అని తండ్రితో రాముఁడు చెప్పెను. అంతట నృపా లుఁడు సత్యమును త్రాటిచేఁ గట్టఁబడి, పుత్రవియోగ దుఃఖము నైరింపఁ

జాలక పలవించుచుఁ గైకేయి మఱుఁగునననుండి రాము నడవికే పంపుము పంపుమనిప్రేరణనేయు నుండుటంజేసి, చేయునది లేక తనముద్దులకొడుకుం జూచి, "నాయనా! నీకు మేలుగలుగుఁగాక; సంపద వృద్ధినొందునుగాక; మఱుల మ్రొచ్చుముగా నచ్చి చేరుదువుగాక. ధైర్యవంతుఁడవై మంచి దారిని బొమ్ము. నీ కెక్కడను భయము దోఁపనేరదు. నీవు సత్యమే స్వభావంబుగఁ గలవాఁడవు; ధర్మమునందే విడువని పూనికి గలవాఁడవు. నీవలన రఘువంశస్థు లందఱు "మనవంశమున నిట్టి మహానీయుఁడు పుట్టెనుగదా" యని సంతోషపడుచుందురు. నీ పట్టుదల నెన్వాఁడును నివారింపఁజాలఁడు. ఈ రాత్రికే యెట్లయినను పయనముగాకుము. నే నీ పూటయైనను నిన్నుఁ జూడకుచు నానంద మొందెదను. ననున్నుఁ దల్లినిఁ జూచుచు నీరేయియెల్ల నిచ్చటనుందుము. ఈరేయి మాళ్ళి కొలఁది, నీ కోరికలఁ దీర్చెదము. మాబలన నన్నికోరికలను బొందిన వాఁడవై, రే పుదయమునను పయనమగుదువు. రఘునందనా! నా యిష్టము నెఱవేర్పఁగోరి, నీ సౌఖ్యములనెల్లఁ బాసి, నిర్జానుష్యమయిన వనంబున వసింపఁబోవుచున్నాఁడవు. నీ విప్పుడు సేయ నలవికాని యొక పని చేయఁబూనితివి. ఇట్టి కార్యమును నీవు తప్ప మఱెవ్వాఁడు సేయఁ నోపును? నాయనా! నే నొట్టుపెట్టి చెప్పెదను, నీ వడవికేగుట నాకెంత మాత్ర మిష్టముగాదు. అయినను లోఁతు మనసుగలవై, బూదిఁ గప్పిననిప్పు చందమున నున్న యీఁడు దానిచేత మోసపోయితిని. దురభిప్రాయురాలగు నీ కైకేయియొక్క ప్రేరణముచేత మోసపోయిన నన్ను తప్పింపఁ గోరుచున్నావు. నీ యంతటి యుత్తమ పురుషుఁ డెవ్వాఁడైనఁ గలడే? నీవు నాకు పెద్దకొడుకవైయుండి, నాకు సంభవించిన యసత్య దోషంబు దొలఁగించుట యొక గొప్ప పింతగాదు. లోకమున పెద్ద కొడుకు తండ్రి ముదుసలి యైనప్పుడు తానే యన్ని సంగతులను విచారించుకొనుచుండును గదా" అని దశరథుఁడు చెప్పెను.

అంతట రాముఁడు తండ్రి శోకపురస్సరముగాఁ జెప్పిన పలుకులు విని, విన్నచనము మోమునఁ దోపఁగా, లక్ష్మణుని యనుమతంబునఁ దండ్రితో నిట్లనియె. "ఓ తండ్రీ! యీ దినమున నేఁ గోరు నన్నివస్తువులు మీఁదు నా కిచ్చితిరిపోండు, రేపు వానినెల్ల నాకెవ్వఁ డీ

గలఁడు? కావున నీ దినముననే యడవికిఁ బోవుట యన్ని కోరికల
నొందినట్లుగాఁ దలఁచుచున్నాను. ధనధాన్యములతోడను, జనపదముల
తోడను, సకలజనులతోడను నిండినదియు నేను విడిచినదియునగు నీ
పుడమినెల్ల భరతున కొసఁగుఁడు. నేను వనవాసమునకు నిశ్చయించితిని.
ఇఁక నా బుద్ధి మాఱదు. వరదా! తమరు సంతసముతోఁ గైకేయి
కొసఁగిన వరమును బూర్తిగా నొసఁగి యీమెను సంతసము నొందించి,
సత్యసంధులరగుఁడు. నేనును దమ యానతిని తాము చెప్పినచొప్పున నడ
పుచుఁ బదునాలుగేం డ్లడవియందు వనవాసులతోడఁ దిరుగుచుందును.
వేఱువిధముగా నాలోచింపక భరతునికిఁ బట్టాభిషేకము సేయుఁడు. నాకు
రాజ్యము గావలెననియు, దేహసౌఖ్యను గావలెననియుఁ గోరిక లేదు.
తమయాజ్ఞ నెవ్విధమునన్నైనను జెల్లించి కీర్తినొందఁ గోరెదను. తమరు
శోకము మానుఁడు; కన్నీరు విడువకుఁడు. నదులకు జేఁడగు సముద్రుఁ
డెవ్వరికి దాఁటు నలవికాక కలఁతఁ జెందకుండుఁగదా. అట్లె తమరును
ధైర్యము విడిచి ధైర్యము నవలంబింపుఁడు. నాకు రాజ్యమునందుఁ
గోరిక లేదు; సౌఖ్యమునందును గోరిక లేదు; సీతతోఁగూడి రమింపవలె
ననియుఁ గోరిక లేదు. ఈ భోగము లన్నియుఁ గావలె ననియు కోరను.
తుదకు స్వర్గమునందును, వేయియేల, నా ప్రాణమునందే నాకుఁ బ్రేమ
లేదు. తమ యెదుట నేను జేసెడి ధర్మకార్యములను, సత్యవాక్యపరిపాలన
మును సాక్షులనుగాఁ బెట్టి చెప్పెదను. పురుషోత్తమా! తమరు చెప్పిన
మాట తప్పి, యసత్యవాదియని పేరు తెచ్చుకొనక, ఆడినమాట తప్పని
వాఁడన్నమాట రావలెనని కోరెదను. ఓ నృపాలా! నే నిఁక నొకనిమిష
మైనను నిలువఁజాలను. ఇఁక వ్యసనము నాఁపుకొనుఁడు. ఇఁక నా తలంపు
మాఱదు. కైకేయి "రాఘవా! నీ వరణ్యమున కేఁగుము" అని నన్నుఁ
గోరెను. నేనును "అట్లే యరణ్యమునకుఁ బోయెదను" అని చెప్పితిని.
కావున నేను వాగ్దత్తమును రక్షించెదను. ఓ మహారాజా, యొక్కవ
మోహము నుంపకుము. మేమును సాధువులగుజింకలు మెండుగాఁగలిగి,
నానావిధములగు పక్షులయొక్క కలకలధ్వనులతోఁ గూడిన వనమున
విహరించుచుందుము. తండ్రీ! దేవతలకుఁగూడఁ దండ్రియే దైవమని

చెప్పఁబడును. నేనును దండ్రియే దైవమని యెంచి తండ్రియానతి ననుస రింపఁగోరితిని. నరశ్రేష్ఠుఁడా, నేను బదునాలుగేండ్లు నిండి మఱలి రాఁగానే నన్నుఁ జూడఁగలరు. కాఁబట్టి తాము దుఃఖముఁబొందుఁడు. కన్నీరు గ్రుక్కుకొని డగ్గుత్తికతోనున్న యీ జనుల దుఃఖమును దమరు దీర్ప వలసియుండఁగా, బురుషశ్రేష్ఠా, తమ రేల యిట్టి దుఃఖవికారము నొంది తిరి? అయోధ్యాపురమును, రాజ్యమును, భూమండలమునంతయు నేను విడిచితిని. తాము భరతునకొసఁగుఁడు. నేను దమయాజ్ఞ ననుసరించి చిరకాలము వనవాసము చేయఁబోయెదను. భరతుఁడే నేనువదలినదియు, పర్వతములు, నడవులు, పట్టణములు ననేకముగఁగలదియు, క్షేమంకర మయినదియుఁ, జక్కనియొల్లలుగలదియునైన భూమండలము నెల్లఁ బాలించునుగాక! నృపాలా! తమరు మొదట నెది యొట్లు చెప్పితిరో, యది యట్లే యగునుగాక! పెద్దలకు సమ్మతమయిన గురుని యాజ్ఞ నెఱవేర్చుట యందు నా కెంత పట్టుదలయున్నదో యంత పట్టుదల గొప్ప భోగము లందుఁగాని, నా కిష్టమగు వస్తువునందుఁగానిలేదు. ఓ మహాత్మా! తమరును నాకై వ్యసనము నొందవలదు. ఓ పాపరహితా! తమ యాజ్ఞను నెఱవేర్పక, తమరి నసత్యవాదినిఁజేసి, అవ్యయమయినరాజ్య మును కోరికలనుగోరను, సుఖముగోరను, సీతను గోరను, జీవితమును గోరను, సత్యవాక్య పరిపాలమును మాత్రము గోరెదను. తమరును సత్యవాక్య పరిపాలనము సేయుదురుగాక! నేనును నడవులకుఁ జని కంద మూలఫలములను భక్షించుచుఁ బర్వతములను, నదులను, తటాకములను జూచుచు వింత వింతలగు చెట్లుగల వనములలోఁ దిరుగుచు సుఖముగ నుండెదను. తామును దుఃఖమువిడిచి నిర్విచారులరై సౌఖ్యము నొందు దురుగాక" యని రాముఁడు దశరథునితోఁ జెప్పెను!

దశరథుఁడును దుఃఖముచేఁ బరితపించుచుఁ బుత్రుని గౌఁగిలించి కొని, స్మృతిదప్పి, మూర్ఛిల్లి, కొంచెమైన నిట్టటుకదలక నేలపైఁబడి యుండెను. అపుడు, కైకేయి తప్పఁ దక్కినవారందఱు గుమిగూడి హాహారవనేడ్చుచుండిరి. సుమంత్రుఁడును బలవించుచు మూర్ఛనొందెను. ఆ నగరంతయు రోదన ధ్వనులతో నిండెను.

౬౯-వ సర్గము.

సుమంత్రుడు కైకేయిని దూఱుట

అంతట సుమంత్రుఁడు దశరథ రాముల సంవాదమువిని, యిది యెల్లఁ గైకేయియొక్క- దురాలోచనయని తలఁచి, కోపాక్రాంతుఁడయి వేగముగఁ దలయూఁచి, పలుమాఱు నిట్టూర్పు విడిచి, చేతులుపిసికి కొనుచుఁ బండ్లు పటపటఁ గొఱుకుచుఁ గన్ను లెఱ్ఱనచేసి, ముందున్నట్టి మోము సొంపువదలి, కోపపరవశతచే నోర్వరాని సంతాపమునొంది, దశరథునకు రాముఁ డరణ్యమున కేఁగుట సమ్మతముగాకున్నదనియెఱిఁగి, కైకేయియొక్క- హృదయమును వాఁడి మాట లనెడుబాణములచే జిల్లులుపడఁగొట్టి యదలింపఁజేయుచు, సాటిలేని పరుసనిమాటలనెడివజ్రములచేఁ గైకేయియొక్క- మర్మముల నెల్ల భేదించుచు నామెతో నిట్లనియె:—

"ఓ కైకేయీ! స్థావరజంగమాత్మకమగు ప్రపంచమునకెల్ల నధిపతి, నీ ప్రియభర్తయునైన దశరథనృపాలుని విడిచితివే! ఇది యెంత యకార్యము! ఇంతటిచేయరాని పనికిఁ బూనిన నీ వెంత పనిని జేయవు! దేవేంద్రునివలె జయింప నలవిగాని పరాక్రమవంతుఁడును, పర్వతము మూడ్కిఁ గదలింప నశక్యుఁడును, మహాసముద్రమువలెఁ గలియఁబెట్ట నలవికానివాఁడును నైనన్నపాలునికి నీ దుష్కార్యములచే నొప్పించు చున్నావే! దీనిఁబట్టిచూడ నీవు మగనిఁ జంపుదానవనియు, బాగుగ యోచించినచోఁ గడపటికిఁ గులనాశకురాల వనియు నేఁ దలఁతును. జనుల నందఱఁ బోషించువాఁడును, కోరిన వగము నొసంగు వాఁడును నైన భర్త నవమానింపకుము. కాంతకు మగని యిష్టము చొప్పున నడుచుట కోటిపుత్రులకంటె నెక్కువ. ఒకదేశమున రాజు మృతినొంది నప్పుడు రాజులు వయఃప్రకారమున రాజ్యము నొందుదురు. ఇక్ష్వాకు వంశ నాథుఁడగు నీ రాముఁడు పెద్దవాఁడు గావున నతఁడు రాజుగావ లసియుండ, నా కార్యము నేల యాటంకపఱిచెదవు. నీ కొడుకగు భరతుఁడే రాజగుఁగాక! అతఁడే రాజ్యమును బాలించుగాక! రాముఁ డెచ్చటికిఁ బోవునో, యచ్చటికి మేమును బోయెదము. నీ కొడు కేలెడి యీ దేశమున నొక్క బ్రాహ్మణుఁడయిన నుండఁబోఁడు. అట్టి పరువులేని

పని నేల చేయఁదలఁచితివి? ఓసీ క్రూరరాలా! నీ విట్టి క్రూరకార్యము చేయుచుండఁగా నీ పుడమియొల్ల వెంటనే బ్రద్దలుగాకున్న దేమి? ఇది గొప్ప వింతగా నున్నది. వాఁడివై చూపఱను వెఱపింపుచున్నట్టి గొప్ప బ్రహ్మర్షులు నెప్పెడి "ఛీ! ఛీ!" యను శాపవాక్యములు రాము నడవికిఁ బంపఁ గంకణము గట్టుకొన్న నిన్ను రూపుమాప కున్నవికదా! మామిడి వ్రేఁకును గొడ్డటితో నఱికి, యచట వేఁపచెట్టునునాటి పాదుగట్టి, పాలు పోసి పెంచిన వాని కది తీయనిపండ్లనీయదు. నీ తల్లియొక్క స్వభావ మెట్టిదో, యట్టి స్వభావమే నీకును గలిగినది. వేఁపచెట్టునుండి తేనె పుట్టునా? అట్లు చెడ్డదియగు నీ తల్లి కడుపునఁబుట్టిన నీవును చెడ్డదానవు గాకుందువే? నీ తల్లియొక్క చెడ్డపట్టుదలను మా పెద్దలు నెప్పఁగా వినియున్నాను.

తొల్లి వరముల నొసఁగు నొక మునీంద్రుఁడు నీ తండ్రికిను త్తమ మగు వరము నొసఁగెను. ఆ నరప్రభావమునంజేసి నీ తండ్రియగు కేకయరాజు పశువులు మొదలగు సకల తిర్యగ్జంతువుల మాటలను దెలిసికొనఁ గలవాఁ డయ్యెను. మితిమీఱిన కాంతిగల యాతఁ డొక దినమునఁ బొన్పుపైఁ బరుండియుండఁగా, జృంభమను నొక చీకు మాట లాడెను. ఆ చీకు యభిప్రాయము నెఱిఁగి యాతఁడు పకపక నవ్వెను. ఆ నృపాలుని ప్రక్కనఁ బరుండియున్న నీ తల్లినిష్కారణముగ నవ్వినందుకై కనలి, మగనికి మరణమను త్రాటినిగోరి, "నృపాలా! నీవేల యిప్పుడు నవ్వితివి? నవ్విన కారణము నెఱుఁగఁ జెప్పవే" యని యడిగెను. అప్పుడు నీతండ్రి నీ తల్లిని జూచి, "ఓ దేవీ! నేను నవ్వినందుకుఁ గారణముఁ జెప్పుదునేనీ, నాకుఁ దప్పక వెంటనే మరణము సంభవించు"ననిచెప్పెను. ఆమాట విని, నీ తల్లి రాజును జూచి, 'రాజా! నీవు బ్రతుకనైన, బ్రతుకుము, చావనైన జావుము. నీవు నన్నుఁ బరిహసించుటకై నవ్వలేదని తెలిసికొనవలయు'నని యడుగఁగాఁ, గేకయనృపాలుఁ డా పలుకులు విని, తనకు వరము నొసఁగిన మహాత్మునితో, "మహాత్మా! నాదేవి నాహాసకారణము నడుగుచున్నది. చెప్పుదునా" యని యడిగెను. ఆ వరదుఁడగు మహాత్ముఁ డప్పలుకులు విని "రాజేంద్రా

చావనీ, పాడైపోవనిమ్ము. నీ వేమాత్రము చెప్పకు" మని చెప్పెను. నృపాలుఁడా మహాత్ముఁడు నిర్మలహృదయముతోఁ జెప్పినపలుకులు విని, నీ తల్లిని వెంటనే తజీమివైచి, కుబేరునివలె విహరించుచుండెను. పాప కార్యమందే దృష్టిగలదానా! నీవు నట్లు చెడ్డవారు నడిచెడిదారిలో నున్నదానవై, తెలివిలేక నృపాలునిచేఁ జెడుకార్యమును జేయించు చున్నావు. అదియుఁ గాక మగబిడ్డలు తండ్రుల ననుసరించియు, నాఁడు బిడ్డలు తల్లుల ననుసరించియుఁ బుట్టుదురనియు లోకమున వాడుకొను లోకోక్తి నిజమని నాకుఁ దోఁచుచున్నది. నీ విట్టి మొఱకుఁ దనము వదలుము. నృపాలుఁడు చెప్పినతెఱఁగున నడచుకొనుము. ఇప్పుడు నీ భర్తయొక్క యభిప్రాయను నవలంబించి, యీ జనులకెల్ల గతియగుము. నీవు చెడ్డవారి దురోభ్భనలకు లోఁబడి, దేవేంద్రునివలె వెలుఁగునట్టి లోకరక్షకుఁడగు నీ మగని సధర్మముసఁ ద్రోయకుము. దేవీ! పాపపుష్టి తుఁడును కాంతిమంతుఁడునైన దశరథనృపాలుఁడు మోసపోయి యొసఁగిన వరముల నిప్పుడు నీ కీకపోవఁడు. రాముఁడు పెద్దవాఁడు; జ్ఞానశీలుఁడు; సదాచారసంపన్నుఁడు; స్వధర్మము గాపాడువాఁడు; సకల జంతువులను రక్షించువాఁడు; బలవంతుఁడు. ఇట్టి సకల గుణములు గల రామునికిఁ బట్టాభిషేకము జరుగునట్లు చేయుము. ఓ దేవీ! తండ్రిని బాసి, రాముఁడు కాననకేఁగునేని, నీకు గొప్ప యపవాదము సంభవించును. ఆ రాముఁడు రాజ్యపాలనము సేయునుగాక ! నీవును జింతను బాసి యుండుము. రాముఁడు తప్ప నితరుఁ డెవ్వాఁడును సమర్థుఁ డిక్కడ నుండఁజాలఁడు. రాముఁడు యువరా జగునేని, మేటివిలుకాఁడగు దశరథనృపాలుఁడు తన పెద్దలదారి ననుసరించి, వానప్రస్థాశ్రమము నడపుటకై వనమునకేఁగును" అని యివ్విధమున సుమంత్రుఁడు నయభయ సూచకములగు మాటలచే రాజసమీపమున కైకేయి మనసును గలఁత పెట్టి, మఱల చేతులు జోడించికొని యుండెను.

సుమంత్రుఁ డిన్ని మాటలఁ జెప్పినను, కైకేయియొక్క మనస్సు కొంచెమైనను గలఁతనొంద దయ్యెను; సంతాపము నొంద దయ్యెను. అప్పు డామె మోమునందు మిన్నదనమును దోఁపదయ్యెను.

36-వ స ర్గ ము.

సిద్ధార్థుండను మంత్రి కైకేయిని దూషించుట

అంతట నిక్ష్వాకువంశస్థుఁడగు దశరథనృపాలుఁడు వరదానముల నొసంగెనందుకు మిక్కిలి నొచ్చినవాఁడై, కన్నీరుగార నిట్టూర్పు విడుచుచు సుమంత్రునిఁ జూచి మాటిమాటికి నిట్లనియె.

"ఓ సారథీ! చతురంగబలములతోఁ గూడిన సేన విశేషధనముఁ గైకొన్నవై రాముని వెంబడించి పోవు నట్లుత్తరువు చేయుము. మాటలచే నితరుల మనముల నాకర్షించువారగు వేశ్యలును, గొప్ప భాగ్యవంతులగు వర్తకులును బహార్థములను గొని పుష్కలముగఁ రాముని సేనలను వెంబడింతురుగాక! ఎవ రీతనియండ జీవనము చేయుచున్నారో, యెవరియొక్క బలిమినిజూచి రాముఁడు సంతోషపడుచుండునో; వారి, కందఱికిని విస్తార ధనము నొసఁగి, వారినిగూడ రాముని వెంబడించు నట్లానతిమ్ము. పట్టణవాసులు శ్రేష్ఠములయిన యాయుధములను దాల్చి, బండ్లను దోలుకొనియు, వనములందుఁ దిరుగు బోయలును రాముని వెంబడిఁ బోవుదురుగాక. రాముఁ డట్లు సర్వ సైన్యముతోఁగూడ నేఁగి, మృగములను, వీనుఁగులను జంపుచు నడవితేనెను ద్రావుచు, పలునదులను జూచుచు, రాజ్యమునే తలంపఁబోఁడు. నా ధాన్యపుఁగొట్టును, బొక్కసమును జన రహితమయిన వనమున నుండఁగల రాముని వెంబడించునుగాక! రాముఁడు పుణ్యదేశములందు జన్నములు నేయుచు, యాచకులకుఁ గావలసిన దక్షిణ లొసఁగుచు, ఋషులతో నిష్టగోష్ఠి సల్పుచు వనంబున సుఖముండును. గొప్ప బాహువులుగల భరతుఁడు నయోధ్యను బాలింపఁగలఁడు. సర్వోత్కృష్టుఁడగు రామునికి నెల్ల యిష్టార్థముల నొసఁగి, యడవులకుఁ బంపుము."

ఇట్లు దశరథుఁడు సుమంత్రునితోఁ జెప్పుచుండఁగాఁ గైకేయి కెక్కువ భయముదోఁచెను. మో మెండిపోయెను. కంఠధ్వని సన్నమయ్యెను. ఆ కైకేయి యిత్తెఱఁగున దుఃఖించి, మిక్కిలి వెఱచి, సంతాపముచే నెండుచున్న మోముగలదై, రాజున కెదుట నిలఁబడి "ఓ సత్పురుషుఁడా! జనులందఱు రాముని తోఁగూడఁ బోయినతర్వాత పాడుపడిన యీ యయోధ్యాపురము సారముదీసిన కల్లువలె రుచిలేనిదై యసుభవ

యోగ్యము గాకయుండును. అట్టి పురమును భరతుఁ డేలుటకు సమ్మతింపఁడు" అని సిగ్గువిడిచి, కడుభయంకరముగాఁ జెప్పఁగా, దశరథుఁడు విశాలనేత్రయగు కైకేయిం జూచి, "ఓ శత్రురాలా! బరువు మోయ నన్నునియమించి, మఱల నన్నేల బాధించుచున్నావు. ఓ చెడ్డదానా! నేను దలఁచిన కార్యము గాకుండఁ జేయుటకు ముందే యేల నివారింపవైతివి" అని కోపముతోఁ నడిగెను. సౌందర్యవతియగు కైకేయి దశరథుఁడు కోపముతోఁ జెప్పిన పలుకులు విని, తా నతని కంటె రెట్టించిన కోపముగలదై, రాజుం జూచి, "తొల్లి నీయొక్క వంశముననే పుట్టిన సగరచక్రవర్తి యసమంజుఁడని ప్రసిద్ధికెక్కిన తన పెద్ద కుమారుని నేమియు నీక తఱుమఁగొట్టెనుగదా! అతఁడు సేనతోడనేఁగెనా! అరణ్యమునకుఁ బోవలెనన్న స్వాధనము విడిచిపెట్టి పోవలయునని కదా యభిప్రాయము. ఆ యసమంజు నట్లే యీ రాముఁడు నేఁగవలయు"నని చెప్పఁగా, దశరథుఁ డా మాట విని, "ఛీ! యిది పరమ నీచురాలు. ఇది మున్నడుగనిదానినికూడ నిష్ఫాడు గోరుచున్నది. ఇది దహింపఁబడుఁగాక" యని నిందించెను. అచ్చట నున్న జనులందఱు దాని దీమసమును జూచి సిగ్గుపడిరి. ఆ కైకేయి వానినంతయు లక్ష్యపెట్టకుండెను.

అప్పు డచ్చట సిద్ధార్థుఁడను ప్రధానమంత్రి యొకఁ డుండెను. అతఁ డాచారవంతుఁడు; ఎక్కువ మర్యాదగలవాఁడు. ఆతఁడు కైకేయిం జూచి యిట్లనియె. "చెడ్డబుద్ధి గల యసమంజుఁడు దారిలో నాఁడు కొనుచుండు బాలురను గొనిపోయి, సరయూనదిలోఁ బడవైచి, వేఁడుక చూచుచుండెను. అట్లు రాజపుత్రుఁడు చేసెడి యన్యాయమును జూచి, పురజనులందఱు కోపగించికొని రాజసన్నిధికిఁ జని, "రాజ్యమును పాలించు నృపాలా! అసమంజునిఁ దఱుముఁగొట్టి, మమ్మునైన నీ చేత మున నుంచుకొనుము. మమ్మునందఱిని దఱిమి యసమంజు నొక్కనినైన నుంచుకొనుము" అని సగరచక్రవర్తితో మొఱపెట్టుకొనిరి. అపుడు రాజు జనులను జూచి, మీ కింత వెఱపు పుట్టుట కేమి కారణమని యడిగెను. రాజు మిగుల ప్రేమతో నడిగిన తర్వాత జనులందఱు రాజుం జూచి, "నరేంద్రా! యీ యసమంజుఁడు చంచల చిత్తుఁడై,

దారిలో నాటలాడుకొను మా పిల్లలనందఱఁ గొనిపోయి సరయూనదిలో వైచి తెలివిలేమిచే మిక్కిలి వేడుకతోఁ జూచుచున్నాఁడు. ఇదియె మా భయమునకుఁ గారణ"మని చెప్పిరి. ఆ సగరన్నపాలుఁడు జనుల పలుకులు విని, వారియిష్టము నెరవేర్పఁగోరి, అహితుఁడగు కుమారు నసమంజుని భార్యాపరివార సమేతముగ రథమెక్కించి, "ఇతఁడు బ్రతికియున్నంతకాలము పట్టణములోపలికి రాఁగూడదు. అడవిలోనే యుండవలయును" అని పంపివేసెను. ఆ యసమంజుఁడు గుద్దలిని గంపను గైకొని, పాపంపుఁ బనులు సేయువాని చందమున పర్వతదుర్గములందును, నానా దిక్కులందును ద్రిప్పురుచుండెను. ఈ కారణములచే మిక్కిలి ధర్మాత్ముఁడయిన సగరుఁడు తనదు పెద్దకొడుకును విడిచిపెట్టెను. ఇప్పుడు రాముని నడవికిఁ బంపఁదలఁచితివే! రాముఁ డట్టి యే చెడ్డపని సేసినవాఁడు? రామునియెడ లేశమైనను దుర్గుణము గనఁజాలము. చంద్రునందుఁ గళంక మెట్లులేదో, అట్లే రామునియందుఁ గించిత్తైనను దుర్గుణము లేదు. ఓ దేవీ! అట్లు కాక, నీ కేదియైన దోషము గనఁబడునేని, దానినిపుడు యథార్థముగా జెప్పుము. ఆ కారణమున రాము నరణ్యమునకుఁ బంపవచ్చును. దుష్టుఁడుగాక, సన్మార్గమునఁ దిరుగువానిని విడుచుట యధర్మము గావున నట్టి యన్యాయ మింద్రుని సంపదనైనను బోఁగొట్టును. కావున రాముని పట్టాభిషేకమునకు విఘాతము సేయవలదు. సొగసైన మోముగలదానా, లోకాపవాదమునకైనను వెఱచి, యిట్టి యన్యాయమునకుఁ బాల్పడకుము" అని సిద్ధార్థుఁడు కైకేయితోఁ జెప్పఁగా, రాజుదుఃఖముచే మతీంత హీనస్వరము గలవాఁడై, కైకేయింజూచి "ఓ పాపాత్మురాలా, నిన్నుఁ జూడ దీనికి నీవు సమ్మతింపవనితోఁచెడి. నీకుఁగాని, నాకుఁగాని హితమునుగోరవు. నీచమార్గమును ద్రొక్కి కుచ్చితంపుఁ బనులు చేయుచున్నావు. నీ నడత సన్మార్గమునకు విదుద్ధముగా నున్నది. నేనును రాజ్యమును, సుఖమును, ధనమును బాసి యిప్పుడే రాముని వెంబడించెదను. నీవును భరతునితోఁగూడి సుఖము లనుభవించుచుఁ జిరకాలము రాజ్యము పాలింపుము" అని చెప్పెను.

37-వ సర్గము.

కైకేయి రామాదులు కైకేయి చెచ్చియిచ్చిన నారబట్టలను ధరించుట

రాముఁడు సిద్ధార్థుఁడను ప్రధానమంత్రియొక్క మాటనువిని, వినయమిట్టిదియని యెఱిఁగినవాఁడగుటఁజేసి, సవినయముగా దశరథునిం జూచి, "నృపాలా! సుఖములను బాసి, యడవులయందుఁ గందమూల ఫలాదులను దినుచు, సకలాశల వర్జించియుండఁబోవు నా కీ సేనలతో నేమి యుపయోగమున్నది? ఎవఁడైన నొక్కఁడు మేటియేనుఁగునొసఁగి దాని నడుమునకుఁ గట్టెడి మోకును గోరినయెడల నేమి యుపయోగము? ఏనుఁగును విడిచినతర్వాత దాని నడుమునకుఁ గట్టెడి మోకునం దాశపడి యేమి యుపయోగము లేదు. ఓ పుడమిఱేఁడా! సత్పురుషశ్రేష్ఠుఁడా! నా కీ సేనలతో నేమి యుపయోగము? అన్నిఁటిని నా భరతున కీ సమ్మతించుచున్నాను. నాకు నారబట్టలఁ దెచ్చియిత్తురుగాక! అవియే నాకుఁ జాలును. నేను బదునాలుగేం డ్లరణ్యమున నుండవలయుఁ గావున నాకుఁ బ్రాణధారణమునకై, గడ్డలు దుంపలు గుద్దలిని, బుటికను దెచ్చి యిప్పింపుఁడు" అని యడిగెను.

కైకేయి వెంటనే తానే నారబట్టలఁ దెచ్చి జనులందఱు చూచుచుండఁగా "రామా! యివిగో! నారబట్టలు కట్టుకొమ్ము" అని సిగ్గుమాలి చెప్పెను. ఆ పురుషశ్రేష్ఠుఁడైన రాముఁడు కైకేయివలన నా రెండు నారబట్టలను గైకొని, తాను గట్టియున్న సన్నపుట్టము నూడఁదీసి, యా మునులు దాల్చెడు నారవస్త్రములను గట్టెను. లక్ష్మణుఁడు నచ్చటనే తండ్రి సమక్షమునలనే మేలి వస్త్రములను విడిచి తాపసులు దాల్చెడి వల్కలములను గట్టెను. అంతట సీతాదేవి దా నెప్పుడు పట్టుబట్టలఁ గట్టుకొనునది కావునఁ దన నిమిత్తము కైకేయి తెచ్చిననారచీరను జూచి, వలనుజూచిన యాఁడుఁజింకవలె గడగడవడఁకెను. శుభలక్షణములు గలదియు, సర్వధర్మముల నెఱిఁగినదియు, భర్తృధర్మములనే తన ధర్మములనుగా నెంచుచుండునదియునైన సీత కైకేయి దెచ్చిన నారచీరలను గైకొని, మనంబున మిక్కిలి నొచ్చినదై, కన్నీటిచే నిండిన కన్నులు గలదై, గంధర్వరాజుం బోలెడి తనయు పెనిమిటిం జూచి "నాథా! వన మునకుండు మును లీ నారబట్ట లెట్లు కట్టుకొందురు"అని మాటిమాటి

నడిగి వానిని దాల్చుటకుఁ జేతఁగాక నిశ్చేష్టురాలయి యుండెను. అట్లు కొంత సేపుండి, యా సీత యొక వల్కలము మెడకుఁ గట్టికొని, మఱొక్కటి చేతఁ బట్టికొని, కట్టుకొనఁజాలక యచ్చటనే సిగ్గుతో నిలఁబడి యుండెను. ధర్మపోషకులలో మేటియగు రాముఁడు వేగిరంబు సీతకడ కేఁగుదెంచి, యా మె కట్టియున్న పట్టుచీరకుఁ బైనఁ దానే నారచీరను గట్టెను. సీతకు శ్రేష్ఠమయిన నారచీరను గట్టుచున్న రామునిఁ జూచి యంతఃపురాంగన లందఱు కన్నీరుగార్చుచు మిక్కిలి యాయాసము నొంది, ప్రతాపముచే వెలుఁగుచున్న రామునిఁ జూచి "ఓ బిడ్డఁడా! గొప్ప మనసు గలదగు సీత వనవాసమునకుఁ బోవలయునని యాజ్ఞాపింపఁబడలేదు. నీవు పితృవాక్య పరిపాలనమునకై యడవి కేఁగినప్పుడు, ఓ ప్రభూ! నీకు మాఱుగా సీతను జూచుచుండెదము. ఓరీ కొడుకా, నీవు లక్ష్మణునిఁ దోడ్కొని వనమునకుఁ బొమ్ము. ఈ సుకుమారాంగియగు సీత మునిపత్నివలె వనవాసము సేయ నర్హురాలుగాదు. ఓ కుమారా! నీవు ధర్మమే ప్రధానముగాఁగలవాఁడవు. నీ విప్పుడు తండ్రి పనుపుఁ దప్పించి యరణ్యమునకుఁబోవక నిలువవుగదా! కావున మా వేఁడికోలు నియ్యకొని సీత నిచ్చట విడిచిపొమ్ము. ఆపె యిచ్చట నుండును గాక!" యని పలికిరి. దశరథ తనయుఁడగు రాముఁ డివ్విధమునఁ బలుకు నంతఃపురాంగనల మాటల నాలకించుచుఁ దన స్వభావమువంబోలు స్వభావముగల సీతకుఁ దానే వల్కలము గట్టనే కట్టెను. సీత నారచీరలఁ గైకేయి చేతినుండి గైకొన్నవెంటనే, రాజపురోహితుఁడగు వసిష్ఠుఁడు సీతాదేవిని, "నీవు కట్టుకొన నక్కఱలే"దని నివారించి, కైకేయిం జూచి యిట్లనియె. "న్యాయము దాఁటి చెడ్డదారులలోఁ బ్రవేశించు బుద్ధిగల దానా, కులమునకుఁ జెఱుపనచేఁటయైనదానా, నృపాలుని మోసపుచ్చి, మర్యాదమీఱి యెంతపనికైనఁ దెగఁబడితివిగదా! గుణహీనురాలా, సీతాదేవి యేల యడవుల కేఁగవలెను? ఆమె పోవలసినది లేదు. ఆమెయే రాముని కిప్పుడు సిద్ధముగానుండు సింహాసనమెక్కి రాజ్యముఁ బాలింపఁగలదు. సంసారియగు గృహస్థునికి భార్యయె యాత్మయని వేదములు చెప్పుచున్నవిగదా! అట్లేరాముని కీ సీత యాత్మ గనుక సీత రామునికి బదులుగానుండి భూమిని పాలింపఁగలదు. అట్లు కాక, సీత రాముని

వెంబడించి వనంబున కేగునేని, మేమును వెంబడింతుము. ఈ పట్టణ మెల్ల వెంబడించును. రాముఁడు భార్యాసమేతుఁడై పోవు వనంబున కే సేనాధిపులును, జనుల కాదరువయిన దశరథుఁడును, వతని దేశమున నుండు జనులును, పట్టణవాసులును తమ సకలపరివారములతోఁగూడఁ బోవుదురు. భరతుఁడును, శత్రుఘ్నుఁడును వల్కలములఁ గట్టుకొని, యడవులఁ దిరుగుచునున్న తమయన్నకడ కేఁగుదురు. అటుపిమ్మట నీ వొక్కతెవె, చెంత నడతలుగలదానవై, జనులకుఁ గీడుచేయుచు నిర్హా నుష్యమై చెట్లు మొలచియుండు నీ పురము నేలుచుండుము. రాముఁడు రాజుగాని రాజ్యము రాజ్యముగాదు. రాముఁడుండఁగల యరణ్యమె రాజ్య మయ్యెడిని. భరతుఁడు దశరథునకే పుత్రుఁడగునేని, తన తండ్రి తనకు మనఃపూర్తిగ నీని రాజ్యము నేలనిచ్చుగింపఁడు. నీవు తన తండ్రికి విరోధమునేసితివిగాన నీయందుఁ గొడుకువలె భక్తిగలిగియుండ నేరఁడు. నీవు నేలనుండి నింగి కెగిరినను, తనపెద్దలవంశచరిత్రము నెఱిఁగిన భరతుఁడు మర్యాదకు భంగముగా నడచుకొనఁడు. కావున నీవు నీ కొడుకుపైఁ బ్రేమతోఁ జేసిన కార్యము నీకొమరునకు సన్మతమైనదికాదు. నీవు పుత్రుని కిష్టమని చేయ నెంచిన పని యాతనికి విరుద్ధమేయగును. లోకమున రాముని మనము ననుసరించి పోవనివాఁ డొక్కఁడు నుండఁడు. ఓ కైకేయీ! రాముఁడు వయనముగాఁగానే, యీ రాము నితోఁగూడ నేఁగవలఁచియుండు సింహ, వ్యాఘ్ర, మృగాదులను నీ వెప్పుడే చూడఁగలవు. ఓ కైకేయీ! నీ కోడలు గట్టిన నారచీరను విప్పి, శ్రేష్ఠములయిన యాభరణముల నొసఁగుము. ఈ నీ కోడలగు సీత నారబట్టలను దాల్పఁదగినదికాదు. మఱియు వీవు "రాముఁ డొక్కఁడే వనమున నారబట్టలఁ దాల్చియుండవలయు"నని కోరితివి. కావున నీ కోడలగు సీత భూషణములను దాల్చి, కైనేత నేసికొని, రాముని తోడ నరణ్యమున వాసము చేయఁగలదు. ఈ సీతయు రామున్నట్లే జడలను, వల్కలములను దాల్చి వనమునకుఁ బోవలెనని నీవు గోరవైతివి గావున, రాజపుత్రియగు సీత ముఖ్యములయిన వాహనములను, పరిచారకులను, సకలవిధములగు వస్త్రనులను, సకలవిధ సాధనములను గూడఁ దీసికొని వయనముగాఁగలదు" అని కైకేయితోఁ జెప్పెను.

బ్రాహ్మణశ్రేష్ఠుఁడు సాటిలేని తపోమహిమ గలవాఁడునగు రాజ పురోహితుఁడయిన వసిష్ఠమహాముని యా ప్రకారము పలుకుచుండఁగా, సీతమాత్రము తన ప్రియకాంతుని యభిమతమునకు విరుద్ధముగాఁ బోఁ దలఁచినదిగాదు కావున సీతయొక్క మనసు గించిత్తయినను మాఱ దాయెను.

38-వ సర్గము.

దశరథుఁడు సీతకు నారబట్టలు వలదనుట

సీత నాథుఁడు గలదైనను నాథుఁడు లేనిదివోలె నారచీర గట్టు కొనుచుండఁగ జను లందఱు చూచి, "ఛీ! దశరథుఁడా!" యని దశర థుని మిగుల నిందించిరి. ఆ నగరునందలి యా కోలాహలమును విన్న తోడనే, యా మహీపాలుఁడు తన ప్రాణమునందును, ధర్మమునందును, కీర్తియందును నాశ విడిచి, యింకఁదన కవి రావనియెంచి, వేఁడి నిట్టూర్పు విడిచి, యా భార్యతో, "ఓ కైకేయీ! సీత నారచీరను గట్టుకొని వనమునకుఁ బోఁజనదు. ఆ సీత సుకుమారి; పిన్నవయసుది; ఎల్లప్పుడు సౌఖ్యము లనుభవింపఁదగినది. మా గురువగు వసిష్ఠమునీంద్రుఁడు "ఈ సీత వనవాసమునకుఁ దగినదిగా" దని నిజము చెప్పెను. ఈ రాజేంద్రుని పుత్రికయగు సీత దయసూపఁదగినది. ఈ సీత యెవరికి నీషత్తయిన నపకారము సేయఁలేదు. ఈసీత నారచీరఁ గట్టికొని జనుల నడుమ వెలవెలపోవుచు, మై మఱచినట్లు, మునికాంతవలె నిలిచి యున్నదే! ఇట్లుండవలసిన యవస్థ యీమె కేల సంభవించెను! ఈపె జనకమహారాజు కూఁతురు; సామాన్యకాలుకాదు. ఈపెను నారచీరలను విడిచివేయుమని చెప్పుము. సీతయుఁగూడ నారచీరలఁ గట్టికొని యరణ్య మునకుఁ బోవలయునని వరమును నే నొసఁగనైతిని. కావున రాజపుత్రి యగు నీ సీత తన సౌఖ్యమునకు లోపము వాటిల్లకుండునట్లుగఁ దనకుఁ గావలసిన యమూల్య రత్నాదులను దీసికొని వనమున కరుగునుగాక. నేను బ్రతుకఁదగినవాఁడనుగాను. కావుననే నీ కింతటి క్రూరమైన వాగ్దానమును జేసితిని. ఆడినమాట తప్పలేక యింతకష్టముఁ దెచ్చు కొంటిని. ఇఁక నేమి యనుకొని యేమియుపయోగము? నీవును మూఁడు రాలవై రాముని యరణ్యవాసము, భరతుని పట్టాభిషేకమునఁదడి

యీ వరములం గోరితివి. వెదురును దాని పుష్పమె కాల్చునట్లు, నే నొనర్చిన వరదానము నన్నే దహించెను. ఇక నేనేమి చేయుదును. ఓసీ క్రూరురాలా! రాముఁడు నీ కెట్టైనఁ గీడు రవంతచేసినాఁడను కొందువుపో! అక్కటా! నీచురాలా! నీకు సీత యేమి యపకారము సేసినది? ఈ సీత యూఁడుఁజింకవలె విశాలమయిన కన్నులు గలది; మెత్తని స్వభావముగలది. నీవలెఁ గీడురోయునదికాదు. చూపటికు దయ తలఁపఁదగినది. అట్టి జానకి నీకేమి యెగ్గుసేసినది? ఓసీ క్రూరురాలా! రాముని నడవికిఁ బంపుటకుఁ గంకణము గట్టికొంటివే! అది యెక్కటి చాలదా? మఱేయము నిట్టి తుచ్ఛంపుఁ బాపకార్యము లేల చేసెదవు? వీనిచే నీకు వచ్చెడు ఫలంబేమి? ఓ కైకేయీ! పట్టాభిషేకమునకై వచ్చిన రామునిఁ గూర్చి, "ఈ రామునికిఁ బట్టాభిషేకము నిలిపి యరణ్యమునకుఁ బంపు"మని యడిగితివి. నీ మాటను విని నేను నంత మాత్రమునకుఁ బ్రతిజ్ఞ చేసితిని. నీ విప్పు డామాట మాఱి, సీతకూడ నారచీరఁగట్టుచుండఁగాఁ జూచుచున్నావుగదా! నన్నడిగినదానికంటె మించ్చుగా నీవు గోరుచున్నావు గాన నీవు నరకము నొందఁగోరితివి" అని యవివేకంబున మహానుభావుఁడగు దశరథుఁడు విలపించుచుఁ గొంచెమైనను వ్యసనముయొక్క దరిఁ గానక, యా పుత్రవియోగ వ్యసనము నందే మునిఁగినవాఁడై, కడునొచ్చి పుడమిపైఁబడి, మఱలఁ గొంత సేపటికి లేచి కూర్చుండెను. ఆ ప్రకారముగఁ బలుకుచుఁ దలవాల్చి కూర్చుండియుండు తండ్రినిగూర్చి రాముఁ డడవికిఁ దఱలినవాఁడై యిట్లనియె: "ధర్మపరుఁడవగు ఓ ప్రభూ యీ నా తల్లియగు కౌసల్య గుణవతియని కీర్తివడసినది; పెద్దది; గొప్ప స్వభావముగలది; తా మీ ప్రకారముగఁ దన పుత్రుఁడగు నన్నుఁ గానలకుఁ బంప నెంచితిరని తమరిని దూషింపకున్నది. తాము కోరిన గోర్కులొసంగువారుగాన, నన్నుఁబాసి, దుఃఖసాగరమున మునిఁగినది కదు, నింతకు మున్నిట్టి వ్యసనముల నెఱుఁగనిదియునైన నా తల్లిని ప్రేమతోఁ జూచుచుండఁ గోరెద. ఇంద్రసమానా! తాము జనులచే మర్యాదసేయఁదగినవారలు. తమ మన్ననచే జాలినొందఁదగిన యామే నాయెడఁబాటువలని వ్యసనము నెట్లొందక, నన్నే తలంచుచు, తమకడఁ బ్రాణములు నిలుపుకొని

యుండునో, నేను వనమున నుండఁగా, దుఃఖముచేఁ జిక్కిన యా మె యమసదనము నొందక, నేను మఱల వత్తుననెడి యాశగలిగి, నా రాక కెదురుచూచుచుండునో, ఆ ప్రకారముగఁ దాము సేయవలయు" నని రాముఁడు తండ్రితోఁ జెప్పెను.

39-వ సర్గము.

{ సుమంత్రుఁడు దశరథాజ్ఞచే రాముని వనంబునకుఁ దోడ్కొనిపోవ రథంబుఁ దెచ్చుట }

దశరథుఁడు పత్నీసమేతుఁడై శ్రీరాముని వచనమును వినియు, మునివేష ధారియగు రాముని జూచియు, స్మృతిఁదప్పి, దుఃఖముచేఁ గడు నొచ్చినవాఁడై, యీ రామునిఁ జూడఁజాలకపోయెను. ఆతఁడు పాఱఁ జూచియు, దుఃఖపారవశ్యముచే మాటలాడఁజాలనివాఁ డయ్యెను. ఆ నృపాలుఁడు ముహూర్తకాలము మైమఱచినవాఁడువోలె నుండి, శోకమునొంది, రామునే మాటిమాటికిఁ దలఁచికొని యేడ్చుచు "తొల్లి నే నెందఱను బిడ్డలనుండి యెడఁబాపితినో? లేక యెందఱు ప్రాణులను హింసించితినో? కావుననే యీ వ్యసనము నాకు సంప్రాప్త మయినదని తలఁచెను. కాలము రానిది బొందెనుండి ప్రాణములు తొలఁగనే తొలఁగవ్రగదా! ఈ పాపాత్ముఁడైన కైకేయి పెట్టిడి బాధల ననుభవించుచున్నను నాకు మరణము రాకున్నది. సన్నని బట్ట లనువిడిచి, మునులు గట్టెడి నారబట్టలను గట్టుకొని యగ్నిహోత్రుని వలెఁ దేజరిల్లుచు ముందట నిలఁబడియున్న నా కన్న కొడుకును నేను జూచుచున్నాఁడనే! నాకంటెఁ గ్రూరుఁ డొక్కఁడున్నాఁడే! ఇట్లు మోసము పన్ని, స్వకార్యమునకై ప్రయత్నపడిన యొక కైకేయి నిమిత్తమింతజనము దుఃఖించుచున్నదిగదా" అని చెప్పి, కన్నీటిచే మూఁతవడిన కన్నులుగలవాఁడై "రామా!"యని యొకతడవ మాత్రమే పిలిచి, పై మాట చెప్పఁజాలనివాఁ డయ్యెను. అమ్మహీపాలుఁడు కొంత సేపటికి స్మృతిఁదెచ్చుకొని రెండుకన్నులనిండఁ గన్నీరుంచుకొని సుమం త్రునిఁ జూచి, "మంత్రివర్యా! రాజులెక్కఁదగిన మన రథమునకు మేటిగుఱ్ఱములనుగట్టి, తీసికొనివచ్చి, యీ సౌందర్యశాలియగు రాముని నంచుఁగూర్చుండఁజేసి, యీ పట్టణమునకు వెలుపటి వనమున

విడిచిరమ్ము. లోకమున గుణవంతులయొక్క సుగుణముల కిదియె ఫలము కాఁబోలునని తలఁచెదను. శూరుఁడయిన రాముఁడు తలిదండ్రులచే నడవులకుఁబంపఁబడుచున్నాఁడుకదా! వీలయన, నాడినమాట తప్పరాదను సుగుణముగలిగి యుండుటఁబట్టికదా యిప్పుడు నేను రాముని నడవులకుఁ బంపవలసివచ్చెను. కావున సుగుణములు సయిత మొక్కసమయ మునఁ గష్టములకే యగుచున్నవి" అని చెప్పెను.

సుమంత్రుఁడును నృపాలుని వాక్యము విని, వేగముగ నడుగు లిడుచుఁబోయి, యుత్తమములయిన గుఱ్ఱములచే శోభిల్లుచున్న రథముఁ దోలుకొని యచ్చటికి వచ్చి, చేతులుజోడించుకొని "రాజకుమారా! మేటిగుఱ్ఱములఁ గట్టిన, సకలభూషణములచే నలంకరింపఁబడిన రథ మును దెచ్చిపెట్టియున్నాను" అని రాముని తోఁ జెప్పెను. ఆ మాటలు విని, దశరథమహారాజు ధనమును నిలువచేయుటయం దాసక్తిగలవాఁ డును దేశకాలముల నెఱిఁగినవాఁడును, లోపలను బయటను సైతము పరిశుద్ధుఁడును,స్థిరమయిసమనస్కులగలవాఁడునునైన బొక్కసపుటధికారిని వేగిరముగఁ బిలిచి, "ఓ ధనాధ్యక్షా! యొక్కువ వెలగల వలువలను, శ్రేష్ఠములైన భూషణములను నీ పదునాలు గేండ్లకుఁ జాలినంత లెక్క పెట్టి, వేగముగ సీతకుఁ దెచ్చియిమ్ము" అని యానతీఁగా, ధనా గారాధిపతి, బొక్కసమునకుఁ బోయి, నృపాలుఁడు చెప్పినప్రకారము సరిగాలెక్కపెట్టితెచ్చి సీత కొసఁగెను. అయోనిజయగు నా సీత వన మునకుఁ బయనమైనదై, చక్కని తన యంగములను వింతలైన సొమ్ము లతో నలంకరించుకొనెను. ఆ భూషణములచే నలంకరింపఁబడిన యా సీత, యరుణోదయకాలమునఁ బొడుచుచున్న సూర్యునికాంతి యాకస మును వెలుఁగజేయుమాడ్కి నా రాజగృహము నలంకరింపఁ జేసెను.

అట్టి సమయమున నత్తయగు కౌసల్య, దిగులుతోఁగాక, సంతస ముతోఁ బనులు చేయుచున్న సీతను రెండుచేతులతోఁ గౌఁగిలించుకొని, శిరము మూర్కొని యిట్లనియె:—

ఈ ప్రపంచమునం దంతయుఁ జెడ్డ యతివలు తమ ప్రియులచే నెల్లప్పుడు మన్ననపడయుచున్నను నొకప్పు డిడుములంబడిన తమ భర్త లను లెక్కసేయరు. మగువలు భర్తలవలనఁ దొలుత నెక్కువ సౌఖ్యము

నుభవించినను, స్వల్పమైన యాపదవచ్చినపుడు మగలను నిందింతురు; తుదకు విషమనైనను విడుతురు. ఇది సామాన్యముగ మగువల స్వభావము. జవరాండ్రు బొంకులాడుట స్వభావముగఁ గలవారు; సకల ప్రయత్నములచేతను గనిపెట్టి కలవికానంత లోఁతయిన మనస్సుగల వారు; అప్పటప్పటికి మనమున మాఁప్పనొందువారు; చెడుతలంపులు గలవారు; క్షణదశలలోభర్తలపైఁ బ్రేమవిడుచువారు. స్త్రీలు కులమును, ఉపకారమును, విద్యను, ఇచ్చినవస్తువులను, లోక మర్యాదలను మన మున లెక్కింపరు. వారి మనస్సు లెల్లపుడు చపలములై యుండును కావున వారిని నమ్మరాదు. మంచి స్వభావము, సత్యము, శాస్త్రజ్ఞానము, సిగ్గు అను వానియందు నిలుకడగల పతివ్రతలగు స్త్రీలకన్ననో, భర్త యొక్కఁడే పరమపావనమైన దైవము. కావున, ఓ సీతా! కానలకుఁ బంపఁబడిన నా కొమరుని నీ వలక్ష్యము సేయకుము. అతండు పేద యైనను ధనికుఁడైనను అతఁడే నీకు దైవము" అని కౌసల్య సీతతోఁ జెప్పెను.

సీతయుఁ దన యత్తగారు చెప్పిన ధర్మయుక్తమైన మాటను విని, తనయెదుట నిలఁబడియున్న యత్తగారినిగూర్చి యిట్లనియె. "ఓ పూజ్యురాలవయిన యత్తగారా! తమ రానతిచ్చిన చొప్పున నే నంతయును నొనర్చెదను. భర్తకడ నెట్లైట్లుండవలయునో యదియెల్ల, నే నెఱుంగుదును. నేను బెద్దలకడ వినియున్నాను. ఓ పూజ్యురాలా! నన్నుఁ జెడి పెలతో సరిపోల్పకుము. చంద్రునికడనుండి యతని కాంతి తొలఁగిపోనట్లు నేను ధర్మమునుండి తొలఁగిపోఁజాలను. తంతులులేక వీణ వాయింపఁబడదు; చక్రములు లేక బండి కదలదు. అట్లే నూరుగురు బిడ్డలఁ గన్నదైనను ఆఁడుది పెనిమిటిలేక సుఖముఁ బడయఁజాలదు. ఆఁడుది తన తండ్రి నేదైన నడిగిన, నతఁడు మితముగా నొసఁగును; తల్లియు మితముగా నొసఁగును; కుమారుఁడును మితముగా నొసఁగును; భర్త యన్ననో యమితముగా నొసఁగును; అట్టి భర్త నే కాంత పూజింపకుండును? ఓ పూజ్యురాలా! నేను మహాపతివ్రతను; తమబోటి పెద్దలవలన ధర్మమునెయొక్క యివతలి యవతలి గట్టుల నెఱిఁగినదానను. అట్టి నేను భర్త నవమానింతునే? స్త్రీలకుఁ బెనిమిటియేకదా దైవము"

అని సీత కౌసల్యతోఁ జెప్పెను. నిష్కపట స్వభావముగలదగు కౌసల్య సీతయొక్క మనోహర మయినవాక్యమును విని, 'యిట్టి సీత యరణ్యమున కేఁగుచున్నదే' యనెడు వ్యసనమువలనను, 'మన రామున కిట్టి సుగుణసంపన్నురాలగు పెండ్లా మబ్బెను గదా. ఇఁక మనకేమి కొదువ' యనెడి సంతసమువలనను గలిగిన కన్నీటిని వెంటనే విడిచెను.

ధర్మమునందే యెక్కువబుద్ధి గలరాముఁడు కృతాంజలియై తల్లులనడుమ మిక్కిలి గారవింపఁదగు తనతల్లికిఁ బ్రదక్షిణముసేసి, యామె నుద్దేశించి, "అమ్మా! నీవు వ్యసనపడకుము. నాతండ్రిని గనిపెట్టుకొనియుండుము. వనవాసమునొక్క ముగింపు వేగిరమే రాఁగలదుం కనుమూసి తెఱచునంతలోపలఁ బదునాలుగేండ్లు నిండఁగలవు. అవలఁ బరివూర్ణ మనోరథుఁడనై, చెలికాండ్రతోఁగూడ నేఁగుదెంచిన నన్నుఁ జూడఁగలవు" అని సవినయముగాఁ దల్లితోఁ జెప్పి, యామెవలెనే దుఃఖించుచున్న మిగిలిన మున్నూటయేఁబదుగురుతల్లులను జూచి, "తల్లులారా! చిరకాలపరిచయమునుచేఁగాని, తెలివితక్కువచేఁగాని నే నేవేని పరుసములుపలికియుండిన వానినెల్ల మన్నింపుఁడు. మిమ్ము నందఱి నడిగిపోవచ్చితిని. పోయివచ్చెదను" అని చెప్పెను. వారందఱు రాముఁడు వినయముతో ధర్మమునకు విరుద్ధముగాకుండఁ బలికిన యా మాటను విని, మిక్కిలి రోదనము చేసిరి. ఆ యంతఃపురాంగనల రోదన ధ్వని, యాఁడు క్రౌంచపక్షుల కూఁతలవలెనుండెను. తొల్లి మద్దెలలయు, నుడుకలయు, మేఘములయు ధ్వనులతోఁగూడియుండిన దశరథుని భవన మిప్పుడు రోదనధ్వనులచేఁ గలఁతపడి, తీరని వ్యసనముతోఁ గడు దుఃఖము గలదయ్యెను.

40-వ సర్గము.

సుమిత్ర లక్ష్మణునకు బుద్ధి చెప్పుట

అంతట రామలక్ష్మణులును, సీతయుఁ జేతులు జోడించుకొని తండ్రికి నమస్కరించి, ప్రదక్షిణమును గావించి, యాతని యనుజ్ఞ గైకొనిరి. అంత రాముఁడు ధర్మజ్ఞుఁడగుటచేఁ దల్లిని విడువఁజాలక, దుఃఖముచే నొడలు దెలియనివాఁడై, తల్లికి నమస్కరించెను. లక్ష్మణుం డును నన్నకు వెంబడే కౌసల్యకు మ్రొక్కి, తరువాతఁ దన తల్లియగు

సుమిత్ర పాదములకు మ్రొక్కెను. సుమిత్ర తన కుమారుఁడగు లక్ష్మణుండు మ్రొక్కుచుండుటను జూచి, విలపించుచు నతని మేలు కోరినదై పొడవ్వుచేతులవాఁడగు లక్ష్మణుని శిరమాఘ్రాణించియిట్లనియె. "ఓరి నాయనా! నీ వడవులం దునికికై పుట్టితివి. చెలికాఁడయిన యన్నయం దనురాగంబుఁగొంటిని. నాయనా! అన్న గారు పోవునపుడు, ఆతని కెట్టి యాపద రాకుండఁ జూచుచు నేమఱుపాటు లేక యుండుము. ఆతఁడు దుఃఖముగలవాఁడయినను, సంపదగలవాఁడయినను, ఓ దోషరహితుఁడా! ఆతఁడే నీకు గతి. అన్నకు లోఁబడి యాతని యిష్టప్రకారము నడచుకొనుట తమ్ముఁడికి విధి. లోకములోని యీ క్షత్రియకులమునఁ బుట్టినవానికి ఇడియుదానము,యజ్ఞములు, యుద్ధములందు దేహాముపదలుట యనునివియు శాశ్వతములైన ధర్మములుగదా". అని యివ్విధమునఁ జెప్పి, సుమిత్ర, లక్ష్మణునిఁ జూచి రామునే లోకమునకంటెఁ బ్రియునిగా నెంచి యతనివెంటఁ బయనమునకు సిద్ధుఁడైయున్న యాతనితో "ఓ నాయనా! రామునే నీ తండ్రియగు దశరథునిగాఁ దలఁచికొనుము. సీతనే నీ తల్లియగు నన్నుఁగాఁ దలఁచికొనుము. అరణ్యమునే యయోధ్యాపట్టణమునుగా నెంచుము. నాయనా! సుఖముగాఁ బోయిరమ్ము" అని మఱలఁ జెప్పిపంపెను.

అంతట్ట వినయ మిట్టిదని యెఱిఁగినవాఁడగు సుమంత్రుఁడు వినయముగలవాఁడై, రామునిం జూచి, మాతలి దేవేంద్రునితోఁ జెప్పిన, ట్లాతనితో "ఎక్కువకీర్తిగలయోరాజపుత్రా, తే రెక్కుము. నీకు మేలయ్యెడు. నీ వెచ్చటికిఁదోడ్కొనిపోయి విడువమనెదవో, యచ్చటికి నిన్నుఁ గొనిపోయి విడిచెదను. కైకేయి చెప్పినచొప్పున నీవు పదునాలుగేండ్లరణ్యమున నుండవలసినది. నీ విపు డా వనవాసమున కుపక్రమింపవలసినది" యని చెప్పెను.

సొగసయిన షఱుదులుగల సీతాదేవి, తా నలంకారముచేసికొని, వనమునకుఁ బోవలసివచ్చెగదాయని తలంపక సంతసముతోఁ గూడిన మనముతో, సూర్యునిఁబోలె, వెలుఁగుచున్న యా రథము నెక్కి కూర్చుండెను. ఆ తరువాత యన్నదమ్ములగురామలక్ష్మణు లిద్దఱును బంగరుసొమ్ములచే నలంకరింపఁబడినదై యగ్నిహోత్రునివలె దేదీప్యమాన

మైయున్న యా రథము నెక్కి-రి. దశరథుఁడు వారు వనవాసమున నెన్ని దినము లుండవలెనో, యన్ని దినంబుల కెన్ని చీరలు, తొడవులు గావలెనో, యన్ని పుట్టములను, సొమ్ములను, భక్తను వెంబడించునట్టి సీత కొసఁగెను. అట్లు యున్నదమ్ముల కిరువురకుఁ గావలసిన యాయుధ సమూహాములను, కవచములను నొసఁగెను. అంత దశరథుఁడు సీతా రామలక్ష్మణుల కొసఁగిన భూషణములను, వస్త్రములను, నాయుధ ములను, చిన్నపుటికను, గుద్దలిని సుమంత్రుఁడు రథమునడుమ నుంచి, సీత తోడఁజేర్చి ముగ్గురుగా రథమున రామలక్ష్మణులు, గూర్చుండిన తోడనే, వాయువేగములు, లక్షణయుక్తములు నయినగుఱ్ఱములను గట్టిగా నదలించి తోలెను. రాముఁడు బహుకాలముండుటకయి యము నకుఁ బ్రయాణ మయినంతటనే, యయోధ్యాపురమునందలి జనులును, సైనికులును మూర్ఛనొందిరి. ఆ పురమునందలి జనులు రాముఁ డరణ్య మునకుఁ బోవుచున్నాఁడని విన్నంతనే మిక్కిలి కలఁతనొంది, తత్తర పడుచు గొల్లగానము చేసిరి. ఏనుఁగు లన్నియు నది విని, మదించినవై ఘోపముచే ఘింకారములు చేసినవి. గుఱ్ఱము లన్నియు బెదరి యిట్టట్టు పరుగులిడుటచే, వాని కాలియందెలు మొదలగు భూషణముల ధ్వనులు చెలరేఁగినవి. ఇట్లయోధ్యాపురమున గలిగిన గొప్ప రొద చెవులకుఁ జెవుడు పడునట్లు చేసెను. అంతట నా పురవాసులంద ఱాబాలవృద్ధ ముగా మిక్కిలి వ్యసనపడి, వేసవిని దప్పిగొన్న వాఁడు నీటిని వెదకుచుఁ బోవునట్లు, రామునే వెంబడించి పరువిడిరి. అట్లు పౌరు లందఱు వెంబ డించి, కొందఱు రథమువెనుకను, గొందఱు రథము ప్రక్కలను బట్టు కొని వ్రేలుచుఁ గొందఱు రథమున కెదుటను నిలుచుచుఁ గండ్లనుండి కన్నీరు గార్చుచు, వేఁడి నిట్టూర్పులు విడుచుచు నా సుమంత్రుఁజూచి,

"ఓ సారథీ! గుఱ్ఱముల పగ్గముల నీడిచి పట్టుకొనుము; రథమును మెల్లగాఁ బోనిమ్ము. రాముని ముఖమును మేము చూచెదము. ఆ మోము నిఁక జిరకాలము చూడఁబోముకదా! అక్కటా! రాముని తల్లియొక్క హృదయ ముక్కుచోఁ జేయఁబడినది. ఇందుకు సందియము లేదు. అట్లు కానిచో, దేవకుమారునింబోలు రామునిఁ డడవికిఁ జను చుండఁగా నామె హృదయము బ్రద్దలు కాకుండునా? నీడవలె సీత తన

భక్తను వెంబడించెఁగాన నామె ధన్యురాలు. సూర్యునికాంతి మేరుపర్వతమునుబోలె భర్తాసక్తురాలయి సీత భర్తను విడువదు. ఓ లక్ష్మణా! నీ వదృష్టవంతుఁడవు. నీ కార్యం బీడేరెను. ఎల్లప్పు డింపు మాటలు పల్కు దేవసమానుఁడయిన యన్నను గొలువఁ బోవు చున్నావు. ఇంతటి భాగ్య మెవరికి దొఱకును? నీ వీరాముని వెంబడించుట యెనుదు నీకొకగొప్ప దేవతానుకూల్యము. నీ కిది యొక గొప్ప యభివృద్ధి. నీ కిది యొక స్వర్గద్వారము." అని యివ్విధమునఁ బలుకుచుఁ బ్రియుఁ డైన యిక్ష్వాకు నందనుఁడగు రాముని వెంబడించుచుఁ గన్నులందుండి వచ్చెడి కన్నీటి నాఁపుకొనఁజాలరైరి. అంతట మిగుల దిగులుపడియున్న దశరథుఁడు దుఃఖముచేఁ గలవరపడి, సంతసముఁ దక్కియున్న పత్ను లతోఁ గూడి ప్రియకుమారుఁడగు రాముని జూడఁబోయెదనని యిల్లు వెడలి బయలుదేరెను. మగధేనుఁగును గట్టివేసినపు డాఁ డేనుఁగులు గుంపుగఁ గూడి ఘీంకారము చేయఁగా గొప్ప రొద పుట్టున ట్లాయంతఃపురాంగన లందఱు గూడి యేడ్చుచుండఁగా గొప్ప రొద పుట్టెను. రామునితండ్రియగు కాంతిమంతుఁడయిన దశరథనృపాలుఁడును రాముని వియోగమువలని దుఃఖముచేఁ బున్నమనాఁడు రాహువుచే గ్రింగఁబడిన నిండుచందురునిమాడ్కిఁ జిక్కియుండెను. కలిమిగల వాఁడును, ఎఱుఁగరాని మహిమ గలవాఁడునునైన దశరథనందనుఁడగు రాముఁడన్ననో రథము వేగిరముగాఁ దోలుమని సుమంత్రునిఁ దొందర పెట్టెను. జనులు సారథిని నిలుపనిచెప్పిరి. ఇట్లు రాముఁడు రథమును శీఘ్రముగఁ బోనిమ్మనియు జను లాఁపుమనియుఁ జెప్పఁగా నప్పుడు సూతున కెట్లు చేయుటకును జేతఁగాక పోయెను. పొడవు చేతుల వాఁడగు రాముఁడు పశ్చాత్తనము పడిచిపోవునపుడు పైకిలేచిన దుమ్ము పురజనుల కన్నీటిచేఁ దడుపఁబడి యణఁగెను. రాముఁడు పయనమైపోవునపుడు పురజను లందఱు నేడ్చువలని కన్నీటిచేఁ దడిసిన వారలై, హాహాకారములు చేయుచు, మిక్కిలి నొచ్చినవార లగుచు నుండిరి. చేఁప లిట్టటు తిరుగుటచేఁ గదలెడు తామరపువ్వులనుండి నీరు బొట్లుబొట్లుగాఁ గాఱునట్లు, వ్యసనమువలని కన్నీరు తామరపువ్వుల రేకులఁబోలు స్త్రీల కన్నులనుండి బొట్లుబొట్లుగాఁ గాఱుచుండినవి.

కాంతిమంతుఁడగు దశరథనృపాలుఁడు, పుర మెల్ల నా రామునియం దొక్కనియందే మన సుంచియుండుటను జూచి, యా వ్యసనముతో మొదలునఱికిన వ్రానుపలెఁ గ్రిందఁ గూలఁబడెను. దశరథుఁడు రాముని వెంబడించి కడు వ్యసనముతోఁ గృశించి చతికిలఁబడి పోవుటంజూచి జనులందఱు నల్లకల్లోలముగా నఱచిరి. కొందఱు జనులు "అయోధ్యా! రామా!" యనియు, మఱికొందఱు "అయోధ్యా! కౌసల్యా!" యనియు నిత్తెఱఁగున నంతఃపురాంగన లందఱును కౌసల్యను జుట్టుకొని రోదనము నేసిరి. రాముఁడును బార్శ్వముల దృష్టి నెఱిపుచుఁ, జెదఱిన మనం బుతోఁ దన్ను వెంబడించి వారిని వచ్చుచున్న తల్లిదండ్రుల నిరువురను జూచెను. ఆ రాముఁడును, వ్రాటిచేఁ గట్టివేయఁబడిన గుఱ్ఱపుఁ బిల్ల తల్లిని బాగుగఁ జూడఁజాలనట్లు, ధర్మమను వ్రాటిచేఁ గట్టఁబడినవాఁడై, తల్లిని సరిగాఁ జూడఁ డయ్యెను.

అంతట రాముఁడు రథముపై నెక్కి రాఁదగినవారయినను గాలినడ కను వచ్చినట్టివారును, సుఖము ననుభవింపఁదగినవారయినను, దుఃఖము ననుభవించువారును, నట్లు దుఃఖానుభనమునకుఁ దగనివారునునైన తన తల్లిదండ్రులం జూచి, వారికష్టములఁ జూడఁజాలక సారథిని ద్వరగాఁ బోనిమ్మని ప్రేరణచేసెను. మూవటినిచే నంకుశముతోఁ బొడువఁబడిన యేనుఁగువలె ధర్మపాశముచేఁ గట్టువడిన రాముఁడు వ్యసనకరమయిన తన తల్లిదండ్రుల దర్శనము నోర్వఁజాలక, సారథి కట్లాజ్ఞ సేసెను. ఇంటి యొద్ద దూడను గట్టివేసి యావును బొలమునకుఁ దోలినయెడల, నది దూడమీఁది మరులుచే నెట్టు దూడ నిమిత్తమై యింటికిఁ బరువిడి వచ్చునో, అట్లు కౌసల్యయు రథమునఁ గూర్చుండిపోవుచున్న రాముని వెంబడించి పరుగిడెను. అట్లు రథమును వెంబడించి పరుగులిడుచు "అయోధ్యా! రామా! అక్కటా! లక్ష్మణా! హా! సీతా!" యని కేక లిడుచు, సీతారామలక్ష్మణుల నిమిత్తమై కన్నీరువిడుచుచు, నృత్యము చేయుదానివలె దుఃఖాతిశయముచేఁ జిందులు ద్రొక్కుచున్న తన తల్లిని బలుమాఱుచూచెను. దశరథుఁడు సుమంత్రుని నిలుమని యనిచెను. రాముఁడు "పో పొమ్ము"ని యనిచెను. అప్పుడు సుమంత్రుని మనసు రెండు చక్రములనడుమఁ జిక్కినవానివలె మిక్కిలి వ్యాకులపాటు నొందెను

అప్పుడు రాముఁడుసుమంత్రునిజూచి, "ఓ సారథీ, నీవు సంశయపడకుము. రథముఁ దోలుము. ఒకవేళ నృపాలుఁడు నీవు మఱలివచ్చినప్పుడు "నేను రథము నిలుపమని యఱచినపుడు నీ వెందుకు నిలుపలేదు" అని యడిగి, నిన్నుఁ గసరి తిట్టినను, నీవు "మహాప్రభూ! చిత్తము! నాకుఁ దమ పిలుపు జనుల సుందడిలో వినఁబడలే"దనిచెప్పుము. అట్లయిన నేలరథముఁ దోలమని నిన్నడిగెద నందువేమో? "ఒకరు దుఃఖపడుచుండఁగాఁ జిర కాలమోర్చి చూచుచుండుట మిక్కిలి కష్ట"మని చెప్పెను. అంత సుమం త్రుఁడును రాముని మాటచొప్పున రథముఁ దోలఁగోరి, రథమువెంబడి నచ్చుచున్న వారి కందఱికిని రామునిచే నెలవిప్పించి పంపి, వేగమునఁ బాఱుచున్నను,గుఱ్ఱములను మఱింతతొందరగాఁ బఱుగిడునట్లు తోలెను. రాజభటు లందఱు రామునికిఁ బ్రదక్షిణముసేసి మఱలిరి. తక్కిన జనుల గుంపులన్నియు మనస్సును,గన్నీళ్ళ ప్రవాహమును నా రాముని వెంబడిఁ బంపినవి. అవిమాత్రము తగ్గనేలేదు. "ఎవఁడు త్వరలో రావలెనని మనము కోరుదుమో, అతనిని బహుపూరము వెంబడింపరాదు" అని మంత్రులు దశరథునితోఁ జెప్పిరి. దిగులు పడియున్న దశరథుఁడు మంత్రులు చెప్పిన హితవగు మాటను విని, జోలు చెమటలచేఁ దడిసిన మేనుగలవాఁడై యా సకలగుణ సంపన్నుఁడయిన కుమారునేఁ జూచుచుఁ బత్నులతోడ నిలఁబడెను.

41-వ సర్గము.

రాముని వనవాసమునకై మూఁడుశోకములవారు దుఃఖించుట

పురుషోత్తముఁ డయిన రాముఁడు తల్లిదండ్రులు మొదలగు పెద్దలకెల్ల జేతులు జోడించి వినయమును గనఁబఱచుచు నడవికిఁ దఱ లఁగా, నపు డంతఃపురమున స్త్రీలరోదనధ్వని పుట్టెను. "దిక్కులేని వారికిని, బలిమిలేనివానికిని, దయచూపఁదగినవారికిని నెవఁడు గతిగాను, రక్షకుఁడుగాను నుండెనో, యా రాముఁడెచటికిఁబోయె? ఏ రాముఁడు తిట్టి నను గోపగింపఁడో, కోపముఁ గాఁదగిన సందర్భములనుగూడ వదలి చిన్నల నైనను బెద్దలనైనను గోపపడువారి సందడిని శాంతింపఁజేయుచు నితరుల సుఖదుఃఖములను దనవిగనే యెంచువాఁడగు నా రాముఁ డేడఁబోయె? "ఈమె మునతల్లి, వీరు పొరుగువారు" అను భేదములేక కౌసల్యయం

దును, మనయందును నొకతీరుననే భర్తని ప్రేమను నెఱిపునట్టి గొప్ప బుద్ధిగల రాముఁ డెచ్చటికిఁబోవుచున్నాఁడు? ఆఁడుదియగు కైకేయి తొందరపడలేక నృపాలుఁడు ప్రేరణసేయుఁగా, సకల లోకములకు శరణ్యుఁడైన రాముఁ డెచ్చటికిఁ బోవనున్నాఁడు? ఓహో! నృపాలుఁడు వివేకహీనుఁడు కాఁబోలు! కావుననే, జంతుసమూహములకెల్ల మిక్కిలి యిష్టుఁడును, ధర్మమార్గముఁ దప్పనివాఁడును నైనరాముని వనమునకుఁ బంపఁ దలఁచినాఁడు" అని యంతఃపురముననుండు రాణులందఱు దుఃఖముచే నొచ్చినవారలై, దూడలఁ బోనాడిన యావులవలె నాక్రందనము చేసిరి; గొంతెత్తి మిక్కిలి బిగ్గఱగా నఱచిరి. పుడమితేఁడు మొదట కొడుకు నెడఁబాయుట వలని యంగలార్పుచే మిక్కిలి నొచ్చినవాఁడై, దానితోడ నంతఃపురమునందలి రాణులరోదన ధ్వనిని సైతము విని, కడు దుఃఖమునొందెను. రాముఁడు కాననకుఁ బయనమగుటఁజూచి, గేస్తులగ్నిహోత్రముల వేల్వరైరి; పాకములఁ జేయరైరి; ప్రజలు పశులను జాలించిరి; సూర్యుఁడును గ్రుంకెను. ఏనుఁగులు తమ తొండములతో నెత్తికొన్న కబళములను విడిచినవి. ఆవులు దమ దూడలకుఁ బాలియ్య వాయెను. తల్లులు తమ మొదటికొడుకులను జూచి, "మనగతి యింతయే కదా" యని సంతసమొందరైరి. * త్రిశంకువు, నంగారకుఁడు, బృహస్పతి బుధుఁడు, మఱికొన్ని ప్రూరగ్రహములు భీకరములై చంద్రునికడఁ జేరి యుండినవి. రిక్కలును దక్కిన గ్రహములును గాంతిలేనివై ప్రకాశింపకుండెను. విశాఖానక్షత్రములుగూడ కనుమాసి బాగుగఁ బ్రకాశింపకుండెను. ప్రలయకాలమందలి సుడిగాలిచే నుప్పొంగి మీఁదికెగసిన మహాసముద్రమువలె, నాపట్టణమునందలి జన మంతయుఁ గంపించుచుండిరి. పట్టణమెల్లఁ గదలిన ట్లుండెను. దెసలన్నియుఁ చీఁట్లు గ్రమ్మినట్లు గుర్తింపరాకుండినవి. మఱేయు నొక గ్రహముకాని, యొకనక్షత్రముకాని మరియేవస్తువుకాని ప్రకాశించినదికాదు. పట్టణమునందలి జనులందఱు హఠాత్తుగా వగలపాలయి, భోజనములందును, వేఁడుకలం

---

* ఈ త్రిశంకు విశ్వామిత్రునకు ముందటి వాఁడు. ఈతఁడు స్వర్గమునుండి త్రోయఁబడి, యాకాశమున నక్షత్రమండలమున నక్షత్రమువలె విరాజిల్లుచున్న వాఁడు. బాలకాండ చూడుఁడు.

దును మనస్సు లేనివారైరి. అయ్యయోధ్యాపురమునందలి జనులందఱు గుబులుకొని వచ్చెడు దుఃఖముచే మిక్కిలి వెతల నొంది యొడతెగని నిట్టూర్పులు విడుచుచు, "దశరథునివలనఁగదా మనకింత వ్యసనము సంభవించెను" అని యతనినే మనంబునఁ దలపోయుచు వగచుచుండిరి. గన్నీటిచేఁ దడిసి కలఁగినమోములతో రాజమార్గమున నున్నజనమునం దొక్కనిమోమునఁనేని సంతోషము కానరాకుండెను. అందఱును దుఃఖితులయియుండిరి. చల్లనిగాలి వీవకుండెను. చంద్రుఁడు కాంతిదఱఁగియుండెను. సూర్యుఁడు లోకముల వెలుఁగఁజేయక, మబ్బుక్రమ్మినట్లుండెను. లోకమంతయుఁ గలఁతపడియుండెను. స్త్రీలు బిడ్డలందును, మగలందును, తోఁబుట్టువులందును బ్రేమలేకయుండిరి. వేయియేల? అందఱు సర్వకార్యములను విడిచి, రామునే తలఁచుచుండిరి. రాముని యాప్తులందఱు దెలిసిఁదప్పినవారలయి, దుఃఖమనెడిబరువుచేఁ గ్రుంగినవారలై లేవఁజాలక పాన్పులంచే పరుండియుండిరి. వీనుఁగులు, గుట్టిములు, భటులు మున్నగువారితోఁగూడిన యా యయోధ్యాపురము, పద్మాదులతోఁగూడిన భూమండలము, దేవేంద్రుని వియోగముచేతవలె నా మహాత్ముఁడయిన రాముని వియోగముచే "నీక మనకు రక్షకుఁడెవ్వఁ" డనియెడి భీతిచేతను, "మనమందు దయ చూపుచుండినవాఁడు మనలవిడిచిపోయెనే" యను విచారముచేతను నొచ్చినదై గడగడవణఁకిపోయెను.

42-వ సర్గము.

దశరథుఁడు కౌసల్య యంతఃపురమా నేరుట

రాముఁడు బయలుదేఱి పోవుసపు డెంతవఱకు రథగమనమువలనఁ బుట్టిన పరాగమునగూడ నగపడలేదో, యప్పుడే నృపుఁడు మిక్కిలి నొచ్చి దుఃఖమునొంది, నేలకొఱఁ

గెను. కౌసల్యాదేవి నృపాలుఁడు క్రిందఁబడఁగా నతని కుడిచేతినూని నిలిచెను. భరతునిపైఁ బ్రేమగల కైకేయి యెడమచేతినూని నిలిచెను. న్యాయశాస్త్రజ్ఞానము, ధర్మాచరణము, వినయము కనువీనితోఁగూడిన యా దశరథుఁడు తన యెడమప్రక్క నిలిచిన కైకేయినిజూచి, మనము నందు మిగుల నొచ్చి, "ఓసీ కైకేయీ! నీవు నా యవయవములను ముట్టకుము. నీవు దుష్టురాలవు. నేను నీ మోముచూడ నిచ్చగింపను. నీవు నాకుఁ బెండ్లామువుగావు, చుట్టమునుగావు. నిన్నాశ్రయించి బ్రతుకుచున్న వారికి నేనుగాను; నాకు వారుఁగారు. అర్థమొక్కటె ప్రధానముగాఁగలదానవు, ధర్మము మాఱినదనవు నైననీవు నాకడ నుండఁజనదు. నేను నిన్ను విడనాడితిని. నే నగ్నిహోత్రుని సమక్షము నం దేనీచేతినిఁ బట్టితినో, ఆ హస్తము నీ లోకమునను బరలోకమునను విడిచెదను. నీ తోడి యెల్లసంబంధమును విడిచిపెట్టెదను. భరతుఁడీ శాశ్వతమయిన రాజ్యమునుబడసి ప్రసిద్ధికెక్కునుగాక! పితృ ప్రీతికై యాతఁడు నా కొసఁగు జల తర్పణాదులు నాకుఁ జెందకుండును గాక" అని కైకేయిని దూఱెను. అటుపిమ్మటఁ గౌసల్య నృపాలుని లేవ నెత్తి దేహమంతయు నంటుకొన్న దుమ్ముఁదుడిచి, వ్యసనముచేఁ జిక్కినదై, యప్పుడే తననగరునను మఱలెను. ధర్మమునడపుటయే స్వభావముగాఁగల దశరథుఁడు కావలెనని బ్రాహ్మణునిఁ జంపినవాఁడు వోలెను, చేతితో నిప్పునంటినవాని పగిదియు మునివేసముఁ దాల్చి యడవినికిఁ జనిన రాముని దలఁచి తలఁచి సర్వదా సంతాపము నొందు చుండెను. తిరిగితిరిగి చూచుచువచ్చుచుండు దశరథనృపాలుని రూపము రాహువుచే గ్రింగఁబడిన సూర్యబింబముపగిదిఁ దేజరిల్లకుండెను. దశరథుఁడును తన ముద్దుల కొడుకునే తలఁచి తలఁచి యిట్లు దుఃఖపడు చుండి, రాముఁడూరిపొలిమేరను జేరెనని, తెలిసికొని "నాకుమారునిఁగొని పోవు మేటి గుఱ్ఱముల యడుగులు కనఁబడుచున్నవికాని, ఆ మహాత్ముఁడయిన రాముఁడు గనఁబడఁడు. నా కొడుకులలో మేటియయిన యే రాముఁడు గంధమురూసికొని, చక్కనైన జవరాండ్రు విసరు చుండఁగా, మెత్తని పాన్పుపైఁ బరుండుచుండునో, ఆ రాముఁడు నేఁ డెచ్చటనో యొక చెట్టు మొదటఁ గొయ్యియో, రాయియో తల

గడగాఁ జేసికొని తప్పక పరుండఁగలఁడు. నేలపైఁ బరుండుటంజేసి, నా కొడుకు మిక్కిలి దీనుఁడై, యుదయమునలేచునపు డొడలంతయు నంటుకొన్న దుమ్ముతోఁగూడినవాఁడై సెలయేటినుండి యూఁడేనుఁగుల రాయఁడులేచు నట్లాకటికి నేలపైనుండి లేవఁగలఁడు. అట్లు లేచి పోవు చుండు పొడవుచేతులవాఁడగు రాముని ముల్లోకములతేని నైనను దిక్కులేనివానిని బోలె వననివాసులు చూడఁగలరు. ఇది నిజము. రాముని సంగతి యటుండనిమ్ము. ఆ జనకమహారాజు కూఁతురగు సీత యెల్లప్పుడు సుఖము లనుభవింపఁదగినది. ఆమె యిపుడు ముండ్లపై నడుగులుంచి యడవినిబోవుచుండును. ఆపె యడవులనెట్టివో యెఱుఁగ నిది. ఆ సీత గంభీరమును భీకరమగు గర్గురాటొవించునదియునునగు మృగముల నినాదములను విని వెఱపునొందఁగలదు. ఇది నిజము. ఓసీ, కైకేయీ! నీవు కోరికతీరినదానవగుము. నే నిప్పుడే మృతినొందుదును. నీవంతట విధవవై రాజ్యము వహింపుము. నేను బురుషశ్రేష్ఠుఁడయిన రామునిఁ బాసి యొక్క క్షణమైనను మనఁజాలను" అని చెప్పెను. ఇవ్విధమునఁ బలికి నృపుఁడు ఖేదపడుచు జనులగుంపులు వెంబడించు చుండఁగా, బంధువులు చావఁగాఁ గాటిఁకేగి మఱలి స్నానముసేసి యంటునింటికిఁ బోవు చందమునఁ బట్టణోత్తమమయిన యయోధ్యలోఁ బ్రవేశించెను. అపు డయోధ్యాపురమున నాలుగువీథులు గలియుచోటు లందును, నిండ్లవాకిళ్ళయందును జనులు లేకుండిరి. అంగడివీథులును దేవాలయములును మూయఁబడియుండినవి. జనులందఱును డస్సి, సత్త్వహీనులు విచారగ్రస్తులు నయియుండిరి. రాచబాటలయందు జనులు పలుచఁగానుండిరి.అట్టియయోధ్యాపురముతీరు నెల్లఁ జూచుచు, రామునే తలఁచితలఁచి మనమున గుబులుకొనివచ్చెడి వ్యసనముచేఁ బలవించుచు, సీతారామలక్ష్మణులు లేకపోవుటచేత, అశ్వోభ్యమును గరుడునిచే నపహరింపఁబడిన పాముగలదియు నయినపెనుమడువువలె నున్న రాజగృహమును సూర్యుఁడస మేఘముఁలోపలఁ బ్రవేశించునట్లు దశరథుఁడు ప్రవేశించెను దశరథుఁ డట్టి నగరునుచేరి, విలపించుచు, డగ్గుత్తికతో సంగతి విశేషము లేకుండునట్లును, ఇతరులకుఁ దెలియఁజాల నంత తిన్నగాను, ద్వారపాలురతో "నాకింకొకచోట మనస్సునకు

నెమ్మదిగలుగదు. నన్ను రామునితల్లియగు కౌసల్యయొక్క యంతిపురము నకుఁ గొంపొండు" అని చెప్పెను. ఆ మాట విని ద్వారపాలురు నృపాలుని గౌసల్య భవనమునకుఁ దోడ్కొనిపోయి విడిచిరి. వినయముతోఁ పిమ్మటఁ బరిచారకులు నృపాలునిఁ గౌసల్యయింట మెత్తనిపాన్పులపైఁ బరుండఁబెట్టిరి. అట్లు పరుండినపిదపఁగూడ నృపాలుని మనము గుదుటఁ బడకుండెను. అతనికిఁ దన యిరువురు కొడుకులును, కోడలునులేని రాజభవనమును చండుఁడు లేని యాకసమువలెఁ గానుపించెను. అప్పుడు వీర్యవంతుఁడయిన దశరథమహారాజు, "హా! రామా! నన్నుఁ బాసితివిగదా" యని చేయియెత్తి పెద్దగొంతుతో నేడ్చుచు, "యే నరోత్తములు రాముఁడు మఱలివచ్చునంతదనుకను జీవించి యుందురో, వారు రాముని౯జూచి, యాతని గౌఁగిలించుకొని, యానందము నొందుదురుగదా" అని తనలోఁ దా ననుకొనుచు విలపించుచుండెను. అంత రాజేంద్రుఁడు, దనకుఁ బ్రలయకాలరాత్రి యో యనఁదగు రాత్రి వచ్చి, చీకట్లు క్రమ్మఁగానే, నడురేయియందుఁ గౌసల్యను బిలిచి, "కౌసల్యా! రాముని వెంబడించిన నా చూపినప్పటికిని మఱలకున్నది. నీ రూపుగూడ నా కంటికిఁ దెలియకున్నది. "నేను నీ పుత్రుని వనమునకుఁ బంపితి నని నాపైఁ గ్రోధమును మనసున నుంపక, నన్నుఁ జేతితోఁ బాఁకి పట్టుకొనుము" అని విలపించెను. అవ్విధమున రాముఁనే తలఁచుచుఁ బాన్పునఁ బరుండి విలపించుచున్న నృపాలునిఁజూచి యతనికిఁ గడుజేరువునఁ గూర్చుండి, తానును మిక్కిలి వ్యసనమొందినదై, నిట్టూర్పులు విడుచుచు విలపించెను.

44-వ సర్గము.

కౌసల్య పుత్రవియోగమునకై దుఃఖించుట

అంత పాన్పునందు వ్యసనముచేఁ గృశించి పరుండియున్న పుడమి తేనిం జూచి, కౌసల్య పుత్రవియోగ దుఃఖముచేఁ బీడింపఁబడినదై, యిట్లనియె.

"ఓ మహీపాలా! నరోత్తముఁడయిన రాముని౯యెడఁ గపటమనెడి విషమునుంచి, కైకేయి కుబుసమునిడిచిన యాఁడుపామువంటమున నిర్భయముగా సంచరింపఁగలదు. ఆపె యదృష్టవంతురాలును, చెప్పినట్లు

విను భర్త గలదియుఁగానఁ దన కోరికిని బొంది, రామునిఁ దలఁపుఁగొట్టి మనస్సమాధానమునొంది, యిందుఁ నుంచుకొన్న దుష్టసర్పమువలె నన్నెల్లప్పుడు భయపఱపఁగలదు. ఓ మహారాజా! నా కుమారుని భరతునికిఁ బనివానిఁగానైన నుంచుకొనుమని కైకేయి వరముకోరుట మేలుగా నుండదా? అప్పు డడతఁడూరిలోపల బిచ్చమెత్తుకొనియైనను నింటం గండ్లమందట నుండునుగదా! కైకేయి రాముని స్వస్థానమునుండి పడఁద్రోసి, యహితాగ్నియగు నతఁడు పున్నమనాఁడు దేవతలకీవలసిన హవిర్భాగమును రక్కసులకొసఁగునట్లు, భరతునకు రాజ్యభారము నొసఁగెను. గజేంద్రమువంటి నడకగలవాఁడును, శూరుఁడును, గొప్ప చేతులవాఁడును,విలుకాఁడునైన రాముఁడు సీతాలక్ష్మణ సమేతుఁడై వన మున నిప్పటికిఁ బ్రవేశించియుండును. నృపేంద్రా! తాము కైకేయి మనోరథం బీడేర్పఁగోరి, వనవాసశ్రమము లింతకుము న్నెఱుఁగనివారలను వనమునకుఁ బంపితిరి. వారు వనమున నిఁక నేగతి ననుభవింతురో! వారు ప్రాయమువారు. ధనహీనులుగాఁ జేయఁబడిరి; సుఖము లనుభవింపవలసిన కాలంబునఁ దఱుమఁబడిరి. ఆ రడవులందు దరిద్రులై, పండ్లను, దుంపలను దిని యెట్లు బ్రతుకుచుండఁగలరు? మఱిల సీతతోను దమ్మునితోను నిచటికివచ్చిన రామునిఁజూచి, నాకు శోకము క్షీణించిపోవునట్టి శుభకాల మిపుడువచ్చునా? శూరులగు రామలక్ష్మణులు నిద్రపోయి లేచినవారువోలె నెపు డయోధ్యకు మఱలివత్తురు? ఎప్పు డయోధ్యాపురమునందు జనులు సంతోషముతో ధ్వజపటములను గట్టఁగా, నయోధ్యాపుర మాధ్వజపటములచే శోభిల్లుచుఁ గీర్తి మంతమైయుండును, అడవినుండి మఱలివచ్చిన పురుషోత్తములగు రామలక్ష్మణులంజూచి, పర్వతమునందలి సంద్రముచొప్పున నయోధ్యా పురజను లెప్పు డుప్పొంగుదురు? ఎప్పుడు దీర్ఘ బాహువగు శూరుఁడైన రాముఁడు, వృషభం బొవునువలె సీతను రథంబుపైఁ దనముందరఁ గూర్చుండఁబెట్టికొని యయోధ్యకు రాఁగలఁడు? ఎపుడు వారు సంత సముతో నయోధ్యయందుఁ జొచ్చి, మంచి మనసుతోఁ గన్యకలకును బ్రాహ్మణులకు దానముల నొసఁగి జనుల నెప్పుడు సంతోషపఱతురు? శత్రుసూదనులైన నా యిరువురు కొడుకులు రాజమార్గమున వచ్చు

నప్పుడు వేలకొలఁది పురజను లెప్పుడు సేసలు చల్లుదురు? నా కొమరులు కర్ణభూషణముల ధరించి, యాయుధములను, గత్తిని చేతఁ బెట్టుకొని శిఖరములతో వెలుఁగు పర్వతముల చందమున విరాజిల్లుచు నెప్పుడు పురమునకుఁ బ్రదక్షిణము సేయఁగలరు? బుద్ధియందును, వయస్సు నందును వికాసము నొందినవాఁడై దేవతలఁబోలు కాంతిగలిగినవాఁ డగుచు ధర్మజ్ఞుఁడయిన రాముఁ డేతెంచి, మూఁడేండ్లపసిబిడ్డఁడువోలె ననెన్నెప్పుడు సంతసపఱుపఁగలఁడు? శూరుఁడవగు ఓ నృపాలా, పూర్వ జన్మమున బిడ్డలు పాలుత్రాగఁ గోరుచుండఁగా, వారితల్లుల స్తనములను గడుఁగ్రూరురాలయిన నేను గోసి పాఱవేయించియుంటను ఇందుకు సందియము లేదు. కావున ఓ పురుషశ్రేష్ఠా, దూడయం దెక్కువ మక్కువగల లేఁగటియావును సింహము దూడలేనిదానిం జేయునట్లు నే నీ జన్మమునఁ బుత్రవాత్సల్యముగలదాన నయినను, నన్నీ కైకేయి బలాత్కారముగా నట్లుచేసిన దాయెను. సకల శాస్త్రములందుఁ బండితుఁడును, ఒప్పులకుప్పయు నయినయట్టి కుమారునిఁబాసి, యెంటిబిడ్డను గలదాననయిన రాముఁడు మఱలివచ్చునంతవఱకు జీవించియుండఁ జాలను. పొడవుచేతులు గలవాఁడును, నెక్కువ బలిమిగలవాఁడునైన నాముద్దుల కొడుకును జూడక నేను ప్రాణములు దాల్చియుండ నాకుఁ గొంచెమయినను దిటవుచాలదు. వేసవియందు ఖరకిరణుఁడయిన భగవంతుఁడగు సూర్యుఁడు తన కిరణములచే నీ పుడమిని మాడ్చునట్లు, పుత్రవియోగముచేఁ గలిగిన దుఃఖమునెడునన్ని యప్పటికప్పటికి వృద్ధి నొందుచు నన్ను దహించుచున్నది. నే నీ వేంద్రమున కోర్చియుండఁ జాలను" అని కౌసల్య నృపాలునితోఁ జెప్పి విలపించెను.

44-వ సర్గము.

సుమిత్ర కౌసల్య నూఱడించుట

అట్లేఁగునఁ బలవించుచున్న యుత్తమాంగనయగు కౌసల్యను జూచి, ధర్మమునం దాసక్తిగలదగు సుమిత్ర ధర్మము మాఱని యిట్లంది వాక్యములఁ జెప్పఁదొడఁగెను.

"ఓ భాగ్యశాలినీ! సద్గుణవంతుఁడగు నీ పుత్రుఁడు పురుషోత్తముఁడు. నీ వతనినిగూర్చి దీనముగ వగచియు నేడ్చియు నుపయోగము

లేదు. ఓ పూజ్యురాలా! నీ కొమరుఁడు బలశాలియైనను, తన తండ్రికిఁ బ్రతిజ్ఞఁదప్పనివాఁ డనుపేరు తేఁగోరి, రాజ్యము బరిత్యజించి, కాన లకుఁ బయనమయ్యెను. తండ్రి యానతిఁ గైకారము నడచుటవలన శాశ్వ తమైన పరలోకము సిద్ధించును, ఆ ధర్మమునే పూర్వికులగు పెద్దలును నాచరించిరి. అతఁడు సర్వజనోత్తముఁడు. ఆతనిఁగూర్చి రెయున్నఁడును విచారపడ నక్కఱలేదు. దోషరహితుఁడగు లక్ష్మణుఁ డెల్లప్పు డతని యందు మంచితలంపు గలిగియున్నాఁడు. అతఁడు సర్వభూతములందు దయగలవాఁడు; మహాసమర్థుఁ డయినరామునికిఁ బెన్నిధియయిన వాఁడు. సుఖము లనుభవింపఁదగినది యైన జానకి వనవాసమునందలి యిడుమల నెఱిఁగినదయ్యెను, ధర్మాత్ముఁడయిన నీకుమారుని వెంబడించి పోవుచున్నది. సమర్థుఁడైన యీ నీ కొమరుఁడు నేర్పరియై లోకమునఁ దన కీర్తియనెడి లెక్కెమును ద్రిప్పుచున్నాఁడో, యట్టి, ధర్మపరిపాలన మును, సత్యవాక్యమును ధనముగాఁగల నీ పుత్రుఁ డేల సత్వరముగా రానేరఁడు. రాముని శీలమును సామర్థ్యమును నెఱిఁగినవాఁడై, సూర్యుఁడు తన కిరణములచే నతనికి వేఁడిమిని గలిగింపఁడు. ఇది నిజము. మఱియు నడవులనుండి వెడలు గాలి యన్నివేళలందును మేలుగావించు నదై, సమశీతోష్ణములు గలిగి, రాముని కింపగునట్లు వీవఁగలదు. చంద్రుఁడును రాత్రులందుఁ బరుండియున్న మహోత్సుఁడగు రాముని దండ్రివలెఁ గాఁగిలించుచుఁ దన చల్లనికిరణములను బర్వఁజేసి; మిక్కిలి సంతసము గావింపఁగలఁడు. తొల్లి శంబరాసురుని పుత్రునిఁ దన పరా క్రమముచే రాముఁడు సంచరించినప్పుడు బ్రహ్మదేవుఁడు సంతసించి, రామునకు దివ్యాస్త్రములన్నిల నొసంగెను. అట్టి పురుషశ్రేష్ఠుఁడయిన శూరుఁడగు రాముఁడు తన బాహుబలమువలన నడవియందున్నను, నింటియందున్నట్లే నిర్భయుఁడై తిరుగుచుండఁగలఁడు. యుద్ధరంగమున నీ రాముని బాణముల బాటెంబడిన శత్రువులు తప్పించుకొనఁజాలరు. అట్లుండఁగా నితని వశమున నీ భోలోకమెల్ల నుండుట కేమి సందియ మున్నది? ఆరాముని ముఖకాంతిని, మగఁటిమిని, సత్స్వభావమునుజూడ సత్వరమ వనవాసము నెఱిపి, వెంటనే యయోధ్యకువచ్చి యతఁడు తప్పక పట్టాభిషిక్తుఁడు గాఁగలఁడు.

ఓ కౌసల్యా! రాముఁడు సూర్యునకు సూర్యుఁడు; అగ్ని కగ్ని; రాజునకు రాజు; కాంతికిఁ గాంతి; కీర్తికిఁ గీర్తి; ఓర్పున కోర్పు; దేవతలకు దేవత; భూతములకెల్లఁ బ్రధానభూతము. అట్టిరాముఁడు పట్టాభిషేకమున నున్న నేమి? దేశమందున్న నేమి? ఎచ్చట నున్నను రాముని కెట్టి యాపదయు సంభవింపనేఱదు. రాముఁడు వేగముగ సీతతోను, సంపదతోను, భూమితోడను గూడి పట్టాభిషేకము నొందఁగలఁడు. అప్పుడు పురమున నంతకుమున్ను రాముని వనవాసమునకై వ్యసన పడుచున్న జనులు పట్టాభిషిక్తుఁడయిన రామునిఁగాంచి యానందబాష్ప ములను విడువఁగలరు. శత్రువులకు లోఁబడని రాముఁడు వల్కల ములను, దర్భలను ధరించి పోవునప్పుడు సీతవలెనే రాజ్యలక్ష్మియు నతనిని వెంబడించినది. కావున నతనికేది దుర్లభమగును? విలుకాండ్రలో మేటియగు లక్ష్మణుఁడును బాణములను, ఖడ్గములను, వస్త్రములను దాల్చి, రామునికిముందు నడుచుచున్నాఁడు. అట్లుండ నా రాముని కేమి కొఱఁతయున్నది? ఓ దేవీ, వనవాసము నెఱపి, సీతతోను లక్ష్మణుని తోను జంద్రునివలె నీ ముందట నుదయించి, నీ పాదములకు మ్రొక్కి, పట్టాభిషిక్తుఁడయి హేలఁగెడి రాముని నీవు గట్టిగాఁ గౌఁగిలించుకొని, యానందబాష్పములతో నాతని శరీరమును బాగుఁగాఁ దడుపఁగలవు. ఓ కల్యాణీ! ఆ రామునివిషయమున దిగులును విచారమును బొంద నక్కఱలేదు. నీవు దుఃఖముఁ బాయుము. నీ వజ్ఞానమును విడువుము. నేను నీకు యథార్థముఁ జెప్పితిని. నీవు మాబోఁటి తక్కినజనుల నందఱి నోదార్పవలసియుండఁగా, నీవేల యిట్లు వ్యసనమున మునిఁగెదవు. రామునికిఁ దల్లివైన నీ విట్లు వ్యసనపడఁదగదు. రామునికంటె మించిన సత్పురుషుఁ డొక్కఁడైనను ముజ్జగములలోపల లేఁడు. ఆరాముఁడు స్నేహితులతో నయోధ్యకుఁ ద్వరలో వఱలివచ్చి మృదువులయినబలసిన తనచేతులతో నీరెండుపాదములను బట్టుకొని నీకు మ్రొక్కఁగా నాతనిపై నీవు వార్షికమేఘమువలె నానందాశ్రువులను విడువఁగలవు" అని యిత్తెఱఁగున రామునితల్లియగు కౌసల్యకు ననేకవిధ వాక్యములం జెప్పి మాటలందును నుపచారములందును నేర్పరురాలయిన సుమిత్ర యంతటితో నూరకుండెను. అట్లు లక్ష్మణుని తల్లియగు సుమిత్ర పలికిన

పలుకులను వినుటచేఁ గౌసల్య స్వల్పోదకశోకముగల శరత్కాల మేఘమువలె నశించెను.

45-వ సర్గము.

రాముఁడు సరయూనదీతీరమున విడియుంట

తిరమయిన మగఁటిమి గలవాఁడును, మహోత్సాహుఁడునునైన రాముఁడు వనమునకుఁ దఱలఁగా, జను లఁదఱు నతని బ్రేమతో వెంబడించిరి. రాముని స్నేహితులును, తండ్రియు బలాత్కారముగా నిల్పినను, ప్రజలుమాత్రము నిలువక రాముని రథమును వెంబడించి పోవుచు వెనుకకు మఱలకుండిరి. గొప్ప పేరువడసినవాఁడును, మేటి గుణములతోఁ గూడినవాఁడు నైనందునఁ బున్నమచందురునిఁబోలె రాముఁ డయోధ్యానగర వాసులగువారికిఁ బ్రీతిపాత్రుఁడయి యుండెను. అట్లు జనులు రాముని వెంబడించి, "ఓ జగద్రక్షకా! నీ విపు డరణ్యమునకుఁ బోవలదు. వెనుకకు మఱలిచ్చి, మమ్ము నేలుము" అని వేఁడుకొనుచున్నను, దండ్రిని సత్యవంతునిగఁ జేయఁ గోరి, యడవికిఁ బోవలెననియే చెప్పి, రాముఁడు జనులనందఱను బ్రేమ మీఱఁ గన్నులతోఁ బానముచేయురీతిని నీక్షింపుచు నా ప్రజలనంద ఱను దన బిడ్డలవలె భావించుచు వారితోఁ నిట్లనియె:—

"ఓ జనులారా! యయోధ్యాపుర నివాసులరగు మీకు నాయెడ నెంతప్రేమయు, గౌరవమును గలదో, యంతటిప్రేమను గౌరవమును నా ప్రీతికై భరతునందు విశేషముగఁ జూపుదురుగాక! ఆ భరతుఁడు మేటి నడవడిగలవాఁడు; నైక కానందమొసఁగఁ జేయువాఁడు. అతఁడు మీ కిష్టములును శ్రేయస్కరములునగు కార్యములను యథావిధిగఁ జేయఁగలఁడు. అతఁడు వయస్సునందుఁ బిన్నయైనను జ్ఞానమునందు వృద్ధుఁడు; సాధువులందు మెత్తనివాఁడు; దుష్టులందు శూరుఁడు; యోగ్యుఁడు. అతఁడు శత్రువులవలని వెఱపుఁ దొలఁగించి, మీకుఁ దగినయేలికయై మిమ్ము నాదరింపఁగలఁడు. రాజగుణ యుక్తుఁడగు నా భరతునే నృపాలుఁడు యువరాజునుగాఁ జేయఁదలఁచెను. మఱియు రాజు నానతి చొప్పున నేనును, మీరును సడచుకొనవలయును. మీరు నా కిష్టముఁ జేయఁగోరితిరేని, నేను గానలకేఁగితినని మహారాజు విచార

పడకుండునట్లు నడచుకొనవలయును" అని చెప్పెను. అట్లు రాముడు తండ్రిమాట జరుపుటయను ధర్మంబున నిలుకడగలవాడై, "నేను మఱలి యయోధ్యను రా" ననుకొలఁదిచూ, జను లాతనినే రాజుగనుండవలెనని మీఁదుమిక్కిలి నిర్బంధముచేసిరి. ప్రజలగదలు గన్నీటిచేఁ గన్నులు మూఁతపడి దుఃఖముతో రామలక్ష్మణులను వెంబడించిపోవుటఁ జూడఁగా, రామలక్ష్మణులు దమ గుణము లనెడు పాశములతో వారిం గట్టి లాగుకొని పోవుచున్నా రేమోయని చూపఱకుఁ దోఁచుచుండెను. జ్ఞానము, వయస్సు, పరాక్రమమునను మూఁటిచే వృద్ధులగు బ్రాహ్మణులు వయసుచే శిరము వణఁకుచుండఁగా దూరదర్శనమునండియే గుఱ్ఱములను గూర్చి "ఓ మంచిజాతియంసుఁబుట్టి వేగవంతములయి రాముని వహించుచుండు గుఱ్ఱములారా! మీరు మఱలుఁడు. పోవలదు. మీ యజమానుఁడగు రామునికి మేలుచేయుఁడు. మృగములన్నిటిలో గుఱ్ఱములకు వినికిడి శక్తి అధికము. కావున మీరు మా ప్రార్థన నంగీకరించి వెనుకకు మఱలుఁడు. రాముఁడు ధర్మపరిపాలనముచే నిర్మలమగు స్వభావముగల వాఁడు; శూరుఁడు; నియమముఁ దప్పనివాఁడు. అట్టి మీ ప్రభువును మీరు పట్టణమునకుఁ బిలుచుకొని రావలయునేకాని, పట్టణమునుండి యడవికిఁ గొనిపోవుట తగదు" అఁది. ఇట్లు మిక్కిలి దీనముగా మొఱలిడుచు రోదనముచేయుచున్న వృద్ధబ్రాహ్మణులను జూచి, రాముఁడు వెంటనే రథంబునుండి దిగి, సీతాలక్ష్మణసమేతుఁడై, యడవియంచే మనంబుంచినవాఁ డగుటచేఁ దిన్నగా నడుగులిడుచుఁ బోయెను. రాముఁడు దయార్ద్ర దృష్టిగలవాఁడును, సత్ప్రవర్తనమునఁ బ్రేమ గల వాఁడును నగుటంజేసి, కాలినడకతో వచ్చెడి బ్రాహ్మణుల నందఱినివిడిచి రథముమీఁదఁ బోనఁ జాలనివాఁ డయ్యెను. నడచిపోవుచున్న రామునిఁ జూచి బ్రాహ్మణులందఱు మిక్కిలి దుఃఖపడి, మనములు చెదరినవారయి "ఓ రామా! ఈ బ్రాహ్మణులందఱు దమ మూపురములపై నగ్నులను బెట్టికొని బ్రాహ్మణహితమునుగోరెదు నిన్ను వెంబడించుచున్నారు. శరత్కాలమందలి మేఘసమూహములవలెఁ దెల్లనై, వెంబడి వచ్చుచుండునవియు, వాజపేయ యాగమున మాకు లభించినవియునైన మా గొడుగులను జూడుము. వాజపేయము చేయుటచే మాకు దొఱకిన యీ ఛత్ర

ములను, గొడుగులేక యెండవేడిమిచే సోలియుండు నీకుఁ బట్టెదము. ఎల్లప్పుడు వేదాధ్యయమునందుఁ బ్రవర్తించుచుండు మాబుద్ధి యిపుడు నీ వడవికేఁగుచున్నందున, నీతోడ నరణ్యమునకు రాఁ దిరిగినది. మాకు గొప్పధనమైన వేదము లేవియున్నవో, అవి మా మనసులందే యున్నవి. మా భార్యలును దమపాతివ్రత్య బలముచేఁ గాపాడఁబడుచు గృహంబులందే యుండగలరు. కావున వారు మాతోడ రారు. మేము నిన్నెట్టియైనను నయోధ్యకు మఱలించి కొనిపోవలెనని వచ్చితిమి. నీ వీక వనవాసమునందలి తలంపు మానుము. నీవు ధర్మము నాచరించుట యందే తలంపుగలవాఁడ వగుదువేని, మామాట వినుటకంటె మిగిలిన ధర్మాచరణ మేమియున్నది? ధర్మము నాచరించుటయందు విడువని పట్టు దలగల యో రామా! మేము కడు వృద్ధులము. మా తలవెండ్రుకలు హంసలవలెఁ దెల్లగ నెఱసినవి. ఆచారనిర్వాహణమున నేలపైఁబడి దుమ్మంటికొనినవి. పెద్దలమును దుఃఖము సైరింపఁజాలనివారమునైన మాయొక్క ప్రార్థనల నంగీకరించి వెనుకకు మఱలుము. అనేకులు ద్విజోత్తములు యజ్ఞము లారంభించి, వలయు సంభారములను సేకరించి యున్నారు. ఓ నాయనా! యవి నీవు తిరిగివచ్చినయొడల నెఱవేఱఁగలవు. నీవు రానియెడల నవి యంతటితో నిలిచిపోవును. జంగమములు స్థావరములునగు ప్రాణులన్నియు సీయెడ భక్తిగలిగి నీవు నగరమునకు మఱలి రావలెనని కోరుచున్నవి. రామా, అట్లు నీయెడభక్తిగలిగియున్న వాని కోరికను దీర్పుము. వృక్షములు విశేషముగాఁ గదలుటచూడఁగా, నవి నిన్ను విడిచియుండఁజాలక, నీ వెంబడి రావలెనని ప్రయత్నించినను, వేళ్లు గతినిరోధము చేయుటచేత నవి నిన్ను వెంబడింపఁజాలక, "మన మిం వేళ్ల యాటంకముచే రాముని వెంబడింప లేమైతిమికదా" యని యాక్రోశించుచున్నట్లున్నవి. ఋక్షులును నీ వరణ్యములకుఁ బోవుటం జూచి, యాహారమునకై బయటఁబోక, చేష్టలుమాని, చెట్లమీఁద నెక్కడివక్కడనే కూర్చుండి, సకల భూతదయాళువయిన నిన్ను వనము నకుఁ బోవలదని యాచించుచున్నట్లున్నవి" అని యిట్లు రాము నితోఁ జెప్పిరి.

అట్లు రాముని మఱిల్చుటకై ఘోషించుచుండు బ్రాహ్మణులను మఱిలింపక పోవుచున్న రామునిఁ గూర్చి, తమసానది "ఓ రామా! నీ విట్లు బ్రాహ్మణులను సమాధానపఱుపక పోరాదు" అని నివారించు చున్నదో యనుస ట్లుగపడెను. అంతట సుమంత్రుఁడును రథమునిలిపి, గుఱ్ఱములనువిప్పి డస్సిన యాగుఱ్ఱములను వేగముగ నలపుదీర్చుకొను టకై నేలపైఁ బొఱలించి, నీరు త్రాగించి, యొడళ్ళుతోమి, బాగుగఁ గడిగి, తమసానది చేరువను త్రిప్పుచుండెను.

46-వ సర్గము.

రాముఁడులు జనులను వంచించి రథంబెక్కిపోవుట

అంతట రాముఁడందమైన తమసానదీతీరముఁజేరి, సీతనుజూచి, లక్ష్మణునితో "సౌమిత్రి! వనవాసమునకు వెడలిన మన కిది మొదటి రాత్రి. లక్ష్మణా! నీకు మేలయ్యెడుగాక; గగ్గోలుపడకుము. లక్ష్మణా! చూడుము. శూన్యములయిన యీ యరణ్యములను తమతమ నివాస ములకు వచ్చెడి మృగములతోను, బక్షులతోను గూడినవై, కళదప్పి, రోదనము చేయుచున్నవో యనునట్లున్నవి. ఇప్పుడు మన తండ్రియొక్క రాజధానియగు నయోధ్యాపురమునను స్త్రీ పురుషులందఱు అడ వులకువెడలిన మనలనుగూర్చి వగచుచుందురు. దీనికి సంశయము లేదు. నరశ్రేష్ఠా! జనులందఱు ననేక సుగుణములచే దశరథుని, నిన్నును, నన్నును భరతశత్రుఘ్నులను గడుఁ బ్రేమతోఁ జూచుచున్నారు. తండ్రియుఁ గీర్తిమంతురాలగు తల్లియు వనమునకు వచ్చిన మనలను గూర్చి మిక్కిలి యేడ్చి యేడ్చి కన్నులుచెడి యంధులగుదురేమో? వారినిగూర్చినేను మిగులవగచుచున్నాను. మహోత్సుఁడగు భరతుఁడు తల్లిదండ్రులను ధర్మార్థ కామములతోఁగూడిన మాటలు నెప్పి యూఱ డింపఁగలఁడుగదా! భరతుని మంచితనమును మఱియు మఱియుఁ భావించి "లక్ష్మణా! తండ్రినిగూర్చికాని, తల్లినిగూర్చికాని నేనంతగా దుఃఖింపను. పురుషశ్రేష్ఠా! నీవు నావెంట వనమునకు వచ్చుట మంచిపనియయ్యెను. అటుకాకున్న; నే నరణ్యమున సీతాదర్శనమునకై సాహాయ్యమును వెదక వలసియుండునుగదా! ఈ నదీతీరమున మనకాహారమునకుఁ గావలసి నన్ని వన్యవస్తువు లున్నవి. కాని మన మీ రేయి నీరుద్రావి యుండె

దము. ఇదియే మంచిదని నాకుఁదోఁచుచున్నది" అని చెప్పి, సుమం త్రునితో "ఓ సారథీ! గుఱ్ఱములను జాగ్రత్తతోఁ జూచుకొనుము" అని చెప్పెను. ఆసుమంత్రుఁడును ప్రొద్దుగ్రుంకఁగనే గుఱ్ఱములఁ గట్టివేసి కావలసిన గడ్డినివేసి, సమీపమునఁనే కాఁచుకుండెను.

రాముఁడును నదికిఁబోయి సాయంసంధ్యావందనా ద్యనుష్ఠా నములు దీర్చికొనివచ్చినపిదప, రాత్రి యయ్యెనని తెలిసికొని సుమంత్రుఁడు లక్ష్మణునితోడ్పాటుతో రామునకుఁ భోన్పు నేర్పఱిచెను. ఆకులతో నేర్పఱిచిన యాపాన్పునుజూచి రాముఁడు లక్ష్మణునితోడను, సీతతోడను దానిపైఁ గూర్చుండెను. అంతఁ గొంతతడవునకు రాముఁడు, సీతయు బాగుగ నిద్రింపఁగాఁజూచి లక్ష్మణుఁడు సుమంత్రునికి రాముని నానా గుణములను జెప్పుచుండెను. తమసానదిగ్నుని మేల్కొని లక్ష్మణుఁడు సుమంత్రునకు రామునిగుణములు వర్ణింపుచుండఁగనే, రాత్రి తెల్ల వాఱఁజొచ్చెను. ఆలమందలచే నిండిన యా తమసానదీతీరమున రాముఁడా రాత్రి వెంబడివచ్చినజనులతోఁగూడ నివసించెను. ఎక్కువ శౌర్యము గలవాఁడగు రాముఁడు నిద్రమేల్కొని, నిద్రపోవుచుండు నా జనుల నందఱిం జూచి, శుభలక్షణములుఁగల తమ్ముఁడగు లక్ష్మణునిఁ గూర్చి, "లక్ష్మణా! యీ జనులు మనయందలిప్రేమచేఁ దమ గృహ ములం దపేక్షమాని, యిప్పుడు చెట్లమొదటఁబరుండి నిద్రించుచున్నారు; చూడుము. ఈ పౌరులు మనలను మఱలించుటకై యెంతయో పట్టుదల గలిగియున్నారు, వీరు ప్రాణములు విడుచుటకైనను సాహసింతురుగాని, తమ నిశ్చయమును విడువఁజాలరు. కావున గాఢనిద్రలోనుండు వీరు నిద్ర లేవకుండులోఁపలనె మనము చప్పుడుచేయకుండ రథమెక్కి నిర్భయముగా సాగిపోవుదము. మన మిప్పు డిట్లు చేయుదుమేని, మనయం దాసగలయయోధ్యాపురవాసు లందఱు నిఁకమీఁద నెప్పటికి నిట్లు చెట్లక్రిందఁ బరుండి నిద్రింపరు. రాజపుత్రులు జనులను వారువారు తెచ్చుకొనిన కష్టములనుండి తప్పించవలయునేకాని, పురజనులు తమ నిమిత్తమై విచారపడునట్లు చేయకూడుగదా?" అని చెప్పెను. లక్ష్మణుఁడు మాపలుకులు విని, ధర్మమే యవతరించెనో యనఁదగియుండు తనయన్నను జూచి, "ఓప్రాజ్ఞుఁడా! నాకును నదియే యుక్తముగాఁ దోఁచుచున్నది;

వేగము రథము నెక్కుడము"అని చెప్పెను. అంతటఁ గాంతిమంతుఁడయిన రాముఁడు సుమంత్రునిఁబిలిచి, "ఓ సమర్థుఁడా! తేరునకు గుఱ్ఱములు పూన్చి తెమ్ము. ఇచ్చటినుండి మఱియొక యరణ్యమునకుఁ బోవుచము. పో పొమ్ము. వేగ రథము నాయితపఱుపుము" అని యానతీఁగా వెంటనే సుమంత్రుఁడు శ్రేష్ఠము లయినగుఱ్ఱములను గట్టి, తేరి నాయితము చేసి, యంజలిబద్ధుఁడై, "రథికశ్రేష్ఠా! యిదిగో రథము నాయితపఱచి తెచ్చితిని. నీకు మేలయ్యెడు. నీవు సీతాలక్ష్మణ సమేతుఁడవై, తేరి నెక్కుము" అని చెప్పెను. అంత రాఘవుఁడు యాయుధములనెల్లఁ గైకొని రథమెక్కి వేగముగా సుళ్లుదిరిగిపాఱుచున్న తమసానదినిదాఁటి, ముండ్లులేక, బాగుగాఁ దిగ్చినదియు, భయపడువారికి భయమును బోఁగొట్టునదియునైన గొప్పబాటనుబొంది, పురజనులను వంచింపఁగోరి, సారథియగు సుమంత్రుని బిలిచి, "సారథీ! నీ వుత్తరముఖముగ రథమునుబోనిమ్ము. రెండుగడియలసేపు రథమును వేగముగాఁబోనిచ్చి పిదప మఱలింపుము నీ విట్లుచేసినయెడలఁ బురజనులు మనరథముజాడ నెఱుఁగకుందురు. ఆ ప్రకారముగ హెచ్చరికతోఁ జేయుము"అనిచెప్పి రథమునుండి దిగెను. అంత సారథి రాముని మాటప్రకార మొనర్చి మఱలివచ్చి, రామునికిఁ దేరప్పగింపఁగా, నప్పుడు రఘువంశవీరులయిన రామలక్ష్మణులు తమకై సిద్ధపఱుపఁబడిన రథమునెక్కి సీతతోఁ గూర్చుండిరి. అంతట నా సుమంత్రుఁడు తపోవనమునకుఁ బోవు మార్గమునసే గుఱ్ఱములను దోలెను. వెండియు మహారథుఁడయిన రాముఁడు రథమునెక్కి యడవికిఁ బయనమై పయనమునకుఁ దగిన శుభశకునములను జూచుటకయి తొలుత నుత్తరపువైపునకు రథము మఱలించెను.

47-వ సర్గము.

రాముఁడు దమ్ము విడిచిపోయినందుకై పురజనులు విచారపడుట

ఆరేయి కడచి తెల్లవాఱుఁగాఁ బురజనులందఱు మేల్కొని, రామాదు లచ్చట లేకుండుటఁ జూచి, దుఃఖము దెబ్బను సహింపలేక చెయువులు దక్కినవారలై, మూల్గుచు, మఱలఁ గొంతసేపటికి లేచి కండ్లయందుఁ గన్నీటిని నించుకొని, యచ్చటచ్చటఁ జూచినను రాముని రథముయొక్క దుమ్మునైనను జూడఁజాలకపోయిరి. అంతట వారు

వ్యసనముచే వాడిన మోములతోఁ గూడి, ధైర్యవంతులయిరి, జ్ఞాని యైన రాముని వియోగముచే దైన్యమునొందిరి, మిక్కిలి దీనముగఁ దమలోఁ దా మిట్లనుకొనిరి. "ఛీ! యీ నిద్రగదా మనల నింత చెఱచినది. ఈ నిద్రచే మైమఱచినవారలమ్మి, నిజనిజోమ్మును, బొడవుచేతులును గలవాఁడగు రాముని నిప్పుడు చూడలేకపోతిమి. గొప్పచేతులు గలవాఁడగు రాముఁడు మనల నెప్పుడును వంచించినవాఁడు కాఁడు. అట్టి యాతఁడు భక్తజనులను విడిచి, యెట్లు వనమునకుఁ బోయి యుండును. తండ్రి తన కడుపునఁ బుట్టిన బిడ్డలనుబోలె, రాముఁడు మనల నెప్పుడు పాలించుచుండునో రఘువంశపు రాజులలో మేటియైన అట్టి రాముఁడెట్లు మనలను బాసి యడవికిఁ బోయెను. కావున మనమిచ్చటనే మరణింతము. లేదా, మరణపర్యంతము యాత్ర గావింతము. అంతియ కాని, రాముని బాసిన మన కీజీవితముతో నేమి ప్రయోజనము? ఇచ్చట బాగుగా నెండిన లావుకొట్టెలు విస్తారముగా నున్నవి. వీనితో నిచ్చట నొక చితిపేర్చి, యగ్నిని రగులుకొల్పి యందుఁ బ్రవేశింతము. మనము మఱలి యయోధ్యకుఁ జనినపు డచ్చటి జనులు మనలఁజూచి, "జనులారా! అసూయలేనివాఁడును, జనులకుఁ బ్రియముగా మాటలాడువాఁడును నైన రాముఁ డెక్కడికిఁబోయె"నని యడిగిరేని, "మమ్మువిడిచి, యాతఁ డడవికేఁగె"ననియే కదా చెప్పవలయును. ఆమాట యెట్లు చెప్పఁగలము? అయోధ్యాపురవాసులందఱు స్త్రీ బాలవృద్ధులతోడఁ గూడి, రాఘవునిఁ బాసి వచ్చిన మనలను జూచి కడు వ్యసన మొందుదురు. ఇది నిశ్చయము. జితేంద్రియుఁడగు రాముఁతోఁగూడ మనము పత్తనమునుండి వచ్చితిమి. ఇప్పుడు రాముఁడు లేకుండ మన మీ పురము సొచ్చి పుర జనులను జూడఁగలము" అని యత్తెఱఁగులైన మాటలను చేతులు పైకెత్తి పలుకుచు, వ్యసనాక్రాంతులై, దూడఁబాసిన మోవులవలె పలవించుచుండిరి. పిదప వారు రాముని తేరిజాడను గనిపెట్టి పోఁదలఁచి, యా దారినే కొంతదూరమేఁగి, దారిజాడయైనఁ గనఁబడమిచే వ్యసనముతోఁ గూడినవారై, "ఇదియేమి? మన మింక నేమిసేయఁగలము. దైవముచే మనము వంచింపఁబడితిమి" యని తలఁచుచు వెనుకకు మఱలిరి. అంత వారందఱు వాడుబాటిన డెందములతో వచ్చినదారిని

బట్టి, విచారపడుచుండు సజ్జనులతో నిండి యయోధ్యాపురము సొచ్చి, తమ యిండ్లకుఁ బోవుటఁగూడ మనసు లేక, యయోధ్యాపురము సొంపు దక్కియుండుటను జూచి, దుఃఖసంతాపముతోఁ గూడిన కన్నులనుండి కన్నీరు విడిచిరి. పన్నగములు గరుడునిచే నెత్తికొనిపోఁబడిన మడుగు చందమున రాముఁడు లేని యయోధ్యాపురము శోభిల్లకుండెను. రాముఁడు లేమిచేఁ జంద్రుఁడు లేని యాకసము మాడ్కియు, నీరు లేని కడలిచాడ్పునను సంతసము దక్కియున్న యయోధ్యాపురము సొచ్చి, జనులు తమ గృహము సకల ధనధాన్య సమృద్ధములై యున్నను, దుఃఖముచేఁ గొట్టువడి, విచారముతోడ నా యిండ్లకుఁ బోయి, సంతసము దక్కియుండుటంజేసి, జనులను జూచుచున్నను, వీరు తమవారు, వీరు పొరుగువారని తెలియఁజాలరైరి.

43-వ సర్గము.

అయోధ్యాపురజనులు రాముని వనవాసమునకు దుఃఖించుట

ఆ నగర నివాసులగు జనులు రాముని వెంబడించి, మఱలివచ్చి, దుఃఖముచే మిక్కిలి పీడింపఁబడినవారై, కన్నులనుండి కన్నీరు గాలుచుండ, ధైర్యమువిడిచి మూర్ఛనొందినవారలగుచుండుటఁ జూడఁగా, వారి ప్రాణములువెలువడి రాముని వెంబడించినవాయనునట్లు చూపఱకుఁ దోఁచుచుండెను. జను లట్టి యవస్థ ననుభవించుచుఁ దమ తమ యిండ్లకు వచ్చి, భార్యాపుత్రులను జూచి కూర్చుండఁబెట్టికొని, మోమున మిక్కిలి విన్నదనము దోఁపఁజేయుచుఁ గన్నీరు విడిచిరి. వర్తకులు సంతోషరోమాంచముల నొందక, యంగళ్లుపెట్టరైరి. పుణ్యకార్యములు జరుగకుండెను. గృహస్థులు వంట వార్పులు సేయరైరి. జనులు తమ గృహముల నుండిన వస్తువు లగపడకపోయి, మఱిల దొఱికినను, విస్తారధనము దొఱికినను సంతసము నొందకుండిరి. మొదటఁ గొడుకును గన్న తల్లు లాకొడుకును జూచి యానందింపరైరి. ఇంటింటను మగువ లేడ్చుచు భర్త లింటికివచ్చుటను జూచి, వ్యసనపీడితలై, అంకుశములచే నేనుఁగులంబోలెఁ దన పెనిమిటులను పరుసని మాటలచే బొడుచుచు "ఎవరు రాముని జూడకుండుదురో, వారి కిండ్లుండిన నేమి? భార్యలున్న నేమి? విస్తార ధనమున్న నేమి? కొడుకులున్న నేమి? సకల సుఖము

లున్న నేమి? లక్ష్మణుఁడును సీతయు రామునికిఁ బరిచర్య సేయుచు వనమునకుఁబోవు రాముని వెంబడించుచున్నారు గావున బురుషులలో లక్ష్మణుఁ డొక్కఁడే సజ్జనుఁడు. ఆడువారిలో నా సీత యొక్కతెయె ధన్యురాలు. రాముఁ డరణ్యమునందలి యే తామర కొలఁకులందును, సామాన్యములగు కొలఁకులందును బరిశుద్ధోదకమునస్నానము సేయునో, ఆకొలఁకులే పుణ్యము సేసినవి. అందములైన వనములుగల యడవులును, గొప్ప జలప్రాయ ప్రదేశములందలి నదులును, నెత్తములతోఁగూడిన కొండలును రాముని బ్రకాశింపఁజేయును. రాముఁ డేయడివికిఁగాని, పర్వతమునకుఁగాని పోవునో, యా యడవియు నాకొండయుఁ బ్రీతితోఁ దనయింటి కతిథివలె నేతెంచిన రాముని బూజసేయకుండఁజాలవు. వింత లైన పుష్పములె శిరోభూషణములుగాఁ గలవై, యనేకములగు పూల గుత్తులను దాల్చి, తుమ్మెదలచే వెలయుచున్న వృక్షములు రామునిఁ జూడఁగలవు. పర్వతముల కాలమునయినను వృక్షములయందు పుష్పము లను, ఫలములను ప్రీతితో రామునకుఁ దోఁపింపఁజేయును. మఱియుఁ బర్వతములు వివిధములయిన వింతలగు నెలయేళ్లతోఁగూడి, నిర్మలోద కములను స్రవించుచుండును. వృక్షములు కొండలకొనలందుఁ బుష్ప ఫలాదులతోఁ గూడి రాముని సంతోషపఱచుచుండును. రాముఁ డెచ్చట నుండునో, అచ్చట భయము లేదు; అపజయము లేదు; దశరథపుత్రుఁ డయిన దీక్షుబాహువగు రాముఁడు శూరుఁడుగదా! రాఘవుఁడు మన కతిదూరమునకుఁ బోవకమునుపే యా రాముని వెంబడింతము. అట్టి మహాత్ముఁడైన ప్రభువగు రాముని యడుగుల నీడ సుఖకరముగ నుండును. ఆతఁడే యీ జనులకుఁ బ్రభుఁడు; ఆతఁడే గతి; ఆతఁడె లోక మునఁ బొందఁదగిన స్థానము. మేము సీతకు బరిచర్య సేయుచుందుము; మీరును రామునికిఁ బరిచర్య సేయుచుండుఁడు. అరణ్యమున మీయొక్క యోగక్షేమములను రాముఁడే విచారించుకొనఁ గలఁడు. సీతయు మా యోగక్షేమములను విచారించికొనును. ప్రసిద్ధి కోలు పోయినదియు, రామునిపై మక్కువతోఁ దపోతపోవనముచుంచునదియు, రమ్యము గానిదియు, మనమునకు సంతసము నొదవనిదియునైన యీ యయోధ్యయందు నీక నెవ్వఁ డుండఁగలఁడు? ఈ రాజ్యము

న్యాయము లేనిదయియుండును నేని, దక్కు లేనిదానివలెఁ గైకేయిచేఁ
జిక్కి. అట్టిరాజ్యమున నుండుటవలనఁ బ్రయోజనము లేదు. కావున
మాకుఁ బ్రాణములతో సక్కు అలేదు. అట్లుండఁ, మాకు బిడ్డ లెట్లు
పోయిన నేమి? ఇండ్లు, వాకిళ్లు, సమస్త సంపదలు నెట్లు పోయిన నేమి?
కులనాశకురాలయిన కైకేయి రాజ్యకాంక్షచేఁ దన వెనిమిటిని, గొడు
కును విడిచినప్పు డిఁక నెవరినిఁ బ్రాఁతదోలకుండును. ఆమెయే రాజ్యాధి
కారము నొందునేని, మన కలుములనెల్ల లాఁగికొని మనలను గూడ
రామునిపలె నడవికిఁ దఱుమును. దీని కేమియు సంశయము లేదు.
మా బిడ్డల తోడుగా మేము చెప్పెదము. కైకేయిరాజ్యమున మేము
కూలివారముగా నైన నుండఁజాలము. ఇంతయేల? ఆమె బ్రతికియున్న
మే మామెను జూచుచు బ్రతికియుండఁజాలము. ఎవఁతె దయమాలి
నదై రాజపుత్రుఁడయిన రాముని నడవికిఁ బంపినదో, ధర్మముదప్పి
నదియుఁ బాపకార్యము లొనర్చినదియునైన యట్టి కైకేయికడనుండి
యెవ్వఁడు జీవింపనోపును. ఈ ప్రజ లెల్ల మిక్కిలి యుపద్రవముకు
లోనయి, యాదరువుదప్పి, దిక్కు లేక, యీ కైకేయిమూలమున
నాశమునొందఁగలదు. రాముఁ డడవికిఁ బోయినాఁడు గావున నృపాలుఁ
డిఁక జీవింపఁబోడు. దశరథుఁడు మృతినొందునేని, యటుపిమ్మటి కార్యము
రోదనమే. వేఱొక్కటి లేదు. ఇది నిశ్చయము. పుణ్యహీనులును, దరిద్రు
లునునైన మీరు చక్కఁగా నాలోచించి, రామునైనను వెంబడింపుఁడు.
లేదేని, విషమునైనను ద్రాగుఁడు. అటు కాదేని, మీ పేరు వినరానియ
ట్లెక్కడికైన దూరదేశములకుఁ బొండు. రాముఁడు సీతాలక్ష్మణులతోఁ
గూడ వంచనమెయిఁ గానలకుఁ బంపఁబడెను. కటికివాని వశమునఁ
బసులువోలె భరతునివశమున నప్పగింపఁబడితిమి. రాముని గుణములు
వర్ణింప నలవి కానివి. లక్ష్మణునియన్నయగు రాముఁడు పున్నమచంద్రునిఁ
బోలు మోమునగలవాఁడు; నీలవర్ణుఁడు; బలిసిన మాపురములును,
పిక్కలుదగులునంత పొడవుచేతులును, కమలములంబోలు కన్నులునుగల
వాఁడు; అందఱిని ముందుగా నెఱింగించువాఁడు; తియ్యనిమాటల
వాఁడు; సత్యము పలుకువాఁడు; అధిక బలవంతుఁడు, జనుల కందఱికుఁ
జంద్రునివలెఁ బ్రేమతోఁ జూడఁదగినవాఁడు; మదపుటేనుఁగు శౌర్య

మునుబోలు శౌర్యముగలవాఁడు; * మహారథుఁడు. ఆ పురుషోత్త ముఁడు వనములందు సంచరించుచు, వానినిఁ బ్రకాశింపఁ జేయఁ గలఁడు" అని తమ భర్తలను గొంతసేపును, నైకేయిని గొంతసేపును, దమ్ముఁ గొంతసేపును నిందించుకొనుచు, మృత్యుదేవతను జూచి వెఱచి నట్లు, భీతితోను జింతతోనుగూడి, మిక్కిలి బిగ్గఱగా గొంతెత్తి యేడ్చిరి. ఇవ్విధమునఁ బౌరకాంతలందఱు దమయిండ్లలో విలాపము సేయుచుం డఁగాఁ బ్రొద్దు గ్రుంకెను; రేయి వచ్చెను. అప్పు డా పట్టణమున జనులు దీపములు వెలిగింపరైరి. బ్రాహ్మణులు వేదాధ్యయనమును, పురాణేతిహా సముల పఠనము మానిరి. అపుడా పట్టణము చీకటిచేఁ బూయఁబడినట్లుం డెను. అయోధ్యానగర జను లాదరువు దప్పి సంతసము లేకుండిరి. అప్పుడా పట్టణము రిక్కలులేని యుప్పరముపగిది వెలయకుండెను. ఆ పౌరకాంతలు రాముని దమకొడుకులకంటె నెక్కువగా నెంచుటచేఁ దమ కొడుకులును, లేక సోదరులును, నడవికిఁ బంపిన నెట్లు దుఃఖిం తురో, అట్లే రాము నడవికిఁబంపుటచే సంతసముమాని, దుఃఖముతోఁ గూడి యేడ్చుచుండిరి. గానములు, వేడుకలు, నాట్యములు, వాద్య ములులేకయు, నంగళ్లుమూయఁబడియు, సంతసము లేకయు నుండుటచే నా పురము నీరింకిన గొప్ప కిడలి చందమునఁ గాంతి దఱిగియుండెను.

49-వ సర్గము.

రాముఁడు ఉత్తరకోసల దేశములను దాఁటుట

పురుషశ్రేష్ఠుఁడయిన రాముఁడు తండ్రియొక్క యాజ్ఞయుం దే మనస్సునుంచి యా రేయి గడచునంతలోపలఁ గడు దవ్వేఁగెను. అట్లు రాముఁడు పోవుచుండఁగ నా రేయి సుఖముగాఁ గడచెను. అంత రాముఁడు సూర్యోదయమగుడు స్నానము మొదలగు ననుష్ఠానముల నెల్లఁ దీర్చికొని, దేశమునొక్క పొలిమేరను జేరి యచ్చటఁ జక్కఁగా దున్నఁబడిన పొలిమేరలుగల గ్రామములను, వ్రాఁచిన వనములను జూచుచు, వేగశీలములైన మేటి గుఱ్ఱములు పూన్చిన రథమునఁ గూర్చుండి పోవుచున్నను, మెల్లగాఁబోయినట్లే చాలదూరమేగెను.

---

* తన్నును, సారథిని, గుఱ్ఱములను గాపాడుచుఁ బగతురతో యుద్ధముచేయు వాఁడు మహారథుఁ డనఁబడును.

అప్పుడు రాముని జూచి, పల్లెపట్టుల నున్న జనులు "ఛీ! దశరథన్నృపాలుడు కామపరవశుడై యెంతపని జేసెను. చూచితిరా! అక్కటా! పాపాత్మురాలును, బాపచింపకలదియున్నైన కైకేయి యెంత క్రూరురాలు? ఎంత పాపకార్యమున కొడిగట్టినది! పాపాత్మురాలగు కైకేయి, ధర్మమునందు బట్టువలగల వాడును, మహాబుద్ధిమంతుడును, సకలభూతములందు దయగలవాడును, ఇంద్రియములను గెల్చినవాడునునైన యిట్టి రాజపుత్రుని వనమునకు బంపినదే యీ కైకేయి, కటికిదనముగలదై, మర్త్యావమీతమైన యెంత ఘోరకృత్యము నొనరించుటకు దెగబడినది. ఎల్లప్పుడు సుఖముల ననుభవించు జనకుని ముద్దుల పట్టియగు సీత భాగ్యశాలినియయిన యే విధముగా నడవులు నిడుములఁ బడఁగలదు? అక్కటా! దశరథుఁ డెంత దయమాలినవాఁడు! జనులకుఁ బ్రియుఁడును, దోషరహితుఁడునునైన తన కొడుకు నరణ్యమునకుఁ బంప నిచ్చగించినాఁడు!" అని చెప్పుకొనుచుండిరి. వీరుఁడైనకోశలేశ్వరుఁడగు శ్రీరాముఁడును నా పల్లెపట్టుల జను లనుకొనుచుండు నిత్తెఱఁగు మాటలనాలకింపుచుఁగోసల దేశము దాఁటి, పవిత్రోదకములగల వేదశ్రుతి యనియెడు నదిని దాఁటి, దక్షిణదిక్కు వైపునకుఁదిరిగి చాలదూర మేఁగి, యావులమండలతోఁగూడిన జలమయప్రదేశములగలదియు, సముద్రమున సంగమించునదియునైన గోమతీనదిని, యా వెంబడి నెమళ్ళయు, నంచలయుఁ గూఁతలతోఁగూడినదియగు స్యందికయను నదిని వేగవంతములైన గుఱ్ఱములు గట్టిన రథంబుచే దాఁటి, యచ్చటి ప్రదేశమును జూచి, "ఓ ప్రియురాలా! తొల్లి మన పూర్వికుఁడయిన యిక్ష్వాకువునకు నీ సకల ధనధాన్య సమృద్ధిగల దేశములతోఁ గూడినదగు నీ పుడమిని మనుచక్రవర్తి యొసఁగెను" అని సీతాదేవికిఁ జూపించెను. వెంటనే మదించిన హంసమువొక్క కంఠధ్వనిం బోలు కంఠధ్వనిగలవాఁడయిన పురుషోత్తముఁడగు శ్రీమంతుఁడైన రాముఁడు సుమిత్రుని "సఖి"యని పలుమాఱు పిలిచి, "నేను వన వాసము ముగించివచ్చి, తల్లి దండ్రులంజేరి, యెప్పుడు సరయూనది గట్టునఁ బువ్వములు విరిసిఁయుండు నీ వనము వేఁటాఁడుచు విహరింపఁగలను? రాజర్షుల కీ లోకమున నడవులందు వేఁటయేకదా మిక్కిలి సుఖ

సమఁగల్గించునది. శ్రాద్ధాదికాలములందు మనుజు లపేక్షించునదియు, విలుకాండ్రకభిమతమయినదియు, నైన సరయూతీర వనమునందు మృగయావిహారమును నే నధికముగాఁ గోరను. రాజర్షుల కీ వేఁటయం దెక్కువ మక్కువగలదు. వారికి దీనింబోలు వఁ:తొక్క యాట లేదు" అని యింక నాయా విషయముల నుద్దేశించి, యింపులైన పలుకులు పలుకుచు నా దారి గడచిపోయెను.

50-వ సర్గము.

రాముఁడు గంగానదియొద్ద గుహునిఁజేరుట

బుద్ధిమంతుఁడగు లక్ష్మణుని యన్నయగు రాముఁడు విశాలము లయి కన్నులకుఁ బండువుసేయుచుండు దక్షిణ కోసల దేశములనుదాఁటి, యయోధ్యాపురము వైపునకుఁ దిరిగి చేతులు జోడించి, "కాకుత్స్థులచేఁ బరిపాలింపఁబడుచున్న యో యయోధ్యాపురమా! నిన్నును, నిన్నుఁగాపాడుచు నీయంతఁడు దేవతలను వీడ్కొనుచున్నాను. నేను వనవాసముఁ పూర్తిచేసి, తండ్రి ఋణమును దీర్చుకొన్నవాఁడనై, మఱలఁ దల్లితండ్రుల కడకుఁ జేరి, నిన్నుఁ జూడఁగలను" అని యయోధ్యాపురమును గూర్చి చెప్పి, రక్తమువలె నెఱ్ఱనైన కన్నులు గల రాముఁడు కన్నులనిండ నీరుపెట్టికొని, సంతసముమాని దేశవాసులగు జనులను జూచి, "ఓ జానపదులారా! మీరు నాయెడ నెంత యాదరమును, దయను జూపితిరి. అదియంతయు చిరకాల దుఃఖమునకు హేతువాయెను. అట్లు చిరకాలము దుఃఖమనుభవించుట కష్టముగదా! కావున మీకార్యములనుజూచుకొనుటకై మీరాయూళ్ళకుఁ బొండు" అని చెప్పెను. ఆ రాముని పలుకులు విని జనులందఱు మహాత్ముఁడగు రామునికి సాగిలఁబడి మ్రొక్కి, ప్రదక్షిణముసేసి, బిగ్గఱగా నేడ్చుచు నచ్చట నచ్చట నిలిచిరి. అట్లు జనులందఱు తనవినొందక యచ్చట విలపించుచుండఁగనే, సాయంకాలమున సూర్యుఁడు గంటికిఁ గనఁబడనట్లు రాముఁడు జనుల కన్నుల కగపడకపోయెను.

అంతటఁ బురుషోత్తముఁడగు రాముఁడు రథమునఁ గూర్చుండియే ధనధాన్యములతోఁ గూడినవియు, దానముచేయు స్వభావముగలవియు, సొంపయినవియు, సెవరవలనను భయములేనివియు, యజ్ఞశాలల

తోను యూపస్తంభములతోను గూడినవియు, నుద్యాననములతోను మామిడితోఁపులతోను గూడినవియు, జనసమృద్ధములయినసరోవరములు గలవియుఁ, దనిసి బలిసిన జనులతో నింపినవియు, రాజులచేఁ జూడఁదగినవియు, బ్రాహ్మణుల వేదఘోషములకు మాఱుమ్రోఁత లీనుచున్నవియు నైన కోసలదేశముల నతిక్రమించెను.

మఱియు, ధైర్యవంతులలో మేటియైన యూ రామునిఁ డట్లు కోసలదేశముండాఁటి, సంతుష్టిపడుజనులతోఁగూడినదియు, సర్వసస్య సమృద్ధంబైనదియు, మనోహరములగు నింటి తోఁటలతోఁ గూడినదియు, రాజశ్రేష్ఠుల యనుభవమునకుఁ దగినదియునైన కోసలదేశము బోడు గున నా దేశపుసొంపుఁ జూచుచునే పోదమెను. అయినను, అది యాతని మనస్సు చలించునట్లు చేయఁజాల దాయెను. ఆ కోసలదేశముయొక్క దక్షిణపార్శ్వమునసే ప్రవహించుచుండు గంగానదిని జూచెను. అయ్యది నిర్మలజలముగలిగి, పాపిలేక పావనమై, మనమునకు రమ్యమై, ఋషులచే సేవింపఁబడునదయి యొప్పారుచుండెను. దాని చేరువను సొబగుమీఱు తపోవనములు వెలుఁగుచుండెను. నప్సరసలందలి మదుగు లలో సంతోషముతో జలకము లాడుదురు. గంగానదిగట్టున దేవతలు, దానవులు, గంధర్వులు, కిన్నరులు విహరించుచుందురు. ఆ నిత్యపావన మయిన గంగానదిని గంధర్వాంగనలనేకులు సర్వదా కొల్చుచుందురు. దాని చేరువను దేవతలయుపవనము లనేకములుగలవు. దేవ తలయుద్యానములు నూఱులకొలఁదిగ దాని గట్టుననున్నవి. ప్రఖ్యాతి గల యా గంగానది దేవతలనిమిత్త మాకసమునఁ బాఱుచుండును. అందు దివ్య కమలములు గలవు. అందలి ప్రవాహముయొక్క ధ్వని యట్టహాసమువలె భీకరమయినది. తెల్లని నురుగు నవ్వువలెనుండును. ఒకొక్కచోట జల మొక్కపాయగాఁ బాఱుచుండును. కొన్నిచోట్ల నీటిసుళ్లచే శోభిల్లునది. కొన్నిచోట్లఁ గదలక లోతైనది. కొన్నిచోట్లఁ బ్రవాహజలముచే నల్లకల్లోలమైనది. కొన్నిచోట్ల గంభీరమైన ప్రవాహ ధ్వనిగలది. కొన్నిచోట్ల భయంకరధ్వనిగలది. గంగనీటియందు దేవగణ ములు స్నానముచేసి పోవుచుందురు. అది నిర్మలములయిన కలువలచే శోభిల్లుచుండును. కొన్నిచోట్ల విశాలములైన యిసుక తిన్నెలుండును.

కొన్నిచోట్లఁ దెల్లని యిసుక దుఁగడును. హంసలు, బెగ్గురుపక్షులు, చక్రవాకపక్షులు నదిగట్టున శబ్దించుచుండును. ఎడతెగని మదముగల పక్షులు నడమి ప్రదేశములందుఁ గూయుచు శోభిల్లఁ జేయుచుండును. గట్టున మొలచినచెట్లు పుష్పమాలికలువోలె నానదికి శోభ గలిగించు చుండెను. కొన్నిస్థలముల నల్లకలువలును, కొన్నిస్థలములందుఁ దామర లును, కొన్ని ప్రదేశములందుఁ దెల్లకలువలఁను, నరవిరిసినమొగ్గల సొంపు చేత నా గంగానదిని శోభిల్లఁజేయుచుండును. ఋతీయు నా గంగానది కొన్నిచోటులం దనేకవిధములైన పూఫ్రలయొక్కపరాగము నిండి యుండుటచే, ముఱికితోఁగూడినదిగను ముఱికిలేనిదగుటచేత స్ఫటికము నందు నవి నిర్మలముగఁ ప్రతిబింబము కాస్పించునదిగను నుండును. ఆ గంగానది చేరువనుండు వనములలో దిగ్గజములును, వనగజములును, మేటి మదపుటేనుఁగులును, దేవతలకు వాహనములగు నేనుఁగులును మాటిమాటికి ఘీంకారములు చేయుచుండును. అందుఁ బండ్లు, పువ్వులు, చిగుళ్లు, పొదలు, పక్షులు నావరించియుండుటచే నయ్యది, సకల భూషణములను దాల్చిన కాంతవలె సొంపుమీఱియుండును. కూర్మ గ్రాహ సర్పాదులగు జంతువులతోఁ గూడియుండును. అట్టి సకల గుణ ములతోఁగూడినదియు, విష్ణువుయొక్కపాదమునఁ బుట్టినదియు, దేవలోక మునఁ బుట్టినదియగుటచేఁ బాపరహితయైనదియు, పాపాత్ముల పాపములఁ బోఁగొట్టునదియు, భగీరథుని తపోబలముచే నీశ్వరుని జటాజూటము నుండి పుడమికిఁజాఱిపడినదియు, బెగ్గురుపక్షులయు, క్రౌంచములయు నాదములతోఁగూడినదియునైన సముద్రరాజపత్నియగు గంగానదిని రాముఁడు శృంగిబేరపుర సమీపమునఁ జూచెను. తరంగములతోఁ గూడుకొనిన సుళ్లుగల గంగానదిని జూచిన పదంపడి మహారథుఁడైన రాముఁడు సారథింబిలిచి, "సుమంత్రుఁడా! మన మీఁదినమున నిచ్చ టనే యుందము. ఇదిగో, చూచితివా యీ నదికి దాపుననే లెక్కలేని పువ్వులతోను పండ్లతోను గూడినయొక గొప్ప గారచెట్టున్నది. దానిక్రిం దనేయుఁడి, నిర్మలోదకముగలిగి పావనమై, దేవ, దానవ, గంధర్వ, మానుషులచేతను, మృగములచేతను, పక్షులచేతను గొల్వఁబడుచుండు నదీశ్రేష్ఠమైన గంగానదిని జూచెదము." అని చెప్పెను. అంత సుమంత్రుఁ

డును లక్ష్మణుఁడును 'సరి'యని చెప్పి గుహుగారచెట్టుయొక్క చేరువకు రథమును దోలిరి. వెంటనే రాముఁడును సీతాలక్ష్మణులతోడ రథము నుండి దిగి, యా రమ్యస్థలియైన గారచెట్టు క్రింద విడిసెను. సుమంత్రుఁడును తేరినుండి దిగి, మేటిగుఱ్ఱములను విప్పి, దాఁపునఁ గట్టివేసి, చెట్టు క్రిందఁ గూర్చుండియున్న రాముని సన్నిధానమునఁ జేతులు జోడించి కొని యుండెను.

అప్పు డచ్చట గుహుఁడనెడి బోయరా జొకఁడుండెను. ఆతఁడు రామునికిఁ బ్రాణస్నేహితుఁడు. బలవంతుఁడు స్థపతియని ప్రసిద్ధిగనిన వాఁడు. ఆ గుహుఁడు పురుషోత్తముఁడగు రాముఁడు తన దేశమునకు వచ్చియున్నాఁడని విని, పెద్దలతోను, మంత్రులతోను, దన కులము వారితోను గూడి యతని నెదురొనఁగా, నప్పుడు రాముఁడు దూర మునసే వచ్చెడు గుహునిం జూచి, లక్ష్మణునితోఁగూడ నాతనిఁగలిసి కొనెను. గుహుఁడును దుఃఖితుఁడై రాముని గౌఁగిలించి, "యో రామా! నీ కయోధ్య యెట్లో యట్లే యిదియును నని తలఁచుకొనుము. నీ కేమి చేయుదును? ఓ మహాభాహూ! నీబోటి ప్రియుఁడగు నతిథి యెవ్వనికి దొఱకును" అని చెప్పి షడ్రసోపేతమయి రుచికరమయి నానావిధములయిన భక్ష్యభోజ్యములతోఁగూడిన యన్నమును తెప్పించి, యర్ఘ్యాదిపూజాద్రవ్యములను సిద్ధపఱచి, రాము నుద్దేశించి, 'యో దీర్ఘబాహూఁడా! నీకు స్వాగతము. ఈ భూమండలమెల్ల నీయది. మేము నీకుఁ గింకరులము. నీవు భర్తవు. నీవు మారాజ్యమును స్వేచ్ఛగా నేలుము. ఇదిగో భక్ష్య, భోజ్య, పేయ, లేహ్యములును, మేటిపాన్పులును, గుఱ్ఱములకు మేఁతయును సిద్ధముగా నున్నవి. వీని ననుగ్రహించి, భక్ష్యభోజ్యములతోఁగూడిన యన్నమును భుజించి సుఖకరములగు పాన్పులపైఁ బరుండుము. గుఱ్ఱములకును తీని వేయుం పుము." అని యివ్విధమునఁ జెప్పుచుండు గుహునిఁజూచి, "గుహా! నీవు రాజవై యుండియుఁ గాలినడకతో వచ్చుటచేతను, చెలిమిఁ జూపిం చుటచేతను, మేము పూజింపఁబడితిమి. సకలవిధములుగా మేము సంత సించితిమి" అని చెప్పి, బలిసిన తన బాహువులతో నాతనిని గట్టిగాఁ గౌఁగిలించికొని, యిట్లనియె. "ఓ గుహా! నీకును, నీ బంధువులకును

దైవానుగ్రహములచన నారోగ్యమేకదా. నీయొక్క రాజ్యమున క్షేమమేకదా! నీ స్నేహితులండఱు సేమముగా నున్నారుగదా! నీకు సకలవస్తువులందును కొఱతలేక యున్నదిగదా! నీ విప్పుడు నాకుఁ బ్రీతితోఁ దెచ్చిపెట్టిన వానినన్నింటిని అంగీకరించితిని. కాని నేను వాని నిప్పుడు గైకొను స్థితియందు లేను. నేను దర్భలను, నారబట్టలను, కృష్ణాజినములను దాల్చి, పండ్లను దుంపలను దినుచు, స్వధర్మాచరణము నందు హెచ్చరికగలవాఁడనై యడవులలోనుఁ దిరుగుచు, మునినై యుండఁ బోయెదను. ఇప్పుడీ గుఱ్ఱములకుఁ దీనిమాత్రము కావలయును. అదిమాత్రము చాలును. దానిచే నీవు నన్నన్ని విధములచేఁ బూజించినట్లగును. ఈ గుఱ్ఱములు మాతండ్రియగు దశరథన్నృపాలునకు మిక్కిలి ప్రీతికరములు. వీనికిఁ దగిన తీని చేసి వీనిని తనివినొందించినయొడల, దానిచే నేను జక్కఁగాఁ బూజింపఁబడినవాఁడ నయ్యెదను"అనిచెప్పఁగా గుహుఁడచ్చటినుండియే పనివారింబిలిచి, యీగుఱ్ఱములకు వేగిరంబుగ నీరువెట్టించి తీని వేయింపుఁడని యానతియొసఁగెను. అంత రాముఁడు నారబట్టయే యుత్తరవస్త్రముగా వేసికొని, సాయంకాలిక సంధ్యావందనము నాచరించి, లక్ష్మణుఁడు తెచ్చియిచ్చిన గంగోదకమును మాత్రమె త్రాగెను. భార్యతోడ నేలపై పరుండియున్న రాముని పాదములు కడిగి లక్ష్మణుఁడు తానును గారచెట్టుకడకు వచ్చిచేరెను. గుహుఁడును సుమంత్రునితోఁగూడి లక్ష్మణునితో మాటలాడుచు, విల్లుచేతఁబట్టి, మెలఁకువతో రామునికడ మేలుకొనియుండెను. అంతట మహాబలవంతుఁడును, కీర్తిమంతుఁడును బుద్ధిమంతుఁడును దుఃఖము నెఱుఁగని వాఁడును, సౌఖ్యములకుఁ దగినవాఁడును నైన దశరథ పుత్రుఁడగు రాముఁ డట్లు నిద్రింపఁగా, నా రేయి యాలస్యముగా దాఁటినట్లుండెను.

51-వ సర్గము.

గుహుఁడు లక్ష్మణునితో సంభాషించుట

గుహుఁడు, నిష్కపటముగాఁ దన యన్న యొక్క కాఁపుదల నిమిత్తమై నిద్రమేల్కొనియున్న లక్ష్మణునిఁ జూచి, మిగుల సంతాపముతో "ఓ లక్ష్మణా! నాయనా, యీ పాన్పు నీ నిమిత్తము పఱుపఁబడినది. రాజపుత్రా! యీ పాన్పునందుఁ జక్కఁగాఁ బరుండి యలసట

దీర్చికొనుము. వనవాసులమగు మేము సకలశ్రమముల ననుభవింపఁదగు దుము. నీవు సౌఖ్యముల ననుభవింపఁ దగినవాఁడవు. నీవు పాన్పునఁ బరుండి నిద్రింపుము. రాముని రక్షణమునిమిత్తమై మేము రాత్రియెల్ల మేలొక్కనియుండెదము. నాకు రామునికంటె మించిన చెలికాఁ డీ భూలోకమున లేఁడు. నాసత్యము సాక్షిగా నొట్టిడి చెప్పెదను. ఇది నిజముగాఁ బలికితినని నమ్ముము. నేను నా యనుఁగుఁజెలిఁకాఁడయిన యీ రాముని యనుగ్రహమునఁజేసియు మిక్కిలివిస్తారమయిన కీర్తిని, విశేషమయిన ధర్మమును, ఎక్కువ ధనమును బొందఁ గోరుచున్నాను. అట్టి నేను విల్లు చేతఁబట్టి, నా బంధువుల నందఱను దోడుచేసికొని, సీతతోఁగూడ శయనించియుండు నాయనుఁగుఁ జెలికాఁడయిన రాముని గాపాడఁగలను. నే నెల్లప్పు డీ వనమునకుఁ దిరుగువాఁడనగుటచే నే నెఱుఁగనిది యిచ్చట నొక్కటియు లేదు. గొప్పదయిన చతురంగ బలముతో నెవరైన నెత్తి వచ్చినను, మేము వారి నోర్వఁగలము" అని లక్ష్మణునితోఁ జెప్పెను.

అప్పుడు లక్ష్మణుఁడు గుహుని పలుకులు విని, గుహుని జూచి, "పాపరహితుఁడవైన యో గుహుఁడా! నీ వెల్లప్పుడు సత్కార్యము నందే పట్టుదల గలవాఁడవు. నీ యొక్క కాఁపుదలవలన మేమందఱము నిర్భయులముగా నున్నవారము. అయినను దశరథపుత్రుఁడైన రాముఁడు సీతతోఁగూడి యుత్తనేలపైఁ బరుండునప్పుడు, నా కెట్లు నిద్రవచ్చును? సుఖమెక్కడిది? తుదకుఁ బ్రాణములైన నెట్లు నిల్చును? యుద్ధరంగమున దేవదానవులందఱు గూడి నచ్చిననను, వీ రాముని పరాక్రమమునకు నోర్వఁజాలరో, అట్టి రాముఁడు పచ్చికపై సుఖముగా సీతతోఁగూడి యెట్లు నిద్రించుచున్నాఁడో, చూడుము. దశరథుఁ డనేకమంత్రములు జపించి, గొప్ప తపస్సుచేసి, నానావిధములగు కష్ట ములకోర్చి, పడసిన ప్రియపుత్రుఁడయిన రాముఁడు తండ్రి గుణముల కీడయిన గుణములు గలవాఁడు. ఇట్టి తన కుమారుని నడవికిఁ బంపి చాలకాలము జీవింపఁజాలఁడు. కావున శీఘ్రముననే యీభూమి విధవ యగును. అప్పు డంతఃపుర కాంత లందఱు పెద్ద గొంతెత్తియేడ్చి,యల సటచే నూరకుందురు. అప్పుడు రాచనగరు రొదమాని, నిశ్శబ్దముగా

నుండఁగలదని తలఁచెదను. కౌసల్యయు, నృపాలుఁడును, నన్నే మాతల్లియు జీవించియుందురేని యీరాత్రిమాత్రమే యని తలఁచెదను. నా తల్లి సుమిత్ర శత్రుఘ్ను నిమిత్తమాత్రముతో జీవించి యుండవచ్చును. కాని వీరుని గన్నతల్లియగు కౌసల్య జీవింపదు. ఈ దుఃఖము నన్ను మిక్కిలి పీడించుచున్నది. రాజుపై నెక్కువ ప్రేమగల జనులుగలదియు, సౌఖ్యమునకుఁ దావలమైనదియు లోకమునకుఁ బ్రియమును గలిగించునదియునగు నయోధ్యాపురముగూడ రాజులేని వ్యసనముచేఁ బాడువడును. మహాత్ముఁడగు దశరథుఁడు ప్రియుఁడైన గొప్పబుద్ధిగల తనదు పెద్దకొడుకును జూడక యెట్లు ప్రాణములతో నుండఁజాలును? కావున నృపాలుఁడును తప్పక మృతి నొందును. రాజు మృతినొందిన వెంటనే కౌసల్య చెల్లుకొనును. ఆ వెంబడే నా తల్లియు నశించును. కడచినది కడచినదియే. అది వేఱువిధముగా జరుగదు. మా తండ్రి రామునికిఁ బట్టాభిషేక మొనర్చి చూడవలెనను కోరిక గలవాఁడై యుండెను. ఆతఁడు తనకోరికయగు రామపట్టాభిషేకమును గావింపకయే మృతి నొందఁగలఁడు. అట్టి సమయము వచ్చినయెడల, ధన్యులయినహారు దగ్గఱనుండి, లోకాంతరమునొందిన మా తండ్రికిఁ బ్రేతకృత్యములు నిర్వర్తింపఁగలరు. అందములైన ముంగిళ్ళతీరుగలదియుఁ, జక్కఁగాఁ దీర్చిన పెద్ద వీథులుగలదియు, గొప్ప ధనికుల యిండ్లతోను, రాజనగరులతోనుఁ గూడినదియు, అందక త్తెలగు నాటచేడియలచే వెలయుచున్నదియు, వీనుఁగులతోడను, గుట్టములతోడను, తేరులతోడను గ్రిక్కిరిసియుండునదియు, వాద్యముల ధ్వనులచే మ్రోగింపఁబడినదియు, సకల శుభములతోఁ గూడినదియు, సంతోషము సమృద్ధిగల జనులచే నెడతెరిపిలేకయుండునదియు, ఉపవనములతోను ఉద్యానములతోను గూడినదియు, జనులందఱుం గలిసి చేయునుత్సవములచేతఁ బ్రకాశించునదియునైన నా తండ్రియొక్క రాజధానియగు నయోధ్యయందు సుఖపురుషు లుండఁగలరు. దశరథుఁడు బ్రతికియుండునా? వనవాసము సమాప్తిగావించి మేమువచ్చి, నియమవంతుఁడైన మా తండ్రినిజూతుమా? ఈతఁడు వనవాసము ముగించి మఱలి వచ్చునప్పటికి క్షేమముతో నున్న సత్యసంధుఁడైన మా తండ్రిగారితోఁ



శ్రీరాముఁడు గంగానదిని దాఁటుట. 195-పుట.

గూడ నయోధ్యను బ్రవేశింతుమా?" అని యివ్విధమున లక్ష్మణుఁడు గుహునితోఁ దన మనోదుఃఖమును దలపోసికొనుచు మేల్కొని నిలఁ బడియుండఁగా, నా రేయి గడచెను. ప్రజలమేలు కోరెడి నరేంద్ర పుత్రుఁడయిన లక్ష్మణుఁడు దన యన్నయందలి ప్రేమచే నవ్విధమున యథార్థమును జెప్పుచుండఁగా, గుహుఁడును లక్ష్మణుని మాటలచే మిక్కిలి విచారము నొందినవాఁడై, జ్వరముతోఁ బాధపడుచున్న వేనుఁగునలె దుఃఖముతోఁ బాధ నొందినవాఁడయ్యెను.

52-వ సర్గము.

రాముఁడు గంగానదినిదాఁటి వత్సదేశములకుఁ జేరుట

ఆ రేయిగడచి తెల్లవాఱఁగా, విశాలమయిన తొమ్మిగల వాఁడును కీర్తిమంతుఁడునైన రాముఁడు శుభలక్షణములుగల లక్ష్మణునిఁ జూచి, "నాయనా! యిది సూర్యోదయకాలము. పూజ్యమయిన నిశ గడచినది. ఇదిగో యిచ్చట మిక్కిలి నల్లని యొక కోయిల కూయుచున్నది. వనమునఁ గూయుచుండు నెనుళ్ళకూఁతలు వినఁబడుచున్నవి. ఓ సాధువా! వేగముగాఁ బ్రవహించునదియు సముద్రగామియునగు గంగానదిని దాఁటుదము" అని చెప్పెను. మిత్రులకు సంతోషమును గలిగించు లక్ష్మణుఁడు రాముని యభిప్రాయమెఱిఁగి, గుహుని, సారథిని బిలిచికొనివచ్చి తన యన్నగొదుట నిలఁబడెను. ఆ గుహుఁడును, రాముని పలుకులు విని, యా మాటలకొప్పుకొని, వెంటనే తన మంత్రులను బిలిచి, "ఓ మంత్రులారా! రాముని నిమిత్తమయి గట్టిదియు, నందమైనదియు, సులభముగా దాఁటఁగూడినదియునైన యొక నావను సిద్ధపఱచి,దానికి వలయు సాధనములతో దానికొక పడవవాని నేర్పఱిచి, రేవునందు వేగముగ నిల్పుము" అని యానతిచ్చెను. వెంటనే గుహుని మంత్రులంద ఱా యానతినివిని, యొక సొగసునావను రేవుకడకుఁ దెప్పించిపెట్టి, గుహున కా సంగతిఁ దెలిపిరి.

అంతట గుహుఁడు లేచి చేతులు జోడించికొని నిలఁబడి, "ఓ ప్రభూ! యిదిగో నావ సిద్ధమయినది. ఇఁక నేమి యానతిత్తురో దాని జేసెదను. పురుషోత్తమా! దేవకుమారసదృశా! మంచి నియమముగల వాఁడా! యీ నావ నీ సాగరగామినియగు గంగానదిని దాఁటు నిమి

త్తము దెప్పించితిని. తా మెక్కి కూర్చుండుఁడు" అనిచెప్పెను. అంతట రాముఁడును గుహుని జూచి, "నీవలన నాకోరికతీరినది. మన్ములను ద్వారలో నెక్కించుము" అని చెప్పి, తానును, లక్ష్మణుఁడు నమ్ముల పొదులను గట్టికొని, కత్తులు నడుమునఁగట్టుకొని, విండ్లనుబట్టి సీతను దోడ్కొని, గంగానదియొడ్డునకుఁ బోవు దారిని బయనమైరి. అంతట సారథియగు సుమంత్రుఁడు కృతాంజలియై ధర్మజ్ఞుఁడయిన రామునికడ కేఁగుదెంచి, మిక్కిలి యడఁకువతో "మహాప్రభూ! నా కాజ్ఞ యేమి?" అని యడిగెను. అంత రాముఁడు శ్రేష్ఠమైన తనకుడిచేతితో నతనినిదడవి "సారథీ! వెంటనే మఱలి తండ్రికడ కేఁగుము. నృపాలుని సమీపమున జాగ్రత్తతో నుండుము. నీ వింతదూరము నన్నుఁ దోడ్కొనివచ్చి విడచితివి. ఇఁక రథముమాని, కాలినడతో నడవులందు సంచరించెదము. నీవు మఱలి యూరికిఁ బొమ్ము" అనెను. సారథియు, రాముఁడు దన్ను మఱలి పట్టణమునకుఁ బొమ్మని నెల వొసంగుటఁ జూచి, పురుషోత్తముఁ డగు నిక్ష్వాకునందను నుద్దేశించి యిట్లనియె. "పురుషోత్తమా! నీవు తమ్ముని తోను భార్యతోను దరిద్రునివలె నడవిలోఁ దిరుగు నవస్థ నెవ్వఁడును దప్పింపఁజాలకున్నాఁడుగదా! నీయొక్క కష్టము చూడఁగా, బ్రహ్మచర్యము, వేదాధ్యయనము, మెత్తన, కపటములేమి మున్నగు గుణములవలన ఫలము లేదనితలఁతును. వీరుఁడా! నీవు సీతాలక్ష్మణులతో మాత్రము గూడివనమునన్నను, ముల్లోకముల గెలుచునట్లుత్తమగతి నొందుదువు. ఓరామా! మమ్ము దైవము వంచించెను. నీవును మోస పుచ్చితివి. ఇఁక మేము దుఃఖపడుచుఁ బాపాత్ములకు నైకేయివశమున నుండఁగలవారము" అని చెప్పుచు సుమంత్రుఁ డప్పటప్పటికి దూరమగు చుండు రామునిఁ జూచి, దుఃఖపీడితుఁడై చాలసేపు బిగ్గఅగా నేడ్చెను. అట్లు విలపించి, కన్నీరు కడిగికొని యాచమనముచేసి, పరిశుద్ధుఁడయి యున్న సారథినిజూచి, "యో సుమంత్రా! యిక్ష్వాకువంశస్థులకు నీబోఁటి చెలికాఁడు మఱొక్కఁడు లేఁడు. కావున దశరథుఁ డెట్లు నన్నుఁ గూర్చి వ్యసనము నొందకుండునో, అట్లు నీ వొనరించుచుండవలయును. నృపాలుఁడు దుఃఖముచేఁ గొట్టువడిన మనసుగలవాఁడు, ముసలివాఁడు, మీఁదుమిక్కిలి కామాతిశయముచేఁ బీడింపఁబడియున్నవాఁడు. కావున

నీ మాటను జెప్పితిని. మహాబలిష్ఠుఁడగు దశరథనృపాలుఁడు కైకేయి మనోరథమును నెఱపుటకై యీనతిచ్చుదాని నంతయు నీవు మాత్రా డక చేసి తీరవలయును. రాజులు తమకుఁ దోఁచిన కార్యములు నిర్విఘ్ను ముగా జరుగునిమిత్తమేకదా రాజ్యములను బాలింతురు! సుమంత్రా! మహారాజేది యొట్లు చేయుమని చెప్పునో, యీయన కసత్యదోషము వాటిల్లకుండునట్లు, దుఃఖముచే నొవ్వకుండునట్లును ఆయన చెప్పిన పనిని నీయన చెప్పినప్రకారమే చేయుచుండుము. దుఃఖ మునఁగ నెట్టిదో యొఱుఁగనివాఁడు, పెద్ద, పూజ్యుఁడు, జితేంద్రియుఁడునైన దశ రథనృపాలునికి నీవు నామాఱుగా నమస్కరించి, వెంటనే యీ మాటను నేఁ జెప్పినట్లుగఁ జెప్పుము. "మహారాజా! నేను కాని, లక్ష్మణుఁడు కాని సీతగాని, మేము మువ్వురము నొకప్పుడయినను అయోధ్యాపురమును విడిచి వచ్చితిమయనికాని అరణ్యమున నుండవలసివచ్చెనని కాని, దుఃఖ మొందుట లేదు. పదునాలుగేండ్లు నిండఁగా వెంటనే మఱలివచ్చి మమ్ము మున్నుపసు జూడఁగలరు. ఈ ప్రకారమే మాతల్లితోను, అచ్చటఁ గూడియున్న తక్కిన రాజపత్నులతోను జెప్పుము. కైకేయితో మాటిమాటికి నీ సంగతిఁ జెప్పుము. తరువాత మా తల్లియగు కౌస ల్యతో సీతయు, లక్ష్మణుఁడు, నేనును జెప్పుమన్నట్లుగా మా క్షేమము లను, పిదప మా నమస్కారములను జెప్పుము. మహారాజుతో విన్నవించి యీనతిఁ గైకొని భరతుని శీఘ్రముగాఁ దోడ్కొనిరమ్ము. భరతుఁడును వచ్చినతర్వాత నృపాలుని యభిమతముఁ గనుఁగొని, యీతనికిఁ బట్టాభి షేకము గావింపవలయును. అట్లు నీవు భరతునకి యువరాజపట్టముఁ గట్టి, యీతని నాలింగనము చేసికొంటివేని, వియోగమువలని దుఃఖము నిన్నేమియుఁ జేయఁజాలదు. భరతునికిఁగూడ "ఓ భరతా! నీవు తండ్రి విషయమున నెట్లు వర్తింతువో యట్లే తల్లు లందఱి విషయమునను నేకరీతి నుండుము. పక్షపాతము నెంచకుము. నీకుఁ గైకేయి యొట్టిదో, సుమిత్ర యట్టిద. కౌసల్యయునట్టిద. కావున నీవు వారికి మువ్వురికిని భేదము లేక యేకవిధమందిన గౌరవమును జూపుము. తండ్రియొక్క మనోరథము ప్రకారము నడపుటకై నీవు యీవరాజ్యముఁ బొందుదువు కావున నీ వివాహపరములకు రెంటికిని నుపయుక్తమగు సుఖమును

బెంపొందించుకొనఁగలవు" అని చెప్పుమని రాముఁడు సుమంత్రునితోఁ జెప్పెను.

ఇట్లు సుమంత్రుఁడు రామునిచే మఱలింపఁబడుఁచు, దుఃఖ పీడితుఁడై యా రాముఁడు నెప్పిన పలుకులనెల్ల నాలకించి, రాముని గూర్చి స్నేహముతో నిట్లనియె. "ఓ రాఘవా! నే ననురాగముచే భయమువదలి, యేమాట చెప్పుచున్నానో, యది యుపచారార్థముగాఁ జెప్పునదికాదు. భక్తితో మనఃపూర్వకముగఁ జెప్పునది. అట్టిమాటలను నీవు "ఇతఁడు భక్తుఁ"డనియెంచి నన్ను మన్నింపనలెను. "రాజపుత్రా! నీ వియోగముచేఁ బుత్రశోకముచేతనుఁబోలె వగచుచున్న యయోధ్యా పురమునకు నేను నిన్నిక్కడ విడిచి యెట్లు పోవుదును? అప్పుడు జను లందఱు రాముని తోఁగూడిన రథమునుజూచిరి. రాముఁడు లేని రథము నిప్పుడు చూచిన నాపట్టణములలో జనులగుండె లవియునే కదా! ఈయుత్తరమును జూచినంతనే, యుద్ధమున వీరుఁడయిననాయకుఁడు మరణింపఁగా సారథి తోలుకొనివచ్చు శూన్యరథమును చూచినసైన్యము వలె నయోధ్యాపురము మిగుల దైన్యము నొందఁగలదు. జనులు, నీవు దవ్వుననున్నను, మనము ఎదుట నున్నట్లే భావించి, నిన్నే ధ్యానించుచు నాహారముఁ గానకుందురు. రామా! నీ వడవికి వచ్చునప్పుడు, నీ వియోగదుఃఖము నొచ్చిన మనసులు గలజనుల క్షోభమును నీవు కన్నులారఁ జూచి యున్నావుగదా! నిన్నుఁ గొనిపోవునాఁడు పుట్టినజనుల యార్తనాద మిప్పుడు రథమున నొంటరినైయున్న నన్నుఁ జూడఁగనే మునుపటికంటె నూఱింతలెక్కువకాఁగలదు. మఱియు నీ తల్లిగారిని జూచి, "నీకొమారుని నేను మేనమామయింట విడిచివచ్చితిని. నీవువ్యసన పడనక్కఱలేదు" అని చెప్పుదునా? ఈమాట ప్రియమైనను నసత్యము గానఁ జెప్పుట కెట్లిష్టపడును? లేక, "నీ కొడుకును వనమున విడిచి వచ్చితి" నని చెప్పుట నిజమైనను, అప్రియమైనమాట నే నెట్లు చెప్పుదును? ఎట్లు చెప్పుటకును లేకయున్నది. నేనేమి చేయుదును? నిన్నును నీ బంధువులగు సీతాలక్ష్మణులను వహించికొనివచ్చిన యీ గుఱ్ఱములు నా కొక్కనికే లోఁబడును. అవి నీవులేని రథమును మోయలించి యెట్లీడ్చుకొని పోవఁగలవు? కావున, ఓ పాపరహితుఁడా! నిన్నువిడిచి,

నే నయోధ్యకుఁ బోఁజాలను. నీతోడ వనవాసము సేయ నెలవిమ్ము. నే నిన్ని తెఱంగుల యాచించినను, నన్ను విడిచిపోదువేని, నే నిక్కడనే రథముతోఁగూడ నగ్నియందుఁ బడెదను. లేక నన్నుఁ గూడఁ దీసికొని పోదువేని, నీ తపమునకు విఘ్నకరములగు మృగముల నీ రథము నెక్కి పోయి చంపెదను. నీ యనుగ్రహమున రథము దోలి, రథమునఁ గూర్చుండు సుఖము ననుభవించితిని. ఇప్పుడును నీ యనుగ్రహమున వనవాస సౌఖ్యము ననుభవించెదను. ఓ రాముఁడా! నేను నడవిలో నీతోడనుండఁ గోరుచున్నాను. అనుగ్రహింపుము, ప్రీతితో నాచెంత నుండుమని చెప్పాము. ఓ శూరుఁడా! యీ గుట్టిములును వనము నుండి నీకుఁ బరిచర్యచేసి యుత్తమగతి నొందఁగలవు. రామా! వనమున నివసించుచు, నీ వాజ్ఞయిచ్చిన కార్యమును శిరసావహించి చేసెదను. ఎల్లవిధముల నయోధ్యకుఁబోను. స్వర్గమునకైనను బోను. పాపాత్ముఁడు స్వర్గలోకమునకుఁ బోఁజాలనట్లు, నిన్ను విడిచి యయోధ్యాపురమునకుఁ బోఁజాలను. వనవాసము ముగిసినపిదప నీరథమునన్నే మిన్నుఁ గూర్చుండఁ బెట్టికొని మఱల యయోధ్యకుఁగొనిపోయెదను. ఇదియేనామనోరథము నేను నీతోడ నరణ్యమున నుంటినేని, నాకీ పదునాలుగేండ్లును నొక క్షణమువలె గడచును. అట్లుకాకున్నచో నీ పదునాలుగేండ్లే నూఱేండ్లుగాఁ దోఁచును. పరిచారకులందుఁ బ్రేమగల యో నృపాలా! నేను భృత్యుఁడను భక్తుఁడను, మర్యాద దప్పనివాఁడను. ప్రభుపుత్రుఁడవయిన నీదారిలోఁ బోఁదలఁచుచున్నాను. ఇట్టి నన్నుఁబాసి పోవుట తగదు." అని యివ్విధమునఁ బలుతెఱఁగుల మాటిమాటికిఁ బ్రార్థించు చున్న సుమంత్రునిఁ జూచి, సేవకులందు వాత్సల్యముగల రాముఁ డిట్లనియెను. ప్రభుభక్తిగల యో సుమంత్రా! నీకు నాయెడఁగల యత్యంత భక్తిని నే నెఱుఁగుదును. అయినను, ఓ సారథీ! నేను నిన్నేల పత్తనమునకుఁ బంపుచున్నానో చెప్పెదనువినుము. నా సవతితల్లియగు నైకేయి యయోధ్యకు మఱలివచ్చిన నిన్నుఁజూచి, రాముఁడు కానల కేఁగెనని మనమున నమ్మికఁ బొందును. నా వనవాసమును విని, మనోరథ పరిపూరణముచే మిక్కిలి సంతసమొంది, ధర్మపథముఁదప్పని రాజును గూర్చి యతఁ డసత్యవాదియను సంశయము వదలును. నా కడఁ

గొట్టుతల్లియగు కైకేయి భరతుని న్యాయపరిపాలనముచేఁ జక్కఁగా వృద్ధినొందిన తన పుత్రుని రాజ్యమును బొందునను టయే నాకుఁ బ్రథానము. నీవు నా మనోరథసిద్ధికొఱకును, తండ్రి యొక్క సత్యవాక్యపరిపాలనరూపకార్యసిద్ధికొఱకును రథముఁ దోలు కొని పట్టణమునకుఁ బొమ్ము. నీతో నేయే సంగతుల నెవరికెవరి కెట్లు చెప్పితినో, వారికివారి కాయాసంగతుల నట్లట్లు చెప్పవలసినది" అని యిష్టప్రకారముగా సారథితోఁ జెప్పి, మాటిమాటికి నూఱడించి, ధైర్యవంతుఁడయిన రాముఁడు గుహునిగూర్చి, సకారణముగా నిట్లనియె. "ఓగుహా! జనసంచారముగల యిట్టి వనమున నుండుట యోగ్యముగాదు. మునులు నివసించెడి తపోవనములం దుండవలయును. అందుకుఁ దగినవిధులను నిర్వర్తించుకొనవలయును. కాపున ఋషుల కిలంకారములగు వ్రతములనుబూని, తండ్రికిని, సీతాలక్ష్మణులకును హితముఁగోరి, జడలుదాల్చి యాశ్రమములకుఁ బోయెదను. మజ్జిపాలు తెమ్ము." అని రాముఁ డానతీఁగా, గుహుఁడు వేగిరముగా రాజపుత్రుఁడగు రామునకు మజ్జిపాలు తెచ్చి యిచ్చెను. రాముఁ డాపాలను గైకొని తాను జడలును దాల్చెను. లక్ష్మణుని జడలనుదాల్చునట్లు చేసెను. దీర్ఘబాహువైన పురుషోత్తముఁ డట్లు జడదారియాయెను. అప్పుడు నారబట్టలను గట్టుకొని జడలఁ గుంపులుదాల్చిన యా యన్నదమ్ములగు రామలక్ష్మణులు ఋషులపగిది వెలుఁగొందుచుండిరి. అంత రాముఁడు లక్ష్మణసమేతుఁడై వైఖానసవ్రతము నవలంబించి, నియమము లవలంబించిన మాఁడై చెలికాఁడగు గుహునిఁ జూచి, "ఓగుహా! సైన్యము, బొక్కసము, దుర్గము, దేశమునను వాటియందు జాగ్రత్తగలిగియుండుము. వీలయిన, రాజ్యపరిపాలనము మిక్కిలి గడుసైనదికదా!" అనిచెప్పి, గుహుని వీడ్కొని సీతాలక్ష్మణసమేతుఁడై ధైర్యముతోఁ బెడలెను. అంత గంగానదితీరమున నిక్ష్వాకువంశనందనుఁడైన రాముఁడు, వేగముగాఁ బోతెడు గంగానదిని దాఁటఁగోరి, నదియొడ్డుననున్న నావనుజూచి. లక్ష్మణుని వైపునకుఁ దిరిగి, "నరశ్రేష్ఠుఁడా! యీ నిలిచియుండు నావయందు మెల్లఁగానెక్కి కూర్చుండుము. మంచి మనస్సుగలసీతను వెనుకనుండి బట్టికొని యెక్కింపుము" అనెను. తర్వాత లక్ష్మణుఁ డన్నమాట ద్రోసి

వేయక, ముందుగా సీత నెక్కించి, పిదపఁ దానెక్కి కూర్చుండెను. అటు తర్వాత శూరుఁడైన రాముఁడును ఎక్కి కూర్చుండెను. అంతట నిషా దుల కధిపతియగు గుహుఁడు నావను నడపుఁడని తన బంధువులను బురి కొల్పెను. మహా తేజస్వియైన రాముఁడును నావయెక్కి, బ్రాహ్మణ క్షత్రి యులకు యోగ్యమయి, తన కితవుచేయు "దైవీం నావం" అనుమంత్ర మును జపించి, పిదప నాచమనముసేసి, సీతతోఁగూడ నాగంగానదికి మ్రొక్కెను. సంతసముచే సుప్పొంగిన విశేషకాంతిగల లక్ష్మణుఁడును గంగాదేవికి మ్రొక్కెను. రాముఁడును, సుమంత్రుని, గుహుని, వాని నేనలను వీడ్కొని, యోడనడపువారితో నిక నోడను గదలనిండని చెప్పెను. వారు విశేషశ్రద్ధతో, మంచితెడ్డతోఁ ద్రోయుచున్నందున, నావ వేగముగా నావలిగట్టునకుఁ బోయిచేరెను. సీతాదేవియు నడిమి యేటికి వచ్చిన పిదపఁ జేతులుజోడించి, యానది నుద్దేశించి, "ఓగంగా దేవీ! యీ యార్యపుత్రుఁడును ధీరుంతుఁడును నయిన మహాబలుఁడగు దశరథుని యాజ్ఞను శిరసావహించి, నీచే రక్షింపఁబడి, పూర్తిగాఁ బదు నాలుగు సంవత్సరము లరణ్యమునఁ గడపి, మఱలి నాతోడను లక్ష్మ ణునితోడను మఱలివచ్చును. ఓ పూజ్యరాలా! అప్పుడు నేనును నేమ ముతోవచ్చి, యన్ని కోర్కులను బొందినదాననై మహానందముతో నీకుఁ బూజ లొసరించెదను. నీవు స్వర్గాదులగు ముల్లోకములందును నడి లేకుండ సంచరించుదానవు. బ్రహ్మలోకమును జూడగలవు. సముద్రరాజు నకుఁ బట్టివి. కావున నీ లోకమున మాకందఱకు దర్శనము నొసఁగు చున్నావు. దేవీ! నీకు మ్రొక్కెదను; స్తోత్రములు చేసెదను. ఓతల్లీ, నీ ప్రీతికై, నరోత్తముఁడయిన రాముఁడు మఱలి క్షేమముతో వచ్చిన తర్వాత లక్షగోవులను, వస్త్రములను బ్రాహ్మణుల కొసఁగెదను. విస్తా రముగా మృదుమధురమగు నన్నప్రదానము సేయుదును. వేయికుండల మద్యముచేతను, మాంసమిశ్రమయిన యన్నముచేతను నిన్నుఁ బూజిం తును. నీ గట్టున నున్న సకల దేవతలును, సకలతీర్థములను, సకల దేవా లయములను, నా కిగపనడివాటి నన్నిటినిబూజించెదను. ఓపాపరహితు రాలా! పాపరహితుఁడయిన మహాభాగ్యవగు రాముఁడు వనవాసము ముగించి నాతోడను, లక్ష్మణునితోడనుగూడి, మఱలిసౌఖ్యముగా

నయోధ్యాప్తనమునకు వచ్చిచేరును గాక!" యని యివ్విధమునఁ బలుకుచు, నేర్పరియును ఉత్తములాలును నయిన సీత యివ్విధమున గంగాదేవిని బ్రార్థించుచు, గంగానదియొక్క దక్షిణపుగట్టునకు వేగిరమె వచ్చిచేరెను. శత్రువులనొప్పించు నరోత్తముఁడగు రాముఁడొడ్డుచేరి, సీత తోనులక్ష్మణునితోడను నావనుండి దిగి, యడవులకుఁ బయనమై, లక్ష్మణుని జూచి, "లక్ష్మణా! జనులుండు ప్రదేశమునఁగాని జనులు లేనట్టి ప్రదేశమునగాని నీవు మమ్ముఁ గాపాడుచుండుము. విశేషముగా నిర్జనవనమునఁ దప్పక మారక్షణమున శ్రద్ధవహింపుము. సౌమిత్రీ! నీవు ముందు పొమ్ము. సీత నీవెంబడి వచ్చును. నేను నిన్నును సీతను గాపాడుచుఁ గడపట వచ్చెదను. పురుషశ్రేష్ఠా! మన మొండొరుల మివ్విధమునఁ గాపాడుకొనవలయును. ఏ పనియైనను జరిగిపోయినది సవరించుట వీలు గాదు. కావునఁ గార్యము చెడకుండునట్లు చూచుకొనవలయును. ఇప్పుడు సీత యరణ్యవాసమువలని శ్రమ మిట్టిదని తెలియఁగలదు. జన సంచారము లేనిదియుఁ, బంట పొలములు, ఉద్యానములు లేనిదియు, మిట్టపల్లములు గలయడవిని బ్రవేశించి యచ్చటఁ గష్టము లనుభవించును. కావున జాగ్రతతో నీవు ముందు నడువుము"అని చెప్పెను. లక్ష్మణుఁడును రాముని పలుకులువిని, తాను ముందుగాఁబోయెను. సీతయాతని వెంబడించెను. రఘునందనుఁడయిన రాముఁడు సీత వెంబడిఁ బోయెను. సుమంత్రుఁడును రాముఁ డవతలిగట్టుచేరి, తన కంటికిఁ గనఁబడునంత వఱకుఁ జూచుచుండి, చాలదూరము పోవుటచే దృష్టికిఁ గనఁబడనందున జూపుమఱల్చి, సంతసము మాని, మనోవ్యథచేఁ బీడితుఁడగుచుఁ గన్నీరు విడిచెను. లోకపాలురంబోలు సమర్థుఁడగు వరదుఁడైన రాముఁడు మహావిశాలమైనగంగానదినిదాఁటి, పైరుపచ్చలతో సమృద్ధమయి కలకలలాడుచు నుబ్బొంగుచున్న వత్సదేశమును బ్రవేశించెను. అంతట రామలక్ష్మణు లాఁకలిగొన్నవారై, పందిని, మనుఁబోతును, దుప్పిని, నల్లచారల దుప్పిని జంపి పరిశుద్ధమైన వాని మాంసమును భుజించి, సాయంకాలమున నొకచెట్టుక్రిందికిఁ జేరిరి.

56-వ సర్గము.

రాముఁడు లక్ష్మణునితో మాటాడుచుండుట

అంత జనులను రఁజింపఁజేయువారిలో శ్రేష్ఠుఁడయిన రాముఁ డా వృక్షమూలమును బొంది, సాయంకాల సంధ్యోపందనము నేసి, లక్ష్మణునిఁ జూచి "లక్ష్మణా! మనము దేశము విడిచి వచ్చినవారము. ఇది మొదటిరాత్రి. సుమంత్రుఁడుగూడ మనలను విడిచిపోయినాఁడు. నీవు వ్యసనపడకుము. సీతయొక్క యోగక్షేమములు మన యధీనములు గనుక మనము రాత్రులందు జాగ్రత్తతో మేలుకొనియుండవలయును. ఆకులపాన్పు నిర్మింప నవకాశములేదు గనుక, లక్ష్మణా! యీరేయి యెట్లో యొక విధముగఁ గడపెదము. మనము నేకరించుకొనిన యాకు లను నేలపైఁ బఱచుకొని పరుండము" అని చెప్పి, యమూల్యమయిన పాన్పునఁ బరుండఁదగిన తాను, సుత్తనేలపైఁ బరుండి," లక్ష్మణునకుఁబుణ్య కథల నివ్విధమునఁ జెప్పుచుండెను. "లక్ష్మణా! మహారాజిప్పుడు గడు వ్యసనముతోఁ గూడఁ బరుండియుండఁగను. కైకేయియుఁ దన కోరిక సిద్ధిం చుటచే నుప్పొంగుచుండును. ఆ కైకేయి, భరతుఁడు వచ్చినం జూచి, రాజ్యలోభముచే మహారాజు ప్రాణములు దీయఁదుగదా! దశరథుఁడు నాథుఁడు లేనివాఁడు,ముదుసలి,ననున్నుఁబాసినవాఁడు, కామపరతంత్రుఁడు, కైకేయికి లోఁబడినవాఁడు. అట్టి యాతఁడేమి నేయఁగలఁడు? ఈ దుఃఖ మును నృపాలుని బుద్ధి విభ్రమమును జూడఁగా, అర్థధర్మములకంటెఁ గామమే గొప్పదియని నాకుఁ దోఁచెడిని. ఎంత తెలివిమాలినవాఁడయిననుఁ, ఆఁడుదాని నిమిత్తమై తన యభిప్రాయముచొప్పున నడచుననున్నుఁ బోలు కొమరుసి మన తండ్రివలె విడుచునా? కైకేయి పుత్రుఁడగు భరతుఁడు భార్యాసమేతుఁడై, సకలసంపదలతోఁ నిండిన కోసలదేశము లను పాలించుచు సుఖించునుగదా! తండ్రి ముసలివాఁడగుటచేతను, నే నరణ్యమున నుండుటచేతను, భరతుఁ డొక్కఁడే రాజ్యమునకు ముఖమువంటివాఁడు. అర్థ ధర్మములను విడిచి, యెవఁడు కామమును మాత్ర మవలంబించుచున్నాఁడో, వాఁడు దశరథనృపాలునిమాడ్కి వేగిరమే ముప్పునొందును. ఓ సాధువా! దశరథుని చేటుకొఱకును, నన్నడవికిఁ బంపుటకొఱకును, భరతునికి రాజ్య మిప్పించుటకొఱకును

నీ కైకేయి మనకుఁ దటస్థపడినది. ఈ కైకేయి తన మగఁడు తానెట్లు చెప్పినను వినునహంకారముచే మై మఱచినదై, నా నిమిత్తమై కౌసల్యా సుమిత్రల నిప్పుడు బాధింపకుండునా? లక్ష్మణా! నీవు నావెంబడి వచ్చుట నా నిమిత్తమై సుమిత్రాదేవియు నేల దుఃఖపడవలెను? నీవు వేఁకువను లేచి యిచ్చటనుండియె యయోధ్యాపురమునకుఁ బొమ్ము. నే నొక్కఁడనే సీతతోడ దండకావనములకుఁ బోయెదను. దిక్కులేనిదై యుండు కౌసల్యకుఁగూడ నీవు దిక్కుకాఁగలుగుదువు. కైకేయి నీచపుఁ బనులు చేయునది. ఆమె ద్వేషముగల్గించు పనినైనను, న్యాయవిరుద్ధమగు కార్యమునైనను జేయును. లక్ష్మణా! ధర్మజ్ఞుఁడయిన భరతునిపక్షమున నాతల్లి నప్పగింపుము. పూర్వజన్మమున నెప్పుడో మాతల్లి తల్లులకును గొడుకులకును నెడఁబాటు గలిగించినది. కావుననే యీ జన్మమున నామెకు నిట్టి పుత్రవియోగ దుఃఖము సంభవించినది. కౌసల్య నన్నుఁ జిన్ననాఁటినుండి శ్రమపడి ఉపవాసములుండి, నోములునోచి, యింతవాని నంతవానిని జేసినది. నేను పెద్దవాఁడనై, శుశ్రూషలుచేయు నప్పు డామె సుఖముగా నుండవలసినది. అట్టి యామెకు శుశ్రూష చేసెడి యదృష్టమునాకు లేకపోయెను. నాజన్మమేల? లక్ష్మణా! యెప్పుడును లోకమున నే యంగనయు నావంటి కుమారునిఁ బడయకుండునుగాక! నేను దల్లికిఁ దుదిలేని దుఃఖముఁ దెచ్చిపెట్టితినిగదా! ఇట్టి కొడుకు పుట్టిన నేమి? పుట్టకున్న నేమి? లక్ష్మణా! నాతల్లి గోరువంకపిట్ట నొకదానిని బెంచుచున్నదిగదా! ఆ గోరువంకపిట్ట, "చిలుకా! శత్రుపాదమును గొఱుకుము" అని చిలుకతోఁ జెప్పుచుండును. తిర్యగ్జాతియందుఁ బుట్టిన యాగోరువంకపిట్ట యెంత ప్రియముగ బలుకుచున్నది! మనుష్యుఁడనైన నాకంటె నదిగొప్పదికదా! శత్రుసంహారియగు లక్ష్మణా! నాతల్లి, నా వియోగముచే దుఃఖించుచుండును. ఆమె తనకు వేఱొక పుత్రుఁడు లేమిచే మిక్కిలి దుఃఖించుచుండును. అట్టియదృష్టహీనురాలయిననాతల్లికి నావలన నేమి ప్రయోజనము? దురదృష్టవంతురాలయిన నాతల్లియగు కౌసల్య, నాయొడఁబాటు వలనఁగలిగిన దుఃఖముచే మిక్కిలి నొచ్చినదై శోకమనుసముద్రమునఁ బడియుండును. లక్ష్మణా! నాకుఁ గోపమువచ్చె నేని, నే నొక్కఁడనే యయోధ్యాపురమును మాత్రమే కాక, భూమండ

లము నంతయును జయింపఁగలను, అయినను నాకిప్పుడు వీర్యముఁ జూపఁ దరుణముగాదు. లక్ష్మణా! తండ్రిమాట మీఱిన, ధర్మలోపమును, పరలోకమునకు హానియుఁ గలుగునని యెంచియే నేనిపుడు పట్టాభిషేకము సేసికొనినైతిని." అనియు, మఱియు ననేకసంగతులు మాటాడుచు, నిర్జనవనమున దుఃఖించి, కన్నులనిండ నీరుంచికొని, రాత్రియెల్ల నిద్దుర మాని కూరుచుండియుండెను. ఇవ్విధమున, విలపించి యూరకుండుటచే, మంటలేని యగ్నివలెను, అలలవేగములేని సముద్రమువలె నున్న రాముని లక్ష్మణుఁ డీక్రింది విధమున నూఱడించెను. "యుద్ధవీరులలో శ్రేష్ఠుఁడా! యిప్పు డయోధ్యాపురము నీ వరణ్యమునకు రాఁగాఁ జంద్రుఁడులేని రాత్రివలెఁ గాంతివఱిగియుండును. ఇయ్యది నిశ్చయము. నరోత్తముఁడవగు రామా! నీ విట్లు దుఃఖపడుట యుక్తముగాదు. నీవే యిట్లు దుఃఖపడిన, నాకును సీతకును ఖేదముగలుగకుండునా? నీటినుండి యెత్తి బయటవేయఁబడిన చేఁపలవలె నిన్ను విడిచి, నేనును, సీతయు నొక్కక్షణమయినను జీవింపలేము. శత్రుతాపనా! తండ్రినిజూడవలయు ననికాని, తమ్ముని జూడవలెననికాని, తల్లిని జూడవలయు ననికాని నాకుఁ గోరిక లేదు. తుదకు స్వర్గమునకైనను నిన్ను విడిచి నేఁ బోఁజాలను" అని యివ్విధమున లక్ష్మణుఁడు రాముని నూఱడించెను. అంతనచ్చట సుఖముగాఁ గూరుచుండియున్న ధర్మాసక్తులగు సీతారాములు దాపుననే మట్టిచెట్టుక్రింద లక్ష్మణునిచేఁ జక్కఁగాఁ బఱుపఁబడిన పాన్పును దిలకించి, దానిపైఁబరుండిరి. ఇట్లు శత్రుసంహారియగు రాముఁడును లక్ష్మణుఁడు సెప్పిన యుత్తమముగు గంభీరవాక్యమును బ్రేమతో విని, బహుకాలము వనవాసము సేయ నిశ్చయించెను. అంతట రఘువంశప్రదీపకులైన మహాబలవంతులగు రామలక్ష్మణులు నిర్మానుష్యములగు వనములలోఁ గొండచరియలందుఁ దిరిగెడు సింగమువలె భీతిని, తత్తరపాటును నొందక, దర్పముతో సంచరించుచుండిరి.

54-వ సర్గము.

రాముఁడు భరద్వాజాశ్రమమున నివసించుట

ఆ సీతారామలక్ష్మణు లా శుభరాత్రి యమ్మహావృక్షము క్రింద నుండి, సూర్యోదయముగాఁగానే యచ్చటనుండి బయలుదేఱి, యమున

గంగానదితో సంగమించుప్రదేశమునకుఁ బోఁగోరి, యొక్క మహావన మును బ్రవేశించి, నానావిధములైన భూప్రదేశములను, నచ్చటచ్చట తా మింతకుమున్ను చూడనిమనోహరప్రదేశములను జూచుచుఁ బోయిరి. ఇట్లు రామలక్ష్మణులు సేమమున నానావిధములగు వృక్షము లను జూచుచుఁ బోవుచుండఁగాఁ, బ్రొద్దుగడవఁగనే, రాముఁడు లక్ష్మణు నుద్దేశించి, "సౌమిత్రీ, ప్రయాగక్షేత్రమునకు సమీపమునఁ బూజ్యుఁడగు నగ్నిహోత్రునియొక్క పొగ మిక్కిలి యున్న తముగాఁ గనఁబడుచున్నది. మన మిప్పుడు నిజముగా గంగాయమునానదులు సంగమమగు స్థానమును బొందితిమి. రెండు ప్రవాహములు నొండొంటి నొఱసికొనుటవలనఁ గలిగిన చప్పుడు వినఁబడుచున్నది గదా! వంటచెఱకునమ్మి జీవించు నడవి జాతులవారిచేఁ జిల్పఁబడిన కట్టెలు చూడఁగా, నీ భరద్వాజాశ్రమమున నానావిధ వృక్షము లున్నట్లు తెలియవచ్చుచున్నది" అని చెప్పెను.

ఇట్లు వారిరువురు మాటాడుచు, దారి బడలిక తెలియనంత సుఖ ముగా నడచి, సూర్యుఁడస్తమించునప్పటికి గంగా యమునానదులు సంగమించు స్థలముననున్న భరద్వాజమహాముని యాశ్రమమునుజేరిరి. రాముఁడును లక్ష్మణుఁడును మున్యాశ్రమమునొంది, మృగములను బక్షులను వెఱపించుచుఁ గొంతదవ్వుఁగి, భరద్వాజమహాముని చేరు వకుఁబోయి, సీతతోడ నమ్మహాముని జూడఁగోరి, దవ్వుననే నిలిచిరి. అట్లు రాముఁడును సీతాలక్ష్మణులతోడ భరద్వాజాశ్రమము సొచ్చి, శిష్యబృందపరివేష్టితుఁడై కూరుచున్న వాఁడును, కఠిననియమము మనోదార్ఢ్యముఁ గలవాఁడును, తపోబలముచే జ్ఞాననేత్రమునుబడసిన వాఁడునునైన భరద్వాజమహాముని నగ్నిహోత్రము వేల్చిన పిదపఁ దిలకించినతోడనే, చేతులు జోడించికొని యభివాదనము సేసెను. సీతయు, లక్ష్మణుఁడును నమస్కరించిరి. అట్లు నమస్కరించినపిదప రాముఁడు మహాముని కిఁ దన చరిత్రమును దెలుపఁగోరి; "ఓ మునీంద్రా! భగవంతుఁడా! మే మిద్దఱము దశరథుని కొడుకులము. ఈ సుమంగలి యగు కాంత నా భార్య; జనకమహారాజు కూఁతురు. పరిశుద్ధురాలగు యీ నా భార్య మనుజసంచారములేని తపోవనమునకు నేను వచ్చు

చుండఁగా నన్ను వెంబడించివచ్చినది. తండ్రి నన్నరణ్యమునఁ బదునాలు గేండ్లుండ నాజ్ఞాపించెను. నియమము వదలనివాఁడగు నా యనుఁగుఁ దమ్ముఁడు లక్ష్మణుఁ డడవులకుఁజను నన్నుఁబాసి యుండఁజాలక నా వెను వెంట నేతెంచెను. ఓ మహాత్మా! మేము, తండ్రి యడవులకుఁ బొమ్మని చెప్పుటచేఁ దపోవనమునఁ జొచ్చెదము. అచ్చట దుంపలు, పండ్లు మొదలగునవి తినుచు స్వధర్మములనే చేయుచుందుము"అని మునీంద్రుఁడగు భరద్వాజునితోఁ జెప్పెను. అంతటఁ దపస్సంపన్నుఁడైన భరద్వాజుఁడు వారి పూజకయి, ఆవును, ఉదకమును ఇతరపూజా ద్రవ్యములను తెప్పించెను. వాని యాహారమునకయి నన్యములగు గడ్డలు,పండ్లు మొదలగువానినుండి సిద్ధముచేసినపదార్థములను సమకూర్చి వారుండుట కొకశాల నేర్పాటుచేసెను. అంత మృగములతోను, పక్షులతోను, మునులతోనుగూడి యర్ఘ్యపాద్యాదులచే రామునిఁ బూజించి, "మీకు సుఖాగమనమేకదా!" యని కుశలప్రశ్నచేసెను. రాముఁడును మునీంద్రుఁడగు భరద్వాజునివలనఁ జేయఁబడిన పూజలను గైకొని కూర్చుండెను. అప్పుడు భరద్వాజుఁడు రామునిఁజూచి,"కకుత్స్థవంశోద్భవుఁడా! చిరకాలమునకు నీ విచటికి రాఁగా నిన్నుఁ జూడగలిగితిని. దశరథుఁడు నిన్ను నిష్కారణముగా నడవికిఁ బంపినాఁడని నేను వింటిని. మహానదులగు గంగా యమునలు రెండును సంగమించు నీప్రదేశము విజనమైనది; పావనమైనది; సొంపయినది. ఇచ్చట నీవు సుఖముగా నుందువుగాక" యని ధర్మయుక్తముగాఁ బలికెను. అట్లు భరద్వాజుఁడు పలుకఁగా, జంతువు లన్నిటికిని మేలుచేయుటయందే యాసక్తిగల రాముఁడు మంచిమాటలతో "భగవంతుఁడగు మునీంద్రా! పట్టణముల వారును, పల్లెలవారును, దేశమువారును నిచ్చటికిఁ గడుచేరువ నున్నారు. కావున వారందఱు మమ్ముఁ జూడఁగోరి, "రామాదులు భరద్వాజాశ్రమమునఁనేయున్నారు. సులభముగాఁ జూచిరావచ్చును. రండు" అని యిచ్చటికి మాటిమాటికి వచ్చుచుందురు. ఈ కారణముఁ బట్టి నే నిచ్చట నుండుట కిచ్చగింపను. ఓ మునీంద్రా! సీతాదేవి జనకమహారాజు కూఁతురు. సుఖముగా నుండఁదగినది. కావున సీత మనస్సునకు రంజకమైయుండు నుత్తమమయిన తపోవనము

నొక్కదాని నాలోచించి చెప్పుఁడు" అనెను. మునీంద్రుఁడగు భర
ద్వాజుఁ డప్పలుకులువిని, రాముని యభిప్రాయమునకు సరిగ్రొన మాట
చెప్పఁగోరి, "రాఘవా! ఇచ్చటికిఁ బదికోసుల దూరమున నొక ఱొండ
యున్నది. దానిని జిత్రకూటమందురు. అయ్యది గంధమాదన పర్వత
మును బోలినది. అచ్చట మహర్షులు సర్వదా నివసించుచుందురు.
వీవైపు చూచినను గన్నుల కింపై యుండును. మతీయు నప్పర్వతమునఁ
గొండమచ్చులు, కోఁతులు, ఎలుఁగుబంట్లును విశేషముగా నుండును.
అట్టి చిత్రకూటము పర్వతములయొక్క శిఖరముల నేమనుష్యుఁ డెప్పుడు
చూచునో, అప్పుడే యా మనుష్యునికిఁ బాపబుద్ధి తొలఁగిపోవును.
సత్కార్యములందే మనసు పుట్టును. అట్లు ఋషు లనేకులు వేలకొలఁది
యేండ్లచ్చట సుఖముగ నివసించి తము తపోమహిమచేత కపాలశిరస్సు
తోడ స్వర్గమునకుఁ బోయి సేరిరి. ఆస్థలము విజనమయినది; ఆచోటు
మీకును సుఖముగ నుండును. నీ వరణ్యవాసము గడపుటకై యిచ్చటి
కైనఁ బొమ్ము. కాదేని, యిచ్చటనే నాతోడ నుండుము" అని చెప్పెను.
ధర్మవేత్తయగు భరద్వాజుఁడు తన యాశ్రమమునకు వచ్చిన యిట్టాతిథి
యగు రాముని, తత్పత్నిని సీతను, తదనుజుని లక్ష్మణుని, వారికోరికల
నెల్లఁ దీర్చి, సంతృప్తులను జేసెను. ఇట్లు రాముఁడు మునీంద్రుని చేరువ
నుండి, ఆతఁడు వింతవింత కథలు నెప్పుచుండఁగా బొవనమైన రాత్రి
యయ్యెను. సుఖముగా నుండఁదగినవాఁడును, దారినడచుటివలన డస్సిన
వాఁడును నయిన రాముఁడు సీతాలక్ష్మణులతో రమ్యమయిన యా భగీ
రథాశ్రమమున నారేయి హాయిగాఁ బరుండెను.

మఱునాఁటియుదయమున నరశ్రేష్ఠుఁడగు రాముఁడు తేజస్సుచే
వెలుఁగుచున్న భరద్వాజమునీంద్రుని సన్నిధికివచ్చి "సత్యమే స్వభా
వముగాఁగల ఓ మహాత్మా! మేమిచ్చ రేయి సుఖముగాఁ గడపితిమి. ఇఁక
దమ రానతిచ్చిన తావునకుఁ బోవ నెలవొసఁగుఁడు" అని యడుగఁగా,
భరద్వాజుఁడును రామునిఁ జూచి, "విశేషబలవంతుఁడవగు రాముఁడా!
యాచిత్రకూటపర్వతమే నీ కనుకూలమగు ప్రదేశము. అచ్చట ననేకము
లగు వృక్షములున్నవి. కిన్నరులును పన్నగులును (పాములును)

విశేషముగా నచ్చట నుందురు. అక్కడ నెయ్యళ్ళకూఁత లంతటను వ్రాఁగుచుండును. గొప్ప యేనుఁగులు సదా వాసముచేయుచుండును. ఆతావు పాపహారమును, రమణీయమును, ప్రసిద్ధమునునైనది. మీకుఁ గావలసిన తేనెయు దుంపలును బండ్లును నచ్చట దొరకును. కావున నీ వచ్చటికిఁబొమ్ము.అచ్చట నేనుఁగుగుంపులును, జింకలగుంపులును నంతటఁ దిరుగుచుండును. వానిని నీయాశ్రమము దాఁటినఁ జూడవచ్చును. నీవా పర్వతముసేరి, సీతతోఁగూడ నచ్చటి నదులను, సెలయేళ్ళను, చఱులను, చిన్న పెద్దగుహలను, నీటిప్రవాహములను జూచుచు నానందించఁగలవు. ఆపర్వతమునఁ గోయిలలు, చీఁకుఁ గొక్కెరలు సంతోషముతో గానము చేయుచుండును. మృగములును,విశేషముగా మదపుటేనుఁగులును గలిగి యాపర్వతము చూచుటకు రమ్యమైయుండును. కావున నీ వచ్చట నొక్కచక్కని యాశ్రమము నేర్పఱచుకొని సుఖముగనుండుము" అని భరద్వాజమహాముని రామునితోఁ జెప్పెను.

55-వ సర్గము.

రాముఁడు చిత్రకూటమునకుఁ బోవుట

శత్రుసంహారకు లయిన రాజపుత్రులగు రామలక్ష్మణులు సీత తోడ నారేయి యక్కడ నుండి మఱునటిదినము, తెల్లవాఱి భరద్వాజ మునీంద్రునకు నమస్కరించి యా చిత్రకూటమునకుఁ దఱలిరి. మహా తేజస్సు గలభరద్వాజమహాముని యుఁ బయనమయిన యా రామాదు లను దీవనలునేసి, తండ్రి కొడుకులనుబోలె వారిని వెంబడించి, స్థిరమగు మగఁటిమిగల రామలక్ష్మణులకు నివ్విధంబున దారిఁ జెప్పెను. "ఓ నరో త్తములారా! మీరు గంగయు యమునయుఁ గలియు చోటికిఁబోయి, యచ్చటినుండి పడమటిమొగముగాఁ బాతెసు యమునానది మూర్ఖము ననే పోయి, యా యమునానదిని సమీపించి, యది బహువేగ ముగాఁ బ్రవహించునది కావున, పురాతనమయి, జనులందఱు వాడు కగావచ్చుచుఁ బోవుచునుండు రేవునుజూచి యచ్చటఁ దెప్పనేర్పఱచు కొని యమునానదిని దాఁటుఁడు. ఆవలిగట్టునకుఁ బోవుదు రేని, యచ్చటఁ బచ్చని యాకులుగలిగి, మిక్కిలి పొడువుగ నెదిగి, చుట్టు ననేకవృక్షము లుండుటచే నల్లనై, సిద్ధులకు నునికిపట్టయి వెలయుచున్న యొక మఱ్ఱి

చెట్టు గనఁబడును. సీత యా వృక్షముఁ జూచినంతట దానికి మ్రొక్కి, తనకోర్కి లీడేరునట్లు ప్రార్థనచేసికొనవలయును. ఆ వృక్షముఁజేరి, యచ్చట నివసింపుఁడు. కాదేని దానిని దాఁటిపొండు. అచ్చటినుండి యొక క్రోసెడుదూరము పోవుదురేని, మోదుగుచెట్లతోను, రేగు చెట్లతోను, యమునానదియందుఁ బుట్టిన వెదుళ్ళతోను గూడి నల్లనైన యొక రమణీయమగు వనము మీకుఁ గనఁబడును. ఆవనము లోననే చిత్రకూటమునకుఁబోవలెను. నే నా దారి నెన్నిపర్యాయములో చిత్రకూటమునకుఁ బోయియున్నాను. ఆ మార్గము మనోహరమైనది. త్రొక్కులేక మెత్తనైయుండును. అచ్చట కాఁయచిచ్చులు లేవు. ఆదారిని మీరును బొండు" అని వారికి దారిఁజెప్పి భరద్వాజమహాముని వెనుకకు మఱలెను. రాముఁడును ఆమహామునికి నమస్కరించి, యాతనిని వెనుకకు మఱలించి, లక్ష్మణుం జూచి, "లక్ష్మణా! భరద్వాజమునీంద్రుఁడు దారిఁ జెప్పి మనయందు మిక్కిలి దయఁజూపెను. మనము ధన్యులమైతిమి." అని చెప్పి, సీతను ముందుఁ బోనిచ్చి, తానును లక్ష్మణుఁడును వెనుకఁబోవుచు యమునానదిఁజేరి, మిక్కిలి వడిగాఁ బ్రవహించుచున్న యమునానదిం జూచి, "యెట్లు మన మీనదిని దాఁటగల"మని మిక్కిలి చింతనొందిరి. వారు కొయ్యలపైనెండిన వెదుళ్ళనుబేర్చి, యొక గొప్ప తెప్పనుగట్టి, దానిపై వట్టి వేళ్ళు పఱిచిరి. వీర్యవంతుఁడగు లక్ష్మణుఁడు ప్రబ్బలి తీఁగెలను, నేరెడు రెమ్మలను నఱికి, సీతకు సుఖకరమైనయొక్క యాసనము నిర్మించెను. అంతట రాముఁడు తెలియరాని మహాప్రభావముగల లక్ష్మీదేవియో యనునట్లున్నదియుఁ గాంచెము సిగ్గుపడుచున్న దియునైన ప్రియురాలగు సీతను దానే పడవయొక్కించి, యాపెకుఁ బ్రక్కనన్ భూషణములను, వస్త్రములను, గుద్దలిని, మేకతోలుగప్పిన పుటికను, ఆయుధములను ఉంచెను. అంత వారొక్కి, తెప్పనుబట్టుకొని, తమ శౌర్యము మెఱయఁ బూనికతో యమునానదిని దాఁటఁబూనిరి. నడియేటికిఁ బోయినంతటనే, సీతయు నయ్యమునాదేవికి మ్రొక్కి, "ఓ దేవీ! మేలుగలుగునుగాక! నిన్ను దాఁటుచున్నాను, రాముఁడు వన వాసము నెఱపి, సౌఖ్యముగా నిక్ష్వాకువంశస్థులు పాలించెడు నయోధ్యం జేరినపిదప, నేను నిన్ను వేయిగోవులచేతను, నూఱుకుండల

కల్లుచేతను బూజించెదను." అని ప్రార్థించెను. అట్లు ప్రార్థించినతర్వాత వారు గట్టులందలి యనేకములగు చెట్లచే శోభాయమానమయి యల లతోఁగూడి, వడిగాఁ బాఱుచున్న యమునానదిని సేరుంబున దాఁటిరి. అట్లు యమునానదిని దాఁటి యా నదియొడ్డునందలి వనమునుండి తఱలి పోవుచు గొప్పదైన చల్లని మఱ్ఱిచెట్టును జూచిరి. సీత యా వృక్షము కడకుఁ బోయి, "ఓ వృక్షరాజమా! నమస్కారము. నా పెనిమిటి వ్రత మును బూర్తిచేయునుగాక! కీర్తిమంతులగు కౌసల్యాసుమిత్రలను జూతునుగాక." అని ప్రార్థించి యావృక్షమునకుఁ బ్రదక్షిణము గావిం చెను. అప్పుడు రాముఁడు ప్రేమగలిగి, చెప్పినట్లు చేయునదియైన నిర్దోషురాలగు సీత మఱ్ఱిచెట్టును ప్రార్థించుటఁ జూచి, లక్ష్మణు నుద్దే శించి, "భరతాగ్రజా! నీవు సీతను వెంటఁ బెట్టుకొని ముందుగాఁ బొమ్ము. నరోత్తమా! నేను మీవెంబడి నాయుధములధరించి వచ్చెదను. లక్ష్మణా! సీత యేయేపండునుగాని, పువ్వునుగాని కోరునో, యాయా పండును బువ్వులను గోసియిమ్ము"అని చెప్పి పోవుచుండెను. పోవుచున్న యా రామ లక్ష్మణుల నడుమఁబోవుచున్న సీతాదేవి రెండేనుఁగుల నడుమఁ బోవుచున్న పెంటియేనుఁగుమాడ్కి వెలయుచుఁ దా నింతకుముందుఁ జూడక యిప్పుడు చూచిన ప్రతియొక్క వృక్షమును, పొదను, పూలచేఁ దేజరిల్లు తీఁగెను చూచి ఒకొక్కదానిం గూర్చి యడుగుచు, నానా విధములగు పుష్పఫలములతోఁగూడిన చెట్లను జూచుచు వచ్చుచుండ, లక్ష్మణుఁ డా సీతయొక్కపలుకులకుఁ బ్రత్యుత్తరము చెప్పుచు నామె యడిగిన వస్తువులను దెచ్చి యిచ్చుచుండెను. జనకరాజపుత్రియగు సీతయు లక్ష్మణుఁడు దెచ్చియిచ్చెడు పుష్పఫలములెల్లఁ గైకొనుచు నానావర్ణవిశిష్టమగు నిసుకలోఁ బ్రవహించుచు, హంసలయు, బెగ్గురు పక్షులయు నాదములతోఁగూడియున్న యమునానదిని జూచి మనస్సు నందు మిక్కిలి సంతసమొందెను. సోదరులగు రామలక్ష్మణు లచ్చటినుండి క్రోసుదూరమేఁగి, యమునానదీ ప్రాంతములందుఁ బరిశుద్ధములయిన మృగములనుజంపి, వాటి మాంసమును సీతయును దామును భుజించిరి. అంతట గంభీరరూపములనున్న రామలక్ష్మణులు నెమ్మెగుంపుల కూఁత లతోఁగూడి, నదిదరిని కోఁతులయు, నేనుఁగులయు గుంపులతోనిండి

మనోహరమైయున్న వనమున నందఱికిని సమ్మతమయి చదరముగానున్న యొక ప్రదేశముఁజేరి, యచ్చట నారాత్రి నివసించిరి.

56-వ సర్గము.

రాముఁడు చిత్రకూటపర్వతము నేరుట

అంత నారేయి గడచి సూర్యోదయమగుడు, రాముఁడు స్వల్ప నిద్ర చెందియున్న లక్ష్మణుని మెల్లగా నిద్రలేపి, "సుమిత్రానందనా! వనములందలి జంతువులెల్ల మధురముగాఁ గూయుచున్నవి. వినుము, మనము పయన మయ్యెదము. ఇది ప్రయాణయోగ్యమగు సమయము" అని చెప్పెను. అట్లు లక్ష్మణుఁడన్న లేపఁగాఁ జివుక్కునలేచి, నిద్రమత్తు, సోమరితనము, దారి యలసటయు లేనివాఁడయ్యెను. అంతట వారు మువ్వురు లేచి, యమునానదియొక్క పుణ్యజలములయందు స్నానము చేసి, భరద్వాజమునీంద్రుఁడు చూపిన దారిని బట్టి చిత్రకూటమునకుఁ బయనమైరి. అట్లు వా రందఱు పోవుచుండఁగా, రాముఁడు కమలములం బోలు కన్నులుగల సీతకు వనముయొక్క సొంపును గనఁబఱుపఁ దొడఁగెను. "ఓ వైదేహీ! వసంతర్తువున నంతటఁ జక్కఁగఁ బూఁచిన యొట్టిని తమ పూవులచేఁ బుష్పమాలికలుగలవి యనఁదగి మిక్కిలి దీపించుచున్నట్లుండు మోదుగు చెట్లను జూడుము. చక్కఁగాఁ బూఁచినవియు, పండ్లచేతను, నాకులచేతను వంగినవియు, మనుష్యులు దాఁపునకుఁ జేరుటకుఁ దగనివియునైన యీ జీడి చెట్లను జూడుము. మన మిచ్చట నిజముగా నుండఁజాలుదుము. లక్ష్మణా! తేనెటీఁగెలు చెట్టు చెట్టునను జేర్చి పెట్టిన నిద్దుము తేనె గలతేనెతెట్టెలు వ్రేలాడుచున్నవి చూడుము. పూలు తఱచుగ నుంటచే నిరుకై మనోహరమైయున్న వన ప్రదేశమున నిదిగో వానకోయిల కూయుచున్నది. దానికిఁ బ్రతిగాఁ నెమలి కూయుచున్నది. వీనుఁగుల మేటి గుంపులతోఁగూడి, పక్షికులం బుల కూఁతలతో వ్యాపింపఁబడియున్న యెత్తు శిఖరములుగల చిత్ర కూట పర్వత మిదిగో కనఁబడుచున్నది చూడుము. ఓరియబ్బాయీ! యనేకవృక్షములతోఁ గ్రిక్కిరిసి రమ్యమయి, పావనమయియున్న యీ చిత్రకూటవనమునందలి నేల చదునయినది. ఇచ్చట మనము విహరింతము" అని చెప్పి యా మువ్వురు కాలినడకనుపోయి రమణీయము

మనోహరము నగుచిత్రకూటమును చేరిరి. అట్లుపోయి నానావిధములగు పక్షులగుంపులతోఁగూడి,దుంపలను ఫలములను దండిగాఁగలిగి,మనోహరమయి, కమ్మని నీటితోఁ గూడిన యీ పర్వతమును బొందిరి,"సౌమ్యుఁడా! యీకొండ యనేకవృక్షములతోను, లతలతోను గూడి, కందమూలఫల సమృద్ధమయి, వాసయోగ్యమయి యున్నయది. ఇచ్చట మనము సుఖముగా జీవింపఁగలుగుదుము. మఱియు నీ కొండపయి మహానుభావులగు ఋషులు నివసించుచున్న వారు.ఇది మనకు నివాసమయ్యెడుఁగాక!ఇచ్చట మనము సుఖముగా నుందుము." అనిచెప్పి, వాల్మీకియాశ్రమమును జొచ్చి యీ వాల్మీకికి నమస్కరించెను. లక్ష్మణుఁడును, సీతయు వెంబడే యమ్మునీంద్రునకు మ్రొక్కిరి. ధర్మజ్ఞుఁడయిన వాల్మీకిమహర్షికడు మోదము నొందినవాఁడై, వారిని గుశలప్రశ్నచేసి, కూర్చుండుఁడని యానతి నొసఁగెను. అంతట దీర్ఘబాహువగు రాముఁడు వాల్మీకిమునీంద్రునికి మర్యాద మీఱకుండ, తన సంగతినంతయుఁ జెప్పి, లక్ష్మణుని జూచి, "ఓరి నాయనా! మేలయిన గట్టికొయ్యలను గొట్టితెచ్చి యిచ్చట నొకశాలను నిర్మింపుము. ఇచ్చట నుండవలెనని నా మనము గోరినది" యనెను. వెంటనే లక్ష్మణుఁ డన్నమాటలను విని, పలుతెఱఁగులగు కొయ్యలను గొట్టి తెచ్చి యొక పర్ణశాలను నిర్మించెను. రాముఁడు లక్ష్మణునిచే దిట్టముగాఁ గట్టఁబడి, చుట్టుఁ దడిగల చూచుట కింపుగనున్న పర్ణశాలను దిలకించి, యొక్కటే మనస్సుతో శుశ్రూషసేయుచున్న లక్ష్మణునిఁ జూచి, "లక్ష్మణా! నల్లయిఱ్ఱిమాంసమును దెచ్చి గృహాదేవతలకు బలియిత్తము. ఆయుర్వృద్ధిని గోరువారు వాస్తుశాంతి చేయవలయును. శుభకరములగు కన్నులు గలవాఁడవయిన యో లక్ష్మణా! మృగమును జంపి వేగము తెమ్ము. శాస్త్రోక్తవిధానమున గృహశాంతి చేయవలయును. ధర్మశాస్త్రమును మఱువఁజనదు. అని యానతీఁగా, శత్రుసంహారియగు లక్ష్మణుఁ డన్నమాట విని, యాతఁడు చెప్పినప్రకారము నల్లయిఱ్ఱిని పట్టితెచ్చెను. రాముఁడును మఱిల లక్ష్మణుం జూచి, "మనము గృహాధిదేవతలను బూజింతము. ఈ మృగమాంసమును బక్వముచేయుము. ఓరీ నాయనా! త్వరపడుము. ఇది ధ్రువమయిన శుభముహూర్తము. ఈ దినమును నట్టిదియే. కావున గృహాధిపతియు

స్థైర్యము నొందును. ప్రతాపశాలియగు లక్ష్మణుఁడు నల్ల యిట్టిని జంపి, దాని పరిశుద్ధమయిన మాంసమును జక్కఁగా మండుచున్న నిప్పు నందుఁ బక్వముచేసెను. అంతట నా యిట్టి రక్తమంతయు నింకి చక్కఁగాఁ గాలినదని తెలిసికొని లక్ష్మణుఁడు నరోత్తముఁడగు రామునిఁ జూచి, "ఓ దేవతలఁబోలువాఁడా! ఈ నల్లయిట్టిని ఛేదింపక యట్లే పక్వముచేసితిని. అది నల్లయిట్టివలెనే యున్నది. ఇఁక గృహదేవతలఁ బూజింపుము. నీ వతి సమర్థుఁడవుగదా!" అనెను. గుణవంతుఁడును, మంత్రజ్ఞుఁడునునైన రాముఁడు స్నానమునేసి, పరిశుద్ధుఁడై, గృహ శాంతి మంత్రములను సంగ్రహముగాఁ బఠించి, గృహాధిదేవతలనెల్లఁ బూజించి, పావనమయిన గృహమునఁ బరమానందముతోఁ బ్రవేశించెను. అట్లు ప్రవేశించి, వైశ్వదేవబలిని, రుద్రబలిని, విష్ణుబలిని జేసి, గృహ శాంతియందుఁ జేయఁదగు శుభకార్యములను నడపించుచు, శక్తికిఁ దగినట్లు జపముసల్పి, నదియందు యథావిధిగా స్నానముచేసి, పాపనోదకమయిన యుత్తమబలి నర్పించెను. అంత నాశ్రమమునకుఁ దగినట్లుగా బలిహరణాదులనైన తిన్నెలను, దేవాలయములను, అగ్ని హోత్రగృహములను నేర్పఱిచెను. ఇవ్విధమున వనమునఁబుట్టిన పుష్పమాలికలు, కందమూలఫలములు, పక్వమాంసములు మున్నగు వానిచేతను, తీర్థోదకములచేతను, వేదోక్తమంత్రజపములచేతను, దర్భలచేతను, సమిత్తులచేతను, కుశలచేతను గృహాధి దేవతలం బూజించి, యాకులతోఁ గప్పఁబడి, యాయా కార్యములకుఁ దగినట్లు ప్రత్యేక స్థలము లుండునట్లు కట్టఁబడి యొక్కొవ గాలి దగులకుండునట్లు చేయఁబడి, మనోహరమయియున్న యా పర్ణశాలయందు, దేవతేంద్రసభయందుఁబోలె సీతాలక్ష్మణ సమేతుఁడై ప్రవేశించెను. అట్లు రామాదులు మువ్వు రా పర్ణశాలయందు వసించి, జితేంద్రియులయి, లెక్కలేని వింతవింతలగు మృగపక్షులతో నిండి, పలురంగుల పూలగుత్తులుగల చెట్లచే శోభిల్లుచు, భయంకరములగు నేనుఁగులయు, నితర మృగములయు నటపులచే నిండియున్న యా చిత్ర కూటపర్వత ప్రాంతవనములందు విహరించుచు, మంచితీర్థముగల మాల్య

వతీనదియందు స్నానపానాదులను జరుపుకొనుచుఁ బట్టణమున విడిచి వచ్చినందుచేఁ గలిగిన దుఃఖముఁ బాసియుండిరి.

57-వ సర్గము.

సుమంత్రుఁడు వనమునుండి మఱలి యయోధ్య సేరుట

గుహుఁడు రామునితో మాటాడుచుండి రాముఁడు గంగానది యొక్క దక్షిణపుటొడ్డు చేరఁగానే, జాలతడవు రాముని గుణములను గూర్చి చెప్పుకొనుచుఁ గడువ్యసనముచే నొచ్చినవాఁడై, తన గృహమునకు సుమంత్రునితోడ మఱలివచ్చెను. అచ్చటనున్న పడవవాండ్రు రామాదులు గంగానదినిదాఁటి భరద్వాజుని యాశ్రమునకుఁ బోవుటయుఁ, బ్రయాగయం దమ్మునీంద్రునితోఁగూడ నుండుటయు, వారు చిత్రకూటపర్వతమునకుఁ బోవుటయు మొదలగు సంగతులను జెప్పిరి.

సుమంత్రుఁడు వ్యసనముచే మిక్కిలి నొచ్చినవాఁడై, రామునిచే సెలవుపొంది, యుత్తమాశ్వములను రథమునకుఁ బూన్చి, యయోధ్యా నగరికే బయలువెడలి, దారినడుమఁ బరిపుళవంతములగు వనములను, నదులను, దటాకములను, గ్రామములను, బట్టణములను జూచుచుఁ బోయి, మూఁడవదినము సాయంకాలము శోకసాగరమున మునిఁగి నిశ్శబ్దమై పాడువడినదో యనఁదగియున్న యయోధ్యాపురమును జూచి, దుఃఖాతిశయముచేఁ గొట్టువడి, మనస్స్వాస్థ్యము కొంచెమైనను లేనివాఁడై, "యయోధ్యాపురము గజాశ్వములతోను, జనులతోను, ప్రభువులతోనుగూడ రాముని వియోగమువలని శోకాగ్నిచే దహింపఁబడలేనుగదా!" యని చింతించుచు, వేగిరంబుగాఁ బఱతెంచు గుఱ్ఱము లతోఁగూడిన రథంబుతోఁ బట్టణద్వారముఁ జేరి లోపలికిఁ జొచ్చెను.

అంత సుమంత్రుఁడు మఱలివచ్చుటం జూచి, జనులు నూఱులు నూఱులుగను, వేలువేలుగను గుంపులుగూడి వచ్చి "రాముఁడేఁడీ?" యని యడుగుచు నెదురుగాఁ బరుగెత్తి వచ్చిరి. సుమంత్రుఁడును జనులను జూచి, "ఓ పౌరులారా! నేను రామాదులను గంగానదియొడ్డు వఱకుఁ గొనిపోయితిని. పిదప ధర్మపరుఁడగు రాముఁడు రథముదిగి, నన్ను మఱలిపొమ్మని యానతీయఁగా నేను మఱలివచ్చితిని." అని బదులిడెను. జనులందఱు గంగాయమునానదులను డాఁటరని తెలిసి

కొని, కన్నులనిండ నీరు నించికొని, "యక్కటా!" యని నిట్టూర్చి "హా! రామా" యని విలపించి, యచ్చటచ్చట గుంపులుగూడి, "రాము, డిక్కడ కానరాడు. మనము కూలారిపోయితిమి. దానములు, యజ్ఞములు, పెండ్లిండు, మహోత్సవములు ధార్మికుడయిన రాముడు లేక మనమొకప్పుడును జూడఁబోము. రాముడు "ఏది కావలెను? ఏది యిష్టము? ఏది సౌఖ్యకరము" అని జనులను దండ్రివలె విచారించుచుఁ బరిపాలించుచుండెను" అని జనులనుకొనుచుండు మాటలను సుమంత్రుఁడాలకించుచు, నంగడివీథిం బోవుచుండఁగా, రాముని వియోగదుఃఖముచే నొచ్చినవారలయి, గవాక్షములందుఁ గూర్చుండి విలపించుచున్న స్త్రీలరోదన ధ్వనుల నాకర్ణించెను. అట్లు సుమంత్రుఁడు రాజవీథినిజొచ్చి, మోమును గప్పుకొన్నవాఁడై, దశరథనృపాలుఁడున్న నగరు చేరువకుఁ బోయి, వేగిరముగ రథమునుండి దిగి, జన బాహుళ్యముచే నల్లకల్లోలముగనున్న యేడు తొట్టికట్లు దాఁటెను. అచ్చట మేడలమీఁదను, విమానములమీఁదను రాజగృహములందును నుండిన స్త్రీలు సుమంత్రునిమాత్రము వచ్చినఁజూచి, రాముని బొడ గానక యందఱును "అయ్యయ్యో" యని యార్చుచుఁ గన్నీరు చారలుగాఁ గారెడి నిర్మలనేత్రములు గలవారలై, మిక్కిలి దీనముగా నొండొరుల మోములను జూచుచు, "సుమంత్రుఁడు రామునితోఁ గూడఁ బోయినాఁడు. రాముఁడు లేకుండ వచ్చినాఁడు. ఆతఁడు పోయి నదిమొదలు విడువని దుఃఖముతోనున్న కౌసల్యనుజూచి యేమి చెప్పఁ గలఁడు? పుత్రుఁడు తన్నుఁబాసి యడవికిఁ బోయినతరువాతఁగూడ కౌసల్య జీవించియున్నది యనుట యేదికలదో, అట్టి పాడుబ్రతుకు బ్రతుకుట సులభ సాధ్యముగాదని తలఁచెదము" అని చెప్పికొనుచుండిరి. అట్లువారు చెప్పికొను నిక్కములైన మాటలను విని, దుఃఖాగ్నిచే నెఱియుచున్నట్లులున్న దశరథుని యంతఃపురగృహముఁ జొచ్చి, యావల నెనిమిదవ తొట్టికట్టునఁ దెల్లరంగుగల గృహమునఁ బుత్ర శోకంబుచేఁ గుములుచు, నొచ్చియున్న దశరథునిఁ జూచెను.

అట్లు సుమంత్రుఁడు సింహాసనమునఁ గూర్చున్న దశరథునిఁ జూచి, తత్పదోపమునకేఁగి, నమస్కరించి, రాముఁడు చెప్పిన మాటల

నన్నింటిని విన్నవించెను. ఆ దశరథుఁ డాతని మాటలను విని, చెదఱిన మనస్సు గలవాఁడై, రాముని వియోగదుఃఖముచే మిక్కిలి నొచ్చి మైమఱచి, సొక్కి, క్రిందఁబడెను. పుడమిఱేఁడగు తమ నాథుండు మూర్ఛచేఁ గ్రిందఁబడినతోడనే, చేతులు పైకెత్తి యంతఃపురకాంత లందఱు నేడ్చిరి. అప్పుడు కౌసల్య సుమిత్ర తోడ్పాటుతోఁ గ్రిందఁ బడిన తమ భర్తను లేవనెత్తి కూర్చుండఁబెట్టి, "మహాత్ముఁడవగు నాథా! చేయ నలవిగాని యెంతటి కార్యములనైనను జేయుచున్న యా రాముని వనమున విడిచిపెట్టి వచ్చిన యీ సుమంత్రునితో నెందుకు మాటాడవు. ఓ రఘువంశోద్భవా, యిప్పుడిట్టి యన్యాయమును జేసి యేల సిగ్గుపడెదవు? లేచి కూర్చుండుము. సత్యవాక్య పరిపాలనచే నీవు పుణ్యము నొందుదువు. దుఃఖించియుపయోగము లేదు. నాథా! నీకిక వెఱచి రాముసికడనుండి వచ్చిన సుమంత్రునిఁ బలుకరింపకున్నా వేమో! ఇచ్చటఁ గైక లేదు. నీవు నిర్భయముగా మాటాడుము" అని దశ రథమహారాజుతోఁ జెప్పి, డగ్గుత్తికచేఁ దడఁబడునట్లు మాటాడుచు దుఃఖ వేగమును సహింపఁజాలక నేలపైఁ గొఱఁగెను. నేలపైఁబడి యేడ్చుచున్న కౌసల్యను, భర్తను జూచి, యంతఃపురాంగనలెల్ల గుమిగూడి వేరెలుఁ గుతో రోదనము సేసిరి. అప్పు డంతఃపురంబునఁ బుట్టిన రోదనంబును విని, పట్టణమునందలి ముదుసలులు, ప్రాయమువారు, స్త్రీలునందఱును గూడ నేడ్చిరి. అప్పు డయోధ్యాపురమంతయు రాముఁడు వనవాసం బునకుఁ బోవునప్పుడువలెనే రోధన ధ్వనులతోఁ నిండెను.

58-వ సర్గము.

సుమంత్రుఁడు రాజునకు రామాదులు నెప్పినమాటలను వినిపించుట

నృపాలుఁడును, కౌసల్యాదులు చేసిన యుపచారములచే నూఱట వడసి, మూర్ఛనుండి తెప్పిఱిల్లి, రాముని వృత్తాంతముఁ దెలిసికొనుటకై యా సుమంత్రుని బిలిపించెను. అంతట సారథియగు సుమంత్రుఁడు, వినయముచేఁ జేతులు జోడించికొని, రామునే తలఁచి తలఁచి దుఃఖించు వాఁడును, అప్పుడే పట్టుకొనఁబడిన యేనుఁగువలె కడు వ్యసనముతో మిక్కిలి నొచ్చినవాఁడునై, వేఁడి నిట్టూర్పులు విడుచుచుఁ జింతనొంది, నెమ్మదిదప్పిన యేనుఁగువలె నుండువాఁడునైన చీఁకుపుడమిఱేనికడ

కేతెంచి నమస్కరించెను. దశరథుఁడు నట్లు దుమ్ముచేనిండిన శరీరము గల వాఁడయి, కన్నీరు విడుచుచు దీనవదనుఁడై యుండు సుమంత్రునిఁ జూచి, మిక్కిలి నొచ్చినవాఁడయి యిట్లనియె. "సూతా! తొల్లి కడుసుఖముగ రాజగృహములందు వసించుచుండిన ధర్మాత్ముఁడగు రాముఁ డిప్పుడు చెట్ల క్రింద నెట్లున్నవాఁడు? ముందు భక్ష్యభోజ్య లేహ్యపేయాదులతోడఁ గూడిన మధురాన్నమును భుజించుచుండిన రాముఁ డిప్పుడేమి భుజింపు చున్నాఁడు? రాముఁ డింతకుఁ బూర్వము దుఃఖములకుఁ దగనివాఁడు; సుఖమైన పాన్పులందుఁ బరుండినవాఁడు; అట్టి రాజపుత్రుఁ డిప్పు డనాథకైవడిఁ కటికినేలపై నెట్లు పరుండుచున్నాఁడు? తొల్లి చతురంగ బలములు వెంటరాఁ జనుచుండెడు రాముఁడు నేఁ డెట్లు నిర్జనవనమున నివసించుచున్నాఁడు? పెద్దపులులును, గడుఁది మెకములును, నల్లత్రాచు లును నెఱసీయుండు నడవియందు నాకుమారులు సీతతోడ నెట్లు కాఁపురమున్నారు? సుమంత్రా! సుకుమారియు మునిపత్నులఁబోలునదియు నగు సీతతో రాజపుత్త్రులగు రామలక్ష్మణులు రథమునుండి యెట్లు కాలి నడకతోఁ బోయిరి? ఓ సారథీ! యశ్వినీదేవతలు మందరపర్వతముఁ జొచ్చునట్లు, నా పుత్త్రు లిరువు రరణ్యములఁ జొచ్చుచుండఁగా, నీవు వారిని జూచితివి కావున నో సుమంత్రుఁడా! నీవు కృతార్థుఁడవు. వన మునఁ జొచ్చినపిదప, రాముఁ డేమి చెప్పెను? లక్ష్మణుఁ డేమి చెప్పెను? సీత యేమి చెప్పినది? సారథీ! రాముఁ డెక్కడఁ గూర్చుండెను? ఏమి భుజించెను? ఎచ్చటఁ బరుండెను? నాకు విస్తరించి చెప్పుము. యయాతి స్వర్గమునుండి భూలోకమునఁ బడునప్పుడు దేవేంద్రునిఁ బ్రార్థించి, సత్పురుషుల సమముఁబడి జీవించునట్లు, నేను నీ రాముని కథ విని కొంత కాలమైన బ్రతికి యుండఁగలను." అని దశరథుఁడు ప్రశ్నచేయఁగా, సుమంత్రుఁడు కన్నీళ్ళతోఁగూడి, తడఁబడుచున్న మాటలతో నరేం ద్రునిఁగూర్చి యిట్లనియె. "మహారాజా! రాముఁడు ధర్మమునే యనుస రించి జేతులు జోడించి, శిరమువంచి మ్రొక్కి నాతో నిట్లనెను. "సారథీ! ఆత్మజ్ఞానముగలవాఁడును, వందనమొనర్పఁ దగినవాఁడునునైన మహాత్ముఁ డగు తండ్రియొక్క పాదములకు నాకుమాఱుగ నందనమాచరింపుము. సారథీ! నా మాఱుగా నంతఃపురమున నున్నవారికి నా క్షేమములు

సెప్పి, వారివారివయస్సులకు, యోగ్యతలకుఁదగినట్లు నమస్కారము లను జేయుము. మాతల్లిగారితో నా క్షేమమును నా నమస్కారము లను, అజాగ్రత్తలేకుండుటను జెప్పి, మఱియు నీ క్రిందిమాట సెప్పుము? ఓ దేవీ! నీవు ధర్మమార్గముఁ దప్పకుము; కాలము దప్పక యగ్నిహోత్ర శాలయందుఁ బురోహితు లగ్నిహోత్రములు వేల్చుచున్నారాయని విచారించుకొనుచుండుము;పతిపాదములనే దైవముగా భావించి పూజించుము; సవతులవిషయమున, నేను బెద్దదాన ననుఁ నహంకారమును గర్వమును మాని నడచుకొనుచుండుము. తల్లీ పూజ్యురాలగు కైకేయి మహారాజు ననుసరించి యుండునట్లు చేయుము; పిన్నయగు భరతుని యందును నృపాలునందువలె నీవు ప్రవర్తింపుము. వయసుచేఁ బిన్నలయిన, రాజులు ధర్మముచేఁ బెద్దలు. ఈ రాజధర్మము మఱవకుము అని తన తల్లియగు కౌసల్యతోఁ జెప్పుమనెను. భరతునకు నా క్షేమము జెప్పి, నా మాటగాఁ దల్లులందఱియందును నేకరీతిగా నుండుమనుము. మఱియు నిక్ష్వాకువంశ నందనుఁడయిన దీర్ఘబాహువగు భరతున కీ సంగతి జెప్పుమనెను. "భరతా! నీవు యువరాజ పట్టము నొందిన వాఁడవై, రాజ్యపరిపాలనము సేయుచుండు తండ్రికిఁ దోడుగా నుండుము. రాజు వయసుచెల్లినవాఁడు. కావున నాతని యభిప్రాయము నకు విరుద్ధముగా నడచుకొనకుము. ఓ భరతా! తండ్రియాజ్ఞప్రకారము నడచుకొనుచు యువరాజవయి సుఖముండుము. అని భరతునితోఁ జెప్పుమనెను. రాముఁడు విశేషముగాఁ గన్నీళ్లువిడుచుచు మఱలనాతో నిట్లనెను. "ఓ భరతా! మాతల్లి పుత్రవాత్సల్యముగలది కావున, మీ తల్లినివలెనే మాతల్లినిగూడఁ జూచుకొనుము" అని చెప్పుమనుచు విస్తారమగు కీర్తిగలవాఁడును, తామరతెకులంబోలు కన్నులుగల వాఁడునునైన యా రాముఁడు జొటజొటగన్నీరువిడిచెను. అప్పుడు లక్ష్మణుఁడు గడు నలిగినవాఁడై, నిట్టూర్పువిడిచి, నాతో నిట్లనియె. "సుమంత్రా! రాజపుత్రుఁడగు రాముఁ డే కారణమున వనవాసమునకు బంపఁబడెను? దశరథుఁడు కైకయొక్క నీచమైన యాజ్ఞకులోఁబడి మాకు బాధదెచ్చెడి యీ యకార్యమును మంచిచెడ్డ లెఱుఁగకచేసెను. రాముని నడవికిఁ బంపుటకుఁ గారణము లోభమయినను కాక వరమయి

నను ఎవ్విధమున నయినను జేసినది చెడ్డపనియేకాని వేఱుగాదు, కైకేయి రాముని నడవికిఁబంపుమని యడిగినప్పుడు "నేను రాముని నడవికిఁ బంపఁజాల" నని చెప్పియుండఁగూడదా? ఇక్కార్య్యమును దశరథుఁడు "తాను ప్రభువు" అనునదే ముఖ్యముగాఁ దలఁచి, చేసెనేకాని రాముని వనమునకుఁ బంపుట కేమియుఁ గారణము నాకుఁ దోఁపకున్నది. దశరథుఁడు మొదట విచారింపక, తెలివిలేమిచే లోకవిరుద్ధములగు నిక్కార్య్యము (రామవివాసనకార్య్యమును) జేసెను. అది యిప్పుడు దశరథునకు మిగులసంతాపమును గలిగించుచున్నది. నే నన్ననో, దశరథమహారాజును దండ్రియనితలఁపను. నాకు రాముఁడే తోఁబుట్టువు; రాముఁడే ప్రభువు; రాముఁడే చుట్టము; వేఱియేల? రాముఁడే తండ్రియు." అని చెప్పి, "ఓ తండ్రీ! సకల జనులకుఁ బ్రియుఁడును, సకలజనులకు మేలు గోరువాఁడునునైన రాముని నడవికిఁ బంపిన నీపైన సకలజనులకుఁ ద్రోహ మయుండునే? జనులందఱి మనముల కొప్పినవాఁడును, ధర్మములఁ దప్పని వాఁడునైన రాముని వనమునకుఁబంపి, జనులందఱికి విరోధివైన నీవెట్లు రాజ్యపుకాఁగలవు" అని తమతోఁ జెప్పుమని నాతోఁ జెప్పెను. మహారాజా! మంచి మనస్సుగల సీత యన్ననో, వేఁడినిట్టూర్పులు విడుచుచుఁ దయ్యమునపట్టినదానివలె నివ్వెఱపాటుతో నిలఁబడియుండెను. సీత రాచకొమరిత; ఇంతకు మున్నిట్టి దుఃఖముల నెఱుఁగనిది; గుణవతియని ఖ్యాతినొందినది. ఆమె వ్యసనముతో నేడ్చుచు, నాకొక సంగతియుఁ జెప్పలేదు. బెండువాఱుచున్న మోముతో భర్తను చూచుచు మఱలి వచ్చుచుండు ననున్నఁజూచి, మిక్కిలి దుఃఖముతోఁ గన్నీటికాలువలు కట్టించెను. అట్లు రాముఁడు చేతులు జోడించి, కన్నీరువిడుచుచు, లక్ష్మణుని భుజబలంబుచేఁ గాపాడఁబడుచు నచ్చటనుండెను. సీతయు శోకముచే విలపించుచు రాజరథమును, నన్నును జూచుచుండెను.

59-వ సర్గము.

సుమంత్రుఁడు దశరథునకు రాముని వనవాసముతీరు చెప్పుట

ఇట్లు చెప్పుచున్న సారథియు మంత్రిశ్రేష్ఠుఁడునయిన సుమంత్రునిఁ జూచి, దశరథుఁడు "ఇఁక మిగిలిన సంగతినిఁ జెప్పు" మని యడిగెను. ఆ నృపాలుని యా మాటలువిని, సుమంత్రుఁడు కన్నీరువిడుచుచు దిటవు

మాని, మఱల రాముని వృత్తాంతమును విస్తరించిచెప్పఁ దొడఁగెను. "మహారాజా! శూరులైన యీ రామలక్ష్మణులు నారబట్టలుగట్టి జడలు దాల్చుకొని, గంగానదిని దాఁటి ప్రయాగవైపునకుఁ బోయిరి. రఘు నందనుఁడగు రాముని కండయయి లక్ష్మణుఁడు ముందుగాఁ బోయెను. అతనివెనుక సీతయు నామెవెనుక రాముఁడును బోయిరి. అవ్విధంబునఁ బోవుచుండువారిని జూచి యిఁకఁ జేయునది లేక వెనుకకు మఱలితిని. నేను మఱలినతర్వాతఁగూడ గుఱ్ఱములు రాముఁడు వనమునకుఁ బోయెనన్న విచారముచే వేఁడి కన్నీరు విడుచుచు, దారిలోనికి మఱలకుండినవి. నేనును రాజపుత్రుల కిద్దఱికిఁ జేతులు జోడించి మ్రొక్కి, నా దుఃఖ మును లోపల నడఁచుకొని రథమెక్కి ప్రయాణమైతిని. రాముఁడు మఱల నన్ను రమ్మని చెప్పి పంపునేమో యనితలఁచి శృంగిబేరపురము ననే గుహునితోడ మూఁడుదినము లుంటిని. ఆ రాముఁ డుచెప్పి పంపనే లేదు. నరేంద్రా! దేవరవారి దేశమునన్న చెట్లు సయితము రాముని వనవాసదుఃఖముచేఁ గృశించినవై పుష్పములతో మొగ్గలతోఁ గూడ వాడుపాటిపోయినవి. నదులందును, గుంటలందును, చెఱువులందును నీళ్ళు మసలఁ గ్రాఁగినట్లున్నవి. తోఁటలందును, నుద్యాన వనములందును నాకులెండి జలజల రాలుచున్నవి. జంతువులు ప్రాఁక కున్నవి. క్రూరమృగములు దిరుగకున్నవి. వనమంతయు రాముని వన వాసశోకముచేఁ గొట్టువడి నిశ్శబ్దముగా నున్నది. నరాధిపా! తామర కొలంకులఁదలి తామరతీఁగెలు వాడిపోవుచున్నవి; తామరాకులు నీటిలో మునిఁగినవి, నీళ్ళ కలఁకపాటినవి. చేపలును, హంసలు మొద లగు జలపక్షులును గానరాకున్నవి. కావున, తామరకొలఁకులన్నియు మొదటికిగుంటలవలె నున్నవి. తామరపువ్వులు మొదలగు నీటి పుష్ప ములును, జాజి మొదలగు మెట్టలందుఁ బుట్టు కుసుమములును సువాసనలేనివై, వెనుకటివలెఁ బ్రకాశింపకున్నవి. ఫలములును బూర్వము వలెదీపి లేకయున్నవి. ఈయయోధ్యాపురమునందలి యుద్యానవనములు పక్షులయొక్క ఇంపయినకూఁతలు లేక పాడుపడియుండియున్నవి. నరేంద్రా! యుపవనములన్నియు సొంపుదఱిఁగియున్నవి. అయోధ్యా పురంబున నొక్కఁడైనను, మఱలివచ్చుచుండు నన్నుఁగని సంతసింపఁ డైరి.

ప్రజలందఱు రామునిఁ గానక మాటిమాటికి నిట్టూర్పులు విడుచు చుండిరి. ప్రభూ! రాముఁడు లేని రాజరథమును జూచి, రాజమార్గమునం దలి జనులందఱు దుఃఖముచేఁ గన్నీరు పెట్టుకొనిరి. స్త్రీలందఱు మేడల మీఁదను, విమానములమీఁదను (ఏడంతస్తుల మేడలమీఁదను) రాజ గృహములమీఁదను ఎక్కి రాముఁడు లేకయే వచ్చిన రథమునుజూచి, "యయ్యయ్యో" అని యాక్రందించుచుండిరి. స్త్రీలు మిక్కిలి నొచ్చిన వారలై, నిర్మలములు, విశాలములునయిన కన్నులనిండుగ నీరు దెచ్చు కొని యేమియుఁ దోఁచక యొండొరులఁను జూచుకొనుచుండిరి. రాముని పగతురును, చెలికాండ్రును, మధ్యస్థులును దుఃఖితులై యుండుటచేత, వీరు శత్రువులనియు, వీరు మిత్రులనియు, వీరు మధ్యస్థులనియు భేదము దెలియుట కష్టముగా నుండెను. అయోధ్యాపట్టణమున జనులు సంతోషహీనులుగ నుండిరి. గజాశ్వములు గళదప్పియుండెను. రోదన ధ్వనులే యంతట వినఁబడుచుండెను. అట్టి యయోధ్యాపురము రాముఁ డరణ్యమునకుఁ బోవుటచేఁ బుత్రునెడఁబాసిన కౌసల్యవలె సంతోష హీనముగ నుండెను.

దశరథుఁడును సారథియగు సుమంత్రునిమాట విని, దుఃఖముచే డగ్గుత్తిక వడిన మాటలతోఁ గడుదీనముగ నా సారథియగు సుమంత్రుని జూచి యిట్లనియె. "ఓ సుమంత్రా! చెడ్డకుటుంబమునఁ బుట్టి చెడ్డతలఁ పులు గలదైన కైకేయి వరము లడుగఁగా, నేను మంత్రాలోచనలందు నిపుణులగు పెద్దలతో యోచింపక నాప్తులతోనైనను యోచింపక, దాని యందలి మోహముచే స్త్రీసుఖముఁగోరి, యీకార్యమును ముందు వెనుక లాలోచింపక చేసితిని. కాదేని, సారథీ! యీ మా కులము నశించుటకుఁగా నీ కష్టమును తప్పక దైవము గల్గించియుండును. సారథీ! నే నింతకుమున్ను సేసినపుణ్యమేదియైన గొంచెమున్నయెడల, నన్నుఁ గడువేగముగ రాముని కడకుఁ జేర్చుము. లేనిచో నా ప్రాణములు నా బొందిలో నుండఁజాలవు. ఇప్పుడును నా యాజ్ఞకుఁ జెల్లుబడి యుండునేనిఁ; నీవు పోయి రాముని మఱలించికొనిరమ్ము. నేను రాముని బాసి యొక క్షణమైన నుండఁజాలను. అట్లు కాక, రాముఁ డిప్పటికిఁ జాలదూరంబేగియుండును గావున నన్నే రథమునఁ గూర్చుండఁబెట్టి

కొని, శీఘ్రముగా నా రామునికడకుఁ గొనిపోయి, యాతనికిఁ జూపిం
పుము. చక్కనిపలువరుసగలవాఁడును, మేటివిలుకాఁడునునైన
లక్ష్మణుని యన్నయగు రాముఁ డెచ్చటనున్నాఁడు? నే నీ పదునాలు
గేండ్లు బ్రతికియుందునేని, సీతతోడ మఱలివచ్చిన రామునిఁ జూతును.
ఎఱ్ఱని కన్నులు, గొప్ప బాహువులు గలవాఁడును, మణిమయములగు
కుండలములను దాల్చినవాఁడును నైన రామునిఁ జూడకుందునేని
యమపురి కేఁగుదును. వృద్ధుఁడనైన నే నింత వ్యసనమునొందియు
నిక్ష్వాకునందనుఁడైన రాముని నిచ్చటఁ జూడకున్నాను. దీనికంటె
మించిన దుఃఖము మఱేమి యుండును? అక్కటా! రామా! హా!
లక్ష్మణా! హా! సీతా! మీ వియోగదుఃఖము నోర్వలేక దిక్కులేని
వాఁడువోలె మృతినొందనున్న నన్ను మీ రెఱుఁగఁబోరుగదా!" అని
సుమంత్రునిఁజూచి, దుఃఖించి, నృపాలుఁడు చింతాక్రాంతచేతస్కుఁడై
దాఁట నలవికాని శోకసాగరమున మునిఁగినవాఁడగుచు, కౌసల్యనుజూచి,
"ఓ దేవీ! రాముని రొడఁబాటువలని శోకమనఁబడు నెక్కువ వైశా
ల్యముగలిగి, సీతావియోగమనెడు నావలిగట్టుతోఁగూడి, నిట్టూర్పు
లనెడు నలలతో, గొప్ప సుళ్లతో వెలసి, కన్నీరనెడి నురుపుచేఁ గలఁక
పాఱి, చేతులాడించుట యనెడు చేపలగుంపులుగలదై, అధికరోధన
మనెడు ఘోషగలిగి విజృంభించుకొన్న కేళములనెడు పాఁచితేఁగెలతోఁ
గూడి, కైకయనెడు బడబాగ్ని గలదయి, గూనిదానిమాటలనెడు గొప్ప
మొసళ్లుగలిగి ఘాతుకురాలైన కైకేయి వరములనెడి చెల్లెలికట్టితో విల
సిల్లుచు, రాముని ప్రవాసన మనెడు నిడివిగలిగియున్న నా కన్నీటి
ప్రవాహామను జలముచలనఁ బుట్టిన దుఃఖమును సాగరమున మునిఁగితిని.
అక్కటా! రాము నెడఁబాసి ప్రాణములనుదాల్చి యీ సాగరము నే
నెట్లు దాఁటఁగలను? నే నిప్పుడు రాముని లక్ష్మణునిఁ జూడఁగోరియుఁ
జూడకున్నానుగదా. దీనికంటె నాకేమి యమంగళము గావలెను?" అని
చెప్పి యేడ్చుచు మూర్ఛనొంది వెంటనే పాన్పుపైఁ బడెను. ఇట్లు దశ
రథుఁడు విలపించుచు మూర్ఛనొంది క్రిందఁబడఁగాఁ, గౌసల్య రాజేం
ద్రుని పలుకులు విని, రామునివిషయమై యిదివఱకే దిగులుపడి

యుండఁగా, నిప్పుడు నృపాలుఁ డిట్లు మూర్ఛనొంది క్రిందబడినందుకై ఖినుఁడిగ దిగులునొందెను.

60-వ స ర్గ ము.

కౌసల్య సుమంత్రుని నడుగుట

అటుపిమ్మట గౌసల్య దుఃఖార్తురాలై, దయ్యమువట్టినదానివలెఁ మాటి మాటికి వడఁకుచు నేలపయిఁ బ్రాణముపోయినదానివలెఁ బడియుండి సుమంత్రునితో "ఓ సారథీ! యెచ్చట రాముఁడు లక్ష్మణుఁడు సీతయు నున్నవారో, అచ్చటికి నన్నుఁ గొనిపొమ్ము. వారినిజూసి నేనొక నిమిషమైన జీవించియుండఁగోరను. రథము నిచ్చటినుండియె త్రిప్పి, వేగముగ నన్నును దండకారణ్యములకుఁ గొనిపొమ్ము. అట్లు వారిని వెంబడించి పోవనేని, యమపురికిఁ బోయెదను" అని చెప్పఁగా, సారథియుఁ, గౌసల్య నూఱడింపఁగోరి, యంజలిచేసి, కన్నీటివేగముచే డగ్గుత్తికచేత తొట్రుపడుచున్న మాటలతో నా కౌసల్యాదేవికి నిట్లనియె; "ఓ దేవీ! శోకమును, అజ్ఞానమును, వ్యసనజనితమైన తత్తర పాటును విడువుము. రాముఁడును దుఃఖమునుబాసి యరణ్యమున నుండఁగలఁడు, ధర్మజ్ఞుఁడును, ఇంద్రియనిగ్రహములుగలవాఁడునైన లక్ష్మణుఁడును నరణ్యమున రాముని పాదములకు శుశ్రూషలు చేయుచుఁ బరలోకము సాధింపఁ బూనుచున్నవాఁడు. సీతాదేవి నిర్జనమయిన వనమునందున్నను, యింటియందున్నట్లే, దిగులుమాని, రామునియందే మనసుంచి, కుశలముగనున్నది. ఈ సీతాదేవి యావంతయైనను దిగులు నొందియున్నట్లు కాన్పింపదు. ఆమె యరణ్యవాసమునకుఁ దగినదానివలెనే తోఁచుచున్నయది. పట్టణోద్యానములందు సీత యెట్లు విహరించుచుండెనో, అట్లె జనులులేని కాననందును విహరించుచున్నది. బాలచంద్రునివంటి మోమునుగల యీ రామామణియగు సీత నిర్జన వనంబున నున్నను, రాముఁడికిఁ దన మనసు నప్పగించినది యీఁటివలనఁ బాలికవలె నచ్చటఁ గ్రీడించుచున్నది. ఈ సీతయొక్క మనోజీవితములు రెండును రాముని యధీనములైయున్నవి. ఒకవేళ రామునితోడఁబోక, సీత యయోధ్యయందున్నను, నయోధ్య సీతమనస్సున కడవిగానే తోఁచును. మఱియు సీత యయోధ్యాపురమునకుఁ గోసుదూరమున

నుండు వనంబులందు విహరించునట్లు తలఁచి, నడుదారియందుఁ గనఁబడు గ్రామములను, నగరములను, నదులను, నానావిధ వృక్షములనుగూర్చి రాముఁడినైనను లక్ష్మణుఁడినైన నడిగి తెలిసికొనుచున్నది. సీత కైకేయినిఁ గూర్చి తొందరగాఁ జెప్పినమాట యిది యొక్కటియే. అని చెప్పి, "అది చెప్పినఁ గౌసల్యా దశరథులు మఱింత వ్యసనము నొందుదు"రని యించి. "అది యేదో యిప్పుడు జ్ఞప్తికి రాకున్నది" యని నోటినుండి పొఁబొపాటుచే వచ్చిన యామాట నావలకుఁ ద్రోసి కౌసల్యకు నానంద దాయకమగు వాక్యము పలుకఁగోరి, "ఓ దేవీ, చంద్రకిరణములతో సమమయిన యామె శరీరకాంతి దారి నడచుటవలనఁగాని, యాగాలి సోఁకుడువలనఁగాని, వ్యాకులపాటుచేతఁగాని, యొండలకుఁగాని మాఱు పాటు నొందకున్నది. ఆ దానశీలురాలయిన సీతయొక్క ముఖము పున్నమచంద్రునితోను గమలముతోను సమానమై యొప్పటికి నొక తీరుననే యున్నది. ఆ సీత యొక్క పాదములు లత్తుక రసమువలె నెట్టని కాంతి గలవిగావున లత్తుకయలఁదకపోయినను నిప్పుడుగూడఁ దామరమొగ్గలకాంతివంటి కాంతిచే మీఱియున్నవి. సీత కాలియందెలు ధరింపకున్నను, రామునియందలి ప్రేమచేతఁ గాలియందెల ప్రోఁతకుఁ దగినట్లు సవిలాసముగ నిపుడును దిరుగుచున్నది. సీతాదేవి యేనుఁగునొండె, సింహమునొండె, వ్యాఘ్రమునొండె చూచినను రాముని చేతులను బట్టుకొన్నదై భయమునొందకున్నది. కావున వారిని గూర్చి విచారపడ నక్కఱలేదు. మనలఁగూర్చియుఁ జింత యక్కఱలేదు. దశరథనృపాలునిఁగూర్చియుఁ జింతింప నవసరము లేదు. ఈ పితృవాక్య పరిపాలన రూపమయిన చరిత్రము లోకమున శాశ్వతమైయుండఁగలదు. వారును దుఃఖముఁ బాఱఁదోలి, సంతుష్టమనస్కులై, మహర్షులు నడచిన దారులలో నడచుచు, నడవులందుండ నపేక్షగలవారలై, యచ్చటఁ గందమూల ఫలములను దినుచు శ్రేయస్కరమగు తండ్రిప్రతిజ్ఞను బరిపాలించుచున్నారు" అని సుమంత్రుఁడు కౌసల్యతోఁ జెప్పెను. అట్లు సుమంత్రుఁడు మంచి మాటలను జెప్పి యూరడించుచున్నను, కౌసల్యాదేవి పుత్రవియోగ శోకము సైరింపఁజాలక, హా! ప్రియా! హా! పుత్రా! హా! రాఘవా! యని యాక్రోశించుచునే యుండెను.

61-వ సర్గము

కౌసల్య దశరథుని దూఱుట

ధర్మపరుఁడును, జనులను సంతోషపెట్టువారిలో నుత్తముఁడునైన రాముని యరణ్యవాసమునకై కౌసల్య కడు దుఃఖించి, యేడ్చుచు భర్తను జూచి, యిట్లనియె: "మహారాజా, దశరథుఁడు సర్వభూతము లందు దయగలవాఁడనియు, దాతయనియు, ప్రియము మాటాడువాఁడనియు మూఁడులోకములందును నీ కీర్తి వ్యాపించియున్నది. ఇప్పుడిష్టముగాని పని చేసితివి. ఓ రాజేంద్రా, రాజపుత్రులగు రామలక్ష్మణులింతదనుక సుఖముగాఁ బెఱిగిరి. అట్టివారు దుఃఖముచే నొచ్చినవారై, సీతతోఁగూడ నయ్యడవులం దేలాగు కష్టముల నోర్చి యుండఁగలరు? జవరాలును, పిన్నవయస్సుగలదియు, సుకుమారియు, సుఖములకుఁ దగినదియునైన సీత యడవులం దెండను, చలిని నెట్లోర్చుకొని యుండఁగలదు? ఇంతవఱకు నిచ్చట రుచికరములగు శాకపాకములతోఁ గూడిన మేలయిన యన్నమును భుజించుచుండిన రాజపుత్రి యిప్పుడు నెమలిబియ్యమును కందమూలఫలములను ఎట్లు భుజింపఁగలదు? పూర్వమిచ్చట గీతములయూ, వాద్యములయు ధ్వనిని వినుచుండిన సీత యిప్పుడు భయంకరములైన సింహ వ్యాఘ్రాదుల గర్జనముల నెట్లు వినుచుండఁగలదు? ఇంపయిన గానములయు, వాద్యములయు ధ్వనులను విని సంతోషపడుచుండిన యుత్తమాంగనయగు సీత యిప్పు డెట్లు భయంకరములగు మృగములయొక్కయు సింహములయొక్కయు బొబ్బరింతలను వినుచుండఁగలదు? దేవేంద్రునిధ్వజమువాఁడిక జనులందఱకు సంతోషముఁ గల్గించువాఁడును, దీర్ఘబాహువులు గలవాఁడును, బలవంతుఁడునైన రాముఁడినుపగుదియంబోలు తన చేతిని దిండుగాఁ జేసికొని యెచ్చట నిద్రించుచున్నాఁడో! తామరపువ్వులవన్నె గలదియు, చక్కని కొనవెండ్రుకలతోఁ గూడినదియు, తామరపువ్వులతావివంటి తావి గల నిట్టూర్పుతోఁగూడినదియు, తామరపువ్వుల రేకులవంటి కన్నులు గలదియునైన యా రాముని యందమయిన ముఖమును నే నెప్పుడు చూడఁగలనుఁ? నా హృదయము వజ్రసారముతోఁ జేయఁబడినది. నిక్కము కావుననే రాముని జూడకున్నను వేయిముక్కలుగ బ్రద్దలుగా కున్నది.

ఓ నృపాలా, నా వారగు రామాదులను, సుఖములకుఁ దగినవారిని దయమాలి యడవికిఁ బంపితివి. వా రిప్పుడు దుఃఖితులై యచ్చటచ్చట నడవులలో నల్లాడుచున్నారు. నీ హృదయ మెంత క్రూరమైనది? ఎంత ఘాతుకపుఁ బని సేసితివి? రాముఁడు పదునేనవయేట మఱలివచ్చినను రాజ్యముగాని, ధనముగాని గ్రహింపఁబోఁడు. వానిని భరతుఁడే యనుభవించును. లోకమునఁ గొందఱు శ్రాద్ధములకు తమ బంధువులనే నిమంత్రణము చేసి, శ్రాద్ధానాంతరమునఁ దమతోడ నిష్టపంక్తియందు భుజింప బ్రాహ్మణోత్తములఁ బిలుతురు. గుణవంతులును, పండితులు నగు బ్రాహ్మణోత్తములు, గుణహీనులగు బ్రాహ్మణులను కర్తలు నియంత్రించి, వారికి మొదటఁ బెట్టుటవలనఁ దము కావల నమృతము నిడినను దాని నంగీకరింపరు. తమకుముందు భుజించినవారు బ్రాహ్మణులేయైనను, ఆఁబోతులు తమ కొమ్ములు నఱికివేయుటకు సహింపఁజాలనట్లు భుక్తశిష్టమైన యన్నమును గుడువఁజాలరు. ఇట్లు తనకంటెఁ జిన్న వాఁడగు భరతునిచే నేలఁబడిన రాజ్యము గైకొనుట పెద్దవాఁడును, శ్రేష్ఠుఁడునైన రాము నకు నవమానకరముగదా! వ్యాఘ్ర మితరమృగములు దిన్న మాంస మును దినఁజాలనట్లు, నరవ్యాఘ్రుఁడగు రాముఁడును నొరులు చవిగొన్న రాజ్యము నంగీకరింపఁజాలఁడు. హావిస్సులు, ఆజ్యము, పురోడాశములు, కపాలు, చండ్ర యూపములు నొక యాగమున నుపయోగింపఁబడినవి మఱియొక్క యాగమున నుపయోగింపఁబడవుగదా! అట్లె రాముఁడు సారమునశించిన కల్లువలెను, సోమమునశించిన యజ్ఞమువలెను జివిగొనఁ బడిన రాజ్యమును బాలింప నియ్యకొనఁడు. అతఁడు పరులకోపమునకు లొంగనివాఁడు గావున నీ యవమానమును సైరింపఁజాలఁడు. అతఁ డాగ్రహావంతుఁ డయ్యెనేని, కటుకుటమ్ములతో మందరపర్వతమునైనను దుత్తునియలు చేయఁగలఁడు. ఆతఁడు కోపవంతుఁడై చంద్రసూర్య గ్రహనక్షత్రములతోఁ గూడియున్న యాకాశమును దలక్రిందులు చేయఁగలఁడు. అట్టివాఁడయినను, నీవు తండ్రివిగాన నీమాట క్రోయఁ జాలకున్నాఁడు. అనేక పర్వతములతో నిండిన యీ పుడమినెల్లఁ గలియఁ బెట్టఁగలఁడు. జనులందఱుఁగూడివచ్చినను సరకుసేయక యడ్డగింపఁ గలఁడు. మహోత్సుఁడగు రాముఁ డన్నియుఁ దెలిసినవాఁడు గావున నీవు

తండ్రివనుగౌరవముచే నిన్నుఁ జంప సాహసింపలేకున్నవాఁడు. బలిష్ఠమయిన వ్యాఘ్రిము తోఁకఁబట్టియీడ్చిన నోర్వఁజాలనట్లు, రాముఁ డిట్టియగౌరవము నోర్వఁజాలఁడు. ఇతనిని ముల్లోకములవారు గూడివచ్చినను, నేమియుఁ జేయఁజాలరు. ధర్మాత్ముఁడయిన రాముఁడు ధర్మహీనమైయున్న యీ లోకమును ధర్మము గలదానినిగాఁ జేయఁగలఁడు. ఓ నృపాలా! పొడవుచేతులవాఁడును, ఎక్కువ పరాక్రమముగలవాఁడునైన రాముఁడు ప్రళయకాలాగ్ని సకల భూతములను బోలెఁ దన బంగారు బాణములచే సప్తసముద్రములనుసైతము దహింపఁజాలును. నృపేంద్రా, నీవు న్యాయమునం దెక్కువ యాసక్తిగల కుమారుని నడవికిఁ బంపితివికదా! నీవు బ్రాహ్మణోత్తము లాచరించుననియు, శాస్త్రములందుఁ జెప్పఁబడినవియునైన శాశ్వతధర్మములను జేసినవాఁడవగుదువే? ఆఁడుదానికిఁ బెనిమిటి మొదటిదిక్కు. అతనికి దరువాత రెండవదిక్కు కొడుకు. మూఁడవదిక్కు దాయాదులు. నాలగవదిక్కు యీ లోకమునఁనె లేదు. ఆ మూఁడుగతులలో మొదటి గతివియైన నీ వేమో నా సవతికి లోఁబడినవాఁడవు కాన నీవు నాకు గతివికావు. ఇఁక రెండవగతియగు రాముఁ డన్ననో యడివికిఁ బోయెను. నిన్నుఁ బాసిపోవుట ధర్మముకాదు; కనుక, నేను రామునితోఁగూడఁ బోవఁజాలనైతిని. భర్తయగు నీవును, పుత్రుఁడగు రాముఁడును నుండఁగా నితరులగు చుట్టములఁ నాశ్రయించుట యుక్తము గాదు; కావున, నీవు నన్ను నానావిధముల మొక్కఁచెఱచితివి. ఓ నృపాలా! నీవు రాజ్యమెల్లఁ బాడుచేసితివి, నీవును చెడితివి; మంత్రులకును జేటు తెచ్చితివి. నన్నును, నా కొడుకగు రాముని పౌరులను అధోగతి పాలు సేసితివి. నీ భార్యయగు కైకేయియు, నీ ముద్దులకొడుకగు భరతుఁడును సంతసపడునట్లు చేసితివి." అని దశరథునిఁ బొడుపుమాటలతో నెత్తి పొడిచెను. దశరథభూమినాథుఁడును కౌసల్య యివ్విధముగాఁ జెప్పిన కర్ణకఠోరములగు మాటలను విని మిక్కిలి వగచి మూర్ఛనొందెను. పిమ్మటఁ గొంతసేపటికిఁ దెప్పిఱిల్లి, తాను ముందుచేసిన పాపకర్మమును స్మృతికిఁ దెచ్చికొని మఱిల దుఃఖము నొందెను.

62-వ సర్గము

దశరథుఁడు కౌసల్యను నూఱడించుట

ఇట్లు కౌసల్య కోపముతో నాడిన నిష్ఠూరపు మాటలను విన్న పాఁడై దశరథుఁడు వగచి, మనమునఁ గలఁగి, మూర్ఛనొంది, చాల సేపటికి మఱలఁ దెప్పిఱిల్లి వేఁడినిట్టూర్పులు విడుచుచు, మఱలఁ బ్రక్కననున్న కౌసల్యను జూచి, "నే నిట్లు పుత్రశోకము నొందఁ గారణమేదియైన నున్నదా? అట్టి పాపకృత్యము మున్నేమిచేసితినో?" యని యాలోచించి, కడసటికిఁ దానుశబ్దవేధి యయి (=చప్పుడు గనిపెట్టి బాణము వేయువాఁడయి) చేసిన పాపకృత్యము జ్ఞప్తికిఁ దెచ్చుకొని, ఉన్నయొక్కవ్యసనమున కా రెండవ వ్యసనము దోడుగాఁగా, రెండు శోకములచే దహింపఁబడుచు, వణఁకుచు దోసిలిగట్టి, తలవంచుకొని కౌసల్య నోదార్పఁబూని యా మెను జూచి, "ఓ కౌసల్యా, నేఁ జేతులు జోడించుకొని మ్రొక్కెదను, నిన్ను బతిమాలుకొనెదను. నీ వెల్లప్పుడు శత్రువులందయినను బుత్రప్రేమగలిగి, చెఱుపు చేయఁ బూనవుగదా! ఓ దేవీ, మగఁడు గుణవంతుఁడైనను, గుణహీనుఁ డయినను స్త్రీలకుఁ బ్రత్యక్షదైవ మని ధర్మముల నెఱిఁగిన యితివ లెఱుఁగుదువుగదా! నీవును అట్లే ధర్మములం దాసక్తిగలదానవు. ఎల్లపుడు లోకమున గుణ దోషములను జక్కఁగా నెఱింగినదానవు. అట్టి నీ కెంత వ్యసనము ప్రాప్తించినను, మిక్కిలి నొచ్చియున్న నన్ను మాటలచే నొప్పించు చున్నావు. ఇది నీకుఁ దగదు" అనిపలికెను.

అట్లు దశరథుఁడు మిక్కిలి దీనముగా జాలిపుట్టునట్లు చెప్పిన మాటను విని, కౌసల్య కన్నీరు ధారలుగాఁగార దుఃఖించుచుఁ దామర మొగ్గంబోలు రాజేంద్రుని దోసిలి నెత్తి తన శిరమున నుంచుకొని, తత్తరపాటుతోడ మాటలు తడఁబడుచుండ నిట్లనియెను. "దేవా! నన్ననుగ్రహింపుము. తలయొగ్గి వేఁడుచున్నాను. నీకిదే పాట్టాంగనమస్కారము. నీచే యాచింపఁబడి పాడయితిని. నీచేతఁ జంపఁదగినదానినిగా నయితినిగదా! కొనియాడఁదగినవాఁడును, బుద్ధిమంతుఁడునునైన మగఁడు ఎవఁ డెసఁగొనియాడుచున్నాఁడో, ఆ యాఁడుది యిహపరములకు రెంటికిని గాని యధోగతిని బొందును. ఓ ధర్మజ్ఞుఁడా! ధర్మ

స్వరూపము నే నెఱుఁగుదును. నీవు సత్యవంతుఁడవనియు నెఱుఁగుదును. అయినను, పుత్రశోకముచే నొడలు దెలియక నే నేదియో చెప్పితిని. నాథా దానిని మన్నింపుము. శోకము ధైర్యమును బోఁగొట్టును. శోకము సర్వమును బోఁగొట్టును. శోకముతో సాటియగు శత్రువు పుడమిని లేఁడు. శత్రువు చేతి దెబ్బనయిన నోర్వవచ్చునుగాని, హాత్తుగా సంభవించిన యించుక దుఃఖమునేనియు నోర్చుట యలవికాదు. ధర్మములనెల్లఁ నెఱింగినవారయిననను, సకలశాస్త్రములఁ జదివినవారయిననను, ధర్మార్థములను పురుషార్థములవిషయములం దేమియు సంశయము లేనివారయిననను, శోకముచే ముసింఁచిన బుద్ధిగలవారలై యుక్తాయుక్తములఁ దెలియక జితేంద్రియులగు యతులు సైతము నవివేకము పాలగుచున్నారు. రాముఁ డడవికిఁబోయి, నేటి కైదుదినము లయినవి. దుఃఖముచేఁ గ్రుంగి కూలారుచున్న నాకు నీ యయిదు దినము లయిదేండ్లతో పాటిగా నున్నవి. ఆ రామునే తలఁచుచుండు నా మనమున శోకము నదులప్రవాహముచే సముద్రజలము వృద్ధినొందునట్లు, దినదినమునకు వర్ధిఁ జెందుచున్నది." అని కౌసల్య దశరథనృపాలునితో మాటాడుచుండఁగా, సూర్యుఁ డస్తమించెను. రేయియు నాసన్నమయ్యెను. అట్లు కౌసల్య మంచి మాటలచే బుజ్జగించుచుండఁగా, నృపాలుఁడు శోకాక్రాంతుఁడై నిద్దుర చెందెను.

63-వ సర్గము

దశరథుఁడు తన పుత్రశోకమునకుఁ గారణముఁ దెల్పుట

అంత కొంతసేపటికి మేల్కొని, దుఃఖముచేఁ గొట్టువడిన మూన సముగలవాఁడైయున్న ఖిన్నసమానుఁ డగు నా దశరథనృపాలుఁడు, సూర్యుఁడు రాహువుచే మ్రింగఁబడునట్లు చింతచే మ్రింగఁబడినవాఁడై రాముఁ డడవి కేఁగిన యాఅవనాటినడు రేయిని శ్రీ రామాదు లరణ్యమున కేఁగుటకుఁ గారణమయిన తన పాపకర్మమును దలఁచి మిగులవగచి యా పాపకర్మమును పుత్రశోకముచే నొచ్చియున్న కౌసల్యకుఁ జెప్పఁదలఁచినవాఁడయి యా మెతో నిట్లనియె. "ఓ మంగళస్వరూపురాలా! లోకమున మానవుఁడు శుభమునేకాని అశుభమునేకాని తా నాచరించిన కార్యమునకుఁ దగినఫలమును బొందుచున్నాఁడు. ఎవఁడు కార్యము

లారంభించునపుడు కార్యముల గొప్ప కొంచెములను, గుణదోషములను నెఱుఁగఁడో, వాఁడు మూఢుఁ డనఁబడును. ఏ మనుష్యుఁ డెట్టిగాను నందముగాను నుండు మోదుగుపూవును జూచి, దానియొక్క పండ్లను ఆలాగే గొప్పవిగా నుండునని తలఁచి, పండ్లు కావలెననికోరి, చిన్న చిన్న పూవులుగల మామిడిచెట్లు చిన్న చిన్న పండ్లనే పండునేమో కనుక నివి మన కక్కఱలే దని యెంచి, మామిడితోఁపును నఱికి, మోదుగుచెట్లకే నీళ్ళుపోసి పెంచుచున్నాఁడో, వాఁడు పండ్లకాలమున మోదుగుచెట్లనుండి తా పండ్లను బొందక విచారపడును. కావున ఫలమును గనుఁగొనక యెవఁడు కర్మనే యనుసరించుచున్నాఁడో, వాఁడు మోదుగుచెట్లను బెంచినవానివలె ఫలసిద్ధి యగు సమయమున నా ఫలంబు నొందక విచారపడును. నేనుకూడ నిప్పు డాచందమునన్నే, మామిడితోఁపును నఱికి, మోదుగుచెట్లను బెంచితిని. ఫల మనుభవింపవలసి వచ్చినప్పుడు మూఢుఁడనై రామునిఁ బాసి చింతిల్లుచున్నాను. నేను ప్రాయమున మృగములను వేఁటాడునప్పుడు మృగములఁ జూచి వేఁటాడక, వాని చప్పుడు గనిపెట్టి గుఱిపెట్టి మృగములపై బాణము లేసి చంపుచుంటిని. ఆ కారణముచేతనే నే నీపాపము నొడిగట్టుకొంటిని. కౌసల్యా, నేను పడుచుఁదనమున నున్నపుడు "ఈ పడుచువాఁడు చప్పుడుగనిపెట్టి బాణము నేయఁగలవాఁ"డని ప్రసిద్ధిఁ జెందియుంటిని. ఆ యహంకారము చేతనే నే నీ పాపకర్మముఁ జేసితిని. దేవీ, మూఢుఁడు విషమును విష మని తెలియక మ్రింగినట్లు నేనును ఈ దుఃఖమును స్వయముగానే తెచ్చికొంటిని. విషము మ్రింగినవాఁడు పడునవస్థ నేనును బొందవలసి నదే. ఒకానొకఁడు మోదుగుపూవులను జూచి, వానిపండ్లును గొప్పవిగా నుండునని తలఁచి వానిని బోషించి, పండ్లయదనునఁ దన కోర్కికిఁ దగిన ఫలములను బొందక విచారపడునట్లు నేనును శబ్దవేధిత్వమువలనఁ గీర్తిఁ బడసి, దాని ఫలమును గొప్పదిగనే యుండునని భ్రమసి కడపట నిట్టి ఫలమును బొందితిని. ఆ కథను నీకు విస్తరించి చెప్పెదను వినుము: దేవీ, నిన్ను నే నప్పటికిఁ బెండ్లాడ లేదు. నే నప్పుడు యువరాజునుగ నుంటిని. ఒకప్పు డట్టిసమయమున మదమును, కామమును హెచ్చఁ జేయు వర్షాకాలము వచ్చెను. సూర్యుఁడును గ్రీష్మర్తువునందు ద్రవ

ద్రవ్యములనెల్లఁ బీల్చి, పుడమినంతయుఁ దపింపఁజేసి, దక్షిణదిశ కేఁగు దెంచెను (ఉత్తరాయణముపోయి దక్షిణాయనము వచ్చెను). వెంటనే వేఁడిమి చల్లాఱెను. మేఘములు నల్లగాఁ గనఁబడినవి. కప్పలు, చాతక ములు, నెమళ్ళు అన్నియు సంతసముతోఁ గూయసాగినవి. పశు లన్నియు ఱెక్కలవిాఁదిభాగములు తడియుటచే స్నానముచేసినవాని వలెఁ గనఁబడుచు, వానగాలిచే నల్ల లాడుచుండు చెట్లకొన కొమ్మలకు మిక్కిలి ప్రయాసముతోఁ జేరినవి. పైనఁబడినదియుఁ, పడుచున్నదినైన నీటిచేఁ దడిసినదియు మదించినయేనుఁగులుగలదియునగుపర్వతమున సము ద్రమువ్రభంగిఁ జూపఱకుఁ గన్పట్టుచుండెను. కొండ చఱియలనుండి పాఱు సెలయేళ్ల ప్రవాహములు స్వయముగా నిర్మలములయియున్నను, గైరికాది ధాతువుల (కావిరాళ్ళ) చేరికవలనఁ గొన్ని చోట్లఁ దెల్లఁగను, మఱికొన్ని చోట్ల నెఱ్ఱఁగనునై కార్చిచ్చుయొక్క బూదితోఁ గలిసి, పాములవలె వంకరలుగాఁ బాఱుచుండినవి. ఆ వర్షర్తువునందుఁ బ్రవాహ ములు నిర్మలములయినను, వాన కురియుటచేఁ గలఁకపాఱిన యొట్లని నీరు గలవై మెట్టలందుఁగూడఁ బ్రవహించుచుండెను. అట్టి కడు సంతోష ప్రదమయిన యా వర్షర్తువునందు ధనుర్బాణములను ధరించి, రథా రూఢుండ నై, సరయూనదీతీరమునకుఁ జని, యింద్రియాశవలన నచ్చటి మడుగులలో రాత్రులందు నీరు ద్రావవచ్చు నడవి దున్నలనుగాని, మదపుటేనుఁగునుగాని, తక్కిన భయంకరమగు నే మృగమునుగాని చంపఁగోరి, విల్లెక్కుపెట్టికొని, యవి వచ్చెడి రేవులకుఁ జేరువనే మఱు గున నుంటిని. అప్పుడు నేనును తీరమునకు వచ్చిన యొక మృగము యొక్క చప్పుడు గనిపెట్టి, యా మృగమును మఱియొక్క క్రూరమృగ మును జంపితిని. పిదపఁ గంటికిఁ దెలియనంత కటికి చీఁకటియం దొక మునిపుత్రుఁడు కుండను నీటియందు ముంచుచుండఁగాఁ గలిగిన బుడ బుడ శబ్దమును బృంహితముచేయుచుండు నడవియేనుఁగుయొక్క చప్పుడని భ్రమసి, కోఱలలో విషముగల కృష్ణసర్పమువలె మండుచున్న బాణమునెత్తి, యేవైపునుండి చప్పుడు వినవచ్చెనో, యావైపున నేనుఁ గున్నదని యెంచి గుఱిపెట్టి యా బాణము నేసితిని. బాణమును విడిచితినో లేదో, అంతలోపలనే యచ్చటనుండిన యొక మునిపుత్రున

కాబోణము దెబ్బ యాయపుఁబట్టునఁ దగులుటచే నా మునిపుత్రుఁడు నీటిలోఁ బడుచు "నయ్యో యమ్మో" యని బిగ్గఱగాఁ గేక వేసి, "వీల మాబోటి ములులపై నీ బాణము వచ్చిపడినది, మీ మొక్కరిఁజోలికిఁ బోవువారముకామే? నేను ఈ కుండతో నీళ్ళు ముంచుకొనిపోవుటకై యీ రేవున నొక్కఁడ రని యిచ్చటి కేతెంచితిని. ఎవ్వఁడు నన్ను బాణముతోఁ గొట్టెను? ఎవనికి నేనేమియపకారము నేసితిని? జీవహింసను మాని, జితేంద్రియుండనై వనమునందలి కందమూలఫలములను దినుచుఁ దపము నేయుచుండు నాబోటివాని నెవ్వఁడు బాణములవాతఁ బెట్టునట్లు దండన విధించును? జడలను దాల్చి, నారబట్టలనుగట్టి కృష్ణాజినము గప్పు కొని తపస్సుచేయుచుండు మునిపుత్రుఁడైన నన్నుఁ జంపి యతఁ డేమి కార్యము సాధింపఁగలఁడు? నే నతని కేమి యపకృతి నొనర్చితిని? ఎవ్వఁ డిట్లు తనకు నితరులకును జేటుమాత్రమే తెచ్చెడి యీ పనికిమాలిన పనిని జేసెను? ఇట్టి పాతకృత్యముఁ జేసినవాని నెవనినైనను గురుపత్నీ సంగమముచేసినవానిం బోలె జనులు లెక్క పెట్టరు. నేను నా ప్రాణ ములను గోల్పోయినందు కంతగా దుఃఖింపను. అయినను, నాతల్లిదం డ్రులు కడువృద్ధులు. కన్నులులేనివారు. వారికి నే నొక్కఁడనే పుత్రుఁ డను. నేను వారిని బహుశ్రద్ధతో నింతకాలము గాపాడితిని. నా ప్రాణ ములు పోయినవెనుక ముదుసలులగు నా తల్లిదండ్రుల నెవ్వఁడు కాపాడఁగలఁడు? వా రేగతిని బోవుదురు? ఎవఁ డాహార్తుఁడు? నన్నును, మా తల్లిదండ్రులను నెవఁడో మూఢుఁడు కఠినుఁ డొక్క బాణముచేఁ జంపెను." అను మాట వినవచ్చెను. నేను ధర్మమునందే కోర్కిగలవాఁడ నగుటంజేసి, యాదీనవాక్యములు వినినమాత్రమునన్నే, నా చేతినుండి బాణముతోఁగూడ విల్లు తనంత జాఱి క్రిందఁబడెను. ఆ ప్రకారము రేయియం డానదీ తీరముననుండి యేడ్చుచున్న యామునికుమారునియొక్క రోదన ధ్వనిని విని, దుఃఖాతిశయముచే మిగులఁ దత్తరపడుచు స్మృతిదప్పి పడియుంటిని. పిమ్మటఁ గొంతసేపటికి మూర్ఛనుండి తెప్పఱిల్లి, ధైర్యసంతోషములు లేమిచే మనస్సుచెడిన వాఁడనై నేను రేవును సమీపించి, నా బాణముచేఁ గొట్టఁబడి, విటిమఁబాఱిన జడలును, డొరలిన నీటికుండయును, ధూళిబ్రుంగి

నెత్తుటఁదడిసిన శరీరమునుగలవాఁడయి ముల్లికి గ్రుచ్చుకొనియుండు టచే నొప్పితో నేలమీఁదఁబడి పొఱలుచున్న మునిపుత్రునిఁ జూచితిని. అతఁడును, భయముచే మనస్సాస్థ్యము లేకయున్న నన్నుఁ దనతపో మహిమచే దహించువానివలెఁ జూచుచుఁ జూడ్కి నిగిడించి, నాతో నిట్లనెను. "ఓ నృపాలా! నే నరణ్యవాసిని. నేను నాతండ్రికి నుదకముఁ గొనిపోవ వచ్చితిని. నిరపరాధుఁడ నయిన నన్ను బాణముతోఁ నేసితివి. నేను నీకేమి యెగ్గునేసితిని? ఒక బాణముచే నన్యాయపుఁబట్టునఁగొట్టి, నన్నును, ఆదరువులేని నాతల్లిదండ్రులను జంపితివి. నా తల్లిదండ్రులు ముసలివారు; దుర్బలులు; గ్రుడ్డివారు. కావున వారు మిగుల దప్పిగొని యున్నారు, నేను నీళ్ళుదెచ్చి యిత్తునన్న వాంఛతో నారాక కెదురు చూచుచు నోర్వరానిదప్పిక నెట్లోర్చియుండఁగలరు. నేను చేసిన గొప్ప తపస్సునకును, నేఁ జదివిన చదువునకును నేమి యుపయోగము? నా తండ్రి నేనిచ్చటఁ బడియుండుస్థితి తెలియఁజాలఁడు. ఒకవేళఁ దెలిసి నను, నడువను శక్తిలేని నాతండ్రి, పెనుగాలి వీచుటచే విఱిగిపడుచుండు చెట్టునకుఁ బొరుగున నున్న వృక్ష మేమియు తోడ్పాటుఁ జేయఁజాల నట్లు, నాకేమి తోడ్పాటు చేయఁగలఁడు? ఓ రాఘవా, నీవె నా తండ్రి కడకు వేగ నేగి, యీ విచార వార్తను చెప్పిరమ్ము. రగులుకొనిన యగ్నిహోత్రుఁడు ననము దహించునట్లు, నాతండ్రి యలిగినవాఁడై నీకుఁ గీడొనరింపఁడుగాక! నృపాలా! మాతండ్రి యాశ్రమమునకీకాలి త్రోవఁ బోవచ్చును. నీ వచ్చటికేగి మాతండ్రిని బ్రార్థింపుము. ఆతఁ డాగ్రహా పడి నిన్ను శపింపకుండుఁగాక! అట్లు నీ వచ్చటికిఁ బోయి, యాతనిని బ్రార్థింపవేని, యతఁ డాగ్రహావేశుఁడై శాపమొసఁగును. ఓ నృపాలా! నీటివెల్లువ యెత్తయిన యిసుకయొడ్డును గరఁగించునట్లు ఈ వాఁడి యైన బాణము నా యొమ్మున నాఁటికొని, నన్ను మిక్కిలి బాధించు చున్నది. నా మర్మములందు గ్రుచ్చుకొన్న యీ బాణము బెజికి వేయుము." అని యా మునికుమారుఁడు చెప్పఁగా, నేనును, "బాణము బెజికి వేయకున్న నీ మునిపుత్రుఁడు బాధపడుచునుండు ననియు, బాణము బెజికివేసిన, మృతినొందు" ననియుఁ దలఁచి, బాణము నూడఁబెఱుకు విషయమునఁ గొంచెము విచారము నొందియుంటిని.

దుఃఖముగలవాఁడనై, ధైర్యము మాని, "బాణము పెఱికివేయకున్న, మునిపుత్రుఁడు బాధపడును. బాణము పెఱికివేసినఁ బ్రాణవియోగము నొందును. నాకు బ్రహ్మహత్యా దోషము వాటిల్లు"నని యెట్లు చేయుట కును ధోఁపక యోచించుచున్న నా తలంపును దెలిసికొన్నవాఁడై, యవయవములను బొఱలించుచు, నేలపైఁ బొఱలుచు, సొక్కి సోలుచు, నంతము సమీపించినవాఁడయి, నన్నుఁ జూచి "ఓ రాజా! శోకము మాని ధైర్యము నవలంబింపుము. నేనును మనసున ధైర్యముఁ బూనెదను. బ్రహ్మహత్య సంభవించు ననెడు భయము విడిచి, నా యొమ్ము నుండి యీ బాణము నూడఁదీయుము. నేను ద్విజస్తుండను గాను; నేను శూద్ర యోనియందు వైశ్యునకుఁ బుట్టినవాఁడను. కావున నీ కా మెర మెర యక్కఱ లేదు." అని కష్టముతోఁ జెప్పుచు, మర్మస్థానమున బాణము నాటుకొనుటచేత నయిన యూరాటమున నిటటు తిరుగుచు నొక ప్పుడు చెయివులుమాని, మఱొక్కపుడు నేలపైఁ బొఱలుచు, వే ఱొకప్పుడు దేహమును సంకోచపఱచుచున్న మునిపుత్రుని యొమ్ము నుండి బాణము నూడఁబెఱికితిని. ఆ తపోధనుఁడగు మునిపుత్రుఁడు నన్నుఁ దలయొత్తిచూచి మిక్కిలి భయపడి ప్రాణములను విడిచెను. అట్లు సరయూనదియందుఁబడి, దేహమంతయుఁ దడిసి, మిక్కిలి యేడ్చి కష్టముచే నిట్టూర్పులు విడుచుచున్న యా మునిపుత్రునిఁజూచి, నేనును మిక్కిలి విచారమునొందినవాఁడ నైతిని." అని దశరథుఁడు కౌసల్యా దేవితోఁ జెప్పెను.

64-వ సర్గము

దశరథుఁడు పుత్రశోకముతో మృతినొందుట

ధర్మాత్ముఁడగు దశరథుఁ డక్రమముగాఁ దాఁ జేసిన యా మునిపుత్రుని హత్యనుగూర్చి విలపించుచు, కౌల్యాదేవితో నిట్లనియెను. "ఓ దేవీ! నేను దెలియక మహా పాతక మొనర్చినందుకై పశ్చాత్తాపపడుచు నింద్రియస్వాస్థ్యముఁ దప్పి, "అప్పుడేమి చేసిన మేలు గలుగు" నని యొక్కడనే యోజించితిని. పిదప మంచి నీటితో నిండిన యూకలశముఁ గైకొని, మునిపుత్రుఁడు చెప్పిన కాలిత్రోవనే పోయి, యా యాశ్రమ

మును జేరి, యచ్చట బలహీనులును, గ్రుడ్డివారును, ముసలివారును, అండ లేనివారును నైనందున తెక్కలూడ్చిన పక్షులవలె నొక్కచోటఁ గూర్చున్న వారును, అడుగు పెట్టక తమ కుమారునిఁ గూర్చిన సంగతులనే మాటాడుకొనుచున్న వారును, నా మూలమున నా పుత్ర విషయకమగు నాశ లేనివారును, దిక్కులేనివారివలె నూరకున్న వారునునగు నా ముని పుత్రునితల్లిదండ్రులను జూచితిని. ఆ యాశ్రమమునకుఁ బోయిన వెంటనే న్యాయ్యముగా మునిపుత్రునిఁ జంపితి ననుదుఃఖముచే మన మునఁ గుందుచు నమ్మునితల్లిదండ్రు లేమందురో యని దిగులుపడి, మఱింత దుఃఖమునొందితిని. అప్పుడు ముదుసలియగు నమ్ముని నా యడుగుల చప్పుడు వినినంతనే గన్నుఁ దనపుత్రునిగా నెంచి, "ఓరీ నాయనా! యేల యింతతడవు సేసితివి? వేగిరముగ నీటిని దెచ్చియిమ్ము. నీవు నీటిలో నాడుచు నీట్లాలసించితివని తలఁచెదను. ఇదిగో! నీ తల్లి నిన్నుఁజూడ దహతహపడుచున్నది. వేగిరముగ నాశ్రమములోనికిఁ బ్రవేశింపుము. ఓ పుత్రుఁడా! నేనుగాని, తల్లికాని యేదియైన నీ కప్రియమొనరించినను, నీవు దహస్సంపన్నుఁడవు గావున దానిని మన మునసిడికొనకుము. గతిలేనివార మగు మాకు నీవే గతివి. కన్నులులేని వారమగు మాకు నీవే కన్నులు. మా ప్రాణములు నీయండే నిలిచి యున్నవి. నీవు మాతో నేల మాటలాడకున్నావు" అని యనెను. ఆ మాటలు విని, తొట్రుపడుచున్నదియు, స్పష్టముగానిదియు, అక్షర ములు చక్కఁగా వినఁబడనిదియునైన వాక్కుతోఁ గూడి, మీఁదు మిక్కిలి వెలిచి, మనస్సునఁగలిగిన భీతిని, మాటలతొట్రుపాటు వ్యాపారములచే నణఁచుకొని, మునిని హెచ్చరించి "నేను దశరథుఁ డను. క్షత్రియుఁడను. మహాత్ముఁడవగు నీయొక్క పుత్రుఁడనుగాను. నా పూర్వాజన్మ పాపకర్మమువలన, సజ్జను లందఱు విని "ఛీ! ఛీ!" యనఁ దగిన యీ చెప్పఁబోవు దుఃఖము నాకు సంప్రాప్తమయినది. ఓ మహాత్మా! నీరు త్రాగవచ్చిన ఘాతుక మృగమునుగాని, యేనుఁగునుగాని చంపఁ గోరి విల్లు చేతఁగొని సరయూనది యొడ్డున కేతెంచితిని. అంత నీటి యందుఁ గుండను ముంచుచుండఁగా బుడబుడయని యొక చప్పుడు విన వచ్చెను. ఆ శబ్దము నీరు త్రాగుచున్న యడవియేనుఁగుయొక్క శబ్ద మని

తలఁచి బాణము నేసితిని. అంత నదీతీరమునకు వచ్చిచూడఁగా, నే నేసిన బాణము గ్రుచ్చుకొనుటచేఁ బ్రాణములు పోయినట్లు నేలపైఁ గొఱఁగి యున్న ఋషిపుత్రునిఁ జూచితిని. ఓ మహాత్మా! శబ్దముఁగనిపెట్టి, యేనుఁగనియెంచి, దానిం జంపఁగోరి బాణము నేయఁగా, నది మీ పుత్రునికిఁ దగిలినది. అంతట నేను దాపునకుఁబోయి చూచితిని, అతఁడు బాణపాతమున ఘోర్వఁజాలక, "ఓ రాజా! నా మొత్తమున గ్రుచ్చుకొన్న బాణము నూడఁబెఱుకు"మని నన్నడిగెను. అట్లు నే నా బాణము నూడఁబెఱుకఁగా, నతఁడు, "అయ్యో! నా తల్లిదండ్రులు గ్రుడ్డివారు, ముసలివారు. ఇఁక వారికి దిక్కెవరు?" అనుచు నేడ్చి ప్రాణములఁ దొఱఁగెను. నేను తెలియక మీ పుత్రునిఁ జంపితిని. ఇఁక మీరు నన్ననుగ్రహించి, యేమి చేయవలయునో యానతిండు" అని యమ్మహాముని తోఁ జెప్పితిని. ఓ కౌసల్యా, మహాత్ముఁడును, తేజస్సుగలవాఁడునయిన యమ్మునీంద్రుఁడు నేఁ జెప్పిన వ్యసనకరములు క్రూరములునయిన పలుకులు విని, యత్యాగ్రహము నాఁపు కొనఁజాలక, కండ్లనిండఁ గన్నీరు పెట్టికొని, దుఃఖముచేఁ గృశించి, వేఁడి నిట్టూర్పు విడుచుచు, చేతులు గట్టికొని యడఁకువతోఁ నిలఁబడియున్న నన్నుఁ జూచి, "ఓ నృపాలా! నీవు చేసిన యీ దారుణ కృత్యమును నీవై చెప్పక, యిఁక నే తీయనైనను దెలిసియుండునేని, నీ శిరము వెంటనే లక్షతునుకలుగాఁ జీలియుండును. ఓ రాజా! క్షత్రియుఁ డెవరినిఁగాని, అందును వానప్రస్థుని బుద్ధి పూర్వకముగాఁ జంపియుండునేని, అతఁడు దేవేంద్రుఁడయినను రాజ్యభ్రష్టుఁడగును. తపస్సుచేయుచు బ్రహ్మచర్యవ్రతంబు సలుపుచున్న యట్టి మునినిఁ దెలిసి, బాణము వేయువానితల యేడు వ్రక్కలై యుండును. నీవు తెలియక, యీ కార్యము చేసినదానినిబట్టియే ప్రాణములతోనున్నావు. లేనియెడల, ఇక్ష్వాకువంశమే నశించి యుండును. అట్లుండ నీవు నశించిపోయి యుందువని వేఱుగఁ జెప్పవలయునా? ఓ నృపాలా! మమ్మిరువుర నచ్చటికిఁ గొనిపొమ్ము. నెత్తుటిచే నొడలంతయుఁ దడిసి, కట్టుకొన్న నారబట్టయు, గప్పుకొన్న కృష్ణాజినమును దొలఁగిపోయి, నేలపైఁ బడి, నిర్జీవుఁడై యమునికధీనుఁడయియున్న యీ నా కొమరుని గడపటితడవ చూడఁగోరెదము"అని నన్నడిగిరి. అట్లే నే నొక్కఁ

డనే మిక్కిలి దుఃఖపడుచున్న వారి నిరువుర నచ్చటికిఁ గొనిపోయి వారి కొమరుని దేహమును దాఁకించితిని. వా రిరువురును దమపుత్రునికళే బరము దగ్గఱఁజేరి చేతులతోఁదడవి, యా కళేబరము పైఁ బడి యేడ్వ సాగిరి. అప్పుడు తండ్రి తన కొడుకుఁగూర్చి యిట్లు దుఃఖపడఁదొడఁగెను. "ఓ నాయనా! నీ వెప్పటివలె నన్ను నమస్కరింప వేమి? వేల నన్నుఁ బలుకరింపవు? ఏల నేలపైఁ బడియున్నావు? వేమి మాపైఁ గోపగించుకొంటివా? ఓ ధార్మికుఁడా, నేను నీ కంత ప్రియుఁడనుగా నేని, కొడుకా! తల్లిని జూడుము. వేల నన్నుఁ గౌఁగిలింపవు? ఇంపు గులుకు మాటలు పలుకుము. ఇఁక నపరరాత్రమున నెవ్వరు వేదాధ్యయనము, ఇతరశాస్త్రపఠనము చేయఁగా నా మధుర ధ్వనిని వినఁగలను? నాయనా! నీవు స్నానముచేసి, సంధ్యావంద నము నాచరించి, ఔపాసనము చేసి యయినవెంటనే, దాపునఁ గూర్చుండి యుపచరించు చుందువే. ఇఁక బుత్రశోకముచేఁ బీడింపఁ బడుచున్న నా కెవఁడు శుశ్రూష చేయఁగలఁడు? ఓ నాయనా! యిఁక నేను స్నానాద్యనుష్ఠానములఁ జేయలేను. నాకడ నీ వారాది ధాన్యములు చేర్చి పెట్టినవి లేవు. నీ వుండఁగా నా కన్నియు జరుగు చుండినవి. ఇఁకమీఁదట, ప్రియుఁడయిన యతిథికిఁబెట్టినట్లు, నా కెవ్వఁడు గడ్డలను, దుంపలను, పండ్లను దెచ్చి, ప్రేమతోఁ బెట్టును? గ్రుడ్డిది, ముస లిది, దుఃఖించినది, పుత్రునిపై నెక్కువ మక్కువగలది యగు నీ తల్లిని నే నెట్లు పోషింపఁగలను? ఓరీ కొడుకా! నీవు యమపురికిఁ బోవలదు, ఇక్కడనేయుండుము, రేపు నీతల్లియు నేనును వచ్చెదము. మాతోఁ గూడ రేపు పోవచ్చును. మే మిరువుగమును పుత్రశోకముచేఁ బీడింపఁ బడినవారము, అనాథులము! దీనులమునై యీ యడవియందు నిన్నుఁ బాసి యుండఁజాలము గాన, మేమును వేగిరమే నీతోడ యమసదన మునకు వత్తుము. అంతట నేను యమునిఁ జూచి, "ధర్మరాజా! ఈతఁడు తల్లిదండ్రులకు శుశ్రూషలు చేయవలయు. నన్ను మన్నించి యితని బ్రతి కింపుము." అని నేను ప్రార్థించెదను. కీర్తిమంతుఁడును, ధర్మాత్ముఁడును, లోకపాలుఁడునైన యమునఁ డందఱికి నభయం బొసఁగువాఁడు గావున నాయొక్క యిట్టి దురవస్థనుజూచి,నాశము లేని యీయొక్క యీయభయ

దానముఁ జేయును. ఈ పాపాత్ముఁడయిన దశరథుఁడు నిన్నుఁ జంపుటచే నీ పాపములు దొసఁగిపోయినవి. శస్త్రయుద్ధముచేయువారి కే లోకములు గలుగునో, ఆ లోకములు నీకు నాసత్యబలమువలనఁ గలుగును. సంగరమున మఱలని శూరులై యుద్ధములందు శత్రువుల నెదిరించి, శత్రువులచేఁ జంపఁబడిన వీరు లేపుణ్యలోకములఁ బొందుదురో, ఆ యుత్తమ లోకములను నీవును బొందుదువు. సగరుఁడు, శైబ్యుఁడు, దిలీపుఁడు, జనమేజయుఁడు, నహుషుఁడు, దుందుమారుఁడు పొందిన లోకములను నీవును బొందుదువు. సజ్జనుల కందఱకు నేది గతియో, నిరతాధ్యయనమువలనను, దపస్సువలనను నేది గతియో, భూదాన మొనర్చువానికి, నిరతాగ్నిహోత్రపరునికి, ఒకతెనే భార్యనుగాఁ గలిగి యుండువానికి, వేయిగోవులను దానముచేయువానికి, తల్లిదండ్రులు మొదలగువారిం బోషించువానికి ప్రాయోపవేశము చేయువానికి నేది గతియో, ఆ గతి నీకును గలుగును. ఈ మనకులమునఁబుట్టినవాఁడెవ్వఁడయినను దుర్గతినొందఁడు. నా పుత్రుఁడవయిన నిన్నెవఁడు చెంపెనో, వాఁడు హీనగతిం బొందును" అని యివ్విధమున నమ్మునివర్యుఁడు కడు దీనముగాఁ బలుమాఱు రోదనముసేసి, యావల, భార్యాసమేతుఁడై, యతనికిఁ దర్పణాదులగు నంత్యకృత్యములనెల్ల జరిపించెను. అంత నా మునిపుత్రుఁడు తన పుణ్యకర్మలచే దివ్యరూపమును ధరించి దేవేంద్రునితోడ వేగిరంబుగ స్వర్గమునొందెను. అట్లు పోవునపుడు మునిపుత్రుఁడును దేవేంద్రునితోఁ గూడ ముదుసలులగు తల్లిదండ్రుల నూఱడించి "ఓ తల్లిదండ్రులారా! మీకు శుశ్రూష లొనర్చుటచే నే నుత్తమలోకముఁ బొందితిని. మీరును శీఘ్రముగా నాయొద్దకు వచ్చి చేరఁగలరు" అని యిట్లు చెప్పి, సుందరమైన దివ్యవిమానమునఁ గూర్చుండి స్వర్గమునకుఁ బోయెను. ఆ తాపసుఁడును, భార్యాసమేతుఁడై, కొమరునకు జలతర్పణాదులెల్ల ముగించి, చేతులు గట్టుకొని నిలఁబడియున్న నాతో నిట్లనియె. "ఓ నృపాలా! ఏకపుత్రకుఁడనయిన నా కొడుకును జంపి, నన్ను నపుత్రకునిఁ జేసితివిగదా! నన్నును నీ విప్పుడె సంహరింపుము. నేను మరణమునకై వ్యసనపడను. ఇఁక నా బ్రతు కేల? ఓ రాజా! నీవు తెలియక నిరపరాధుఁడయిన నా పుత్రునిఁ జంపి, నాకుఁ

దీరనిపుత్రశోకమునెడి మహాదుఃఖముఁ దెచ్చి పెట్టితివి; కావున నేనును నీకు మిగుల భయంకరము అత్యంతము దుఃఖకరమునగు శాపము నిచ్చెదను. ఓ రాజా! నే నిప్పుడు పుత్రశోకము నెట్లనుభవించుచుఁ బ్రాణములు విడుచుచున్నానో, అట్లే నీవును నంతకాలమునఁ బుత్రశోకము తోడనే ప్రాణములు విడుతువు. ఓ నరాధిపా! నీవు క్షత్రియుఁడవయి తెలియక మునికుమారునిఁ జంపితివి కావున నీకు బ్రహ్మహత్యాదోషము గలుగదు. అయిననను, దక్షిణయొక్క ఫలము దాతను బొందునట్లు, ప్రాణ హానికరమైనదియు, భయంకరమునునైన యిట్టియవస్థ నిన్నును త్వరిత ముగనే బొందును" అని నాకు శాపమునొసఁగి, జాలిపుట్టునట్లు మిక్కిలి దుఃఖించి, కాష్ఠమునపై నిద్దఱునెక్కి, ప్రాణములఁ దొఱఁగి స్వర్గలోకము నొందిరి.

ఓ దేవీ! శబ్దమునుగనిపెట్టి బాణము వేయునపుడు దెలియక చేసి దెచ్చుకొన్న యాశాప మిప్పుడట్లే యాలోచింపఁగా జ్ఞప్తికివచ్చెను. అపథ్యములగు వస్తువులతోఁ జేర్చి భుజించువానికి రోగమువచ్చునట్లు, నాఁడు చేసినపాపకర్మమునకు ఫల మిపుడనమునఁ గలిగినది. ఓ శుభాంగీ, నా కా దుష్కర్మమువలననే యా మహాముని వాక్యము తగిలినది. కావున నే నిప్పుడు పుత్రశోకముతోఁ బ్రాణములను దొఱఁగెదను. నేను నిన్నుఁ గన్నులెత్తి జూడఁజాలకున్నాను. నన్నుఁ దాఁకుము" అని చెప్పి మఱల దశరథుఁడు కౌసల్యను జూచి యిట్లనియె: ఓ దేవీ! నేను రాముని విషయమున నేమిచేసితినో, అది క్రూరుఁడనయిన నాకే తగును. రాముఁడు నావిషయమునఁ నేమిచేసెనో, అదియారామునకే తగును. లోక మున నెవ్వాఁడు చెడునడత గలవానిని నైనను గన్న కొడుకును నావలె నడవులకుఁ బంపును? ఎవఁడు రాముని వలె నడవికిఁ బొమ్మనినఁ తండ్రితో విరోధము పెట్టుకొనకుండు? ఇప్పుడు రాముఁడు ననొక్కమాఱు దాఁకి నను, లేక నా కన్నులగకపడినను నాకుఁ దనివియై యుండును? మర ణము నొందినపిదప మానవులు తమ బంధువులను జూడఁజాలరుగదా. ఓ దేవీ, నా కన్నులు మూతలుపడుచున్నవి. నీ రూపము నాకుఁ దెలియకున్నది. నాకు స్మృతియుఁ దప్పిపోవుచున్నది. ఇదిగో, యమ దూతలు నన్నుఁ దొందరపెట్టుచున్నారు. నేను అవసానకాలమునందు

సత్యమయిన మగటిమిగలవాఁడును, ధర్మముల నెఱిఁగినవాఁడునునైన రామునిఁ జూడ లేకున్నానుగదా. దీనికంటె హెచ్చయిన వ్యసనము మఱొక్కటియున్న దే? ఆ సాటిలేని పనులు చేయు రామునిఁ జూడమివలని శోకాగ్ని, యాతపము స్వల్పజలమును బీల్చివేయునట్లు, నా ప్రాణములను మాడ్చుచున్నది. పదునేనవయేఁట వనవాసము ముగించివచ్చిన పిదప మనోహరములగు కుండలములను దాల్చిన రాముని నెవరు చూడఁగలరో, వారు మానవులుగారు, దేవతలు. కమలదళములఁబోలు కన్నులు, సొగసయిన కనుబొమ్మలు, మంచి పలువరుస, చక్కనిముక్కు గలిగి చంద్రునివలె నొప్పారుచుండు రామునిమోమును వనవాసానంతరమునఁ బుణ్యాత్ములు చూడఁగలరు కాని, నాబోటి పాపాత్ముల కట్టి రామునిఁ జూచు నదృష్టముగలుగునే! శరత్కాల చంద్రునితోను, వికసించిన తామరపువ్వుతోను సాటియైనదియు సుగంధము గలదియు నగురామునిమోము చూచుట పుణ్యాత్ముల కబ్బునేకాని నాబోటి పాపాత్ముల కబ్బునే! వనవాసము పూర్తిచేసి, మఱల నయోధ్యకేతెంచి, స్వస్థానగతుఁడైన శుక్రునివలె దేదీప్యమానుడైయుండు రాముని సుఖపురుషులు చూడఁగలరు. ఓ కౌసల్యా! నాకు మనస్స్వాధీనత తప్పి చున్నట్టున్నది. నాబుద్ధి తప్పిపోవుటచేత ధ్వనికూడ వినఁబడలేదు. ఏ వస్తువు తగిలినను తెలియలేదు. రుచియుఁ దెలియకున్నది. మనసు చెదరుటవలనఁ దక్కిన యింద్రియములుకూడ, చమురులేని దీపము యొక్క కాంతులుదగ్గునట్లు తగ్గిపోవుచున్నవి. ప్రవాహవేగము ఏటి గట్టును గరఁగఁదీయునట్లు, నేను స్వయముగాఁ దెచ్చుకొన్న దుఃఖము దిక్కులేక, నెమ్మది దప్పియున్న నన్నుఁ గృశింపఁ జేయుచున్నది. అక్కటా! రాఘవా! దీర్ఘబాహువా! నా కష్టములఁ బాపువాఁడా! తండ్రి మున్నగకెక్కినవాఁడా! నాథా! ఓ కొడుకా! నీ వెచ్చట నున్నాఁడవు! ఓ కౌసల్యా! ఓ సుమిత్రా! ఓకై కేయీ! క్రూరురాలా! శత్రువా! కులమును జెఱిచినదానా! నే నిదిగో ప్రాణములఁ దొఱఁగుచున్నాను" అని యివ్విధమునఁ బుత్రుని ప్రవాసమునకై, మిగులవగచుచు మిక్కిలి జాలిపుట్టుమాటలు పలుకుచు ఉదారదృష్టిగల దశరథుఁడు నడికిరేయిని ప్రాణములఁ దొఱఁగెను.

65-వ సర్గము

కౌసల్య మొదలగు నంతఃపురాంగనలు భర్తృమరణమునకై చింతించుట

అంత నారేయి గడవఁగా, మఱునాఁటియరుణోదమున వందులును, మంచి యలంకారములను దాల్చిన సూతులును, మంగళవాచకులును, విశేష శాస్త్రజ్ఞానము గలవారును, గాయకులును, స్తుతిపాఠకులును వెవ్వేఱుగావచ్చి తమతమ విహితకృత్యములను జేయుచు, నృపాలుఁడు కాలధర్మము నొందియున్న రాజగృహమున నుండిరి. వందులు మున్నగు వారు చేయు స్తుతులయొక్క ధ్వనులు రాజగృహమునం దెల్ల వ్యాప్తమై యుండెను. అంత సూతులు రాజు వంశావళిఁ బొగడుచు తాళములు వేయువారు, రాజుగారియొక్కయు వారిపూర్వులయొక్కయుఁ బూర్వ వృత్తాంతములను బొగడుచు తాళములు వాయించుచుండిరి. ఆ చప్పు డునకు చెట్ల కొమ్మలం దుండునవియు, పంజరములం దుండునవియు, రాజ గృహమున నుండునవియునగు పక్షులు మేలుకొని మిక్కిలి కూతలిడినవి. ఆ సూతమాగధాదులు చెప్పు శబ్దములును, వీణలమ్రోతలును, వారు చేయుదీవనల ధ్వనులఁను, కీర్తనలధ్వనులు, ఆరాజగృహమును నిండించిన దయ్యెను. అంతట మంచి యాచారముగలవారును, శుశ్రూషలొనర్చుట యందు నేర్పరులునైన యతఃపురపరిచారకులు మామూలుప్రకారము వచ్చి కొల్చుచుండిరి. స్నానవిధి నెఱిఁగిన భృత్యులు సుగంధయుక్తమయిన యుదకమును నృపాలుని స్నానముకొఱకు బంగారు బిందెలతో వేళతప్పక యథావిధిగాఁ దెచ్చిపెట్టిరి. మఱికొందఱు జవరాండ్రు స్నానార్థము గావలసిన తైలమును, జిడ్డుఁ బోఁగొట్టు సంస్కార చూర్ణము మొదలగు పదార్థములను పలుదోమినపిదప నోటిని శుభ్ర పఱచుకొనుటకువలసిన నువ్వుపిండి, జీలకఱ్ఱి మొదలగువస్తువులను అద్దము, వస్త్రములు, ఆభరణములు మొదలగు నలంకారసామగ్రిని గొనితెచ్చిరి. ఇట్లు రాజు నగరియందున్న పరిచారికా జనులందఱు శుభలక్షణములతోఁ గూడినవారలై, తమతమ కృత్యములఁ దీర్చుకొని, సుగుణ సంపదలతో నొప్పుచుండిరి. సూర్యోదయమగువఱకుఁగూడ నృపాలుఁడు నిద్ర లేచి రాకుండుటఁ జూచి, యచ్చటిజనులందఱు నౌత్సుక్యముతో "నృపాలుని కేమి జబ్బో తెలియకున్నది" యని సందియముగలవారైరి. అంత దశరథ

నృపాలుని పాన్పునకుఁ బ్రక్కనే పరుండియున్న స్త్రీలందఱు గూడి తమ భర్తను మేలుకొలిపిరి. ఆ యుచితవృత్తిగల స్త్రీలందఱు మిక్కిలి వినయముతోను, యుక్తితోను పాన్పునందుఁ బరుండియున్న నృపాలునిఁ దాఁకి, యేమియులేక కట్టెవలె నీల్గియుండుటను జూచిరి. వారు మొదటఁ గలయోయని భ్రమసిరి. అయినను నృపాలుఁడు చేతులుగాళ్లు గదలింపకుండుటచే, నిది నిద్రాలక్షణము గా దని యెఱింగి, నృపాలుఁడు మృతి నొందినట్లున్నది యని గడగడ వణఁకుచుఁ బ్రవాహమున కెదుట నున్న గడ్డికొనవలెఁ గదలుచుండిరి. అట్లు స్త్రీలు గడగడవణఁకుచు రాజుం జూచి యేమి సంశయపడిరో, అది యట్లె స్థిరపడెను. కౌసల్యా సుమిత్రలును పరవశలై, మృతినొందినవారి వైవడి నిద్రించుచు లేవరైరి. కాంతియు, వన్నెయుఁ దఱిగి, శోకముచేఁ గృశించియున్న కౌసల్యాదేవి చీఁకటిచేఁ గప్పఁబడిన నక్షత్రముపగిదిఁ బ్రకాశింపకుండెను. రాజునకుఁ బిమ్మటఁ గౌసల్యయు, కౌసల్యకుఁ బిదప సుమిత్రయు దుఃఖించుచుఁ గన్నీటిచే నిండిన ముఖములగలవారలై, కాంతిలేక యుండిరి. అప్పుడంతఃపుర స్త్రీలందఱు నవ్విధమున నిద్రించుచున్న శుభాంగులగు కౌసల్యా సుమిత్రలఁ జూచి, దశరథుని నిద్రబోవుచునే ప్రాణములఁ దొఱఁగినట్లుగా నెంచిరి. అంత నరణ్యమున నుండు నాఁడేనుఁగులు తమమేటి యేనుఁగును బోఁగొట్టుకొని, కడు బిగ్గఱగా నేడ్చునట్లు, ఆ యుత్తమ స్త్రీలందఱు మిక్కిలి దీనముగా గొల్లున నేడ్చిరి. ఆ స్త్రీల రోదనధ్వనిని విని కౌసల్యాసుమిత్రలు వెంటనే తెలివినొంది, మేల్కొని, పార్థివుం జూచి, "యయ్యో! నాథా!" యని దుఃఖించుచు నేలఁబడిరి. ఆ కోసల రాజు కొమరితయగు కౌసల్య నేలమీఁదఁ బొఱలుచు దుమ్మంటుకొనుటచే, నాకసమునుండి జాఱి నేలమీఁదఁబడిన నక్షత్రము వైవడిఁ బ్రకాశహీనురాలై యుండెను. నృపాలుఁడు చెయువులు దప్పి క్రిందఁబడి యుండుటఁ జూచి కొట్టఁబడిన యాఁడేనుగుంబోలియున్న యా కౌసల్యను నంతఃపురస్త్రీలందఱు చూచిరి. అటుపిదపఁ గైకేయి మొదలగు నృపాలునిభార్య లందఱు మిక్కిలి సంతాపముతోఁ జెయువులు మాని క్రిందఁబడిరి. ఆ కైకేయి మొదలగువా రేడ్చిన యఱపులతోఁ గూడినకౌసల్యాదులరోదనధ్వని యా గృహమునం దంతయు నిండి

పోయెను. పూర్వము సంతోషముచే నిండియున్న యంతఃపురము దశ రథుడు మృతినొందియుండుటం జూచి, యంతట నల్లకల్లోలమయి, ఆతురులగు జనులుగలిగి, సొంపుదఱిగి, కడు దైన్యముతోఁ గూడి, సంత సము లేనిదై యుండెను. నృపాలుని రాణులందఱు రథికశ్రేష్ఠుఁ డగు దశ రథనృపాలుఁడు గతించినవాఁ డని యెఱింగి, యతనిచుట్టు గూర్చుండి చేతులు తలపైఁ కెత్తి దిక్కులేనివారివలె విశేషముగా నేడ్చుచుండిరి.

66-వ సర్గము

మంత్రులు దశరథుని కళేబరమును తైలభాండమున నుంచి కాపాడుట

అంత, కౌసల్య చల్లాఱిన యగ్నిహోత్రునివలెను, నీరులేని సము ద్రమువలెను, వెలుఁగులేని సూర్యునివలెను గాంతిహీనుఁడై స్వర్గలో కము నొందిన దశరథనృపాలునిఁ జూచి, కన్నులనిండఁ గన్నీరుపెట్టికొని, నానావిధములుగ నేడ్చుచు, నృపాలుని శిరమును దనతొడపైఁ బెట్టి కొని, కైకేయిం జూచి, "ఓసీ చెడునడతలదానా, నీ కోరిక సఫలమైనది. రాజును మృతినొందెను. ఇఁక నీవే, క్రూరురాలా, యేకాగ్రచిత్తురాలవై, నిష్కంటకమయిన రాజ్యము నేలుము. నా పుత్రుఁడగు రాముఁడు ననున్నుఁబాసి వనమునకేగెను. భర్తఁయు స్వర్గలోకము నొందెను. దొంగల భయమున తోనిండిన చెడుదారియందుఁ దోడులేకుండఁ బోఁగూడనట్లు, నేను నీచే నేలఁబడు రాజ్యమున మనఁ గోరను, తనకు దైవతమగు పెని మిటిని బాసి యీ యన్యాయపరురాలగు కైకేయి తప్ప, మఱేయెవఁ డై జీవించియుండఁగోరును? లోభి పేరాసచే విషముగలిసినవంటకమును దినుచు నందలివిషదోషము నెఱుఁగనే యెఱుఁగడు. ఈ కైకేయి గూని దాని దురాలోచనలకు లోఁబడి తనకొడుకునకుఁ బట్టముగట్టఁగోరి, రఘు వంశమునకుఁ జేటుదెచ్చినది. రఘువంశమునకుఁ జేటుదెచ్చుటయే కాక, జనకునకును దుఃఖముగలిగించినది. కైకేయి యడుగని వరములనడిగినను, వాని నిచ్చుటకు దశరథుఁ డొప్పుకొని, రాముని సీతతోడ నడవులకుఁ బంపినాఁ డని విని జనకమహారాజును నావలె దుఃఖము నొందఁగలఁడు. ధర్మిష్ఠుఁడును, కమలదళములంబోలు కన్నులుగల వాఁడునయిన రాముఁడు, జీవించియుండియు, వనమునకుఁబోయి యుండుటచే నేను బెనిమిటినిబాసి విధవనైతినని యెఱుఁగఁజాలఁడు. విదేహరాజు కూఁతు

రగు సీత జాలిచూపఁదగినదియు, దుఃఖము లనుభవింపఁదగనిదియు నైనను, అరణ్యములందు దా నిడుములఁ బడుటకు మిక్కిలి వెఱచును. జను లులికిపడునట్లు మృగములు, పక్షులు కూయుచుండఁగా విని సీత వెఱచి, తప్పక రాముని యండకుఁ జేరుకొనఁగలదు. నిక్కము. వృద్ధుఁడును, స్వల్పసంతతి గలవాఁడునునగు జనకుఁడు తన కూఁతురు విపినములం దిడుములం బడుచున్నందుకై వగలఁ బొగులుచు దేహము విడువఁగలఁడు. నేనన్ననో, పాతివ్రత్యము ననుసరించి, యీ నా పెని మిటికోరీరముఁ గౌఁగిలించుకొని, యగ్నిం బ్రవేశించి, యిప్పుడే తనువుఁ దొఱఁగెదను" అని యిత్తెఱంగునఁ బలుకుచు విలపించెను. అట్లు నృప కళేబరముఁ గౌఁగిలించుకొని మిగుల వగలపాలయి, విలపించుచున్న తపస్వినియగు కౌసల్య నూఱడించి యూరిలకుఁ బంపిరి. వెనుక వసిష్ఠాది మునులు, పుత్రులు లేక సంస్కారము చేయఁగూడ దని చెప్పుటచేత మంత్రులు రాజుదేహమును సంస్కరింపక, యా కళేబరము చెడకుండుటకై నూనె కొప్పెరయం దుంచి పదిలముగాఁ గాపాడి, తామును సమస్తధర్మముల నెఱిఁగినవారు గావున రామలక్ష్మణులు వనముల కేగిరిగాన భరతశత్రుఘ్నులకుఁ జెప్పి పంపి, వారు వచ్చునంతదాఁక యట్లె యుంచఁగోరిరి. మంత్రులచే నూనెకొప్పెరయం దుంపఁబడిన రాజుకళేబరముఁ జూచి, యంతఃపురపుఁగాంత లందఱు ఆ తైలకటాహముఁ జుట్టుకొని, కడు నొచ్చినవారై యేడ్పుమోములతోఁగూడి కన్నీరువిడుచుచు, వగలం బొగులుచు హా! మహారాజా! యెల్లప్పుడు ప్రేమతో మమ్ము నాదరించుచు, మాటతప్పనివాఁడగు రాముని నడవులకుఁ బంపితివి. నీవును మమ్మువిడిచి పోవుట యుక్తమా? ఇఁక మాగతియేమి? కైకేయి చెడు తలంపుగొని, మమ్ము రాముననుండి యెడఁబాపి, పెనిమిటినిగూడఁ జంపుకొనెను. అట్టి యా కైకేయికడ మే మనాథలమై యెట్లుండఁజాలుదుము? శ్రీమంతుఁడగు నారాముఁడే యెల్లప్పుడు మాకుదిక్కు. నీకును బ్రభువు. అతఁడు మంచి మనస్సుగలవాఁడు. అట్టి రాముఁడు రాజ్యలక్ష్మిని విడిచి యరణ్యములకుఁ బోయెను. నిన్నును రామునిఁ బాసి, దుఃఖముచేఁ దెలివిదప్పి, కైకేయియొక్క తిరస్కారమునకు లోఁబడి, మే మెట్లు మనఁజాలుదుము. వీ కైకేయి, సుగుణులును, బలవంతులునగు పుత్ర

లను సీతను నడవికిఁ బొమ్మందోలి, మగనిని జంపినదో, యట్టి ఘోరకురా
లగు కైకేయి మాబోటి యితరులఁ దొందరపెట్టక, తమమఁగొట్టక
యుండునే" అని యివ్విధమున దశరథుని యంతఃపురాంగనలందఱు
తుదిలేని శోకముతోఁ గూడి, కన్నీళ్లయందుఁ దెప్పఁ దోఁగి, సంతసము
మాని, రోదనముసేయుచు నేలఁబడి పొరలుచుండిరి. అయోధ్యాపుర
మున జనులు గన్నీటిప్రవాహముచేఁ దడిసినవారుగానుండిరి. కులకాంత
లందఱు హాహాకారములు చేయుచుండిరి. ఇండ్లముంగిళ్లును, నాలుగు
దారులు గలిగియు చోటులును పాడుపడి వెనుకటివలెఁ బ్రకాశము
లేనివైయుండెను. కనుక, చంద్రుఁడులేని రాత్రివలెను, పెనిమిటిఁ
బోఁగొట్టుకొన్న వనితవలెను నృపాలుండులేని యయోధ్యాపురము
శోభిల్లకుండెను. ఇట్లు నరాధిపుఁడు పుత్రశోకముచే స్వర్గమున కేగఁగా,
నృపాంగనలందఱు నేలపైఁబడి పొఱలుచుండఁగా, సూర్యుఁడు సంచా
రంబు చాలించి యస్తంగతుఁ డాయెను. చీఁకటి నలుదెసలఁ గ్రమ్మునట్లు
చేయుచు రాత్రి వచ్చెను, మంత్రులందఱు నృపాలుని దేహమునకు
సంస్కారము చేయఁదలఁచియు, వసిష్ఠాది మునులందఱు పుత్రులు
దగ్గరలేకుండఁగ సంస్కారము చేయఁగూడ దనిరి గావున, రూపుచెడి
యున్న నృపాలుని తైలభాండమునందుంచి కాపాడఁదలఁచిరి. ఆ పురంబు
నందు నృపాలుఁడు స్వర్గమునకేగుటచేతను, జనులు కన్నీళ్లు పెట్టుకొని
మూల మూలలలో విలపించుటచేతను నయోధ్యాపురము సూర్యుఁడు
లేని యాకసమువలెను, నక్షత్రగణములులేని రాత్రివలెను జెన్నుదఱిగి
యుండెను. ఆ పురమునందలి స్త్రీ పురుషులందఱు నృపాలుని మరణము
సంభవింపఁగా గుంపులుగూడి, వ్యసనాక్రాంతులై భరతునితల్లియగు
కైకేయివలనఁగదా యింత దుఃఖము సంభవించెనని యామెనుదూఱుచు,
నూఱటఁబాసి యుండిరి.

67-వ సర్గము

మునులు రాజును గోరుట

ఆ యయోధ్యాపురమునందలి జనులు రోదనము సేయుచుఁ
గన్నీటిచే డగ్గుత్తికపడు కంఠధ్వనితోఁ గూడినవారలై యుండుటఁజేసి,
మూఁగేయి మిక్కిలి దీర్ఘమయి యొట్టకెలకుఁ గడచెను. అట్లు రేయిగడచి

సూర్యుఁడుదయింపఁగా, మార్కండేయ, మౌద్గల్య, వామదేవ, కాశ్యప, కాత్యాయన, గౌతమ, జాబాలులు మొదలగు కీర్తిమంతులగు ఋషులు మంత్రులతోడ సభకువచ్చి రాజపురోహితుఁడగు వసిష్ఠమహా మునిం జూచి యిట్లనిరి. "మునీంద్రా, ఈ నృపాలుఁడు పుత్రశోకము వలన మృతినొందుటచే నీ రేయి యొక్కటియే నూఱేండ్లతో సమా నముగా నుండెను. మహారాజగు దశరథుఁడు స్వర్గతుఁడయ్యెను. రాముఁడు కాననమునకేగెను. ప్రతాపశాలియగు లక్ష్మణుఁడును రాము నితోఁగూడ నరణ్యమునకు పోయెను. శత్రుసంహారులయిన భరత శత్రుఘ్నులిద్దఱు కేకయదేశమునందుఁ దాతగారి పురమగు రమ్యమగు రాజగృహమున నున్నారు. అయోధ్యాపురమునకు నిప్పుడే యిక్ష్వాకు వంశస్థులలో నొక్కనిని రాజునుగా నేర్పఱిపుఁడు. అట్లొనర్చినమొదల, రాజులేని మనదేశము మఱల రాజన్వంతమై (మంచిరాజుగలదై), నాశమునొందకుండును. రాజులేని దేశమున మబ్బు లుఱుములతోను, మెఱుపులతోను గూడి దివ్యజలము వర్షించి, దేశమునకు క్షేమముఁ గలిగింపదు. జనులు దొంగలెత్తుకొనిపోవుదురన్న భీతిచే విత్తనములు చల్లకుందురు. తండ్రికిఁ గొమరుఁడును మగనికిఁ బెండ్లామును జెప్పిన మాట వినకయుందురు. ధనము లపహరింపఁబడును. దుష్టులు పరస్త్రీల నీడ్చికొనిపోయి చెఱతురు. వీనికంటె నెక్కువభయంబుఁ గలిగించునది యొక్కటియున్నది. అరాజకమగు దేశమున సత్యమే నిలువదు. జనులు సంతోషహీనులై యుందురు. దుష్టులు చెలుపుదురన్న భీతితో సభలు చేయరు. దుష్టులు నటికివేయుదురన్న భీతితో మనోహరములగు తోఁటలు నిర్మింపరు. దొంగలు దాఁగుటకు దుర్గములుగ ననుపయోగపడు నన్న భీతితో దేవగృహములను గట్టరు. బ్రాహ్మణులు శాంతులు, బ్రహ్మ జ్ఞానులు, కఠినవ్రతులునై యెల్లప్పుడు యాగముచేయు స్వభావముగల వారైయున్నను, దుష్టులు చెలుపుదురన్న భీతితో యాగములు సలు పరు. అట్లు యాగములు సల్పినను, యాగముచేయు బ్రాహ్మణులు ధన వంతులైయున్నను దొంగలు దోఁచుకొనిపోవుదురన్న భీతితోఁ జాలి నంత దక్షిణలొసఁగరు. ప్రేరణ చేయువారు లేమింజేసి నేర్పరులగు నటులు నర్తకులుత్సవంబులందుఁ దమ నేర్పుఁజూపి జనులకు సంతసము

గావింపరు. రాజ్యమునకు వన్నెఁదెచ్చు కూటములును జరుగవు. క్రయ విక్రయములవల్ల జీవించువారును, లోకవ్యవహారములు దీర్చువారును తమపనులు చక్కఁగా జరుగమిచే సంతసముఁ బొసియుందురు. పౌరాణికులు కథలు వినువారికిఁ గథలు చెప్పి, వారిని రంజింపఁ జేయరు. ప్రాయపుమగువలు, దొంగలకు భయపడి బంగరుభూషణములు ధరించి, సాయంకాలమున నాడుకొనుటకై యుద్యానవనములకుఁబోరు. కామకులగు పురుషులు తమ ప్రియకాంతలతోఁగూడి, వన విహారము నిమిత్తము వేగముగాఁ బొతెడు వాహనములనెక్కి సవారిచేయరు. వ్యవసాయము వలనను గోపాలనము వలనను జీవించుచు సురక్షితులుగనుండిన ధనికులు దొంగలవలని భీతితోఁ దలుపు తెఱిచుకొని హాయిగా నిద్రింపరు. దూరదేశములకుఁబోయి అనేక విక్రయవస్తువుల నంగళ్లుపెట్టి యమ్ము వర్తకులు దొంగల భీతిచేత మార్గములందు క్షేమముగాఁ బోఁజాలరు. గంటలుగట్టినవియు, కొమ్ములుగలవియునైన యటు వదియేండ్ల యేనుఁగులు రాజవీథులందు నిర్భయముగాఁ దిరుగవు. ఆయుధముల నభ్యసించునపుడు, ఎల్లప్పుడు బాణప్రయోగమువలనఁ గలుగు నల్లెత్రాటి చప్పుడు వినఁబడదు. దుష్టులు బాధింతు రన్న దిగులుచే, మునులొంటరిగాఁ దిరుగుచు జితేంద్రియులై, మనములందు భగవంతుని గొల్చుచు నెచ్చట చీఁకటిపడిన నచ్చట బసచేయుచుఁ దిగుచుండఁ జాలరు. జనులు లేనివి తెచ్చుకొనఁ జాలరు. తెచ్చుకొన్నవానిని గాపాడుకొనఁ జాలరు. శత్రువులు దోఁచుకొని పోవుదురన్న భీతి గలిగియుందురు. సైన్యములు చిందరవందరలై శత్రువుల నోర్వఁ జాలవు. జనులు రథములమీఁదను, మేటి గుఱ్ఱములమీఁదను గూర్చుండి వేడుకగాఁ దిరుగఁజాలరు. పండితులు వనములందును, ఉపవనములందును శాస్త్రవిచారము చేయుచు నుండరు. నియమవంతులగు జనులు దేవతా పూజకై పూలను, కుడుములను జేయఁజాలరు, దక్షిణల నొసఁగ జాలరు. రాజపుత్రులు అగరు గంధము నలఁదుకొని, వసంతర్తుపు నందలి వృక్షములవలెఁ గాన్పింపరు. రాజు లేనిదేశము నీరు లేని యేటి చందమునను, పచ్చిక లేని యడవిచందమునను, గొల్లవాఁడు లేని యావుల వలెను గాంతిదఱిగియుండును. రథమునకు పెక్కేము గుఱ్ఱము, పొగ

యగ్నిహోత్రునికి గుఱుతు, మనకెవ్వఁడు ధ్వజమో, ఆతఁడివ్విధ మున స్వర్గమునొందెను. రాజులేని దేశమున జనులిది తమ వస్తువని తలఁప భయపడుదురు. ముకీయు జనులు చేఁపలమాడ్కి నెల్లప్పు డొకరినొకరు పీఁకుకొని తినుచుందురు. పరువులేనివారై, పరలోకము లేదని వాదించుచు విచ్చలవిడిగాఁ దిరుగునట్టి నాస్తికులు రాజదండనము నొందినవారయినను, సజ్జనులమని తలఁచుకొనుచుందురు. శరీరము యొక్కమంచిని నేత్రములు గమనించునట్లు రాజేంద్రుఁడు స్వదేశము లందలి ధర్మార్థములను గొఱఁతపఱచకుండును. రాజే నరులకు సత్యము ధర్మము కులవంతులకు గొప్పకులమును. రాజే ప్రజలకుఁ దల్లియుఁ దండ్రియు హితము చేయువాఁడును. రాజు తన ప్రజాపాలన సామర్థ్యము చే నింద్రాగ్న్యాదివరుణులను మించఁగలఁడు. రాజు లోకమున మంచిచెడ్డ లరయక యుండునేని, యీ లోకమెల్లఁ జీఁకటి క్రమ్మి నట్లుండును. దశరథమహారాజు జీవించియుండినప్పుడును సముద్రము చెలియలికట్టను దాఁటఁ జాలనట్లు మే మందఱమును మీ మాట నతిక్రమింపకుంటిమి. కావున నో మహాత్మా! మా క్రియను చక్కఁగా నడుపఁ గోరితేని, రాజులేని రాజ్యము అరణ్యముతో సమానమయినది కావున ఇక్ష్వాకువంశుఁడైన దాతయగు నొక్కనిని తామే పట్టాభిషేకము జేయుఁడు" అని ఋషులు చెప్పిరి.

68-వ సర్గము

వసిష్ఠుఁడు దూతలను గేకయనగరమునకుఁ బంపుట

వసిష్ఠమహాముని వారి మాటను విని, యచ్చటనున్న మిత్రులను, మంత్రులను, బ్రాహ్మణులను అందఱిని జూచి "భరతుఁడు శత్రుఘ్నుని తోడఁ గేకయపురమున మేనమామ యింట సుఖముగనున్నాఁడు కావున నచ్చటికి వేగవంతములగు గుఱ్ఱములు పూన్చిన రథమెక్కి దూతలేగి, వారి నిద్దఱిని బిలుచుకొని వత్తురుగాక! దశరథుఁడు భరతునికే పట్టాభిషేకముచేయునట్లు ఏర్పాటుచేసెనుగదా. అట్లుండ మనము విచారింప వలసిన పని యేమి యున్నది.?" అని చెప్పఁగా, వారందఱు "అట్లే చేయవచ్చు"నని బదులు చెప్పిరి. వసిష్ఠమహాముని వారి యా మాటను విని, "సిద్ధార్థుఁడా! విజయుఁడా! జయంతుఁడా! అశో

కుఁడా! నందనుఁడా! మీరంద ఱొక్కఁడికి రండు. మీరు చేయవల సిన పని నెప్పెద. ఆలకింపుఁడు. మీరు వేగముగల గుఱ్ఱములపై నెక్కి కూర్చుండి, రాజ గృహపురమునకుఁ బోయి, దుఃఖముఁ గనఁబఱపక, భరతునిఁ జూచి, నా యాజ్ఞగా "యో రాజపుత్రుఁడా! తమ మంత్రు లును, పురోహితుఁడును తమ క్షేమము విచారించి తమరు దగ్గఱనుండి చేయవలసిన ముఖ్యకార్యమున్నది గావున వేగిరముగా రమ్మని చెప్పిరి అని చెప్పుఁడు. మీ రెంతమాత్రము "రాముఁడు వనమున కేగె"ననికాని, "దశరథుఁడు మృతినొందె"ననికాని, ఈ రఘువంశోపద్రవమును మీ రెంతమాత్రము చెప్పవలదు. పట్టువస్త్రములను, శ్రేష్ఠములగు భూషణములను గైకొని భరతునకుఁ గేకయరాజునకు దీసికొనిపోయి రండు" అని చెప్పెను.

అంతట దూతలు దారిబత్తెములను గైకొన్నవారలయి, వడిగల గుఱ్ఱములనెక్కి, కేకయదేశమునకుఁ బోవుచుఁ దమ భార్య బిడ్డలకు నీ సంగతిఁ దెల్పుటకై తరుతమ యిండ్లకుఁబోయి, ప్రయాణమునకు వల సిన యితరకార్యములను దీర్చుకొని వసిష్ఠుని యాజ్ఞానుసారము గేకయదేశమునకుఁబయనమైరి.ఆదూతలయోధ్యనుండిపడమటివైపుగాఁ బోయి యపరతాలమును పర్వతమునొక్క దక్షిణపు కొననుదాఁటి, పిదప యపరతాల ప్రలంబ పర్వతముల నడుమ మాలినీ తీరమార్గమునఁ గొంత దూర ముత్తరముగానేగి, యా ప్రలంబపర్వతము నుత్తరమునుండి పడ మటి వైపుగాఁబోయి,హస్తినాపుర సమీపమున గంగానదినిదాఁటి, కురు జాంగలదేశముల నడుమఁ బోవుచుఁ బాంచాలదేశమును బొంది, పడ మటివైపుగాఁబోవుచు, పూర్ణముగా నిండిన తటాకములను, తేఁట నీళ్లు గల నదులను జూచుచు, పని తొందరవలన నెచ్చటను నిలువక చనిరి. అంత నిర్మల జలముగలిగి, నానావిధములగు పక్షులగుంపులతో, జను లతోనిండియున్న శరదండానదిని వేగముతో దాఁటి, యా నదిగట్టున, దేవతావాసమై, యాచకుల కోర్కి లొసఁగుటచే సత్యోపయాచనమని సార్థకనామముగలిగిన వృక్షమునకుఁ బ్రదక్షిణ నమస్కారములు గావించి, కుళింగాపురిని ప్రవేశించి, అంతట నభికాలమునుజేరి. యచ్చట బోధిభవన పర్వతమునందుఁ బుట్టి ప్రవహించుచుండు

నదియు, రఘువంశమునఁ బుట్టినవారిచే ననుభవింపఁబడు గ్రామములకుఁ జేరువనున్నదియునైన యిక్ష్వుమతీ నదినిదాఁటి, యచ్చట దోసెఁడు నీరు మాత్రమే యాహారంబుగాఁ గలవారై, తపస్సుచేయుచున్న వేదవిదులగు బ్రాహ్మణులం జూచుచు, బాహ్లీకదేశ సుదామపర్వతముల దారిని బోవుచు, విష్ణుపదమును, విపాశానదిని, ఆ నదిగట్టుననున్న శాల్మలీవృక్షమును జూచుచు నచ్చటచ్చటనున్న నదులనుఁ, కోనేళ్లను, చెఱువులను, గుంటలను, సింహావ్యాఘ్రాదులగు భీకరజంతువులను జూచుచుఁ బ్రభుశాసనముఁ జెల్లింపఁగోరి, కడుదూరమేగిరి. అంతట దీర్ఘప్రయాణముచే గుఱ్ఱము లలఁతనొందినను, వారు భరతునిఁ గొనిపోయి యతనిచే దశరథునకు సంస్కారము చేయించి, యతనికిఁ దృప్తి గలిగించుటకును, రాజకులరక్షణము చేయుటకును, రాజసంశమునకుఁ గీర్తి గలుగఁజేయుటకును గోరి, రెచ్చటను నిలువక, యతి వేగముగాఁ జీఁకటిపడునప్పటికి గిరివ్రజమను వేఱు పేరుగల కేకయ రాజధానియగు రాజగృహమునకు జేరిరి.

69-వ సర్గము

భరతుఁడు తాను దుస్స్వప్నము గనెనని చెప్పుట

దూతలు కేకయాధిపుని పురము చేరిన రాత్రియే భరతుఁడును జెడ్డకల యొక్కటిఁ గనెను. మఱునాటి యుదయమునసే యాభరతుఁడా చెడు స్వప్నముఁ గూర్చి తలఁచికొని, "యెవరి కేమి యపాయము సంభవించెనో" యని మనమునఁ గుందుచుండెను. అప్పుడు భరతుని మోమునందలి విన్నదనమును జూచి, యతనికిఁ బ్రియములు పలుకు నాతని సరియాడువారగు చెలికాండ్రందఱు నాతని యాయాసమును బాపఁగోరి, ఇష్టగోష్ఠిననేక కథలను జెప్పుచుండిరి. కొందఱాతని మనశ్శాంతికై వీణ మొదలగు వాద్యములను వాయించిరి; కొంద ఱాట లాడించిరి. కొందఱు నాటకములను జదివిరి. కొందఱు నానావిధ హాస్యములను జేసిరి. ఇట్లు నెచ్చెలులు ప్రియములు పలుకుచు, గోష్ఠులు సలుపుచు హాస్యములు నెఱపుచున్నను, మహోత్సుఁడగు భరతుఁడు తన విన్నదనము విడిచి సంతోషమునొందిన వాఁడు కాఁడయ్యె. అప్పుడు భరతుని నెచ్చెలియగు నొకఁడు "చెలికాండ్రు నీ చుట్టు గూర్చుండి నిన్ను

వేడుకపఱచుచున్నను, నీవేల యిట్లు కుందుచున్నావు" అని యడుగఁగా, భరతుఁ డతనితో నిట్లనియెఁ: "ఓ నెచ్చెలీ, నా కీ యధైర్యము దోఁచి నందుకుఁ గారణము నెప్పెద నాలకింపుము. నే నీ రేయి యొక చెడుకల గంటిని. దానియందు మాతండ్రి మాసిన బట్టలుఁ గట్టుకొని, తలవిరియఁ బోసికొని, కంపుకొట్టుచుండు వేఁడగుంటయందుఁ గొండకొననుండిపడి, యా వేఁడగుంటయందీఁదుచు, దోసిలితో నూనెఁ ద్రావుచు, వెట్టివాని కైవడి మాటిమాటికి నవ్వుచు, నూవులు గలిసిన యన్నముఁ దినుచుఁ బలుమాఱు దలక్రిందుగనున్న వాఁడై యొంటికంతకుఁ దైలముఁ బూసి కొని, తైలములో మునిఁగియుండునట్లును, పిమ్మట, నల్లయినుమునతోఁ జేయఁబడిన పీఠమందుఁ నల్లబట్టఁ దాల్చి కూర్చుండియుండఁగా నతనిని నలుపుఁ బసుపుగలిసిన మేనిచాయగల కాంతలు చుట్టునుండి సేవింపఁ జేయునట్లును, ధర్మాత్ముఁడగు మాతండ్రి యొట్టినిగంద మలఁదికొని, గాడిదెలుగట్టిన రథమునఁ గూర్చుండి త్వరగా దక్షిణదిశకుఁ బోయినట్లును, ఎట్టినిబట్టకట్టుకొని వికారమైన మోమునగల నడుప్రాయపు రాక్షసాంగన యొకతె యట్టహాసముచేయుచు నృపాలునిఁ జేయిపట్టి యీడ్చినట్లును గలగంటిని. మఱియు సముద్రము లింకినట్లును, చంద్రుఁడు నేల మీఁదఁ బడినట్లును, లోకమంతయుఁ జీఁకటి గ్రమ్మియుండునట్లును, రాజు లెక్కఁదగిన యేనుఁగులొక్కకొమ్ములు తునియలయినట్లును,మండుచున్న నిప్పు తటాలునఁ జల్లారినట్లును, భూమి బ్రద్దలుగాఁ జీలినట్లును, నానా విధములగు వృక్షములు నిట్టనిలువున నెండిపోవునట్లును, పర్వతము లన్నియుఁ బొడుపడి పొగరాఁజుచున్నట్లును భయంకరమయిన స్వప్న మును గంటిని. ఈ దుఃస్వప్నమునకు ఫలముగా దశరథనృపాలుఁడో, రాముఁడో, లక్ష్మణుఁడో, నేనో మృతినొందఁగలము. గాడిదలుగట్టిన రథమున నెవఁడేని గూర్చుండిపోయినట్లు స్వప్నము గంటిమేని, యా స్వప్నమునకు ఫలముగాఁ దోడుతనే నాతని చితియందుఁ బొగను జూతుము. నెచ్చెలులారా, దీనిని బట్టియే సంతోషము లేక దిగులు పడి మిమ్ము హెచ్చరించుకొనకుంటిని. మఱియు నా గొంతెండుకొని పోవుచున్నది; నా మనస్సు నెమ్మదిదప్పియున్నది. భయకారణము దెలియ కున్నను మిగుల భయపడుచున్నాను. గొంతునుండి మాట వెలువడ

కున్నది. నా శరీర కాంతియుఁ దఱుఁగుచున్నది. నన్ను నేనే పీవగించు కొనుచున్నట్లున్నాను; కారణ మెంత యోచించినను దెలియకున్నది. పలుతెఱఁగుల యీ స్వప్నమునకుఁ గారణము దెలియరాకున్నది. ఇట్టి కల నే నెన్నఁడును గనినది లేదు. రాజున కేమి యపాయము సంభవించెనో యను గొప్పదిగులు నా హృదయమునుండి తొలఁగకయున్నది" అని భరతుఁడు తన వయస్యులతోఁ జెప్పికొని విలపించు చుండెను.

70-వ సర్గము

భరతుఁ డయోధ్యకుఁ బఱతెంచుట

భరతుఁ డివ్విధమునఁ దన దుస్స్వప్నము రీతిం దెల్పుచుండఁగా, దాఁటరానియగడ్డగల రాజగృహపురమునకు దూతలు, గుట్టుములుబడలిక నొందఁగా వచ్చి చేరి, రాచనగరుసొచ్చి, కేకయరాజుకు మ్రొక్కి, ఆతని కొడుకగు యుధాజిత్తును సందర్శించి వారిని నేమురసి భరతునిఁగూర్చి, "ఓ భరతా! నీ పురోహితుఁడగు వసిష్ఠమునీంద్రులు నిన్నుఁ గుశల మడిగి, త్వరగారమ్మనియు, నీ వవశ్యముగా వచ్చి చేయవలసిన కార్య మున్నదియనియుఁ జెప్పురునిరి. ఈ విలువగల వస్త్రములను భూషణ ములను గైకొనుము. వీనిలో రాజున కియ్యఁదగిన వస్త్రభూషణము లఱువదికోట్ల విలువగలవి. నీ మేనమామ కియ్యఁదగిన వస్త్రాభరణముల యొక్క విలువ పదికోట్లు పూర్తి వెలగల యవి" అని చెప్పిరి.

అంత, బంధుజనమునందుఁ బ్రేమగలవాఁడగు భరతుఁడు దూత లొసఁగిన వస్త్రాభరణములను గైకొని, యా దూతలను సర్వకామ ములచే సంతృప్తులం గావించి, వారితో నిట్లనియెను. "మా తండ్రి దశ రథమహారాజు క్షేమముగానున్నారా? రామలక్ష్మణు లారోగ్యవంతులై యున్నారుగదా? గొప్పవంశమునఁ బుట్టినదియు, ధర్మమునం దాసక్తి గలదియు, ధర్మముల నెఱిఁగినదియు, ధర్మమునే గ్రహించునదియునైన ధీమంతుఁడగు రాముని తల్లియగు కౌసల్య క్షేమముగా నున్నదా? వీరు లగు లక్ష్మణ శత్రుఘ్నుల తల్లియు, సడిమిదియునైన ధర్మజ్ఞురాలగు సుమిత్ర యారోగ్యము గలిగి యున్నదిగదా? తన కార్యమునందే పూనికిగలదియు, ఎల్లప్పుడు భయంకరురాలును, కోప పడునదియు, తన కేమియుఁ దెలియకున్నను నన్నియు దెలిసినట్లు తలంచునదియునైన

మాతల్లి కైకేయి యారోగ్యవతియై యున్నదిగదా! ఆమె నాకేమి సం గతిఁ జెప్పి పంపినది" అని యడిగెను.

మహోత్సుఁడగు భరతుఁ డివ్విధమున నడుగఁగా, దూతలును "నరశ్రేష్ఠా! నీ వెవ్వారెవ్వరి క్షేమమరయుచున్నావో, వారందఱు క్షేమమఁగనున్నారు. కమలమును జేతఁదాల్చిన (రాజ్య) లక్ష్మి నిన్ను వరించుచున్నది. నీవు త్వరగా తేరి నాయితపఱిపనానతిమ్ము" అని భర తునితోఁ జెప్పఁగా, భరతుఁడును దూతలతో, "నేను మా తాతగారి కడకేగి, "దూత లయోధ్యాపురమునుండి నన్నుఁ బిల్చుకొనిపోవ వచ్చి యున్నారు" అని చెప్పి వచ్చెదను" అని చెప్పి, దూతలు త్వరపఱిచు చుండఁగాఁ దన తాతగారికడకుఁ బోయి, "ఓ తాతా, మా యూరి నుండి నన్నుఁ దోడ్కొనిపోవ దూతలు వచ్చియున్నారు. నేను మా తండ్రిగారికడ కేగెదను. మఱల మీ రెప్పుడు రమ్మని చెప్పిపంపిన నప్పుడు వచ్చెదను" అని తాత నడుగఁగా, కేకయన్యపాలుఁడు తన మనుమఁడగు భరతుఁ జీకి, శిరమున ముద్దాడి "నాయనా పోయి రమ్ము. నీవలననే కైకేయి సుపుత్రుఁడు గలదియనిపించుకొనుగాక! నీ తల్లితోను, తండ్రితోను, పురోహితునితోను, తక్కిన బ్రాహ్మణోత్తములతోను, మేటి విలుకాండ్రగు నీతోడఁబుట్టువులయిన రామలక్ష్మణులతోను మా క్షేమము నెప్పుము" అని చెప్పి, భరతునకు మేటి యేనుఁగులను, పలురంగులుగల రత్నకంబళములను, కృష్ణాజినములను, రెండువేల బంగారు వరహాలును, విస్తార ధనమును పదునాఱునూఱుల గుఱ్ఱము లను నొసఁగి, యిష్టులును, నమ్మఁదగినవారును, గుణవంతులునైన యమాత్యులను దోడుగాఁ బంపెను. అంతియకాక, ఇంద్రశిరంబను పర్వతంబునఁ బుట్టినవియు, ఐరావతజాతిలోఁ జేరినవియుఁ జూడ సొంపయి యుండునవియునైన యేనుఁగులను, బరువు విశేషముగా మోయఁగల వడిగల కొన్ని ఖరములను, అంతిపురమునందే బాగుగాఁ బెరిగినవియు, పులియొక్క శౌర్యబలములంబోలు శౌర్యబలములు గలవియు, కోఱలే యాయుధములుగాఁగలవియు, గొప్పశరీరము గలవియునైన కొన్ని (వేఁట) కుక్కలను గానుకగా నొసఁగెను. తాతగారంత ధనము నిచ్చి నను, భరతుఁడు పయనపుఁ దొందరలో వానిఁగూర్చి యొక్కవ

సంతోషపడఁ డయ్యెను. చెడుకల యొక్కటివచ్చుటచేతను, దూతలు తొందరపెట్టుచుండుటచేతను భరతుని మనమునఁ గడు గొప్ప విచారము పుట్టెను. అంత జనులతోను, ఏనుఁగులతోను గుఱ్ఱములతోను గూడి యున్న తన యింటినుండి బయలుదేరి కాంతిమంతుఁడగు గొప్పబుద్ధిగల భరతుఁ డందమైన రాజవీధిని కొంతదవ్వేగి యడ్డుపెట్టఁబడక యంతఃపురములోపలఁ బ్రవేశించి, తాతను మేనమామయగు యుధాజిత్తును వీడ్కొని, శత్రుఘ్నునితోడ రథమెక్కి, భృత్యులనేకులు గుండ్రని చక్రముగల రథములపై నెక్కి, యొంటెలతోడను గోవులతోడను, గుఱ్ఱములతోడను, నేనలతోడను వెంబడించి, కాపాడుచుండఁగా, తనతో సరివారగు మంత్రులు గూడ వచ్చుచుండఁగా నిష్కంటకుండై సిద్ధుఁ డింద్రలోకంబునుండి మఱలి వచ్చునట్లు రాజగృహపురమునుండి బయలువెడలెను.

71-వ సర్గము

భరతుఁ డయోధ్యాపురము జేరుట

ఇక్ష్వాకువంశమునఁ బుట్టినవాఁడును, కాంతిమంతుఁడును నైన భరతుఁడు రాజగృహపురమునుండి వెడలి, తూర్పుమొగముగా బయలు దేఱిపోవుచు సుదామానదిం జూచి దాని సొబగు నీక్షించుచు నానందముతో దాఁటి, యతివిశాలమగుహ్లాదినీ నదినిదాఁటి, పడమటి మొగముగాఁ బాఱెడు పెక్కులలుగలశతద్రూనదిని, ఏలధాన మనుగ్రామము సమీపమున దాఁటి, అపరపర్వతములను దేశములను జొచ్చి శిలావహాయను నదినిదాఁటి, యాగ్నేయమందున్న శల్యకర్తనమను గ్రామమును, శిలావహాయను నదిని జూచుచుఁ జైత్రరథంబుంగూర్చి పోవుచు గొప్ప పర్వతములను దాఁటెను. అంత సత్యసంధుఁడును, సదాచారసంపన్నుఁడును, గాంతిమంతుఁడునునైన భరతుఁడు సరస్వతీనదిని గంగానదిని సమకాలముననే దాఁటి వీరమత్స్యదేశముల కుత్తరముననుండు భారుండమును వనమునఁ బోవుచు, వేగముతోఁ బాఱుచున్నదియు, మనస్సంతోషముఁ గలిగించునదియు, పర్వతములతోఁ జుట్టఁబడినదియునైన కుళింగానదిని, దానిపిమ్మట యమునానదిని దాఁటి, తన సేనలను కొంతతడవు విశ్రమింపఁజేసి, బడలిన గుఱ్ఱముల నేటిలో దింపి యంగములను దోమి

కడిగించి, యచ్చటఁ దానును స్నానముసేసి, నీరు ద్రావి, మార్గమునఁ గొంతదవ్వు జలముదొఱకదు గావున గొంతజలము దీసికొని పయన మాయెను. సుందరాకారుఁడయిన రాజపుత్రుఁడగు భరతుఁడు తఱి చుగా నడచుదారికాని యట్టి మహారణ్యమును భద్రజాతియందుఁ బుట్టిన యేనుఁగువీఁదనెక్కి, వాయువు ఆకాశమునుంబోలె మఱింత వేగ ముతోఁగడచి, ప్రాగ్వటమను ప్రసిద్ధమయిన పట్టణమునకు దాపుననుండు నంశుధానమను గ్రామముదగ్గఱ దాఁటనలవికాని గంగానదిని కుటికోష్ఠిక యనునదినిగూడ దాఁటి, సైన్యముతోఁగూడ ధర్మవర్ధనమను గ్రామము చేరి, యచ్చటనుండి తోరణగ్రామమునకుఁ బోయి, యచ్చటినుండి దక్షిణ ముగాఁదిరిగి జంబూప్రస్థమునుబొంది, తదనంతరము వరూథగ్రామము నకుఁ జని యచ్చట మనోహరమయిన వనమునవిడిసి యటనుండి తూర్పు వైపునకుఁదిరిగి, విశేషముగాఁ గదంబవృక్షములతో నిండిన యుజ్జిహాన యనునగరమందలి యుద్యానముఁ జేరి, యటుమీఁదట స్వదేశమగుట వలన"గుట్టిము లలఁతఁ దీర్చికొన్నపిమ్మట, మీరు తిన్న గారం"డని సేనల కాజ్ఞాపించుసఁగి, వేగముగాఁబోవు గుట్టిములుగట్టినరథమెక్కి వేగముగఁ బోవుచు, సర్వతీర్థమున బసచేసి, యుత్తానికానదిని, తక్కిన యనేక నదులను పర్వతంబులందుఁ బుట్టిన గుట్టిములమీఁదనెక్కి దాఁటి హస్తి పృష్ఠక గ్రామమునుజేరి, యచ్చటఁ గుటికానదిని, లౌహిత్యగ్రామమునఁ గపీవతియనునదిని, వికసాలమున స్థాణుమతీనదిని, వినతయందు గోమతీ నదిని దాఁటి, కళింగనగరమునన్నున్న సాలవనమునుబొంది, గుట్టిములు మిక్కిలి బడలినందున నచ్చటఁ గొంతతడవు విశ్రమించి, మఱల నచ్చటి నుండి ప్రయాణమై రాత్రియెల్ల సాలవనమును వేగముగా దాఁటి, యరుణోదయకాలమున మనుచక్రవర్తిచే నిర్మితమయిన యయోధ్యా పురమును జూచెను. ఇట్లు పురుషశ్రేష్ఠుఁడయిన భరతుఁడు దారియం దేడురాత్రులు గడపి, యెనిమిదవనాటివేఁకువ నయోధ్యాపురము నెదుటఁబొడఁగాంచి సారథితో నిట్లనియె! ఓ సారథీ, యీ యయోధ్య మనోహరములగు తోఁటలతోఁగూడి, యొక్కువ కీర్తిగలిగి, తెల్లని మన్నుగలదై సుగుణవంతులును, వేదములఁ దుదముట్టఁ జదివిన వారును, సోమయాజులునైన సంపన్నులగు బ్రాహ్మణులతోఁగూడి

రాజ్ఞి యగు దశరథునిచేఁ బాలింపఁబడుచున్నది గదా! అట్టి యీ యయోధ్యాపుర మేల యొక్కవ శోభలేనట్లుగాఁ గాన్పించు చున్నది? తొల్లి యయోధ్యాపురమున నాఁడువారును మగ వారును నంతటఁ గలకల ధ్వనులు సేయుచుందురు. ఇప్పు డా కలకల ధ్వని వినఁబడకున్నది. సాయంకాలమునఁ బురజనులు తోఁటలందు విహారములు సల్పుచుండి యలసి యచ్చటికచ్చటికిఁ బోవుచుందురు గదా! ఇప్పు డట్లుండునట్లు కానిపింపకున్నది. కాముకులు లేమిం జేసి, యీ యుద్యానములు రోదనముసేయుచున్నవో యనునట్లున్నవి. ఈ యయోధ్య యరణ్యప్రాయముగఁ దోఁచుచున్నది. ఇచ్చట పూర్వము వలెనే యేనుగులమీఁదనుఁ, గుఱ్ఱములమీఁదను, రథములమీఁదను నెక్కి రాకపోకలు సలుపుమా రెవ్వరుఁ గానరాకున్నారు. పూర్వము మదించి, సంతసముతోఁ గూయుచున్న కోకిలలు మొదలగు పక్షులతోఁ గూడి, చక్కఁగఁ జిగిరించి పూచియుండుటచేత విహారము నిమిత్తము వచ్చెడు కాముకులకు మిక్కిలి యుపయుక్తములై ప్రకాశించుచుండి నవి. అట్టి యుద్యానము లిప్పు డంతటను మూర్ఖులందు రాలిన యాకులు గలిగి యేడ్చుచున్నవో యనునట్లుండు వ్రాఁకులతోఁగూడి, దేవురించుచున్నట్లు కనఁబడుచున్నవి. ఇప్పుడు సూర్యోదయమయినను మదించినవైన మృగములును బక్షులును నవ్యక్తమధురముగను, శ్రావ్యముగను, రాగయుక్తముగను గూయుచున్న ధ్వనులు విన రాకున్నవి. చందనాగురు ధూపవాసనలతోఁగూడి సుఖకరముగ వీచు వాయు విప్పుడు పూర్వమువలె వీవకున్నదేల? మున్ను, సర్వదా భేరీమృదంగ వీణాది వాద్యములయొక్క గంభీరధ్వని యిప్పుడు వినఁబడకున్న దేమి? అనిష్టములను దెలుపునవి గనుక, మనస్సునకు నింపు గొలుపని పలుతెఱఁగులైన చెడు శకునములు కానుపచ్చుచున్నవి గావున నామనసము కలవరపడుచున్నది. సారథీ, నాబంధువులందఱు క్షేమముతోనున్నట్లు సకల విధములఁ దోఁపకున్నది. అది నిశ్చయముగా నుండవచ్చును. దుఃఖహేతువు లేకున్నను నా మనసు దిగులుపడు చున్నది. అని యిట్లు సారథితోఁ జెప్పుచు దుఃఖమునొంది, మనస్సున నాయాసమును, ఇంద్రియముల వైకల్యమును బొంది, దిగజాఱి,

యిక్ష్వాకువంశము వారిచేఁ బాలింపఁబడు నయోధ్యాపురమును వైజ యంత మను ద్వారమునఁ బ్రవేశించెను. అప్పుడు గుట్టిములు మిక్కిలి యలసియుండిరవి.అట్లు వచ్చుచుండు భరతునింజూచి ద్వారపాలురు లేచి, జయ మయిగి వెంబడివచ్చుచుండఁగా నాభరతుఁడు నిలుకడలేని మనస్సు గలవాఁడై, ద్వారపాలురను మర్యాదచేసి, బడలికఁజెందియున్న యశ్వ పతిరుహారాజు సారథిని బిలిచి యిట్లనియె. "ఓ పాపరహితుఁడా! నే నేల వీరిచే నిష్కారణముగాఁ బిలిపింపఁబడితిని? నా మనమున నేవియో చెఱుపులే తోఁచుచున్నవి. నా ధైర్యస్వభావము తగ్గిపోవుచున్నది. సారథీ, రాజులు నశించినపు డేయవక్షణములు గాన్పించు ననిపెద్దల వలన వినియున్నానో, యాయవలక్షణము లన్నియు నిచ్చట నగపడు చున్నవి. ఇచ్చట నుండు కుటుంబుల యిండ్లూడ్వఁ బడక గఱుకులు పాతియున్నవి. తలుపులు తెఱవఁబడియున్నవి. పూజాకర్మలు నడవ కున్నవి. సుగంధ ధూపములు వేయఁబడకున్నవి. జనులందఱు భోజనము లేక, వాడుపాతిన మోములు గలిగియున్నారు. ఇట్లుండుటచే గృహా ములు గాంతిదఱిగియున్నవి. దేవాలయములందుఁ బుష్పమాలికల యలం కారములు లేకయున్నవి. ముంగిళ్లు చక్కఁగాఁ నలుకఁబడకుండుట చేతఁ బాడుపడియున్నందున పూర్వమునలెఁ బ్రకాశింపకున్నవి. దేవతా పూజలును, యూపస్తంభములును, యజ్ఞసభలును లోపించియున్నవి. పూలయంగళ్లయందుఁ బూలసరముల యమ్మకము జరుగకయున్నది. ఇచ్చట వర్తకులు మునుపటిలెఁగాక, చింతతోఁగూడినవారలై, క్రయ విక్రయములు నిల్పి దీనులవలెఁ గాన్పించుచున్నారు. దేవాలయము లందును, మంటపములందును, బక్కులు గుంపులుగూడి దీనముగా రొద చేయుచున్నవి. పురమునందలి స్త్రీపురుషు లందఱు మాసిన బట్టలను గట్టు కొని, నయనములనిండఁ గన్నీరు పెట్టుకొని, ధైర్యమువిడిచి, చింతచేఁ జిక్కి తహతహపడుచు నున్నట్లు తోఁచుచున్నది." అని భరతుఁడు తన తాతగారి సారథితోఁ జెప్పుచు, నయోధ్యాపురమునందలి యా యశుభలక్షణముల సూచుచు, జనసంచారము లేని చదుకములతోను, గృహాములతోను, రాజమార్గములతోను గూడినదియు, దుమ్ముపడుటచే నెట్టినైన ద్వారములందలి తలుపులును, ద్వారబంధములును గలదియునై

పూర్వ మమరావతిం బోలియుండిన యయోధ్యాపురమును జూచి' మిక్కిలి దుఃఖముతో నిండినవాఁడై, యింతకు మున్నెప్పుడును నీ పుర మునఁ జూడని యప్రియముల ననేకములను జూచుచుఁ దలవాంచి, మనమున ధైర్యము విడిచి సంతోషహీనుఁడై తండ్రియొక్క నగరునఁ బ్రవేశించెను.

72-వ సర్గము

కైకేయి భరతునకు అయోధ్యయందు నడిచిన సంగతిఁ జెలుపుట

అంత భరతుఁడు పితృగృహమునఁ దండ్రిని గాననివాఁడై, మాతృగృమునఁ దల్లిని జూడఁబోయెను. కైకేయియుఁ దాతగారి యూరికిఁ బోయియుండి వచ్చిన భరతునిఁజూచి, సంతోషముతో దన బంగరు గద్దియపైనుండి లేచెను. ధర్మశీలుఁడగు భరతుఁడు చెన్ను దఱిగియున్న స్వగృహము చేరినవెంటనే తనతల్లియొక్క శుభకరము లగు పాదములకు నమస్కరించెను. ఆ కైకయుఁ దనకు మ్రొక్కిన కీర్తి మంతుఁడగు తనపుత్రుని భరతుని లేవనెత్తి శిరమున ముద్దాడి, గట్టిగాఁ గౌఁగిలించుకొని, యతనిని దనతొడమీఁదఁ గూర్చుండఁబెట్టికొని, క్షేమము లడుగఁబూనెను. "ఓ నాయనా! నీవు తాతగారియూరు బయలువెడలి యెన్ని రాత్రులాయె? నీవు వేగిరముగ రథమున నేతెంచి నాఁడవే! నీకు దారిబడలిక లేదుగదా! ఓరి నాయనా! పూజ్యుఁడయిన నీ తాతయు, నీ మేనమామ యగు యుధాజిత్తును క్షేమముగ నున్నారా? నీవును దూరదేశమున సౌఖ్యముగా నుంటివా? ఈ సంగతి యెల్ల నాకు సవిస్తరముగాఁ జెప్పుము." అని తల్లి యడుగఁగా, కమల లోచనుఁడయిన రాజనందనుఁడగు భరతుఁడు సంగతి యంతయు సవిస్తరముగాఁ దల్లికిఁ జెప్పఁదొడఁగెను. "ఓ తల్లీ! నేను తాతగారి యింటినుండి బయలుదేఱి నేఁటి కేడు రాత్రులు గడచినవి. నీ తండ్రియు, నా మేనమామయు క్షేమముతో నున్నవారు. నాకుఁ దాతగారొసఁగిన ధనమును, రత్నములను గొనివచ్చెడి పనివారు డస్సినందున దారిలో నొకగ్రామమున నిలిచిరి. నేను ముందుగా నేతెంచితిని. రాజుగారిచేఁ బంపఁబడిన దూతలు నన్నుఁ దొందరపెట్టుటచే, నేను నిలువకయు వచ్చితిని, నేను ఏది యడుగుదునో, దానికి నీవు బదులీయవలె నని కోరు

చున్నాను. "ఓతల్లి బంగరు భూషణములచే నలంకరింపఁబడిన నీవు పరుండెడి యీ పాన్పు వట్టిదిగ నున్నది. చళరథుని సంబంధులయిన వారందఱు మోమున సంతోషము లేకయున్నట్లు తోఁచుచున్నది. నృపాలుఁడు తఱచుగా నిచ్చట నుండుట వాడుకగదా! ఆయన యిచ్చటఁ గనఁబడలేదు. ఆయనను జూడఁగోరి నే నిచ్చటి కేతెంచితిని. తండ్రిగారి పాదములకు మ్రొక్కవలయును. ఆతఁడు నా పెద్దతల్లియగు కౌసల్య యొక్కయింట నున్నాఁడా? చెప్పుము." అని యడిగెను. అంతట, కైకేయి రాజ్యమునందలి లోభముచే మంచిచెడ్డ లరయఁజాలనిదై, భయంకరమును, నిష్టము గానిదియునైన వృత్తాంతమును బ్రియ మని తలఁచి, యొక్కటియు నెఱుఁగని భరతునితో నిట్లనియె.

"అయోధ్యాదేశము నేలువాఁడును, మహాబుద్ధిమంతుఁడును, పరాక్రమశాలియు, యాగము లనేకములను జేసినవాఁడును, సజ్జనులకు గతియైనవాఁడు నగు నీ తండ్రి యందఱు పోయిం చేరెడు స్థలమునకుఁ బోయెను." అని చెప్పెను. ధర్మిష్ఠుఁడును, సత్కులప్రసూతుఁడును, ఆచారసంపన్నుఁడునైన భరతుఁ డీ మాటలు విని, పితృవియోగ దుఃఖము సైరింపఁజాలక, వెంటనే "అక్కటా! చచ్చితినిగదా!" యని మిక్కిలి హీనస్వరముతోఁ బలుకుచుఁ దన నిడుదచేతులను విదలించికొని క్రిందఁబడి, తండ్రి మరణమునకై మిక్కిలి చింతించి, మనము బ్రమసి కలవరపడి యిట్లు లేడ్వసాగెను. "ఈ నా తండ్రియొక్క శయనగృహము పూర్వము శరదృతువునందలి చంద్రునిచే వెలుఁగు నిర్మలరాత్రివలె బహు రమ్యముగా ప్రకాశించుచుండెను. ఇప్పు డా ధీమంతుఁడగు రాజు లేని యీ శయనము చంద్రుఁడు లేని రాత్రికైవడి సీ రింకిన సము ద్రమువలెఁ గాంతిఁ దఱిగియున్నది" అని చెప్పుచుఁ గన్నీరు విడిచి, పితృ వియోగముచే మిక్కిలి విచారపడి కాంతిగల తన మోమును బట్టతోఁ గప్పుకొని గట్టిగ విలపించుచుండెను. నొచ్చినవాఁడును, దేవతలంబోలు కాంతిగలవాఁడును, కాననమున గొడ్డలితో నఱికఁబడిన మ్రానిబోదెవలె నేలమీఁదఁ బడియుండువాఁడును, మదపుటేనుఁగుఁ బోలువాఁడును, చంద్రసూర్యులవలె వెలుఁగువాఁడునైన భరతుని కైక లేవనెత్తి కూర్చుండఁ బెట్టి యిట్లనియె. "కీర్తిమంతుఁడవగు నో రాజపుత్రుఁడా!

లే లెమ్ము. ఏల పడియుండెదవు? సభాపూజ్యులయిన నీబోటివారు శోకము నొందరుగదా! బుద్ధిమంతుఁడా! నీ యొక్కబుద్ధి దానములకు, యజ్ఞములకు నధికారము గలదియు, సదాచారముల వేదవాక్యముల ననుసరించినదియునై సూర్యమండలమునందు వెలుఁగువలె వెలుఁగుచున్న ది."అని కైకేయి భరతునితోఁ జెప్పెను. ఇవ్విధమున నానావిధములగు విచారములతో నిండినవాఁడై అంత భరతుఁడు చాలసేపు నేలపైఁ బొఱలుచుండి, తల్లిఁ జూచి "నాతండ్రి రామునికిఁ బట్టాభిషేకము నేయనున్నాఁడో, లేక జన్నమునేయనున్నాఁడో."అని యెంచి మహానంద ముతో నిటకుఁ బయనమై వచ్చితిని. అది యిప్పుడు వేఱుగా మాఱిపో యెను. ఎల్లప్పుడు మా కిష్టమును మేలును గల్గించుటయం దత్యంత శ్రద్ధ గల మాతండ్రి కానిపింపకపోవుటచేత నా మనము బ్రద్దలయిపోయినది. తల్లీ! నేను రాకమునుపే, యేవ్యాధిచే నతఁడు లోకాంతరము నొందెను? రామాదులందఱు దగ్గఱనుండి పితృసంస్కారము చేయుటచే ధన్యులైరి. కీర్తిమంతుఁడగు మహారాజు "నేను వచ్చితి"నని దృఢముగా నెఱుఁగఁడు గాఁబోలు! ఆతఁడు "నేను వచ్చితి" నని యెఱుఁగునేని, వేగముగ వచ్చి, నన్నుఁ దలవంచి ముద్దాడునుగదా! నేను వీథులలో నాటలాడునపుడు నాయొడలి కంటుకొనిన దుమ్మును మృదువుగా దులుపునట్టిదగు పుణ్య కర్మముల నాచరించు నాతండ్రి చేయి యెక్కడ? ఎవ్వఁడు నాకుఁ దోబుట్టువును, దండ్రియు, జ్యేష్టమునైయున్నాఁడో, ఏ బుద్ధిమంతునికి నేను దాసుఁడనైయున్నానో, పాపకార్యముల చేయని యట్టి రామునికి నేను వచ్చియుండు సంగతిని త్వరఁగా దెలియఁజేయుము. ధర్మము నెఱిఁగిన వానికి నన్నయేగదా తండ్రి. కావున నాతని పాదములను బట్టు కొందును. తండ్రి గతించినపిమ్మట నింక నతఁడేకదా నాకు గతి. ధర్మముల నెఱిఁగినవాఁడును, ధర్మమునందే నెలకొన్నవాఁడును, సత్యము తప్పని వాఁడును, నియమము దాఁటనివాఁడును, స్థిరమగు పరాక్రమముగల వాఁడును నైన పూజ్యుఁడగు నా తండ్రి దశరథనృపాలుఁడు నా కేమి చెప్పి పోయెను? మా తండ్రి చనిపోవునప్పుడు చెప్పిన మంచిమాట యేదియో వినఁగోరుచున్నాను." అని భరతుఁ డడుగఁగా, కైకేయి నడచినది నడచినట్లు చెప్పఁగోరి, "ఓ భరతా! గతిమంతులలో శ్రేష్ఠుఁ

డయిన మహాత్ముఁడగు నృపాలుఁడు "ఓ రామా! ఓ లక్ష్మణా! ఓ సీతా!" యని విలపించుచుఁ బరలోకము నొందెను. నీతండ్రి మృత్యుదేవతచే నీడ్వఁబడి క్రొళ్ళఁజేఁ గట్టుఁబడి మదపుఁజేనుఁగువలె విలపించుచు నీ తుది మాటను జెప్పెను. "ఏ నరులు సీతతోఁగూడ మఱలివచ్చిన రాముని, మహాభావనుఁడగు లక్ష్మణునిఁ జూడఁగలరో, వారు కృతార్థులు." అని యాతఁడు చెప్పెను." ఇట్లు కైకేయి చెప్పిన రెండవ యప్రియవాక్య మును విన్న వెంటనే భరతుఁడు కడువ్యసనమునొంది, మోమున విన్న దనము దోఁపఁగా, మఱలఁదల్లి నిట్లని యడిగెను. "ఓ తల్లీ! ధర్మాత్ముఁడును, కౌసల్యయొక్క ముద్దులపట్టియునైన రాముఁడు, తమ్ముఁడగు లక్ష్మణుఁడును, సీతయు నొకటేపర్ణ్యశ మెక్కడికిఁ బోయిరి?" అని యడుగఁగా, భరతునితల్లియగు కైకేయి భరతునికిఁ బ్రియముగాని మాటను బ్రియ మను భ్రాంతితో వాస్తవముగాఁ జెప్పఁదొడఁగెను.

"ఓ పుత్రా! రాచకొమరుఁడగు నా రాముఁడు నారబట్టలను గట్టు కొని, లక్ష్మణుఁడు వెంబడి వచ్చుచుండఁగా, సీతను బిలుచుకొని దండ కారణ్యములకుఁ బోయెను."అని కైక చెప్పఁగా, భరతుఁడు తనవంశము సదాచార సంపన్న మయినది గావున, తనయన్న యేమియైనఁ జెడుపని చేసెనా యని సంశయించి, తల్లిని మఱల ని ట్లడుగఁదొడఁగెను. "ఎచ్చట నైనను రాముఁడు బ్రాహ్మణుల ధనం బపహరించెనా? దరిద్రునిఁగాని, లేక భాగ్యవంతునిఁగాని తప్పులేనివానిని దండించెనా? రాజపుత్రుఁడగు నారాముఁ డెప్పుడును పొరుగువారి భార్యలను జెఱచువాఁడుకాఁడు గదా! భ్రూణహత్యఁ జేసినవాని నడవికిఁ బంపునట్లు రాముని నడవికిఁ బంపుట కేమి కారణము?"అని భరతుఁ డడుగఁగా, భరతుని తల్లి యగునైకేయి, మూఢురాలయినను తన్నుఁ బండితురాలనిగా నెంచిన దగుటవలన, స్త్రీ స్వభావముచేత జరిగిన సంగతి యిది యని యంతయు దాఁపక యున్నది యున్నట్లు, భరతునితోడనే చెప్పఁదొడఁగెను. "ఓ పుత్రుఁడా, రాముఁడు బ్రాహ్మణధనమును గొంచెమయిన నెప్పుడును నెచ్చటను నపహరించినది లేదు;తప్పుచేయనివానిని భాగ్యవంతునైనను దరి ద్రునినైనను హింసచేయునదియు లేదు;రాముఁడు పరదారలను గన్నెత్తి యైనఁ జూడఁడు. కుమారా! దశరథుఁడు రామునిపట్టాభిషేకము

నకుఁ బ్రయత్నముచేయుచున్నాఁడని నేను విన్నతోడనే, నీకుఁ బట్టాభిషేకము నేయునట్లును, రామునిఁ బదునాలుగేండ్లు దండకారణ్యములకుఁ బంపునట్లును నృపాలుని రెండు వరముల నడిగితిని. ఆ నృపశ్రేష్ఠుఁడును భాగ్దత్తమును దప్పఁ గూడదను తన నియమములను బట్టి, నే నడిగిన ప్రకారము చేయఁదలఁచి, రాముని సీతాలక్ష్మణులతో నడవికిఁ బంపెను. ఆ పుత్రుని నడవికిఁ బంపి, యా పుత్రవియోగదుఃఖము సైరింపఁజాలక, మిగులఁబొగిలి మృతినొందెను. ధర్మముల నెఱిఁగిన వాఁడా! నీ విప్పుడు రాజ వగుము. నీకు రాజ్యము వచ్చునిమిత్తమే నే నిది యంతయుఁ జేసితిని. నాయనా! దుఃఖసంతాపములను వదలి ధైర్యము నవలంబింపుము. ఈ యయోధ్యాపురమును, ఈ సుభిక్షమైన రాజ్యమును నీ యధీనమైయున్నవి. ఓ పుత్రుఁడా! నీవు జాగు చేయక శాస్త్రవిధుల నెఱిఁగిన వసిష్ఠాది మహామునులు చెప్పు ప్రకారము ధైర్యవంతుఁడగు తండ్రికి సంస్కారము గావించి, పట్టాభిషేకముఁ జేసికొనుము" అని కైక భరతునితోఁ జెప్పెను.

73-వ సర్గము

భరతుఁడు తండ్రి, తోఁబుట్టువులనుగూర్చి విలపించుట

భరతుఁడు కైకవలనఁ దండ్రి మృతినొందినదియు, తోఁబుట్టువులు సీతతోడ నరణ్యమునకుఁ బోవుటయు విని, దుఃఖసంతప్తుఁడయి యిట్లనియెఁ:—"తండ్రిని, తండ్రితో సమానుఁడయిన నా యన్నను విడిచి, బెట్టచెడి దుఃఖించుచున్న నా కీ రాజ్యమేల? నీవు నా తండ్రినిఁ జంపి, అన్న నడవికిఁ బంపి, వైద్యుఁడు పుంటివిూఁద తోరము నుంచునట్లు దుఃఖమువిూఁద దుఃఖమును గలిగించితివి. కులమునకుఁ జేటు తెచ్చుటకై నీవు ప్రలయకాల రాత్రివలె మాయిల్లు సొచ్చితివి. మా తండ్రి నిన్నుఁ జెడ్డదానిఁగఁ దెలియక యొడిలో నిప్పుఁగట్టుకొన్నట్లు నిన్నుఁ గట్టికొని మృతినొందెను. ఓ చెడు పనులందుఁ దలఁపుగలదానా! నీవు కావలె నని మా తండ్రికి మరణముఁ దెచ్చి పెట్టితివి. ఈ ఇక్ష్వాకువంశమునకు నీ వజ్ఞానముచే సుఖమునుబోఁగొట్టి దుఃఖముఁ దెచ్చితివి. సత్యసంధుఁడును కీర్తిమంతుఁడునైన నాతండ్రి నిన్నుఁ బొంది, యీ ర్వారాని దుఃఖముచే నొచ్చినవాఁడయి పరలోకమును జెందెను. ధర్మవత్సలుఁ

డయిన నా తండ్రియగు మహారాజేల నీచేఁ జంపఁబడెను? రాముని నేల యూరు వెడలఁగొట్టి యడవులకుఁ బంపితివి? కౌసల్యయు సుమిత్రయుఁ బుత్రశోకపీడితలయి, నా తల్లియగు నీకడఁ జేరి యిఁక జీవింతు రను మాట కల్ల. పెద్దలకడ నెట్లె ట్లుండఁనలయునో, అదియెల్ల నెఱిఁగిన రాముఁడును తన తల్లియందువలెనే నీయందును భయభక్తులు గల్గి శుశ్రూష చేయుచుండునుగద! దూరాలోచనగల నాపెత్తల్లియు ధర్మము నవలంబించి, నిన్నుఁ దన చెల్లెలితో సాటిగాఁ జూచుకొనుచుండును గదా. ఓ పాపిష్ఠురాలా! నీపైఁ బ్రేమగల యట్టి కౌసల్య కొమరుఁడును బుద్ధి మంతుఁడును నైన రామునికి నారబట్టలు గట్టించి, యడవికిఁ బంపి, నీ వెట్లు దుఃఖింపవు? చెడ్డపనులందు దృష్టి లేనివాఁడు, శూరుఁడు, బుద్ధిమంతుఁడు, గుణవంతుఁడని ప్రసిద్ధిచెందినవాఁడును నైన రామునికి నారబట్టలొసఁగి యూరు వెడలఁగొట్టితివికదా! అట్లు చేయుట కేమి కారణముకలదు? నేను రాముని యందు మిక్కిలి భయభక్తులు గలవాఁడ నని వివేకహీనురాలవయిన నీ వెఱుఁగవైతివని తలఁచెదను. కావుననే నీవు రాజ్యముమీఁది యాశచే నీ యనర్థమును దెచ్చి పెట్టితివి. నే నన్నను, పురుషశ్రేష్ఠులయిన రాయలక్ష్మణులను జూడక యేశక్తియుహీ నమునఁలన రాజ్యముఁ బరిపాలింప సాహసింపఁగలను? మేరుపర్వతము తలయందలి వనమునుంబోలె, బలిష్ఠుఁడైన దశరథనృపాలుఁడు బలవంతుఁ డైన తన పుత్రుని రాముని నాదరువుచేసికొని యుండెను. అట్లుండఁగా, బరువుమోయఁగల గొప్ప యెద్దు మోయఁదగిన భారమును గోఁడె మెడమీఁదఁ బెట్టిన, నా భారము నాగోడె మోయఁజాలనట్లు దశరథునిచే రాముని తోడ్పాటువలన మోయఁబడుచున్న రాజ్య భారమును బసివాఁడ నైన నేను మోయఁజాలను. ఆ బరువు మోయు నంతటి శక్తి నా కెక్కడిది? అట్లు కాక, నాకు సాహాద్యసాయముల చేతఁగాని, బుద్ధిబలముచేతఁగాని రాజ్యపరిపాలనము సేయు శక్తి యుండినను నుండనిమ్ము. అట్లున్నను, పుత్రునందుఁ బేరాసగలిగిన నీ కోరిక నీడేర్ప నాకిష్టము లేదు. రాముఁడు తనతల్లియందువలెనే నీయందును భక్తి గౌరవములు గలవాఁడు గనుక, ఆయనకుఁ గోపము వచ్చు నని పాపపుఁదలంపుగల నిన్ను విడువఁజాలకున్నాను. రామునికి

నీయం దట్టి గౌరవము లేదేని, నిన్ను నేఁ బరిత్యజించియే యుందును. పాపబుద్ధిగలదానా! సచ్చరిత్రమును కోలుపోయినదానా! పెద్దలెల్ల దూషించునట్టి యీ దుర్బుద్ధి నీకెట్లు పుట్టినది? మా వంశమునఁ బెద్దల నాటినుండి పెద్దకుమారునికిఁ బ్రభుత్వ మొసఁగుదురు. అతనితమ్ము లతని యందు భయభక్తుల గలిగి మెలఁగుచుందురు. ఓసీ క్రూరురాలా! రాజ ధర్మమును గమనింపవలెననియు, రాజుల సాంప్రదాయకమైన మర్యాద మీఱరాని దనియు నీవు దెలియవైతివికదా. రాజధర్మముఁ బరీక్షించి చూడఁగా, రాజ్యమునఁ బెద్దకుమారునికిఁ బట్టాభిషేకము జరుగుట క్షత్రియు లందఱికిను సమానము. ముఖ్యముగ నిక్ష్వాకువంశపు రాజు లకు మిక్కిలి సమ్మతముగు విషయము. కేవలము ధర్మమునే కాపాడు చుండువారును, కులమర్యాదలు, సదాచారములుం గలవారునునైన యీ యిక్ష్వాకువంశీయులవారికిఁ గల సచ్చరిత్రాభిమానము నీవలనఁ బాడైపోయెను. నీ పుట్టినింటివారగు రాజులు మిక్కిలి యోగ్యులు గదా! పెద్ద లందఱు నిందించెడు నీయజ్ఞానము నీ కెట్లు సంభవించినది? చెడుతలంపుగలదానా! నేను నీ కోర్కి నెఱవేర్చను. నీవు నాకుఁ బ్రాణ హానిచేయ నీ దుఃఖమును దెచ్చిపెట్టితివి. నీయనోరథము సిద్ధింపకుండు టకై యిదిగో చూడుము! ఇప్పుడు నేను బంధుజన ప్రియుండగు రాముని మఱలించుకొని వచ్చెదను. అట్లు రాముని మఱలించికొనివచ్చి, తేజస్సుచే వెలుఁగుచున్న యీ రామునకుఁ బట్టముగట్టి మిక్కిలి దృఢ మయిన మనస్సుతో నతనికి దాసుఁడనై యుండెదను." అని యిట్లెఱఁ గున గంభీరస్వభావముగల భరతుఁడు మిక్కిలి అప్రియములైన పలుకు లతో నామెను నొప్పించుచు శోకపీడితుఁడై, పర్వతముయొక్క గుహాయం దున్న సింహమువలెఁ దద్దయుం బెద్ద గర్జించెను.

74-వ సర్గము

భరతుఁడు, మఱల కైకేయిని దూషించుట

భరతుఁ డప్పుడు తల్లియగు కైక నవ్విధమున దూషించి, మఱల నత్యాగ్రహమునొందినవాఁడై కైకేయింజూచియిట్లనియె: "క్రూరురాలా! చెడునడతగలదానా! నీవు ధర్మముఁ బాసితివి గావున రాజ్యమునుండి తొలఁగిపొమ్ము. నేను మృతినొందితి ననినీ వేడ్కచు నుండుము. నృపా

లుఁడుగాని, అతిధర్మశీలుఁడయిన రాముఁడుగాని నిన్నుఁ దిట్టిరా? ఏమియు లేకున్న, వారిలో నొక్కరికి మరణము మఱొక్కరికి వన వాసము నొకతూరిగా నెందుకుఁ దటస్థించెను. కులనాశకురాల వయిన నిన్ను భ్రూణహత్యాపాతకము చుట్టుకొనినది. నీవు నరకమునఁ బడుము. నీభర్తపోయినలోకము నీకు లభింపదు. నీవు ఘోర ప్రయత్నము నేసి, సకల లోకప్రియుండైన రాముని నడవికిఁ బంపి, నీ వొనర్చిన యీ పాప కార్యము నా మనస్సునకు గొప్ప భయముఁ దెచ్చుచున్నది. నీ నిమిత్త మయి నాతండ్రి మృతి నొందెను. రాముఁ డడవికిఁ బోయెను. నా కీ భూలోకమున నపకీర్తియుఁ గలిగెను. మాతృరూపిణి యగు నా శత్రువా! రాజ్యమునుగోరు క్రూరురాలా! చెడునడతగలదానా! పెని మిటిని జంపుకొన్నదానా! నీవు నాతో నేమియుఁ బలుకుట తగదు. కౌసల్య, సుమిత్ర మొదలగు నా తల్లులందఱు కులముఁ జెఱుపఁబుట్టిన నీవలనఁ గడు వగలపాలయిరి. నీవు ధర్మాత్ముఁడును, వివే కియునైన యశ్వపతికిఁ బుత్రికవు గావు. తండ్రి కులమును రూపుమాపు టకై యచ్చట రక్కసివిగాఁ బుట్టితివి. నీవు రక్కసివి కావేని ధర్మమునం దాసక్తిగలవాఁడును, సర్వకాలములందును సత్యముఁ దప్పనివాఁడును నగు రాముని నడవికిఁ బంపి, పుత్రవియోగ దుఃఖముచే మాతండ్రి స్వర్గమునొందునట్లు చేసియుందువా? పాపకార్యమే ముఖ్యముగాఁగల దానవై, నీవు నా తండ్రినిఁ బరలోకము నొందించి, నాతోఁబుట్టువుల నడవులపాలుచేసి, లోకుల కందఱకు నన్నప్రియునిఁజేసి, నీ చేసిన పాపమునెల్ల నా నెత్తినిఁ ద్రోఁచితివి. నీవు చెడుతలంపు గలదానవు నరకమున కేగుదానవునైనందున ధర్మాత్ముఁరాలగు కౌసల్యయొక్క పుత్ర నడవులకుఁ బంపించి యామెకుఁ బుత్రవియోగ దుఃఖము గలిగించితివి. నీ వన్యాయ్యముగా సాధుబాధ చేసితివి కావున నీ విపు డెట్టి నరక లోకము నొందెదవో నాకుఁ దెలియకున్నది? నీ పాపమునకుఁ దగిన నరకలోకము నా కొక్కటియుఁ దోఁపలేదు. ఓక్రూరురాలా! కౌసల్యా పుత్రుఁడగురాముఁడు సదా బంధువుల కాదరువైనవాఁడనియు, నృపా లుని పెద్దకొడుకు గాన నాకుఁ దండ్రితోసాటియగువాఁడనియు నీకుఁ దెలియదయ్యెఁగదా? పుత్రుఁడనువాఁడు తల్లియొక్క ముఖము, కంఠము,

త్రొమ్ము, కుతీ, చేతులు, కాళ్ళు మొదలగు నంగముల వలనను, కన్నులు, ముక్కులు, చెవులు, నోరు మొదలగు ప్రత్యంగములవలనను, హృదయమువలనను బుట్టుచున్నాఁడు. కావునఁ దల్లికిఁ దనయంగ ప్రత్యంగహృదయములవలనఁ బుట్టిన పుత్రుఁ డెంతటి ప్రియుఁడో, తక్కిన బంధువు లంత ప్రియులు గారు. కావునఁ దల్లి కట్టిపుత్రుని నెడఁ బాసి యుండుట యెంతయో కష్టముగదా! తొల్లి యొకానొకప్పుడు, ధర్మములన్నెల్ల నెఱిఁగినదియు, దేవతలచేఁ పూజింపఁబడునదియునైన కామధేనువు భూలోకమున నాఁగేటి నీడ్చుచు, దున్నఁజాలక, సగము దినము దున్ని, యలసి నిర్జీవములవలెఁ బడియుండు తన పుత్రులగు రెండు వృషభములఁ జూచి, కన్నీటిచేఁ జెదరిన చూడ్కులు గలదై, పుత్రశోకముచే రోదనము సేయుఁగా, నా కామధేనువునకుఁ గ్రిందుగాఁ బోవుచున్న మహోత్సుఁడయిన దేవేంద్రునియొడలిపై సువాసనకల సన్ని కన్నీటిబొట్లు పడినవి. ఇంద్రుఁడును దన దేహమునఁబడిన సువాసనగల కన్నీటిబొట్లను జూచి, యీ కన్నీరు విడిచినది యుత్తమయగు కామధేను వని యెఱిఁగి, యాకసమునఁ గడుచింతతో విలపించుచు సంతసముఁ దక్కఁ కదలక నిల్చియున్న కామధేనువునకు నంజలి చేసినవాఁడై, విచార పడుచుఁ గీర్తిమతియు, వగపుచే నొచ్చినదియునైన యీకామధేను వుతోఁ "మాలో నెవరివలనను నీకు భయము లేదుగదా. సకల జనముల మేలుగోరు కామధేనువా! నీవేల యిట్లు వ్యసనపడుచున్నావు? నీ వ్యసనమునకుఁ గారణమేమి? చెప్పు"మని యడిగెను. అంత ధైర్యముగలదియగు కామధేనువు ధీమంతుఁడగు మాటలలో నేర్పరి యైనయింద్రునిఁ జూచి, "అమ్మ్యయ్యో! మీ రన్నట్టియమంగళవాక్యమును నేను వినకుందునుగాక! అమరావతీ విభుఁడా! మీవలన నా కెట్టి భయమును లేదు. దేవేంద్రా! కృషీవలులు పెట్టెడి బాధలకు లోనయ్యి, యెండవేఁడిమికి వాడుపాటై, బక్కచిక్కి దీనులయి యీపదయం దున్న నా పుత్రులను జూచి, "అక్కటా! నా దేహమునుండి పుట్టినయీ వృషభము లిట్లు బరువు మోయఁజాలక కష్టములపాలయియున్నవి." అని విచారపడుచుఁ గన్నీరువిడిచితిని. లోకమునఁ గన్నకొడుకుంబోలెడు ప్రియుఁడు లేఁడుగదా!" అని చెప్పెను. ఇంద్రుఁడును "ఈ ప్రపంచ

మంతయుఁ దన కొడుకులు వేలకొలఁదిగ వ్యాపించియున్నను, ఇరువురు బిడ్డలు కష్టపడుచుండుట కింతగా వ్యసనపడుచున్నదే యీ కామధేనువు! లోకమునఁ బుత్రునికన్న ప్రియమయినవా రన్యులు లే"రని తలఁచెను. ఎల్లప్పుడు సాటిలేని మంచి నడనడి గలదియు, అందరికంటె మించిన కాంతిగలదియు, ఎడఁబాయని గుణములుగలదియునైన కామధేనువు స్వభావముచే సమస్తమును సృజింపశక్తిగలదై, లోకరక్షణము నిమిత్తము వేలకొలఁది బిడ్డలను సృజించి, పుడమియెల్ల వ్యాపింపఁజేసియున్నను, ఇరువురు పుత్రులనిండుమనులఁజూచి, విచారపడుచుండ, నొకపుత్రునిఁగన్న కౌసల్య రాముని బాసి యెట్లుండఁగలదు? అక్కటా! నీ వీ విడరొక్క యింటికొడుకును వనంబునకుఁ బంపి యీ మెకునామె బిడ్డనికి నెడఁబాటు గలిగించితివి. కావున నీ వెల్లప్పుడు, ఇహపరములు రెండిటియందును దుఃఖము ననుభవించుచుందువు. నే నన్ననో మాయన్నకును దండ్రికిని బూజలు సల్పుచుఁ గీర్తిని వృద్ధిచేసికొనెదను. ఇది నిస్సంశయము. అటు కాదేని, బలవంతుఁడయిన కౌసల్యా పుత్రుఁడగు రాముని నిచ్చటికిఁ బిలుచుకొనివచ్చి, పట్టాభిషిక్తుఁజేసి, మునులుండు నరణ్యమునకు నేనే పోయెదను. చెడుకోర్కులు గలదానా! పురజనులందఱు కన్నీరుపెట్టుకొని చూచుచుండఁగా, నీవు సంపాదించి యిచ్చిన యీ పాపపు రాజ్యమును వహించి యుండఁజాలను. నీ వగ్నియందైనఁ బ్రవేశింపుము. నీవె దండకారణ్యములపాలుకమ్ము. లేక గొంతున కురియైన వేసికొనుము. ఇంతకన్న వేఱుశరణము నీకు లేదు. నిక్కమగు మగటిమిగల రాముఁడు మఱలఁ నయోధ్యకు వచ్చినప్పుడే నేను కల్మషములను బోఁగొట్టికొని కృతార్థుఁడ నయ్యెదను." అని కైకేయితో భరతుఁడు చెప్పెను. శత్రుసంహారియగు భరతుఁడు కోపముచేఁ గన్ను లెఱ్ఱనచేసి, బల్లెమునుతోను, ఈఁటెతోఁ బొడువఁబడిన యేనుఁగువలె బుస కొట్టుచున్న పాముమాడ్కి నిట్టూర్పు నిగిడించుచు, నొడలిబట్టి వీడుట కూడ దెలియక, తాఁటుమారైన సర్వాభరణములతోఁ గూడి, యుత్సవానంతరమున నింద్రునివలె నేలఁబడి మూర్ఛిల్లెను.

75-వ సర్గము

భరతుఁడు కౌసల్యయొక్క నమ్మికకై యొట్టులు పెట్టుకొనుట

మగటిమిగల భరతుఁడు చాలసేపటికి లేచి కూర్చుండి తెలివినొంది, కండ్లనిండఁ గన్నీరుపెట్టుకొని, తన యభిప్రాయము చొప్పునఁ దన కొమరుఁడు రామునికై వగచుచుండు నికైకేయిం జూచి, యచ్చట నప్పు డున్న మంత్రు లందఱు వినునట్లుగా దూషించి, వారిం జూచి, "నే నొకప్పుడు రాజ్యముగావలె నని కోరను లేదు. నేను తల్లితో మంతనము నేయను లేదు. నృపాలుఁడు నికైకేయియొక్క ప్రోత్సాహముచే నాకుఁ బట్టాభిషేకము సేయవలె నని తలంచినదియు నాకుఁ దెలియదు. నే నెంతయో దూరదేశమున శత్రుఘ్నునితోఁగూడ నుంటిని. కావున ధైర్యశాలియైన రాముని నరణ్యమునకుఁ బొమ్మనినదియు, లక్ష్మణుఁడు, సీతయు నాతనిని వెంబడించిపోయినదియు నాకుఁ దెలియదు." అని గొంతెత్తి యఱచి చెప్పెను.

అవ్విధమున మొఱపెట్టుచున్న బుద్ధిమంతుఁడగు భరతుని యొక్క గొంతుచప్పుడును కౌసల్య గుఱుతుపట్టి సుమిత్రం జూచి, "దయమాలినదై గొంతుకోసెడునట్టి పనులుచేయు క్రూరురాలగు నికైకయొక్క కొడుకగు భరతుఁడు వచ్చినట్లున్నది. అతఁడు దూరదృష్టిగలవాఁడు. అతఁడు రామాదు లడవికిఁ బోవునపుడిచ్చట నున్నఁ దా నీ యపవాదమునకుఁ బాత్రుఁడగుదునని మున్నందుగా నాలోచించి, తల్లియొక్క బోధనచేతఁ దాతగారియింటికిఁ బోయినట్లు నెపముపన్ని, రాముఁ డడవికిఁబోయిన వెంటనే పట్టాభిషేకము చేసికొనుటకై యఱలిచ్చినవాఁడు. ఏమిసము నెఱుఁగనివానికైవడి నిప్పుడు మాటాడుచున్నాఁడు. ఆహా! యితఁడు దూరాలోచన చేయువాఁడు" అని చెప్పి, పన్నె గటికిఁగినదియు, వలిసపుంటినదియు చిక్కినదియునై నశరీరము గలిగి వణఁకుచు, మాటిమాటికి నొడలు దెలియక క్రిందఁబడుచు లేచుచు, భరతుఁ డుండు చోటికిఁ కౌసల్య దటులేను. అంత భరతుఁడును యాకౌల్యయొక్క సగరునకుఁ బ్రయాణమయ్యెను శత్రుఘ్నుఁడును తన యన్నయగు భరతుని వెంబడించి పోయెను. వా రిద్దఱు పోయి, కొడుకు నెడఁబాటుచేఁ దల్లడిల్లుచు నొడలు మఱచి

నేలఁబడియుండు కౌసల్యను లేఁగిలించికొని, మంచి మనస్సుగలదైన పూజ్యురాలగు తమ పెత్తల్లి దుఃఖపడుచుండఁగాఁ, దానును నామె యొక్క వెతలఁ జూడఁజాలక యేడ్చుచుండిరి.

అప్పుడు కౌసల్య మిక్కిలి వగలపాలైనదై, భరతునిఁజూచి, "ఓరీ నాయనా! రాజ్యము గావలె నని కోరితివి. ఇదిగో రాజ్యము వచ్చినది. తండ్రి మృతినొందెను. రామలక్ష్మణు లడవుల కేగిరి. ఇఁక శత్రుఘ్నుఁడు చిన్నవాఁడు; నీకు లొంగినవాఁడు. వాఁడు నీకుఁ బ్రియుఁడు. కావున నీ రాజ్యము నిష్కంటకమయినది. నీకు శత్రు బాధ లేదు. అక్కటా, కైకేయి చేసిన క్రూరపుఁ బనిచేతఁగదా యింత వేగముగా రాజ్యము నీ చేతికి వచ్చినది. ఔరా! కటికిపనులనే వెదకు నట్టి యీ కైకేయి, నా కొడుకుచేత నారబట్టలఁ గట్టించి, యడవుల పాలుచేసి, యేమి లాభముఁ బడసినది? బంగరువంటి మేనిచాయ గల వాఁడును, విశేషకీర్తిశాలియున్నైన రాముఁ డున్నచోటికి నన్నును వేగి రమే తలుమఁగొట్టఁగలదు. లేదేని, నేను స్వాయముగానే సుమిత్రను దోడ్కొని యగ్ని హోత్రుని ముందుంచుకొని రాముఁ డున్న యడవు లకు సుఖముగాఁ దఱలిపోయెదను. అట్లుకాదేని, పురుషశ్రేష్ఠుఁడైన రాముఁ డెచ్చటఁ దపస్సుచేయుచున్న వాఁడో యచ్చటికిప్పుడు నీవైనను నన్నుఁ గొనిపొమ్ము. ధనధాన్య సమృద్ధిగలిగి, రథగజతురగపదాతు లనెడి చతురంగబలముతో నిండియున్న యీ విశాలమైన రాజ్యమును నీకు నీకు సంపాదించి యిచ్చినది. నీవు దీనిని సుఖముగా నేలుము" అని భరతునిఁ బలుతెఱఁగుల దూఱెను.

భరతుఁడును కౌసల్య యాడిన నిష్ఠురపు మాటలచేఁ బుంటి యందు సూదిచేఁ బొడువఁబడినవానివలె మనస్సున నధికముగ బాధ నొంది దుఃఖాతిశయముచే మిక్కిలి తల్లడిల్లి, యా కౌసల్యయొక్క కాళ్ళపైఁబడి మూర్ఛ నొందెను. మఱిలఁ గొంతసేపటికి తెలివిఁదెచ్చు కొని లేచి, చేతులు జోడించి, యామె ముందట నిలిచి, యివ్విధంబునఁ బలువిధముల దుఃఖములపాలయి యున్న కౌసల్యతో నిట్లనియె.

"ఓ పూజ్యురాలా! యేమియు నెఱుఁగక నిరపరాధినై యున్న న న్నేల నిష్కారణముగ దూఱెదవు? రామునియెడ నాకుఁగల విస్తార

మైన నిశ్చలభక్తి నెట్లుండగవే? † నా యనుమతిమీఁదనే సత్యసంధుఁడు (==ప్రతిజ్ఞఁ దప్పనివాఁడును), సజ్జనశ్రేష్ఠుఁడునైన రాముఁ డడవికిఁ బోయి యుండునేని, నేను గురుముఖమున నేర్చిన శాస్త్రానుసారియయిన బుద్ధి నశించునుగాక. రాముని యరణ్యప్రవాసము నా సమ్మతిమీఁదనే నడచిన దగునేని, నేను మహాపాపాత్ములకుఁ గింకరుఁ డగువానికిఁ గలుగు పాతకమును, సూర్యుని యెదుట మూత్రపురీషములను విడిచిన వానికిఁ గలుగు పాతకమును నిద్రించుచున్నయావును గాలితోఁ దన్నిన వానికిఁ గలుగుపాతకమును నాకుఁ గలుగును. నా యనుమతి మీఁదనే రాముఁడు వనంబులకేగియుండెనేని, పనివానిచేతఁ జాకిరి చేయించుకొని, బత్తెమియ్యక పంపిన యజమానునకుఁ గలుగు పాపము నాకుఁ గలుగును. రాముని వనవాసము నాకు సమ్మతమేయైయున్నయెడల, సకల జీవరాసులను దన పుత్రులతో సాటిగాఁ బాలించు రాజునకు ద్రోహముసేయువారికిఁ గలుగు పాతకము నాకు సంభవించును; జనుల యాదాయము నుండి యాఱవపాలు పన్ను గైకొని, జనులను గాపాడనట్టి రాజు చెందెడి

---

† వాల్మీకి మహాముని భరతుని నెపమునఁ గొన్ని మంచి ధర్మములను బోధించుచున్నాఁడు. సజ్జనుల కషాయంబుఁ దలఁచువానికి గురుముఖమునఁ బడసిన శాస్త్రజ్ఞానము నశించిపోవును. పాపాత్ములకుఁ గొల్వుకాఁడు కాఁగూడదు. సూర్య నెదుటికిఁ దిరిగి మలమూత్రములు విడువరాదు. నిద్రించుచున్న యావును గాలితోఁ దన్నరాదు. పని వానిచేతఁ బని చేయించుకొని, బత్తెమియ్యకుండఁ బంపరాదు. అట్లు చేయంటచే వాఁడు సకుటుంబముగా దుఃఖమునొందుచుఁ దిట్టుకొనునుగావున నిది యజమానునికి శ్రేయస్కరంబుగాదు. రాజు తనదేశ ప్రజలను దన బిడ్డలనువలెఁ జూచుకొనవలెను. అట్లుచూచుకొను రాజునకు జనులు కీడు చేయరాదు. జనులను దన కొడుకులంబోలెఁ బాలింపని రాజునకుఁ గీడుసేయవచ్చును. రాజులు ఆఱవపాలు పన్నుఁ గైకొని జనులను బోషింపవలయును. అట్లు రాజు దానికంటె హెచ్చు పన్నుఁ గైకొన్ననుఁ, ఆఱవపాలు పన్నుఁ గైకొనియుఁ, జనులను న్యాయ్యముగాఁ బాలింపకున్నను దోషవంతుఁడగును. యాగంబులందు యజమానుఁడు మునులకు దక్షిణ లిచ్చెదనని వాగ్దత్తముచేసి, యావల దాని నియ్యఁడేని, మహాపాతకంబు నొందును. ఘోరమయిన యుద్ధమునం దేకత్రియుండు శత్రువులకు వెఱచి వెనుకకు మఱలి పరుగిడరాదు. గురువు నాశ్రయించి, యాతని యనుగ్రహమున సూక్ష్మార్థములుగల శాస్త్రజ్ఞానముఁ బడసి, దానిని మఱచువానికి మహా పాతకము

పాపమును బొందుదును. ఎవని కీ రాముని ప్రవాసము సమ్మతముగా నుండెనో, వాఁడు యాఁగమునందు ఋషులకు దక్షిణ లొసఁగెన నని మాటయిచ్చి యావల దాని నియ్యక యేమార్చునట్టివాఁ డొందు పాపము నొందును. ఎవని యనుమతిమీఁద రాముఁడు వనమున కేఁగెనో, వాఁడు రథగజతురగ పదాతులతో నిండియున్న యుద్ధరంగ మునఁ బగతురం జూచి పరుగెత్తువానికిఁ గల్గుపాతకమును బొందును. ఎవనియనుమతిని రామునికి వనవాసమున గలిగెనో, చెడుతలంపుగల యాతఁడు గురుశుశ్రూషసేసి, ప్రయత్నపూర్వముగా జ్ఞానియగు నా గురువువలనఁ బొందిన మిక్కిలి సూక్ష్మవిషయములుగల శాస్త్రజ్ఞానమును మఱచిపోవునుగాక! ఎవఁడు రాముని నడవులకుఁ బంపుటకై ముందుగా యోచనలుచేసెనో, ఆ పాపాత్ముఁడు ఎత్తయిన మూపురములును, పొడవు చేతులుం గలవాఁడునై సూర్యచంద్రులంబోలె వెలుఁగుచు, రాజ్యమేలె

గలుగును. పాపాత్ములగువారు శ్రీరాముని రాజ్యపరిపాలన సమయంబున నుండఁ జాలరు. పాయసము అనఁగా పాలతో నుడికించిన యన్నము. కృసరము అనఁగా నువ్వులు బెల్లము గలిపిన యొక వంటకము. శ్రాద్ధాదులందును, బ్రాహ్మణ సంతర్పణములందును, బంధువులు అతిథులు తమ యిండ్లకు వచ్చినప్పుడును ఈ మాటిని వండింపవలయును. అట్లు గాక యంత్త సమయములందుఁగూడ వీనిని బచనము చేసి తినువాఁడు పాతకము నొందును. కావున వానిని తనకై వండరాదు. ఆవులను గాలి తోఁ దన్నరాదు. పెద్దలను ఒకరు తిట్టునప్పుడె వినరాదు. అట్టుండ తానే తిట్టుటకుఁ బూనిన నెంత గొప్ప పాతకంబు సంభవింపవచ్చును? నమ్మినవానికి ద్రోహము చేయరాదు. ఒకఁడు రహస్యముగా బయలుపఱిపఁగూడదని చెప్పిన తన యపవాదమును బయలు పఱిపరాదు. పరోపకారము చేయవలయును. చేసిన మేలు మఱువరాదు. ఆత్మహత్య చేసికొనరాదు. పెద్దలయెడ లజ్జగలిగియుండవలయును. బహుజనవిరోధంబు గలిగియుండఁ జనదు. నేస్తుఁడు శ్రేష్ఠుడైన యొక పదార్థముఁ దెచ్చెనేని, భార్యకు, బిడ్డలకు, బని వారికి దానిని బెట్టినపిమ్మటనే తా దినవలయును. అట్లు వారికిఁ బెట్టక తా దినినచో మహాదోషము సంభవించును. సజ్జనుల కపకారంబులు నేరనివానికి గుణవతియగు భార్య దొరకదు. అగ్నిహోత్రాది సత్కార్యములు జరుగవు. సంతతి లేక వంశాభివృద్ధి నొందరు. వారిట్టికూపరముల రెంటిని బొరయఁజాలరు. సత్పురుషాపకారికి నాయుస్సు క్షీణించును. సంతతియుఁ గలుగదు. వాఁడు దుఃఖితుఁడై యుండును. రాజహత్య, స్త్రీహత్య వృద్ధ హత్య గావించువానికి నితరహత్యలు సేయువానికంటె నెక్కుడు పాపంబు గలుగును.

డి రాముని జూడఁజాలఁడు. రాముని వనవాసమునకు సమ్మతించువాఁడు దయలేనివాఁడై, ఘోరాన్నమును, కృసరమును, మేకమాంసమును బితరులకును, బ్రాహ్మణులకును, నతిథులకును నివేదింపక తానే తిన్నవానికిఁ గలుగు పాపము నొందును; గురుస్త్రీలను దిరస్కరించినవాని పాపమును బొందును. రాముని వనవాసమునకుఁ దలయూఁచినవాఁడు గోవును గాలితోఁ దన్నును; తల్లిదండ్రులు, ఉపాధ్యాయుఁడు మొదలుగాఁగల వారిని తిట్టును; నమ్మిన చెలికాని కెంతయు ద్రోహముఁ దలఁచును. రాముని వనవాసమును గోరినవాఁడు చెలికాఁడు తన ప్రాణస్నేహితుఁడని చెప్పికొన్న రహస్యమును బయలుపఱచువానికిఁ గలుగు పాపము నొందును. ఎవఁడు రాముని వనవాసమున కంగీకరించెనో, వాఁడు పరోపకారశూన్యుఁడును, చేసినమేలు మఱచువాఁడును, ఆత్మహత్య చేసికొన్నవాఁడును, పెద్దలయెడ లజ్జలేనివాఁడును, లోకులకెల్ల విరోధియు నగును. శ్రీరాముఁడరణ్యముల కేగుట నాకు సమ్మతముగా నుండు

భృత్యులను నిరాధారముగా విడువరాదు; లక్ష, మద్యమాంసములు, క్షౌమము, విషము మొదలగువానిని విక్రయింపరాదు. అవి విక్రయించుట మహాదోష ప్రదము. ఘోరయుద్ధమునందు శత్రువునకు వెఱచి పరువిడరాదు. అట్లు పరువిడుచు, వాఁడు చంపఁబడునేని, మహాపాతకముఁ బొందును. సజ్జనాపరాధి కల్మి లేక, యన్నమునకుఁ గష్టపడుచు బిచ్చమెత్తుకొనును. మద్యపానము, జూదము, స్త్రీమోహము చెఱుపు గల్గించునవి కావున సజ్జనుల కపకారమొనరించువాఁడు పై మూఁటిలో నొకదానియందుఁగాని, అన్నిటియందుఁగాని యాసక్తిగలిగి, దినదినమునకు బుద్ధి మాఱుపలచే నశించునుగాన మద్యపానము సేయరాదు, జూదమాడఁగూడదు. స్త్రీలకు విశేషముగా లోఁబడఁగూడదు. సజ్జనుల కపకార మొనర్చువానికి ధర్మమందు శ్రద్ధయుండదు. అధర్మంబునందే వానికి బుద్ధి లయించు. వాని ద్రవ్యమును నయోగ్యులపాలగును. కావున మానవుఁడు ధర్మమునందు శ్రద్ధయుంచవలెను. అధర్మమునం దాస్థ పనికిరాదు. ద్రవ్యము నయోగ్యులపాలు చేయరాదు. సజ్జనాపరాధి సంపాదించిన విస్తార ద్రవ్యము దొంగలపాలయిపోవును. సూర్యోదయసూర్యాస్తమానములందు నిద్రింపరాదు. అది మహా దోషము. కాపురమున్నయింట నిప్పుపెట్టుటయు, గురుభార్యాసంగమము చేయుటయు, నమ్మిన చెలికానికిఁ గీడు దోయుటయుం మహా దోషకరములు గావున నట్లూహపనులు సేయరాదు. దేవతలనుఁ బూజలు సేయవలయును. పితృప్రీతిగాఁ దర్పణాదులు చేయవలయును. తల్లిదండ్రులకు శుశ్రూషచేయ

నేని, తనయింట నాలు బిడ్డలుఁ బనివాండ్రు చుట్టుగూర్చుండి యాఁక లితో నకనకలాడుచుండఁగా, వారినందఱిని విడిచి, తా నొక్కఁడే తనివి తీఱఁ దినువానికిఁ గలుగు పాతకము నొందుదును. నేనే రాముని వన వాసమునకుఁ గారణభూతుఁడనుగా నుందునేని, నేను సమాన రూప వయోలావణ్యాదులుగల భార్యలభింపక, బిడ్డలు లేక మృతినొందువాని కగుపాపమును, విహితధర్మములగు కార్యములను జేయక యిహపరములకు రెంటికిఁగాక చెడువాఁ డొందు పాపమును బొందుదును. రాముని నడ విකిఁ బంపుటకు నేను సమ్మతించియే యుందునేని, దీర్ఘాయుస్సునొందక, నాభార్యలందు సంతతి నొందక పోదును. రాముఁడు వనవాసమునకుఁ బోవ నేఁ బ్రయత్నించి యుందునేని, రాజులను, స్త్రీలను, వృద్ధులను

వలయును. ఇవి చేయకున్నయెడల మహా దోషము సంభవించును. మనము సర్వ ప్రయ త్నములచే సత్పురుషుల లోకము నొందుటకును సత్పురుషులు చేయు మంచిపనులు చేయుంటకును ప్రయత్నింపవలయును. కావున నవి చేయనివాఁడు భ్రష్టుఁడగును. తల్లికి శుశ్రూష చేయవలయును. అది చేయఁడేని మానవుఁడు రోషియగును. సజ్జనవిరోధి దరి ద్రుఁడయి, యెక్కువ సంతతిగలవాఁడై, వారిని బోషింపఁజాలక రోగములలోఁ జిక్కు కొని, యెడతెగని కష్టములపాలగును. కావున సజ్జనాపరాధము సేయరాదు. యాచ కులకు నిచ్చెదనని యియ్యక పోరాదు. రాజవిరుద్ధకార్యములు సేయరాదు. కాఠిన్యము వహించి యుండరాదు. కపటము బూనరాదు. ఒరులను వంచనసేయరాదు. సజ్జనాప రాధమువలన నీ యిడుములు సంభవించును. బుతుస్నాతయయి బుతుకాలమునఁ బుత్రార్థియైవచ్చిన భార్యయొక్క మనోరథ మీడేర్చనివాఁడు మహా పాతకమునొందును. పరదారగమనము సేయరాదు. తన ధర్మపత్నులందే రమింపవలయును. అట్లుగాక, స్వభార్యనువిడిచి, పరదారగమనము చేయుట మహా పాపంబు. స్వభార్యయందు సంతతి నొందక, వేశ్యాలోలుఁడై యుండరాదు, అది మహా పాపము. నీటిలో మలమూత్రముల విసర్జింపరాదు. ఒరులకు విషంబుఁ బెట్టరాదు. బ్రాహ్మణపూజకుఁ గావలెనని విఘా తంబు సేయరాదు. ఆవు ఈనినపిదపఁ బది దినములగు నంతవఱకుఁ బాలు దీయరాదు. ఒకఁడు మిక్కిలి దప్పిగొని, "యయ్యా, తీర్థముఁ గొంచెమి"మ్మని వచ్చి యడిగినయెడల, వాని కెచ్చట నయినను దెచ్చియైనను దప్పి కియ్యవలయును. అట్లుండఁగా, తన యింటియందుఁ దీర్థముండియుం నియ్యనియెడల, మహాపాతకంబు గలుగును. దారిలో నిద్దఱు జగడమాడుచుండినయెడల, వారి వివాదంబుఁ దీర్పఁ బ్రయత్నింపవలయునుగాని, వారి జగడము హెచ్చుచుండఁగా వేడుక చూచుచుండరాదు.

జంపిన పాపమును, నమ్మిన పనివానినిఁ బనినుండి తొలఁగించిన పాపమును నే నొందుదునుగాక! నేను రామప్రవాసనహేతు భూతుఁడ నయ్యోద నేని, లక్క, మధ్యమాంసములు, ఇనుము, విషము మొదలగు నిషిద్ధ వస్తు విక్రయమువలనఁ గలుగు లాభముచేఁ గుటుంబము పోషించు వానికిఁ గలుగు పాపంబు నాకును గలుగును. నేను రాముని ప్రవాస మునకు సమ్మతించియుందునేని, శత్రుసేనలకు భీతిఁ గలిగించునట్టి యుద్ధ మున నెదిరి సేనలం జూచి పరువిడుచుఁ జంపఁబడువానికిఁ గలుగు పాపము నాకును గలుగును. నేనే యా రాముని ప్రవాసమునకుఁ గారణంబౌదునేని, తలపుత్తె చేతఁ బట్టికొని, గుడ్డవేలికను గట్టుకొని, బిచ్చమెత్తుకొనుచు వెట్టివానివలెఁ దిరుగుచుందును. నేను రాముని యరణ్యావాసమున కొప్పుకొని యుందునేని, మద్యపానమున, జూద మున, స్త్రీలయందు నెల్లప్పుడు మనము చొప్పించి, కామక్రోధములకు లోఁబడియుందును. రాముని వనవాసమును నేనంగీకరించి యుందునేని, నా మన నెల్లప్పుడు ధర్మమునందుఁ జొఱకయ న్యాయమునందే ప్రవ ర్తించునుగాక. మఱియు నా ధనము యోగ్యులపాలుగాక యయో గ్యులపాలగునుగాక! నేను రాముని ప్రవాసము నంగీకరించియే యుందు నేని, సకల విధములుగా నాచే సంపాదింపఁబడిన ధనమును దొంగలెత్తి కొని పోవరుగాక! రాముఁడు నా సమ్మతివిూఁద నరణ్యములకుఁబోయి యుండునేని, ప్రాతస్సాయంకాలములందు నిద్రించువానికిఁ గలుగు పాపము నొందుదును. రాముఁ డడవికేగుట నా యనుమతివిూఁద జరిగి యుండెనేని, ఇండ్లకు నిప్పుపెట్టినవానికిఁ గలిగిన పాపమును, గురుభార్యా సంగమము చేసినవానికిఁ గలుగు పాపమును, మిత్రద్రోహము నేయు వానికిఁ గల్గుపాపమును నేను బొందుదును. ఎవని సమ్మతివిూఁదనే రాము డడవికిఁబోయెనో, వాఁడు దేవతలఁ బూజింపనివానికిని, పితరులకుఁ దర్ప ణాదులు సేయనివానికిని, తల్లిదండ్రులకు శుశ్రూషసేయని వానికిని, గలుగు పాపమును బొందును. నా సమ్మతివిూఁదనే రాముఁ డడవికిఁ బోయియున్నచొడ, నేను సత్పురుషుల లోకమునొందక, సజ్జనులు గొని యాడెడి పనులఁజేయక, సత్పురుషులు చేసెడు పనుల నాచరింపక వేగి రముగా నిప్పుడే నరకమునఁ బడిపోదును. పొడవుచేతులు గలవాఁడును,

వెడల్పు తొమ్ము గలవాఁడునునైన రాముఁడు నా సమ్మతిమీఁద నరణ్య ములకుఁ బోయి యుండునేని, నేను దల్లికి శుశ్రూషసేయక చెడిపోదును గాక! నా యనుమతిమీఁద రాముఁ డడవులకేగియుండునేని, దరిద్రుఁ డనై, బహు పుత్రుఁడనయి, రోగములఁబడి, యెడతెగని కష్టముల ననుభ వింతును. నేను రాముని యరణ్యవాసమునకు సమ్మతించియుందునేని, పైనఁ గూర్చుండుటచే మోరలెత్తి యాచించుచుండు దీనుల కిచ్చెదనని చెప్పి, పిదప నీయనివానికిఁ గలుగు పాపమును నేను బొందుదును. రాముఁడు వనవాసమున కేగుట నాకు సమ్మతముగునేని, యెల్లప్పుడు అధర్మపరుఁడనై, కఠినుఁడనై, పాపినై, అపరిశుద్ధుఁడనై, రాజునకు వెఱచి మోసముచే జీవించువాఁడు చెందు పాపము నొందుదును. నా సమ్మతిమీఁదనే యీ కార్యము జరిగియుండునేని, దుష్టబుద్ధిగల వాఁడనై, ఋతుస్నాతయై ఋతుకాలమున వచ్చిన భార్యం జేరనివానిఁ గలుగు మహా పాపమును నేను బొందుదును. నేను రాముని యరణ్య వాసమున కంగీకరించి యుందునేని, వివేకశూన్యుఁడనై, న్యాయమందు శ్రద్ధమాని స్వభార్యను విడిచి, పరదారలతో రమించువాఁ డొందు పాపమును నే నొందుదును. నేను రామప్రవసాంగీకారి నయియుందు నేని, భార్యనువిడిచి, వేశ్యాలోలుఁడయి, స్వభార్యయందు సంతతి నొందని బ్రాహ్మణునిఁ గలుగు పాపము నాకుఁ గల్గును. నేను రాముని యరణ్యవాసమునకు సమ్మతించియే యుందునేని, నీటిలో మలమూత్రా దులను విసర్జించి నీటిని జెఱుచువాఁడును, విషము పెట్టువాఁడును, బొందు పాపమును నే నొక్కఁడనే చెందుదును. రాముని వనవాసము నకు నే నంగీకరించియుందునేని, బ్రాహ్మణపూజను బాపబుద్ధిలోఁ జెఱుపు వాఁడును, లేఁదూడగల యావుపాలు దీసినవాఁడును బొందు నరక లోకములను బొందుదును. నేను రాముని యరణ్యవాసమున కొడఁబడి యుంటినేని, ఒకఁడు దప్పిగొని వచ్చినప్పుడు, ఇంటనీరుంచుకొనియు, లోభముచే లేదని వానిని బంపువాఁ డెంతపాపము నొందునో యంత పాపము నే నొందుదును. నే నా రాముని యరణ్యవాసమున కిష్టపడిన వాఁడనయి యుంటినేని, దారిలో నిద్దఱు సరిగాఁ బోరాడుచుండఁగా, వారిలో నొక్కనియందుఁ బక్షపాతముచే వానిజయముఁగోరి వానికి

నుపాయము చెప్పియిచ్చువానికిఁ గలుగు పాపము నాకుఁ గలుగును" అని యివ్విధమున రాజపుత్రుఁడయిన భరతుఁడు బెనిమిటిని బోఁగొట్టి కొని, కొడుకు నడవులపాలుచేసి దుఃఖించుచున్న కౌసల్య కనేకవిధము లచే నమ్మిక పుట్టించు మాటలు పల్కుచునే దుఃఖపీడితుఁడై క్రిందఁ బడెను. అట్లు పెట్టుకొనరాని యెట్టులు పెట్టుకొనుచు, దుఃఖముచే నొచ్చినవాఁడై మూర్ఛనొందియున్న భరతునిఁ జూచి, "ఓ నాయనా! పతిపుత్రవియోగముచే నా దుఃఖము హెచ్చుచున్నది. నీవు వినరాని యెట్టులు పెట్టుకొనినందున, నాదుఃఖము మఱింత హెచ్చినదై, నా ప్రాణము లెగసిపోవునట్లున్నవి. నా బిడ్డఁడా! నీవును లక్ష్మణుని చొప్పుననే భాగ్యవశమునఁజేసి, ధర్మమునుండి చలింపకున్నావు. నీవు ప్రతిజ్ఞదప్పనివాఁడవై సత్పురుషుల లోకము నొందఁగలవు" అని చెప్పి, తోఁబుట్టువులందు మిగులఁ బ్రేమగలవాఁడును, దీర్ఘబాహువునైన భరతునిఁ దన తొడవిరాఁదఁ గూర్చుండఁబెట్టికొని కడుదీనముగ నంగ లార్చెను. ఇట్లు వగలపాలై మిగులఁ బరితాపంబుఁ జెంది, ధైర్యముఁ బాసి భరతుఁడు వ్యసనపడుచుండఁగా, మై మఱపునలనను, దుఃఖము యొక్క యావేగమువలనను అతని మనస్సు గలఁత చెందెను. అట్లు భరతుఁడు విలపించుచు, నడుమనడుమ మైమఱపునొందుచు, బుద్ధిసెడి, నేలఁబీఁదఁబడి మాటిమాటికి వేఁడి నిట్టూర్పులు నిగిడించుచు దుఃఖముతోఁ గన్నుఁ గూర్కక యారేయియెల్ల నెట్టకేలకుఁ బుచ్చినవాఁడయ్యెను.

76-వ సర్గము

భరతుఁడు దశరథునకు సంస్కారము చేయుట

మాటలలోఁ నేర్పరియు, సందర్భములకుఁ దగినట్లు మాటాడువాఁడునునగు వసిష్ఠుఁడు, ఇత్తెఱఁగున వగలఁబొగులుచు మైమఱచి క్రిందఁబడియుండు భరతునిఁజూచి "విస్తారమైన కీర్తిగల రాజపుత్రుఁడా! దుఃఖమువలదు. నీకు మేలయ్యెడు. ఇప్పుడు దశరథమహారాజునకుఁ జేయఁదగిన యుత్తరక్రియలను జేయుము." అని చెప్పఁగా, ధర్మవేత్తయగు భరతుఁడు దుఃఖముబాసి, ధైర్యముపూని, ప్రేతకృత్యముల నన్నింటినిఁ జేయఁదొడఁగెను. అంతట భరతుఁడు దశరథుని, కళేబర

మును నూనెకొ ప్పెరనుండి యొత్తించి, పుడమివిూఁదనుంచి, పసుపుచన్నె గల మోముతోఁగూడి, నిద్దురపోవునట్లుండు నృపాలుని సకల రత్నము లచే నలంకరింపఁబడి మేలిమి పాస్పునందుఁ బరుండఁబెట్టియు, మిక్కిలి నొచ్చినవాఁడయి, "ఓ నృపాలా! నేను పరదేశమున కేగి రాక యుండఁగా, ధర్మముల నెఱింగిన రాముని బలవంతుఁడైన లక్ష్మణుని వన మునకుఁ బంపి, నీవేమి చేయఁదలఁచితి? మహారాజా! పుణ్యకర్మములు సేయునట్టి పురుషోత్తముఁడయిన రామునిఁ బాసి, యీదరువ్రలేక విల పించుచుండు మమ్ము విడిచి, నీవెచ్చటికేగితివి? ఓ నా తండ్రీ! నీవు స్వర్గ మునకుఁబోయి, రాముఁడును వనమున కేగఁగా నీ పత్తనమునందలి జనుల యోగక్షేమములు విచారించువాఁడెవ్వఁడు? నృపాలా! నిన్నుఁబాసి, భర్తలేనిదై యీ పురము చంద్రుఁడులేని రాత్రిమాడ్కిఁ గాంతి దఱిగి యున్నది" అని దశరథనృపాలునిఁగూర్చి విలపించెను. ఇట్లు భరతుఁడు దీనవదనముతోఁ గలఁతఁజెందినమనముతో నేడ్చుచుండ వసిష్ఠమహామునీం ద్రుఁడు భరతు నవలోకించి, "దీర్ఘబాహుఁడా! యీ నృపాలునికిఁ జేయవలసిన యుత్తరక్రియలు విచారముమాని జాగ్రత్తతో లోపము వాటిల్లకుండునట్లు కావింపుము" అని చెప్పెను. అంతట భరతుఁడు వసిష్ఠమహామునిమాట గారవించి, ఋత్విక్పురోహితా చార్యులను ద్వారగాఁ గార్యములను నడపుఁడని తొందరపఱుపఁగా, వాడు గృహాంత ర్భాగమున శవమున్నందున నగ్నిహోత్రశాలనుండి వెలుపటికిఁ గైకొని రాఁబడియున్న యగ్నిహోత్రములు యథావిధిగా దెచ్చిరి. అంతఁ బరి చారకులు నిర్జీవుఁడయిన దశరథుని కళేబరమునను, బల్లకియందుఁ బరుండఁ బెట్టి, మహాదుఃఖముతోఁ గన్నీరువిడుచుచు మోసికొనిపోవుచుండఁగా, జను లందఱు బంగారమును, వెండిని, అనేకవిధములగు వస్త్రములను మార్గము పొడుగునను విరఁజల్లుచు శవమునకు ముందుగాఁ బోయిరి. మఱి కొందఱు చందనాగరు చూర్ణములను, గుగ్గిలమును జల్లుచు సరళమను ధూపమును వేయుచు పద్మచూర్ణమును, దేవదారుచూర్ణమును నాభూపాలుని కళేబరముపైఁ జల్లుచుఁ దీసికొనిపోయి శ్మశానమున నా దశరథుని కళేబరమును జితియందుంచిరి. అంత భరతుఁడు నృపాలుని దేహముపై నగ్ని హోత్రముంచిన పిదప శాస్త్రప్రకారముగా ఋత్వి

జులు పైతృమేధికములగు మంత్రములను బఠించిరి. మఱికొందఱు సాముగులు సామగానముఁ జేసిరి. ఆ దశరథుని భార్యలును వృద్ధులతోఁ గూడినవారలై వారివారిగౌరవములకుఁ దగినట్లు పల్లకులమీఁదను, రథములమీఁదను గూర్చుండి నగరునుండి వెడలి వెలుపలికివచ్చిరి. అంత ఋత్విజులును కౌసల్యాదులగు దశరథన్నపాలుని యంతఃపురపుఁ గాంత లందఱును, భరతుఁడును దుఃఖముచే నొచ్చినవారలై, పెక్కుయాగము లొనర్చిన యాన్నపాలునియొక్క కళేబరమునకు నప్రదక్షిణముఁ గావించిరి. అప్పుడు కౌసల్యాదులగు స్త్రీ లందఱు నాఁడుక్రొంచ పక్షులమాడ్కి వేలకొలఁదిగా మోఁతలెత్తి మొఱలిడుచుండిరి. అట్లు స్త్రీ లందఱు విలపించుచు, మాటిమాటికి మైమఱపునొందుచు, రథము లందుఁ గూర్చుండి సరయూనదిగట్టున దిగిరి. అట్లు నృపాంగనలును, మంత్రి పురోహితులును భరతునిచే మహారాజునకు జరుగవలసిన పితృకార్యములను నడిపించి, కన్నీరుగ్రమ్మిన కన్నులుగలవారలై పట్టణము ప్రవేశించి, † పది దినంబులు నియమముతో నుండి యాపవలనాశౌచమును దీర్చుకొనిరి.

77-వ సర్గము

భరతుఁ డస్థి సంచయనమునకుఁ బోయి విలపించుట

అటుతర్వాతఁ బదియవదినమునందలి యుత్తరక్రియ కాఁగానే భరతుఁ డంటుతీర్చుకొని, పండ్రెండవదినమునఁ దండ్రికి షోడశ సపిండీకరణాదులగు నుత్తరక్రియలను నిర్వర్తించి, బ్రాహ్మణులకు సమృద్ధముగా నన్నముఁ బెట్టించి, హిరణ్యదాన, గోదాన, ఛాగదాన, శయ్యాదాన, వాహనదాన, గృహదాన, రజతదానాదులగు షోడశ మహాదానములను, భూదాన, దాసదాన, దాసీదాన, వాహనదానాద్యుపదానములను జేసి, వారిని దనివి నొందించెను. అంతఁ బదుమూఁడవనాఁటి వేకువను దీర్ఘ బాహువగు భరతుఁడు, అస్థి సంచయనార్థ మయి, శ్మశాన

†షోడశేనభూపాలా!=="రాజులకుఁ బదునాఱు దినంబులచేత నాశౌచంబు తీరును" అని యుండ నీ భరతుఁడు పదిదినములే యాశౌచ మున్నందున కేమి కారణము?" అని యాక్షేపింప, "క్షత్రియస్తు దశాహేన స్వకర్మనిరతఃశుచిః" స్వకారమును దప్పక చేయించుఁ బరిశుద్ధుఁడయియుండున్న క్షత్రియుండు పది దినములె యాశౌచం బాచరింప వచ్చునని విశేష విధియున్నందున భరతాదులు పది దినములే యాశౌచ ముండిరి.

మునకుఁ బోయి దుఃఖాక్రాంతుఁడై, డగ్గుత్తికతోనేడ్వనారంభించి, కాష్ఠమునొద్దఁ గూర్చుండి, తండ్రి నుద్దేశించి, ఓ తండ్రీ! రాముడు చీర జటాజినములను దాల్చినవాఁడయి యడవికిఁ బోవ, శూన్యమయిన యీ యయోధ్యాపురమున ననొ్నంటరినిగా విడిచి స్వర్గమునకుఁ బోతివి. తన యొకే కొడుకు నరణ్యమునకుఁ బంపి, దిక్కులేక పతినే దిక్కుగా నెంచియున్న మా తల్లియగు కౌసల్యనుగూడ విడిచి యొక్కడికిఁ బోతివి?" అని చెప్పుచుఁ గాలుటచే నెల్లగానుండు నదియు, గాలిన యస్థులు గలదియు, తండ్రి శరీరమును బోఁగొట్టి నదియునైన యాచితిప్రదేశమును జూచి, గట్టిగా నఱచుచు, దీనుఁడై రోదనము చేయుచు, బగ్గములచేఁ బైకెత్తఁబడుచు జాఱి క్రిందఁబడిన యింద్రధ్వజమువలె భరతుఁడు నేలపైఁబడెను. అంత నతని మంత్రులు భరతుఁడు గ్రిందఁబడుటను జూచి, లేవనెత్తఁగోరి, తొల్లి పుణ్యతీయమునఁ గ్రిందఁబడిన యయాతిని లేవనెత్తుటకై ఋషు లేతెంచిన చాడ్పున నాతని దగ్గఱ కేతెంచిరి. శత్రుఘ్నుఁడును దుఃఖాక్రాంతుఁడై పడియున్న భరతునిఁజూచి సైఁగదప్పి నృపాలునే తలఁచుచుఁ గ్రిందఁబడెను. ఆ శత్రుఘ్నుఁ డట్లు కొంతతడ వొడలుదెలియక పడియుండి, మఱల లేచి, తండ్రియొక్క గుణములను అంగములను దలఁచి తలఁచి పిచ్చివానివలె యిట్లుమిగులవిలపించెను. "మంథరవలనఁ బుట్టినదై, కైక యను మొసలిచే భీతికరమైన, వరదాన రూపమై చొర నలవిగాని దగు శోకసముద్రమున మే మిందఱమును మునిఁగితిమి. ఓ నాయనా! నీచే నెల్లప్పుడు బుజ్జగింపఁబడుచుండు సుకుమారుఁడును, పసివాఁడునునై విలపించుచున్న భరతుని విడిచి, నీ వెచ్చటికిఁ బోయితివి? ఓ నాయనా! యిఁకమీఁద మాకు అన్నపానాదు లమర్చి, వస్త్రాభరణాదులను యథేష్టముగా నొసఁగి, మమ్ముఁగాపాడువాఁ డెవ్వఁడు? ఓ నాయనా! ధర్మజ్ఞుఁడు, మహాత్ముఁడు, ప్రభువునగు నీవు లేనిదైన యీ భూమి బ్రద్దలు కావలసినది. ఏల యింకను బ్రద్దలుకాకున్నది? తండ్రి స్వర్గమున కేగెను; అన్న యరణ్యమునకుఁబోయెను; ఇక నాజీవితమేల? కావున నేను నగ్నిప్రవేశము చేసెదను. ఇక్ష్వాకువంశపు రాజులచేఁ బాలింపఁబడినదియు, పాడువడినదియు నగుననయోధ్యను తండ్రిని, అన్నను

బోఁగొట్టుకొనిన నేను బ్రవేశింపను. నే నరణ్యములందుఁ జొచ్చెదను.” అని రోదనము చేయుచుండెను. వారివెంబడి వచ్చిన వారందఱు నా భరతశత్రుఘ్నుల విలాప ప్రకారమును, దుఃఖమును జూచి, తామును మిక్కిలి దుఃఖముచే నొచ్చినవారైరి. అప్పుడు భరతశత్రుఘ్ను లిద్దఱు విలపించి విలపించి రోదనముచేసి యలసినవారై కొమ్ములు నఱికిన వృషభములనలె నేలమీఁదఁబడి పొరలుచుండిరి. అప్పుడు సత్త్వ భావుఁడును, పండితుఁడును, రాజపురోహితుఁడునైన వసిష్ఠమునీంద్రుఁడు భరతుని లేవనెత్తి కూర్చుండఁబెట్టి, “ఓ సమర్థుఁడా! నీతండ్రి మరణించి నది మొద లిది పదమూఁడవ దినము. ఈ దినమున నస్థి సంచయనము చేయవలసి యుండఁగా నేల యాలస్యము చేయుచున్నావు. ఆఁకలి దప్పులు, శోకమోహాములు, ముదమిచ్చావులు అను నీ మూఁడుద్వంద్వము లందఱికిని గలవు. అవి యెవరికిని దప్పించుకొన నలవిగాదు. అట్టివానిని గూర్చి మూఢునట్లు నీవు విచారపడఁ దగదు” అని చెప్పెను. తత్త్వము నెఱిఁగిన సుమంత్రుఁడును శత్రుఘ్నుని లేవనెత్తి యూఱడించి “నాయనా! జాతస్య మరణం ధ్రువం” అని యున్నది. ప్రపంచమున జన్మించిన ప్రతి జంతువు గిట్టవలసినదే. దానింగూర్చి విచారపడి యుప యోగము లేదు” అని బోధించెను. కీర్తిమంతులైన యా నరశ్రేష్ఠులగు భరత శత్రుఘ్నులు లేచి, ఎండచేతను వానచేతను గొట్టువడియున్న యింద్ర ధ్వజమువలెఁ బ్రకాశించిరి. అప్పుడు మంత్రు లేడ్పుచే నెట్టి వారిన కన్నులనీరు దుడుచుకొనుచు దీనముగా మాటాడుచునున్న రాజ పుత్రులను మిగిలిన యుత్తరక్రియలు సేయుటకై తొందరపఱిచిరి.

78-వ సర్గము

శత్రుఘ్నుఁడు మంథరను జంపఁబూనుట

అటుపిమ్మట లక్ష్మణుని సోదరుఁడగు శత్రుఘ్నుఁడు గృహమునకు వచ్చిన పిదప రామునికడ కేగఁదలఁచియున్న దుఃఖపీడితుఁడగు భరతుని జూచి “సర్వభూతములకు రాముఁడు గతియయియుండ నాతనిం గూర్చి విచారమేటికి? బలవంతుఁడయిన యట్టి రాముఁడొక స్త్రీచే నడవికిఁ బంపఁబడెనుగదా. బలపరాక్రమములుగల లక్ష్మణుఁడును తండ్రి మాట మీఱి యేల రాముని నాఁపియుండఁగూడదు? దశరథుఁడు, చెడ్డవైన

కైకకు లోఁబడి చెడ్డదారికి దిగకముందే, న్యాయాన్యాయములు విచారించి యాతనిమాటను దిరస్కరించి యుండవలసినది" అని చెప్పుచుండఁగా, గూనిదగు మంథర, మంచి గంధము పూసికొన్నదియు, మేటి పుట్టములను గట్టినదియు, నానావిధములగు భూషణములచే నలంకరింపఁబడినదియు, చిత్రవర్ణములైన మొలనూళ్ళును, మఱియు ననేక భూషణములుదాల్చినదయి త్రాళ్లతోఁ గట్టఁబడిన యూఁడుకోతివలెఁ గన్పట్టుచుఁ దూరపువాఁకిటియొద్ద కేతెంచెను. అప్పుడు ద్వారపాలురు కడుఁ బాపాత్ములును దయలేనిదియునగు కుబ్జను బట్టుకొని శత్రుఘ్నుని యెదుటికిఁ దెచ్చి నిలఁబెట్టి "ఓ రాజపుత్రా! యెవతెవలన రాముఁ డడవికిఁబోయెనో, ఎవతెవలన మీతండ్రి మృతినొందెనో, క్రూరహృదయ యగు నీపాపాత్మురాలి నిదిగో పట్టితెచ్చితిమి. మీకెయ్యది యిష్టమో, యాదండనను దీనికిఁ జేయుఁడు"అని చెప్పిరి. వ్రతనియమముగల శత్రుఘ్నుఁడును ద్వారపాలుర మాటఁ గైకొని, కడు వగచి యంతఃపురమందున్నవారి నెల్లరఁ జూచి, "ఏ క్రూరురాలగు మంథర ననున్ను, నా తోఁబుట్టువులను, నా తండ్రిని నోర్వరాని కష్టములందుఁ బెట్టినదో, యామంథర తన పాపకర్మములకు ఫలమును బొందునుగాక" యని చెప్పి, చెలికత్తెల నడుమనున్న యా గూనిదానిని గట్టిగాఁ జేయి పట్టియీడ్చెను. అంతట నా గూనిది యిల్లెత్తిపోవునట్లు బిగ్గఅగా నఱచెను. అంత దాని చెలికత్తెలందఱు మిగుల సంతాపము నొందినవారలై శత్రుఘ్నుఁ డలిగియుండుటనుజూచి, "ఈ శత్రుఘ్నుఁడు మనలను సాధింప నుద్యమించినవాఁడు. ఇఁక మనల నితఁడు మిగిలింపఁబోఁడు. కావున మన మిప్పుడు దయగలదియు, దానశీలయు, ధర్మజ్ఞురాలును, కీర్తిమతియునైన కౌసల్యను శరణు చొత్తము. ఆమెయె మన కిప్పుడు గతి"యని యనుకొనుచు నలుకెలఁకులకుఁ బరువిడిపోయిరి. శత్రువులను దహించు శక్తిగల శత్రుఘ్నుఁ డలుకచేఁ గన్ను లెఱ్ఱఁజేసి, మొఱలిడుచుండు మంథరను నేలఁబడఁద్రోసి, యీడ్చెను. ఆ శత్రుఘ్నుఁ డీడ్చుకొనిపోవునప్పుడు, ఆ గూని మంథరయొక్క వింతలైన నానావిధములగు భూషణము లచ్చటిచ్చటఁ గ్రిందరాలిపడెను. అప్పుడట్టు లెల్లెడలఁ జెదరిపడియున్న నగలతో నొప్పుచున్న యా రాజమందిరము శరదృతువునందలి యాకసమువలెఁ బ్రకాశించుచుండెను.

బలవంతుఁడగు నా పురుషశ్రేష్ఠుఁడయిన శత్రుఘ్నుఁడు కోప ముతో మంథరను గట్టిగాఁ బట్టుకొని, దానిని విడిపింపవచ్చిన కైకేయిని బెదరించి పరుసనీపలుకులు పలికెను. కైకేయియు నాపరుషవాక్యము లకుఁ గడుంగడు దుఃఖించుచు శత్రుఘ్నుఁ డేమిజేయునో యన్న వెఱ పుచేఁ దత్తరపాటొంది తన కొమరుని శరణుచొచ్చెను. అంత భరతుఁ డా మెనుజూచి కోపముతో మండిపడుచున్న శత్రుఘ్నునిఁ జూచి, "ఓ నాయనా! సకలజంతువులందును స్త్రీజాతి నెంత యపరాధమున్నను జంపరాదు గావున దీని నేమియుఁ జేయక విడువుచుఁ. ఓర్పు వహింపుము. ధార్మికుఁడైన రాముఁడు, తల్లిని జంపినవాఁడనని నా మీఁదఁ గోపపడఁ డేని, చెడ్డపనులు చేయునదియు, పాపాత్మురాలునునైన యీ కైకను జంపియేయుందును. పోనీ, ఈ గూనిదానినైనఁ గూలిచ్చెదమన్న, దీనిని జంపినది గూడ ధర్మాత్ముఁడగు రాముఁ డెఱుఁగునేని, మనలను పలక రింపఁడు. ఇది నిస్సంశయము" అని చెప్పఁగా, లక్ష్మణుని తోఁబుట్టువగు శత్రుఘ్నుఁడు భరతుని మాటలు విని, కోపమణఁచుకొని, మంథరను విడిచిపెట్టెను. ఆ మంథర శత్రుఘ్నునిచే విడువఁబడి, కైకేయియొక్క పాదముల పయిఁబడి, వేఁడినిట్టూర్పులువిడిచి, మిగులవగచుచు జాలిపుట్టు నట్లు విలపించెను. అప్పుడు భరతుని తల్లియగు కైకేయి, శత్రుఘ్నుఁడు మెడఁబెట్టి త్రోయుటచేఁ దెలివిదప్పినదియు, నొచ్చినదియునై, వలలోఁ బిక్కుబిక్కొని దిక్కు తోఁచకయున్న యాఁడు క్రౌంచపక్షివలెఁ జూచు చున్న గూనిదానిని దగ్గఱకుఁ జేర్చి మెల్లగా నోదార్చెను.

79 వ స ర్గ ము

భరతుఁడు రామునిఁ బిలుచుకొని రాఁ బయనమగుట

అంతటఁ బదునాలవనాటి వేఁకువనే, రాజాంగము వారందఱుఁ గూడివచ్చి భరతునింగూర్చి, "యొక్కవ కీర్తిగల యో రాజపుత్రుఁడా! కడు గొప్పవాఁడగు దశరథుఁడు, పెద్దవాఁడయిన రాముని, బలవంతుఁ డయిన లక్ష్మణుని నడవులకుఁ బంపి, తాను స్వర్గమునకేగెను. నీ విప్పుడు మాకుఁ బ్రభువవు గమ్ము. ఇప్పు డీ దేశ మరాచకమైనను, దైవబలముచే నెట్టి యన్యాయమునకును బాలుగాకున్నది. ఇట్లే యొప్పటికి నుండు నని తలంపరాదు. అభిషేకమునకుఁ గావలసిన వస్తువుల నెల్లఁ దెచ్చి, నీ

బంధువులును, జనులును నీ రాకకై వేచియున్నారు. నరశ్రేష్ఠుఁడా! వంశ పరంపరగా వచ్చిన యీ శాశ్వతమగు రాజ్యము ననుగ్రహించి, పట్టముఁ గట్టుకొని, మమ్ము నేలుము" అని ప్రార్థించిరి.

నియమముఁ దప్పనట్టి భరతుఁడు తన యభిషేకము నిమిత్తము తేఁబడియున్న పదార్థములనెల్లఁ దిలకించి, ప్రదక్షిణ నమస్కారములు సేసి, యా జనుల నందఱను నుద్దేశించి, "ఓ జనులారా! మా వంశ మునఁ బెద్దవానికిఁ బట్టముఁగట్టుటయె యెల్లప్పుడు నాచారము. అది మీ రెఱిఁగియుండియు నిట్లు ననున్నుఁ జెప్పుట యుచితముకాదు. మా పెద్ద యన్నయగు రాముఁడు మీకు రాజు గాఁగలఁడు. నే నతనికి బదులుగాఁ బదునాలుగేం డ్లరణ్యమున నుండెదను. చతురంగబలముగల గొప్పసేన నాయితముసేయుఁడు. నేనడవి కేగి మా యన్నను రామునిఁ దోడితెచ్చెదను. ఈ యభిషేకమునకై సిద్ధముచేయఁబడిన సకలసామగ్రిని ముందుంచుకొని రామునిఁ గొనివచ్చుటకై నేనే యడవికిఁ బోయెదను. ఆ వనముననే యీ యభిషేకద్రవ్యములతో నతనికిఁ బట్టాభిషేకముసేసి, యజ్ఞగృహామునుండి యగ్నిహోత్రుని దెచ్చున ట్లచ్చటి నుండియె రామునిఁ దోడితెచ్చెదను. తల్లియని మాత్రము పేరుకొనఁదగిన యీ నా తల్లియొక్క మనోరథమును నెఱవేర్చను. నేనే యడవులం దుండెదను. రాముఁడే పుడమిఁ బాలించువాఁడు గాఁగలఁడు. మీరు శిల్పులతోఁ జెప్పి మిట్టపల్లములు సరిచేసి దారివేయింపుఁడు. కొండదారుల నెఱిఁగినవారలను దోడుగా వెంట నేతెంచుట కేరుపాటు చేయుఁడు" అని చెప్పెను.

ఇవ్విధమున రామునిఁ బిలుచుకొని వచ్చు నిమిత్తము ప్రస్తావించుచున్న నృపకుమారుఁడగు భరతునిఁ జూచి జను లందఱు "ఓ రాజపుత్రా! నీవు జ్యేష్ఠుఁడగు రామునకు రాజ్యము నీయఁగోరుచున్నావు గాన నిన్ను రాజ్యలక్ష్మి తానే వరింపఁగలదు" అని మంగళకరమును, ఉత్తమమును నయిన మాటను చెప్పిరి. భరతుఁడు చెప్పిన వాక్కులను విని మిగుల సంతోషము నొందిన యా రాజకర్తల కన్నులనుండి యానందబాష్పములు వెలువడినవి. అంత మంత్రి పురోహితాది సభ్యులందఱు విచారమూని మనమున సుప్తాంగుచు, శిల్పివర్యులచే వన

మార్గము చక్కఁ బెట్టింపను, మార్గ రక్షకుల నియమించుటకును నుత్తమ యోసఁగి, "యో రాజపుత్రా! మార్గము చక్కఁపఱుపఁబడుచున్నది. వన మార్గప్రదర్శకులగు కావలివారును నియమింపఁబడిరి" అని భరతునితో విన్నవించిరి.

80-వ సర్గము

శిల్పులు వనమునకు మార్గమును నిర్మించుట

అంత భూప్రదేశము లెచ్చట నెచ్చట నేయే రీతిగా నుండునో యది తెలిసినవారును, లోఁతయిన బావులు మొదలగు వానినుండి నీరు చేఁదుటకు వలయు త్రాళ్లు మొదలగువానిని బేఁడువారును, తమ పనులం దెక్కువ జాగ్రత గలవారు, శూరులు నగు ఉప్పరవారును, యంత్రములను నిర్మించువారును, కూలివాండ్రును, గొప్ప శిల్పులును, యంత్ర నిర్మాణమునందు నేర్పరులగువారును, వడ్రంగులును, దారుల నేర్పఱిచువారును, చెట్లు నఱుకువారును, బావులు త్రవ్వువారును, సున్నపుఁబని చేయువారును, వెదురుపనులఁ జేయువారును, మార్గము లంతకుమున్ను చూచిన యనుభవశాలురును, ముందుగాఁ బయనమైరి. ఆ తీరున వనప్రదేశమునకుఁ బోవుచున్న విస్తారమగు జనసమూహము పున్నమనాఁడు పోఁబెక్కిన సముద్రమువలె శోభిల్లుచుండెను. బాటలు వేయుటయందు నేర్పరులగువా రందఱు తమువాఁడం జెప్పుకొని, తమ తమ పనులకుఁ గావలసిన కొఱనుట్లు గైకొని ముందుగా వెడలిరి. వా రట్లు పోవుచు, కొమ్మలను, తీగలను, పొదలను, మొక్కలను, తొలను పలువృక్షములను నరుకుచు దాఁటిపో నలవికాని యరణ్యమున మార్గము నేర్పఱుపఁ దొడఁగిరి. చెట్లు దట్టములై చొఱనలవికాకయున్న చోట్లఁ గొందఱు గొడ్డళ్ళతోను, ఉలులతోను, అంపములతోను, జెట్లను నఱికిరి. చెట్లులేక బట్టబయలుగా నుండు చోట్లఁ జెట్లను నాఁటిరి. మఱి కొందఱు కడుబలశాలురు కోయ నలవికాకయుండు నవురుగడ్డిని గాల్చి, యచ్చటచ్చటఁ బోవ నలవికాకయున్న ప్రదేశములను సమఁపఱిచిరి. మఱికొందఱు దారి కడ్డముగా నున్న పాడుబావులను, వెడల్పయిన బొరియలను, పల్లములను మన్ను ద్రోసి పూడ్చి సమముచేసిరి. కొంద ఱిచ్చటచ్చటఁ గట్టవలసినవానిని గట్టిరి, పొడిసేయఁ దగినవానినిఁ బొడి

సేసిరి. పగులఁగొట్టఁదగిన తిప్పలు మొదలగువానిని పగులఁగొట్టిరి. కొందఱు శీఘ్రకాలములోపల స్వల్పప్రవాహములకుఁ గట్టులుకట్టి, వానిని యందు సముద్రముతో సాటియగునట్లు నీటిని నిలువఁజేసిరి. కొందఱు నీళ్లులేని తావులందుఁ బలుతెఱఁగులైన గొప్పబావులను ద్రవ్వించి, వాని చేరువ విశ్రమించుటకుఁ దగిన తిన్నలఁ గట్టిరి. అట్లు వారిచే నేర్పఱుపఁబడిన యా సేనలమార్గము సున్నపుఁ బూఁతతోఁ గూడిన పై ప్రదేశముగలదియు, చక్కఁగఁ బూఁచిన పూలచెట్లతోఁ గూడినదియు, మదించి యొక్కఁవ కూఁతలు గూయుచున్న పక్షులగుంపు గలదియు, పెక్కేములచేఁ గైసేయఁబడినదియు, గలయంపి చల్లఁబడినదియు, నానా విధములగు పుష్పములుచల్లుటచే శోభిల్లుచున్నదియునై దేవమార్గముంబోలె నెంతయుఁ బ్రకాశించుచుండెను. మార్గ నిర్మాణానంతరమున నృపాలుని యధికారులందఱు దమ బుద్ధికిఁ దోఁచినట్లు భృత్యులకుఁ బనిచేయ నానతియొసఁగి, భరతుఁడు దారిలో దిగుటకై తగు గుడారములను వేయఁదలఁచి, వానికిఁ దగు ప్రదేశము నేర్పఱుపనందఱుగూడి యాలోచించి, నానావిధములగు తియ్యని ఫలములతోఁ గూడినవై మనమునకు రమ్యములైయుండు ప్రదేశములందు మహాబుద్ధిశాలియగు భరతునకు సమ్మతములయిన శిబిరములను శుభనక్షత్రములతోఁ గూడిన శుభముహూర్తములందు నిర్మింపించి, వానిని సకల భూషణములతో నలంకరించిరి. భరతునికొఱకై నిర్మింపఁబడిన యా గుడారములు విస్తారమైన యిసుకతోఁగూడి, యగడ్తలచేఁ శోభిల్లుచు నింద్రకీల పర్వతముంబోలి, రాజగృహములు, ధనికగృహములు, వీడంతస్తుల మేడలును గలిగి, పెక్కేలతోఁగూడినవై పరుసలుదీర్చిన గొప్ప వీథులచే వెలయుచు, ఆకాశమునకు వ్యాపించుచున్నవో యన్నట్లుండు గువ్వల గూళ్లు కొనలందుఁగల యెత్తైన విమానములతోఁ గూడి, దేవేంద్ర భవనముమాడ్కి శోభిల్లుచుండినవి. అయ్యధికారులిట్టి గుడారములను నానావిధ వృక్షములుగల వనములతోను, చల్లని తేఁటనీటితోను, గొప్పచేపలతోను గూడియున్న గంగానదివఱకు నిర్మించిరి. ఆవల వీలుపడమిచే వానిని నిర్మింపరైరి. రేయియందు చంద్రనక్షత్రములతోఁగూడి నిర్మలమయిన యాకాశము వెలుఁగు

చందమున నేర్పరులగు శిల్పులచే క్రమక్రమముగా నిర్మితమయి రమ్యమయియుండు నా భాజమార్గము వెలయుచుండెను.

61. వ స ర్గ ము

భరతుఁడు రామునియొద్దకుఁ దఱలుట

అంత నభ్యుదయ యుక్తమగు నపరరాత్రియందు మాటలలో ననేకభేదముల నెఱిఁగిన సూతమాగధులు మంగళయుక్తములగు స్తోత్రములచే భరతుని స్తుతించిరి. జాములు దెల్లయుటకై వాయింపఁబడు దుందుభివాద్యము బంగారుకొయ్యలచే వాయింపఁబడినది. శంఖములును, వెవ్వేఱు స్వరములుగల వాద్యములును పలుమూఱులు వాయింపఁబడినవి. ఆ కడు గొప్పదైన వాద్యములధ్వని యాకసమును నింపుచు, దుఃఖపడుచున్న భరతుని మఱింత దుఃఖపఱిచెను. భరతుఁడును మేలుకాంచి, "యావాద్యములు వాయింప నక్కఱలేదు. నేను రాజను గాను" అని చెప్పి, శత్రుఘ్నునిఁజూచి యిట్లనియె. "ఓ శత్రుఘ్నా! కైకేయి లోకమున కంతకు నెంత యపకారము చేసినదో చూడుము. దశరథనృపాలుఁడు నన్ను దుఃఖముల పాలునేసి స్వర్గతుఁడయ్యెను. అట్టి న్యాయ పరిపాలకుఁడైన దశరథనృపాలునియొక్క రాజ్యలక్ష్మి సముద్రమున మాలిమిలేని యోడవలె నల్లాడుచున్నది. ఎవఁడు మనకు గొప్ప యాపదరువుగా నుండెనో, యా రాముని నీతల్లి నీతిఁదప్పి యడవికిఁ బంపినది." ఇట్లు చెప్పుచు విలపించుచుండు భరతుం జూచి, యంతిపురపు చానలందఱు గొల్లున జాలిపుట్టునట్లేడ్చిరి. అట్లు భరతుఁడు విచారపడుచుండఁగా, రాజధర్మముల నెఱిఁగినవాఁడును, కీర్తిమంతుఁడునగు వసిష్ఠ మునీంద్రుఁడు శిష్యసమేతుఁడై, బంగారుతోఁజేయబడి, మణులుచెక్కఁబడిన రమ్యమయియొప్పుచున్న యింద్రసభయగు సుధర్మనుబోలియున్న యిక్ష్వాకువంశాధీశ్వరు సభయందుఁ బ్రవేశించి, మెత్తని పఱపుఁబరచిన బంగారుమయమయిన పీఠమునఁ గూర్చుండి దూతలను రాఁబనిచి, "మీరు వేగ నేగి, మంత్రులను, బ్రాహ్మణక్షత్రియ వైశ్యులను, కూటముల యధికారులను, కడువేగముగాఁ దోడ్కొనిరండు. మనకు నవసరముగాఁ గావలసిన పని యొండు గలదఁ. రాజపుత్రులతో సమేతులయిన కీర్తిమంతులగు భరత శత్రుఘ్నులను, యుధాజిత్తు, సుమంత్రుఁడు ననుమంత్రులను,

మఱి మన మేలు గోరెడు హితులను బిలిచికొనిరండు" అని యాన తిచ్చెను. జనులు రథ, గజ, తురగముల నెక్కివచ్చెడు నపుడు మిక్కిలి గొప్పదగు కోలాహల ధ్వని పుట్టెను. అంత రథారూఢుఁడై వచ్చు చుండు భరతునిఁ జూచి, దేవతలు దేవేంద్రునిఁ గొనియాడునట్లు, జనులు దశరథునిఁబోలెఁ బలుతెఱఁగులఁ గొనియాడిరి. గొప్ప గొప్ప చేఁపలతోను, నీటి యేనుఁగులతోను గూడి, కదలని జలముగలిగి రత్న ములును, శంఖములును, ఇసుకయుఁ గలిగియుండు మడువుంబోలి, దశరథ పుత్రులగు భరతశత్రుఘ్నులచే శోభిల్లుచున్న యా సభామంట పము పూర్వము దశరథునితోఁ గూడియున్నప్పటి దానివలెనే వెలయు చుండెను.

82-వ సర్గము

భరతుఁడు ససైన్యుఁడై యడవికిఁ దఱలుట

బుద్ధిమంతుఁడగు భరతుఁడు పూజ్యులగు వసిష్ఠాది మునులతో నిండి నిశ్శబ్దముగనున్న యా సభామందిరమును పూర్ణచంద్రుఁడు రాత్రినివలెఁ జూచెను. అప్పుడు పెద్దలందఱు మేలిమి బట్టలను గట్టు కొని, నెత్తావిగల గంధము నలఁదికొని వచ్చి వారి వారి గౌరవములకుఁ దగినట్లుగ నా సభలోని యాసనంబులందుఁ గూర్చుండిరి. అపుడు వారి మైపూఁతల డాలుచేతను, బట్టల కాంతిచేతను శ్రేష్ఠమైన యా సభ వెలుఁగఁజేయఁబడినదై, పండిత జనములతో నిండి, రమణీయమగుచు, పున్నమ చందురునితోఁ గూడినశరత్కాల రాత్రివలె మిక్కిలి వెలుఁగు చుండెను.

అప్పుడు ధర్మవేత్తయగు పురోహితుఁడు రాజులను, జనుల నందఱను జూచి, భరతునితో దిన్నని మాటల నిట్లనెను. "ఓరి నాయనా, నీ తండ్రి యగు దశరథుఁడు సత్యసంధుఁడై, ధనధాన్య సమృద్ధిగలిగి, విశాలమై యున్న యీ భూమండలమును నీకొసఁగి స్వర్గము నొందెను. శాశ్వత మైన ధైర్యముగలవాఁడగు రాముఁడు తండ్రిమాట నెఱవేర్చుట యను తన పెద్దల నడవడిని జ్ఞప్తికిఁ దెచ్చుకొని, ఉదయించిన చంద్రుఁడు వెన్నె లను బాయనట్లు తండ్రి యాజ్ఞను మీఱక యరణ్యమునకుఁ బోయెను. తండ్రియు, నన్నయు నీ కొసఁగిన నిష్కంటకమైన యీ రాజ్యమును

మంత్రులను సంతోషపఱచుచు ననుభవింపుము. వేగిరమె పట్టాభిషేకము చేసికొమ్ము. ఉత్తర దక్షిణ పశ్చిమ దేశ వాసులగు రాజులును, సింహాసనము లేని సామాన్య రాజులును, పశ్చిమ దేశవాసులగు యవనులును, సముద్ర మధ్యములందలి దీవులం దుండు రాజులును రత్నములను గానుకగా నొసఁగుదురుగాక." అని వసిష్ఠమునీంద్రుఁడు భరతునితోఁ జెప్పెను. ధర్మజ్ఞుఁ డయిన భరతుఁడును వసిష్ఠుని వాక్యమును విని దుఃఖముపొంగుచుండ ధర్మమునందలి యాసక్తిచే రాముని మానసమున ధ్యానించెను. కలహంసముయొక్క కంఠస్వరముఁబోలు క్వంతస్వరము గలవాఁడును, ప్రాయపువాఁడును నైన యా భరతుఁడు కన్నీటిచే సుస్పష్టముకాని మాటలతో సభనడుమనే రాముని దలఁచికొని రోదనంబుసేసి, పురోహితుం జూచి, "యిట్టి యధర్మమైన మాటను చెప్పుటకుఁ దమ కెట్లు నోరాడెను" అని యాతనిని నిందించి, మఱల నమ్మునీంద్రాదులం జూచి, "మీర లిట్లు చెప్పితిరే' బుద్ధిమంతుఁడును బ్రహ్మచర్య వ్రతము జరుపువాఁడును, వేదాధ్యయనము చేసి, పిదప వ్రతస్నాన మొనర్చి, జ్ఞానవంతుఁడై, ధర్మకార్యములందుఁ బ్రయత్న పడుచుండువాఁడునునైన రామునియొక్క రాజ్యమును నాబోటివాఁ డపహరించునే? దశరథునికిఁ బుట్టినవాఁ డెట్లీపని సేయఁగలఁడు? రాజ్యము రామునిది. నేనును రామునికింకరుఁడను. ఈ విషయమున నేది న్యాయమో మీరే చెప్పవలయును. రాముఁడు నాకంటెఁ బెద్ద వాఁడు; శ్రేష్ఠుఁడును, ధర్మాత్ముఁడును; దిలీపనహుషులతో సాటియగు వాఁడును. కావున దశరథునికిఁ బిదప రాముఁడే రాజ్యమున కర్హుఁడు. దుష్టు లాచరించునదియు, నరకము నొందించునదియునైన యీ పాప కార్యము నే నాచరింతునేని, నే నిక్ష్వాకువంశమునకుఁ జెఱుపనచేటయైన వాఁడ నగుదును. నా తల్లికిఁ గలిగిన చెడుతలంపు నా కింతయు సమ్మతము గాదు. నే నిచ్చటనుండియే చొరరాని యరణ్య ప్రదేశములం దుండు రాముసికిఁ జేతులు జోడించి మ్రొక్కెదను. రాముని నను సరించియే నేఁ బోయెదను. మనుజశ్రేష్ఠుఁడగు నా రాముఁడే రాజు. రాముఁడు ముల్లోకములనైనను బాలింపఁగలఁడు." అనెను.

సభాసదులందఱు భరతుని ధర్మము దప్పని యీమాటలను విని రామునియందే దమ మనస్సులను లగ్నంపఁజేసి, సంతసంపుఁ గన్నీటిని విడిచిరి. మఱల భరతుఁడు సభ్యుల నందఱిఁ జూచి, "నే నట్లు మా యన్నను నిగ్బంధముచేతనయిన నడవిలోనుండి మఱలింపఁజాలనేని, యీర్ష్యాడగు లక్ష్మణుఁ డుండునన్నచో నేను నచ్చటనే యుండెదను. సుగు ణులు, సజ్జనులునైన తమయందఱికి రెండుటనే బలవంతపెట్టినైనను, మాయన్నను దోడ్కొనివచ్చుటకుఁ దగు ప్రయత్నములన్నీఁ జేసెదను. దారిని బాగుచేయుటకును, దారిలోఁ దగు సంవిధానమునకును దగినకూలివారిని వెట్టివారిని, అనేకులను, ఇదివఱకే పంపితిని. కాన్మున, సర్వవిధముల నతనిఁ బిలిచికొని వచ్చుటకు నేఁ బోవలయును." అని యందఱు వినునట్లుగా చెప్పి ధర్మాత్ముఁడును, తోఁబుట్టువులం దెక్కువ ప్రేముఁడి గలవాఁడునైన భరతుఁడు దగ్గఱ నిలఁబడియున్న యాలోచన పరుఁడగు సుమంత్రునిం జూచి యిట్లనియె: "సుమంత్రా! నీవు వేగిరముగా నేగి నాయాజ్ఞగాఁ బ్రయాణమును జాటింపుము. సేనలను గొనిరమ్ము." అని చెప్పెను. మహాత్ముఁడయిన భరతుని యాజ్ఞను శిరసావహించి, హర్షముగలవాఁడైన సుమంత్రుఁడు శ్రద్ధతో భరతుఁడు చెప్పినచొప్పున నన్ని పనులను గావించెను. సేనాధిపతులును, జనులును రామునిఁ బిలిచికొనివచ్చుటకై యొసఁగిన యానతిని విని, పరమానందభరితులైరి. ఆ పురియందలి యుద్ధవీరుల పత్నులు సంతసముతోఁగూడినవారయి ప్రతియింటను దమతమ భర్తలను దొందర పఱచిరి. సేనాధిపతులు వడిగాఁ బోవు గుఱ్ఱములను, ఎద్దులబండ్లను, రథములను, కాలి బలమును గొనివచ్చి భరతునకుఁ దెలిపిరి. అప్పుడు భరతుఁడు ప్రయాణమునకుసిద్ధమయి వచ్చినిలిచియున్న యాబలమునుజూచి ప్రక్కనున్న సుమంత్రునిఁజూచి, వసిష్ఠమునియనుమతమునఁ "సారథీ, నా రథము సిద్ధపఱుపుము"అని చెప్పెను. అంత సుమంత్రుఁడు భరతునాజ్ఞను విని, యానందభరితుఁడై, వేగవంతములయిన గుఱ్ఱములు గట్టిన రథమును ద్వారలోఁ దెచ్చి సిద్ధపఱచెను. శాశ్వతమైన ధైర్యముగలవాఁడును, ప్రతాపవంతుఁడును, విడువని పరాక్రమము గలవాఁడునునైన భరతుఁడు మహారణ్య మధ్యమున నున్న కీర్తిశాలియగు తన యన్నను బతి

మాలి తోడ్కొని రాఁగోరి, సుమంత్రునితో నిట్లనియె. "సుమంత్రా, నీవు లేచివేగముగఁ బోయి సేనానాయకులతో సేనలను సిద్ధపఱుపుఁడని చెప్పుము. లోకమురెక్క మేలుగోరి, వనమున నున్నట్టి హితుఁడయిన రామునిఁ బ్రార్థించి, యిచ్చటికిఁ బిలుచుకొని రాఁ గోరుచున్నాను." అని చెప్పెను. సుమంత్రుఁడును భరతునియాజ్ఞను శిరసావహించి, నిండిన మనోరథము గలవాఁడయి, పౌరులలో ముఖ్యులను, సేనాధిపులను, చెలికాండ్రను "మీ రందఱు త్వరగా రావలయును" ననియాజ్ఞాపించెను. అంతట బ్రతియింటనున్న బ్రాహ్మణులు, రాజులు, వైశ్యులు, శూద్రులు భరతునివెంబడిఁ బోఁగోరి యుత్తమజాతియందుఁ బుట్టిన గుఱ్ఱములను, ఏనుఁగులను, ఒంటెలను, వేసడములను, రథములను ప్రయాణమునకై సిద్ధముఁ చేసిరి.

83-వ సర్గము

భరతుఁడు పయనమై గంగాతీరమున విడిసిరుట

అంత, భరతుఁడు వఱువాతనే లేచి, శ్రేష్ఠమైన రథము నెక్కి, రామునిఁ జూచుటయందలి తనితో వేగముగాఁ బయనమయ్యెను. అతనిమంత్రులందఱును, పురోహితుఁడును, సూర్యరథము మాడిక్రి వెలుఁగుచుండునట్టి హయములు గట్టిన రథము నెక్కి, యాభరతుని యగ్రభాగమున బయలువెడలిరి. ఆయిక్ష్వాకుకులప్రకాశకుఁ డైన భరతునివెంబడి తొమ్మిదివేల యేనుఁగులు తరలినవి. నానావిధాయుధములను ధరించిన విలుకాండ్రగు రథికులఱువదివేలును లక్షమంది గుఱ్ఱపు రౌతులును ప్రతిజ్ఞదప్పనివాఁడును, ఇంద్రియముల నణఁచినవాఁడును, గుణవంతుఁడని ప్రసిద్ధికెక్కినవాఁడునునైన యా భరతుని వెంబడించిరి. ప్రఖ్యాతిగన్న కౌసల్యయు, సుమిత్రయు, కైకేయియు రామునిఁ బిలుచుకొనివచ్చుటయందు మక్కువ గలవారలై వెలుఁగుచున్న వాహనములపైఁ గూర్చుండి వెంబడించిరి. మఱియు నయోధ్యాపుర వాసులగు జనులును, పెద్దలందఱును రాముని, లక్ష్మణుని, సీతను జూడఁ గోరి, "మేఘమువంబోలి నల్లనైనవాఁడును, దీర్ఘబాహుండును, విడువని సత్త్వయు, గట్టి నియమముగలవాఁడును, లోకమునకు దుఃఖమును బోఁగొట్టువాఁడును నైన రామునిఱున మెప్పుడు చూడఁగలము?

సూర్యుఁ డుదయించుచు లోకమంతటియొక్క చీఁకటిని బోకార్చునట్లు, రాముఁడు దర్శన మాత్రముననే మన శోకముఁ బోఁగొట్టుఁగలఁడు." అని యిట్లెఱఁగున నా రామునిఁగూర్చి పలుతెఱఁగులైన వింత వింతలగు కథలను జెప్పికొనుచు, మనములం దుప్పొంగుచు, నొండొరులఁ గౌఁగిలించుచుఁ బయనమైరి. అచ్చట నెవ్వారెవ్వారు రామునకు నిష్టులో, ఎవ్వారుఁ పట్టణనివాసులో, యీజను లందఱు సంతోషభరితులై, రామునిఁ జూడఁ బయనమైరి. వారితోడ ననేకులు రత్నముల సానపెట్టువారును, మంచి మనసుగల కుమ్మరులును, గుడ్డలవారును, ఆయుధములచే బ్రతుకువారును, నెమ్మితెక్కలవిసనకట్ర కట్టువారును, అంపపుఁగోఁతకాండ్రును, రంగులు తీర్చువారును, రత్నములు మొదలగువానికి బెజ్జములు వేయువారును, దంతపుఁబనులు సేయువారును, పాలగూఱ మొదలగు సున్నపుఁబూఁతపనులు సేయువారును, సుగంధ ద్రవ్యములఁ నాశ్రయించి జీవించువారును, వేరు వహించిన కంసారులును, కంబళ్లు దుడుచువారును, అభ్యంజనాది స్నానములు చేయించువారును, ఒడళ్లు పిసుకువారును, వైద్యులును, ధూపములు వేయువారును, మద్యములు పక్వముచేయువారును, చాకళ్లును, సాలెలును, పల్లెలందును గొల్లపల్లియలందును నుండు పెద్దకాఁపులును, నట్టువకాండ్రును, చెంబడులును గాంతలతోఁ గూడి చక్కని వేషములు దాల్చి, తెల్లని బట్టలను, గట్టుకొని యొట్టిని గంధముఁ బూసికొని నానావిధ యానముల నెక్కి, భరతుని వెంబడించి, యా రామునిఁ జూడఁ దఱలిరి. యోగనిష్ఠగల వారును, వేదవిదులఁను, సదాచార సంపన్నులునైన వేలకొలఁది బ్రాహ్మణులును ఎద్దులబండ్లెక్కి యా భరతుని వెంబడించిరి. సేనలును గగ్గురుపాటుతోను వేడ్కతోనుఁగూడి, యన్నయందుఁ బ్రేమగలిగి యన్నను బిల్చుకొని రాఁబోవుచున్న కైకయీసుతుని భరతుని వెంబడించెను. వారు రథగజాశ్వాది యానములమీఁదనే కదుదవ్వేగి, రాముని చెలికాఁడగు గుహుఁడు బంధుమిత్రాది సంపన్నుఁడై, జాగ్రత్తతో నేలుచుండెడి గంగానదీతీరమునందలి శృంగిబేర పురముఁ జేరిరి. భరతుని వెంబడించి పోవుచున్న సేనయు చక్రవాకపక్షులచేనొప్పుచున్న గంగానదీతీరముఁ జేరి యచ్చట నిలిచిన ధారుసు. భర

తుఁడు తనసేనలు దారినడకచే డస్సియుండుటను, గంగానదియందలి తేట నీటిని జూచి, మంత్రుల నందఱి నవలోకించి, "ఇష్టము చొప్పున మన సేనల నిచ్చటనే నిలువఁజేయుఁడు. ఈరేయి యిచ్చట నలఁతఁ దీర్చుకొని, రేపటివినమున నీ పుణ్యప్రదమైన గంగానదిని దాఁటుదము. అంతియకాక, స్వర్గము నొందిన మా తండ్రికిఁ బుణ్యలోకావాప్తికై, జలతర్పణముఁ గావింపఁ గోరియున్నాను." అని చెప్పెను. మంత్రులందఱు "మహా ప్రభూ! చిత్త మట్లే" యని, సేనల నన్నింటిని వేఱువేఱుగాఁ దమ తమ యిష్టము చొప్పున విడియఁ జేసిరి. భరతుఁడును గంగానదియొడ్డున వేయఁబడిన గుడారమునందు దిగి, మహోత్సుఁడయిన రాముని దెచ్చు విషయముఁగూర్చియే యాలోచించుచుండెను.

84-వ సర్గము

గుహుఁడు భరతునికి సతిథిసత్కారము నేయుట

గుహుఁడు గంగానదీతీరమున నిశ్చ్రమించియున్న గొప్ప సేనను జూచినంతనే, తత్తరపడుచు బంధువులం జూచి "ఈ గొప్పసేన యపార మయిన సముద్రముంబోలెఁ దోఁచుచున్నది. ఎంత తడవు మనమున యోచించినను, దీనియంతము తెలియరాకున్నది. చెడుతలంపుగల భరతుఁడు తానే యేగుదెంచినట్లున్నది. అవును. అదిగో కాంచనవృక్ష ముతోఁ జేయఁబడిన పెక్కెము గాసిపించుచున్నది. రథమునందు గనఁబడుచున్న మహాకాయుఁడు భరతుఁడే. అతఁడు జాలరుల నందఱిని గట్టివేయుటకో, లేక మనల నందఱి జంపుటకో వచ్చు చున్నాఁడు. అటు గాదేని, కైకేయీ సుతుఁడు రాజగుటకు నర్హుఁడగు రాముఁ డేతెంచినపిదపఁ దన కీ రాజ్యము దొఱఁకుట యరుదగునో యని తలఁచి, తండ్రిచే నడవులకుఁ బంపఁబడిన రాముని వధింప నేగుదెంచెనో? రాముఁడు నాకుఁ బోషకుఁడును, చెలికాఁడును. కావున మీ రందఱు నతనికి మేలుగోరుచు, యుద్ధసన్నద్ధులై గంగానదీతీరప్రాంతములందుఁ దిరుగుచుండుఁడు. మీలోఁ గొందఱు సేనలతోడం గూడి యోడలందే మాంసము, పండ్లు, దుంపలు మొదలగువానిం దినుచు నేటిని గాపాడు చుండవలయు. ఏనూఱు పడవలలో పడవకు నూఱుగురిచొప్పున యువ కులు సన్నద్ధులయి యుండవలయు. భరతుఁడు రాముని కిష్టుఁడుగ నుండు

నేని, యీ సేనలతోడ నితనిని దాఁటింతము." అని తనవారికిఁ జెప్పి, మత్స్యమాంసమద్యములను గానుఁగాఁ గైకొని భరతు నెదుర్కొని వచ్చుచుండెను. ప్రతాపవంతుఁడును విసమ్ముఁడు నెఱిఁగినవాఁడును నగు సుమంత్రుఁ డాపచ్చుచున్న గుహునిఁజూచి, యడకువతోడఁ గూడి భరతు నితో నిట్లనియెను. "ఓ రాజపుత్రా! ఇదిగో కనఁబడునట్టివాఁడు స్థపతి యగు గుహుఁడు. ఇతఁడు వేలకొలఁది బంధుజనులతోఁ గూడినవాఁడై యీ దండకారణ్యమున నున్నాఁడు. ఇతఁడు వృద్ధుఁడు; నీ యన్నకుఁ బ్రాణస్నేహితుఁడు. కావున మన మీ గుహునికడకుఁ బోదము. ఆతనికి రామలక్ష్మణు లుండు తావు తప్పక తెలియును." అని చెప్పెను. భరతుఁడును సుమంత్రుని వాక్యము నిని, "మన్లే మనము శీఘ్రముగా నా గుహునికడకుఁ బోదము." అని చెప్పెను. ఇంతలోపల గుహుఁడును భరతునివలన ననుజ్ఞను బొంది యెక్కు-న సంతసముగలవాఁడై, బంధువులను దోడ్కొనివచ్చి, భరతుఁజూచి, వినయముతో "నృపాలా! యీ దేశము మీ రాయింటితోఁటవంటిది. మేము మీ రాకఁ దెలియక మోస పోతిమి, మేము మాగృహంబుల నన్నింటిని మీకు నివేదించెదము. దాసులమగు మాయిండ్లయం దీ రేయి యుండి రేపు పయనము సేయుఁడు. బోయలు తెచ్చిన కందమూలఫలములును, వనమృగములవైన యొండి నవి పచ్చివియగు విపిధములయిన మాంసములును విశేషముగా నున్నవి. ఈరాత్రి కీ సేనలతోఁ గూడ నా విచిత్రాహారములను భుజించి, మే మొనర్చు నుపచారముల నన్నింటిని స్వీకరించి, రేపు సైన్యముతోడఁ గూడి పోవచ్చు"నని చెప్పెను.

85-వ సర్గము

భరతుఁడు సైన్యముతోఁ గూడ గంగానదిం దాఁటుట

మహావిచక్షణుఁడగు భరతుఁడు బోయల మోఁడయిన గుహుని పలుకులు విని, సహేతుకముగా నాతనికి "ఓ చెలికాఁడా! నీవు నాయన్నకుఁ జెలికాఁడవు. నీ కోరిక లన్నియు సఫలము లయ్యెను. నీ వొక్కఁడవే నాయింత నేసకు నాతిథ్యమీయఁ దలఁచితివిగదా" అని భరతుఁడు గుహునితోఁ జెప్పి మఱల సతనిం జూచి "ఓ గుహుఁడా! భరద్వాజాశ్రమమునకు నే దారినిఁ బోవలయును. గంగకుఁ జేరువ నున్న దేశము

వనములతో నిండినదై, చొటి నలవికాక యున్నది. ఈ గంగానదిని దాటుటయు మిక్కిలి కష్టతరముగా గన్పట్టుచున్నది." అని ధీమంతుడయిన రాజపుత్రుడడుగగా, అడవి ద్రిమ్మరియైన గుహుండు దోసిలి గట్టికొని, "రాజపుత్రా! నీవు వెఱవకుము. నా భృత్యులు విండ్లనుదాల్చి మీవెంబడి మిక్కిలి జాగ్రత్తతో రాగలరు. నేనును నీవెంట వచ్చెదను. హాసికరములగు కార్యములు నేయని రామునికడకుఁ బోవుట యందు నీకేమియుఁ జెడుతలఁపు లేదుగదా! ఈ నీ యుపారసైన్యమునుఁ జూడ నీ వతనిపైకి దండెత్తి పోవుచున్నావేమో యని నాకు సంపేయమగుచున్నది" అని యా భరతుని నడిగెను. అంతట నింగివలె నిష్కపటుఁడయిన భరతుఁడు "ఓ గుహా! రామునికి నేను కీడు చేయుఁడలఁచునట్టి కష్టకాలము రాకుండునుగాక. నీవు శంకింపవలదు. ఆ రాముఁడు నాకుఁ బెద్దయన్న. తావున నా కతఁడు తండ్రితో సాటియుయినవాఁడు. అడవుల నున్న యాకాకుత్స్థునిఁ దోడితెచ్చుటకు పోవుచున్నాను. నీవు వేఱువిధముగాఁ దలఁపకుము. నిజము పలికితిని." అని తిన్ననిమాటలతో గుహునికిఁ బ్రత్యుత్తర మొసఁగెను. గుహుండును భరతుని మాటలు విని, మోమున సంతసముఁ గన్పఱుచుచు, గగ్గురుపాటొంది, మఱల భరతుం జూచి, "ఓభరతా! నీవు పుణ్యాత్ముడవు. భూతలమున నిన్నుఁ బోలిన పుణ్యాత్ముఁ డీ భూమండలమున వేఱొక్కఁడు లేఁడు. ప్రయత్నము లేకయే వచ్చిన రాజ్యమును నీవు విడువఁగోరుచున్నావు. ఖిదుములుపొందుచున్న రాముని నీవు తోడితేఁ గోరుచున్నావు గనుక, నీకీర్తి యెల్లలోకములందును వెలయుచు శాశ్వతముగా నుండఁగలదు." అని భరతునితోఁ జెప్పెను.

ఇట్లు గుహుండు భరతునితో ముచ్చటలాడుచుండఁగా, చండకిరణుఁడగు సూర్యుఁడు తేజోడిగి యస్తమించెను, రాత్రియయ్యెను. భరతుఁడును, సేనల నచ్చట దింపి, గుహునితో ముచ్చటలాడుచుఁ గొంతతడవు గడపి, యాతనిశుశ్రూషలకు సంతసిల్లి, యారేయి శత్రుఘ్నునితో నచటఁ బరుండెను. ధైర్యశాలియు, అధర్మమున దృష్టిలేని వాఁడునునైన భరతుఁడు తా నింతకుమున్ను దుఃఖములనన్నెట్టివో యెఱుఁగనివాఁడును, దవానలముచేఁ గాలుచున్న యడవి నడుమనున్న చెట్టును

దానిలోని గూఢముగ నుండునగ్ని తపింపఁజేయునట్లు, రామునిఁ గూర్చిన చింత యనెడు నగ్ని హోత్రుఁడు, భరతుని మనస్సులోపల నుండి యత నిని దహించెను. క్రాఁగి కరఁగి హిమవత్పర్వతమున నుండి కారుచుండు మంచునీటివలె భరతుని యన్ని యంగములనుండియు దుఃఖాగ్నివలన చెమట వెలువడుచుండెను. కైకేయీ పుత్రుఁడగు నా భరతుఁడు చింత యనెడు గొప్ప బండలును, నిట్టూర్పులనెడు ధాతువులును, దిగులనెడు వృక్షములగుంపులును, దుఃఖశ్రమములనెడు శిఖరములును, మూర్ఛ యనెడు మృగసమూహమును, సంతాప మనెడి యోషధులును బొంగు వెదుళ్లును గల దుఃఖ మును, పర్వతము క్రింద నెటు పోవుటకును దోఁచక యుండెను. అంతట భరతుఁడు కడు నొచ్చిన మానసముతో వేఁడి నిట్టూర్పు విడుచుచు, మనస్సంతాప పీడితుఁడై యప్పు డప్పుడు తెల్పి దప్పుచు గుంపునుండి తప్పిపోయిన వృషభమువాఁడ్కిఁ బరితపించుచు సౌఖ్యముఁ బాసియుండెను. అప్పుడు గుహుఁడు సపరివారుఁడయి, భర తునికడ కేగుదెంచి, యాతనితో మాటలాడుచు, నతని దుఃఖమును జూచి, తానును దుఃఖమునొందుచు, నడుమ నడుమ భరతునికి రామునిఁ గూర్చిన సంగతులు సెప్పి యూఱడింపుచు నుండెను.

86-వ సర్గము

గుహుఁడు భరతునికి లక్ష్మణుని వాక్యము సెప్పుట

అరణ్య సంచారియగు గుహుఁడు సాటిలేని బలపరాక్రమము గల భరతునికి మహోత్సుఁడగు లక్ష్మణుని సద్భావమును దెలుపఁబూని "ఓ భరతా! తనయన్నయొక్క రక్షణముకొఱకై ధనుర్బాణములను ఖడ్గమును దాల్చి కంటిమీఁద నెప్పవాల్చక నిద్ర మేల్కొని యుండు వాఁడును, సుగుణసంపన్నుఁడును నగు లక్ష్మణునితోనే నిట్లంటిని: "రఘు నందనా! ఓ నాయనా! ఈ సుఖకరమైన సెజ్జ నీకై యేర్పఱచఁబడినది. నీవు దీనియందుఁ బరుండి నిద్రించి సేద దీర్చుకొనుము. ఓ ధర్మాత్ముఁడా, ఈ జన మంతయు దుఃఖముల నోర్చుకొనఁగలదు; నీవు సుఖములకుఁ దగినవాఁడవు. ఆ రాముని కాఁపుదలకై మే మందఱము మేల్కొనియుందుము. ఓ లక్ష్మణా! లోకమున రామునికంటె నాకు మిగులఁ బ్రియమైనది మఱొక్కటిలేదు. నీవు రామునిరక్షణకై

మేల్కొనియుండ నక్కఱ లేదు. నీ యెదుట నసత్యము పల్కుదునా? రాముని యనుగ్రహము వడసి యీ లోకమునఁ గడు గొప్పకీర్తిని, విస్తారమైన పుణ్యమును, ముఖ్యమయిన ధనాదిలాభమును బొందఁ గోరుచున్నాను. కావున నేను విల్లు చేతఁబట్టి బంధువులందఱితోడఁ గూడి సీతాసమేతుఁడై పరుండియున్న నా నెచ్చెలియగు రామునిఁ గాపాడుచుండెదను. ఎల్లప్పుడు నే నీవనము సంచారము చేయువాఁడను గనుక, నా కీవనమునఁ దెలియని దొక్కటి లేదు. మేము యుద్ధరంగమునఁ జతురంగములుగల సేనలనైన నోర్వఁగలము" అని మేము పలుకఁగా, ధర్మమునందే దృష్టిగల లక్ష్మణుఁడు మమ్ము నందఱి నిత్తెఱఁగునఁ జెప్పి సమాధానపఱిచెను. "ఓ గుహా! దశరథపుత్రుఁడైన రాముఁడు సుఖకరమైన సెజ్జపైఁ బరుండఁ దగినవాఁడు. అట్టి యాతఁడు సీతతోడ నుత్తనేలమీఁదఁ బరుండియుండఁగా, నా కెట్లు నిద్దురపట్టును. నాకుఁ బ్రాణములమీఁదనే యాశ లేదు. అట్లుండఁగా నాకుఁ నిద్రమీఁదికిఁ గాని, సుఖములమీఁదికిఁ గాని యెట్లు ఆశ పోవును? యుద్ధరంగమున దేవాసురుల కందఱికైన నోర్వఁజాలని పరాక్రమముగల యట్టి రాముఁడు సీతతోడఁ గసవులందుఁ బరుండి నిద్రించుచున్నాఁడు, గుహా, నీవు చూడుము. దశరథుఁడు గొప్పతపస్సుచేసి, సకలకష్టములఁ బడి తనతో సాటి యగు గుణవంతుఁడైన యొక్కపుత్రునిఁ బడసెను. ఇతఁడు వనము నకు వచ్చిన పిదప, రాజు గా రిఁక పెద్దకాలము బ్రతుకఁబోఁడు. కనుక త్వరలోనే ఈ పుడమి నాథుఁడు లేనిది గాఁగలదు. ఇది సత్యము. ఓ నాయనా! అంతఃపురస్త్రీలంద ఱిప్పటివఱకు గొప్పగొంతుపెట్టుకొనియేడ్చి యేడ్చి యిప్పటి కాయేసువ్వ చాలించియుందురు. కావున రాజగృహా మిా వేళకు నిశ్శబ్దమై చప్పచల్లాఱియుండును. కౌసల్యయు, నృపాలుఁడును, అట్లే నాతల్లియు నీ రేయికూడ బ్రతికియుందురని నేను తలంపను. నా తల్లియగు సుమిత్ర తనకు మఱొక్క కొడుకున్నందున, వానిం జూచుచు నైనను బ్రాణములఁ దాల్చియుండును గాని, శూరుని తల్లియైన కౌసల్య తన యాయొక్కకొమరునిఁబాసి యెట్లు ప్రాణములతో నుండ గలదు? కడచినది కడచినదియే. నాతండ్రి రామునికిఁ బట్టాభిషేకము సేయఁగోరి యా కోరిక నొందకయే మృతినొందఁగలఁడు. పుణ్యాత్ములగువా

రెవ్వారో, వారు మాతండ్రి స్వర్లోకమున కేగునట్టి కాలము వచ్చి నపుడు నృపాలునికి దహనాది ప్రేతకార్యముల నెల్ల నెఱవేర్చు వారు ధన్యులు పుణ్యవంతులగు సుఖపురుషులును మనోజ్ఞములైన ముంగిళ్ళతీరును గలదియు, చక్కగా దీర్చిన గొప్ప వీథులతోఁ గూడి నదియు, మేడలతోను, భవంతులతోను, నిండినదియు సకలవస్తు రత్న ములచేఁ గైసేయఁబడినదిగును, రథ గజ తురంగము లనేకముగాఁగల దియు, వాద్య ధ్వనులతోఁ జెలరేఁగుచున్నదిగును, సకల శుభకార్యము లతోఁ గూడినదియు, ఉపవనములతోను, ఉద్యానములతోను నిండి నదియు, ఉత్సవసమూహములతో శోభిల్లుచున్నదియునై, మనస్సంతో షమును దేహపుష్టియుఁ గలిగిన జనులతో నిండియున్న మా తండ్రి యొక్క రాజధానియందుఁ బుణ్యాత్ములగు పురుషు లుండఁగలరు. ఈ గడువు సత్యసంధుఁడైన రామునితో క్షేమముగను సుఖముగను మేము మఱల నయోధ్యలోఁ బ్రవేశింతుమా!" అని రాజపుత్రుఁడగు మహాత్ముఁ డయిన లక్ష్మణుఁ డీతెఱఁగున వగచుచు నా రేయిని గడపెను. మఱునాఁటి సూర్యోదయమున రాజపుత్రు లిద్దఱును జడలు దాల్చిరి. నేను వారి నీ రేవునుండియే సుఖముగ వీడ్కొంటిని. అంతట బలవంతులును, శత్రువులను సంహరించువారును మేటి యేనుఁగులం బోలువారునునైన వా రిద్దఱు నారబట్టలను గట్టికొని కృష్ణాజినములు గప్పుకొని, జడదారు లయి మేటివింట్లను ఖడ్గములను బాణములను దాల్చినవారై యొక్కఁట జాగ్రతతో సీతను నడుమ నుంచికొని నడచి పోయిరి.

87-వ సర్గము

భరతుఁడు గుహుని పలుకులు విని చింతించుట

సుకుమారుఁడును, ఎక్కువ బలిమిగలవాఁడును, సింహపు మూఁపువంటి మూఁపులుగలవాఁడును, పొడవుచేతులవాఁడును, తెల్ల తామరపువ్వు రేకులవలెఁ విశాలములయిన కన్నులు గలవాఁడును, ప్రాయంపువాఁడును, ఆహ్లాదకరుఁడునునైన భరతుఁడు మిక్కిలి యింపు గాని గుహునిమాటలను విని, తనకోర్కి సిద్ధించునో, సిద్ధింపదోయని చింతింపఁదొడఁగి, కడుంగడు వగపునొంది, కొంత తడ వా వగపును మనమున నణఁచిపెట్టుకొని, దాని నట్టాపుకొనఁజాలక బరిగోలలచే

మిగులఁ బొడువఁబడిన యేనుఁగునూఁడ్కి నచ్చటనే పడెను. వెంబడి నున్న శత్రుఘ్నుఁ డట్టి యవస్థ గలిగియున్న భరతునిఁ గౌఁగిటఁ జేర్చు కొని, దుఃఖముచేఁ జిక్కినవాఁడయి, స్మృతిఁదప్పి గొంతెత్తి మిక్కిలి రోదనము చేసెను. అంత నుపవాసము లొనర్చియు, పెనిమిటినిఁబాసియు బడుగులయియున్న యా భరతుని తల్లులండఱు నచ్చటికివచ్చి నేల మీఁదఁబడియున్న భరతునిఁ జుట్టుకొని రోదనము గావించిరి. బిడ్డలపైఁ బ్రేమముగల రాముని తల్లియగు కౌసల్య తన బిడ్డచుబోలె భరతునిఁ గౌఁగిటఁజేర్చి, యతనితో నిట్లనియె. "ఓ నాయనా! నీకు దేహమున నేమియు వ్యాధి లేదు గదా! మాప్రాణములెల్ల నీ యధీనములై యున్నవి. రాముఁడు లక్ష్మణునితోడ నడవికిఁ బోయినను, దశరథుఁడు స్వర్గమున కేగినను, నిన్నుఁజూచుకొని మేము జీవించుచున్నాము. ఇప్పుడు నీ వొక్కఁడవ మాకు దిక్కు. నాయనా! లక్ష్మణుం గూర్చి యైనను, భార్యాసమేతుఁడై వనమున కరిగియున్నట్టి, నా యేక పుత్రుఁడగు రాముని గూర్చియైనను చెడుమాట దేనినైనను వింటివా?" అని కౌసల్య భరతు నడిగెను. కీర్తిశాలియగు నా భరతుఁడు శోకతప్తులకిఁ దెప్పిఱిల్లి రోదనము సేయుచునే కౌసల్య నూఱడించి, గుహునిఁజూచి, "రాత్రియం దెచ్చట రాముఁడును, సీతయు, లక్ష్మణుఁడును శయనించిరి? ఏమి భుజించిరి? చెప్పుము." అని యడుగఁగా, బోయలకేఁడయిన గుహుఁడును దన ప్రియుడును హితుఁడును నగు నతిథియగు నా రాముని విషయమునఁ దాను నడచుకొన్న తీరెల్ల వివరింపఁ దొడఁగెను. "నేను నానా విధములగు వ్యంజనములతోఁగూడిన షడ్రసోపేతమయిన యన్నమును, పలుతెఱఁగులైన పండ్లను, మఱియు ననేకములైన పదార్థములను రామునికి భోజనము నిమిత్తము దెచ్చిపెట్టితిని. విశేషపరాక్రమముగల రాముఁడు వానిని జూచి, మఱల నన్నే తీసికొని పొమ్మనెనుగాని, తన క్షత్రియ ధర్మము దలఁచినవాఁడై, నా విందును గైకొనఁడయ్యెను. మఱియు మహాత్ముఁడగు రాముఁడు ననుఁ జూచి, "చెలికాఁడా! మే మెల్లప్పు డొక్కరి కియ్యఁదగునేకాని, పుచ్చుకొనుట యుచితము గాదు." అని మమ్ము సమాధాన పఱిచెను.

మహా కీర్తిశాలియగు రాముఁడు సీతతోడఁగూడి లక్ష్మణుఁడు తెచ్చియిచ్చిన యుదకముఁ ద్రావి, యా రేయి యుపవాస వ్రతము నాచరించెను. లక్ష్మణుఁడును మిగిలిన జలముఁ ద్రావెను. అట్లు వారు మౌనవ్రతులై, యేకాగ్రమనస్కులై సంధ్యోపాసన చేసిరి. లక్ష్మణుఁడును సంధ్యనుపాసించి, తానే యేగి దుర్భలను దెచ్చి, రాముని నిమిత్తమై మెత్తని పాన్పు నేర్పఱిచెను. రాముఁడును సీతా సమేతుఁడై యా మెత్తని దర్భశయనమునఁ బరుండెను. అప్పుడు లక్ష్మణుఁడు వారి యిరువురి పాదములఁ గడిగి, యానలికిఁ బోయెను. భరతా! వారు పండుకొన్నవి యీ గారచెట్టు క్రిందనే. రాముఁడును సీతయు దేనియం దా రాత్రి శయనించిరో, అదియే వారు శయనించిన యీ దర్భశయనము. శత్రుసంహారియగు లక్ష్మణుఁడును అల్లెల్లాటి దెబ్బ తగులకుండుటకై యత్తెమును, వ్రేళ్ళ యొరయుఁ దొడిగికొని, బాణములు నిండుగనున్న యమ్ముల పొదులను వీపునకుఁ గట్టుకొని, తన గొప్ప విల్లెక్కుపెట్టుకొని రేయియంతయుఁ గంటిమీఁద కెప్పవాల్పక యీ రామునికిఁ జుట్టు తిరుగుచుఁ గావలి గాచుచుండెను. అంతట నేనును, నుత్తమములగు ధనుర్బాణములను ధరించి, లక్ష్మణుఁ డున్నచోటనే, దేవేంద్రుఁ బోలు రామునిఁ గాచుచుంటిని. నా బందుగులును నా రేయి నిదుర మాని ధనుస్సులు చేతఁ బట్టి వారిని గాచుచుండిరి.

83-వ సర్గము

భరతుఁడు రామునిఁజ్జూచి విలపించుట

భరతుఁడు గుహుని మాటలను శ్రద్ధతో విని, గారచెట్టు మొదటి కేగుదెంచి, యా రాముని పాన్పును జూచి, తల్లులందఱుం బిలిచి, "యిచ్చట నస్మత్ప్రభుత్వుఁడైన రాముఁడు నేలమీఁదఁ బరుండుటకై యేర్పఱిచిన పాన్పు ఇదియ. ఇదిగో నలిగి చెదరి యున్నది. గొప్ప కులమునఁ బుట్టినవాఁడును, గొప్పవాఁడుఁను నైన జ్ఞానియగు దశరథునికిఁ బుట్టిన రాముఁ డిత్తెఱఁగున నేలపైఁ బరుండుట తగునే? మఱియుఁ బురుషశ్రేష్ఠుఁడగు రాముఁడు గృష్ణాజినము పఱచినదియు, మేలగు ననేకాస్తరణములు గలదియునైన హంసతూలికా తల్పమునఁ బరుండువాఁడు; ఇప్పు డెట్లు కటికినేలపైఁ బరుండుచున్నాఁడో! ఈ రాముఁడు

విమానములం బోలు మేడలకొనభాగములందును, పై యంతస్తులం దును, బంగారు వెండి రేకులుతాపినవియు, మేలయిన యాస్తరణ ములచే శోభిల్లుచున్నవియు, నానావిధములగు పూవులు పఱచినందునఁ బలురంగులు గల్గియున్నవియు, చందనముయొక్కయు అగురు యొక్కయు కమ్మనివాసనలు గుబాళించుచుండునవియు తెల్లని మబ్బుల కాంతివంటి కాంతిగలవియు, చిలుకల కూఁతలతోఁ గూడినవియు, చల్ల దనము, సువాసనయుఁ గలిగినవియు, బంగారుమయము లగు గోడలు గలిగియున్నందున మేరుపర్వతమును బోలియున్నవియునైన శ్రేష్ఠము లయిన మేడలమీఁదఁ బరుండి, గీతములయు వాద్యములయు ధ్వనుల చేతను, మేటిసొమ్ములధ్వనులచేతను, మద్దెల చప్పుళ్లచేతను మేలొకొలుపఁ బడి, యరుణోదయమునఁ బలువురు సూతమాగధులు పాడెడి యింపు లయిన పాటలను, వంశావళీబిరుదులను వినుచు లేచుచుండినవాఁడు. అట్టి రాముఁ డిప్పు డు త్తనేలపైఁ బరుండినాఁ డన్నమాట నమ్మఁదగిన దని నాకుఁ దోఁపలేదు. ఇది వట్టిమాట యని నాకుఁ దోఁచుచున్నది. నా మనసు గలవరపడుచున్నది. ఇది కల యని నాయభిప్రాయము. కాలమునకంటె నెక్కువ బలము గలది యొక్కటియు లేదు. లేకున్న, దశరథపుత్రుఁడయిన రాముఁ డి ట్లుత్తనేలపైఁ బరుండునా? జనకమహా రాజు కూఁతురును, దశరథనృపాలుని కోడలును, చూచుట కింపయిన దియు రామునికిఁ బ్రియురాలునైన సీత యెట్లు కటికి నేలపైఁ బరుండు చున్నది? ఇది మా యన్నగారి పాన్పు. ఇచ్చటనే యాతఁడు పొరలు టచే నతని యంగము లన్నింటియొక్క రాయిడిచేత నీ దర్భలనెజ్జ నలఁగియున్నది. ఈ మేటి దర్భశయనమున సీత యాభరణములఁ దాల్చి నదియై పరుండిన దని తోఁచెడి. కావుననే యచ్చటచ్చట బంగరుపొడి పడియున్నది. మఱియు నిచ్చట సీత తనపైఁటచెఱఁగుఁ గ్రిందపఱచుకొని పరుండినట్లున్నది. కొఁబట్టి దర్భలపై నచ్చటచ్చటఁ దెల్లపట్టు నూలి ప్రోఁగులు దగులుకొనియున్నవి. చిన్నదియు, కష్టముల నోర్వఁజాల నిదియు, పతివ్రతయు, జాలి నొందఁదగినదియు నైన యా సీత భర్తతోఁ గూడ నీ పాన్పునఁ బరుండినందున నా మెకుఁ గష్టము తెలియరాకుండు నని తలఁచెదను. అక్కటా! నే నెంత పాపిష్ఠుఁడను! నా నిమిత్తమయి

రాముఁడు దిక్కులేనివానివాఁడిక్కు భార్యకోడ నిట్టి కటికినేలపైఁ బరుండుచున్నాఁడుగదా! చక్రవర్తుల వంశమునఁ బుట్టినవాఁడును, జనుల కందఱకు నిష్టుఁడును, జనుల కందఱకు మేలుచేయువాఁడును, ఎఱ్ఱి తామరపువ్వులంబోలు కన్నులవాఁడును, ఆస్థోవకఱ్ఱఁడును, సుఖములకుఁ దగినవాఁడును, దుఃఖములకుఁ దగనివాఁడును నయిన యీ రాముఁ డెట్లు నేలపైఁ బరుండుచున్నాఁడు? మంగళకరములగు లక్షణములు గల లక్ష్మణుఁ డాపదలందుఁ దన యన్నను గొల్చుచున్నాఁడు గాన నాతఁడు ధన్యాత్ముఁడు. భర్తను వెంబడించిన సీతయు ధన్యాత్మురాలు. మహాత్ముఁడయిన యీ రామునిఁ బాసియుండిన మన మిప్పు డాతనికడకుఁ బోయిన మునసేవ నొప్పుకొనునో, లేక నాతోఁగూడ రావల దనునో యని సంశయపడుచున్నాను. దశరథుఁడు స్వర్గమున కేగఁగను, రాముఁ డరణ్యమున కేగఁగను, ఈ భూమండలము సముద్రమందు మాలిమి లేని యోడవలెఁ దోన్యమగ నున్నది. రాముఁ డరణ్యమున నున్నను, శత్రురాజులతని శౌర్యమునకు వెఱచి, యీతని బాహుబలముచేఁ గాపాడఁబడు నీ నేల నాక్రమించుకొన నెల్లరును వెఱచుచున్నారు. ప్రాకార రక్షకులు లేనిదియు, కట్టఁబడనందున స్వేచ్ఛమైఁ దిరుగుచుండు గుట్టములు నేనుఁగులుఁ గలదియు, తెఱవఁబడియుండు తలుపులు గలదియు, సైన్యములు సంతసము దక్కి యసడ్డగలిగియున్నందున కాఁపుదల లేనిదియు, తగ్గుస్థితిలోను, కష్టదశయందు నుండునదియునై యున్నను, శత్రురాజులు విషముగలిపిన భక్ష్యములనుబోలె నీ యయోధ్యాపురమును గోరకయున్నవారు. కావున రాజ్యమున నెవ్వఁ డుండకపోయినను గీడులేదు. ఇదిమొదలు నేనును నెల్లప్పుడు గంద మూల ఫలముల నాహారముగాఁగొనుచు, జడలుదాల్చి, నారచీరలు గట్టుకొని, నేలమీఁదనో, తృణములమీఁదనో పరుండెదను. నేనును ఆ రాముని ప్రతిజ్ఞ నవలంబించి, యిదివఱకుఁ గడచిన దినములు పోను మిగత కాల మంతయు సుఖముగా వనమున నుండెదను. రాముని ప్రతిజ్ఞ రొన్నఁటికి నసత్యము గానేరదు. అన్నగారి నిమిత్తము వనముల నుండు నన్ను శత్రుఘ్నుఁడనుసరించి, నావలెనే కందమూల ఫలాశనుఁడై నారబట్టలఁ గట్టు

ఁొని భూదర్భశయనము చేయుచుండును. మా యన్నగారు లక్ష్మణ సమేతుఁడై యయోధ్యాపురమును బాలింపఁగలఁడు. అయోధ్యాపుర వాసులగు విప్రులు రామునికిఁ బట్టాభిషేకము నేయఁగలరు. దేవత లందఱు నా యీ కోరికను సఫలముఁజేయుదురా నేను రాముని కిఁ దలతోఁ మ్రొక్కి పలుతెఱఁగుల బతిమాలుకొనెదను. అట్లు నా ప్రార్థనము నతఁ డియ్యకొనఁడేని, నేనును రాముని తోడ నుండెదను. తనతోడి వనవాసమునకు రాముఁడు వన్నంగీకరింపక పోఁడు." అని చెప్పుచు మిక్కిలి విలపించెను.

89-వ సర్గము

భరతుఁడు గంగానది దాఁటి భరద్వాజాశ్రమమును జేరుట

భరతుఁడు రాత్రియంతయు నా గంగానదీతీరముననే యుండి, వేకువ లేచి, శత్రుఘ్నుఁ జూచి, "యో శత్రుఘ్నా! యేల యింకను నిద్రపోవుచున్నావు? లే లెమ్ము. బోయలు జెఱఁడగు గుహుని వేగఁ దోడ్కొని రమ్ము. నీకు మేలగును. అతఁడు మనలను గంగానదిని దాఁటించును" అని చెప్పెను. ఆ మాటలను విని శత్రుఘ్నుఁడు భరతునితో, "ఓ యన్నా! నేను మేల్కొనియున్నాను. ఆ పూజ్యుఁడైన యన్ననే తలఁచుచుండుటచే నాకు నిద్దుర పట్టకున్నది." అని చెప్పెను. ఇట్లు పురుషోత్తములగు వీ రిరువురు పరస్పరము మాటలాడుకొనుచుండఁగా, గుహుఁడు భరతునికడ కేగుదెంచి చేతులు జోడించికొని, యా భరతునింగూర్చి, "ఓ భరతా! యీ గంగానదీతీరమున నీ రేయి సుఖముగా నుంటిరిగదా! నీవు సేనలతో క్షేమముగనుంటివిగదా." అని యడిగెను. రామునికి విధేయుఁడగు భరతుఁడును గుహుఁడు చెలిమితోఁ జెప్పిన యా మాటను విని, "యో గుహా! మే మీ రేయి సుఖముగాఁ గడపితిమి. నీవును మాకు సకల మర్యాదలను జేసితివి. మేము గంగానదిని దాఁటఁ గోరుచున్నాము. నావికులను రప్పించి, మమ్ము గంగానదిని దాఁటింపుము. అనేకములైన యోడ లనాయితము చేయింపుము" అని చెప్పెను. అంత భరతుఁడు త్వరతో నాజ్ఞాపించిన యాజ్ఞను శిరసా వహించి, తన పల్లెకుఁ బోయి, తన బందుగుల నందఱను బిలిచి, "లే లెండు, మేల్కొనుఁడు. మీ కెల్లప్పుడు మేలయ్యెడు. పడవల

సీడ్చికొనిరండు. భరతుని నదిని దాఁటింతము." అనెను. వా రందఱు నట్లే యని లేచి, తొందరపాటుతోఁ దమ ప్రభువు నుత్తరువుప్రకారమే యేనూఱు నావలను వేగిరమె యీడ్చికొనివచ్చి యంతట నింపిరి. ఇనియేఁకాక, గొప్ప గంటలు గట్టఁబడినవియు, గాలియొక్క రాకపోక లకుఁ దగిన గవాక్షములు గలవియు, చక్కగ నిర్మింపఁబడినవియు, మిక్కిలి శోభిల్లుచున్నవియునైన యుత్తమములగు మఱికొన్ని స్వస్తిక ములు లనెడు నావలకు టెక్కెములు గట్టి, వానినిఁగూడ దేవునకుఁ జేర్చిరి. అంతట గుహుఁడు దెల్లని కంబళము పఱచినదియు, చిఱు గంటలు గట్టినదియునై యొప్పుచున్న యందమైన స్వస్తిక మనెడి యొక నావను దెచ్చెను. ఆ యోడయందు భరతుఁడును, మహా బలుఁడగు శత్రుఘ్నుఁడును నెక్కిరి. వారికిఁ బిదప గురువులును, పెద్దలగు బ్రాహ్మ ణులును నెక్కిరి. పిమ్మట, కౌసల్య, సుమిత్ర మున్నగు రాజస్త్రీలును నెక్కిరి. వా రెక్కిన తరువాత భరతుని దేవేరులు మొదలగు రాజ కాంత లందఱు నెక్కిరి. పిదప రథములును బండ్లును, అంగళ్ళును నెక్కింపఁబడెను. అప్పుడు సైనికులలోఁ దాము విడిసిన స్థానముల దహింతువారును, నోడలలో నెక్కుటకయి దేవున దిగువారును, సామగ్రులను ఓడలలోపలి కెక్కించువారును జేయుచున్న గొప్ప రొద మిన్ను ముట్టుచుండెను. సేన లెక్కినతర్వాత, నావికులు గూర్చుండి యోడ చాపలు విప్పిన వెంటనే యా యోడలు తమంత మఱింత వేగ ముగా నేగెను. కొన్ని నావలలో నాఁడువా రెక్కిరి. మఱి కొన్నిటిలో గుఱ్ఱము లెక్కినవి. కొన్ని నావలం దెక్కువ బండ్లను, రథములను, ఎద్దులు, గుఱ్ఱములు మొదలగు వాహనములను విస్తారమగుధనమును సైనిక లెక్కించిరి. ఆ యోడలు నడుపువా రోడల నావలి గట్టును జేర్చి వారినందఱను దింపిరి. పిమ్మట నావికులు నీటియందు నావలను జిత్ర విచి త్రముగ ద్రిప్పిరి. టెక్కెములుగట్టిన యేనుఁగులను మూఁటిం డ్రు దాఁటిం చిరి. అవి యప్పుడు నడగొండలో యను నట్లుండినవి. మఱియు ననేకులు నావలలో నెక్కి దాఁటిరి. కొందఱు తెప్పలలో నెక్కి దాఁటిరి. కొందఱు భానలపై దాటిరి మఱికొంద ఱీదుచు దాఁటిరి. గంగాస్నానముచేఁ బరి శుద్ధమైన యా సేన గంగానదిని దాఁటినదై, మైత్ర మనుముహూర్తమున

నందమయిన ప్రయాగవనమునకుఁ జనిలినవి. మహాత్ముఁడగు భరతుఁడు సేనలను గొంత సేపూఁటు నొందించి, సుఖమునకుఁ గొఱఁత రాకుండు నట్లు ప్రయాగవనమునఁనే నిలిపి, తాను బుత్విజులతోఁ గూడి, బుషి శ్రేష్ఠుఁడయిన భరద్వాజ మహాముని ని జూడఁబోయెను. భరతుఁడట్లుపోయి మహాత్ముఁడును, దేవపురోహితుఁడును, బ్రహ్మవేత్తయునైన ద్విజ శ్రేష్ఠుఁడగు భరద్వాజ మునీంద్రునియొక్క యాశ్రమము చేరి, రమ్యము లయిన పర్ణశాలలతోడను, చెట్లగుంపులతోడను నొప్పారుచు రమణీయ ముగనున్న గొప్పయాశ్రమ వనమును జూచినవాఁ డయ్యెను.

90-వ సర్గము.

భరతుఁడు భరద్వాజాశ్రమున నుండుట

నరశ్రేష్ఠుఁడగు భరతుఁడు సకల ధర్మముల నెఱిఁగినవాఁ డగుటం జేసి, కోసుదూరమునఁనే భరద్వాజాశ్రమమును జూచి, సైన్యము నంతయు నచ్చట నిలిపి, శస్త్రములను సకల భూషణములను దీసివైచి, తెల్లని పట్టుబట్టలను గట్టుకొన్నవాఁడై, పురోహితుని ముందిడుకొని, మంత్రులు వెంబడి రచ్చుచుండఁగాఁ గాలినడకను గొంతదవ్వుఁగి భర ద్వాజాశ్రమము చొచ్చినపిదప మంత్రులను గూడ నిల్పి, పురోహిత పురస్సరుఁడై, భరద్వాజమునీంద్రునిఁ జూడఁబోయెను. విశేష తపస్సం పన్నుఁడగు భరద్వాజమునీంద్రుఁడు వసిష్ఠునిఁ జూచినంతనే, శిష్యులను బిలిచి, యర్ఘ్యము తెండని యానతిచ్చి తా నాసనమునుండి లేచెను. మహాతపోమహిమగల యా భరద్వాజుఁడు వసిష్ఠుని గలిసికొనెను. అపుడు భరతుఁ డమ్మునీంద్రునకు మ్రొక్కెను. భరద్వాజమునీంద్రుఁ డును ఆ మ్రొక్కిన యాతఁడు దశరథన్యసాలుని కొడుకగు భరతుఁ డని యెఱిఁగెను. అంత భరద్వాజుఁడు భరత శత్రుఘ్నుల కిరువురకును మొదట నర్ఘ్యపాద్యములు నొసఁగి, యావల వన్యము లయిన ఫల ములు నొసఁగి, వరుసఁదప్పక యందఱి క్షేమమడిగి, పిదప నయోధ్యయం దలి సేనలు, బొక్కసము, చెలికాండ్రు, మంత్రులు మొదలగువారిని గూర్చి, సేనలు బాగున్నవా? బొక్కసముల నిండుగా ధనమున్నదిగదా? చెలికాండ్రందఱు నీ మేలరయుచు నుందురుగదా? మంత్రులు నీ కాలోచనలఁ జెప్పుచుందురుగదా?" యని యడిగెను, కాని దశరథన్యసా

లుని మరణవార్త నెఱింగియున్నవాఁడు కావున నా సంగతిమాత్ర మెత్తఁడయ్యెను. అట్లు వసిష్ఠమునీంద్రుఁడును, భరతుఁడును భరద్వాజ మునీంద్రునిఁ జూచి, "మునీంద్రా! తమకు క్షేమమేగదా? అగ్నిహోత్ర కార్యములు చక్కఁగా జరుగుచున్నవిగదా! శిష్యులు మీ మాట చొప్పున నడచుకొందురుగదా! తపోధనులందలి మృగపక్షు లొం డొరుల మీఁద వైరముఁ బూటింపక పొత్తుగలిగి యనుచున్నవిగదా?" యని యడిగిరి మహా తపస్వియగు భరద్వాజ మునీంద్రుఁడును "మీ రడిగినదియెల్ల సన్నీయున్న" దని వా రిద్దఱితోఁ జెప్పి, రాముసీయందలి చెలిమిచే భరతుని కిట్లనియె. "ఓ భరతా! నీవు రాజ్యము నేలుచు నిక్కడి కేలయేతెంచితివి? రాజ్యమును విడిచి యిట్లు రావలసినంతపని యేమి వచ్చినది? నామనము పరిపరివిధములఁ బోవుచున్నది కావున నా కీ వృత్తాంతము సవిస్తరముగా వినిపింపుము. శత్రుసంహారకుఁడును లోకానందకరుఁడును కీర్తిమంతుఁడును కౌసల్యకన్నకొడుమును నగు రాముని దశరథుఁడు స్త్రీకి లోఁబడి "పదునాలుగేండ్లు వనవాసివిగమ్ము" అని తమ్మునితోడను, భార్యతోడను గూడ నడవులకుఁ బంపెను. నీవు నిష్కంటకమగు రాజ్య మనుభవింపఁగోరి, నిరపరాధియగు నా రాము నకుఁగాని, యాతని తమ్ముఁడగు లక్ష్మణునికిఁగాని యొట్టి కీడును జేయఁ గోరవుగదా!" యనెను.

ఇట్లు భరద్వాజమునీంద్రుఁడడుగఁగా, భరతుఁడు కన్నులనిం డుగ నీరుదెచ్చుకొని దుఃఖముచేఁ దొట్రుపడుమాటలతో నిట్లనియె. "ఓ మునీంద్రా! తామును నీప్రకారముగాఁ దలఁచితిరేని, నా బ్రదుకు బ్రద్దలయి పోయినది. నావలన నెట్టి యపరాధమును లేదని తలఁచెదను. తా మిట్లాన తిచ్చి నన్ను నొప్పింపకుడు. నాతల్లి కైకేయి నేను లేనప్పు డెయ్యది చేసినదో, యది నా కెంతయు సమ్మతముగాదు. నేను వచ్చిన పిదప నా కా సంగతి దెలిసినను, నాకు రాజ్యము వచ్చెఁ గదా యని నేను సంతసము నొందను లేదు. నే నామె మాటప్రకారము పట్టాభిషేకము చేసికొనను గోరలేదు నే నన్ననో యా రాముని పాద ములకు మ్రొక్కి, యాతనింబ్రతిమాలి, యతనిని నాయొడ ననుగ్రహము గల వానినిగ నొనరించికొని యయోధ్యాపురికిఁ దోడుకొనిపోవ వచ్చి

తిని. ఓ మహాత్మా! తాము నా మనోరథము నెఱిఁగితిరి కావున, నాయెడ ననుగ్రహించి, యీ రామభూపాలుఁ డెచ్చట నున్నవాఁడో యెఱిఁగిం పుఁడు" అని భరతుఁడు భరద్వాజమునిఁ నడిగెను. అప్పుడు వసిష్ఠాది మహర్షులును, ఋత్విజులును "మహాత్మా! భరతుని ప్రార్థనము నెఱి వేర్పు" మని యాచింపఁగా, భరద్వాజమునీంద్రుఁడును భరతునియెడ ననుగ్రహమునేసి, "ఓ పురుషశ్రేష్ఠుఁడా! పెద్దల సహవాసమును, నోర్పును, సత్పురుషుల ననుసరించుటయు రఘువంశమునఁ బుట్టినవాఁడ వగు నీకుఁ దగియే యున్నవి. నీ మనసున నున్న సంగతి నే నెఱిఁగి యున్నాను. అయినను, ఆ విషయమును దృఢముగాఁ దెలియఁగోరియు, నీ కీర్తి దిగంత విశ్రాంతమగుటకును నే నీ మాట యొత్తి యడిగితిని. ధన్యుఁడగు రాముఁడు తమ్మునితోను, సీతతోను గూడి యెచట నుండు నది నే నెఱుఁగుదును. నీ యన్న చిత్రకూటమను మహాపర్వతమున నున్నాఁడు. రే పక్కడికిఁ బోదువుగాని, మంత్రులును, నీవును నీ రేయి కిచ్చట నుండుఁడు. అర్థ కామము లను పురుషార్థముల స్వరూపం బెఱిఁగిన యీ బుద్ధిమంతుఁడా! యీ నా ప్రార్థన నంగీకరింపుము." అని భరతునితోఁ జెప్పెను. అంత గొప్పభావముగలవాఁడును, సౌందర్య వంతుఁడునైన రాజపుత్రుఁడగు నా భరతుఁ డట్లే యని చెప్పి, యా మునీంద్రుని యాశ్రమమున నా రేయి గడపఁ దలఁచెను.

91-వ సర్గము.

భరద్వాజమునీంద్రుఁడు భరతునకు విందుసేయుట

మఱి యీయా పుత్రుఁడగు భరతుఁడును నా రేయి యచ్చట నుండుట కియ్యకొనఁగా, నప్పుడు భరద్వాజమునీంద్రుఁ డాతనిని భోజనాంత మైన యతిథిసత్కారమును గ్రహింపఁగోరెను. భరతుఁడును, "మహాత్మా! తమ రర్ఘ్యపాద్యము లొసఁగి, వనమున దొఱకు ఫలాదులచే నతిథి సత్కారము చేసితిరిగదా! ఇంక నేమి" యని యడిగెను. ఆ పలుకులు విని, మునీంద్రుఁడును "భరతా! నీవు నాయెడఁ బ్రేమగలవాఁడ వనియు, నే నేది యొసఁగినను, నీవు దానిచేతనే తనివి నొందుదువనియు నే నెఱుఁగుదును. అయినను, ఈ సేనకెల్ల విందుపెట్టఁ గోరుచున్నాను. నరశ్రేష్ఠా! నా కోరిక యెట్లున్నదో, యది యట్లు నెఱవేర్తువుగాక.

పురుషోత్తమా! నీవు దవ్వునకే యేల సేనలను విడిచి వచ్చితివి? సేనలను దోడ్కొని యేల రావైతివి?" అని యడిగెను. భగతుఁడును, చేతులు జోడించి "సహస్రాక్షా! తమకు వెఱచి సేనతోడ రాఁజాలితిని. రాజ్యంబె, రాజపుత్రుఁడొండె గొల్లఁపడుఁ తపస్వులుండు ప్రదేశములను సర్వ విధములఁ దప్పించి తిరుగుచుండఁగలరు. భగవంతుఁడా! శ్రేష్ఠములైన గుఱ్ఱములును, మేటి మదపుటేనుఁగులును, సైనికులును చాలమేరయాశ్రమించి నన్ను వెంబడించుచున్నవి. ఆ సేనలు తపోవనమునకు లోపల నచ్చునేని, యాశ్రమములందలి నేల చెట్లను విఱిచి, నీటినిగలియఁబెట్టి, నేలను ద్రొక్కి దుక్కిచేసి పాడుచేయుననియుఁ బన్నగాలలను బడఁద్రోయుననియుఁ దలఁచి నే నొక్కరుండనే వచ్చితిని" అని చెప్పి, యమ్మహర్షి వలన సేనలను లోపలికిఁ దోడ్కొనిరా నానతిఁ బడసినవాఁడై, సేనలను ఆశ్రమమునకుఁ బిలిపింప నానతి యొసఁగెఁ.

అంత భరద్వాజమునీంద్రుఁ డగ్నిహోత్రశాల కేఁగి, యాచమనము ముమ్మా ఱొనర్చి, తుదుచుకొని, భరతునికి నతిథి సత్కారము సేయుటకై, కొందఱు దేవతల నాహ్వానము చేసెను. "దేవతల వ్రేఁగి యగు విశ్వకర్మను ధ్యానించెదను. అతఁడు వచ్చి భరతుని సేనలకు వలయు గుడారములను సృష్టించునుగాక. యము వరుణ కుబేరు లను లోకపాలురను మువ్వురను, నింద్రుఁడు మొదలగు వేల్పులను బిలిచెదను. వారు దానికై ప్రయత్న పడుదురుగాక. పూర్వవాహినులగు నదులను, పశ్చిమవాహినులగు నదులను, మఱి భూమ్యాకాశముల యందుఁ బ్రవహించు నదులను బిలిచెదను. అవి యన్నియుఁ గూడి వచ్చి యీ యాశ్రమమునందలి సేనల కుపయోగార్థము నిల్చునుగాక! కొన్ని నదులు మైరేయమును, మఱికొన్ని సదు లుత్తమమగు కల్లును, మఱికొన్ని నదులు చెఱుకుపాలంబోలు చల్లని యుదకమును నొసఁగునుగాక! విశ్వావసువు, హాహా, హూహూలను గంధర్వులను, గంధర్వాంగనలను, ఘృతాచి, విశ్వాచి, మిశ్రకేశి, అలంబుస, నాగదంత, హేమ, పర్వతమునసుండు హిమ మొదలగు నచ్చరలను, దేవేంద్రుని గొల్చెడి స్త్రీలను, బ్రహ్మ నుపాసించుచుండు స్త్రీలను వారి వారి నృత్తగీతాది వాద్యసాధనములతోను బాడినవారిని, గానశిక్షకుఁ

డగు తుంబురు మహామునిని బిలిచెదను. వారందఱు నేతెంచి, నాట్యము సల్పిరిగాక, పాటలుపాడియు భరతుని, నతనిపరివారమును సంతసపఱతురు గాక! ఉత్తరకురుదేశములందు వస్త్రములు భూషణములు ననెడి యభీష్టములు గల్గి, రూపవతులగు నంగనలనెడి ఫలములతో శోభిల్లుచుండెడి కుబేరుని సంబంధియైన చైత్రరథమను వనమును, ధ్యానించెను. అది యిచ్చటికి పచ్చియుండునుగాక. నేను చంద్రుని ధ్యానించెదను. అతఁడు నా ప్రార్థనము నంగీకరించి, భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్య పానీయము లనెడు చతుర్విధాన్నములను విస్తారముగా వెంటనే సిద్ధపఱచి, నానావిధములగు పుష్పములను భూషణములను, సుదర్శనము మొదలగు పాసేయములను పలుతెఱఁగుల నంజిష్టను సిద్ధముచేయునుగాక!" అని యిట్లనుచు జెప్పి యోగబల తపోబలములుగల యా భరద్వాజ మునీంద్రుఁడిట్లెఱఁగున శిష్యులందలి స్వరములతోఁ గూడిన పలుకులతోఁ జేతులు జోడించి తూర్పునకుఁ దిరిగి, దేవతల నందఱను వెవ్వేఱుగ మనమున ధ్యానించెను. అంతట వేల్పులందఱు నమ్మునీంద్రుని యెదుటఁ బ్రత్యక్షమైరి. పరిశుద్ధమయిన వాయువును మలయ దర్దుర పర్వతములనుండి వెడలి, జనుల శ్రమవలని చెమ్మటఁ బోకార్చుచు, నెత్తావితోఁగూడి జనుల కానందమును గలిగించుచు వీచుచుండెను. దేవత లాకసమునుండి యెడతెగని దివ్య పుష్పవర్షములఁ గురిపించిరి. దేవతలు దుందుభివాద్యములు వాయింపఁగా, వానిమ్రోతలు దిక్కులెల్ల నిండెను. అప్సరస లందఱు నాట్యమాడిరి. నెత్తావిగల చల్లని తిన్నని గాలులు వీచినవి. దేవతలు గంధర్వులు వీణలను హాయిఁ చుచుఁ దదనుగుణముగా గానము సేసిరి. నృత్తగీత వాద్యములవలనఁ బుట్టిన యా ధ్వని, మిక్కిలి తిన్ననైై, శ్రుతితో నేకీభవించి, లయతోఁ గూడి భూమ్యంతరిక్షములందు వ్యాపించి ప్రాణుల శ్రవణముల కానందమునుఁ గొల్పుచుండె, సకలజనానంద కరమయిన యా ధ్వని యాఁగినంతనే, భరతుని సైనికులాయా శ్రమమున పశ్వాకర్మ చే నిర్మితములయిన విడిదలలి వింత నిర్మాణమునుజూచుచుండిరి. అయ్యాశ్రమము చుట్టు నైదు యోజనములదూరము భూమి యంతటను చదనై, పచ్చలు, వైడూర్యములు పాటిగాఁ దేఁదగిన యనేకములైన పచ్చికపట్టులు గలిగి రమణీయమయి

యుండెను. అయ్యాశ్రమమున మాఱేడు, వెలగ, పనస, మాఱు లుంగము, ఉసిరిక, మామిడి మొదలగు చెట్లు ఫలములతో శోభిల్లు చుండినవి. ఉత్తర కురు దేశములనుండి దేవభోగములతోఁ గూడిన చైత్రరథమనెడి కుబేరుని యుద్యానము భరద్వాజాశ్రమము వొచ్చెను. అనేకములగు పుణ్య నదులును గట్టిన నానేకవృక్షములతోఁ గూడినవై యా యాశ్రమమునఁ బ్రత్యక్షమయ్యెను. శుభ్రములయిన బవంతు లును, గుట్టిపు లాయములును, గజ శాలలును, మేడలును, రాచనగ ళ్లును మేలిమి తోరణములతోఁ గూడ నగపడినవి. మఱియు శరత్కాలమందలి మేఘమువలెఁ దెల్లనిదియుఁ, దెల్లని పుష్ప మాలికలచే నలంకరింపఁబడినదియు, మేలైన కలయంపి చల్లబడి నదియు, నిఱుకు లేకుండునట్లు నాలుగు మూలలు దీర్చినదియుఁ, బాన్పులు, పీటలు, వాహనములు గలదియు, నానావిధములగు దివ్య రసములతోఁ గూడినదియు, దివ్యభోజన వస్త్రాదుల గలదియు, సిద్ధము చేయఁబడినయన్ని తెఱఁగుల యన్నములతోఁ గూడి నదియుఁ, ముఱికిలేకుండ చక్కఁగాఁ దోమఁబడినపాత్రములతోఁ గూడినదియుఁ, జక్కఁగాఁ బఱిచఁబడిన సకలాసనములు గలదియునై, మేలిమి బట్టలచేఁ జక్కఁగాఁ బఱిచఁబడిన యుత్తమ శయనము లతోఁ గూడి యొప్పారుచున్న రాజభవన మావిర్భవించెను. అంత, దీర్ఘబాహుఁడగు కైకేయీపుత్రుఁడైన భరతుఁడు భరద్వాజుని యనుజ్ఞ వడసి, సకలవస్తు సంపూర్ణమైన యా గృహమునఁ బ్రవేశించెను. వెంటనే మంత్రు లందఱును బురోహిత పురస్సరులై యా భరతుని వెంబడించి, యా విడిదల యవుఁరికం దిలకించి సంతోషభరితులైరి. అంత భర తుఁడును మంత్రి సమేతుఁడై యచ్చట నున్న శ్రేష్ఠమగు సింహాసనమున కును, వింజామరలకును, దెల్లని గొడుగునకును, రాజునకుఁబోలెఁ బ్రద క్షిణ నమస్కారము లొనర్చెను. సింహాసనము రామునికొఱకె యని తలఁచి, యా సింహాసనమునకుఁ జేయవనే మంత్రులు కూర్చుండఁదగిన యొక యాసనచామరమునుపుచ్చుకొని గూర్చుండెను. అనంతరము పురో హితుండును, మంత్రులును, వారికి వెనుబడి సేనాధిపతియు, శిబిరనాయ కుండును గూర్చుండిరి. అంతట భరద్వాజుని యాజ్ఞవలన బురదవలె

చిక్కనైన పాయసమున ప్రవహించునదు లా భరతుని ముందరఁ బ్రవహించుచుండినవి. ఆ నదికి నిరుప్రక్కలను భరద్వాజమునీంద్రుని యనుగ్రహమునఁ దెల్లని పాలగారతోఁ బూయబడిన రమ్యములయిన దివ్యములగు గృహము లేర్పడినవి. అక్షణమందనే దివ్యములైన సొమ్ము లను దాల్చిన యిరువదివేలమంది యప్సరసలు బ్రహ్మదేవుని పనుపున నా భరతుని ముందట నిల్చిరి. వెండియుఁ గుబేరునిచేఁ బంపఁబడిన యిరు వదివేలమంది స్త్రీలు రత్నములు, ముత్తైసులు, పటడములు మొదలగు వానిచే నిర్మితములయిన భూషణములను దాల్చి, శోభిల్లుచు నేతెంచిరి. పురుషులను వెట్టివారినిగఁ జేయఁగలంత సొబగు మీఱుచేయున్న యప్స రస లిరువదివేలమంది నందనవనమునుండి వచ్చి నిలిచిరి. నారదుఁడు, తుంబురుఁడు, గోపుండు ననుగంధర్వరాజు భరతునిముందటి కేతెంచి, గానములఁ గావించిరి. అలంబుస, మిశ్రకేశి, పుండరీక, వామన మున్నగు నప్సరసలు భరతునిముందర నాట్యమాడిరి. చైత్రరథమున నెయ్యైన పుష్ప ములు గలవో యవియెల్లను భరద్వాజానుశాసనమునఁ బ్రయాగక్షేత్ర మున నావిర్భవించినవి. ఆచ్చట బిల్వవృక్షములు మృదంగములు వాయించువారుగను, తాండ్రచెట్లు తాళములు వేయువారుగను, రావి చెట్లు నర్తకులుగను నైనవి. మఱియు నచ్చటి సరళవృక్షములును, దాటిచెట్లును, బొట్టుగుచెట్లును కానుగుచెట్లును సంతోషపరవశములై ముసీంద్రు ననుగ్రహమున మఱుగుజ్జులును, పొట్టివియునైనవి. మఱియు నా భరద్వాజ ముసీంద్రుని యాశ్రమమున శింశుపావృక్ష ములు, ఉసిరికచెట్లు, నేరేడుచెట్లు, మఱి యనేకములయిన వన్యములగు వృక్షములును, మొల్లలు, జాజులు మొదలగు వనమునందలి తీఁగెలును స్త్రీ రూపము దాల్చి యా వనమున సంచరించుచుండినవి. "ఓ సైనికు లారా! మద్యపానము చేయువారందఱు యథేష్టముగాఁ బానము సేయుఁడు. ఆకలిగొనినవారు మాంసాన్నము గుడువుఁడు. మిక్కిలి పరిశుద్ధములయిన మాంసములను గోరినంత దినుఁడు" అని యా వృక్షములు చెప్పినవి. కాంత లేడుగు రెనమంద్రు గలిసి, సైని కుల నొక్కొక్కనికిని నలుగురు పెట్టి రమ్యములయిన దోటిగట్టులందుఁ గూర్చుండఁబెట్టి స్నానము చేయించిరి. మఱియు సుందరమైన కన్నులు

గల నలువురు ప్రమద లేఁగుదెంచి, యా సైనికుల కొడళ్ళ తుడుచుచుఁ గాళ్లు పిసుకుచు, మద్యము నొండొరులచేఁ ద్రాగించిరి. అంతట మహా బలు లగు వాహనముల కాపరు లిక్ష్వాకువంశపు జోదుల వాహనములయిన వాజిగజోష్ట్రవృషభములకుఁ జక్కఁగాఁ గడ్డి మొదలగు నాహారములను వాసికిఁ దగినట్లుగాఁ బెట్టి, జెఱుకు ముక్కలను, తేనె గలిపిన వేలాలను బెట్టిరి. సైనికులు భక్ష్యపానను చేసి, మై మఱచి, ప్రక్చందనాది భోగవులచేఁ గడు మోదము నంది వెలుఁగుచుండుటం జేసి, యేనుఁగులఁ గట్టువా రేనుఁగులను, గుఱ్ఱములఁ గట్టువారు గుఱ్ఱ ములను గుఱుతు దెలియకుండిరి. సైనికు లంద ఱెఱ్ఱని గంచము నలందు కొని, కోర్కులన్నింటిని బొందుటచేఁ దనివి పడసి యుచ్చరలతోఁ గూడి యానందించుచు "మే మిఁక నయోధ్యకును బోవము. దండకారణ్య ములకుఁ బోవము. భరతుఁడును, రాముఁడును లేమముతో నుందురు గాక!" యని పలుకుచుండిరి.

ఇ ట్లెఱిఁగిన భరతుని వెంబడించిపోయెడు కాలిబంటులను, గుఱ్ఱపు రౌతులు, మూవటీంద్రును, గుట్టిముల నేనుఁగులఁ గట్టివేయు వారును మునీంద్రుని యాశ్రమమునఁ జేయఁబడిన సకలోపచారముల ననుభవించి స్వేచ్ఛమైఁదిరుగుచు, వేలకొలఁది గుంపులు గుంపులుగూడి సంతోషాతిశయముచే నొడలు తెలియక, "ఇది స్వర్గమే" యని యరచి చెప్పుచుండిరి. సైనికులలోఁ గొందఱు పుష్పమాలలను దాల్చినవారై గుంపులు గూడి నాట్యమాడిరి. కొందఱు పకపక నవ్విరి. కొందఱు పాటలుపాడిరి, కొందఱు నలువైపులకుఁ బరుగెత్తిరి. ఆ సైనికు లమృ తమునఁబోలు నా యన్నమునఁ గుడిచినను, నచ్చటి దివ్య భక్ష్యములను జూచి, తమ కాఁకలి లేకున్నను, నింకను దినఁ దలంపుగలవారై యుండిరి. సేసలం దుండు పనికాండ్రు, పనికత్తెలు, వయసున నున్న సైనికుల యంగనలును నూతన వస్త్రములను దాల్చి, మిక్కిలి మత్తిల్లిరి. ఆ సేనలలోఁ దెల్లని బట్టఁ గట్టనివాఁడును, దుమ్ముపడి తలమాసిన వాఁడును, నాఁకొన్న వాఁడును,ముసలికిగలవాఁడు నొక్కఁడయినను గాన రాఁడయ్యెను. ఏనుఁగులు, గుట్టిములు, ఎద్దులు, ఒంటెలు, వేసడములు, మృగములు, పక్షులు భరద్వాజమునీంద్రునిచేఁ గల్పింపఁబడిన

యాహారమునే భుజించి తనివినొందినవికాని, వీనికైయొరు లే యాహార
మును గల్పింపరైరి. అయ్యాశ్రమమున మేకలయు, వరాహములయు
మాంసములు; మేలయిన వ్యంజనములు, పండ్ల రసములుచేర్చి పక్వము
చేయఁబడియున్న సుగంధ రసములతోఁ గూడిన సూపములు, పూవుల
పెక్కేములతోఁగూడిన తెల్లని యన్నరాసులును గల లోహపాత్రము
లను జనులందఱు మహాశ్చర్యముతోఁ జూచిరి. వన సమీప ప్రదేశ
ములం దుండు బావులు చిక్కని క్షీరాన్నముతోనిండియుండెను.
గోవులు కోరిక్కలు పితుకువనియైయుండెను. వనద్రుమములు తేనియలు
గార్చుచుండెను. అచ్చటి నడబావులు మైరేయమను మద్యముతో
నిండియుండినవి. గొప్ప పాత్రములలోఁ జక్కఁగా వండిన మయూరము
లయు, మృగములయుఁ, గోళ్ళయు మాంసము యథేష్టముగానుండెను.
అచ్చట పేలకొలఁది యన్నము వడ్డనచేయు తట్టలును, వ్యంజనము లుంచు
పాత్రములును, లెక్కలేని బంగారు కంచములును, చక్కఁగా సంస్కా
రింపఁబడిన పెరుగుతో నిండిన కుండలును, చిన్నపంటులును, వెడల్పు
నోరుగల చట్టులును నుండినవి. కొన్ని సరస్సులంత క్రొత్తదియు
నంతప్రాఁతదియుఁగాని వెలఁగపండ్ల వాసనగల మంచి మజ్జిగతోఁ నిండి
యుండినవి. మఱికొన్ని చక్కఁగాఁ దాళింపువేయఁబడిన రసాలమనఁ
బడు తెల్లని మజ్జిగ నిండియుండినవి. మఱియుఁ బాయసముల మడుగులు
చక్కెరరాసులు నక్కడ వెలయుచుండినవి. సైనికులు నదీతీరములందుఁ
బాత్రలం దుంపఁబడిన యుసిరిక పిండిముద్దలను, సుగంధ చూర్ణము
లను, నానావిధములగు స్నానసామగ్రిని, వేఁడినీటి హాండీలను జూచిరి.
తెల్ల కూర్చుగల పండ్లుతోము పుల్లలను; డబ్బీలలోఁ బెట్టఁబడిన తెల్లని
చందనములను, నిర్మలములైన యద్దములను, వస్త్రరాసులను, వేల
కొలఁది చెప్పులజోళ్ళను, కాటుకబరణులను, దువ్వెనలను, విసనములను
దువ్వుకొను నొక తెఱఁగు దువ్వెనలను, నస్త్రములను, విండ్లను, విచిత్ర
ములైన కవచములను, పాన్పులను, పీఠములను; గజ, అశ్వ, ఖర,
ఉష్ట్ర ములు నీరు త్రాగుటకుఁ దగిన నిండుమడుగులను కలువలు తామర
పువ్వులు గల్గి యాకసముమాడ్కి నిర్మలమయి నీటితోనిండి, సుఖముగా
దిగి స్నానముచేయఁదగిన మడువులను, పసులమేతకై చేర్చిపెట్టిన సీల

వైడూర్యముల రంగుగల మెత్తని గడ్డిమోపులను గలయఁజూచిరి. భరతునికై భరద్వాజమునీంద్రునిచే సిద్ధముచేయఁబడిన, స్వప్నమాయనఁదగియుండు నాశ్చర్యకరమైన యావిందునుజూచి సైనికులందఱు విశేషాశ్చర్యము నొందుచు వేల్పులమాడ్కి— గమ్యమగు నా భరద్వాజాశ్రమమున విహరించుచుండఁగా నారేయి గడచిన దాయెను. వేకువనే భరద్వాజుని పిలుపుచే వచ్చిన నదులు దేవ గంధర్వులు, సకలాప్సరసలును మునీంద్రుని వీడ్కొని తమతము నావరణంబులకుఁ జనిరి. భరతుని సైనికులును మద్యపానమునేసి, శ్రేష్ఠమైన యుగుసు గంధము నలఁదికొని, నానావిధ పుష్పహారములను ధరించి, యా పుష్పహారము లెల్ల వాడి, నలఁగి రాలిపోవునట్లు విహరించుచుండిరి.

92-వ సర్గము.

భరతుఁడు చిత్రకూటమునకుఁ బఱతెంచుట

పురుషశ్రేష్ఠుఁడయిన భరతుఁడు సేనలతోడ, భరద్వాజమునీంద్రుఁడు చేసిన యతిథి పూజను బడసి, యారేయి యెల్ల నక్కడనుండి, మఱునాటివేకువ లేచి, రాముని జూడఁగోరి, యా భరద్వాజ మునీంద్రుకడ కేగుదెంచి చేతులు జోడించికొని నిలఁబడియుండఁగా, భరద్వాజ మునీంద్రుఁ డగ్నిహోత్రకార్యములను దీర్చుకొనినచ్చి భరతుంజూచి, "ఓ పాపరహితుఁడా! మా యాశ్రమమున నీకిరేయి సుఖముగాఁ గడచినదిగదా! నీ సైనికు లందఱు నేఁ జేసిన విందుచేఁ దనివి నొందిరిగదా" యని యడిగెను.

భరతుఁడు చేతులు మోడ్చి, యాశ్రమమునుండి వెడలివచ్చినట్టి శ్రేష్ఠమగు బ్రహ్మతేజస్సుగల యమ్మునీంద్రునికిఁ బ్రణమిల్లి, "ఓ భగవంతుఁడా! నేను, నాసైనికు లందఱును, నా మంత్రులును తమ రొసఁగిన విందుగొని, యన్ని కోర్కెలను బడసితిమి. నా సేనలోని గజాశ్వవృషభ ఖరోష్ట్రాదులు దనివిదీర నాహారము గొనినవి. మే మందఱము దారి బడలికను, బెట్టను బోఁగొట్టికొని, చక్కఁగా భుజించి, అనుకూలములగు విడిదలందు వసించి, తమ రేర్పఱచిన బంటు లొసఁగు పాద సంవాహనాద్యుపచారములను బడయుచు మిక్కిలి హాయిగాఁ బరుండి నిద్రపోతిమి. ఓ పూజ్యుఁడగు, ఋషీంద్రా! మాయన్నను జూడఁ బయ

నమై యున్నాను. నాకు నెలవిండు. నన్ను నెనరుచూపుతోఁ జూడ వలయును. ఓ ధర్మజ్ఞా! ధర్మమండే చింతగల మహాత్ముఁడయిన మా యన్న యుండు నాశ్రమమున కే దారిని బోవలయును? అది యిచ్చటి కెంతదూరము? ఈ విషయము సవిస్తరముగా నెఱింగింపవే" యని యడుగఁగా, గొప్ప తపస్సుగలవాఁడును, బ్రహ్మతేజస్సుగలవాఁడును నైన యమ్మునిపుంగవుఁడు తోఁబుట్టువుఁ డెక్కువ మక్కువ గలిగి యుండు నా భరతునితో నిట్లనియె. "ఓ భరతా! యిచ్చటికి రెండున్నర యోజనము దూరమున నొక డేకాంతవనమున నా చిత్రకూట పర్వత మున్నది. అవనము నానుకొని మందాకిని ప్రవహించుచున్నది. ఆ నది యిరు దరులును వ్రాఁచిన చెట్లతోడను రమ్యములయిన పుష్పవంతము లగు వనములతోడను గూడి యొప్పుచున్నది. ఆ నదికి దక్షిణమునఁ జిత్రకూటమను పర్వతము రమణీయమగు చదునైన కాననము గలదై పెంపొందుచున్నయది. ఆ నదీపర్వతముల నడుమన నా రామలక్ష్మణుల యాశ్రమ మిట్లున్నది. ఆ పర్ణశాలయందే వారు వాసముచేయుచున్నారు. రఘునందనా! సేనానాయకుఁడును, మహాత్ముఁడునగు భరతుఁడా! చతు రంగబలముతోఁగూడిన యీ సేన నిచ్చటనుండి దక్షిణముగాఁగాని, నైరృతిమూలగాఁగాని పోనిమ్ము. అట్లు పోయితివేని, నీవు రఘురాముని జూడఁగలవు." దశరథనృపాలుని కాంతకు ప్రయాణమున్న సంగతి విన్న వాఁడై మునీంద్రుని బ్రణమిల్లుటకై, తమతమ పల్లకులనుండి డిగ్గి, భర ద్వాజమునీంద్రుని జుట్టుకొనిరి. అంతట దుఃఖముచే గృశించియున్న కౌసల్య వణఁకుచు, మునీంద్రుని పాదములకుఁ బ్రణమిల్లెను. సుమి త్రయుఁ గౌసల్యకు వెంటనే మునీంద్రుని చరణముల కెఱఁగెను. వా రిరువురు మ్రొక్కులిడిన పదంపడి, జనులందఱిచే దూఱఁదగిన కైకేయి, తన కోర్కి నెఱవేఱినిచే సిగ్గుతోఁ దలవంచుకొని, యమ్మునీంద్రుని పాదములకు మ్రొక్కి, భగవంతుఁడయిన యమ్మునీంద్రునికిఁ బ్రదక్షి ణము గావించి, భరతుని చేరువనే, దీనమయిన మనముతో నిలఁబడి యుండెను. అప్పుడు నియమముఁ దప్పని భరద్వాజమునీంద్రుఁడు భర తునిఁజూచి, "రాఘవా! నీ తల్లులపేరులు మున్నగునవి దెలియఁగోరు చున్నాను. తెలిపింపు" మని యడుగఁగా, మాటల నేర్పుకాఁడైన

ధీమంతుఁడగు భరతుఁడు భగవంతుఁడైన భరద్వాజ మునీం
ద్రునిఁ జూచి, "ఓ మహాత్మా! నేము నిన్ని థానమున దుఃఖముతోఁగూడి,
యాహోరము భూమినుటచేఁ జిక్కిపోయుండుదుము నీ యమ్మ కౌసల్య. ఈమె
నృపాలునకిఁ బట్టంపుదేవి. పురుషశ్రేష్ఠుఁడును సింగమును బోలు మగఁటిమి
గలవాఁడునైన రాముఁడు దీనికిఁ బ్రథమపుత్రుఁడు. ఈమె కౌసల్యకుఁ
బుట్టెను. ఈపెయొక్క రెండవ భుజమునుగు గౌఁగిలించుకొని, యడవి
యందుఁబుష్పములు రాలిపోయిన కొండగోఁగు చెట్టు కొమ్మ లే పగపాలయి
యున్న చందమే సుమిత్ర. ప్రశ్వనీపేపతలనుబోలువారును, సాటిలేని
పరాక్రమము గలవారిను, జోడులునైన యీమె శత్రుఘ్నుల్ని లిద్దఱు
నీ దేవి కుమారులే. ఎవఁతె మిత్రము సర్వశ్రేష్ఠులయిన రాములక్ష్మణులు
ప్రాణములవిాఁది యాశ మాని, యడవులపాలయిరో, పుత్రశోకముచే
నృపాలుఁడు స్వర్గమునొందెనో, యట్టి క్రోధశీలురాలును, బుద్ధిహీను
రాలును, గర్వితురాలును, దన్ను రూపవతినిగాఁ దలఁచినదియు, రాజ్యా
పేక్షగలదియుఁ, జెడ్డబుద్ధియుఁ, జెడ్డతలంపును గలదియు, గొప్పదాని
వలెఁ గానిపించునదియునైన ఘాతుకురాలగు నీ రాజపుత్రిని కైకేయి
యని యెఱుఁగుఁడు. ఈమెయె నాయొక్క తల్లి. ఈమెవలననే నాకు
గొప్ప వ్యసనము సంభవించినది" అని పలికి భరతుఁడు కన్నీ లెల్లఁజేసి,
కనలి బుసకొట్టుచున్న పామువలె నిట్టూర్పునిడుచుచు డగ్గుత్తికతో నిట్లు
నుండెను. బుద్ధిశాలియగు భరద్వాజమహర్షియు నత్తెఱఁగునఁ బలికిన
భరతుని జూచి, యర్థగౌరవముగల మాటలతో "ఓ భరతా! కైకే
యిపైఁ దప్పులుమోపి యాపెను నిందింపఁజనదు. రాముఁ డరణ్యము
నకుఁ బోవుటవలన ముందు మేలు గలుగనున్నది. ఆ రాముని వనవాసము
వలన దేవదానవులకును, భగవద్ధ్యానపరాయణు లగు ఋషులకును
మేలే కలుగగలదు." అనిభరతునితోఁ జెప్పెను.

అంత భరతుఁడును యాతని దీవనలువడసి, మునీంద్రునికిఁ
బ్రదక్షిణ నమస్కారములఁ జేసి, యాతనిని వీడ్కొని, సుమంత్రునిఁ
బిలిచి, సేనలను తులింపు మని యానతిచ్చెను. అంతట సైనికు లందఱు
ప్రయాణమయి, బంగారు భూషణములతో నలంకరింపఁ బడినవియు,
సొగసయినవియు నైన మేటి గుఱ్ఱములను బూన్చిన బండ్లనెక్కిరి.

ఱులుములతోఁ గూడిన వర్షాకాలమునందలి మేఘములవలె బంగరు తొడవులు దొడిగిన యేఁడేనుఁగులును నేనుఁగులును రెక్కెములతోడఁ గూడి వెడలినవి. మఱి యనేకములైన చిన్నవి గొప్పవి యగు గుఱ్ఱములు, వేఁడములు మున్నగు జగత్ప్రలఁబూన్చిన యానములును బయలువెడలినవి. బంటులు కాలినడకతో వెడలిరి. అంతటఁ గౌసల్యా మొదలగు మగువ లందఱు రాముని దర్శనముఁ గోరి, సంతోషముతోఁ మేటి పల్లకులమీఁద నెక్కి వెడలిరి. అంబగాఁడగు భరతుఁడు సూర్యచంద్రులమాడ్కి వెలుఁగుచున్నదియుఁ, జక్కఁగాఁ బఱపఁబడినదియునైన సొగసగు పల్లకిమీఁద సపరివారముగాఁ నెక్కి దఱలెను. గజాశ్వభట యుక్తమయిన యా భరతునిసేన, మహానందభరితమై, గంగానది యావలిగట్టున దక్షిణదిశయెల్ల వ్యాపించియున్న కారుమబ్బువలె దక్షిణదిక్కు నంతయుఁ గ్రమ్ముకొని, యచ్చట నదులందును గొండలందును నున్న మృగపక్షులతోఁ గూడిన వనముల దాఁటుచు, నచ్చటి మృగపక్షుల గుంపులను వెఱపింపుచు నా గొప్ప వనమునఁ జొచ్చి ప్రకాశించుచుఁ బోవుచుండెను.

93-న సర్గము.

భరతుఁడు చిత్రకూటముఁ జూచుట

ధర్మశీలుఁడగు కాంతిమంతుడయిన భరతుఁడు సుతసము నందిన వాఁడయి, సముద్రమునుం బోలిన దౌటచే, వానకాలమున గొప్ప మబ్బాకసమును గ్రమ్మినమాడ్కిఁ బుడమియెల్లఁ గ్రమ్మివదియు, వనములందలి మత్తిల్లిన మేటి యేనుఁగుల మొత్తములను వెఱపించునట్టియు, రొద గలదియు నయిన చతురంగబలముతోను, నేల యగుపడకుండునట్లు వ్యాపించి వేగవంతములయిన గజాశ్వముల సమూహాములతోను గూడినవాఁడై, యా వనములందును పర్వతములందును నెల్లెడలఁ గనఁబడుచుండు నెలుఁగుబంట్లను చారులుగల జింకలను, చుక్కలులేని గొప్ప శరీరముఁగల దుప్పులను జూచుచుఁ జాలదూరమేఁగి, గుఱ్ఱము లలయుటచేఁ గొంత వడి తగ్గించి, మంత్రవేత్తలలో నుత్తముఁడగు వసిష్ఠునిఁ జూచి భరద్వాజమునిం బ్రఁ డెట్టి రూపముగలదని చెప్పెనో, నే నెట్టిదని వింటినో, అట్టి రూపముఁగల ప్రదేశమునకు వచ్చితిమి. ఇదిగో చిత్ర

కూటపర్వతము! ఇదిగో మందాకినీ నది. దానికి దాపుననే నల్లని కాఱు మబ్బుఁ బోలిన యొక వనము గన్పట్టుచున్నది కొండలను బోలిన మన యేనుఁగు లీ మనోహరమ్మైన చిత్రకూటము చుఱియలను త్రొక్కి పాడుచేయుచున్నవి. వస్త్రగ్వనందు నీటితోఁ గూడిన నల్లని మబ్బు లుదకముఁ గుఱియున ట్లొకొండల నెత్తములందుండు నీ చెట్లుపువ్వులను రాల్చుచున్నవి. ఓరి శత్రుఘ్నా! జలజంతువులచే నిండిన సముద్రము పోలె మెకములచే నంతట నిండినదియుఁ, గిన్నరుల కునికిపట్లును నైన యీ వనము సొంపును బొగడఁజూడుము. ఈ మెకముల గుంపులు, గాలిచే నాకసమునఁ జెదరగొట్టఁబడిన శరత్కాల మేఘమువలెఁ గడు వేగముతోఁ దోలఁబడినట్లు పోవుచున్నవి. దాక్షిణాత్యులగు నరులు మబ్బువలె నల్లనైన తమ వెండ్రుకలను బలుకలుగాఁ దీర్చి పూవుల దుఱుమున ట్లోషధము లన్నియుఁ బుష్పయుతములయిన శిరో భూషణములను నల్లని కొనలందుఁ దాల్చుచున్నవి. తొల్లి నిశ్శబ్దముగ భయంకరమయియుండిన యీయరణ్య మిప్పుడు మనసేనలతోఁ నిండిన దయి యయోధ్యానగరమునవలెఁ గానుపించుచున్నది. ఈ మన గుట్టి ముల గొరిజలచే లేపఁబడిన దుమ్మాకసమును గ్రమ్మియున్నది. నాకు హితము నాచరించుదానివలె గాలి యీదుమ్మును గొట్టుకొనిపోవు చున్నది. శత్రుఘ్నా! యీ యరణ్యమునందు వడిగల గుట్టిములను టూన్చి సారథులు తోలుచున్న రథము లెత వడిగాఁ బఱతెంచు చున్నవో చూడుము! ఇవిగో మనోహరములయిన నునుపు తెక్కలు గల నెనుళ్లు రథముల చప్పుడునకు వెఱచి, తముగయునికిపట్టగు నీపర్వత మునకు వచ్చుచున్నవి. ఈ తాపసుల కునికిపట్టగు నిప్పట్టు స్వర్గమువలె నా మనమున కతి రమ్యముగాఁ దోఁచుచున్నది. ఇచ్చట ననేకములగు తెల్లచుక్కల మృగములు దము యీఁడుమృగములతోఁ గూడి పుష్ప ములచే నలంకరింపబడినవానివలె మనోహర రూపములు గలవిగాఁ జూపట్టుచున్నవి. రామలక్ష్మణు లెచ్చట నివసించుచున్నారో, తెలియున ట్లీ సైనికు లందఱు వెడలి చక్కఁగా వెదకుని ట్లుద్యోగపుచేయుఁడు" అని భరతుఁడు చెప్పెను. సైనికు లందఱు భరతుని వాక్యము విన్నవెంటనే యాయుధము లెత్తికొని, కొంతదూరముచని, యొక్కచోటఁ బొగ

యొగయుచుండుటఁ జూచి, వెనుకకు మఱలిచ్చి, "రాజపుత్రా! మను ష్యులులేని ప్రదేశమున ధూమముపొడమదుగదా! కావున రామలక్ష్మణు లిచ్చటనే తప్పక యుండవలయును, అట్లు శత్రుసంతాపనులయిన రామ లక్ష్మణు లిచ్చట నుండకేని, రామునిబోలెడు ధైర్యశాలురగు మును లయిన నిచ్చట నుండితీరవలయు"నని భరతునితోఁ జెప్పిరి. శత్రుసేనలను హింసించు భరతుఁడు వారు చెప్పిన మిక్కిలి యిష్టమైన వాక్యమును విని, యా సైనికుల నందఱిఁ జూచి, "మీ రిచ్చట జాగరూకులై యుండుఁడు. ఇచ్చటినుండి పైకిఁ బోవలదు. వీనును, సుమంత్ర వసిష్ఠ మహామునులం దోడ్కొని చనియెదను" అని యానతీయఁగా, సైనికు లంద ఱిచ్చటనే నిలిచిపోయిరి. భరతుఁడును పొగ పోఁబడి కస్పష్టు చున్న ప్రదేశమునకుఁ దలిపోయెను. భరతునిచే నచ్చటనే నిలుపఁబడిన యా సైనికులు, ఒకకుఁ బ్రియుఁడైన రాముని ద్వారలోఁ గలిసికొనఁ గలమని మిక్కిలి యూహంపఁజొచ్చి యా ధూమమువైపునకే చూచుచు నిల్చియుండిరి.

94- వ స ర్గ ము.

రాముఁడు సీతకు చిత్రకూటముసొంపుఁ జెలుపుట

భరతుఁ డిట్లు చిత్రకూటము చేరువనుండఁగా, నచ్చట దేవతల కెనవచ్చువాఁడును, పర్వతములందును వనములందును సంచరించుట యందుఁ బ్రేమగలవాఁడునునైన రాముఁ డొక్కనెల యా చిత్రకూట పర్వతమున నున్నవాఁడై, తన కాంతయగు సీతకు మనస్సంతోషము గలిగింపఁగోరియుఁ, దన మనమునకు సైతము గొంచెము విశ్రాంతి గోరియు, దేవేంద్రుఁడు శచీదేవికిఁ బోలె నింతఁ గొలిపెడు చిత్రకూట పర్వతము సొంపును సీతాదేవికిఁ జూపఁగోరి, "ఓ మంగళకరీ! యీ మనోహరమైన పర్వతమును జూచిన పదంపడి, రాజ్యము కోలుపో వుటకాని, చెలికాండ్రఁ బాసియుండుట కాని నా మనమునకుఁ గించిత్తయినను శ్రమము గానింపకున్నది. ఓ కల్యాణీ! పలుతెఱఁగులైన పక్షుల గుంపులతోఁ గూడినదియు, గైరికాది ధాతుమండితమునై యొకసము నొఱయుచున్న కొనలచే వెలుఁగుచున్నదియునైన యీ పర్వతమును జూడుము. ఇచట గైరికాది ధాతువులచే నలంకరింపఁబడిన ప్రదేశము

లలోఁ గొన్ని వెండివలెఁ దెల్లగను, మఱికొన్ని నెయ్యురువలె నెట్టిగను, వేఱొక కొన్ని పసుపు పచ్చనివన్నెయుఁ జిత్రవర్ణములుఁ గలవిగను, ఇంకను కొన్ని శ్రేష్ఠములైన రత్నముల కాంతులు గలవిగను, మఱికొన్ని పుష్యరాగములయు, స్ఫటికము, మొగలిపూలయువన్నెలు గలవిగను, వేఱుకొన్ని నక్షత్రములయొక్కయుఁ, బాదరసమువొక్కయుఁ గాంతి గలవిగను విరాజిల్లుచున్నవి. మఱియు నీ పర్వతము సౌమ్యములయిన పలుజాతుల మెకముల గుంపులు, పులులు, చిఱుతపులులు మొదలగు భీకరములయిన మృగములతోను, పలుజాతుల పక్షులతోను, పుష్ప ఫల భరితనులయి, నీడగలిగి, మనమునకు నింపుగుల్కుచుండునవియునైన మామిడి, నేరేడు, వేగిస, లొద్దుగ, మోరటి, పనస, చండ్ర, ఉడుగు, పెద్దతినాశము, మారేడు, వెదుగు, పెద్దమ్మడి, వేము, ఉలిమిరి, ఇప్ప, బొట్టుగు, రేఁగు, ఉసిరిక, మంకెన, వీఱుమద్ది, దాడిమ్మ మొదలగు మహావృక్షములచే శోభిల్లుచు సొంపువిరాజీయున్నవి. ఓ కాంతా! చూచితివా యీ రమణీయములగు కొండ చఱులందుఁ జూపఱకు గగుర్పాటొదవించుచుండు కిన్నరదంపతులు వేడ్కమీఱి నొండొరులమీఁద ప్రేమగలిగి విహరించుచున్నారు. ఇచ్చట విద్యాధరులు తమ యాయుధములను, మేలిమి పుట్టములను చెట్ల కొమ్మలకుఁ దగిలించియున్నారు. ప్రియా! విద్యాధరాంగనలు విహరించెడి యీ రమ్యప్రదేశములను జూచితే! ఈ పర్వతము గొన్ని ప్రదేశములందుఁ బైనుండి పడు సెలయేటి ప్రవాహములతోను, నచ్చటచ్చటఁ బుడమినుండి పుట్టిననీటిబుగ్గలతోను, నూఁటలతోను, గూడి కాఱుచున్న మదముగల మేటి యేనుఁగుఁబోలి వెలయుచున్నది. గుహాలనుండి నచ్చెడి గాలి పలు పువ్వుల నెత్తావులను గొని, ఘుమఘుమయని పరిమళించుచు వీచుచున్నవి. ఈ సువాసనగల గాలి సోఁకిన నెట్టిమూఁసవునకైన నీప్రదేశమును విడిచిపోవ మనముఁ రాదు. ఓ సొగసుఁదానా! నీతోను, లక్ష్మణుని తోనుగూడి యిచ్చట నెన్నియేండ్లున్నను, రాజ్యభ్రంశముచలని విచారము నన్నేమియుఁ జేయనేఱదు. ఓ భామినీ! యనేక పక్షి సంఘములతోఁగూడినదియు, నానావిధములగు పుష్పఫలములతో నిండినదియునైన చిత్రశిఖరములుగల యీ పర్వతము నందుఁ బ్రీతిగలవాఁడనయి

తిని. ఈ వనవాసమువలనఁ దండ్రిఋణము దీఱుటయు, భరతునికోర్కి నెఱవేఱుటయునను రెండు ఫలములు గలిగినవి. ఓ జానకీ! మనోవాక్కాయములను జూఱఁగొను పలుతెఱఁగులగు స్వాభావిక వైచిత్ర్యములను జూచుచు నాతో చిత్రకూటమున సంతసముతోఁ గ్రీడించుచున్నావుగదా. ఓ రాణీ! మాతాత ముత్తాతలు మఱియుఁ బెద్దలగు రాజర్షులు దేహాంతమున మోక్షముఁ బడయుటకై, సంసార సుఖములు మాని, వనమున వాసముచేసి గని పెద్దలు చెప్పిరి. ఈ పర్వతమునందలి పెక్కులైన వెడల్పుగల బండలంతేటను నలుపు తెలుపు పసుపు నెఱుపు చిత్రవర్ణము మొదలగు రంగులుగలిగి శోభిల్లుచున్నవి. ఈ పర్వతమునందలి కొన్ని తీఁగెలు తమ కాంతులచే దెసలు వెలుఁగఁజేయుచు నగ్నిజ్వాలలమాడ్కిఁ దేజరిల్లుచున్నయవి. ఈ పర్వతమునఁ గొన్ని ప్రదేశము లింపైనవలెను, మఱికొన్ని తోఁటలవలెను, కొన్ని రొంటి రాయి మేడలవలెను నొప్పుచున్నవి. ఈ చిత్రకూట పర్వతము సర్వత్ర సొంపుమీఱియుండు శిఖరమునఁ గూడి భూమినుండి వైకి లేచినదో యనఁదగియున్నది. ఓ సీతా! యీ చిత్రకూట పర్వతముయొక్క శిఖరమును చూచితివా యెంత సుందరముగఁ గనఁబడుచున్నదో! నల్లకలువలు, సురపొన్నపుష్పాలు, భూర్జజీవి యను వృక్షముల పుష్పములు, భుజపత్రవృక్షములు, గమలదళములును వైనఁ బఱచిన కామునికుల యీ పాన్పులను జూచితివా? ఈ పెజ్జలందుఁ గామునికులు తమరు దాల్చిన, రతికేళీలందు నలఁగిన, తామరపూవుల దండలు దీసి పాఱవైచి యున్నారు. వారు సగము దిని పాఱనైచిన పలుతెఱఁగుల పండ్లెన్ని యున్నవో చూడుము. ఈ పర్వతము విస్తారమయిన కందమూల ఫల సమృద్ధియు, జలసమృద్ధియుఁ గలిగి, యీలకాపురమును, సౌగంధికనమును నుత్తర కురుదేశమును మించినదో యనఁదగియున్నది. ఓ సీతా! నేను నాక్షత్రియ ధర్మములను, పెద్దల నడవడులను దప్పక, నియమముతో నున్నవాఁడనై యిచ్చట నీతోడను, లక్ష్మణునితోను గూడి వనవాసకాలమును సుఖముగాఁ గడపఁగలను. అని చెప్పెను.

ఏభైవ సర్గము.

రాముఁడు సీతకు మందాకినీ నదీవైభవము చెల్లించుట

అంతట్టిఁ గోసలేశ్వరుఁడును, రామలక్ష్మణులంబోలు కన్నులు గలవాఁడునగు శ్రీరామునిఁ చూచి సీతయనీబోలు మోమునుగలదియు, సొగసు గలవాఁడునగు శ్రీరాముఁడు చూచి సీతను దోడ్కొని పర్వతము వెడలి కొంతదవ్వుగా, జేటి నీటితోఁ గూడినదిగాఁ, చూడఁజనుమల కింపు గులుకువదిగానున్నయున్న మందాకినీనది నామెకుఁ జూపి, "మోహిపియా! హంసలతోను, బెగ్గురుపక్షులతోను గూడినదిగాను, వింత గొలిపెడి యిసుక తిన్నెలుగలదిగాను, రామరపున్నగులతోఁ గూడినదియు, తీరము లందు నానావిధములయిన పూలచెట్లను, పండ్లచెట్లనుగలదిగాను, కుబే రునియొక్క సౌగంధికమునెడి కొలనివోఁడ్క వెలయుచున్నదిగానున్నయీ మందాకినీ నదిని జూడుము. ఇప్పుడే మృగములగుంపులు నీరు ద్రావినందునఁ గలకపాటేయుండు నీటితోఁగూడినవై యీ మందాకినీ నదియొక్క రేవులు నా మనమునకు సంతసము గొల్పుచున్నవి. ఓ ప్రియురాలా! ఋషులు పెక్కండ్రు వేకువనే లేచి, కృష్ణాజినములను మొలకుఁ గట్టుకొని, నారబట్టలను బైనఁ గప్పుకొని జడదారులై యీ మందాకినియందు స్నానము నేయుచున్నారు. ఓ వెడల్పు కన్నులదానా! వీరుగో మతికొందఱు ఋషులు కఠిన నియమములు వూని, చేతులు పైకెత్తికొని, సూర్యుని నుపస్థానము చేయుచున్నారు. పట్టువగాఁడు నాట్యమునను ముందుగాఁ బుష్పాంజలిని జల్లినట్లు, ఈ పర్వతము గాలి కెగిరిన వృక్షముల కొమ్మలనెడి హస్తములచే, నదిచుట్టును బుష్పాం జలులు చల్లుచున్నది చూడుము. కొన్ని చోట్ల ముత్తేములంబోలు తేట నీరుగలదియు, కొన్ని తామ్రపులం దిసుకతిన్నెలచే నొప్పినదియు, కొన్ని ప్రదేశములందు సిద్ధులచే శోభిల్లునదియునైన యీ మందాకినీ నదిని జూడుము. గాలికిరాలి దేటి నీటినడుమఁ బడి కొన్ని చోట్ల విస్తారము గను, మునిఁకొన్ని ప్రదేశములగుదు రాసులు రాసులుగనుబడి దట్టముగా నుండు వూవులను జూడుము. ఓ కల్యాణీ! శ్రావ్యమయిన కంఠధ్వనిగల చక్రవాకపక్షులు ఇంపుగఁ గూయుచు నావూవుల ప్రోవులపయి నెక్కు చున్నవి. ఓ సుందరీ! చిత్రకూటపర్వతమును జూచుటయు, మందాకినిం

గాంచుటయు నాకు నయోధ్యాపురమున వసించుటకంటెను, నిన్ను జూచుట కంటెను నెక్కువయని తోచెడి, ఓచెలీ! పాపములఁ బోఁగొట్టుకొన్న వారును,తపస్సిద్ధులును, వేదాధ్యయనము, ఇంద్రియ నిగ్రహము, ఓర్పు మొదలగు గుణములు గలవారును వగు మహాత్ములీ నదియందు స్నానముచేసిపోవుచుందురు. ఇట్టి పవిత్రమగునదియందు దిగిస్నానమొనర్పుము. నాతోడ రమ్ము. ఓ సీతా! నీ స్తనములయొక్కయు, జఘనముల యొక్కయు నొఱపుచేఁ గమలములను, తెల్ల తామర పూవులను నీటి ముంచుచుఁ జెలిక త్తెతోడనలె నాతోఁ గూడి జలమాడుము. ఓ వనితా! నీ వీ యడవియందుండు మృగములను పుగజనులనుగను, చిత్రకూటము నయోధ్యాపురమునుగను, ఈ మందాకినీనదిని సరయూనదినిగను నెంచుకొనుము. ధర్మముఁ దప్పనివాఁడగు లక్ష్మణుఁడు నా యానతిఁ దప్పక యున్నాఁడు. నీవు ననుకూలురాలవయి యున్నావు. నాకుఁ బ్రేమను గల్గించుచున్నావు. మీ రిద్దఱు నిట్లు నన్నానందింపఁజేయుచున్నారు. నీ తోడ నిచట నేను మువ్వాటుల స్నానముఁ జేయుచుఁ, దేనె, దుంపలు, గడ్డలు మొదలగువానిని దినుచు నిచ్చటనే యుండెదను. నా కయోధ్యయు నక్కఱలేదు. రాజ్యము నక్కఱలేదు. ఈ నది మృగముల సమూహములతోనిండినదియు, గజసింహవానరములు మున్నగు మృగములచేఁ ద్రావఁబడిన యుదకముతో నిండినదియు, చక్కఁగాఁ బూఁచిన పుష్పవృక్షములతోఁ గూడినదియునై మనోహరముగనున్నది. ఈ మనోహరమగు ప్రదేశమును గాంచినవెంటనే సకల శ్రమములు పాయును. ఇది సకల పాపములను దొలఁగించును." అని యిట్లు రఘువంశోద్ధారకుఁడగు రాముఁడు తనప్రియురాలగు సీతకు గంగానదిని గూర్చి యనేక విషయములఁజెప్పుచు, కాటుకవలె నొప్పారుచున్న యా రమణీయమగు చిత్రకూటపర్వతమునఁదమ విహరించుచుండెను.

96-వ సర్గము.

లక్ష్మణుఁడు రాముసికి భరతునియాత్రను దెలుపుట

ధర్మపరిపాలన తత్పరుఁడగు రాముఁడు మైథిలి కిట్లెఱుఁగునఁ బర్వత ప్రాంతమునఁ బాతెడి యానదియొక్క సొంపును జూపించి, యొక చటియయందుఁ గూర్చుండి, సీతాదేవికి మాంస భక్షణమునం దాశ

గలిగింపఁగోరి, "ఓ ప్రియా! యీ మాంసము పరిశుద్ధమైనది. ఇది రుచ్యమైనది. ఇది చక్కఁగా నిప్పులలోఁ గాల్చఁబడినది. దీనిని దినుము, దీనిని దినుమని యొక్కటొక్కటిగా నెత్తి చూపుచు నామెకుఁ దన నొసఁగుచుండెను.

వా రిట్లచ్చటఁ గూర్చుండియుండఁగా, చిత్రకూటము దాపునకు వచ్చిన భరతుని సైన్యముల కాలిత్రొక్కిడిచేఁ గలిగిన పరాగమును రొద యును మిన్ను ముట్టినవయ్యెను. ఈలోపల నప్పుడ్డతమున నుండిన మదించిన యేనుఁగుల మేటులు నుపాత్తరమైన సైన్యముల ఘోష ములను విని, మిక్కిలి భీతిల్లి, తరు కదంపులతోఁగూడి దిక్కుదిక్కులకుఁ బఱువిడిపోయినవి. రఘునందనుఁడును సైన్యములనుండి పుట్టుచున్న రొదను విని, మూల మూలలకుఁ బఱువిడుచుండు నా యేనుఁగుల గుంపులను జూచి, తేజస్సుచేఁ బ్రకాశించుచున్న సుమిత్రపుత్రుఁడగు లక్ష్మణు నుద్దేశించి, "లక్ష్మణా! యిది యేమి రొద? నీతల్లికదుపు చల్లఁగా నుండునుగాక! ఈ వైపు చూడుము. పిడుగువాడ్కి గుండె లవియించుచున్నది యీధ్వని! ఈ యరణ్యమునందలి గొప్పవనములలో మూలమూలలలో డాఁగియుండిన యేనుఁగు మొత్తములును, దున్న లును, ఇతరమృగములును సింగములకుబెదరి దిక్కుదిక్కులకుఁ ద్వరగాఁ బఱువిడుచున్నవి. రా జొండె, రాజంతటి గొప్ప ప్రభు వొండె వేఁటకు వచ్చిగమున్నట్లు తోఁచెడిని. లేక, ప్రారబ్ధమేదియైన వచ్చియున్నదో! కనుఁగొనుము! యీ పర్వతమునఁ బక్షులకుఁగూడ సంచరించుట యలవి కాదు. ఇట్టిచోట నీ గొప్ప రొద వినఁబడుటయు, మృగములు దిగు లొంది మూలమూలలకుఁ బఱుగులిడుటయు నేలనో వేగమే తెలిసి కొనుము." అని లక్ష్మణునితోఁ జెప్పెను.

అంత లక్ష్మణుఁడు వెంటనే లేచి, పుష్పించిన యొక వృక్షము నెక్కి, యెల్లదిశలఁ జూడఁగోరిన వాఁడయి దూర్పు దిక్కును బాఁ జూచెను. మొగము త్తరమునకుఁ ద్రిప్పిచూచుచు, రథగజతురంగ ములతోఁ గ్రిక్కిరిసినదియు, సన్నద్ధులయిన పదాతులతోను గూడినదియు నైన గొప్ప సేనను జూచి, "ఓయన్నా! గజాశ్వములతో నిండినదై, యరదముల మెక్కలచే శోభిల్లుచుండెడి యపారమయిన సేన యొక్కటి

యేతెంచుచున్నది. కౌసల్య సీతను గుహాయందు మఱిగాను నుంచి, విల్లెక్కుపెట్టి కవచము దొడిగి, బాణములను గైకొని సంసిద్ధుడవై యుండుము" అనెను.

పురుషోత్తముడగు రాముడును మఱల లక్ష్మణుని జూచి "సౌమిత్రీ! యీ సేన యెవరిదో చూడుము" అని చెప్పగా, లక్ష్మణుడా సేనపై నగ్నిహోత్రసమలె మండిపడి, చుఱచుఱ జూడ్కి నిగిడించి, "ఓ యన్నా! కైకకొడుకు భరతుడు పట్టాభిషేకం బొనర్చికొని, యంతటితోడ దనివిజాలక సకల సంపదలతో నిండిన రాజ్యమును నిష్కంటకముజేయుటకోసరి, మనలం జంపవచ్చుచున్నాడు. ఇది నిజము. ఇదిగో మిగుల నెత్తయినదియు, గాఢిగలదియునగు నెత్తు బోదెగల కాంచన వృక్షరూపమయిన కెక్కెము రథమున వెలయు చున్నది. గుట్టల్ల రౌతులు వేగముగా బఱతెంచు గుఱ్ఱములనెక్కి యిచ్చటికి స్వేచ్ఛగా నేతెంచుచున్నారు. వీరుగో, కొందఱు జోదులు గజముల నెక్కి మనముల మిక్కిలి యుప్పొంగుచు వెలువడుచున్నారు. శూరుడా! మనమును విల్లు చేతం బూని, పర్వతమును జేరుదము. కాదేని యాయుధములం దాల్చి పోరునకుం గట్టాయితముగ నిచ్చటనే యుందము. కాంచనపుం డెక్కెముగల భరతుని మనము జయింపలేమా? మన కితడు లోబడుడే. రామా! ఏ భరతుని నిమిత్తమయి నీకును, నాకును, సీతకును గొప్ప వ్యసనము ప్రాప్తించెనో, ఆ భరతుని మనము చూడగలనుగదా! ఓ రాఘవా! శాశ్వతమయియుండు రాజ్యమును బోగొట్టికొని, యెవని నిమిత్త మిట్లు, అడవిలో సీదుమఱం బడితివో, యట్టి శత్రువగు గండడయిన భరతుడు వచ్చుచున్నాడు. సకలవిధ ములం బ్రయత్నించి, అతనిని వధింపవలయును. నేనే యీపని నేసెదను. రఘునందనా! భరతుని జంపుటయం దే దోషము నున్నట్లు కాన్పింపదు. మొట్టమొదట నపకార మొసర్చినవారిం బరిత్యజించుటయం దే దోషమును లేదు. రఘునందనా! భరతుడు మొదట నపకార మొసర్చినవాడు. ధర్మము విడిచి మనపైకే వచ్చుచున్నవాడు. ఇతనిని బరిమార్చెదను. నీ వీభూమండలమునెల్ల నేలుము. రాజ్యమునం జేరాసగలదగు కైకేయియు భరతుడు పోరునందు నాచేం జచ్చినాం

డని విని కిడు డస్సినవై, యేనుఁగుచే విఱుగఁగొట్టఁబడిన చెట్టువలెఁ బడినవానిని జూచి, మిక్కిలి వగవఁగలదు. భరతునే కాక, కైకేయిని, దాని చెలిక తెలను, చుట్టములను సైతము చంపెదను. ఈ పుడమియు నీ పాపిష్ఠురాలిచే విడువఁబడుసుగాక! శత్రువుల యభిమానముఁ బోఁగొట్టువాఁడా! కసవు వామియందు నిప్పువెట్టినట్లు, ఇన్ని దినము లాఁపుకొనియున్న కోపమును, అవమానమును శత్రుసేనలపైఁ జూపెదను. ఇప్పుడే వాడితూపులచేఁ బగతుర యొడళ్ళు చిల్లులు వడనేసి, యీ చిత్రకూటమునందలి కాననమెల్ల నెత్తుటిప్రవాహముచేఁ దడిసిన దానిని జేసెదను. నాచే నాయపట్టులందు నాఁటున క్లేయఁబడినవై గుండెలు చీలినగుట్టములను, ఏనుఁగులను, మనుష్యులను క్రూరమృగము లీడ్చుకొనిపోయి తినునుగాక. గొప్పయుద్ధమునేసి భరతుని సేనలతోఁ గూడఁ జంపి, నే నెత్తిన బాణములయొక్కఁయు, విల్లుయొక్కయు ఋణముఁ దీర్చుకొందును. ఇది తప్పదు, నిజమని నమ్ముము" అని లక్ష్మణుఁడు రాముని తోఁ జెప్పెను.

97-వ సర్గము.

రాముఁడు లక్ష్మణుని కోపము చల్లార్చుట

రాముఁడు మిగులఁ గోపపడి, కడు నార్ద్రాటముతోఁ గూడిన వాఁడైయున్న లక్ష్మణు నోదార్చి యిట్లనియె. "లక్ష్మణా! మేటి విలుకాఁడైన గొప్ప పండితుఁడగు భరతుఁడు, తానే వచ్చినపుడు డాలు వాలుతోఁగూడిన ఖడ్గమేల? ధనుస్సేల? లక్ష్మణా! తండ్రి సత్యవాక్యము ననుసరించి నడచుకొందు నని ప్రతిజ్ఞచేసి, యిప్పుడు వచ్చిన భరతునిఁ జంపి రాజ్యము గైకొంటినేని, "భరతునిఁ జంపి తండ్రి భరతున కొసఁగిన రాజ్యమును రాముఁ డపహరించె"నని నన్ను జనులందఱు దూరుదురు గదా. అట్టు నిందలకుఁ బాలయిన, యీ రాజ్యము నేల నేల నేఁ గోరవలయు? నా కీ రాజ్యమే యక్కఱ లేదు.

లక్ష్మణా! బంధువులను చెలికాండ్రను జంపుటవలన నున్న కలిమిని విషము గలిపిన వంటకములను బోలె నే నెంత మాత్రమును గోరను.

లక్ష్మణా! నే నాయుధము చేతఁబట్టి యెట్టు పెట్టుకొని చెప్పు చున్నాను. తోఁ బుట్టువులు ధనవంతులఁను సౌఖ్యవంతులు నగు నిమి త్తమే ధర్మార్థకామము లనెడి త్రివర్గమును, రాజ్యమును గోరెదను గాని, నా కేమో దేహమిఁదను ఆశ లేదు.

లక్ష్మణా! నేను గాఁ దలెనన్న నీ చతుస్సముద్ర వలయితమగు భూమండలము నాకు దొఁకకపోదు. అయినను, అనార్యత్వముచే లభిం చిన దేవేంద్ర పదవినైనను నేఁ గోరను. భరతుని, నిన్ను, శత్రుఘ్నుని బాసి కలిగెడి సుఖము నిప్పులపాలగునుగాక! సోదరప్రేమగలిగి నాకు ప్రాణమఁకంటె మిన్నయైన భరతుఁ డయోధ్యకు వచ్చియుండును. అచ్చటఁ దండ్రి, కైకేయి మొదలగువాఁడు పట్టాభిషేకము సేయ నిర్బం ధము సేసియుందురు. అదియుఁ గాక, పురుషోత్తమా! శూరుఁడా! నేను దండ్రియాజ్ఞచే జటావల్క లాజినములను ధరించి, సీతతోను, నీతోను గూడ నిచ్చటికి వచ్చితి ననిన సంగతి దెలియఁగనే, పెద్దవాఁ డుండఁగఁ జిన్నవారు రాజ్య మేలుట మనయాచారము గాదని యెఱిఁగినవాఁడై, మనయందలి చెలిమిచేఁ గ్రమ్మఁబడిన మనసును, వ్యసనముచేఁ గలవర పడిన ఇంద్రియములుఁ గలవాఁడగుచు, మనలఁ జూచుటకే భరతుఁ డచ్చటి కేతెంచుచున్నాఁడని తలఁచెదను. దీనికంటె వేఱొక్క కారణ ముండఁబోదు. శ్రీమంతుఁడగు భరతుఁడు తల్లివైఁ గోపపడి, యామెను నిష్ఠూరపుమాట లాడి, తండ్రిని సమాధానపఱిచి, నాకు రాజ్యమొస గుటకే వచ్చియుండును. ఇపుడు భరతుఁడు మనలను జూడఁగోరియే, యిచ్చటికి వచ్చియుండు నని తలఁచుట యుక్తము. ఇతఁడు మన విషయ మునఁ గలలోనైన నొక్కకీడు తలంచువాఁడుకాడు. ఓ లక్ష్మణా! నీ విప్పుడు భరతుని విషయమున సంశయపడునంతటి కీడు నీకెన్నఁడైనను నింతకుముందు చేసియున్నాఁడే? ఎద్దియైన భయము గలిగించు పనియైనఁ జేసియున్నాఁడే? నీవు భరతునిఁగూర్చి, నిష్ఠూరపు మాటలాడకుము. అనిష్టములయిన పలుకులు పలుకకుము. నీవు భరతునెయెడ నేదియైన నింపుగాని మాట మాటాడుదువేని, అది నన్నన్నట్లే యగు. ఇక యిదుమ వచ్చినప్పుడు కొడుకులు తండ్రి నెట్లు చంపుదురు. లక్ష్మణా! తనప్రాణములోని భాగమగు తోఁబుట్టువును తోఁబుట్టువు చంపునే?

రాజ్యము నిమిత్తమే నీ విట్టి పలుకులు పలుకుదువేని, భరతుని నే జూచినంతనే, "నాయనా! భరతా! రాజ్య మితనికిమ్ము" అని చెప్పెదను. లక్ష్మణా! నేను భరతునితో "ఇతనికి రాజ్యమునిమ్మని చెప్పితినేని, అతడును "అట్లే యిత్తును" అని చెప్పినుగాని బదులు నెప్పుడు." ధర్మాచరణ మే స్వభావముగాఁగల రాముఁ డిట్లు పలుకఁగా, అతనికి సమ్మతం బొనర్చుటయుం దే యాపత్తిగల లక్ష్మణుఁడు సిగ్గుతోఁ గ్రుంగి తలవంచుకొనెను. అట్లు లక్ష్మణుఁడు రాముని వాక్యము విని సిగ్గరియై "తండ్రి యగు దశరథుఁడు తానే నిన్నుఁ జూడవచ్చుచున్నాఁడని తలఁచెదనని చెప్పఁగా, రాముఁడును సిగ్గుపడియున్న లక్ష్మణుం జూచి, "దీర్ఘ బాహువగు దశరథుఁడే మనలను జూచి పోవుటకో సుఖాప్తులమగు మన పాటులం జూచి, వీ రీ యవస్థలం బడనేరరని మఱల మనలను బురమునకుఁ దోడ్కొనిపోవుటకో వచ్చియుండును. ఒకవేళ మనము వనమున నుండఁగలమని తలఁచి, యెల్లప్పుడు సుఖమును ననుభవించుననియగు సీతసుమాత్రము శ్రీమంతుఁడగు తండ్రి దశరథుఁడు వనమునుండి తోడ్కొనిపోవ వచ్చెనో? ఓ శూరుఁడా! ఇదిగో మంచికులమున బుట్టినవియు, మనోహరములయినవియు, వేగమున వాయువుంబురు డించునవియునైన వేగశీలములగు రెండు మేటి గుఱ్ఱములు గాన్పించుచున్నవి. ఇదిగో, సేనాముఖమున ధీమంతుఁడగు తండ్రి యొక్కఁడి గొప్ప దేహముగలదగు శత్రుంజయమను పేరుగల యేనుఁగు కనఁబడుచున్నది. అయినను, పొడవుచేతులవాఁడా! లోకపూజితము దివ్యమునగు తండ్రి యొక్క తెల్లని గొడుగు గానరాకున్నది. కావున నా వచ్చు నాతఁడు తండ్రియగునో కాఁడోయని సందియము గలుగుచున్నది. లక్ష్మణా! నీవు నా మాట విని, చెట్టు కొననుండి దిగిర"మ్మని చెప్పఁగా, శత్రు సంహారియైన లక్ష్మణుఁడు వృక్షాగ్రమునుండి దిగి, చేతులు జోడించికొని, రాముని పార్శ్వమున నిలఁబడియుండెను.

నీతిమంతుఁడగు భరతుఁడు రామునివనమున కే మాత్రము తొందర గలుగఁ గూడదని తలఁచి, సేనలంజూచి, "మీ రెంత మాత్రము సందడిచేయరా"దని యాజ్ఞాపింపఁబడుటచే, గజాశ్వ రథ సంకులమైన సేన యహంకారము మాని భయభక్తులు గలదై

యాపట్పత పార్శ్వమున నొకటిన్నర యోజనము మేర గుడారములు నేర్పఅచుకొని యుండెను.

త్రిపంచాశ సర్గము.

భరతుడు పాదచారియై రామాశ్రమము వెదకుట

పాదములుగలనారిలోపల సుత్తముడును, దీక్షుబూవాడును, మాటనిండ్రలలో మేటియు, పురుషోత్తముడుసగు భరతుడు సేన లకుం దగిన వసతు లేర్పఱిచిన పదంపడి పాదచారియై పితృవాక్య పరిపాలకుడగు రామునిం గలిసికొనఁగోరి, వినయవంతునిపలె శత్రుఘ్నుం జూచి, "నీవు మనవెంటవచ్చు బోయలను, బనివారిని గూడఁ దీసికొని వేగముగా నీ వనమెల్ల వెదకుము. గుహుండును ఖడ్గ, బాణ, ధనుర్ధారులయిన బంధువులను దోడునేసికొని, తాను నీ చిత్రకూటమును వెదుకఁ గలఁడు. మంత్రులు, పౌరులు, వసిష్ఠాదిగురువులు, బ్రాహ్మణులుతోడరా నేను నీవనమందంతటను కాలినడతోఁ దిరిగి చూచెదను. రాముసిని, బలపంతుఁడగు లక్ష్మణుని, పూజ్యురాలగు సీతను జూచునంతవఱకును నా మనమునకు నెమ్మది గలుగదు. పద్మపత్రాక్షుండయిన రాముని యొక్క పూర్ణచంద్ర నిభమగు మోమును జూచితేని కాని, నామనము గుదుటఁబడదు. రాజలక్షణ సంయుక్తములగు శ్రీరాముని పాదములకు సాష్టాంగముగాఁ బ్రణమిల్లి, వానిని సా శ్రమంతో నెత్తుకొనసిదియు నా మనమునకు శాంత గలుగఁబోదు. రాజ్యపరిపాలనమునకుఁ దగిన రాముని నయోధ్యకుఁ దోడ్కొనివచ్చి, వంశ పారంపర్యముగా వచ్చు నీ రాజ్యమునఁ బట్టభద్రునిఁ జేయునంతవఱకును నా మనమునకు నెమ్మదిలేదు. పున్నమ చందరుని బోలి మొలుఁగుచున్న రాజీవాక్షుఁడగు రామునియొక్కమోము నెల్లప్పుడు చూచుచుండు లక్ష్మణుఁడును, చతు స్సముద్ర వేలావలయితంబగు భూమండలమున కేలికయగు తన భర్తను వెంబడించివచ్చిన పూజ్యురాలగు జానకియుఁ బుణ్యాత్ములు నందనవనము గుఱిచేయునకుఁబోలె, ఈ చిత్రకూటము, శ్రీరామునికి నునికిపట్టయ్యెఁ గానఁ బావనమయ్యెను. భీకర మృగా క్రాంతమును, దుర్గమమును నగు నియ్యరణ్యము ధనుర్ధర వరుఁడగు రామునికి నివాసమయ్యెఁ గాన పవిత్రమయినది. అని పలుకుచుఁ బాదచారియై మహారణ్యముఁ బ్రవే

శించి యచ్చటఁ గొండ నెత్తములందుఁ బూచిన పుష్ప వృక్షముల రామణీకముఁ చూచుచుఁ గొంత దవ్వేఁగి, యచ్చటఁ జక్కఁగఁ బూచిన యొక మహావృక్షము నెక్కి రాముని పర్ణశాలా ప్రదేశమునుండి వచ్చెడి హోమధూమము నీక్షించి, దుస్తరమగు సముద్రముం దాఁటి యావలిగట్టును జెందినమాని క్రైవడి మహానందమగ్నుఁడై, "శ్రీరాముఁడిచ్చట దృష్టముగా నుండఁగల" డని యొక్కఁడే, పరిజనమును గూడఁ దీసికొనక యే గుహునిచేఁ జూపఁబడు డారిం బోవుచు సజ్జనసేవితమగు రామాశ్రమమునకు ససంభ్రమముగా నేగెను.

99-వ సర్గము

భరతుఁడు రాముని జూచుట

సేనలు విడిసిన పసంపడి యప్పుడు భరతుఁడు తమ్ముకముతో, శత్రుఘ్ననకు రాముని యాశ్రమమును జూపుచు, రామునిఁ జూడఁ దలఁచెను. అట్లు గురువత్సలుఁడయిన భరతుఁడు తలఁచి "మునీంద్రా! మా తల్లులను వేగ తోడ్కొని రమ్ము" అని తన యాచార్యుఁడగు వసిష్ఠునిఁ బ్రార్థించి, తాను ముందు వేగిరముగాఁ బయనమాయెను. శత్రుఘ్నుఁడు తన యన్నను వెంబడించెను. భరతునకువలె, సుమంత్రునికిని రాముని సందర్శనాభిలాష మీఱియుండెఁ గావున, సుమంత్రుఁడును శత్రుఘ్నుని వెంబడి పయనమయ్యెను. అంత శ్రీమంతుఁడగు భరతుఁడు పోవుచునే తాపసులయునికిపట్టుల నడుమ నెలకొనియున్న యన్నయొక్క యాకుటిల్పును, పందిటిని, ఆయాకుటింటి ముందట పీఱిచిపెట్టఁబడియున్న కట్టెలను, పూజనిమిత్తము కోసియుంచబడియున్న పువ్వములను జూచెను. ఆ యాశ్రమమునసే రామలక్ష్మణులు దారి తెలియుటకై గుఱుతులుగ నచ్చటచ్చటఁ జెట్టమీఁద నుంచిన దర్భలను, నారబట్టలను చూచెను. మఱియు నతఁడు రామలక్ష్మణులు వానకాలమునఁ జలి కాచుకొనుటకై చేర్చియున్న మృగములయు, దున్నలయు నేఱుపిడకల గొప్ప రాసులను జూచెను.

నిడివిచేతులవాఁడును, గాంతియుంతుఁడునైన భరతుఁడు సంతోషముతో శత్రుఘ్నుని, సుమంత్రుఁడు మున్నగు మంత్రులను, గుహాదులను గూర్చి, "మనము భరద్వాజులు చెప్పినచోటికి వచ్చి చేరితిమని

నేఁదలఁచెదను. ఇచటికిఁ గడు దాపుననే మందాకిని నది పాఱుచుండునని తోఁచెడి. ఇచ్చటఁ జెట్లమీఁద నచ్చటచ్చట నారబట్టలు కొమ్మలకుఁ దగిలింపఁబడియున్నవి. ఇవి, లక్ష్మణుండు రాత్రికాలము బయటఁ బోవునపుడు, దారితెలియుటకై యుంచుకొన్న గుఱుతులై యుండ నోపును. బలవంతములును, ఉన్నతదంతములునగు నేనుఁగులు గర్జిల్లుచు నొండొంటితోఁ బోరాడిన ప్రదేశమిదియే యయియుండును. వనములందు మునీంద్రులచే హోమార్థము సదా పడిలముగాఁ గాపాడఁబడుచుండు నగ్నిహోత్రమునుండి లేచు ధూమమిదిగో తెలియుచున్నది. పితృవాక్య పరిపాలన దీక్షితుఁడును, బలవంతుఁడును, జడలదారియునైన మాయన్న యిచ్చట నుండును. పూజ్యుఁడయిన ఆయనను నే నిచ్చట సంతసముతోఁ జూడఁగలను. ఇంతకు సందియములేదు" అనుచుఁ జిత్రకూటమునుఁజూచి గొంతదవ్వుగి, మందాకినిఁజేరి, "పురుషోత్తముఁడైన రామనృపాలుఁడు నిర్మానుషమయిన యడవి కేతెంచి, కటికి నేలపై † వీరాసనమునఁ గూర్చుండియున్నాఁడు. నాకియి కదా రామునిఁ డింతటి యిడుమలపాలయ్యె. నాజన్మమేల! నా ప్రాణము లున్న నేమి! పోయిన నేమి! నానిమిత్తమై మహాకాంతి గల జగద్రక్షకుఁడగు శ్రీరాముఁడు తన యెల్లసుఖముల విడనాడి యరణ్యవాసి యయ్యెనని జనులు నన్ను దూరుచున్నారు. నే నిప్పుడు రామునియొక్కయు సీతయొక్కయు, లక్ష్మణుని యొక్కయు పాదములపైఁ బడి, నన్నను గ్రహింప వేఁడెదను" అని విలపించుచుఁ బోయి, మద్ది, తాటి, ఇనుమద్ది యాకులు దండగాఁ బఱువఁబడి నదియు, యజ్ఞవేదికవలె నంతట మెత్తని దర్భలు పఱువఁబడినదియు, నూఱు పలముల యెత్తు గలిగినవియు, బంగారు వీఁపుగలవియు, విశేష బలముగలవియునై వజ్రాయుధమును బోలినవియు శత్రువుల నొప్పింపఁగలిగినవియునగు విండ్లతోడను, సూర్య కిరణములవలె వెలుఁగుచుండు జ్వలించుచున్న కొనలుగలవియునై యమ్ములపొదులం దుంపఁబడిన భయంకర బాణములతోడను గూడి, విసపుమంటలఁ గ్రక్కుచున్న సర్పములతోఁ గూడిన భోగవతివలె నుండునదియు, బంగారపు టొరలలో వెయఁబడి

---

† కుడ మోఁకాలిపై ఎడమపాదమును, ఎడమ తొడక్రిందఁ గుడిపాదము నుంచి కొని కూర్చుండుట "వీరాసన" మనఁబడు.

యున్న కత్తులచే నొప్పునదియు, యచ్చటచ్చట బంగారపు బిళ్ళ లతికింపఁబడియున్న డాలువాఁకులచే విరాజిల్లుచుండునదియు, కాంచన భూషితములును, చిత్రవర్ణములునునైన యచ్చటచ్చటఁ దగిలింపఁబడి యుండు నుడుపముతోలుచేఁ జేయఁబడిన ప్రేళ్ళ యొరలతోఁ గూడినదియు మృగములకు సింహాము గుహానుబంధమై శత్రురాజుల కలవి కానిదియు విశాల రమణీయమును పావనమునునైయుండు పాపులహారి యాకుటింటిని జూచినవాఁడై, దానికి జేయవ సీతాసౌమిత్రులం దందఁ బలమైనదియు, జ్వలించుచున్న యగ్నిహోత్రునితోఁ గూడినదియు, విశాలమును, పావనమునునైయుండు నగ్నిహోత్ర వేదిని జూచెను. అట్లు భరతుఁడు కొంత తడవు పర్ణశాల వేదికల సొంపుసు జూచుచుండి మఱింత దాపునకేఁగి, సింహాముయొక్క ముఖపురములంబోలు ముఖపురములు గలవాఁడును, నిడుపు చేతులవాఁడును, తెల్ల తామరపువ్వులం బోలు కన్నులుగలవాఁడును, సముద్రపర్యంతము నుండెడి పుడమి నేలువాఁడును, స్వధర్మము నేమఱక నడపువాఁడును, దర్భలు పఱచిన పుడమిపై సీతా లక్ష్మణులతోఁ గూడఁ గూర్చుండి యున్న వాఁడును, జటావల్క లాజినధారియునునై, యగ్నిహోత్రునిమాడ్కిఁ దేజరిల్లుచున్న రాముని జూచెను. రాజవర్ణసమయినంతనె, కాంతిమంతుఁడు, ధర్మశీలుఁడునైయున్న భరతుఁడు దుఃఖసాగర మగ్నుఁడై యెదురుగాఁ బరుగెత్తి, ధైర్యముతోఁ గన్నీళ్ళ నాపుకొనఁజాలక హీన స్వరముతో నిట్లుపలికెను. "మా యన్నయైన రాముఁడు కొలువుకూట మునఁ గూర్చుండి ప్రజలచేఁ కొలువఁబడఁ దగినవాఁడు. ఆతఁడిప్పుడు శార్దూలాదులగు వన్యమృగములచేఁ గొల్వఁబడుచు నొక యాకుటింటి యందుఁ గూర్చుండియున్నాఁడు. అయోధ్యయం దున్నప్పుడు, అమూల్యములైన పలుతెఱఁగుల వస్త్రములఁ గట్టుచుండిన రాముఁ డిప్పుడు జింకతోలును గట్టికొని వానప్రస్థ ధర్మము నాచరించుచు నున్నాఁడు. తొల్లి యయోధ్యాసగరమున నున్న యప్పుడు సువాసనగల నానావిధ పుష్పములను దాల్చుచుండిన రాముఁ డిప్పుడు జడలను దాల్చి యున్న వాఁడు. తొల్లి నెత్తావిగల గంధము నలఁదికొనుచుండిన రాముఁ డిప్పుడు ముతికినిండిన శరీరము గలిగియున్నాఁడు. తాను యజమానుఁడై

యుండి, బుతిగ్గిజులచే జన్మములు చేయించి యీ ఫలము నొందవలసిన రాముఁ డిప్పుడు శరీరమును క్షశింపఁజేసి పుణ్యము నొందఁగోరుచున్న వాఁడు. అయ్యో! సుఖాస్పదుడైన రాముఁడు నా నిమిత్త మిట్టిదుఃఖము నొంది యున్న వాఁడు. లోకుల నిందకుఁ బాలయిన క్రూరుఁడ నగు నేను ప్రాణములతోనుండి యేమి యుపయోగము!" అని ఇట్లు దిగులుపడి దిగఁజాఱి, చెట్టుపోసిన మోముఁదమ్మిగలవాఁడయి విలపించుచు, రాముని పాదములకడకుఁ బోయి చేరకయె నై మఱచి క్రిందఁబడెను. మఱల లేచినను, మహాబలుఁ డగు భరతుఁడు వెతలపాలయి, యొక తడవ దీనముగా "అన్నా" యని పిలిచెనుగాని, యంతకుఁ బైమాట యేమియుఁ జెప్పక యూఱకుండెను. భరతుఁ డిట్లు దుఃఖాధిక్యముచే నయిన డగ్గుత్తికతో క్షీణుంతుఁడగు రాముని జూచి "యన్నా" అని మాటిమాటికిఁ బిలుచుచుండెనుగాని, యంతకుఁ బైమాట నేమియుఁ జెప్పఁజాలఁ డాయెను. అనంతరము శత్రుఘ్నుఁడును విలపించుచు రాముని పాదములకు వందన మాచరించెను.

శ్రీరాముఁడును తన తమ్ముల నిరువురను గౌఁగిలించికొని, కన్నీరు మున్నీరై పాఱుచుండ్లు విడిచెను. అంతలో సుమంత్ర గుహాలును రామ లక్ష్మణులకడకు వచ్చిరి. అప్పు డా రామలక్ష్మణులు సుమంత్ర గుహా లతోఁగూడి, యాకసమున శుక్రబృహస్పతులతోఁ గలసిన దివనాథ నిశానాథులమాడ్కిఁ దేజరిల్లుచుండిరి. అచ్చట నయ్యక్షిణ్యమునఁ గూడిన మేటి యేనుఁగుఁగున్నలఁబోలు నా రాజులను దిలకించి, యయోధ్యాశ్రమ వాసులగు ముసు లందఱు సంతసముమూని, వారియుపమలఁజూచి, కన్నీరు విడిచిరి.

100-వ సర్గము.

రాముఁడు భరతుని కుశలప్రశ్న చేయుట

రాముఁడును జడలు చాల్చినవాఁడును, నారబట్టలఁ గట్టుకొన్న వాఁడును, చేతులుజోడించుకొన్న వాఁడై నేలఁ బడినవాఁడును నయిన ప్రళయకాలమందలి భానుమంతునిమాడ్కిఁ జూడ నలవికాకయున్న భరతుఁ జూచి, చిక్కియు, మోము వన్నెదఱిగియు నున్నందున నెట్టకేలకు నతఁడు భరతుఁ డని యూహవాలుపట్టి, యతనిని చేతులఁ గ్రుచ్చి

యొత్తి కూర్చుండఁబెట్టి, గట్టిగాఁ గౌఁగిలించికొని, శిరమున ముద్దాడి, తన తొడపైఁ గూర్చుండఁ బెట్టుకొని, సావధానుఁడయి కుశలప్రశ్న చేయఁ దొడఁగెను.

ఓ నాయనా! నీ వడవికి నచ్చితివే? తండ్రిగొక్కడకేఁగుదెంచెను? ఆతఁడు ప్రతికియుండఁగా, నీ వతనిని విడిచి వనమునకు రాఁదగదు గదా. ఓ నాయనా! నిన్నుఁజూచి చాలదినము లాయెను. నే నడవికి వచ్చుటకుఁ జాలదినములకు మునుపే నీవు కైకయి దేశమునకుఁ దాతగారి యింటికిఁ బోయితివి. ని న్నెంతకాలమునకుఁ జూడఁ గలిగితిని. నీ యంగములు గుఱుతే తెలియకున్నవి. ఈ ఘోరారణ్యమునకు నీవెందుల కేఁగుదెంచితివి? నాయనా! ఇప్పుడు తండ్రి ప్రతికిగున్నాఁడా? లేకున్న నీ వెట్లు రాఁ గలిగితివి? నృపాలుఁడు పుత్రశోకపీడితుఁడై యీ దుఃఖముతో మ్మతినొందఁడు గదా. ఓ అబ్బాయీ! నీవు బాలుఁడవు గావున నీ రాజ్య మెవ్వరు గైకొనిపోవక తిరమ్మెయున్నదా? ఓరి తండ్రీ! తిరుగు మగఁటిమిగల తండ్రినిఁ గొల్చుచున్నాఁడవే? ఆడినమాట తప్పని వాఁడును, పెక్కు రాజసూయములు, నశ్వమేధములుం జేసినవాఁడును న్యాయమందు నిలకడగలవాఁడునునగు దశరథన్నృపాలుఁడు సేమముతో నున్నవాఁడే? బ్రహ్మజ్ఞానియు, త్రికాలవేదియు, ధర్మముఁ దప్పని వాఁడును, బ్రహ్మతేజస్సుగలవాఁడును, ఎక్కువ కీర్తిగలవాఁడును, ఇక్ష్వాకువంశమువారికిఁ బురోహితుఁడునునైన వసిష్ఠమునీంద్రునిఁ జక్కఁగాఁ బూజించుచున్నాఁడవె? నాయనా! దుఃఖపడుచుండిన మాతల్లియగు కౌసల్యయు, సుపుత్రులఁ గన్న తల్లియగు సుమిత్రయు, పూజ్యురాలగు కైకేయియు సేమముతో నున్న వారుగదా! వినయముతోఁ గూడినవాఁడును, గుణపుర్రుఁడును, విశేషమైన శాస్త్రజ్ఞానము గలవాఁడును, అసూయ లేనివాఁడును, నీ కార్యములయెడఁ బ్రమాదము వాటిల్లకుండునట్లు చూచువాఁడునైన పురోహితుఁడగు సుయజ్ఞుని గారవించుచున్నాఁడవు గదా! శ్రౌతవిధానముల నెఱిఁగినవాఁడును, బుద్ధికుంతుఁడును, చక్కనివాఁడును, కపటము లేనివాఁడునైన సుయజ్ఞుఁడు నీచే నగ్నిహోత్రములు నడిపింప నియోగింపఁబడి యప్పుడప్పుడు జరిగిన హోమములను, జరుగఁబోవు హోమములను జక్కఁగఁ

జూచుకొనుచు వచ్చుటకొఱకై వానిని నీకుఁ దెలియఁజేయుచున్నాఁడు గదా! వేల్పులను, తండ్రులను, గురువులను, తల్లులను, పితృసములగు బంధువులను మఁదుగలులను, వైద్యులను, బ్రాహ్మణులను నీవు పూజించుచున్నాఁడవుగదా! శ్రేష్ఠమైన భోజనములను, భక్ష్యములను గలవాఁడును, నీతిశాస్త్రము నెఱిగినవాఁడును నగు నుపాధ్యాయుఁడగు సుధన్వుని మర్యాద చేయుచున్నావుగదా! వయసుచారును, శౌర్య వంతులును, శాస్త్రజ్ఞానము గలవారును, లంచము గొనని వారును, సద్వంశమునఁ బుట్టినవారును, నీ యభిప్రాయమెఱిఁగి నడచుకొనువారు నగు మంత్రుల నేర్పఱిచికొనియున్నాఁడవుగదా! రాజులకు ఆలోచనయె గెల్పునకు హేతువుగనుక, గూఢముగ నెవరికిఁ దెలియకుండులాగున నాలోచనలు తెలిపినవారును, నీతిశాస్త్రము నెఱిఁగినవాఁడునైన మంత్రులు సీతో నుండి యాలోచనలు నెప్పుచుందురుగదా! ఎల్లప్పుడు నిదురింపవుగదా! వేఁకువనే నిద్దురలేచుచున్నావు గదా! నడికిరేయి యందుఁ గార్యాలోచనలఁ జేయుచున్నాఁడవుగదా! ఒంటరిగానైనను అనేకులతోనైనను జేరి యాలోచనలు చేయవుగదా! నీయాలోచనలు కార్య ములగువఱకు నొరులకుఁ దెలియనివ్వుగదా! తక్కువపెట్టుబడితో నెక్కువ లాభమునుగలిగించు కార్యమును నిశ్చయించుకొని జాగుసేయక పనులను జేయుచున్నావుగదా! అట్టిపనులు చేయుటకాలసింపవుగదా! నీయిరుగు పొరుగుల నుండువారు నీవు చేసెడి యన్ని పనులు చక్కఁగాఁజేసి ముగించిన పిదపనో, యించుమించుగా నని ముగియనున్నప్పుడో వానిని తెలిసికొందురుగాని, నీవు చేయఁబోవు వానిని యెఱుఁగరుగదా! నీ వొండె నీ మంత్రులొండె చేసిన యాలోచన లొరు లూహిం్రైనను, యుక్తిచే నయినను, మఱియుఁ జెప్ప నలవిగాని తంత్రములచేతనైనను నెఱుఁగరుగదా! యోగ్యుఁడు కష్టములు వచ్చినపుడు మనకు మే లొనరించుఁ గావున, నీవు వేలకొలఁది మూఢులలో నొక పండితుని నేర్పఱిచి, వానిని జేర్చుకొని తక్కినవారిని వదలుదువుగదా! ఒక్క వ్యాపాలుసికడ మూర్ఖులు వేవు రున్నను, పదివేవురున్నను వారివలన నా రాజున కెట్టి యుపయోగమును లేదు. చుఱుకుదనము, శౌర్యము, నేర్పు, తెలివియుఁ గలవాఁడగు మంత్రి యొక్కఁడయినను గొప్ప రాజునైనను రాజ

మాఁటఁ బ్రసిద్ధివచ్చు నెక్కుడ వచ్చి నొడఁగూర్చును. భరతా! గొప్ప పను లలో గొప్పవారిని, సామంతావర్జితపుఁ బనులందు సామాన్యులను, నీచపుఁ బనులందు నీచులను నియమించుచుచ్చాన్నగదా! సుపరీక్షితులును, కప టములేనివారును, వంశపరంపరగా వచ్చువారును, ఆచారవంతులును, ఉత్తమగుణవంతులునైన మంత్రులకే గొప్ప యుద్యోగము లిప్పించుదు గదా! నైకయీసుతుఁడా! నీవు జనుల కనార్జవ్యముగా నోర్వరాని దండనములను విధించి, వారికష్టము కలిగించునప్పుడు నీ మంత్రులు చూచుచు నూరకుండగుగదా! భద్రంగాని దానములు పట్టి ధనమార్జించి దానిచే యాగము చేయఁ దలఁచు కుంభస్థుని యాజకులు లెక్కింప నట్లును, అతిబలు బలాత్కారముగా చేయిపట్టి తిగిచిపోని పోయి రమింపఁగోరువానిని విడుచునట్లును, ఓర్వరాని పన్నులు నైకొనుటచే నిన్నెవరును దూషింపరుగదా! అన్ని పనులను జేయుటయందు నేర్పరియు, నీతిశాస్త్రవిచక్షణుఁడును, నేపథ్యములతోఁ గమ్యస్థానులు పుట్టించు వాఁడును, శూరుఁడును, రాజ్యము నపహరింపఁ గోరునట్టివాఁడునగు దుర్జనమానవుని గాజుచంపకపోయినయెడల వాఁడురాజు నేచంపును గనుక నట్టివానిని సంహరించుచుందువే! ధైర్యశాలియు, పెక్కుసమయము లందు నీవటన సమ్మానమునొంది సంతసించినవాఁడును, తెలివిగల వాఁడును, ఆచార వంతుఁడును, సత్కుల ప్రసూతుఁడును, నీయెడఁ బ్రేమగలవాఁడును, సేనాపూర్వాహ్ణములందు నేర్పరియునునైనవానిని సేనాధిపతినిగఁ జేసితివిగదా! బలిమిగలవానిని, యుద్ధములందు నేర్పరు లునునైన జోదులను వారు యుద్ధములందు చూపిన సామర్థ్యములను గనిపెట్టి బహుమానము లొసఁగి సంతోషపఱచితివే! సేనలకు బత్తె ములు, జీతములు వారివారి నేర్పునకును, నధికారమునకును దగినట్లు ఇయ్యవలసిన సమయములలో నిత్యువ్యగాని యాలస్యము చేయవుగదా! జీతములచే జీవించు భృత్యులు బత్తెములను జీతములను సకాలమున నియ్యనిచోఁ బ్రభువుపైఁ గోపపడుదురు; దూషింతురు. కావున నిది యొక గొప్ప యన్నమని చెప్పఁబడును. ప్రధానులగు రాజపుత్ర లం దలు నీ రొడఁ బ్రేమగలిగి నీ కార్యములందుఁ బ్రాణములనైనను విడు తురుగదా! స్వదేశమునందుఁ బుట్టినవాఁడును, విద్వాంసుఁడును, క్రొత్త

క్రొత్తగాఁ బుట్టెడు యోచనలతోఁ గూడిన బుద్ధిగలవాఁడును, నేర్పరియు, చెప్పిన మాటలు సరిగాఁ జెప్పువాఁడును, యుక్తాయుక్తములనెఱింగినవాఁడునైన దూత నేర్పఱిచియున్నాఁడవుగదా. * స్వదేశమునఁ బదునైదు తీర్థములను, బరదేశమునఁ బదునెనిమిది తీర్థములను ఒక్కొక్కరికిని, బరులకును దెలియకయుండువట్లు ముగ్గురు ముగ్గురు వేగులం బంపి వేఱువేఱుగా విచారించుకొనుచున్నాఁడవే? శత్రుసూదనా! నీచే నొక్కతూరి పెడలఁగొట్టఁబడినవారును, నీకుఁ గీడు దలపెట్టువారును, నీపై దండెత్తువారు నైనశత్రువులను దుర్బలులని యుపేక్షింపవు గదా! నాస్తికులగు విప్రులు మూఢులై, తమ్ముఁ బండితులనుగా నెంచుచు, మంచి చెడ్డగాను, చెడ్డ మంచిగాను దెలిపి చెడ్డ పనులలోఁ జొప్పింతురు గావున, ఓరీ నాయనా! యట్టి విప్రులను నీవు దగ్గఱఁ జేర్చుకొనవుగదా? ప్రమాణములగు సజ్జనసమ్మతము లయినధర్మశాస్త్రము లెన్నియమున్నను, బెడకట్టి బుద్ధిగలవారలైన యా నాస్తికులు తమ యూహలచే నపార్థములను గల్పింతురు. నాయనా! శూరులయిన మన పెద్దలచే శీలఁబడినదియు, నయోధ్యయని సార్థకనామముగలదియు, గుఱ్ఱములు నేనుఁగులు రథములు వీనితో నిండినదియు, ఎల్లప్పుడు స్వస్వనిహిత వర్ణాశ్రమధర్మములం దాసక్తులగువారును, జితేంద్రియులును, నెక్కువ పూనికగలవారును, యోగ్యులు నయినవేనవేలు బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులచేత వెలయుచున్నదియు, పలుతెఱఁగుల సోపానములతోఁ గూడినదియు, పండితులచే నొప్పుచున్నదియు, సకలసంపదలతోఁ గూడినదియు, విశాలమైనదియునగు నయోధ్యను శ్రద్ధతోఁ గాపాడుచున్నావుగదా! ఓభరతా! నూఱులకొలఁదిగాఁగల యాగ

---

* శత్రుదేశమునఁ బదునెనిమిది తీర్థములు:—మంత్రి, పురోహితుఁడు, యువరాజు, సేనాపతి, ద్వారపాలుఁడు, అంతఃపుర రక్షకభటుఁడు, చెఱసాలకాఁపరి, బొక్కసకాఁపరి, కార్యనిర్వాహకుఁడు, న్యాయములఁ దీర్చువాఁడు (జడ్జీలు), సేనానాయకుఁడు, పట్టణరక్షకుడు, కర్మాంతికుఁడు, సభాధికారి, ధర్మాధికారి, దుర్గరక్షకుఁడు, దండపాలుఁడు, పొలిమేర కాఁపరి అనునవి.

స్వపక్షమునఁ బదునైదు తీర్థములు:—మంత్రి, పురోహితుఁడు, యువరాజు తప్పఁ దక్కినవైఁ జెప్పినవారు.

శాలలకోఁ గూడినదియు, మంచి జీవనవసతిగలజనులచే నిండినదియు, దేవాలయములతోను, చలిపందిరులతోను, కొలఁకులతోను సంతట నొప్పుచున్నదియు, సంతోషభరితులయిన స్త్రీపురుషులచే శోభిల్లుచున్నదియు, ఉత్సవములచేతను నూరేగింపులచేతను రంజిల్లుచున్నదియు, చక్కఁగ దున్ని పైరువెట్టఁబడియుండు పొలములకోఁ గూడినదియు, పశువులుగల దియు, ఈతిబాధలేనిదియు, వర్షజలమే కాక, యేటిసేటి పాటువలయు నాధారముగాఁ గలదియు, శార్దూలాది భయంకరమృగములులేనిదియు?, చోరాగ్నిదాయాదుల భయములేనిదియు, బంగారు వెండి మొదలగు లోహములుగలజనులచే నంతట వెలుఁగుచున్నదియు, పాపాత్ముల సంచారములేనిదియు, నావెన్కలు చక్కఁగాఁ గాపాడినదియునైన కోసలదేశ మెల్ల నన్ని తెఱఁగుల సమృద్ధిగలిగి సుఖముగ నున్నదిగదా? దేశమున నున్న కాఁపులును, ఆవుల కాఁపరులును నీయెడఁ బ్రేమగలిగియున్నారుగదా? నాయనా! వైశ్యులు నీ మాటలను విని వర్తకము చేయుచు, సుఖము నొందుదురు గదా? ఓ భరతా! ఆ వైశ్యులయొక్క సొత్తులను గాపాడియు, ఆపదలను నివారించియు, వారిని బోషించుచున్నాఁడవే? నృపాలుఁడు స్వదేశవాసులగు జనుల నందఱను సర్వవిధములఁ గాపాడవలయునుగదా! స్త్రీలను సంతోషపెట్టుచున్నాఁడవే? నీవు వారిని గాపాడుచున్నాఁడవే? నీవు వారిని నమ్మవుగదా? వారితో రహస్యములు చెప్పవుగదా? వీనుఁగులు పుట్టునట్టి యడవులను మళ్ళఁదోలించికాపాడుచున్నాఁడవే? పెంటియేనుఁగు లున్నవా? ఆఁడేనుఁగులు, గుఱ్ఱములు, గజములు నెన్నియున్నను, నీవు దనివినొందవుగదా! రాజపుత్రుఁడా! ప్రతిదినము నుదయమున లేచి సొమ్ములు దొడుగుకొని ప్రొద్దుటిపూట సభలోఁ గూర్చుండి జనుల కంచఱికు దర్శనమొసఁగుదువుగదా? పనివాండ్ర కందఱికిని బలుమాఱు దర్శనమిచ్చుచును, బొత్తుగా దర్శనము నిప్పించుకయు నుండక, యప్పుడప్పుడు వారికి దర్శన మిచ్చుచున్నాఁడవుగదా? నీవు కోటల నన్నింటిని ధనము, ధాన్యము, ఆయుధములు, ఉదకము, యంత్రములు, విలుకాండ్రు, వడ్రంగులు నను వీరిచే నిండించియున్నావుగదా? నీకు ఆదాయము హెచ్చుగాను, వ్యయము స్వల్పముగాను నున్నదా? నీ ధనము యోగ్యుల పాలుగాకయున్నదిగదా! ఓ భరతా! నీ ధనమును

దేవతలు, పిత్రదేవతలు, బ్రాహ్మణులు, యోధులు చెలికాండ్రు ననువీరికై వెచ్చించుచున్నాఁడవుగదా? సత్స్వభావముగల సజ్జనులపై దొంగతన ములు మోపి శిక్షింపవుగదా? అట్టి పరిశుద్ధునివిషయమున నీతిశాస్త్ర మర్మముల నెఱింగిన పెద్దల సాయమున విచారించి తప్పు మోపవుగాని, లంచగొండివై లోభముతో వారిని దండింపవుగదా? ఒక దొంగిలించునప్పుడు చూచి పట్టుకొనఁబడి విచారించి, సాక్షులను విమర్శించి దోషము నిరూపింపఁబడిన తర్వాత, డబ్బున కాసపడి వానిని విడువవుగదా? శాస్త్రజ్ఞులైన సీమంత్రులు భాగ్యవంతునికిని దరిద్రునికిని వివాదము సంభవించినప్పుడు ద్రవ్యాశమాని విచారించి తీర్పు చెప్పుచున్నారుగదా? నేరముచేయనివానిపై నేరమును మోపిన నప్పుడు వారు మిక్కిలి వ్యసనముతో విడిచిన కన్నీరు పుడమిపైఁబడి, జనప్రీతికై చాలించెడి యా రాజాయొక్క పుత్రులను, పశువులను, ధనధాన్యాదులను నాశము నొందించును. రఘునందనా! ముదుసలులను, బాలురను, బండితశ్రేష్ఠులను మానము లొసఁగుట, మంచిమాటలు మాట్లాడుట, మనమునఁ బ్రేమగలిగియుండుట యను నీ మూఁడుపాయములచేత లోఁబఱచుకొనుచుందువుగదా! గురువులకు, ముసలివాండ్రకు, ఋషులకు, వేల్పులకు, నతిథులకు, దేవాలయములకు, కృత కృత్యులగు బ్రాహ్మణులకును జూచినపుడు మ్రొక్కుచుందువుగదా? అర్థముచే ధర్మమును గాని, ధర్మముచే నర్థమునుగాని లేక ధర్మార్థములను రెంటిని సుఖాపేక్షచేతఁ గాని, కామముచేతఁగాని చెడఁగొట్టవుగదా? జయశీలురలోపల శ్రేష్ఠుఁడా! ధర్మమును, అర్థమును, కామమును నీవు కాలము నెఱిఁగిన వాఁడవు, వరదుఁడవును గనుక నొక్కొక్క వేళలో నొక్కొక్కదానిని సేవింతువుగదా గొప్ప పండితుఁడా? సకలశాస్త్రముల రహస్యముల నెఱిఁగినవా రగు బ్రాహ్మణులును, పురజనులును, గ్రామవాసులును నీయొక్క క్షేమమును గోరుచుందురుగదా. దేవుఁడు లేఁడనుట, బొంకులాడుట, కోపము, వీమఱుపాటు, జ్ఞానుల దర్శనముచేయమి, సోమరితనము, ఎల్లప్పుడు ఇంద్రియసౌఖ్యములు గోరుచుండుట, కార్యములపట్ల నొంటరిగా యోచించుట, మూర్ఖులతో యోచించుట, ఆలోచించి చెయ నిశ్చయించిన కార్యములను మొదలుపెట్టకుండుట, ఆలోచనను వెలి

పుచ్చుట, సూర్యోదయమున నగ్గము చూచుట మొదలగు శుభకార్యములు చేయకుండుట, ఒకటే పర్యాయము శత్రురాజు లందఱిపై దండెత్తుట యనునిని పదునాలుగును రాజదోషము లనఁబడును. ఈ పదునాలుగు రాజదోషములును నీకు లేవుగదా! వేఁటాడుట, జూదము, పగటిపూట నిద్రపోవుట, పరులను దూరుట, స్త్రీలయందెల్లప్పు డాసక్తిగలిగియుండుట,గర్వము, ఆటలు, పాటలు,వాద్యములు, పనిలేకుండఁ దిరుగుట యను పది దోషములును; సాపత్నము, ధనము, స్త్రీ, మాటలు, అపకాథను వీనివలనఁ గలుగు పంచవిధ వైరములును; లేక ఉదకదుర్గము, పర్వతదుర్గము, నరదుర్గము, విరిణము, ధాన్వనము అను పంచదుర్గములు; సామ దాన భేద దండము లనెడిచతుర్వర్గమును; రాజు, మంత్రి, దేశము, బొక్కసను, స్నేహితులు, కోట, సేన యను సప్తవర్గమును; కృషి, వర్తకము, దుర్గము లేర్పఱచుట, సేతువులు కట్టుట, వీసుఁగులఁగట్టుట, గనులను వశపఱచుకొనుట, పన్ను వసూలుచేయుట, కాఁపుగములు లేని యిండ్లలోఁ గాపుగము పెట్టుట యను అష్టవర్గమును; అసాధ్యమైన పనులలోఁ బ్రయత్నపడుట, తెలివిలేమిచే సాధ్యములయిన పనులలోఁ బ్రయత్నపడకుండుట, సాధ్యములయిన పనులలో సైతము సమయము మీఱి ప్రయత్నపడుట యను కార్యవ్యసనరూపమైనది; లేక, ప్రభుశక్తి, మంత్రశక్తి, ఉత్సాహశక్తి యను శక్తిరూపమయినది; లేక, ధర్మ, అర్థ, కామరూపమయినది యగు త్రివర్గమును; త్రయీ, వార్త, దండనీతి యను త్రివిద్యలను, పంచేంద్రియములను సంధిచేసికొనుట, యుద్ధముచేయుట, యుద్ధమునకు వెడలుట, ముట్టడించుట, మిత్రభేదము, ప్రక్కబలము సంపాదించుట యను షడ్వర్గమును; నిప్పు, నీరు, రోగములు, మిఱుపు, చావు అను దైవవశములైన వ్యసనములను; తగనివారు, దొంగలు, పొరుగుదేశమువారు, రాజబంధువులు, రాజు అను మానుషవ్యసనములను; "జీతమునొందని లుబ్ధుఁడును, అనమానింపఁబడిన మానవంతుఁడును, నిష్కారణముగాఁ గోపించుకొనఁ బడిన కోపనుఁడును, భయపఱపఁబడిన భయపడు స్వభావముగలవాఁడు వీరు రాజునకుఁ జెఱుపు చేయుదురు గాన వీరి కిష్టమయిన వస్తువుల నొసఁగి, భేదింపవలయు" అని చెప్పఁబడిన భేదకృత్యమును; బాలుఁడు, వృద్ధు,

దీర్ఘరోగి, బంధువులచేఁ దఱుముఁబడ్డవాఁడు, భయపడువాఁడు, భయపడు జనులుగలవాఁడు, లుబ్ధుఁడు, లుబ్ధజనులు గలవాఁడు, వైరాగ్య స్వభావము గలవాఁడు, ఇంద్రియాశలందుఁ దగులుగలవాఁడు, పరిపరి విధములగు యోచనలు చేయువాఁడు, దేవబ్రాహ్మణ నిందకుఁడు, బ్రహ్మరిక్షాపగ్రస్తుఁడు, దైవబలము లేనివాఁడు, కఱవుచే బాధపడు చుండువాఁడు, సేనానాశముచే దుఃఖపడువాఁడు, పరదేశస్థుఁడు, పలు పురికిఁ బగవాఁడు, గ్రహచారము చాలనివాఁడు, సత్యమును న్యాయ మార్గమును దప్పినవాఁడు నను నీ వింశతి (20) వర్గమును ; మంత్రి, రాజ్యము, దుర్గము, బొక్కసము, దండము అను జయము గోరెడు రాజునకుఁ గావలయు ప్రకృతులను; జయముఁ గోరువాఁడు, అతని శత్రువు, ఆ శత్రువునకు ముందుండు మిత్రుఁడు, అతనికి ముందుండు శత్రువుయొక్క మిత్రుఁడు, అతనికి ముందుండు శత్రుమిత్ర మిత్రుఁడు నను ముందుండు నైదుగురును; పార్ష్ణిగ్రావాఁడు, పార్ష్ణిగ్రాహాసారుఁడు అను వెనుకనుండు రాజును, వాని మిత్రుఁడు, ఆతని వెనుక నుండు వాఁడు, పార్శ్వములో నుండువాఁడు, మధ్యనుండువాఁడు, దూర ముఁగ నుండువాఁడును అను మండలమును ; అయిదువిధములు గల యానమును, సేనల నిల్పువిధమును, యానాసనములకుఁ గారణమయిన విగ్రహమును, ద్వైధీభావసమాశ్రయములకుఁ గారణమయిన సంధిని, శాస్త్ర రీతిగాఁ దెలిసికొని చెడువానిని బరిత్యజించి మంచివానిని గైకొనుచున్నాఁడవే? నీవు మంత్రి కుండఁదగిన లక్షణములతోఁగూడిన ముగ్గురు లేక నలుగురు మంత్రులతో వెవ్వేఱుగాఁగాని, కలసికాని యేకాంతమున నాలోచన చేయుదువే ? నీవు చదివిన వేదశాస్త్రములను అగ్నిహోత్రాది కార్యములు సేసి సార్థకము చేయుచున్నావా ? నీవు సంపాదించిన ధనమును దానభోగములచే సఫలమగునట్లు చేయు చున్నావా ! నీ భార్యలు రతిసుఖమును, సుతతియుం బడయుటచే సార్థ కులుగా నున్నారా? నీవు నేర్చినశాస్త్రములు నీ మంచి స్వభావముచే సఫలములైయున్నవా ? ఆయుస్సును, కీర్తిని నొసంగునదియు, ధర్మార్థ కామముల నొసఁగునదియునైన వై జెప్పిన నీతుల నెఱిఁగెడి బుద్ధి నా కెట్లున్నదో యట్లే నీకు నున్నదా ? మన కితముత్తాత లెట్టి సడత

నడచుకొనుచుండిరో, వీది మంచిదారిఁ దప్పనిదో, వీది మంచిదో యీ నడతనే నీవు నడచుకొనుచున్నావుగదా? మధురపదార్థములను నీ వొంటరిగాఁ దినవుగదా? నీ స్నేహితు లడిగినది శక్తికొలఁదిగా నిత్తువు గదఁ? భరతా! నృపాలుఁడు మహా బుద్ధిశాలియై జనులలో దుష్టులను గనిపెట్టి దండించుచు, న్యాయమార్గమునఁ బుడమి నేలుచు, భూమండలము నెల్లఁ దననశవముచేసికొని, యీ లోకమున సకల సుఖముల ననుభవించి యంతమున పరబ్రహ్మత్వము నెఱిఁగి, శాశ్వత స్వర్గలోకము నొందుచున్నాఁడు." అని భరతునిఁ గుశలమడిగెను.

101-వ సర్గము.

భరతుఁ డన్నకుఁ దండ్రిమరణవార్తను దెలుపుట

భరతుఁడు రాముని పలుకు లాలకించి, "ఓ నరశ్రేష్ఠా! న్యాయమార్గముఁ దప్పినవాఁడనగు నా కీ రాజ్యపరిపాలనముతో నేమి ప్రయోజనమగలదు? పెద్దవాఁడుండఁగాఁ జిన్నవాఁడు రాజగుట మనసంశయము నఁదుఁ బెద్దలనాటినుండి వచ్చెడి యాచారము గాదు. కావున నే నెట్లప్పుడు రాజ్యాభిషిక్తుఁడ నయ్యెదను? రాఘవా! నీవును సకల సంపత్సమృద్ధమైన యయోధ్యాపురమునకు నాతోడ నేతెంచి, మనవంశాభివృద్ధి గలుగుటకై పట్టాభిషేకము చేసికొనుము. రాజ్యపరిపాలనమైహిక ఫలదమని చెప్పుదురు గాని, యాముష్మికమగు దైవత్వమునుగూడఁ గల్గించునని నే నెంచెదను. ఏ నృపాలుఁడు ధర్మార్థములకు లోపము వాటిల్లకుండునట్లు రాజ్యపరిపాలనము చేయునో, ఆ నృపాలుఁడు దేవత్వము నొందును. కావున నీవు తపస్సుచేతనే దేవత్వముగలుగునని తలంపక రాజ్యము ననుగ్రహింపుము. నేను కేకయపురమున నుండఁగా, సీతా లక్ష్మణసమేతుఁడవై నీ వడవికి వచ్చిన తర్వాత, సజ్జనులకుఁ బ్రియుఁడును, జన్నములు సేయువాఁడునైన పూజ్యుఁడగు తండ్రిగారు పుత్రశోకము నోర్వజాలక దివమున కేఁగెను. పురుషోత్తమా! లే లెమ్ము. లక్ష్మణసమేతుఁడవై తర్పణాదు లొనరింపుము. ఏనును శత్రుఘ్నుఁడును తర్పణాదులగు నుత్తరక్రియల నెల్లఁ జేసితిమి. రాఘవా! ప్రియుఁడగు పుత్రుఁడు చేసిన తర్పణాదులే పితృదేవతల కెక్కుననని పెద్దలు చెప్పుదురు. నీవు తండ్రికిఁ బ్రియుఁడవు గదా. కావునఁ దండ్రికిఁ దర్పణాదు

లగు నుత్తరక్రియలం జేయుము. నీ తండ్రియు సిన్నెడఁబాసి, నీ వియోగదుఃఖమున మునిఁగినవాఁడై, నిన్నుఁ గూర్చియే వగచుచు, నిన్నుఁ జూడఁగోరుచు, నీ యందుఁ దగులుగల బుద్ధిని మఱిల్చుకయే, నిన్నే తలంచుచు స్వర్గలోకము నొందెను" అని రామునితోఁ జెప్పెను.

102-వ సర్గము.

రాముఁడు తండ్రి కుత్తరక్రియలు సల్పుట

శత్రుపీడాకరుండయిన రాముఁడు భరతునిద్వారా యుద్ధరంగమున దేవేంద్రునిచేఁ బ్రయోగింపఁబడిన వజ్రాయుధమునుబోలునట్టి మనమున కింపుగాని దిగులు గలిగించు తండ్రిమరణవార్త యనెడి బాణముచే మనమున నాఁటఁబడి, మై మఱచి యిరుగేలును బై కెత్తి, కాన నమున గొడ్డటితో నఱుకఁబడిన పూచిన కొనకొమ్మలు గలచెట్టు పోడ్కిఁ బుడమిపైఁ బడెను. అట్లు నేలపైఁబడి, దరులను కొమ్ములతో గోరాడి యలసి గాఢముగ నిద్రించుచున్న యేనుఁగుచందమునఁ దోఁచువాఁడును, దుఃఖముచే మిక్కిలి స్రుక్కినవాఁడును, కడు వగలం బొగులుచున్నవాఁడునైన విలుకాఁడగు రాముఁనిచుట్టు కూర్చుండి తమ్ములందఱును సీతయుఁ గన్నీరు విడుచుచు నారామునిఁ దొడలిపయిఁ జల్లనినీటిని జల్లిరి. ధర్మాత్ముఁడగు రాముఁడు కొంతసేపటికిఁ దెప్పఱిల్లి నేత్రములనుండి కన్నీటిని ధారలుగాఁ గార్చుచు జాలిపుట్టునట్లుగా నా భరతుంగూర్చి న్యాయ్యములైన కొన్ని మాటలం జెప్పఁ దొడఁగెను. "ఓ భరతా! తండ్రి మృతి నొందిన పిదప, నయోధ్యాపురమున నాకేమి పని యున్నది? నృపాలోత్తముఁడు లేని యయోధ్య నెవ్వఁడు పాలింపఁగలఁడు? ఏ నృపాలుఁడు నా నిమిత్తమగు శోకముతో మృతినొందెనో; ఏ నృపాలునికి నేను సంస్కారం బొనరింపనైతినో; ఇమ్మహాత్ముఁడయిన నృపాలునికిఁ జెడు పుత్రుఁడైన నేను చేయవలసిన దేమి యున్నది? నిర్దోషుఁడవగు నో భరతుఁడా! నీవును శత్రుఘ్నుండును దండ్రికిఁ జేయవలసిన ప్రేతకృత్యములఁ జేసితిరి గావున మా జన్మములు పావనములయ్యెను. నృపాలుఁడు మృతినొందుటచే నాథుఁడు లేనిదై, యల్లకల్లోలమైయుండు నయోధ్యకు వనవాసము నుగించిన పిదపఁ గూడఁ బోవ మనము లేదు. తండ్రి లోకాంతరమున కేఁగేఁ గాన వసవాసము

మునింఁచి యయోధ్యకు వచ్చినపిదప నా కెవ్వఁడిను సదుపదేశము సేయఁ గలఁడు? మంచి నడతగల నన్ను బుజ్జగింపుచుఁ నాతండ్రి నా కేదేది బోధించుచుండెనో, నా చెవుల కింపుగా నుండెడి అట్టి మాటలు నా కిఁక నెవ్వఁడు చెప్పఁగలఁడు? అట్టి మాటలు నెవరివలన వినఁగలను?" అని భరతునితోఁ జెప్పి, దుఃఖపీడితుఁడై పున్నమచందురునిఁబోలు మోమునగల సీతను, లక్ష్మణునిఁజూచి, "ఓసీతా! నీ మామ మృతుండయ్యె. లక్ష్మణా! నీవు తండ్రి లేనివాఁడ వయితివి. నృపాలుఁడు స్వర్గమున కేఁగె నని భరతుఁడు వ్యసనవృత్తాంతముఁ జెప్పెను." అని యిట్లు కాకుత్స్థుఁడు పలుకఁగా, కీర్తిసుఁతులగు తమ్ములంబటి గన్నీరు మున్నీరయి పార రోద నము చేసిరి. తమ్ము లంబటి నన్నునూరార్చి జాలించి, నిట్టూర్పువిడిచి, తండ్రికిఁ దర్పణము చేయుమని రామునికిఁ జెప్పిరి. ఆ సీతయు మామ గారు స్వర్గమున కేఁగె నన్న వృత్తాంతము విని కన్నులనిండఁ గన్నీరుంచు కొని, భర్తను జూడఁ జాలకుండెను. రాముఁడును వగచుచుండు సీతా దేవి నూఱడించి, దుఃఖితుఁడై వ్యసనపడుచున్న లక్ష్మణునిఁ జూచి, "లక్ష్మణా! మహాత్ముఁడయినతండ్రికి నుదకదానము చేయఁబోవుచున్నాను. నీవు గారపిండిని, ఉత్తరీయమును దెమ్ము. సీత ముందు నడుచును. నీవు దానివెంబడిఁ బొమ్ము. నేను మీవెనుక వచ్చెదను. ఈ దారి మిక్కిలి భయంకరమయినది." అని చెప్పెను. అంతట వారి నెల్లప్పు డనుసరించు వాఁడు, తెలివికలవాఁడు, బుద్ధిమంతుఁడు, మెత్తనివాఁడు, దాంతుఁడు, శాంతుఁడు, రామునియెడ దృఢభక్తి గలవాఁడు నగు సుమంత్రుఁడు రాజపుత్ర లందఱితోనుగూడి, రాముని జెయిపట్టుకొని వచ్చి, పవిత్ర మైన మందాకినీ నదిరేవున దింపెను. కీర్తిసుంతులగు రాజపుత్ర లందఱు మంచి రేవులు గలదియు, రెండు గట్టులందు పుష్పఫల భరితములగు చెట్లచేఁ బ్రకాశించునదియు, మనోహరమైనటియు, వడిగాఁ బ్రవహించు నదియు నగు మందాకినీ నదియం దడుసు లేని తేటనీటితోఁగూడిన యొక రేవునందుదిగి, "ఇది సీకొఱకునుగాక" అనుచు నృపాలునికిఁ దిలతర్పణ మొనర్చిరి. అపుడు నృపాలుఁడగు రాముఁడు జలాంజలి నిండఁ బట్టుకొని, దక్షిణదిశ కభిముఖుఁడై, "ఓ రాజశ్రేష్ఠుఁడా! పితృ లోకము నొందిన నీ కిదిగో నిర్మలజలము నొసఁగుచున్నాను.నాచే నొసఁగఁ

బడిన యీ తర్పణాంజలి నిన్నుఁ బొందునుగాక" అని చెప్పుచుఁ దిల తర్పణ మొనర్చి, యా మందాకినీ నదీతీరముఁ జేరి యచ్చటఁ దమ్ము లతోఁగూడి తండ్రికి సపిండీకరణ మొనర్చెను. రాముఁడు గారపిండిని రేగుపండ్లరసముతోఁ జేర్చి పిసికి, పిండములునేసి, దర్భాసనమున నునిచి, మిగుల వగలపొలై, "మహారాజా! మేము దినుచుండునాహారమునే నీ కర్పించితిమి. దీనిని ప్రీతితో భుజింపుము. పురుషుఁడు తాను దిను నన్నమునే తాను కొలుచు దేవతలకు నర్పించును." అనుచుఁ దండ్రికిఁ బిండప్రదానము నేసి, యుత్తరక్రియలను బూర్తిచేసినవాఁడై, యా మందాకినీనది గట్టునసే పోయి, రమ్యమైన చటులచే నొప్పుచుండు పర్వతము నెక్కి తన యాకుటింటి వాకిటికిఁ జని భరతలక్ష్మణులను గట్టిగాఁ గౌఁగిలించెను. అంత నన్నదమ్ములు సీతతోఁగూడి గొంతెత్తి గొల్లున నేడ్చిరి. సింహ గర్జనములకువలె వారి రోదనధ్వనులకు నా పర్వతమునఁ బ్రతిధ్వనులు పుట్టెను. తండ్రికిఁ దర్పణము చేసివచ్చి రోదనము చేయు చున్న యా బలిష్ఠులగు రామాదులయొక్క యల్లకల్లోలమైన యారోదన ధ్వనిని విని భరతుని సేనలు భయపడి, "ఓహో! భరతుఁడు రామునితోఁ గలిసికొనెను. తండ్రియొక్క మరణమునుగూర్చి దుఃఖపడుచున్న వారి ధ్వనులే యీ వినఁబడుచున్నవి." అని తమలోఁ దామనుకొనుచుఁ దమ యిక్కలువిడిచి యా ధ్వని వినవచ్చినవైపునకుఁ గడువేగిరముగా నడువ నలవికాని దారిలోఁ సుకుమారులు కొంద తేనుఁగులమీఁదను, మఱి కొందఱు గుఱ్ఱములమీఁదను, వేఱుకొందఱు చక్కఁగాఁ గై సేయఁబడిన రథములందును గూర్చుండి పోయిరి. తక్కిన వారందఱు నడచివెళ్లిరి. వారు నడచిపోవుచు, కొన్నిదినముల క్రిందటనే యరణ్యమునకు నేఁగి రాముని బహుకాలమునకు ముందరణ్యమున కేఁగిన వానినివలెఁ జూడఁ గోరినవారయి యందఱును వేగముగా నాశ్రమమునకుఁ జనిరి. వారం దఱు నొండొరులను గలసికొనిన యా యన్నదమ్ములను జూడఁ మిగులఁ గతూహలపడినవారయి గిట్టలయు, రథచక్రములయు ధ్వనులు గల నానావిధములగు వాహనముల నెక్కి యడవులకుఁ దఱలిరి. ఆ పర్వత ప్రాంతమునఁ బోవుచున్న యా యనేక గజాశ్వముల గిట్టలచేతను, చక్రములచేతను నలుగుచున్న నేలయందుఁ బుట్టిన ధ్వని వర్షర్తువు నాఁటి

యాకసము నందలి ధ్వనిని బోలియుండెను. ఆ ధ్వనులను విని యాపర్వతమున నున్న యేనుఁగులు భయపడి ఆఁడేనుఁగులతోఁ గూడినవై, తమ మదగంధముచే నా వనమును బరిమళింపఁ జేయుచు మఱియొక వనమున కేఁగినవి. వరాహములు, తోడేళ్లు, దున్నపోతులు, పాములు, కోఁతులు, గురుపోతులు, పులులు, జింకలు మొదలగు మృగము లన్నియు మిగుల నులికిపడినవి. జక్కవలు, నీరుకోళ్లు, రాయంచలు, బెగ్గురు పక్షులు, కొంగలు, మగకోయిలలు, క్రౌంచములు మొదలగు జలపక్షు లన్నియు నదరిపడి యెడలుమఱచి దిక్కులకుఁ బాఱినవి. ఆకసమా గందరగోళముచే మిక్కిలి యదరిన పక్షులతోనిండి వెలుఁగుచుండెను. భూమియు మనుష్యులతోనిండి విరాజిల్లుచుండెను. అంత నా భరతుని వెంబడి వచ్చిన వా రందఱు నొండొరులఁ గడచి పడుచు లేచుచు వచ్చి యాకుటింట నేలపైఁ గూర్చుండి యున్న వాఁడును, కీర్తిమంతుఁడును, శత్రుసంహారియు, పురుషశ్రేష్ఠుఁడునైన రామునిఁ జూచి, పాపిష్ఠు రాలగు కై కేయిని, మంథరను దూరుచుఁ కన్నీరు గార్చుచు నంగలార్చిరి. అంతట ధర్మజ్ఞుఁడయిన రాముఁడట్లు కన్నీరుగార్చుచు నంగలార్చుచున్న యాజనము నవలోకించి, కౌఁగిలించెను. కొందఱు రామునికి మ్రొక్కిరి. అప్పుడు నరపాలసూనుఁడు చెలికాండ్రను, బందుగులను వారివారి వయోగుణములకుఁ దగినట్లు గౌరవించెను. అయ్యాశ్రమము చేరువ నమ్మహాత్ములగు రామాదు లొనర్చు రోదనధ్వనులు భూమ్యాకాశము లందును, పర్వతగుహాలందును మాఱుమ్రోఁత లినఁ జేయుచు భేరీ వాద్యముల మాడ్కి చెలరేఁగినవి.

103-వ సర్గము.

రామునితల్లులు రామునిఁ జూచుట

వసిష్ఠమునీంద్రుఁడు దశరథనరేంద్రుని పత్నులను దోడ్కొని, రామునిఁ జూచు మక్కువతో నతఁడుండు ప్రదేశమున కేఁగెను. అట్లు వసిష్ఠమునీంద్రునిచేఁ గొంపోవఁబడుచున్న నృప పత్ని లందఱు మం దాకినీనదిం గూర్చి మెల్లఁగాఁ బోవుచు, రామలక్ష్మణులు మందాకినీ నదిలో దిగుట కేర్పఱచుకొనిన రేవును జూచిరి. అప్పుడు కౌసల్య కన్నీ టిచే నిండి బెండుపాఱిన మోముగలదగుచు, సుమిత్రను దక్కొంగల

రాజకాంతలను జూచి, హీనస్వరముతో "ఓ మగువలారా! ఇది మున్ను చేశ భ్రష్టులుగాఁ జేయఁబడినవారును, పవిత్రచరిత్రులునైన సీతారాము లక్ష్మణులు వనవాసమున స్నానార్థమై యేర్పఱచుకొన్న రేవు. ఓ సుమిత్రా! నీ కొడుకును, లక్ష్మణుఁడు నా కొడుకునిమిత్తమయి యేమఱు పాటులేక యెల్లప్పు డుదక మిక్కడనుండియె తానే కొంపోవుచుం డును. నీ కుమారుఁ డిట్లు గౌరవహీన మయినపని యొనర్చినను, నతనికి గౌరవము తగ్గదు. అన్నకే శుశ్రూష యొనర్చినను, నది యంతయు సరోత్తమమైనది. ఇప్పుడయినను నీ కొమరుఁ డిట్టి యిడుమలకుఁ దగిన వాఁడు కాఁడు. కావున ఇప్పుడు సేయునట్టి నీచపుఁబనులు మాని రాజ్య సుఖము వొందునుగాక" యని చెప్పుచు, నావలివైపున దక్షిణపుఁ గొనలు గలుగునట్లు పఱచిన దర్భలం దుంచబడియున్న గారపిండి పిండ ములను జూచి, కడువగచి, తనతోఁ గూడనున్న దశరథ పత్నుల నంద ఱం దిలకించి, "యిక్ష్వాకురాజులకుఁ బ్రభువును, రఘువంశోద్భవుఁడును, మహాత్ముఁడునైన రాముఁడు తండ్రికి యథావిధిగ నిడిన పిండములు చూడుఁడు. సకలభోగముల ననుభవించినవాఁడును, దివ్యరూపము దాల్చినవాఁడును, మహాత్ముఁడునగు పార్థివునకు నీ గారపిండి పిండములు తగినవికావు. నాలుగుసముద్రములచేఁ జుట్టఁబడిన భూమండలము నేలినవాఁడైన దేవేంద్రునిఁ బోలెడు దశరథ భూమిపాలుఁ డీ గారపిండి పిండముల నెట్లు దినఁగలఁడు? సకల సంపదలతో నొప్పినవాఁడయ్యు రాముఁ డిప్పుడు తండ్రికి గారపిండి పిండములను బెట్టుచున్నాఁడు. ఇంతకంటె మించినదుఃఖము లోకమున నింకొకటియుండఁబోదు. రాముఁడు తండ్రి కొసఁగిన గారపిండిపిండములను జూచినతరువాతను గూడ నీ దుఃఖముచే నా హృదయము బ్రద్దలు కాకయున్నదేల? "మానవుఁ డే యాహారమును దినునో, వానిదేవతలు నదే యాహార మును గల్గియుండురు" అని లోక ప్రసిద్ధమైన శ్రుతి యిప్పుడు నాకుఁ సత్యముగఁ దోచుచున్నది" అని చెప్పెను. అప్పు డా నొచ్చియున్న కౌసల్యను సవతు లంద ఱూరడించి, స్వర్గలోకమునుండి క్రిందికిఁ బడిన వానివలె నాశ్రమమున వెలుఁగుచున్నట్టివాఁడును, సకల భోగములను విడిచినవాఁడునునైన రామునిఁ జూచి దుఃఖించి వే రెలుఁగుతో

నేడ్చుచుఁ గన్నీరు విడిచిరి. అంతటఁ బ్రతిజ్ఞతప్పనివాఁడును, పురుష శ్రేష్ఠుఁడునునైన రాముఁడు దర్భాసనమునసుండి లేచి నిలిచి యీ తల్లు లందఱియొక్క మంగళకరములగు పాదములకు నమస్కరించెను. విశాలనేత్రలగు కౌసల్య మున్నగు దశరథ రాజపత్నులందఱు మెత్తని వ్రేళ్ళతోఁగూడి, సుఖస్పర్శముగలవైన తమ హస్తములతో నా రాముని వీపు మీఁది దుమ్ము దుడిచిరివైచిరి. లక్ష్మణుఁడును తల్లుల నవలోకించి దుఃఖితుఁడై, రాముని వెంబడిదానును మెల్లగా వారి కందఱికి మ్రొక్కెను. దశరథతనయుఁడును శుభలక్షణోపేతుఁడునైన లక్ష్మణుని యందును రామునియందుపలెనే కౌసల్య మున్నగు వారందఱు ప్రేమను గనఁబఱిచిరి. సీతయుఁ దన యత్తల పాదముల కెఱిఁగి, వగలం బొగులుచుఁ గన్నులనిండఁ గన్నీరు నించికొని, వారియెదుట నిలఁబడియుండెను. కౌసల్య, యడవియం దుండుటచేఁ గృశించినదియు, దిటవులేనిదియు, వంతెలపాలయినదియునైన సీతను బల్లి కూఁతురింబోలె గట్టిగాఁ గౌఁగిలించికొని, జనకమహారాజుకూఁతురును, దశరథనృపాలుని కోడలును, రామునకుఁ బత్నియునైన యీ సీత యిట్లు జనరహితమగు నడవులం దిడుములఁ బడవలసివచ్చెఁ గదా యని తలఁచి, "ఓ సీతా! ఎండకు వాడిన తామర వూవువలెను, వాడుపాటిన కలువవలెను, దుమ్ముచేఁ గప్పఁబడిన బంగారమువలెను, మబ్బుచేఁ గ్రమ్మఁబడిన చంద్రబింబము వలెను గాంతి తఱిగియున్న నీ మోమునుజూడ, అరణియందుఁ బుట్టిన యగ్ని దన్నాశ్రయించుదానిం బోలె దుఃఖాగ్ని నా మనమును దహించుచున్నది" అని యాతురతతోఁ జెప్పుచుండఁగా, రాముఁడును కులగురుఁడగు వసిష్ఠమునీంద్రుని పాదము కెఱిఁగెను. అప్పు డగ్నిహోత్రుని చందమునఁ దేజరిల్లుచుండువాఁడును, నిండు కాంతిచే వెలుఁగువాఁడును నైన వసిష్ఠమునీంద్రునకి, బృహస్పతికి దేవేంద్రుఁడువోలె రాముఁడు ప్రణమిల్లి, యాతని నుచితాసనమునఁ గూర్చుండఁబెట్టి, తానును గూర్చుండెను. పదంపడి భరతుఁడును మంత్రి పౌరముఖ్య ధార్మికజన సైనిక సమేతుఁడై రాముని చేరువఁ గూర్చుండి చేతులు జోడించికొని, తాపసవేషముతో నెక్కువ కాంతిం దేజరిల్లుచున్న రాముని దివ్య రూపముఁ జూచి, బ్రహ్మదేవుని యెదుట దేవేంద్రుఁడుంబోలె, నా

రాముని యెదుట విరాజిల్లుచుండెను, అప్పుడు జను లందఱును "ఇఁక నీ భరతుఁడు రామునికి నమస్కారముఁ గావించి, సవినయముగ నేమి చెప్పునో" అని మిక్కిలి కుతూహలముతోఁ జూచుచుండిరి. నిక్కువయిన ధైర్యము గలిగినవాఁడగు రాముఁడును, ఎక్కువ యుక్తాయుక్తజ్ఞ లక్ష్మణుఁడును, ధర్మపరుఁడగు భరతుఁడును చెలికాండ్రచేఁ జుట్టుఁబడి, యజ్ఞశాల యందు సభ్యులచేఁ జుట్టుఁబడిన గార్హపత్యాహవనీయదక్షిణాగ్నులం బోలె మిక్కిలి ప్రకాశించుచుండిరి.

104-వ సర్గము.

భరతుఁడు రాముని రాజ్యము నైకొన బ్రార్థించుట

మహోత్సుఁడును, కకుత్థ్సవంశోద్భవుఁడునైన రాముఁడు లక్ష్మణ సమేతుఁడై, గురువాత్సల్యముగలవాఁడయిన తమ్మునిఁ దిన్నని పలుకులచే నూఱడించి, "నీవు జడలను వల్కలాజినములను దాల్చినవాఁడవయి, రాజ్యము విడిచి యిచ్చటికేల యేతెంచితివి? కారణము దెలిపితివేని వినఁగోరుచున్నాఁడ" నని చెప్పి గట్టిగఁ గౌఁగిలించి, నిర్బంధింపఁగా, నిడుదచేతులవాఁడగు భరతుఁడు చేతులు జోడించుకొని, యన్నంజూచి "మహాభాగుఁడగు దశరథుఁడు చేయ నలవికాని పనిని జేసి దేవర నడవికిఁ బంపి, పుత్రవియోగదుఃఖము నైరింపఁజాలక స్వర్గమునకేఁగెను. ఓ శత్రుతాపనా! నృపాలుఁడు కేవల మొక యాఁడుదియైన నా తల్లికిలోఁబడి, తన కీర్తిని బోఁగొట్టుడి యీ గొప్ప పాపపుం బనిఁ జేసెను. అట్టి పాపాత్మురాలయిన నాతల్లి విధవయై దుఃఖముఁజేడస్సి, తాను గోరిన రాజ్యసుఖము నొందకయె కడు భయంకరమైన నరకమునఁ బడఁగలదు. దాసుఁడనైన నాపై ననుగ్రహముంచి, యిప్పుడే దేవేంద్రునిఁ బోలెఁ బట్టాభిషిక్తుఁడ వగుము. ఈ పురవాసులగు జను లందఱును, విధవలయిన యీ మన తల్లులును నిన్నుఁ బ్రార్థించుచున్నారు. నీవు వారిపై ననుగ్రహింపుము. శత్రువుల యహంకారమును ఖండించువాఁడా! క్రమమున వచ్చినదియు, నీకుఁ దగినదియునైన యీ రాజ్యమును జ్యేష్ఠక్రమమున నంగీకరించి చెలికాండ్రమనోరథములఁ దీర్పుము. శరత్కాలమందలి రేయి నిష్కళచంద్రునితోడం బోలె భూమండలమెల్ల భర్తవైన నీతోఁగూడి యనాథకాకుండునుగాక! నేను నాయాయమంత్రులను సాష్టాం

గముగాఁ బ్రణమిల్లి వేఁడుచున్నారము. నేను నీకు సోదరుఁడను; దాసుఁ డను నాపై ననుగ్రహింపుము. ఓ పురుషశ్రేష్ఠుఁడా! వంశపరంపరగా వచ్చినవారును, తాతతండ్రులనాఁటినుండి యుండువారునైన యీ ప్రజలందఱు నేకగ్రీవముగాఁ జెప్పు మాటలను నీ వతిక్రమింపఁ దగదు" అని కన్నీరు విడుచుచు రాముని పాదములను శిరము సోఁకునట్లు మ్రొక్కి గట్టిగాఁ బట్టెను. రాముఁడును మదపుటేసుఁగుమాడ్కి మాటి మాటికి నిట్టూర్పు విడుచుచున్న తన్ముని భరతునిఁ గౌఁగిలించి "ఓ భరతా! గొప్ప వంశమునఁ బుట్టినవాఁడును, సత్త్వగుణముతోఁ గూడిన వాఁడును, పరాక్రమశాలియు, వ్రతముల నాచరించినవాఁడునైన నీ వంటి మానవుఁడు రాజ్యము నిమిత్తమై యిట్టి పాపకార్యమును జేయునే? శత్రుసంహారకా! నీయెడ నీవగింజంతదోష మైనను గాని పింపదు. మఱియు నీవు మూఢతవలన నీ తల్లిని దూషింపఁ దగదు. మహా ప్రాజ్ఞుఁడవగు నీవసనరహితుఁడా! తల్లిదండ్రులు మొదలగు పెద్దలు శిష్యులు, దాసులు మొదలగువారలకును, భార్యలకును బుత్రులకును దమ యిచ్ఛకువచ్చిన యానతులను జేయఁగలరు. ఓ నాయనా! పాధువులు తమభార్యలను, పుత్రులను, శిష్యులను నెట్టివారిఁగఁ దలఁతురో, అట్లు మన తండ్రియు మనల తలఁచు నని నీవు తెలిసికొనుము. దశరథమహీపాలుఁడు నాకు నారబట్ట నుత్తరీయముగను, కృష్ణాజినము గట్టుబట్టగను నొసఁగి యడవికిఁ బంపుటకైనను, రాజ్యము నొసఁగుటకైనను అధికారముగలవాఁడు. ధర్మవంతులలో శ్రేష్ఠుఁడా! తండ్రియెడ నందఱు మెచ్చునట్టి గౌరవ మెంతయో, తల్లియందు నంత గౌరవము నుండవలయును. ధర్మశీలుఁడైన తల్లిదండ్రులు "వననము నకుఁ బో"మ్మని యానతిచ్చియుండ, నే నెట్లు వేఱువిధముగాఁ బ్రవర్తింతును. నీ పట్టాభిషేకమునకై నేలికవై సకల జనులును గొనియాడునట్లు రాజ్యపరిపాలనము సేయవలయు. నేను నారబట్టలను గట్టుకొని యరణ్యవాసము సేయవలయు అని జను లందఱి యెదుటను తండ్రి విభాగమేర్పఱిచి యానతిచ్చి స్వర్గమునకుఁ బోయెను. లోకములకెల్ల గురువును, ధర్మశీలుఁడును నగు దశరథనృపాలుఁడు నీకును బ్రమాణము గావున, నీవును దండ్రి పంచియిచ్చిన రాజ్యము ననుభవింపఁ దగు

దువు. నేనును బదునాలుగేండ్లు దండకారణ్యముననుండి మహాను భావుఁడగు తండ్రి యొసఁగిన భాగమగు వనవాసము ననుభవించెదను" అని భరతునితోఁ జెప్పెను.

105-వ సర్గము.

రాముఁడు భరతుని మాటలకు బదులు చెప్పుట

పురుషశ్రేష్ఠులగు రాజపుత్రులు నల్వురు సుహృద్గణముతోఁ గూడినవారలై, యిట్లు విలపించుచుండ నా రేయి యొట్టికేలకుఁ గడ చెను. మఱునాఁటి వేకువ లేచి యా యన్న దమ్ములును, వారి చెలికాండ్రును మందాకినీనదికిఁ బోయి స్నానము, సంధ్య, ఔపాసనము మొదలగు ప్రాతరనుష్ఠానముల నెల్ల నిర్వర్తించి, రాముని కడ కేఁగుదెంచిరి. అప్పుడు వారందఱు మౌనముతోఁ గూర్చుండిరికాని, యొక్కరు నే మాటను బలుకరైరి. భరతుఁడు మాత్రము చెలికాండ్రందఱు వినుచుండ నిట్లుపలికెను. "నృపాలా! మాతల్లికి సమాధానపడినది. నాకు రాజ్య మిఁడబడినది. నాకు రాజ్యమొసఁగితివి. నే నా రాజ్యమును నీకే యొసఁగెదను. శత్రుబాధలేని యీ రాజ్యమును నీ వనుభవింపుము. వర్షాకాలమున గొప్ప నీటి ప్రవాహమునకుఁ దెగిన కట్టను గట్టుట యేరికిని సాధ్యముగాదుగదా! అట్లే యీ విస్తారమయిన రాజ్యభాగముఁ బాలింప నీవు దప్ప నెవఁడు చాలును? ఈ రాజ్యము నాబోఁటివాని కలవియగునది కాదు. ఓ పుడమిఱేఁడా! ఖరమునకు గుఱ్ఱమువేగ మబ్బినట్లును, సామాన్యమగు పక్షికి గరుత్మంతునివేగ మబ్బినట్లును, నీ నడతను బొందుటకు నాకు సామర్థ్యముచాలదు. జీవనార్థమై యొరులచే నెవఁడాశ్రయింపఁబడునో, వాని బ్రతుకు మంచి బ్రదుకు.ఎవఁడు సదా యొరుల నాశ్రయించి జీవించుచుండునో, వాని బ్రదుకు కడు నధమమైనది. ఒకానొక పురుషుఁ డొక్క చెట్టును నాఁటి నీరుపోసి పెంచఁగా, అది కుజుచవాని కెక్కుటకు వీలుగాక, యొదిఁగిన బోదెగలిగి గొప్ప వ్రానయి, సకాలమునఁ బుష్పించి, ఫలముల నొసఁగకుండునేని, యా వృక్షమును నాఁటినవాఁ డేయుద్దేశముతో నాఁటెనో యా యుద్దేశము నొందఁడుగదా. నిడివిచేతులవాఁడా! నీవు గొప్పవాఁడవు, పోషింపఁగలవాఁడవు నయ్యా, మమ్ముఁ బాలింపవేని, యీ దృష్టాం

తము ప్రస్తుతవిషయమునకుఁ దగియుండును. ఓ నరశ్రేష్ఠా! దాని యర్థ
మును నీ వెఱుఁగఁగలవు. దశరథపృపాలుఁడు నీవలన గొప్ప సౌఖ్యముఁ
బడయఁగోరి నిన్నింతవాని నంతవానిని జేసెను. ఇప్పుడు నీవు పోషింపఁ
జాలినవాఁడవయ్యు మున్నుఁ బోషింపఁదగినవారిని బోషింపవేని, దశరథ
నృపాలుని పాటు ఆచెట్టు నాఁటినవాని పాటునలె విసలుయిపోవును
గదా! మహారాజా! శత్రుసంహారివైన నీవు సింహాసనమునఁ గూర్చుండి
సూర్యునివలెఁ దేజరిల్లుచుండఁగా, పురజను లందఱు నిన్నుఁ దనివి
తీఱఁ జూచుచుందురు గాక! ఓ కకుత్స్థవంశోద్భవుఁడా ! మదపు
టేనుఁగుబు నిన్ను వెంబడించినవై ఘీంకారము లొనరించును
గాక! అంతిపురపు టతివ లందఱు మిక్కిలి నెన్నుదిగలిగి సంతసపడు
దురుగాక!" అని రామునితోఁ జెప్పెను. అట్లు రామునిఁ
బ్రార్థించుచుండు భరతుని పలుకులు విని, యయోధ్యాపురము నుండి
వచ్చిన నానాజాతుల జనులును "నీ వచనము బాగుగ నున్నది" యని
తలయూఁచిరి. ఇ ట్లెఱుఁగున నంతతోఁగూడి పలనించుచున్న కీర్తిమంతుఁ
డయిన భరతునిఁ జూచి, మనస్సును జయించినవాఁడును. ధైర్యశా
లియునగు రాముఁ డూఱడించుచు, "ఓ భరతా! మనుజునకు స్వాతం
త్ర్యమనునది లేదు. ఈ పురుషుఁ డేదియుఁ దనంతటఁ దాను జేయఁ
జాలఁడు. దైవమే పురుషుని నిక్కడి కక్కడికి నీడ్చుచుండును గావునఁ
బురుషుఁ డతఁ డీడ్చినతట్టునకుఁ బోవుచుండును. "సంపదలెల్ల నాశమే
ముగింపుగాఁగలవి. పెరుగుటలు పడుటలతోఁ ముగియును. కలియుఁబాటు
లెడఁబాటులకే యగును. పుట్టుట గిట్టుటకొఱకే యగును. చెట్టునందుఁ
బండిన పం డెట్లు పడకతీఱదో, యట్లె పుడమినిఁ బుట్టిన మానవుఁడు
మరణము నొందక తప్పదు. కావున మానవుఁడు మరణభీతి నొందుట
యవివేకము. గట్టిగుంజలుగల యిల్లు, ప్రాఁతగిలి కూలుచందము నరులును
దిటవుగలవారుగ నున్నను జరామరణములకు లోఁబడినవారలై నాశ
మొందుదురు. కడచినరాత్రి మఱల రాదుగదా! నిండు ప్రవాహముతోఁ
బ్రవహించు యమున జలపూర్ణమయిన సముద్రమునఁ జేరుచున్నదే
కాని యచ్చటినుండి మఱలదు. భూలోకమున పగళ్లు రాత్రు లొక్కటి
వెంబడి నొక్కటిగఁ బోవుచున్నవి. అయ్యవి ప్రాణు లందఱి యాయుస్సు

లను, మందు వేసవిని సూర్యకిరణము లుదకమునుబోలె నానాటఁ
దఱుగఁజేయుచున్నవి. నీవు నిలుచున్నను, నడచుచున్నను, ఆయుస్సు
క్షీణించుచుండఁగా, నిన్నుఁగూర్చి నీవు దుఃఖపడక యెరులంగూర్చి
కుందుచున్నాఁడవేల? పోవునట్టి మనుజునంటి మృత్యువు పోవుచుండును.
కూర్చుండు మనుజుని వెంబడే యది కూర్చుండియుండును. కడుదవ్వు
నడచివచ్చినను మృత్యువు కూడనే వచ్చుచుండును. కావున మన మెచ్చు
టికిఁ బోయినను మృత్యువునుండి తప్పించుకొనఁజాలము. అవయవము
లందు ముడుతలు పడుచున్నవి. తలవెండ్రుకలును నెఱయుచున్నవి.
ముదుసలితనముచేఁ బురుషుఁడు శిథిలుఁడగుచున్నాఁడు. వీని నే యుపా
యముచేఁ దప్పించుకొనఁగలఁడు? కావున ప్రాయమున నున్నప్పుడే పర
బ్రహ్మవిచారణను, వ్రతోపవాసాదికర్మలను జేయవలయును. మనుజులు
సూర్యుఁడుదయ మొందఁగానే, ద్రవ్యసంపాదనాదికార్యములు జరుగఁ
గలవు గదా యని తనివి నొందెదరు; సూర్యుఁడస్తమించునప్పుడు నిద్రా
కామసుఖము లనుభవింపవచ్చును గదా యని యానంద మొందుదురు.
కాని, యహోరాత్రములు గడచుటచేఁ దమ యాయుస్సు క్రమముగ
క్షయించుచున్నదని యెఱుఁగఁజాలరు. ఋతుస్రారంభములను జూచి క్రొత్త
క్రొత్త ఋతువు వచ్చెఁగదా యని జను లానందింతురుగాని, ఋతువుల
వెంబడి ఋతువులు వచ్చుచుండుటచేఁ దమయాయువు క్షీణించె నని
యెఱుఁగరు. ఒకనదీప్రవాహమునందు నొక కట్టె యొకవైపునుండియు,
మఱియొక్కటి మఱొక్కవైపునుండియు వచ్చి కొంతకాలము చేరి
యుండి, పిదప నెట్లు వేఱగుచున్నవో, అట్లే భార్యలు, పుత్రులు,
దాయాదులు, ధనమును. ఎప్పటికైనను భార్యాపుత్రాదులు విడిచి
పోవుట నిశ్చయము. ఇహలోకమున మానవుఁడు తన యిచ్ఛానుసార
ముగాఁ నడచుకొనఁజాలఁడు గావున మానవుఁడు మృతునింగూర్చి వం
తల నొందుటచే నుపయోగ మేమియు లేదు. వాని నేమో మృత్యువు
బ్రతికింపఁబోవునది లేదు. దారినిబోవుచున్న బాటసారులం జూచి యా
దారి నున్న వాఁ డొక్కఁడుఁడు "నేనును మీ వెంబడి వచ్చెదను" అని
వారిని వెంబడించిపోవునట్లు మనమును తొల్లింటి పెద్దలైనతాత ముత్తా
తలచే ననుసరింపఁబడిన మార్గమున పోవలయును. తిరుగుపాటు లేని యా

పూర్వికులమార్గము నందిన నేల వ్యసనపడవలెను? పాఱుచుం డెడి ప్రవాహమువలెఁ బ్రాయము గడచిపోవుచుండుఁ గావున నాత్మకు సుఖకరమయిన దానాదిసత్క్రియలు చేయుచుండవలెను. వారే మానవులనఁబడుదురుగాని, పరలోకహేతు వగు ధర్మకార్యములం జేయని వారు మృగప్రాయు లనఁబడుదురు. ధర్మాత్ముఁడగు మన తండ్రియగు దశరథన్నపాలుఁడు మంగళకరములైన యనేకములగు జన్నములు చేసి, విశేషదక్షిణ లొసఁగి, యీ పుణ్యమహిమచే స్వర్గలోకము నొందెను. మన తండ్రి లెస్సగాఁ దనభృత్యులను బోషించుటచేతను, ప్రజలను బాలించుటచేతను, బీదలకు విశేషముగా దానము లొసఁగుటచేతను, సకలశుభకర్మలాచరించుటచేతను, విస్తారములైన దక్షిణలతోఁ గూడిన జన్నములు సేయుచుండుటచేతను దేవతా, పితృ, ద్విజులం దనివి నొందించి, పెద్దకాలము రాజ్యము పాలించి, దీర్ఘాయువుంబడసి, యెంతయో కాలము సౌఖ్యము లనుభవించి, మృతినొందెను. ఆ మనతండ్రి శిథిలమయిన మానవదేహము విడిచి, స్వర్గలోకమున దివ్యభోగము లనుభవించుచున్నాఁడు. నీవు సకల శాస్త్రములనెఱిఁగినవాఁడవు, బుద్ధిమంతులలోపల శ్రేష్ఠుఁడవునై యొట్టి సుగుణసంపద గలిగియున్నాఁడవో, అట్టి నీబోటి ప్రాజ్ఞుఁడతనింగూర్చి యిట్లెఱిఁగిన వ్యసనము నొందఁదగదు. ఈయేడ్పు, కన్నీరునిడుచుట మొదలగు నానావిధములగు వ్యసనములను ధీరుఁడైన బుద్ధిమంతుఁడగు మానవుఁడు సర్వకాలసర్వావస్థలంచును విడువవలయును. మాటకాంద్రలో శ్రేష్ఠుఁడా! నీవు నెమ్మదిపడుము. వంత మానుము. నీవు మఱలి, పురమున కేగి రాజ్యము నేలుము. స్వతంత్రుఁడయిన తండ్రి యట్లె నీ కానతిచ్చెను. ఆయన యానతి మీఱుట తగదు. పుణ్యస్వభావుఁడగుపూజ్యుఁడయిన తండ్రి నన్నేమి చేయుమని యానతిచ్చెనో, దానిని నే నిచ్చటనుండి యాచరించెదను. శత్రుసంహారీ, నే నా తండ్రి యానతి మీఱుటన్యాయ్యము గాదు. నా కెట్లో నీకు నట్లతనిమాట త్రోయఁదగినది గాదు. ఆతఁడు మన కందఱికి హిత బంధువు; రఘువంశోద్భవా, ధర్మము నడపువాఁడగు తండ్రియొక్క యిష్ట మగు వనవాసరూపమయిన యాజ్ఞను నేను శిరసావహించి వనమునను నుండి పదునాలుగేండ్లు గడపెదను. పురుష

శ్రేష్ఠుఁడా! పరలోకము నొందఁగోరు మానవుఁడు స్వధర్మమును దప్పక యాచరించువాఁడును, దయాళువును, పెద్దలమాట చొప్పున నడుచుకొనువాఁడునునై యుండవలయును.పురుషశ్రేష్ఠుఁడా! మన తండ్రియగు దశరథనరేంద్రుని సదాచారముఁ దిలకించి, నీ వాతని యానతిచొప్పున రాజ్యముఁ బాలింపుము" అని యుధాజిత్తుఁడును సమర్థుఁడునైన రాముఁ డివ్విధమునఁ దండ్రియానతిప్రకారము నడచుకొమ్మని తన తమ్మునితోఁ నర్థవంతము లగు కొన్ని మాటలు పలికి యూరకుండెను.

106-వ సర్గము

భరతుఁడు రాము నయోధ్యకు రమ్మని వేఁడుట

అంత మందాకినీతీరమున రాముఁ డర్థగౌరవము గల కొన్ని మాటలు పలికి చాలింపఁగా, ధర్మపరాయణుఁ డయిన భరతుఁడు భక్తజనవత్సలుఁ డయిన రామునింగూర్చి ధర్మము ననుసరించిన యొక్క మాట యిట్లు పలికెను.—"ఓ శత్రుసంహారీ! నీయట్టి వాఁ డీ లోకమున నెవ్వఁ డున్నాఁడు? నీ కాపద వచ్చినప్పుడు వ్యసనము లేదు; సుఖము వచ్చినప్పుడు సంతసమును లేదు. సుఖదుఃఖములను రెండింటిని సమానముగాఁ జూచుచున్నాఁడవు. పెద్దల కిష్టుఁడవు. నీ కెద్దియైన సందియము గలిగినప్పుడు వారి నడిగి తెలసికొందువు. మృత్యునియందుఁ బోలె బ్రతికినవానియందును బగసూపకుండుట, లేనివస్తువునందువలెనున్న వస్తువునందును బ్రేమవిడుచుట యను నీ బుద్ధి యెవనికిఁ గుదురునో, వాఁడు మనసున నొక్కింతయైనను వంత నొందఁడు. మానవేంద్రా, నిత్యానిత్యవస్తువివేకము గలవాఁ డెంతటి యాపద వచ్చినను విచారము నొందఁడు. అట్లు నీవును ఆత్మానాత్మవివేకము గలవాఁడవయి విచారము నొందఁకున్నాఁడవు. ఓ రఘువంశోద్భవా! నీవు దేవతలతోసమానమయిన బలముగలవాఁడవు; ధైర్యవంతుఁడవు; ప్రతిజ్ఞ దప్పనివాఁడవు; సర్వము నెఱిఁగినవాఁడవు; సర్వముఁ జూచువాఁడవు; వివేకివైనవాఁడవు. ఇట్టి సద్గుణములు గలవాఁడవు; ఉత్పత్తిలయముల నెఱింగినవాఁడవు, ఓర్వరాని మహిమగలవాఁడవు నైన నిన్ను దుఃఖము నొప్పింపఁ జాలదు. నేను దేశాంతరమున నుండఁగా, నాతల్లి నీచురాలై నాకు రాజ్యము రాఁగోరి యే పాపకృత్యముచేసినదో యది నా మన

మునకు సమ్మతము గాదు. కావున నాపైఁ గరుణ యుంచి నన్నుగ్రహిం పుము. నేను ధర్మపాశమునకుఁ గట్టువడియున్నాను. కావున పాపకృత్య మొనరించుటచే దండనమునకు వజ్రాలాయిన ఆ నాతల్లిని తీవ్రముగ దండించి చంపకున్నాను. సత్కులప్రసూతుఁడును, సత్కార్యపరా యణుఁడునైయున్న దశరథ నృపాలునికిఁ బుట్టి, ధర్మమార్గముఁ దెలిసి యుండి, ధర్మవిరుద్ధమైనదియు, లోకులచే నిందితము నైన యీ రాజ్య పరిపాలనరూపకార్యము నెట్లాచరింతు. గురువనియు, యజ్ఞాది సత్కార్య ములు చేసినవాఁడనియు, ముదుసలి యనియు, రాజనియు, మ్నతినొందిన వాఁడనియు, తండ్రి యనియు, నైనమనియు నెంచి నే నతనిని సభలో నిందింపను. ఓ ధర్మజ్ఞుఁడా! ధర్మవేత్త యగువాఁడెవ్వఁడు స్త్రీకిఁ బ్రియముసేయఁగోరి, ధర్మార్థములకు రెంటికి విరుద్ధమైన యిట్టి పాప కృత్యము సేయనోపును? ముదుసలితనమున జంతువులబుద్ధి మాతి పోవు నని వేదములు చెప్పుచున్నవి. దశరథుఁ డీలాగు చేసి, యీ వేద వాక్యమును నిజముచేసెను. కైకేయి కోపపడుటవలనను, కైకేయిపై మోహామువలనను, సాహసమువలనను తండ్రి ధర్మార్థములకు విరుద్ధ మయిన యిక్కార్యము చేసెను. దీనిని నీవు చక్కఁగా నాలోచించి సవరింపవలయును. ఏ కుమారుఁడు తండ్రియొక్క కార్యమును చెడ్డ దానినైనను మంచిదానినిగాఁ దలఁచునో యీ కొమరుఁడు కొమరుఁడు గాఁడు. నీవు తండ్రి యొనర్చిన లోకనింద్యమైన పాపపుఁగార్య మంగీక రించి, నీ వట్టి కొమరుండవు కాకుము. కైకేయి, తండ్రి, నేనును నీకప కార మొనర్చినవార మైనను, దానిని బరిగణింపక, మమ్మును, మిత్ర ములను, బంధువులను, పురములందును, పల్లెలందును నుండు జనులను, ఈ రాజ్యము నంతయును నీవు కాపాడవలయును. అరణ్య మెచ్చట! రాజధర్మ మెక్కడ! జడ లెక్కడ! రాజ్యపాలన మెక్కడ? నీ విప్పు డిట్టి యసాస్త్రీయమైన కార్యము సేయుట తగదు. క్షత్రియునకు రాజ్యాభి షేకము గదా ప్రథమధర్మము. ఆ పట్టాభిషేకమువలననే కదా జనుల పరిపాలించుటకు శక్యమగును. క్షత్రియుఁ డెవ్వఁడు దానభోగములచేఁ బ్రత్యక్షఫలదమయిన రాజ్యపరిపాలనరూపధర్మమును విడిచి, సందిగ్ధ మును, గుఱుతులేని దౌటచే నిశ్చితము గానిదియు, నుత్తర

కాలమునఁ బుణ్యము నొసఁగునదియు నైన మునిధర్మము నాచరిం చును? అట్లు కాక, నీవు కష్టపడి ధర్మార్జనము సేయవలెనని కోరుదువేని, నాలుగువర్ణములను న్యాయమార్గమునఁ బాలించుచుఁ గష్టఫలము నొందుము. బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్థ, సన్న్యాసము లనెడు నాలు గాశ్రమములలో గృహస్థాశ్రమము శ్రేష్ఠమని ధర్మవేత్తలయిన పెద్దలు వక్కాణింతురు. ఓ ధర్మజ్ఞుఁడా! నీ వట్టి గృహస్థధర్మము విడువఁ బూనుట పాడియగునా? నేను నీకంటె వయసునఁ జిన్నవాఁడను; శాస్త్ర జ్ఞానమునను, స్థానమునను జిన్నవాఁడను. అట్టి నేను, నీ వుండఁగా నెట్లు భూమండలము నేలఁగలను? నేను బాలుఁడనుమాత్రమె కాక, బుద్ధి యందును, గుణములందను దక్కువవాఁడను. హీనస్థితియం దుండువాఁ డను. ఇట్టి నేను నిన్నువిడిచి యొక్కనిమిషమైన మనఁజాలను. నే నెట్లింత విస్తారమైన భూమండలము నేలఁగలను? ఓ ధర్మజ్ఞుఁడా! నీవు సకలధర్మ ములఁ నెఱిఁగినవాఁడవు గావున, న్యాయాన్యాయములఁ బరిశీలించి, స్వధర్మము పూని, బంధు సమేతుఁడవై నిష్కంటకమైన యీ రాజ్య మును మెలఁకువతోఁగూడి పాలింపుము. ఇచ్చటనే మంత్రులును, వసిష్ఠుఁడును, మంత్రవేత్తలగు ఋత్విజులును గూడి శాస్త్రవత్తుగా నీకుఁ బట్టాభిషేకం బొనరింతురు. లోకముల జయించి యనంతరము, వేల్పు లచే నభిషిక్తుఁడయిన దేవేంద్రునిఁబోలె నీవును మాచేఁ బట్టాభిషిక్తుఁ డవై, వెలుఁగుచు నయోధ్యకేతెంచి రాజ్యముఁ బాలింపుము. అయోధ్యఁ జేరి, దేవ, ఋషి, పితృఋణములను దీర్చుకొనుచు, దుష్ట లను లెస్సగా దండించుచు, సాధువ్రతులను సర్వకామము లొసఁగి తనిపి నొందింపుచు, నీవే నన్నుఁ బాలింపుము. ఓ పూజ్యుఁడా! నీ పట్టాభిషే కముచే నిప్పుడే నీ చెలికాండ్రందఱు సంతసిల్లుదురుగాక. ఇప్పుడే నీ శత్రువు లందఱు వెఱచి మూలమూలకుఁ బరుగిడుదురుగాక. పురుషో త్తమా! నామీఁదను, నాతల్లిమీఁద నున్న కోపమును మాని, ఇప్పుడే పూజ్యుఁడయిన తండ్రికిఁ గూడఁ బాపము కలుగకుండునట్లు కాపా డుము. నేను నీ పాదములపైఁబడి మ్రొక్కెదను. నాయందు దయ యుంచుము. మహేశ్వరుఁడు సర్వభూతములందు దయ గనఁబఱచు లాగున, బంధువు లందఱియందును గరుణఁ జూపుము. నీవు నామాట

వినక, యడవికే పయనమైతివేని, నేనును నీ వెంబడి వత్తును" అని భరతుఁడు రాముని బలుతెఱఁగులఁ బ్రార్థించెను.

ఇట్లు భరతుఁడు మనమునఁ దల్లడిల్లుచు ననేకవిధముల వేడ్కొనుచుఁ పాదములకు సాగిలఁబడి మ్రొక్కుచున్నను, రాముఁడు ధైర్యవంతుఁ డగుటంజేసి, తండ్రియొక్క మాటను నడపుటయందే మనము గలవాఁ డగుటచే నయోధ్యాపురమునకు మఱలిపోవ మనమునఁ దలంపఁడాయెను. అప్పుడు జను లందఱు రాముని యందలి యద్భుతమైన ధైర్యమునుజూచి, "భరతుఁ డెన్ని విధముల బతిమాలినను, రాముఁ డమోఘ్యకు రాఁదలఁపకున్నాఁడుగా" యని వగచిరి. "భరతుఁ డెన్ని తెఱఁగులఁ బ్రార్థించినను, రాముఁడు దన ప్రతిజ్ఞ విడువకున్నాఁడుగదా" యని సంతసము నొందిరి. అప్పుడు ఋత్విజాలును, పట్టణగ్రామవాసులగు పెద్దలును, కౌసల్యాదులును స్మృతిఁ దప్పి, కన్నీళ్ళచే మాటలు దడఁబడఁ జుండఁగా, భరతునిమాటలను విని "యాతఁడు చెప్పినది బాగుగానున్న"దని తలయూఁచిరి. వారును భరతునితోఁగూడ రామునికిఁ మ్రొక్కి యయోధ్యకు రమ్మని రామునిఁ బ్రార్థించిరి.

107-వ సర్గము

రాముఁడు భరతు నయోధ్యకుఁ బొమ్మనుట

సిరియు, మర్యాదయుఁ గలవాఁ డగు లక్ష్మణాగ్రజుఁడగు రాముఁడు మఱల నిట్లు పలుకుచున్న భరతునింగూర్చి, బంధువు లందఱి నడుమ "ఓ తమ్ముఁడా! నీ విప్పుడు చెప్పిన మాటలు ట్టెక్కెకు దశరథ నరేంద్రునివలన జనించిన నీకుఁ దగియున్నవి. తొల్లి మనతండ్రి తల్లి యగు కైకం బెండ్లాడినప్పుడు నీ తాతతో దీనికిఁ బుట్టిన కుమారునికి రాజ్య మిచ్చెద ననివా గ్దానముచేసెను. అంతియగాక తొల్లి దేవాసుర యుద్ధమునందు మన తండ్రి పగతురబాణములచేఁ గొట్టఁబడి రథమున మూర్ఛిల్లఁగాఁ, గూడనుండిన కైకేయియు నాతనికి వలయు నుపచారము లొనర్చెను. అయ్యుపచారములకు దశరథనృపాలుఁడు సంతసము నంది వరములు రెండు గోరుమని నీతల్లి ననఁగా, నామె నీకుఁ బట్టాభిషేకము సేయుటయు, ననున్నుఁబదునాలుగేండ్లడవికిఁ బంపుటయు ననురెండువరము లిమ్మని యడిగెను. నృపాలుఁడు నామె యిష్టముచొప్పున రెండువరముల

నొసఁగెను. నేను సాటిలేని పరాక్రమముగలవాఁడనైనను, తండ్రిమాట ప్రకారము నడచుకొనఁగోరి, సీతాలక్ష్మణులను దోడ్కొని యిచ్చటి కేతెంచితిని. రాజశ్రేష్ఠుఁడా! నీవును వేగ నేగి, పట్టాభిషేకము సేసికొని, తండ్రిమాటను నిజముచేయుము. భరతా! సకలజనరక్షకుఁడయిన రాజును కైకేయీఋణమునుండి విడిపించుము. ధర్మవేత్తయగు తండ్రిని తల్లిని నానందపఱుపుము. ఓ నాయనా! తొల్లి కీర్తిమంతుఁడగు గయుఁడను చక్రవర్తి గయయందు పితృదేవతల నుద్దేశించి జన్నముసేయుచు, "కొమరుఁడు తండ్రిని పుత్తనెడి నరకమునుండి పితృదేవతల నుద్ధరించుట తండ్రివేర నిష్టాపూర్తాదులు గావించి పరలోకమున నున్నవారినిఁగాపా డుటచేతను బుత్త్రుఁడనఁబడును. గుణవంతులును, విశేషశాస్త్రజ్ఞానము నము గలవారు నగు బహు పుత్త్రులు గావలయు నని కోరవలయును. వా రందఱు గయకుఁబోయి శ్రాద్ధముసేయకున్నను, వారిలో నొక్కఁ డైనను గయకుఁ బోయి శ్రాద్ధము నొనరించును." అని యొక గాథం జెప్పెను. రాజనందనా! యిట్లొనర్చియొ రాజర్షు లందఱు ప్రఖ్యాతిఁ జెందిరి. ఓ సమర్థుఁడవగు నరశ్రేష్ఠా! నీవును దండ్రి మాట ప్రకారము నడచికొని, తండ్రిని నరకమునుండి యుద్ధరింపుము. వీరుఁడ వగు భరతుఁడా! నీ వయోధ్యకుఁ జనుము. శత్రుఘ్నుని వసిష్ఠాది బ్రాహ్మణోత్తముల నందఱను తోడునేసికొని, న్యాయమున రాజ్యముఁ బాలించుచు జనులను సంతోషపఱుపుము. నేనును జాగునేయక సీతా లక్ష్మణులతోఁగూడి దండకారణ్యముఁ జొచ్చెదను. భరతా! నీవు జనుల కందఱకు రాజవుగమ్ము. నేను నడవులందలి మృగములకు రాజరాజ నయ్యెదను. నీ విప్పుడు సంతసముతోఁ బురశ్రేష్ఠమగు నయోధ్యకుఁ బొమ్ము. నేనును మహానందముతో దండకారణ్యములఁ జొచ్చెదను. భరతా! శ్వేతచ్ఛత్రము నీ నెత్తిని నెండ దగులనీయక చల్లనినీడను గలిగించును. నేనును ఈ యడవులం దుండెడి మహావృక్షములయొక్క దట్టమయిననీడను బొంది హాయిగా నుందును. బుద్ధి కుశలత గల శత్రు ఘ్నుఁడు నీపు బాసటయైయుండును. నాకు లక్ష్మణుఁడు ననుఁగుచెలి కాఁడై యుండును. భరతా! పుత్రరత్నముల మైన మనము నలుపురము

నిశ్చైఱఁగున నరేంద్రునిప్రతిన నెఱవేర్చి యతనిమాట చక్కఁనట్లు చేయుదము. విచారము నొందకుము." అని చెప్పెను.

108-వ సర్గము

జాబాలి రామునితో అహితము పలుకుట

భరతు నిశ్చైఱఁగున నూఱడింపుచుండు ధర్మవేత్త యగు రామునిఁ జూచి, జాబాలియను బ్రాహ్మణోత్తముఁడు నాస్తికయముఁ దప్పిన మాటలఁ జెప్పఁ దొడఁగెను: "ఓరఘువంశోద్భవా! నీవు గొప్ప బుద్ధిగల వాఁడవు, ధైర్యశాలివి. ఇట్టి సీపు నీచునివలెఁ బనికిఁరాని బుద్ధి గలిగి యుండుట లెన్నఁగాదు. దీనిని మూఁఢము. మనుజుఁడు పుట్టినప్పు డొక్కఁడుగఁ బుట్టుచున్నాఁడు; గిట్టునప్పు డొక్కఁడుగ గిట్టుచున్నాఁడు. ఎవని కెవ్వఁడు చుట్టము? ఒకనికి మఱియొక్కనివలనఁ గావలసినది యేమి యున్నది? కావున రామా! యెవ్వఁడు "ఈమె నా తల్లి"యని, "ఈతఁడు నాతండ్రి" యని మోహము గల్గియున్నాఁడో, వాఁడు వెఱ్ఱి వానితో సమానుఁడని యెఱుఁగవలయును. ఒకనికి నొకఁడు లేఁడు. ఒకానొకఁడు పొరుగూరికిఁ బోవుచుఁ జీఁకటిపడినప్పు డొక్కచోట నిలుచును. మఱునాటి యుదయమున లేచి, మన మిచ్చట నీ రేయి యుంటిమే యని యూఁ తావుపై మోహ ముంపక యచ్చోటుఁబాసి, దారిసాగి పోవుచుండును. ఇట్లే సంసారమునఁ బుట్టుచుఁ గిట్టుచు నుండు ప్రాణికిఁ దల్లిదండ్రులు, ఇండ్లు వాకిండ్లు, ధనధాన్యములు విడిదలల వంటివి. అచ్చట నుండువఱకు వారికిని మానవులకు సంబంధ మున్నది గాని యవల నేమియు సంబంధము లేదు. కావున వారిని వదలినపిదప వారిప్రీతికై వ్రతాదు లొనర్చుట వ్యర్థము. నరోత్తమూఁడా! నీవు పైతృకమయిన రాజ్యమును వదలి ముండ్లపాఁతరయు, యొడ్డాఱికము నయి మిగులబాధను గల్గించు దుర్గమారణ్యముల నుండఁబోకు. పతివ్రత యగు కాంత తనభర్తను బాసియుండునప్పు డొంటిజడ గలదై, తన ప్రియుని రాకకై వేచియుండునట్లు, అయోధ్యయు నీ రాకకై యెదురు చూచుచున్నది. రాజపుత్రా! సకలసంపత్సమృద్ధ మయిన యయోధ్యా పురమునకు మఱలి పట్టాభిషేకము చేసికొని, యుత్తమములయిన భోగ ముల ననుభవించుచు, దేవేంద్రుఁడమరావతియందు విహరించుచంద

మున నయోధ్యాపురమున విహరింపును. నీకు దశరథుఁ డెవ్వఁడు? దశరథునకు నీ వెవ్వఁడవు? దశరథుఁ డొక్కరాజు; నీవొక్క రాజవు. నీకును నాతనికి నెట్టిసంబంధమును లేదు. కావున నేఁజెప్పునది చేయుము. తండ్రి జంతువునకు బీజమాత్ర కారణము. ఋతుస్నాత యగు తల్లి యొక్క శోణితముతోఁ గలిసిన తండ్రియొక్క వీర్యమే మానవుని యుత్పత్తికిఁ గారణ మయియున్నది. అంతమాత్రమునకే తండ్రిమాట గొప్ప చేయఁదగదు. ఆ దశరథుఁడు పోయి చేరవలసిన స్థలమునకుఁ బోయి చేరెను. అందఱు ప్రాణులసంగతియు నిట్టిదియే. నీవుమాత్రమేల లేనిపోని సంబంధ మొక్కటి గల్పించుకొని బాధపడుచున్నావు. కేవ లార్థమునందే, కేవల ధర్మమునందేయాసక్తిగలవారిని జూచి నామనము పరితాపపడును; ఇతరులనుగూర్చి పరితాపపడదు. అట్టి వారి లోకమునఁ గష్ట మనుభవించి పరమునను జెడుదురు. జనులు "అష్టకా శ్రాద్ధమని, ప్రత్యబ్దిక"మని పితరులంగూర్చి శ్రాద్ధములఁ జేయుదురు. ఇది యూఁతిక యన్న మయిపోవుటయే కాని, మృతుఁడేమైన వచ్చి తనునే? వేఱొక్కఁడు దిన్న యన్నము మృతుఁడయినవాని దేహమునఁ జేరి, వానికిఁ దనివిఁ గల్గించునది నిక్కమైనచో, దేశాంతరమున కేగిన తండ్రికి వాని పుత్రులు శ్రాద్ధమిడినచో నా శ్రాద్ధమునందు భుజించినవారి కడుపునఁ బడ్డ యన్నము దేశాంతరస్థుఁడైన వాని తండ్రికి దారికూడు గావచ్చును గదా? "యాగములు చేయుము. పాత్రులకు దానము లొసఁగుము. వ్రతము లొనర్పుము. తపస్సు చేయుము. సన్న్యసము పూనుము."అని బుద్ధికుశలతగల వారు ద్రవ్యార్జనకై యనేక గ్రంథములు ధర్మ శాస్త్రము లని, స్మృతు లని పేర్లుపెట్టి రచించిరి. అవి యెల్ల యోచించి, పర మనునది యొక్కటి లేదని తలంపుము. కంటికిఁ గనఁబడు రాజ్య భోగాదుల ననుభవింపుము. ఏ కంటికిఁ గనఁబడని పితృవాక్య పరిపాల నాది ధర్మముల విడువుము. ఓ నృపాత్మజా! భరతుని వేడికొలు నియ్యకొని, స్వాజనసమ్మత మయిన ప్రత్యక్షమగుదానికంటె నెక్కువ ఫల మొసఁగునది వేఱొక్కటి లే దని నిశ్చయించి, రాజ్యముఁ బొంది సకల సుఖముల బొందుము."అని జాబాలిమహాముని నాస్తికమతా వలంబియై రామున కధర్మవాక్యమును బోధించెను.

109-వ సర్గము

రాముఁడు జాబాలి మతమును ఖండించుట

సత్యస్వభావులలో మేటియైన శ్రీరాముఁడు జాబాలిమునియొక్క పలుకులు విని యెక్కువ కర్ణశ్రద్ధగలవాఁ డగుటచేత బుద్ధి చపలత నొందక యప్పునీంద్రునితో నిట్లనియె:—ఓ మునీంద్రా! నీవు నామేలు గోరి చెప్పినమాట యకృత్యమైనను కృత్యమువలెఁ దోఁచుచున్నది. హితము గాకపోయినను హితమువలెఁ గనఁబడుచున్నది. మర్యాద లేనివాఁడు, చెడునడవడి గలవాఁడు, వేదవిరుద్ధమైన యాచారముల బోధించు మతమునందుఁ బ్రవర్తించువాఁడునైన మానవుఁడు పెద్దల నడుమ గౌరవము నొందఁడు. పురుషుఁడు సత్కులప్రసూతుఁడయి నదియు, చెడుకులమునఁ బుట్టినదియు, శూరుఁడయినదియుఁ, బెదరుస్వభావము గలవాఁ డయినదియు, ఆచారవంతుఁ డయినదియు, అనాచారవంతుఁ డయినదియు వానినడవడిగొలె తెలుపును. నే నయోగ్యుఁడనై యోగ్యునివలెను, ఆచారహీనుఁడనయిఁ యాచారవంతునివలెను, శుభలక్షణములు లేనివాఁడనయి శుభలక్షణములు గలవానివలెను, చెడునడవడి గలవాఁడనయి మంచినడవడిగలవానివలెసునై సద్ధర్మమును వదలి, వైదికక్రియలును, శాస్త్రవిధులును లేనిదియు, జనులను జెఱుపునదియు నైన యీ యధర్మమును ధర్మమనుబుద్ధితో నంగీకరింతు నేని, లోకమున మంచి చెడ్డ లెఱుఁగఁగల జ్ఞానవంతుఁడగు మానవుఁడు, చెడునడతలు గలిగియు మంచివానివలె నటించు నన్ను గారవింపఁడుగదా! ఆడినమాట తప్పినట్టి యీ నడవడి గలిగియుందునేని, నే నెవ్వరికి నీతులు గఱపుదును. ఏ విధముగా స్వర్గలోకమును బొందుదును? నే నిప్పు డాడినమాటఁ దప్పుదునేని, యీ జను లందఱుఁ దమ యిచ్ఛల చొప్పున నడుచుకొందురుగదా! రాజు లెట్టి నడతను గలిగియుందురో, జనులు నట్టి నడతల నవలంబింతురుగదా! సత్యమే చక్కనైన శాశ్వత రాజధర్మము గావున రాజ్యము సత్యస్వరూపమై యున్నది. సత్యమునందే లోకములు నిల్చియున్నవి. ఋషులును దేవతలును సత్యమునే గొప్పగా నెంచిరి. ఇహలోకమున సత్యము పలుకువాఁడె యంతమునం దుత్తములోకములం బొందును. బొంకులాడువానిఁ

జూచి, పామును జూచి వెఱచునట్లు జనులు వెఱతురు. సత్యమే యీ లోకమున నుత్తమ ధర్మమనియు, స్వర్గప్రాప్తికిఁ బ్రధానకారణమనియుఁ జెప్పఁబడుచున్నది. సత్యమే లోకమునకుఁ బ్రభువు. సత్యమే యెల్లప్పుడు కలిమి కాశ్రయమైనది. అన్నిటికి సత్యమే మూలాధారము. సత్యమునకంటె మించిన యొక గొప్ప పదవి లేదు. మనము చేయు దానములు, యజించు యాగములు, వేల్చెడు హోమములు, జపించు తపస్సులు, ఆచరించు వ్రతములు, పఠించు వేదములు సత్యమునందే నిలిచియున్నవి. కావున మానవుఁడు సత్యనిరతుఁడై యుండవలెను. ఒకఁడు లోకమును పాలించును. ఒకఁడు కులమును పాలించును. ఒకఁడు నరకమును పొందును. వే ఱొక్కఁడు స్వర్గమునఁ బ్రకాశించుచుండును. అనఁగా, సత్యవంతుఁడును, అసత్యవంతుఁడును వారివారిగుణానురూపములైన ఫలములను పొందుదురు. ఆడినమాట తప్పనివాఁడను, తప్పక వనవాస మొనరించెద నని శపథముచేసినవాఁడనునైన నేను నిజమయిన మా తండ్రియొక్క యాజ్ఞ నెట్లు చేయకుందును? సత్యసంధుఁడనైన నే నజ్ఞానముచేఁగాని, పేరాసచేఁగాని, మైమఱపుచేఁగాని తొందరపడి సత్యముయొక్క కట్టను దెగఁగొట్టఁజాలను. ఆడినమాట తప్పువాఁడును, చంచల హృదయుఁడును, కట్టుపాటులేనివాఁడునునైన వాఁడొసఁగు హవ్యకవ్యములను వేల్పులుగాని, పితరులుగాని గైకొనరని పెద్దలు చెప్పఁగా వినియుంటిని. కావున సత్యవ్రతమే పరమాత్మస్వరూప మని నే నెంచుచున్నాను. కాఁబట్టి సజ్జనులు దాల్చెడు జటావల్క లాజినములు నేను దాల్చుచున్నాను. నీచులు, క్రూరులు, లోభులు, పాపాత్ములు నగు వా రవలంబించునట్టి క్షత్రియధర్మమును నేను విడిచెదను. ఆ క్షత్రియధర్మమున నధర్మము హెచ్చుగను, ధర్మము తక్కువగను నున్నది. అట్టి ధర్మమునాచరించుట శ్రేయము గాదు. మానవుఁడు పాపకార్యమును మనమున నిట్లు చేయవలసినది యని యెంచుకొని, పిదప దేహముతోఁ జేసి, నోటితోఁ జేసినది లేదని చెప్పును. కావున మానసిక, కాయిక, వాచికములగు ముత్తెఱఁగు లయిన పాపములను చపలుఁడగు మానవుఁడు సంపాదించుకొనును. సత్యముఁ దప్పని పురుషుని కీర్తి, యశస్సు,

సంపద, భూమి యనునవి తమంతటఁ దామే పొందఁగోరుచుండును. అతఁడు స్వర్గమున కేగినను, అవి వానిని విడువవు. కావున సత్యమునుసు దప్పఁగూడదు. ఓ మహామునీ! "ఇది మే లయినది. దీనినిఁ జేయుము" అని శ్రుతి స్మృతి విరుద్ధముగా యుక్తిప్రధానములైన వాక్యములతో నన్నుఁగూర్చి నీవేమి చెప్పితివో, యీ యయుసదేశము పైకి మంచినిగాఁ గనఁబడుచున్నను, అది యుక్తము గాదు. నేను తండ్రియొయుట వనవాస మొనరెదఁ దని ప్రతిజ్ఞ సేసి, యిప్పు డా తండ్రి మాటను తుంగలలోఁ ద్రొక్కి భరతుని మాట నెట్లు విందును? నేను తండ్రియొనుట, ధైర్యముతో వనవాసము చేసెద ననిగట్టిమాట చెప్పితిని. నా పలుకులు విని కైకయు నంతకునున్ను విచారము మాని, మనమున సుప్పొంగెను. కార్యాకార్య విచక్షణుఁడ నైనండున, నేను "ప్రతోపవాసాది కర్మములవలన నేమి ఫలమున్నది?" ఈ మొదలగు కుత్సితబుద్ధులు మాని, పితృవాక్యపరిపాలనాది సద్ధర్మాచరణమునందు ఫల మున్న దని నమ్మి, యిట్లొఱఁగున వనవాసముచేయుచుఁ బరిశుద్ధుఁడనై, భోజనీయమములుగలిగి, కంద మూల ఫలపుష్పాదులచే దేవతలం బితరులం దృప్తినొందించుచుఁ బంచేంద్రియముల సంతుష్టిగలవాఁడనై శాలము గడిపెదను. జను లీకర్మభూమియం దుండునంతవఱకు శుభకృత్యములు సల్పుచుండవలయును. అగ్ని వాయు చంద్రులును గర్మభూమియం దుండునప్పుడు సత్కర్మల నాచరించి, తత్ఫలములుగా నగ్నిత్వ, వాయుత్వ, చంద్రత్వములం బొందిరి. దేవేంద్రుఁడు కర్మభూమియం దుండి నూఱు జన్నము లొనర్చి, శతక్రతు వని సార్థకనాముఁడై, స్వర్గలోకాధిపత్యమును బొందెను. మహర్షు లనేకులోర్వరాని తపము లొనర్చి స్వర్గము నొందిరి." అని యిట్లొఱఁగున సుగ్రతేజుఁడగు దశరథ సందనుఁడు జాబాలితోఁ జెప్పి, యమ్మునిచెప్పిన "సర్వం మిథ్య" యను నాస్తికోక్తులఁ దలఁచి తెలఁచి, కోపము నాఁపుకొనఁజాలక, యాతని మాటలలో నొక్కొక్కటి దానిని ఖండించుచు మఱియు నతనితో నిట్లనియె: "సత్యము, ధర్మము, శౌర్యము, భూతదయ, ఇంపుగా మాటాడుట, దేవబ్రాహ్మణాతిథిపూజ స్వర్గమునకు మార్గము లని పెద్దలు చెప్పుదురు. కావుననే బ్రాహ్మణశ్రేష్ఠు లందఱు వేదవేదాంగ

ముల యర్థములను జక్కఁగా నెఱిఁగి, పొత్తు గలిగి, జాగ్రత్తతో శాస్త్ర విహిత విధానముల చొప్పున స్వస్వధర్మములను జరుపుచు నుత్తమ లోకముఁ బొందఁగోరుదురు. ఇట్టి వేదోక్తకర్మలను విరుద్ధ మగు బుద్ధి గలిగి, వైదికుని చాడ్పునఁ గనఁబడుచు, నాస్తికుఁడవై, ధర్మమార్గముఁ దప్పి యిట్టి దుర్బుద్ధితోఁగూడి నాస్తికత్వమును బోధించెడి నిన్ను దగ్గఱఁ జేర్చిన నాతండ్రి యెంత పాపకృత్యము చేసెనో! లేకున్న నిట్టి నాస్తికుఁడ వగు నిన్ను దగ్గఱఁ జేర్చునా? బుద్ధుఁడు దొంగవంటివాఁడు. బుద్ధుఁడే నాస్తికుఁడని యెఱుఁగుము. కావున నాస్తికుని జనులు దగ్గఱఁ జేర్ప రాదు. పండితుఁడు నాస్తికునిముఖమునే చూడరాదు. ఓ జాబాలీ! నీకంటె వృద్ధులయిన పెద్దలు పుణ్యకార్యములను జేసి యిహపరములను రెంటిని సాధించిరి. కావున ద్విజులు శుభకార్యములను, వేల్పులను, స్వధర్మమును దప్పక చేయుచుందురు. స్వధర్మములం దాసక్తిగలవారును, సత్పురుషులతోడి చెలిమిచేయువారును, తపోబలముచే వెలుఁగువారును, దాతలును, జంతుహింస మానినవారును, పాపములేనివాఁ డైన మునీంద్రులను జనులందఱు గౌరవింతురు గాని నీవలె నాస్తికత్వమును బోధించెడివారి నెవరు లెక్కింతురు? అని సరోషముగాఁ బలుకుచున్న ధైర్యశాలియు, మహాత్ముఁడు నగు రాముఁడాఁగూర్చి జాబాలిముని సవినయముగ సత్యమును, ఆస్తికత్వమును బోధించు నవియు, సజ్జనసమ్మతములునైన వాక్యములతో "రామా! నేను నాస్తికుల మాటలను జెప్ప లేదు. నేను నాస్తికుఁడను కాను. లేదనుమాట లేనేలేదు. అన్నియు నున్నవి. అయినను, సమయమునకుఁ దగినట్లు నాస్తికమతము మఱల నవలంబించితిని. మఱొక్క సమయమున ఆస్తికుఁడ నయ్యెదను. నాకు సమయానుసారముగా నాస్తికత్వమును, ఆస్తికత్వమును గలుగుచుండును. ఇప్పుడు నాస్తికత్వము నవలంబింపవలసిన సమయము తటస్థపడినది. ఇప్పుడు ని న్నెట్లయినను బతిమాలి యడవినుండి మఱలించి యయోధ్యకుఁ గొనిపోవుటకై యీ ప్రకారము చెప్పితిని" అని రాముని తోఁ జెప్పెను.

110-వ సర్గము

వసిష్ఠుఁడు రాముని బతిమాలుట

వసిష్ఠమహాముని జాబాలివచనములకు రాముఁ డలిగెనని యెఱిఁగినవాఁ డయి, రామునిఁ జూచి, "జనులు పుణ్యకర్మములచే స్వర్గమును బొందుదు రనియు, పుణ్యములు క్షీణించిన, మఱలఁ బుడమిఁ బడుదు రనియు జాబాలిముని యెఱుఁగును. అయినను, ని న్నెవ్విధముగా నైన నయోధ్యకుఁ దోడ్కొనిపోవఁగోరి యిట్లు పలికెనుగాని వేఱుగాదు. త్రిలోకాధిపతీ! సృష్టి తొలుత జలమయమై యుండెను. దానినుండి భూమి యుప్పతిల్లినది. అందు బ్రహ్మ స్వయముగా దేవతలతో నుద్భవిల్లెను. అంత నాతఁడు వరాహావతారమెత్తి భూమిని దన ముట్టెతో లేవనెత్తెను. అంతఁ బ్రహ్మయుఁ బండితులగు మరీచి మొదలగు తన పుత్రులను సహాయులనుగాఁ గొని ప్రపంచమునంతయు సృజించెను. పరబ్రహ్మమువలన నిత్యుఁడును, శాశ్వతుఁడును, నాశరహితుఁడునైన సృష్టికర్తయగు బ్రహ్మదేవుఁ డుద్భవించెను. ఆ బ్రహ్మకు మరీచియు, మరీచికిఁ గశ్యపుఁడును, కశ్యపునకు వివస్వంతుఁడును, వివస్వంతునికి మను వును పుట్టిరి. ఈ వైవస్వతమనువే మొదటి ప్రజాపతి యనంబడును. ఇతనికి ఇక్ష్వాకువు పుట్టెను. మనువు తా నీ యయోధ్యాపురమును నిర్మించి, మొదట నీ యిక్ష్వాకు మహారాజున కొసఁగెను. కావున నిక్ష్వాకువే యయోధ్యాపురమునకు మొదటిరాజు. ఆ యిక్ష్వాకువునకు శ్రీమంతుఁడగు కుక్షి యని ప్రసిద్ధుఁడైన నృపాలుఁ డుద్భవించెను. కుక్షికి వికుక్షి పుట్టెను. వికుక్షికి నెక్కువ తేజస్సును, మగటిమియుంగల బాణుఁడను పుత్రుఁడు జనించెను. బాణునికి నిడుపుచేతులు గలిగి, యెక్కువకీర్తి గలిగి వెలయుచున్న యనరణ్యుఁడు పుట్టెను. సత్పురుషశ్రేష్ఠుఁడగు అనరణ్యుఁ డేలికగా నున్నప్పుడు దొంగయనుపేరే లేదు. వానలు దేశమం దెల్లెడలఁ గురియుచున్నందున దుర్భిక్షమను మాటయే లేకుండెను. ఆ యనరణ్యునికి నిడుదచేతులవాఁడగు పృథు చక్రవర్తి జన్మించెను. ఆ పృథువువలన త్రిశంకు మహారాజు పుట్టెను. ఆ త్రిశంకువుని సత్యవాక్య ప్రభావమువలన బొందితోడనే స్వర్గమునకు జనెను. ఆ త్రిశంకువునకుఁ గీర్తిమంతుఁ డగు యువనాశ్వుఁడను కొమ

రుఁడు జన్మించెను. మహాకాంతిగల యువనాశ్వుఁడు దుందు వను రక్క సుని జంపుటచే దుందుమారుఁ డని వినుతికెక్కెను. ఆ యువనాశ్వునికిఁ గాంతిమంతుఁడగు మాంధాతయు, మాంధాతకు తేజస్వియగు సుసంధియు జన్మించిరి. సుసంధికి ధ్రువసంధి ప్రసేనజిత్తు లనెడు నిరువురు కొడుకులు పుట్టిరి. వారిలో ధ్రువసంధికిఁ గీర్తిమంతుఁడైన శత్రుసంహారి యగు భరతుఁడు జన్మించెను. దీర్ఘబాహువగు భరతునివలన నసితుఁడు జనించెను. అయ్యసితునికి హైహాయులు, తాలజంఘులు, హైహయులగు శశిబిందువు లనువారు విరోధులైరి. ఆ యసితుఁడు వారందఱితో యుద్ధముసేసి యోడి యరణ్యమునకుఁ బరుగిడెను. ఆతఁడు మనోహరమయిన హిమవంతముచేరి వైరాగ్యముచే మౌనవ్రతము దాల్చియుండెను. అతని కిరువురు భార్యలుండిరి. వా రిరువు రొక్కసమయమునవే గర్భము దాల్వఁగా, వారిలో నొక్కతె తనసవతికి విషము గలిపిన యన్నముఁ బెట్టెను. ఆ సమయమం దొక్కనాఁడు భృగువంశజుఁడైన భార్గవచ్యవనుఁడను ముసీంద్రుఁడు హిమవంతమున కేతెంచెను. అప్పుడసితుని భార్యలలో నొక్కతె యగు కాళింది యను నామె యమ్మునీంద్రునియొద్దకు వచ్చి మ్రొక్కఁగా, నమ్మునీంద్రుఁడా కాళింది పుత్రునిఁ బొందఁగోరుచున్నదని యెఱిఁగినవాఁడై, "ఓ రాణీ! లోకప్రసిద్ధుఁడును, ధర్మముఁ దప్పనివాఁడును, మంచి స్వభావముగలవాఁడును, వంశమును వృద్ధినొందించువాఁడును, శత్రుసంహారియు నగు పుత్రుఁడు పుట్టు"నని చెప్పెను. అంతట నాకాళింది సంతసమందినదై, ముసీంద్రునికిఁ బ్రదక్షిణముసేసి, వీడ్కొని, తనయాశ్రమమున కేతెంచి, తామర రేకులం బోలు కన్నులవాఁడును బ్రహ్మతేజస్సుగలవాఁడునైన పుత్రునిఁ గనెను. ఆ కాళింది యొక్క గర్భమును జంపఁ దలఁచి, యామెకు సవతి విషము పెట్టెనుగాని యమ్మని వరప్రభావమునం జేసి, యా విషముతోఁ గూడనే శిశువు పుట్టుటచే సగరుఁ డనుపేరుగల వాఁడయ్యెను. ఆ సగర నృపాలుఁడు యాగము లొనర్చి పర్వకాలమున వేగంబుచే గర్జించుచు నీ లోకపు జనులను వెఱపించుచుండు సముద్రమును ద్రవ్వించెను. ఆ సగరుని కసమంజుఁడను నొక్కమారుఁడు పుట్టె నని మేము వినియుందుము. ఆ యసమంజుఁడు దుష్టకార్యములఁ జేయుచున్నందునఁ దండ్రి వానిని

జీవించియుండఁగానే యడవికిఁ దఱిమెను. అయ్యసమంజుని కంశుమంతుఁ డను వీర్యశాలి యగు పుత్రుఁడు పుట్టెను. ఆ యంశుమంతునికి దిలీపుఁడును, దిలీపునికి భగీరథుఁడును, భగీరథునికి కకుత్థ్సుఁడును పుట్టిరి. కకుత్థ్సుని వలననే యీ వంశస్థులందఱు కాకుత్థ్సులనఁబడిరి. ఆ కకుత్థ్సునికి రఘువు పుట్టెను. ఆతనిచే నందఱు రాఘవులనఁబడిరి. రఘువునకుఁ దేజముగల యొక పుత్రుఁడు పుట్టెను. ఆతఁడు ప్రవృద్ధుఁడనియు, కల్మాషపాదుఁడనియు, పురుషాదుఁడనియు, సౌదాసుఁడనియుఁ బుడమిం బ్రసిద్ధి చెందెను. కల్మాషపాదునికి శంఖణుఁడను పుత్రుఁడు పుట్టెను. ఆ శంఖణుఁడు దండ్రియగు కల్మాషపాదునితోఁ గయ్యమునేసి, సేనలతోడ మడిసెను. ఆ శంఖణునికి శూరుఁడును, గాంతిమంతుఁడు నగు సుదర్శనుఁడు పుట్టెను. ఆ సుదర్శనుని కగ్నివర్ణుఁడు, అగ్నివర్ణునికి శీఘ్రగుఁడు, శీఘ్రగునికి మరువు, మరువునకుఁ బ్రశుశ్రుకుఁడును బుట్టిరి. ప్రశుశ్రుని కొక్కువ వెలుఁగు గల యంబరీషుఁ డను పుత్రుఁడు పుట్టెను. అంబరీషుని కొడతెగని మగటిమిగల నహుషుఁడను పుత్రుఁడు జనించెను. నహుషుని కొక్కువ ధర్మచింతగల నాభాగుఁడు జనించెను. నాభాగుని కజసువ్రతులనెడు నిరువురు కొడుకులు పుట్టిరి. అజుని కొడుకే ధర్మాత్ముఁడగు దశరథమహారాజు. ఆతనియొక్క దాయభాగము ననుభవించుట కర్హుఁడు జ్యేష్ఠపుత్రుఁడునగు రాముఁడను నీ విదిగోయున్న వాఁడవు. రాజుకాఁదగినవాఁడవు నీవే కావున రాజ్యము గైకొని, జనులం బాలింపుము. ఇక్ష్వాకువంశపురాజు లందఱిలో మొదటఁ బుట్టినవాఁడే రాజగుట వాడుక. పెద్దవాఁ డుండఁగ, కనిష్ఠునికి రాజ్యార్హతలేదు కావున జ్యేష్ఠునికే పట్టాభిషేకము గావింపవలయు. ఓ విస్తార కీర్తిగలవాఁడా! నీ తొల్లింటి పెద్దలనాటినుండి వచ్చెడి యాచారమును నీవు విడచూడఁదగదు. ఎక్కువ కల్మియు వైశాల్యముగల రాజ్యముతో నొప్పు భూమండలమును తండ్రివలె నేలుము" అని రామునితోఁ జెప్పెను.

111-వ సర్గము

రాముఁడు వసిష్ఠునికి బదులిడుట

రాజపురోహితుఁడగు వసిష్ఠమహాముని రాముని కిట్లు చెప్పి యాతనికి న్యాయమున కొప్పినట్లుగా మఱల నిట్లనియెను. భూలోకమున

జనించిన ప్రతి యొక్కనికిఁ దల్లి, తండ్రి, యాచార్యుఁడు (మంత్రోప దేశము చేయువాఁడు) అని ముగ్గురు గురువులు గలరు. పురుషోత్తమా! తండ్రి యీ పురుషునిఁ బుట్టించుచున్నాఁడు, కావున నతఁడు గురువనఁబడును. ఆచార్యుఁడు జ్ఞానము గలిగించుచున్నాఁడు గావున నతఁడును గురు వనంబడును. పరంతపా! నేను నీ తండ్రికి గురుండను; నీకును గురుండను. నీవు నామాట విని యట్లు చేయుదువేని, నీవు సన్మార్గము మీఱినవాఁడవు గానేరవు. ఈ బ్రాహ్మణులును పురజనులును, క్షత్రియులును వైశ్యులును, నీవారలు. వీరి యొడ దయఁ జూపి, రాజ్యపాలనము నియ్యకొంటివేని, నీవు సత్య ధర్మముఁ దప్పినవాఁడవుగానేఁబోవు. ముదుసలియు, ధర్మాచరణపరాయణయు నగు తల్లిమాటను మీఱఁజనదు. ఆమెమాటఁబడి నడచుకొందువేని నీవు మంచివారిత్రోవను మీఱినవాఁడవు కాకుందువు. న్యాయమును, శౌర్యమును విడువనివాఁడవగు రాఘవా! భరతుని వేఁడికోలును మన్నించి, రాజ్యము నంగీకరించితేని, నీ కెట్టి ధర్మలోపమును గలుగ నేరదు. అని యిట్లు వసిష్ఠుఁడింపుగాఁ జెప్పిన పలుకులు విని, నరోత్తముఁడగు రాముఁడు తన చేరువఁ గూర్చుండియున్న తన గురువును జూచి యిట్లు బదులు నెప్పఁ దొడఁగెను. "మహామునీ! తల్లి దండ్రులు కొడుకులు గలుగవలయునని కోరికతో నెన్ని యో యుపవాసములు, నోములు మున్నగునవి చేయుదురు. తల్లియుఁ గొడుకులు పుట్టిన తర్వాతఁ దమకుఁ గలవి పెట్టియు, జలకమాడించియు, నలుఁగులు పెట్టియు, నెల్లప్పు డింపుమాటలు పలికియుఁ, బోషించియుఁ జేసిన యుప కారము లెన్ని యున్నవో, వానికిఁ బ్రత్యుపకారము లెన్ని నేసినను సాటిగావు. కావున నాకు దశరథుఁడు జనకుఁడు; పోషకుఁడు; రాజును. కాఁబట్టి నే నతనియొడఁట నేమని ప్రతిజ్ఞ నేసితినో, యది తిరుగదు." అని రాముఁడు వసిష్ఠమునీంద్రునితోఁ జెప్పఁగా, వెంటనే యొక్కువ యౌదార్యముగల భరతుఁడు తన కోర్కి నెఱవేఱుమికిఁ గదువగచి, చేరువనున్న సుమంత్రునిఁజూచి "సారథీ! శీఘ్రముగా దర్భలు దెచ్చి పఱుపుము. అన్నగారు నాపైఁ గరుణఁ జూపువఱి కిచ్చటఁ బుడమిపై దర్భల నెజ్జమిడఁదగ బరుండెదను. అప్పు తీసికొన్నవాఁడు మఱల నీయకున్నచో

నప్పిచ్చిన బ్రాహ్మణుం డప్పుదీసికొన్న వానియింటి కడ్డముగా, నిద్రా హారములు మాని, మోమును గప్పుకొని యెట్లు పరుండియుండునో అట్లె నేనును రాముఁ డడవినుండి యయోధ్యను వచ్చునంతవఱకు నీయాకుటింటి ముందటఁ బరుండెదను" అని చెప్పఁగా, సుమంత్రుఁడు రాముని జూచుచు నూరకుండెను. అంతట భరతుఁడు కడు వెత నొంది, తానే దర్భలఁ దెచ్చి యా పర్ణశాలముందట నుత్తనేలపైఁ బఱిచెను. అప్పు డదికతేజస్వియగు రాజశ్రేష్ఠుఁడగు రాముఁడు భరతునిం జూచి, నాయనా! భరతా! నీకు నేనేమి చెఱుపుసేసితినని నీవిట్లు పరుండ నున్నావు? బ్రాహ్మణులుగదా యప్పుదీసికొన్నవారి యింట్లవాఁకిళ్ళ కడ్డ ముగా నొకవైపునకే తిరిగి బరుండుదురు. క్షత్రియు లిట్లు వాఁకిళ్ళ కడ్డముగాఁ బరుండి పీడించు టన్యాయ్యముగదా. నరశ్రేష్ఠా! యీ యాగడంపుఁ బనినిమాని, యిచ్చటనుండి వెంటనే యయోధ్యా పురమునకుఁ బొమ్ము" అని భరతునితోఁ జెప్పఁగా, భరతుఁ డన్నతో, యట్లే దర్భలమీఁదఁ గూర్చుండియే యచ్చటఁ గూడియున్న పురజను లను, గ్రామజనుల నందఱను జూచి, "మీరైననన్నకుఁ జెప్పరాదా? వీల యూరకున్నారు?" అనెను. అంతట నగరములవారును, పల్లెల వారును భరతునింజూచి, "నాయనా! రాముని గుణము మే మెఱుఁగు దుము. రాముఁడు మంచిమాట చెప్పుచున్నాఁడు. మహాత్ముఁడగు నీ రాముఁడును తండ్రిమాటమీఁదనే నిలిచియున్నాఁడు. కాఁబట్టి మే మేమి చెప్పియు నితనిని మఱలింపఁజాలకున్నాము" అని చెప్పిరి. రాముఁ డును వారి పలుకులు విని, "ధర్మదృష్టిగలహితు లిట్లే పలుకుదురు. భరతా! యోచించి, లేచి కూర్చుండి, నన్నును, నీటిని దాఁకుము" అని భరతునితోఁ జెప్పెను. అట్లె భరతుఁడు లేచి కూర్చుండి, రాముని జలమును దాఁకి కూర్చుండి, "బ్రాహ్మణులును, మంత్రులును, జనులంద అును నామాట వినుఁడుగాక! నేను తండ్రిని రాజ్యము గావలెనని కోరలేదు. తల్లిని "నీ వడుగు"మని ప్రేరింపనులేదు. ధర్మజ్ఞులలో మేటి యగు పూజ్యుఁడయిన రాముఁ డడవులలో నుండుటకును నేను కోర లేదు. అట్లువశ్యముగఁ దండ్రిమాటప్రకారము నడువవలసియు, నడ వులలో నుండవలసియు నున్నట్లయిన నేనే రామునికిఁ బ్రతిగాఁ బదు

నాలుగేం డ్లరణ్యమున నుండెదను" అని చెప్పెను. ధర్మాత్ముఁడగు రాముఁడు తన తమ్ముఁడు యథార్థముగఁ జెప్పిన మాటకు నచ్చెరువొంది, పుర్రగ్రామవాసిజనములం జూచి, "తండ్రి బ్రతికియున్నప్పుడు తాను విక్రయించినదియుఁ, గుదువయుంచినదియుఁ, గొన్నదియు మార్చుటకు నాకుఁగాని, భరతునికిఁగాని శక్యముగాదు. వనవాసవిషయమున విసుగు పడి నేను తండ్రిని వంచింపవచ్చునా? నేను వనవాసము నీ కిచ్చి, రాజ్య పాలనము నైకొనుట తండ్రిని వంచించినట్లుకదా యగును. కైకేయి యోచనచేసియే కోరినది. తండ్రియు మంచిపనియే చేసెను. భరతుఁ డూర్పును, గురుభక్తియుఁ గలవాఁడని యెఱుఁగుదు. సత్యసంధుఁడగు మహాధైర్యశాలియయిన భరతుని కిది యంతయుఁ దగియేయున్నది. నేనును బదునాలుగేం డ్లరణ్యవాసమునేసి, మఱలివచ్చి, పట్టాభిషిక్తుఁడనై యీ ధర్మాత్ముఁడగు తమ్మునితోఁ గూడి మేటిపుడమి యేఁడ నయ్యెదను. కైకేయి తండ్రిని వరముల నడిగెను. నేను తండ్రి యాజ్ఞప్రకారము నడచుకొనెదనని చెప్పితిని. నీవును తండ్రి యగు దశరథనృపాలున కసత్యదోషము వాటిల్లకుండఁ జొనరింపుము" అని భరతునితోఁ జెప్పెను.

112-వ సర్గము.

రాముఁడు భరతునకుఁ దన పాదుకల నొసఁగుట

అచ్చటికి వచ్చియున్న మహర్షు లందఱు సాటిలేని తేజస్సుగల యన్నదమ్ముల యాశ్చర్యకరమయిన కూడికనుజూచి మిక్కిలి యాశ్చర్య మొందిరి. అంతర్ధానము నొందియున్న ఋషులును, సిద్ధులును, మహర్షులును మహాసమర్థులైన రాము భరతులను జూచి, "ధర్మముల నెఱింగిన వారును, ధర్మమునందు విక్రమము గలవారునునైన యీ రాము భరతులకు జనకుఁడయిన దశరథుఁడు కదా ధన్యుఁడు! వీరి సంభాషణమును విన్నను, నింకను వినవలయు ననియే యపేక్ష వొడమఁజున్నది." యని యా కాకుత్స్థునుఁబొగడి, రావణవధము మనమునఁ గోరినవారయి, రాజ శ్రేష్ఠుఁడగు భరతుంగూర్చి వారందఱు నేకగ్రీవముగా నిట్లనిరి. "ఓ సత్కులప్రసూతుఁడా! గొప్ప పండితుఁడా! మంచి నడవడి గలవాఁడా! పేరువడసినవాఁడా! నీవు తండ్రిని సత్యసంధునిగాఁ జేయఁ దలఁతువేని,

రాముని మాట వినుము. ఈ రాముఁడు పిత్రువాక్యపరిపాలనరూప మగు ఋణమును తీర్పవలెనని మేము సర్వదా కోరుచుందుము. దశ రథుఁడును, కైకేయి కిచ్చిన వాగ్దత్తమును నెఱవేర్చి స్వర్గతుఁడయ్యెను." అని గంధర్వులు, రాజర్షులు, మహర్షులును జెప్పి యందఱును తమతమ తావరములకుఁ జనిరి. శుభదర్శనుఁడగు రాముఁడును ఋషులు చెప్పిన యా యింపైన మాట విని, సంతసమును, ముఖవికాసమును బొంది యా ఋషుల కందఱికిని ప్రొక్కెను. భరతుఁడును దన మనో రథ మీఁడేరకుండుటకు వగచి, చేతులు జోడించికొని రామునిఁ గూర్చి మాటలు డగ్గుత్తిక చేఁదొట్రుపడుచుండ వెండియు నిట్లనియె. "ఓ కాకుత్స్థా! పెద్దవానికే పట్టాభిషేకము చేయుట యనురాజధర్మమును, మన వంశా చారమును బరికించి, నాయొక్కయుఁ, దల్లియొక్కయుఁ బ్రార్థనము నెఱ వేర్పుము. ఈ కడు గొప్ప రాజ్యమును బాలించుటకును, మనయందుఁ బ్రేమ గలపుర గ్రామవాసి జనులను సంతోష పఱచుటకును నే నొక్క రుండను చాలను. మేఘోదయమును గాఁపు లెదురుచూచునట్లు మన బంధుగులును, జోదులును, చెలికాండ్రును, హితులును నీవు వచ్చి రాజ్యము నొందవలెనని నిరీక్షించుచున్నారు. గొప్ప బుద్ధిగలవాఁడా! కకుత్థ్సవంశోద్భవా! నా వేఁడికోలు మన్నించి యీ రాజ్యమును నెల కొలుపుము. ఈ రాజ్యమును పాలింప నీవె సమర్థుఁడవు" అని భర తుఁడు సవినయముగా రాముని నింపుగులుకు మాటలచేఁ బ్రార్థించుచు నా రాముని పాదములపైఁ బడెను. రాముఁడును నీలమేఘ ఛాయ గలవాఁడును, తామరపూవులంబోలు కన్నులతోఁ గూడినవాఁడును, మదించిన రాయంచల కంఠధ్వనింబోలు కంఠస్వరము గలవాఁడునునైన భరతునిఁ దానే లేవనెత్తి తన తొడమీఁదఁ గూర్చుండఁ బెట్టికొని, "నాయనా! నీ కీ యడకుఁవగల బుద్ధి పుట్టుకతోడ వచ్చినది. నీ వీ బుద్ధి చేతనే యీ పుడమి నెల్ల యేలఁగలవు; నిన్నెడఁబాయకుండువారును, నీ మేలు కోరెడివారును, బుద్ధి మంతులు నగు మంత్రులతో నాలో చించి, యెంత గొప్ప పనులనైనను జేయుము. చంద్రుని విడిచి వెన్నెల తొలఁగవచ్చును హిమవత్పర్వతము మంచుఁగురియకనైనఁ బోవచ్చును. సాగరము కట్టుదాఁటియైన రావచ్చునుగాని నేను తండ్రి యాజ్ఞాపించిన

కార్యమును జేయక మానను. తల్లికోరికతోనో లేక లోభముతోనో చేసిన యీ కార్యమును నీవు మనమున నుంచకుము. తల్లినివలె నామెను జూచుకొనుము" అని రాముఁడు భరతునితోఁ జెప్పెను. ఇట్లు చెప్పుచుండువాఁడును, సూర్యరశ్మింబోలు కాంతిగలవాఁడును,పాడ్యమి యందలి చంద్రునివలె వర్ధిష్ణువును, బూజ సేయఁదగినవాఁడునునైన రామునిఁ గూర్చి "అన్నా! స్వర్ణాలంకృతములైన యీ పావుకోళ్ళపై నీ యడుగులుపెట్టి యిమ్ము. అవియే అన్ని లోకములకును యోగక్షేమములను సమకూర్పఁగలవు." అని చెప్పఁగా, నెక్కువ తేజస్సు గల వాఁడయిన పురుషోత్తముఁడగు రాముఁడును పావుకోళ్ళపైఁ దన పాదములఁ బెట్టి యిమ్మి, వానిపైనుండి దిగి, మహాత్ముఁడగు భరతునికి వాని నొసఁగెను. ఆ భరతుఁ డా పావుకోళ్లను భక్తితోఁ బ్రణమిల్లి, రామునింగూర్చి "రఘునందనా! శత్రుసంహారీ! యీ పదునాలుగుసంవత్సరములును నేనును, జడలను దాల్చి, నార బట్టలఁ గట్టుకొని, కాయలు, దుంపలు, పండ్లు నాహారముగాఁ గల వాఁడనై, రాజ్యభారమెల్ల నీ పావుగోళ్ళయం దుంచి, పట్టణమునకు వెలుపలనేయుండి, నీ రాక కెదురు చూచుచుందును. రఘూత్తమా! పదునాలవయేఁడు నిండిన మఱునాఁడు నీ మోమును నేను జూడనేని, యగ్నిప్రవేశము సేయుదును" అని చెప్పెను. రాముఁడును భరతుని, శత్రుఘ్నుని ప్రేమ పూర్వకముగాఁ గౌఁగిలించి, "అట్లే కావించెద"నని శపథముచేసి మరల భరతునిం జూచి, "రఘుసత్తమా! నీ తల్లియగు కైకేయి నేమియు ననక కాపాడుము. నామీఁదను, సీతమీఁదను నొట్టిడి చెప్పుచున్నాను" అని చెప్పి కన్నుల నీరుగ్రమ్ముచుండ "నీక పోయిర" మ్మని చెప్పెను. ప్రతాపవంతుఁడగు భరతుఁడును జక్కఁగ నలంకరింపఁబడిన యా పాదుకలకును, రామునికిని ప్రదక్షిణము గావించి, యా పావుకోళ్ళ నెత్తి మృత్యుంజయమను గజేంద్రమువీఁద నుంచికొని పయనమాయెను. అంత రఘువంశోద్ధారకుఁడగు రాముఁడును హిమవత్పర్వతము మాఁడిఁ దనధర్మమునుండి కదలనివాఁడై, గురువులను, మంత్రులను, పురగ్రామవాసిజనములను, తమ్ములను క్రమమున వారివారినిఁ దగిన చొప్పున సంతోషపఱిచి యందఱికిని సెల వొసఁగెను.

తల్లులును దుఃఖవేగముచేఁ గొం తడఁచుకొని మాటరానందునఁ బోయి వచ్చెదమని కూడఁ జెప్పఁజాలక పోయిరి. రాముఁడును తల్లుల నందఱిని మ్రొక్కి, విలపించుచుఁ దన యాకుటింటిలోపలికిఁ జొచ్చెను.

113-వ సర్గము.

భరతుఁడయోధ్యకు మఱలుట

అంతట నప్పుడు భరతుఁడును రాముఁని పాదుకోళ్ళను దన నెత్తిని నుంచుకొని, శత్రుఘ్నసమేతుఁడై సంతోషముతో రథమెక్కెను. గట్టి నియుతముగల వసిష్ఠ వామదేవ, జాబాలి మహర్షులును మంత్రాలోచన లందు నేర్పరులయిన మంత్రులును ముందుగాఁ బయనమై, తూర్పు మొగముగాఁ దిరిగి, మందాకినీ నదికిని, చిత్రకూటపర్వతమునకుం బ్రదక్షిణము గావించుచుఁ బోయిరి. బుద్ధిమంతుఁడగు భరతుఁడును సేనలతోఁగూడి నచ్చుచుఁ జిత్రకూటమునందలి రమ్యములగు పలు తెఱఁగులైన గైరికాది ధాతువులయొక్క సొంపును దిలకించుచుఁ, జిత్ర కూటము వెంబడే వచ్చి, యా చిత్రకూటముయొక్క చేరువనున్న భర ద్వాజాశ్రమమును జేరి, రథమునుండి దిగి, యా శ్రమములోపలికిఁ జొచ్చి యమ్మునీంద్రుని పాదముల కెఱఁగెను. అంత భరద్వాజమునీంద్రుఁ డును "నాయనా! నీవు తలపెట్టిన కార్యమునఁ నెఱవేఱినదా? రామునిఁ జూచి మాటాడితివా?" అని యడుగఁగాఁ, దోఁబుట్టువులందుఁ బ్రేమగల భరతుఁడును భరద్వాజమునీంద్రుని కిట్లనియె. "మునీంద్రా! మే మిక్కడినుండి వెడలి దృఢమయిన శౌర్యముగల యా రామునికడకుఁ జేరితిమి. నేను నాచేతనయినంతఁ బ్రార్థించితిని. గురువగు వసిష్ఠమునీం ద్రుఁడును చాలదూరము బోధించె. అయిననుఁ రాఘవుఁడు మిగుల సంతసముతో మునీంద్రునిఁ జూచి, "నేను తండ్రి మాటప్రకారము నడ చుచు నీ పదునాలుగేం డ్లరణ్యమునఁనే యుందును" అని చెప్పఁగా, మహాబుద్ధిశాలియు, వాక్య విశారదుఁడునైన మునీంద్రుఁడు మాటలందు నేర్పరియైన రామునిఁజూచి, గొప్ప యర్థగౌరవముగల యీ మాటఁ జెప్పెను. 'ఓకడు బుద్ధిశాలీ! స్వర్ణభూషితములైన యీ పాదుకలను సంతోషముతో నొసఁగుము. ఆ పాదుకోళ్ళను నీకుఁ బ్రతినిధులనుగా సింహాసనమునం దుంచి, వాని వేరిట నాజ్ఞలుసేయుచు భరతుఁడు రాజ్య

మేలుచుండును" అని చెప్పఁగా, రాముఁడును దూర్పువైపునకుఁ దిరిగి, యీ పాదుకోళ్ళపై నెక్కి నిలఁబడి, వానిని బెట్టి రాజ్యము నేలుమని చెప్పి పంపెను. నేను మహాత్ముఁడగు రాముని సెలవు గైకొని యచ్చటి నుండి మఱలి యీ పాదుకోళ్ళను దీసికొని యయోధ్యకే పోవుచున్నాను" అని భరతుఁడు భరద్వాజమునీంద్రునితోఁ జెప్పెను. భరద్వాజుండును, మహాసమర్థుఁడైన భరతుని మాట లాలకించి, "నరోత్తమా! శీలవంతులలోపల శ్రేష్ఠుఁడా! ఇదేమియు విపరీతముగాదు. పల్లమునందుఁ బడిన నీ రచ్చటనే యుండునట్లు, జ్యేష్ఠానువర్తన రూప మయిన శ్రేయస్సు నీయందే యుండును. దాని కేమియు హానిలేదు. ధర్మముల నెఱిఁగినవాఁడవు, ధర్మజ్ఞులు నడపుటయం దెక్కువ మోహము గలవాఁడవునైన యిట్టి నీవంటి సత్పుత్రుఁ గన్న తండ్రియగు మహాభాగుఁడయిన దశరథుఁడు మృతినొందినను బ్రతికియున్నవాఁడే సుమీ" అని భరతునితోఁ జెప్పెను. అంతట భరతుఁడు సవినయముగాఁ జేతులు జోడించి, మహాత్ముఁడగు మునీంద్రుని పాదముల కెఱఁగి, యా మునీంద్రునికడ సెలవు గైకొని, యాతనికిఁ బలుమాఱు ప్రదక్షిణముఁ గావించి, మంత్రిసమేతుఁడై యయోధ్యకుఁ బయన మాయెను. భరతుని వెంబడించిన విస్తారమైనసేన వాహనములమీఁదను, బండ్లమీఁదను, గుఱ్ఱములమీఁదను, నేనుఁగులమీఁదను నెక్కి, మఱలి వచ్చెను. ఇట్లు వా రందఱు తఱలి, యలలవరుసలచే శోభిల్లు యమునా నదిం దాఁటి మంగళకరమయిననీటితోఁగూడిన గంగానదినిఁ జూచిరి. అంతట భరతుఁడు మంత్రిపురోహితబంధువులతోను సేనలతోను గూడి, మనోహరమగు బలముతో నిండియున్న యా గంగానదిని దాఁటి, యందమైన శృంగిబేరపురముఁ జొచ్చి, మఱల నచ్చటినుండి తఱలివచ్చి, తండ్రియు నన్నయు లేని యట్టి యయోధ్యాపురముఁ జూచి, మిక్కిలి వెతలపాలయినవాఁడై సుమంత్రునిఁ జూచి, "సారథీ! యీ యయోధ్యాపురము చూచితివా, యిది యెంత కళదప్పి, చప్పచల్లారి, రూపుసెడియున్నదో! ఇచ్చటి జనులు సంతోషము మాని యెంత దిగులుపడియున్నారో! చూడుము. ఇది యెంతయుఁ గాంతి హీనమైయున్నది" యని చెప్పెను.

114-వ సర్గము.

భరతుఁ డయోధ్యను జూచి దుఃఖించుట

కీర్తిశాలియగు భరతుఁడు కడు వేగిరంబుగా మిక్కిలి గొప్పధ్వని గల రథముపై నెక్కివచ్చి, జనముల సంచారముగాని గజముల సంచారముగాని లేక, పిల్లులయొక్కయు, గుడ్లగూబలయొక్కయు సంచారము గలదియుఁ, జీకటి క్రమ్మిన కృష్ణపక్ష రాత్రివలె వెలుతురు లేనిదియు, మొదటఁ గాంతితోఁ గూడినదై, చంద్రునికిఁ బ్రియమైయుండియు నంగారక గ్రహముచే నొంటరిగాఁ జిక్కి పీడింపఁబడిన రోహిణివలె నున్నదియుఁ, గొంచెముగా నున్నందున నెండకుఁ గలఁగిన నీటితోఁగూడినదియు, నెండ వేఁడిమికి మిక్కిలి తపించిన పక్షులుగలదియు, నళించిపోయినచేపలు, మొసళ్లు మొదలగు జలజంతువులు గలదియునయి సన్నపాటియున్న గిరినదివలెనున్నదియు, మొదటఁ బొగలేక బంగారువలెనుండి, పిదప ద్రవమైన హవిస్సునహోమముఁచేఁ జల్లాఱినదైయుండు యాగాగ్నిజ్వాల కైవడిఁ గాంతిలేనిదియు, గొప్పయుద్ధమున శత్రువులచేతఁజిక్కి, కవచములఁ బోఁగొట్టికొని, గజాశ్వములు చచ్చియు, రథములు, వాని కెక్కములు విఱిగియు గొప్పవీరులు చచ్చియుఁ బడియున్న సేనపగిదిఁ దేజము లేకున్నదియు, మొదట నురుగుతోను, గొప్పధ్వనితోను లేచి, గాలి మిక్కిలి యణఁగుటవలనఁ బొడవడఁగిన సముద్రపుటలమూఁడ్కి సిశ్శబ్దముగనున్ననదియు, యాగము ముగిసి యవభృథస్నానమైన పిదప శ్రోతవేత్తలగు ఋత్విక్కులు తమతమ యాయుధములు గైకొని పోయినందునఁ జప్పుడు లేకయున్న యజ్ఞవేదికవలె వెలుఁగకున్నదియు, మందయందెద్దునుబోఁగొట్టుకొని దిగులుపడి, యొక్కడకక్కడనిలిచి, కసవు దినక, తమ భర్తనుబొందఁ దహతహపడుచుండు నావులగుంపువలె నున్నదియు, మిక్కిలి నునుపువై ప్రకాశించుచున్న మంచిజాతిలోఁ బుట్టిన పద్మరాగాదిమణులులేని క్రొత్త ముత్యాలహారము కైవడినున్నదియుఁ, బుణ్యము తఱుగుటచేఁ దా నున్నచోటిని బాసి, వెలుతురుయొక్క వ్యాప్తిలేనిదై యాకసమునుండి క్రిందఁబడిన నక్షత్రమువోఁడ్కిఁ గాంతిలేనిదియు, వసంతర్తువునఁ బూలతో వెలయుచు, తుమ్మెదల ఝంకారములతోఁగూడియుండి, యా ఋతువు గడచిన పిదప వేసవి

కాలము రాఁగానే కాఱుచిచ్చుచే నించుకతగులఁబడి వాడియున్న వనలత వలెఁ బ్రభలేనిదియు, జనసంచారము లేని వీథులును, క్రయవిక్రయములు లేని యంగడులును గలిగి చంద్రుఁడును నక్షత్రములును దెలియనట్లు మేఘములచేఁ గ్రమ్మఁబడిన యాకసముమాడ్కిఁ దేజోహీనమై యుండు నదియు, వట్టి భయలునం దుత్తమపానవస్తువులు లేక, పగిలిన బానల తోను, చచ్చిన క్రాగుబోతులతోను గూడి, యలంకార హీనమైయున్న పానభూమివలెఁ దేజరిల్లకుండునదియు, నేలయంతయు బ్రద్దలువాఱి, పల్లపుయి, పగిలిన పాత్రలంతటనుగలిగి నీరులేనిదయి విఱిగి పడిపోయిన బ్రద్దలువాసిన చలిపందిరిమాడ్కిఁ గాంతిలేకయున్నదియు, వింటనెక్కు పెట్టఁబడి, యుద్ధరంగమున బలవంతులగు శత్రు రాజుల బాణములచేఁ ద్రుంచఁబడి, వింటినుండి జాఱి క్రిందఁబడి, విరివిగా వ్యాపించియున్న గట్టి యల్లెత్రాటి చందమునఁ దేజోహీనమై యుండునదియు, యుద్ధమున నేర్పరియగు గుఱ్ఱపు రౌతుచే నెక్కి యుద్ధము చేయఁబడినతర్వాత, జీని మొదలగు నలంకారములు తీసి విడిచివేయఁబడినదియు, డస్సినదియు నగు నాఁడుగుఱ్ఱపుఁబిల్లవలె నందము దఱిగియుండునదియు, జలము వేఁడిమి కింకుటచే నల్లాడుచుండు ననేకములగు గొప్ప చేఁపలతోను, తాఁబేళ్ళ మున్నగు జలజంతువులతోను గూడి, కలువలు లేక,గట్లంతటను విఱిగి కూలిపోయిన నడబావిచందమున పాడువాఱియుండునదియు, దుఃఖముచేఁ జందనాద్యలంకారములు సేసికొనని దుఃఖపీడితుఁడైన మానవునియొక్క దేహాముమాడ్క సొంపుదఱిగియున్నదియు, వాన ముసురుపట్టి కురియునప్పుడు కాఱుమబ్బులచేఁ గ్రమ్మఁబడిన సూర్యుని యొక్క కాంతివలె నుండునదియునైన యయోధ్యాపురము సొచ్చి, తాను, రథమునఁ గూర్చుండియొ, రథముఁ దోలుచున్న సారథింజూచి, "సారథీ! సుమంత్రా! మన యయోధ్యాపురమున నెల్లప్పుడు మిక్కిలి గొప్పవైన దుందుభివాద్యములయు, వంది మాగధుల పాటలయు క్రొత్త వినఁబడుచుండును. ఇప్పుడది వినఁబడకున్నదిగదా! మద్యముల తావియు, పూవులసువాసనయు, నగురుధూపముల పరిమళము నంతటను వీచుచుండునుగదా! ఇప్పు డదేల వీవకున్నది? రాముఁ డడవికేఁగుటచే నీయయోధ్యాపురమున శ్రేష్ఠములయిన వాహనములధ్వనులును

గుట్టిమముల సకిలింతలును, మదపుటేనుఁగుల ఘీంకారములును, రథముల చప్పుడులును వినరాకున్నవి. రాముఁ డడవికిఁ బోయినపిదపఁ బ్రాయపు వారందఱు మనములందుఁగుంది మైపూఁతలుఁ బూసికొనక, నెత్తావి గల పూలమాలికల జుట్టులందుఁ దుఱుముకొనక, యనేక భోగములను విడిచియున్నారుగదా. మానవులు నానావిధములగు పుష్పమాలికలను దాల్చి పురబాహ్యప్రదేశముల విహరింపఁ బోవకున్నారు. రాము నెడ బాయుటవలనఁ గలిగినదుఃఖముచేఁ బీడింపఁబడిన ప్రజలుగల యీ పట్టణమున నుత్సవములు జరుగకున్నవి. ఈ పురశోభ మాయన్న వెంబడే పోయియుండవలయును. కావుననే యీ పురము కాటు మబ్బుచే దట్టముగాఁ గ్రమ్మఁబడి జడివానకురియుచున్న శుక్లపక్షరాత్రి వలెఁ గాంతిహీనమై శోభిల్లకున్నది. ఎప్పుడు మాయన్న మహోత్సవము వలె నిచ్చటికిఁ గాఁగలడు? ఎప్పుడీ యయోధ్యయం దుండు జనులు వేస విని మాడుచున్న జనులు మేఘమును జూచి యానందమొందునట్లు వనవాసము ముగించివచ్చిన రామునిఁజూచి తనివినొందఁగలరు? పూర్వము రాజమార్గములలోఁ బ్రాయపువారు మనోహరములగు వేష ములఁ దాల్చి, మహాగర్వముతోఁ దలవాల్పక పోవుచుందురు గదా! ఇప్పు డొక్కరును పోవనిచే రాజమార్గములు వెలయకున్నవి" అని యనేకవిధములుగ చెప్పుచు, దశరథనరేంద్రుఁడు లేమిచే సింహము లేని గుహవలె, వెలయకున్న రాజమందిరముసొచ్చి, దేవాసురయుద్ధ మున దేవతలోడి పరుగెత్తఁగా, రాహువు సూర్యుని భ్రింగఁగా రేయింబగళ్లు దెలియకున్న దినముపగిదిఁ గళలేక పాడుపడియున్న యా యంతఃపురమునెల్లఁ జూచి, యత్యంత చింతాక్రాంతుఁడై కన్నీరు విడిచెను.

115-వ సర్గము.

పాదుకాపట్టాభిషేకము

తరువాత నియమమును దప్పని భరతుఁ డయోధ్యాపురియందలి యంతఃపురమునఁ దల్లులను విడిచి, చింతాకులితమానసుఁడై, వసిష్ఠాదు లగు పెద్దల నందఱింజూచి, "నేను నందిగ్రామమునకుఁ బోవనున్నాను. మీరందఱును నాకు సెలవొసఁగుఁడు. రాము విరహదుఃఖము నచ్చట

నెట్టులో సైరించెదను గాని, ఇచ్చట నున్న చో, నా మనస్సు కుదుటఁ బడదు. నాతండ్రి స్వర్గమునొందెను. నాయన్న యడవుల కేఁగెను. మా యన్న వచ్చువఱకు నచ్చటనుండి,యాతని రాకకై యెదురుచూచుచుండె దను. ఆ రాముఁడే ప్రఖ్యాతిఁ జెందిన నృపాలుఁడు. ఆతనితో సాటి యెవ్వరును రారు"అని చెప్పెను. ఆసమర్థుఁడగు భరతుని మంచిపలుకులు విని, మంత్రులందఱును బురోహితుఁడగు వసిష్ఠుఁడును, భరతు నుద్దే శించి, "భరతా! నీవు తోఁబుట్టువు మీఁది మక్కువఁగలవాఁడవై చెప్పిన మాట నీకే తగును. ఎల్లప్పుడు చుట్టాలయందు మక్కువయుఁ, దోఁబుట్టు వులం దనురాగమునుగల్గి, పెద్దలదారిని బోవునట్టి నీయొక్కయభిమతము నెవఁ డంగీకరింపఁడు"అని తన యభిప్రాయానుగుణముగాఁ జెప్పిన వారి మాటలు విని, భరతుఁడు చిఱునవ్వు మోమునగలవాఁడై సారథిని బిలిచి త్వరగాఁ దేరి నాయితపఱుచి తెమ్మని, తన తల్లు లందఱకు నమస్కరించి శత్రుఘ్నునితోడ నరదమెక్కి, రాముని పాదుకలు నెత్తిన బెట్టుకొని నందిగ్రామమునకుఁ దఱలెను. వెంటనే గురువగు వసిష్ఠుఁడు మున్నగు బ్రాహ్మణోత్తము లందఱును నందిగ్రామమునకుఁ దూర్పు మొగముగాఁ బయనమైపోయిరి. భరతుఁడు పిలువకున్నను, రథ, గజ, తురంగసేన యును, పురవాసులును దఱలిరి. ధర్మాత్ముఁడును, సంపన్నమగు సోదర ప్రేమ గలవాఁడునునైన యా భరతుఁడు రాముని పావుకోళ్ళ నెత్తిని బెట్టుకొని వేగిరముగా నందిగ్రామముఁ జేరి, రథమునుండి డిగ్గి, తన గురు వుల జూచి, "మాయన్న యీ రాజ్యమును నాయం దిల్లడవెట్టి, తా నడిగినప్పు డిమ్మని చెప్పెను. అంతవఱకు నీబంగారుపావుకోళ్ళ రాజ్యము యొక్క యోగక్షేమముల విచారించుకొనుచుండును. జనులారా! మీరు మాయన్నగారి యీపాదుకలకుఁ దెల్లని గొడుగు పట్టుఁడు. ఈపాదుకలవలననే రాజ్యమున ధర్మము శాశ్వతముగా నిల్చియున్నది. నాయందుఁ బ్రేమతో నిల్లడవెట్టిన నాయన్నగారి రాజ్యమును, నాతని రాక కెదురుచూచుచుఁ బాలించుచుండెదను. గురువగు రాఘవుఁడు వచ్చినవెంటనే యీ పావుకోళ్ళ నాతని పాదములకుఁ దొడిగి, దర్శన మొనర్చి, యీ రాజ్యభారమాతనిపై నుంచి, యతనిని గలిసికొని, "యన్నా! ఇదిగో, నీరాజ్యము నీవుగైకొను"మని యీ రాఘవుని కొప్ప

గించి, యా యన్న చెప్పినప్రకారము నడచుచు, నతనికి శుశ్రూష చేయుచు నుండెదను. ఇ ట్లైఁగున రాముఁడు నాయం దిల్లడఁ బెట్టిన యీ పావ్రకోళ్ళను, రాజ్యమును, నయోధ్యాపురము నప్పగించి, నేను కైకేయీమూలమునఁ బడసిన యపవాద పాపమునుండి తప్పించుకొనెదను. ఎప్పుడు రాముఁడు పట్టాభిషిక్తుఁడగునో, యిప్పుడు జనులు రాముని పట్టాభిషేకము చూచి సంతోషపడుదురో, యప్పుడే నాకు రాజ్య పరిపాలనము చేయునప్పుడున్న దానికంటె నాలుగింత లెక్కువయిన యానందమును, కీర్తియుఁ గలుగును" అని చెప్పి దీనుఁడై విలపించుచు, జడలను దాల్చి, నారబట్టలఁ గట్టుకొని, ముని వేషమును దాల్చి, రాముని రాక కెదురుచూచుచు, రాముని మాటయందు నిలిచి, తన ప్రతిజ్ఞ చెల్లించుటయందుఁ బూనికి గలిగి, నందిగ్రామమున సేనలతోఁ గూడ నుండి, రాముని పాదుకలకుఁబట్టాభిషేక మొనర్చి, శాసనముల నన్నిటిని రాముని పాదుకలపేరిటఁ జేయుచు, నెల్లప్పుడు వానికి సేవ చేయుచు, రాజ్యపరిపాలనము మంత్రులమూలమున జరిపించుచుండెను. ఏదియైన నొక శాసనము చేయవలసివచ్చినప్పుడును, సామంతరాజులు కానుక లేవియైనఁ దెచ్చియిచ్చినప్పుడును భరతుఁడు మొదట వానిని పాదుకలకు నివేదించి, పిదపఁ జేయవలసిన కార్యములఁ జేయుచుండెను.

116-వ సర్గము.

ఋషులు రాక్షసులకు వెఱచి చిత్రకూటాశ్రమము వదలుట

ఆ భరతుఁడు నందిగ్రామమున నట్లు రాజ్యపాలనము సేయుచుండఁగా, రాముఁడును, భరతుఁడు వనమువిడిచి యేఁగినవెంటనే, చిత్రకూటమునఁ దన చేరువనున్న ఋషులందఱు దిగులుపడి, యిత రాక్షసములకుఁ బోఁగోరి యుండుటను దెలిసికొనెను. అప్పుడు మునులందఱు వెఱచి, వికృతపుఁజూపులు చూచియుఁ, గనుబొమలు చిట్లించియు, రాముని జూచి యొండొరులు గుసగుసలాడుకొనుచుండిరి. రాముఁడును వారి యరణ్యము వదలి మఱొక్క యరణ్యమునకుఁ బోవ నెంచుటకుఁ బాసు గారణమేమోయని తలఁచినవాఁడై, చేతులు జోడించి, కులపతియగు మునీంద్రునిఁ జూచి, "ఓ ఋషీశ్వరా! మునులందఱు మోములు చిట్లించుచు, మనోభావములు మాఱియు నున్నారు.

దీనికిఁ గారణమేమి? నే నేదియైన నపరాధము చేసితినా? లేక, మాతమ్ముఁడగు లక్ష్మణుఁడు పొరపాటునఁ దన మర్యాదకుఁ దగని పని చేయఁగా, మునులు చూడలేదుగదా! లేక, సీత నా శుశ్రూషయే ప్రధానముగా నెంచినదై, తపస్వులకు శుశ్రూషలు నేయునప్పుడు తగినట్లు నడచుకొనకున్నదా యేమి?" అని యడిగెను. ఆ మాటలు విని, జ్ఞానవయోవృద్ధుఁడయిన కులపతియగు ముసీంద్రుఁడు వణఁకుచు భూతదయగల వాఁడగు రాముని నింగూర్చి, "నాయనా! మంచిస్వభావముగలదియు, మేలైన కార్యములం జేయుటయందే యాసక్తిఁ గలదియునైన సీత కార్యములపట్ల స్వాభావికముగాఁ జలనము నొందదు. అట్లుండఁ, ఋషులవిషయమున నామె యేమియుఁ బొంతమాత్ర మొందదు. నీ నిమిత్తమే యీ తాపసుల కీ యుత్తలంపాటు వాటిల్లినది. దాని చేతనే యీ ఋషులు రాక్షసులవలన భయపడి యొండొరులు మాటాడుకొనుచున్నారు. ఇచ్చట గర్వితుఁడును, యుద్ధమునఁ బగతుర గెల్చినవాఁడును, క్రూరుఁడును, మానిసి దిండియును, దనకంటె మించిన వాఁడు లేఁడని యహంకారము వహించియున్నవాఁడును, పాపాత్ముఁడు నైన రావణుని తమ్ముఁడగు ఖరుం డనెడి రాక్షసుఁడు జనస్థానమున నున్నాఁడు. అతఁడు జనస్థానముననున్న ముమల పర్ణశాలల నన్నింటిని బెడిదికి పాఱవైచి, వారిని హింసించి తఱిమివైచెను. అంతట మునులంఁబఱు వానికి వెఱచి యిచ్చటి కేతెంచిరి. నీ వీ యాశ్రమము చొచ్చినది మొద లా ఖరుఁడు మున్నగు రాక్షసులు నిన్నుఁ జూచి యోర్వలేక, యిచ్చటి మునులకుఁ బలుతెఱఁగులుగా నపకారము చేయుచున్నారు. కొందఱు రోఁతపుట్టించు భీకరములయిన నానావిధములగు వికృతక్రూరరూపములు చూపియు, వెట్టిచూపుకులు చూచియు మునులను బెదరించుచున్నారు. మఱికొందఱు దుష్టరాక్షసులప్రశస్తములయిన యపరిశుద్ధములగు వస్తువులను దెచ్చి మునులపై వేసి మంచు నిలఁబడి చంపుచున్నారు. మఱికొందఱు దుష్టాత్ములగు రాక్షసులాయా మునుల యాశ్రమములందుఁ వారికిఁ దెలియకుండ దాఁగి, తాపసులను జంపుచుఁ గ్రీడించుచున్నారు. మునులు హోమము చేయఁబూను నప్పుడు దుష్ట రాక్షసులు స్రుక్స్రువములను, హోమసాధనములను

బాఅవైచుచున్నారు; హోమకుండములం దుదకము పోసి చల్లార్చు చున్నారు, సమిధలను నుగ్గుచేయుచున్నారు. కావున నీ ఋషు లందఱు దుష్టరాక్షసులచేఁ బీడింపఁబడిన యీ యాశ్రమములను విడిచి యన్యదేశమునకుఁ బోఁగోరి, నన్నిప్పుడు పురికొల్పు చున్నారు. దుష్టరాక్షసులు కొన్నిదినము లిచ్చట నున్నచో మమ్ముఁ జంపఁబూనుదురు. కావున మే మిప్పుడే యీ యాశ్రమముఁ బాసి యన్యస్థలములకుఁ బోఁగోరుచున్నాము. ఇచ్చటికి బహుదూరమున కందమూలఫలసమృద్ధిగల యొక పురాతన వనమున్నది. అచ్చటికి నేను ఋషిసమూహములతోఁ గూడఁ బోయెదను. ఖరుఁడు నీ విషయ మునఁగూడ నిట్లే ప్రవర్తించును. నీ కిష్ట మున్నయెడ, నీవును మాతోఁ గూడ రమ్ము. రాఘవా! నీ వెంత సామర్థ్యముగలిగి జాగ్రత్తతోనున్నను, భార్యతో నీ విచట నుండుట దుఃఖమునకు హేతువుగాఁగలదు" అని చెప్పెను.ఇట్లు పలుకుచుఁ, బ్రయాణమునకు సిద్ధుఁడైయున్న కులపతియగు మునీంద్రునికి బసలు మాట చెప్పి పోకుండ నిలుపఁజాలకపోయెను. అంత కులపతియగు మునీశ్వరుఁడు రాముని గారవించి, వీడ్కొని, తమ విరహమునకై దిగులుపడవలదని యూరడించి యయ్యాశ్రము విడిచి పోయెను. రాముఁడు కులపతికిని, ఋషిగణములకును మ్రొక్కి, వనము విడిచి వారు పోవునపుడు వారిని దారి సాగనంపుటకై కొంత దవ్వు వెంబడించి, మిక్కిలి సంతుష్టులయిన యా ఋషుల యనుమతివడసి, యనేక నీతులను వారివలనఁ దెలిసికొని, మఱలి తన యాకుటింటికి వచ్చి చేరెను. ఆ యాశ్రమముననుండిన ఋషులు రాముని యందు ఋషుల కుండవలసిన గుణము లుండుటచే నతనియెడఁ బ్రేమగలిగి యా రాము ననుసరించి యున్నందున, రాముఁ డా వనమును ఋషివిరహితమై నను వేగిరముగా విడిచిపోవుటకు మనమునఁ దలఁపఁ డాయెను.

117-వ సర్గము.

రాముఁడత్రిమునీంద్రుని యాశ్రమము చేరుట

అంత మును లందఱు వనాంతరములకుఁ బోఁగానే రాముఁడును బహుదూర మాలోచించి, "ఇచ్చటికి భరతుఁడును, నా తల్లులును,

పట్టణవాసులగు జను లందఱు నేతెంచిరి. ఇచ్చట నున్నయెడల నా మన సున కదే జ్ఞాపకము వచ్చుచుండును. వారి కలవరమె నన్నెల్లప్పుడు బహు దుఃఖమున ముంచుచుండును. అదికాక, మహాత్ముడగు భరతుని నేన లిచ్చట గుడారములు వేయుటచేతను, గుట్టిములయు నేనుఁగు లయు లద్దులచేతను తపోవనశాంతయు నపరిశుద్ధమైయున్నది. కావున, మఱొక్క యాశ్రమునకు బోవుదము" అని పెక్కు కారణములచే నచ్చటనుండుట కిష్టపడక సీతను, లక్ష్మణుని దోడ్కొని పయనమై యత్రి మహాముని యాశ్రమము సొచ్చి, త్రికాలజ్ఞుఁడగు నత్రిమహాముునికి మ్రొక్కెను. అత్రిమునియు రాముని బుత్రునివలె దగ్గఱకుఁ జేరఁదీసి, తా మా రాముని కతిథి సత్కారము నంతయు బాగుగాఁ గావించి, వెంటనే సీతను లక్ష్మణుని బ్రియవచనములచే గారవించెను. ఆసమయమున నచ్చటికి లోపలినుండి యనసూయాదేవి యేతెంచెను. సర్వభూతదయ గల యత్రిమునీంద్రుఁ డా పూజ్యురాలయిన ముదుసలియగు తనపత్ని ననసూయను బిలిచి, సీతారామలక్ష్మణులను జూపెను. అతఁడు మునిపుంగవుండు సీతం గూర్చి, ఓ కల్యాణీ! యీ యనసూయ మహామహిమగలది; తపస్సు చేయు శీలముగలది; స్వధర్మముఁ దప్పక నడచునది కావున నీమెకు నమస్కృతు లొనరింపుము" అని సీతతోఁ జెప్పి, రాముని నుద్దేశించి, యో పాపరహితుఁడా! పూర్వ మొక్కప్పుడు పదియేం డ్లెడతెగక హానగురియక క్షామము సంభవింపఁగా, నీ యనసూయ ఋషులకెల్లఁ గందమూలఫలములఁ గల్పించియిచ్చినది. గంగానది పాఱునట్లు చేసినది. పదివేలయేండ్లు పెక్కు నియమములుపూని యోర్వరాని తపస్సుచేసినది; కృచ్ఛ్ర చాంద్రాయణాది వ్రతము లొనర్చి దీక్షలుపట్టి, కడపట నవభృద స్నానమొనర్చినట్టిది; తపోవిఘ్నములను బోఁగొట్టినది. మఱియు నొక ప్పుడు దేవతలకార్యనిమిత్తము పదిరాత్రు లొక్కరాత్రిగాఁ జేసి నది. ఇట్టి మహాత్తురాలగు ననసూయ నీకుఁ దల్లివంటిది. ఆమెను బూజిం పుము. ఓ రామా! యీ యనసూయ తన శాంతాద్యాది గుణములచేత ననసూయ యని సార్థకనామము వహించినది. ఈమెకుఁ గోప మను

మాటయే లేదు. సర్వభూతములచే నమస్కరింపఁదగినదియుఁ, గీర్తి మతియు, వృద్ధురాలునగు నీ యనసూయకుఁ బూజనేయుని సీత కాన తిమ్ము" అని చెప్పెను. అంత రాఘవుఁ డట్లేయని యత్రిమునితోఁ జెప్పి, ధర్మములన్నెల్ల నెఱిఁగిన సీతనుగూర్చి, "రాజపుత్రీ! ఈ ఋషిశ్రేష్ఠుఁడు నెప్పిన పలుకులు వింటివిగదా! మన శ్రేయస్సునకై తపస్వినియగు అన సూయకడకు వేగ నేఁగి వందనము లాచరింపుము" అనెను. మైథిలియు శ్రేయస్సుఁగోరి, చెప్పిన రామునిమాట విని, ధర్మముల నెఱిఁగిన యన సూయకుఁ బ్రదక్షిణము గావించి, మాంసాదులు శోషించుటచే ముడు తలుపడుచున్న యొడలును, ముసిముసిఁజేఁ దెల్లనైన శిరోజములును గల దియు, సుడిగాలియందలి యరఁటిచెట్టువోలె నెల్లప్పుడు వణఁకుచున్న మేనితోఁ గూడినదియు, మహిమగలదియుఁ, బతివ్రతయునైన యన సూయకుఁ దన గోత్రప్రవరలు చెప్పుచు నభివాదము చేసెను. అట్లు వినీతరాజపుత్రి దోషరహితురాలయిన యా యనసూయకు మ్రొక్కి, మక్కువతోఁ జేతులు జోడించుకొని, యా మహాదేవిని క్షేమమడిగెను.

అంతట ననసూయ ధర్మమార్గమున నడచునదియు, సౌందర్యవతియునగు సీతను జేరఁ దీసి బుజ్జగించుచు "ఓ భామినీ! నీవు ధర్మమును జక్కఁగా నడపుచుందువుగదా! నీవు బంధువ్రజలను, సంపదను, గౌరవమును విడిచి యడవులకుఁ బలాత్కారముగా నెట్టఁబడిన రాముని వెంబడించి వచ్చి తివిగదా! నీ యదృష్ట మే మనవచ్చును! నగరమున నుండినను, అడ విలో నున్నను, చెడ్డవాఁడైనను, మంచివాఁడైనను భర్తనే యే స్త్రీలు ప్రియునిగా నెంచెదరో, వారివే స్వర్గాదిపుణ్యలోకములు. దుష్టస్వభావుఁ డైనను, స్వేచ్ఛాప్రకారము నడచుకొనువాఁడైనను, దరిద్రుఁడైనను భర్తనే గొప్పనడత గలస్త్రీలు ముఖ్యదైవమునుగాఁ దలంతురు. ఓ సీతా! నేను సర్వవిధముల నాలోచించితిని, శ్రద్ధతోఁ జేయఁబడిన నాశరహితమగు తపస్సువలె బంధువు లందఱికంటెఁ బెనిమిటి ప్రాణబంధు వనియు, నతఁడే స్త్రీలకు రక్షకుఁడనియు నెంచెదను. కొందఱు స్త్రీలు గుణదోషములు పరిగణింపక, మన్మథుని బారికి లోఁబడినవారలై, విటు లను వెదకుచుఁ దిరుగుచుందురు. వారి కీ ధర్మసూక్ష్మత తెలియదు.

మైథిలీ, యెవ రట్టి యకార్యములలోఁ జొచ్చి, ధర్మాధర్మ పరిజ్ఞానము లేకయున్నారో, వా రిహలోకమున నపకీర్తిని బరలోకమున నధోగతినిఁ బొందుచున్నారు. ఓ సీతా! సీబోటిస్త్రీలు సుగుణవతులై, లోకములోని మంచి చెడ్డలను బరికించి, మంచి ననుసరించినవారలై, ధర్మశ్రద్ధగలవారి చాడ్పుననే స్వర్గలోకమున సంచరింపఁగలుగుదురు. కావున, ఓ సీతా! నీవును పతివ్రతవై పతివ్రతాధర్మముల నవలంబించి, యిహ్లోకమున నీ ప్రియు నెడఁబాయక, పెనిమిటిచేఁ బనులలోఁబాలు పుచ్చుకొనుచు నుంటివేని, యిహమునఁ గీర్తిని, పరమునఁ బుణ్యలోకములను బొందఁగల"వని చెప్పెను.

118-వ సర్గము.

అనసూయాదేవి సీతకు శాశ్వతాలంకారము నొసఁగుట

సీత యసూయలేని యా యనసూయ చెప్పిన పలుకులు విని, యా పలుకులను గౌరవించి, మెల్లగా నిట్లనెను. "ఓ తల్లీ! తమరిప్పుడు నాకుఁ జెప్పినది యేదియు నొక క్రొత్తవిషయముగాదు. మనుష్యకు మగఁడే దైవమని నే నెఱిఁగియున్నాను. భర్త దురాచారుఁడయినను భార్య యతనియెడఁ గృత్రిమబుద్ధితో నుండఁజనదు. అట్టి మగని విషయములోనే యట్లుండవలసినప్పుడు, గొనియాడఁదగినగుణములు గల వాఁడు, దయాళువు, పరస్త్రీముఖదర్శనము చేయనివాఁడు, తిరముగ ప్రేమగలవాఁడు, తల్లిదండ్రులమూడిఁ బ్రియుఁడునైన భర్తాత్ముఁడగు మగని విషయమున నెట్లుండవలెనో యది చెప్పవలయునా? మహాబలుఁడగు రాముఁడు కౌసల్యయం దెట్లో, యట్లే యితరరాజకాంతలందును, తక్కిన స్త్రీలయెడలను మాతృభక్తిగలిగియున్నవాఁడు. ధర్మవేత్తయుఁ, బితృభక్తిగలవాఁడునగు రాముఁడు తనతండ్రి యనురాగమంతో నొక్కతూరి చూచిన స్త్రీలను సైతము తన తల్లులనుగా నెంచి, అభిమానము మాని, వారికి శుశ్రూషలు సల్పుచుండును. అట్టి నా ప్రాణుని విషయమున నే నెట్లుండవలయునో తమరే చెప్పుఁడు! భయంకరమయి, నిర్మానుష్యమగు కాననమునకు వచ్చునప్పుడు మా యత్త యొసఁగియో పాతివ్రత్యధర్మములను నీతులను గఱపినది. ఆమె చెప్పిన మాటల వన్నిటిని

మనమున నుంచుకొంటిని. వివాహసమయమున మాత్స్లి యగ్ని యెదుట నేమేమి చెప్పినదో యదియెల్ల నేను మనమున ధరించితిని. ధర్మములు నడచుకొనుమహాత్తురాలా! యిప్పుడు తమరు చెప్పిన మాటలచే నాయుపదేశములెల్లఁ గ్రొత్తఁగాఁ జేయఁబడినవానివలె నొప్పుచున్నవి. ఆఁడుదానికిఁ బతిశుశ్రూషకన్న వేఱుతపస్సులేదు. సావిత్రి భర్తృ శుశ్రూషవలననే స్వర్గలోకము నొందెను. అట్టి నడతగల తమరును భర్తృ శుశ్రూషచే దివము నొందఁగలరు. స్త్రీలందఱిలోపల శ్రేష్ఠురాలగు రోహిణీదేవియుఁ జంద్రు నెడఁబాసి యొక్క నిముసమైన నుండదుగదా! ఇట్టినడతగల స్త్రీలెందఱో భర్తృశుశ్రూషయే ప్రధానముగాఁజేసి, తమ పుణ్యాకర్షఫలముగా దేవలోకమున విహరించుచున్నారు" అని సీత చెప్పెను. అంతట ననసూయాదేవి సీత మాటలను విని, మిక్కిలి యుప్పొంగినదై, సీతను శిరమున మూర్కొని, యాపె కానంద మెసఁగఁ జేయుచు "చిఱునవ్వుమోముదానా! నేను వ్రతోపవాసాదులఁజేసి, సంపాదించిన తపస్సు విస్తారముగా నున్నది. మైథిలీ యీ మాటలు నీకుఁ దగినవిగాను మునోహరముగా నున్నవి. నీ మాటలువిని యానంద మొంది తిని. నీ వడిగినది యిచ్చెదను కోరు"మని యనఁగా, సీత యనసూయ మాటలు విని, యాశ్చర్య మొంది చిఱునవ్వు నవ్వుచుఁ, దపోబలముతోఁ గూడిన యనసూయం జూచి "యన్నియుఁ జేసితిరి" యని చెప్పెను. అంత ధర్మజ్ఞురాలగు ననసూయాదేవి సీతపలుకులు విని మిక్కిలి ప్రీతి నొంది, "ఓ సీతా! నా సంతోషము సార్థకమగునట్లు నీ కెద్దియైనఁ జేసెదను. ఈ దివ్యమగు పుష్పమాలికను, వస్త్రమును, సొమ్ములను, మైపూఁత, శ్రేష్ఠమైన పరిమళగంధమును నొసఁగెదను. కైకొనుము. నే నొసఁగెడి యీ పుష్పమాలికాదివ్యాలంకార ద్రవ్యములు నీ యంగములను శోభిల్లఁ జేయును. ఈ యలంకార మెప్పటికిని దఱుగక యెప్పుడిదే తీరున నుండును. ఇది నీకుఁ దగియుండును. ఈ పుష్పమాలికలు వాడవు. ఈ మైపూఁత మాయదు. ఈ గంధముయొక్క సువాసనతగ్గదు. ఈ తొడవు లెప్పుడు నిగనిగ మెఱయుచుండును. జానకీ! ఈ మేటి మైపూఁత పూసికొని, లక్ష్మీదేవి యవ్యయుండగు విష్ణువునుంబోలె

నీవును నీ భర్తను సంతోషపఱపఁగలవు" అని చెప్పఁగా, సీతయు, నన సూయ ప్రీతితో నొసఁగిన యలంకారద్రవ్యములను గైకొని, చేతులు జోడించికొని, తపోధనయైన యనసూయను గొల్చుచుండెను. అట్లు సవినయముగఁ దన్నుఁ గొల్చుచుండు సీతను జూచి, దృఢనియమముగల యనసూయ "ఓసీతా! కీర్తిమంతుఁడయిన యీ రాముఁడు నిన్ను స్వయంవరమునఁ బడసె ననఁగా, నేను వినియున్నాను. ఆ స్వయంవర వృత్తాంతము జరిగినది జరిగినట్లుగా నాకు విస్తరించి చెప్పుము, సీతయు ధర్మరతయైన యనసూయతో "ఆ కథను విస్తరించి చెప్పెద నాలకింపు" మని యిట్లనియె. "ధర్మముల నెఱిఁగినవాఁడును, శూరుఁడు నైన మిథిలానాయకుఁడగు జనకనృపాలుఁడు క్షత్రియధర్మమునందు శ్రద్ధగలిగి, న్యాయపూర్వముతోఁ బుడమి నేలుచుండెను. అతఁడు యజ్ఞముచేయ నుద్దేశించి, యజ్ఞకాలాగ్రమున నాగేటిని చేతఁ బట్టి పుడమిని దున్నుచుండఁగా, నేను భూమిని బెకలించికొని పుట్టి యీ జనక మహారాజునకుఁ గూఁతురనైతిని. ఆ జనకనృపాలుఁడు పిడికిటితో నోష ధులను జల్లుచుండఁగా, దుమ్ముతోఁగూడిన యన్ని యంగములుగల నన్నుఁజూచి, యాశ్చర్యపడి, తాను బిడ్డలులేని మోహముచేత నన్నుఁ దనతొడపైఁ గూర్చుండఁబెట్టికొని, "యీ బిడ్డ నా కూఁతు"రని చెప్పి యదిమొదలు నాయెడ మిగుల వాత్సల్యము గలిగియుండెను. అశరీర వాణి "ఓ నృపాలా! నీవు తలఁచినట్లే యిది యగును. నీ కిది ధర్మముచేతఁ గూఁతురే". యన్నట్లు వినఁబడెను. అంతట పుణ్యకార్యములు చేయు వాఁడును, నన్నుఁబడసినపిదప ధర్మాత్ముఁడును, మిథిలానాయకుఁడును నైన నాతండ్రియగు జనకనృపాలునిసంపదలు మిగులఁ బెంపొందినవి. ఆయన నన్ను మహానందముతోఁ దన పట్టపుదేవికిఁ దెచ్చియిచ్చెను. ఆ దేవియు నన్నుఁ దల్లివలెనే యనురాగముచేఁ బెంచెను. నాకుఁ బ్రాయము వచ్చి పెండ్లి కీడయినతర్వాత నాతండ్రి, సొమ్ము పోఁగొట్టు కొన్న దరిద్రునివలెఁ దన మనమున నిట్లు చింతింపఁ దొడఁగెను. లోక మున నాఁడుబిడ్డలఁగన్న నాఁడు దేవేంద్రునివంటివాఁడయ్యు, సరి వారిలోఁ దక్కువవారిలోఁగూడ నవమానము నొందును. నే నెవ్వరి

కీ కన్యనిత్తును? ఎవ్వాఁ డీకన్యకుఁ దగినవాఁడు?" అని యెంతదూర మాలో చించియు నిఁకవిరాఁడన బంధువులవలన రాఁబోవు నవమానమును దలఁచి, చింతాసముద్రమున మునిఁగి, తెప్పలేనివాఁడు సముద్రము దాఁటఁ జాలనట్లు లాచితాసముద్రపు దరి నొందఁజాలక, యయోనిజయగు నన్నెవరి కిచ్చుటకు మనమున నిశ్చయింపఁజాలఁడయ్యెను. అట్లు జనక నృపాలుఁడు చింతించి చింతించి యెట్టకేలకు నిశ్చయించి, "నా కూఁతురికి స్వయంవరము చేసెదను" అనునిశ్చయమునకు వచ్చెను. మహాయజ్ఞమున దేవతలప్రేరణవలన వరుణభగవంతుఁడు శ్రేష్ఠమైనధనుస్సును, తఱుగని బాణములుగల యమ్ములపొదులను మాతండ్రికిఁ బ్రీతితో నొసఁగెను. అధనుస్సు మిక్కిలి బరువైనది గనుక మానవులలో నెవ్వారును దానిని గదలింపఁజాలరు. నృపాలురు గలలోనైనను దానిని వంపఁజాలరు. మాతండ్రి యాస్వయంవరమునకు వచ్చిన రాజుల నందఱను జూచి, "ఎవఁడీ ధనుస్సునంచి యెక్కుపెట్టునో, వానికి నా కన్య నిత్తు"నని ప్రతిజ్ఞ చేసెను. స్వయంవరమునకు వచ్చిన రాజులందఱు పర్వతము వలె బరువుగనున్న యా ధనుస్సును జూచి, దానిని గదలింపనుగూడ శక్తిలేక, నమస్కరించి, "యయ్యా యీపని మాకవలనఁగా" దనుచు వెడలిపోయిరి. పిదప నెంతయో కాలమునకు రఘువంశోద్భవుఁడును పరాక్రమశాలియునైన రాముఁడు లక్ష్మణసమేతుఁడై విశ్వామిత్ర మునీంద్రునితోడ మా తండ్రి చేయు యజ్ఞమున కేతెంచెను. విశ్వామిత్రమునీంద్రుఁడు మా తండ్రినవల సతిథిసత్కారము వడసి, యన్నదమ్ములగు రామలక్ష్మణులను, మా తండ్రికిఁ జూపించి, "వీరు దశరథుని పుత్రులు. ధనుస్సును జూడఁగోరి వచ్చిరి. రాముని కా దివ్య ధనుస్సును జూపు"మని చెప్పఁగా, మాతండ్రి రాముని కా శ్రేష్ఠమగు ధనుస్సును జూపెను. వీర్యవంతుఁడైన రాఘవుఁడు నిమిషమాత్రములోపల నీ విల్లు వంచి నారి కట్టి, యెక్కుపెట్టెను. అట్లెక్కుపెట్టుచుండ నా ధనుస్సు రెండు తునుకలుగా విఱిగినది. అప్పుడు పిడుగు పుడమిపైఁబడ్డప్పుడు వలె గొప్పధ్వని గలిగెను. అంతఁ బ్రతిజ్ఞ తప్పనివాఁడగు నాతండ్రి జలపూర్ణపాత్రమునుబట్టి రామునికి నన్నియ నిశ్చయించెను.

అట్లు మాతండ్రి నన్నీయరాఁగాఁ, దండ్రి యానతి లేకయే నే నీ కన్యకను గ్రహింపనని రాముఁడు చెప్పెను. అంతట మాతండ్రి వృద్ధుఁడయిన దశరథనరేంద్రునిఁ బిలిపించి, పరతత్త్వము నెఱిఁగిన రాముని కిఁ నన్నిచ్చి పెండ్లిచేసెను. సౌందర్యవతియగు మాచెల్లెలిని నూర్మిళను లక్ష్మణుని కొసఁగెను. ఈ ప్రకారము స్వయంవరమున వీర్యవంతులలో నుత్తముఁడగు రామునిఁ బెండ్లాడి, పతివ్రతనై, భర్తయందుఁ బ్రేమ గలిగి యున్నాను" అని సీతాదేవి యనసూయకుఁ దన స్వయంవర వృత్తాంతమును వినిపించెను.

119-వ సర్గము.

రామాదులు దండకారణ్యము సొచ్చుట

ధర్మములనెల్ల నెఱిఁగినదియగునట్టి యనసూయ సీత చెప్పిన గొప్ప కథను విని, యా సీతను రెండు చేతులతోను గట్టిగాఁ గౌఁగిలించి, శిరసున మూర్కొని, "ఓ సీతా! స్పష్టాక్షరములైన మాటలతో వినఁ జక్కఁగా వింటిని. శ్రావ్యముగా మాటాడుదానా! నీ కథ నా మనమునకు సంతసము గలిగించుచున్నది. సూర్యుఁడు గ్రుంకుచున్నవాఁడు. రాత్రియువచ్చినది. పగలెల్లఁ దమ యెరకై తిరుగుచుండి, సాయంకాలమయినంతనే తమ గూండ్లకు విశ్రమింపవచ్చిన పక్షులు నిద్రకొఱకు చేసెడి యవ్యక్తమధురములగు కలకలధ్వనులు వినఁబడుచున్నవి. ఈ మునులుదఱు నదులందు సాయంకాల స్నానముసేసి, తడిసిన నార బట్టలఁ గట్టుకొని, జలపూరిత పాత్రములు చేతఁ బట్టుకొని, గుంపులు గుంపులుగాఁగూడి వచ్చుచున్నారు. ఋషులు సాయంకాలమున శాస్త్రవత్తుగా వేల్చిన యగ్నికుండములనుండి గాలిచే లేచిన పొవురపు దేహాముచాయవంటి చాయగల హోమధూమము చూపట్టుచున్నది. పలుచని యాకులుగల చిన్న చెట్లు గుబురుగాఁ జేరియున్నవి. బట్టబయలునఁగూడ దిక్కులు దెలియకున్నవి. రాత్రిచరములగు ప్రాణులువనమునందంతటను దిరుగుచున్నవి. ఆశ్రమ మృగములు తిన్నెలందుఁ బండుచున్నవి. రాత్రియు నక్షత్రములచే నొప్పారుచున్నది. చంద్రుఁడు

చదలునం దుదయించి, వెన్నెలలఁ జిమ్ముచు వెలుఁగుచున్నాఁడు. నే ననుజ్ఞ యిచ్చెదను. ఇఁక లేచిపొమ్ము. రాముని తోఁగూడ నుండుము. నీ సొంపయిన మాటల కానంద మొందితిని. మైథిలీ! నా యెదుటనే యలంకారము చేసికొని, దివ్యాలంకారభూషితురాలవై, నాకుఁ బ్రీతిని గలిగింపుము" అని చెప్పెను. దేవకుమారినింబోలిన సీత యాప్రకార మలంకరించికొని, యామెకు సాష్టాంగప్రణామము లాచరించి, రాము నొద్దకుఁబోయెను. వస్తులలో శ్రేష్ఠుఁడయిన రాముఁ డట్లలంకారముచే శోభిల్లుచున్న సీతనుజూచి యనసూయ ప్రీతిపూర్వముగా నొసఁగిన వరమును విని మిక్కిలి యానంద మొందెను. మిథిలరాజకన్యకయగు సీత యనసూయము తనకుఁబ్రేమతో నొసఁగిన వస్త్రాభరణాదులను జూపి వరదానము మొదలగు సర్వవృత్తాంతమును దెలిపెను. మానవులకు దుర్లభమైన సీతయొక్క సత్కారమును జూచి రాముఁడును, మహారథుఁడగు లక్ష్మణుఁడును పట్టరాని సంతోషము నొందిరి. అంతటఁ బున్నమచందురునిఁ బోలు మోముగలవాఁడయిన రఘునందనుఁడు తపస్సిద్ధిగల యామునులు చేసెడి యాతిథ్యము గైకొని పావనమైన యా రాత్రి యచ్చటఁ బుచ్చెను. మఱునాటి యుదయమున నరశ్రేష్ఠులగు రామ లక్ష్మణు లిరువురును లేచి, నిత్యకృత్యములు దీర్చికొని, యా వనము నందుండెడి మునులఁ జూచి, "మాకు సెలవిండు. మే మితరవనములకుఁ బోయెదము" అని యడుగఁగా, వనమునఁ బుణ్యకార్యములు సేయుచున్న మునులందఱు వారితోఁ దమ యాశ్రమమున రాక్షసులు చేసెడి యుపద్రవములఁ జెప్పఁబూని, "ఓ రాజపుత్రులారా! పలుతెఱఁగులగు రూపములు దాల్చినవారలయి, మనుష్యులను దినెడి రక్కసి మాకయును, రక్తముఁ గ్రోలెడి దుష్టమృగములును ఈ మహారణ్యమున నున్నవి. రాఘవా! మునులు మైలపడినప్పుడును, వీయుపవాసంతోనున్నప్పుడును వారి నీడ్చికొని తినుచున్నవి. ఇట్లు మమ్ము బాధించుచుండు వానిని వధింపుము. ఇది యిక్కడిబ్రుషులు పండ్లుకోసికొని వచ్చెడు మార్గము. ఈ దారినిబోయి యెవ్వరికిఁ జొటి నలవికాని వనముఁ జొచ్చుట మంచిది" ఇట్లని చేతులు జోడించి చెప్పి, దీవనలు సల్పినవార

లైరి. అంత రాముఁడు వారిదీవనలఁ గైకొని, సీతాలక్ష్మణుల వెంటఁ దీసికొని, సూర్యుఁడు మేఘమండలమును జొచ్చినచందమున దండ కారణ్యమును బ్రవేశించెను.

శ్రీమద్వాల్మీకి రామాయణమున నయోధ్యాకాండము సమాప్తము.

శ్లో. కాండం ద్వితీయం శృణ్వతా యః ప్రోక్తేన నియమేనతు,
సోఽగ్నిసాయుజ్య మాప్నోతి పఠనాద్వాపి శాస్త్రతః.

స్కాండపురాణము. 147-వ అధ్యాయము

తా. ఎవఁడు రామాయణమున రెండవదగు అయోధ్యాకాండమును శాస్త్రోక్త నియమముతోఁ బఠించుచున్నాఁడో, లేక వినుచున్నాఁడో, వాఁడగ్ని లోకమును బొందును.

చెన్నపురిః వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1951

వచనగ్రంథములు

	ప్రతి 1-కి రూ. అ.
వచనగ్రంథములు.	
ఆంధ్రవచనభాగవతము, ద్వాదశ స్కంధములు, ఒకేసంపుటము	9 0
డిటో మూడుసంపుటములు	10 8
ఆంధ్రవచనభారతము:—	
,, ఆదిసభాపర్వములు	5 0
,, ఆరణ్యపర్వము	5 0
,, విరాటోద్యోగపర్వములు	5 8
,, భీష్మద్రోణపర్వములు	7 8
,, కర్ణశల్యసౌప్తికస్త్రీపర్వములు	5 8
,, శాంతిపర్వము	7 8
,, అనుశాసనికము మొదలు స్వర్గారోహణ పర్వము వరకు గలసంపుటము	7 8
ఆంధ్రవచనవాల్మీకిరామాయణము, బాలకాండము	2 8
అయోధ్యాకాండము	5 0
తక్కిన కాండలు	అచ్చు
పంచతంత్రహితోపదేశ కథామంజరి	1 12
ఆంధ్రవాఙ్మయచరిత్ర సంగ్రహము	3 0
న్యాయవిచారణ, (ప్రహసనము)	0 12
శ్రీతిలకుగారి సెక్యూరిటీకేసు ఉపన్యాసములు	0 14
భారతరమణీమణులు, 1 భాగము	1 4
డిటో 2 భాగము	0 10
డిటో 3 భాగము	0 8
యజుర్వేదకథాసంగ్రహము	0 10
నీతిచంద్రిక, శ్రీచిన్నయసూరి,	0 10
,, టీకతో	1 4

	ప్రతి 1-కి రూ. అ.
పంచతంత్రము, వచనము	0 12
సంగ్రహరామాయణము	1 8
పతివ్రతలచరిత్రలు	3 0
భోజునికథలు	0 12
భోజకాళిదాసకథలు, I-భాగము	1 0
II-భాగము	1 0
తెనాలిరామలింగనికథలు, జీవితము	0 8
డిటో A. S. P. అయ్యరు	0 8
సంస్కృతనాటకకథలు	2 0
రాజశేఖరచరిత్రము, గోపాలుడు	0 12
చార్దగ్వీషుకథలు	1 0
తాతాచార్యులకథలు	0 8
బేతాళునికథలు	0 12
పరమానందశిష్యులకథలు	0 4
నరుసుగుమంత్రులకథలు	0 8
అయిదుగురుదొంగలకథలు	0 8
పురాణగాథలు I	1 0
,, II	1 0
బాజీరాయనిచరిత్ర	1 4
రఘువంశకథ	0 8
విక్రమార్కచరిత్ర, శ్రీశ్రీ. రామమూర్తిశాస్త్రి	1 8
ఈసఁపనీతికథలు, 1-వ భాగము	0 8
డిటో 2-వ భాగము	0 12
పంచాఖ్యానపల్లవి, శ్రీమాలవ్యా	0 8
మర్యాదరామన్నకథలు	0 3
ఐరావణచరిత్ర, చక్కనికూర్పు	0 2
అనంతసాగరము, బుక్కరాయసముద్ర చరిత్రము	0 12
ద్వాదశజ్యోతిషనిమిత్తులు తెలుగువచనము	5 0

వావిళ్ల రామస్వామిశాస్త్రులుఅండ్‌సన్స్

292, ఎస్ప్లనేడ్, చెన్నపురి. 1.